ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 02 - Spl. Edition - February 2020 - ISSN No. : 2456-4702



భారతీయ సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు



అంతర్జాతీయ సదస్సు

తేది : 08-02-2020



ప్రత్యేక సంచిక – ప్రధాన సంపాదకురాలు :

డా॥ ఎస్. బేబిరమణి

శాఖాధిపతి, తెలుగు విభాగం,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట,

సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Literary, Culture & Language Study

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue No. 2 - Spl. Edition - February 2020 - ISSN No. : 2456-4702

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies
Universityof Heidelberg, Germany.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

LEGAL ADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

COVER PAGE & PAGE SETTING

TENALI PRAKASH, G.L.S. ENTERPRISES, Guntur. 9494 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar,
Guntur - 522 002. Ph. 9703301698.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

భారతీయ సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు

అంతర్జాతీయ సదస్సు

నిర్వహణ :

తెలుగు విభాగం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

భారతీయ సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు అంతర్జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రథమ ముద్రణ : **ఫిబ్రవరి 2020**

ప్రతులు : **500**

కాపీలకు : **ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,**
సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

: **డా॥. బేబి రమణి, శాఖాధిపతి, తెలుగు విభాగం,**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

గమనిక : **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**

ఎడిటోరియల్ చిరునామా : **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్**
పోస్టల్ కాలనీ, 4వ లైను,
గుంటూరు – 522 002.

డి.టి.పి & ప్రింటింగ్ : **తెనాలి ప్రకాష్**
జి.యల్.ఎస్. గ్రాఫిక్స్,
లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.
సెల్ : 9494 660 509.

భారతీయ సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు

అంతర్జాతీయ సదస్సు – ప్రత్యేక సంచిక

సంపాదక మండలి

గౌరవ సంపాదకులు :

డా॥ టి. పతంజలి, Principal

ప్రధాన సంపాదకులు :

డా॥ యస్. బేబి రమణి, శాఖాధిపతి, తెలుగు విభాగం.

Organising Committee :

Sri. **Vinayaka Kumar,** Vice Principal

Sri. **Y. Ramesh Babu,** Asst. Prof. of Zoology

Dr. **S.P. Krishnaveni,** Asst. Prof. of Economics

Sri. **P. Raji Reddy,** Lecturer in Physics

Reception Committee :

Dr. **D. Karunakar,** Asst. Prof. of Chemistry

Smt. **A. Manjula,** Lecturer in History

Sri. **J. Rajashwar,** Record Asst.

Registration Committee :

Smt. **K. Anuradha,** Asst. Prof. of Botany

Smt. **P. Savidhya,** Lecturer in Commerce

Smt. **Manjula Vani,** Lecturer in Hindi

Smt. **Y. Uma Devi,** Lecturer in Commerce

P. Sumalatha, Lecturer in Maths

Sri. **R. Arun Kumar,** Office Sub Ordinate

Technical Assistance Committee :

Ms. **F. Bhavani,** Lecturer in Computer Science

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

ముందుమాట

భారతీయ సాహిత్యం- చతుర్విధ పురుషార్థాలు

ఉదాత్తమైన విలువలు కలిగిన భారతీయ సాహిత్యంలో లేనిది ఏది లేదని పెద్దల మాట. కాకపోతే మనలో చాలా మందికి భారతీయ సాహిత్యాన్ని చదివే ఓపిక లేదు. వినే ఓపిక లేదు.

ఈ పరిస్థితుల్లో చుట్టూ ఉన్న చీకటిని తిడుతూ కూర్చొనకుండా, తన వంతు బాధ్యతగా ఒక దీపం వెలిగించాలనే ఉదాతమైన ఆశయంతో మా కళాశాల తెలుగు విభాగ అధ్యాపకురాలు డా. యస్ .శోభారమణి గారు "భారతీయ సాహిత్యం- చతుర్విధ పురుషార్థాలు" అనే అంశం మీద ఒకరోజు అంతర్జాతీయ సదస్సు చేయటానికి , సదస్సుకు వచ్చిన పత్రాలను ప్రచురించటానికి ముందుకు వచ్చారు. అందుకే మొట్టమొదట వారిని, వారితో పాటు సదస్సుకు సహకరిస్తున్న పెద్దలను,పరిశోధనా పత్రాలను పంపిన వారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

❖❖❖

పురుషుడంటే మానవుడని మామూలుగా అందరు చెప్పుకునే అర్థం. కాని వేదాంతుల భాషలో దీనికి "జీవుడని" అర్థం. ఈశ్వర చైతన్యమే జీవరూపంగా వచ్చి ఈ శరీరమనే పురంలో ప్రవేశించింది పురుషుడయింది.

పురుష శబ్దానికి మూడు అర్థాలు ఉన్నాయి. శరీరమనే పురంలో శయనించాడు గనుక పురుషుడు.శయనంతో ఆగక శరీరాన్ని, విశ్వశరీరాన్ని రెండింటినీ పూరించాడు గనుక పురుషుడు. పూరించిన తరువాత అంతటా వ్యాపించి ఉన్నాడు గనుక పూర్ణత్వము వలన పురుషుడయ్యాడు. ఇక్కడ పురుషుడంటే మానవుడని అర్థం. అనగా స్త్రీ, పురుషులిద్దరూ పురుష శబ్దంతో చెప్పబడ్డారు.

పురుషస్య అర్థః ప్రయోజనమ్ పురుషుని ప్రయోజనము. పురుషార్థం. ఇవి నాలుగు వరుసగా ధర్మ-అర్థ-కామ-మోక్షములు.

❖❖❖

చతుర్విధ పురుషార్థాలలో మొదటిది ధర్మం. "ధారయతి ధార్యతే. ఇతి ధర్మః' ధ్రియతే పుణ్యాత్మభిః -ఏది జీవుడు ధరిస్తాడో అంటే నాది అనుకొని ఆచరిస్తాడో, ఆచరిస్తే ఏది వాడిని అదృష్టరూపంగా ధరించి ఉంటుందో అది ధర్మం. "ధరతి లోకాన్, ధర్మస్య సాధనమ్" లోకాన్ని ధరించేది, అంటే లోక వ్యవహారాలను అందరికీ

న్యాయం జరిగే పద్ధతిలో నిర్వహించేది ధర్మం. శ్రుతి, స్మృతులు ధర్మబద్ధమ్మెన కృత్యాలను తెలియజేస్తాయి. శరీరముపడిపోయిన తరువాత మాసిపోకుండా లోకాంతర జన్మాంతరాలకు తీసుకెళ్ళి ఫలానుభవం ఇస్తుంది ఇది. అనుకూలమైతే ధర్మం. ప్రతికూలమైతే అధర్మం. విధిచోదితమైన కర్మ ధర్మం. లౌకికంగా చేస్తే కర్మ. శాస్త్రోక్తంగా చేస్తే ధర్మం.

ధర్మం పది విధాలని మనువు నిర్వచనం. ఇవి: 1. ధృతి, 2. క్షమ, 3. దమం, 4. ఆస్తేయం, 5. శౌచం, 6. ఇంద్రియ నిగ్రహం, 7. ధీ (బుద్ధి), 8. విద్య, 9. సత్యం, 10. అక్రోధం.

చతుర్విధ పురుషార్థాలలో రెండవది అర్థం. అర్థమంటే "అర్యతే ప్రాప్యతే" ప్రయోజనము అని పదము యొక్క అర్థం. మానవుడు తన జీవితానికి గమ్యంగా ఏది కోరుకుంటాడో అది అర్థం. విషయము, ప్రయోజనము, హేతువు, కోరిక, నివృత్తి, ధనము అని అర్థ శబ్దానికి అర్థాలుగా చెప్పినప్పటికి లోకంలో చాలామంది అర్థమంటే ధనము, సంపాదన అని భావిస్తారు. .

చతుర్విధ పురుషార్థాలలో మూడవది కామం. అంటే కామ్యతే అసౌ కోరిక మన్మథుడు. కోరబడ్డ పదార్థంకూడా కామమే.. కామమంటే మామూలుగా చెప్పుకోవాలంటే స్త్రీ పురుష విషయం.

చతుర్విధ పురుషార్థాలలో నాలుగవది మోక్షం. "మోక్ష్యతే దుఃఖం అనేన" దేనితో దుఃఖము వదిలి పెట్టబడుతుందో అది మోక్షము.జన్మమరణాభ్యాం ముక్తిః. జన్మ మరణముల నుండి ముక్తి పొందుట మోక్షము.. 'మోక్తు మిచ్ఛా ముముక్షా.' సంసారాన్ని త్రోసి పుచ్చాలనే కోరిక. సంసార బంధంలో నుంచి బయటపడటం మోక్షం.. అలా పడ్డవాడు ముక్తుడు. ఇది శరీరముండగానే జరిగితే జీవన్ముక్తి. పోయిన తరువాతనైతే విదేహముక్తి.మోక్షం కోసం కాంక్షించేవాడు ముముక్షువు.

ఈ చతుర్విధ పురుషార్థాలతో పాటు బృందావన వైష్ణవ సంప్రదాయంలో ఐదవ పురుషార్థం అయిన ప్రేమని కూడా చెబుతారు. బ్రౌన్ ఈ ధర్మార్థ కామమోక్షాలను **1. The Gratification of Desire, (ధర్మ) 2. Acquirement of Wealth, (అర్థ) 3. Discharge of Duties, (కామం) and final emancipation. (మోక్షం)** అని అనువదించాడు.



మనకు ప్రామాణికులైన కేంద్ర సాహిత్య అకాడమీ వారు అస్సామీ, బెంగాలీ, బోడో, డోగ్రీ, ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణీ,మైథిలీ,మళయాళం, మణిపూరి, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, రాజస్థానీ, సంస్కృతం, సింధి, తమిళం, తెలుగు, ఉర్దూ భాషలలో పుస్తకాలు ప్రచురిస్తున్నారు. (దేవనాగరి లిపిలో కూడా) కనుక భారతీయ సాహిత్యం అంటే పైన పేర్కొన్న భాషలలో వచ్చిన సాహిత్యంగా మనం పరిగణించాలి.

ఈ భాషా సాహిత్యాలన్నింటిలోను చతుర్విధ పురుషార్థాలను గురించి పరిశోధనా పత్రాలు అందరూ చదవాలని మా తాపత్రయం. మాకు లభించిన ఆయాయా విశ్వ విద్యాలయ వెబ్ సైట్లలో విద్యుల్లేఖల చిరునామాలకు (ఇ మెయిల్స్) మా సదస్సు వివరాలు పంపాం. అన్ని భాషలనుండి మాకు వ్యాసాలు వచ్చాయని మేము

చెప్పటంలేదు. గంగానది పుట్టిన చోట చిన్నదిగా ఉంటుంది. పోను పోను ప్రవహించిన తరువాత విశ్వరూపం ధరించింది. మా ఆశయం కూడా ఇదే. కాలం గడుస్తున్న కొద్దీ ఈ కృషి సహృదయులచే విశ్వ వ్యాప్తమవుతుంది.

❖❖❖

ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగు పురుషార్థాలలో ధర్మంతో-అర్థకామాల్ని సాధించాలి. అప్పుడు మోక్షమనే పురుషార్థం లభిస్తుంది. ఈ విషయాన్ని మనకు తెలియచేస్తూ దేశం నలుమూలలా నాలుగు చతురామ్నాయ పీఠాలను స్థాపించి, మోక్షపీఠంగా, సర్వజ్ఞపీఠంగా కంచి కామకోటి పీఠాన్ని స్థాపించారు శ్రీ శంకర భగవత్పాదులు. (కోటి అంటే చివరి భాగం.) చతుర్విధ పురుషార్థాల విషయంలో ఇది మన జీవితాదర్శం కావాలి.

"కామార్థగుణ సంయుక్తం ధర్మార్థగుణ విస్తారం ...' అని బాలకాండలో వాల్మీకిమహర్షి చెప్పారు. కామం, అర్థం గురించి మితంగా, ధర్మార్థగుణం గురించి విస్తారంగా రామాయణం చెప్పింది. జీవితంలో కూడా ఇది ఆచరణీయం. ధర్మము, అర్థము, కామము వీటికోసం కాలాన్ని విడదీసుకోవడంలోనే ఎవరిదైనా విజ్ఞత ఉన్నది.. కేవలం కామమునందే జీవితాన్ని నిక్షిప్తం చేసుకున్నవాడు, చెట్టు చివరి కొమ్మమీద నిద్రపోతున్నవాడితో సమానమని మన భారతీయ సాహిత్యంలో శిఖరాయమాణమైన రామాయణం హెచ్చరించింది. "స శాంతి మాప్నోతి స కామ కామి ... అన్నది గీతాచార్యుని వాక్కు. (సర్వేంద్రియ సంయమియైన సాధనాపరుడైన సత్పురుషునికే మోక్షస్థితి సాధ్యమవును గాని, కామం గలవానికి సాధ్యం కానే కాదు).

భారతీయ సంస్కృతికి మూలస్తంభాలు ధర్మార్థ కామ మోక్షాలు. వీటిలో ధర్మార్థ కామాలకి మూలమైన గృహస్థాశ్రమ పునాదులపై నిర్మించబడిన అద్భుత కావ్యం కాళిదాసు యొక్క ' మేఘదూతం '.

❖❖❖

అన్నమయ్య సాహిత్యంలో ఈ చతుర్విధ పురుషార్థ ప్రస్తావన చాలా చోట్ల కనిపిస్తుంది.

పాపము మానిన యట్టి బ్రదుకొక్కటే సుఖము 2-159 (ధర్మం)

తప్పు లేని జీతమొక్క తారమైన చాలు 1-114 (అర్థం)

పొంచి కామాంధ కారము పుణ్యము కానగనీదు- 3-30 (కామం)

తెలిసితే మోక్షము తెలియకున్న బంధము 2-19(మోక్షం)

❖❖❖

క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కినుతింతు సైకత
శ్రోణికి చంచరీకయ సుందరవేణికి, రక్షితామర
శ్రేణికి తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిన్
వాణికి, అక్షదామశుక వారిజ పుస్తక రమ్య పాణికిన్

(సైకత శ్రోణి, చదువులవాణి, అలినీలవేణి ఐన వాణికి నేలకు నెన్నుదురు తాకేలా సాగిలపడి మ్రొక్కి,

పొగుడుతాను. అమృతాలు వర్షించే సుందర సుకుమార సూక్తులతో బ్రహ్మ మనస్సును ఆకర్షించే ఆ సౌందర్యరాశిని, కటాక్ష వీక్షణాలతో దేవతల సమూహాన్ని దయచూసే ఆ కరుణామయిని, ఒక చేతిలో అక్షమాల, ఇంకో చేతిలో రాచిలుక, వేరొక చేతిలో తామరపువ్వు, మరో చేతిలో పుస్తకం ధరించిన ఆతల్లిని ఎప్పుడు పొగుడుతాను.)

ఈ ప్రసిద్ధమైన పోతనగారి పద్యంలో విద్య ద్వారా చతుర్విధ పురుషార్థాలను సాధించడమే లక్ష్యమని 'శారదామూర్తి' చేతుల్లోని నాలుగు ప్రతీకలు సూచిస్తున్నాయని గరికపాటివారు ఇలా చెప్పారు.. "అమ్మవారి చేతుల్లోని పుస్తకం ధర్మానికి ప్రతీక. పద్మం అర్థానికి ప్రతీక. లక్ష్మీదేవి పుట్టింది దాని నుండే కదా! ఇక, మన్మథుడి వాహనమైన చిలుక.. కామ పురుషార్థానికి ప్రతీక. నాలుగోచేతిలోని జపమాల మోక్షానికి ప్రతీక. జపతపాల ద్వారానే కదా సిద్ధిపొందేది! విద్య ద్వారా ఈ నాలుగు పురుషార్థాలనూ సాధించాలని.. అప్పుడే మనిషికి భవబంధాల నుంచి విముక్తి అని తెలియజేయడం కోసమే విద్యాదేవత తన చేతుల్లో ఆ నాలుగు వస్తువులనూ ధరించిందని గ్రహించవచ్చు"

తెలుగు సాహిత్యంలో - ఆమాటకు వస్తే ఏ సాహిత్యంలో అయినా ఇలాంటి చతుర్విధ పురుషార్థాలను సూచించే అనర్ఘ రత్నాలెన్నో..

❖❖❖

"ఇది చేస్తే పుణ్యమా? పురుషార్థమా?" అని ఒక సామెత.. మా **"భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు"** సదస్సు పుణ్యంతో పాటు పురుషార్థాలకు దారి చూపించే కరదీపిక. స్వస్తి.

-డా॥. తొడేపల్లి పతంజలి

ముందుమాట

యుగములు నాలుగు. సత్యయుగము లేదా కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము. ఈ నాలుగు యుగములలో ధర్మదేవత గోరూపమును ధరించి సంచరించుచున్నది. సత్యయుగమునందు ధర్మదేవత నాలుగు పాదములందు స్వేచ్ఛగా విహరించింది. అనగా ఆ యుగమునందు అధర్మములేకమాత్రమైనను కానరాదు. నాటి ప్రజలు చాతుర్వర్ణ ధర్మములు, చతురాశ్రమ ధర్మములు చక్కగా పాటించెడివారు.

త్రేతాయుగమునందు ధర్మదేవత ఒక పాదమును కోల్పోయి మూడు పాదములపై సంచరించినది. ఒక పాదము అధర్మము, మూడు పాదములు ధర్మము. నాడు రావణాసురుడు మొదలైన రూపములతో అధర్మము పొడచూపినది. ద్వాపరయుగమునందు ధర్మదేవత రెండు పాదములను కోల్పోయినది. అనగా ధర్మాధర్మములు సమపాళ్లలోనున్నవి. నాటి అధర్మమునకు మూలరూపములు దుర్యోధనాది కౌరవులు మొదలైనవారు.

నేటి కలియుగమునందు ధర్మదేవత మూడు పాదములను కోల్పోయి సంచరించుట మిక్కిలి కష్టమై దుస్థితినొంది పరితపించుచున్నది సమస్త కార్యములందు అధర్మము ప్రాబల్యము వహించి, ధర్మమును అణగద్రొక్కుచున్నది. సమాజము ఇట్టి దుస్థితిలోనున్న నేపథ్యములో మానవులై జన్మించిన వారు సాధించవలసినవి చతుర్విధ పురుషార్థములే కానీ అధర్మము యొక్క పెంపుకాదని ఒకమారు జ్ఞప్తి చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని భావించి నేను ఈ సదస్సును నిర్వహించుటకు పూనుకొనినాను.

నా ఈ ప్రయత్నమునకు సహకరించిన ధర్మాత్ములందరికి వేనవేల వందనములు సమర్పించుకొనుచున్నాను.

– డా॥ ఎస్. బేబి రమణి

విషయసూచిక

1. ప్రబంధ సాహిత్యం – పారమార్థిక ప్రయోజనం	– ఆచార్య మసన చెన్నప్ప	15
2. స్వర్గారోహణపర్వమందు నిబిడీకృతమైన ధర్మసూక్ష్ములు	– డా।। యస్. బేబీరమణి	21
3. భాగవత పురాణం – పురుషార్థాలు	– డా।। బాచిమంచి వెంకటేశ్వర్లు	23
4. మహాభారతంలో (ఇతిహాసం) – ఆర్థిక వ్యవస్థ	– బానోత్ వెంకటేశ్వర్లు	27
5. వాల్మీకి రామాయణం ధర్మార్థ యోగములు	– బానోతు స్వామి	30
6. కట్టబ్రహ్మన చరిత్ర – ధర్మ నిబద్ధత	– బొలుగాని శోభన్ బాబు	33
7. మహాభారతకాలంలో ధర్మము	– డా।। ఏ.వెంకట ప్రసాదు	37
8. భారతంలో ధర్మపరిరక్షణ – ఒక పరిశీలన	– డా।। అల్లంశెట్టి నాగజ్యోతి	39
9. వసిష్ఠ రామ సంవాదము – మోక్ష ప్రదాయకము	– డా।। బి. భవాని	44
10. ధర్మబుద్ధుడు – గుహుడు	– డా।। బి. భీమమ్మ	46
11. ఆర్థిక దుస్థితికి అద్దంపట్టిన 'మంచి అడుగు' కథ	– డా।। జడా సుబ్బారావు	49
12. మనుచరిత్ర – ధర్మానుశీలనం	– డా।। జంపాల అనూరాధ	52
13. కావ్యం – చతుర్థ పురుషార్థం	– డా।। కాకునూరి సూర్యనారాయణమూర్తి	55
14. నిర్దేశిత జీవన విధులు పురుషార్థాలు	– డా।। కప్పగంతుల మధుసూదన్	57
15. యయాతి చరిత్ర – ధర్మార్థకామమోక్షాలు	– డా।। ఎన్. దీపిక	66
16. మోక్షానికి భక్తి సోపానం	– డా।। ఎం. పద్మకుమారి	69
17. ప్రబంధ కావ్యాల్లో ప్రతిఫలించిన మోక్ష సాధన	– డా।। వై. శ్రీలత	72
18. గుణనిధి కథ – ధర్మార్థ కామ మోక్షాలు	– గొంగులూరి కృష్ణవేణి	76
19. "మూడో పురుషార్థ" యుక్తి శక్తిగా...	– డా।। జె. సీతాపతి రావు	79
20. "జానపద సాహిత్యంలో ధర్మ, అర్థ, కామ మరియు మోక్షాలు	– ఖలీమ్ పాషా	84
21. " రామో విగ్రహవాన్ ధర్మః"	– కందాళ వనదుర్గా రోహిణి	88
22. "మోహక్షయమే మోక్షము – పురుష ప్రయత్నము అదే ఆనందసూత్రము"	– డా।। యస్.పి. క్రిష్ణవేణి & యస్. శ్రీనివాస్	93
23. రాజనీతి – రాజధర్మాలు	– డా।। మామిడాల రమేశ్ బాబు	96
24. రామాయణము – ధార్మికాంశాలు	– ఎస్. చంద్రశేఖర శర్మ	100
25. జానపద సాహిత్యంలో ధర్మము	– యస్. రజిత	102
26. జానపద సాహిత్యం – ధర్మార్థ కామమోక్షాలు	– పి. మల్లికార్జున్	105
27. కె.వరలక్ష్మి గారి 'పక్షులు' కథలో ధర్మార్థాల ప్రాముఖ్యత	– పోతురాజు దుర్గాదేవి	107
28. బసవపురాణం – ముగ్ధభక్తి – మోక్షసిద్ధి	– ఆర్. మహేందర్ రెడ్డి	109
29. ప్రవరుడు – ధర్మార్థకామమోక్షాలు	– డా।। రాపోలు శ్రీనివాస్	113

30. మహాభారత మహేతిహాసంలో చతుర్విధ పురుషార్థాలు – టేకుమళ్ళ వెంకటప్పయ్య 117
31. ఆంధ్ర మహాభాగవతం – చతుర్విధ పురుషార్థాలు – పున్న ధనలక్ష్మి 120
32. రామాయణ అయోధ్యకాండలోని ధర్మము – డా॥. కపిల భారతి 123
33. కథలో కుటుంబ వ్యవస్థ అర్థం – ప్రాధాన్యత – కె. ఏసురత్నం 126
34. కేనోపనిషత్తు – మోక్షమార్గము – డా॥. ఆర్. వరలక్ష్మి 129
35. జానపద రామగాథలు – వ్యక్తి ధర్మం – ఎ. మృణాళిని 134
36. మోక్షపథసోపానం ధర్మం – డా॥. ఒభిన్ని శ్రీహరి 139
37. ఆచంట శారదాదేవి కథల్లో ధర్మార్థ కామ మోక్షాలు – డా॥. సూర్యకాంతి 143
38. 'కరుణ' చూపని 'ప్రసన్న' – 'ప్రసన్న'త చూపిన 'కరుణ' – యుద్దనపూడి దీప్తి 146
39. ఆంధ్ర మహాభారతం – గాంధారి 'ధర్మం' – డా॥. యస్.పి. సంజీవరెడ్డి 151
40. భగవద్గీత – ధర్మాధర్మ, కర్తవ్యబోధ – డా॥. పి.వి. లక్ష్మణరావు 154
41. మార్కండేయ పురాణంలో ధర్మార్థకామమోక్షాలు – నాగరాజు 159
42. పురాణాలు ధర్మార్థ కామమోక్షాలు – డా॥. శంకర్ అనంత 162
43. గుణనిధి కథలో మోక్షరీతి – డా॥. చిలకా అనిత 165
44. ప్రబంధయుగం మోక్షసాధనలో ఆముక్తమాల్యద – చక్రహరి రమణ 168
45. భారతం – కామం – డా॥. నల్లపనేని విజయలక్ష్మి 171
46. సాహిత్యం చెప్పిన సార్వకాలిక ధర్మాలు – డా॥. వై. వి. సిహెచ్. లీలా పద్మజ 174
47. భగవద్గీత – అధ్యయనం – ఎల్కమూరి రాజు 177
48. దాశరథి శతకం – మోక్షమార్గం – జంగిటి వేణు 180
49. చతుర్విద పురుషార్థాలు – గౌరయ్య 183
50. ఇతిహాసములు – ధర్మ స్వరూపము – కె. మాధవి 186
51. కవి'తా'ధర్మం – డా॥. ఎన్. మృదుల 191
52. అరణ్యపర్వం – ఆధ్యాత్మిక ధర్మం – డా॥. పి.లలితవాణి 194
53. భారతీయ జీవన విధానం – పురుషార్థాలు – రాఘవేంద్ర రావు 197
54. రామాయణం – ధర్మార్థ కామ మోక్షాలు – యాదగిరి 201
55. ఆదర్శ న్యాయం – 'ధర్మం' – పరిశీలన – ఎలగొండ రాములు 206
56. ప్రకాశం జిల్లా శతక సాహిత్యంలో పురుషార్థాలు – వి. చంద్రశేఖరరెడ్డి 208
57. రామాయణము – ధార్మికాంశాలు – యం. వేణుగోపాల్ శర్మ 211
58. మహాభారతము – ధార్మికత – డా. హెచ్. వామనమూర్తి 213
59. జానపద సాహిత్యం – చతుర్విద పురుషార్థాలు – ఎన్. అరుంధతి 215
60. రామాయణం – పరమార్థం – ఎస్. చంద్రశేఖర శర్మ 218
61. భారత భాగవతాలలో – ధర్మ స్వరూపం – పి. అశోక్ 220
62. తెలుగు నవల – చతుర్విధ పురుషార్థాలు – డా. ఈతకోట ఈశ్వరరావు 224

63. హైందవం – ధర్మం – డా॥. జి.సుహాసిని 226
64. అభిజ్ఞాన శాకుంతలం – చతుర్విధ పురుషార్థాలు – డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ 229
65. మహాభారత సావిత్రోపాఖ్యానం – డా॥ వి. ఎన్. మంగాదేవి 233
66. భారతీయ తత్వ శాస్త్ర భూమిక: చతుర్విధ పురుషార్థాలు – నందిగామ నిర్మల కుమారి 236
67. అసమర్ధుని జీవ యాత్రలో ధర్మార్ధ కామ మోక్షాలు – డా॥ జి. వెంకట రమణ 241
68. భార్గవరామ చరిత్ర – ధర్మాచరణ – జి. రమేష్ 250
69. తెలుగు కావ్యాలు – ధర్మార్థ కామ మోక్షాలు – కట్ట రంజిత్‌కుమార్ 254
70. జయరాజు పాటలు – ధర్మార్థ కామ మోక్షాలు – ఎలకంటి రవీందర్ 257
71. జానపద సాహిత్యం – ధర్మార్ధ మోక్షములు – సోనబోయిన సతీష్ 259
72. జ్ఞానాదేవతుకైవల్యమ్ – శ్రీదేవి కాశవజ్జల 261
73. ధర్మబద్ధ కామం – పూషడపు సుబ్బారావు 263
74. వేయి పడగలలో పురుషార్థం – ధర్మం – అవధానం సుజాత 266
75. పోతన భాగవతంలో మోక్ష మార్గం – డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ 269
76. భారతీయ సంస్కృతికి పురుషార్థాలు మూలస్తంభాలు – పి. అనురాధ 273
77. "సతి దానశూరము" యక్షగానంలో ధర్మార్థ కామమోక్షలు – డా॥. బాణాల భుజంగరెడ్డి 276
78. శ్రీ శివ మహాపురాణము – చతుర్విధపురుషార్థాలు – డా॥. మఠపతి మాంతయ్య 279
79. భారతీయ సంస్కృతికి చాతుర్వర్గ మూలాలు – టి. పద్మ 282
80. అర్థము ధర్మముననుసరించిన అనుసరణీయము – డా॥. యస్. బేబీరమణి & యస్. సతీష్ 284
81. భాగవతపురాణము – చతుర్విధ పురుషార్థములు – డా॥. బాచిమంచి వెంకటేశ్వర్లు 285
82. పురుషార్థసాధన – గజేంద్ర మోక్షము – విడేప్రు నాగమణి 291
83. "కుమార సంభవం – గృహస్థాశ్రమధర్మం" – డా॥. పెండ్యాల అనసూయా ప్రసన్నలక్ష్మి 293
84. ఆత్మజ్ఞానం (మోక్షము) యొక్క గొప్పతనము – డా॥. యస్.పి. క్రిష్ణవేణి 302
85. ధర్మార్థకామమోక్షాలకు నిలయం : దాంపత్య జీవన సౌరభం – బోయపల్లి చిట్టెమ్మ 305
86. వేమన ధర్మనిరతి – డా॥. యమ్. విజయశ్రీ 309
87. భాగవతంలో "ధర్మం" విశిష్టత – డా॥. మంద సురేఖారెడ్డి 311
88. జానపద సాహిత్యంలో శృంగార (కామ) సౌరభాలు – డా॥. సి.హెచ్. చంద్రయ్య 313
89. **रामो विग्रहवान् धर्मः** - **कंदाल वनदुर्गा रोहिणी** 315
90. **माधकाव्ये चतुर्विधपुषार्थाः** - **डा. एन. सशिधर** 317
91. **धर्म कर्म नीती** - **डा. वि.टि.वि. क्रिश्न वेनि** 322
92. Folk Performning Arts and the Role of Telugu News Papers - Kondigari Buchaiah 326
93. Principles of Dharma in Ramayanam - Dr. K. Padmaja 328
94. Attainment of Purushaarthas According to ShukraNeeti - I. R. Nandini 331
95. Relevance of Puranic Discourses of Purusharthas in Modern Life - A.V. Sheshachary 333

ప్రబంధ సాహిత్యం – పారమార్థిక ప్రయోజనం

– ఆచార్య మసన చెన్నప్ప, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

ప్రబంధ కవులందరూ ఆస్తికులే. వారికి వేదాల పట్ల ఎంత గౌరవమో పురాణాల పట్ల అంత గౌరవం ఉంది. భగవంతుని అవతార వాదాన్ని మనస్ఫూర్తిగా నమ్మి అభివర్ణించినవారు ప్రబంధ కవులు. వారెంతటి లౌకిక దృష్టి గలవారో అంతటి పారమార్థిక దృష్టిగలవారు. భౌతిక మైన జగత్తును అభివర్ణిస్తూనే, శాశ్వత సుఖాన్ని అందించే మోక్షాన్ని ఎంతగానో కొనియాడారు.

"ఉడుముండడె నూరేండ్లును
పడియుండడె పేర్మి పాము పదినూరేండ్లున్
మడుగున కొక్కెర యుండడె
కడునిలపురుషార్థపరుడు కావలె సుమతీ"

మానవుడెంతకాలం జీవించినప్పటికీ, చతుర్విధ పురుషార్థాలను అవశ్యం సాధించవలసి వుంది. పురుషార్థ సాధకుడు కావడమే మనుష్య ధర్మమని సుమతీ శతకకారుడు మనకుపదేశిస్తున్నాడు.

బహుశా ప్రబంధ కవులు కూడా ఈ దృక్పథంతోనే ప్రబంధాలు రచించినట్లు కనిపిస్తున్నది.

ప్రబంధ రాజమైన మనుచరిత్ర పారమార్థిక ప్రయోజనాన్ని సాధించిన ఉత్తమ రచన. ప్రవరుడు అచ్చమైన వైదికుడు. నిత్యాగ్నిహోత్రి. విషయ పరాఙ్ముఖుడైన శ్రోత్రియుడు. ప్రవరుని కథ ద్వారా పెద్దన రెండు ప్రయోజనాలు సాధించాడు. మొదటిది భోగలాలసతో కూడిన విషయ పరాయణతకు అవమాన తిరస్కారాలు కల్గించడం; రెండవది విషయవరాఙ్ముఖమైన ధార్మిక ప్రవృత్తికి విజయాన్ని కల్గించడం. ధర్మబద్ధమైన జీవనానికి మోక్షాన్ని నిర్దేశించినవాడు పెద్దన.

మనుచరిత్ర ఆరంభంలోనే కవి శఠకోపయతీంద్రులను "ఆశ్రిత జనదురితచ్ఛల గాఢధ్వాంతసమితి శఠకోపయతిన్" అని స్తుతించాడు. ఇంకా స్వారోచిషమను సంభవం కలిధ్వంసకం అని కూడా ఉగ్గడించాడు.

ప్రవర వరూధినీ ఘట్టాన్ని తాత్త్వి దృష్టితో పరిశీలించినప్పుడు, ధర్మార్థకామ మోక్షాలకు పెద్దన ఆయా వ్యక్తులను ప్రతీకలుగా ఊహించినట్లు ఒక అభిప్రాయం కలుగుతుంది.

ధర్మం - ప్రవరుడు
అర్థం - మాయాప్రవరుడు
కామం - వరూధిని
మోక్షం - సిద్ధుడు

మరొక అడుగు ముందుకేసి చెప్పాలనుకున్నప్పుడు ప్రవర వరూధినీ మాయా ప్రవరులు త్రిగుణాలకు ప్రతీకలుగా నిలుస్తారు.

సత్త్వం - ప్రవరుడు
రజస్సు - వరూధిని
తమస్సు - మాయాప్రవరుడు

సత్త్వ గుణాధిక్యం చేత ప్రవరుడు దేవతల్లో ఒకడుగా, రజోగుణాధిక్యంచేత వరూధిని మానవమాత్రురాలుగా, తమోగుణాధిక్యంచేత మాయాప్రవరుడు రాక్షసులలో ఒకడుగా భావింపబడుతారు. ఇది గుణాలను బట్టి చేసిన మానవ విభజన మాత్రమే. మనుష్య, రాక్షస స్వభావాల కంటే భిన్నమైన దేవతాస్వభావమే గొప్పదని మనుచరిత్ర నిరూపిస్తుంది. ప్రవరుడు నిజంగా దేవత, వివిధాస్వర నిర్మల ధర్మకర్మదీక్షా పరతంత్రుడు.

ప్రవరుని ముసుగులో మాయా ప్రవరుడు వరూధినితో కలిసి భోగానుభవించి తిరిగి వెళ్ళిపోయేముందు ఇలా అంటాడు -

"ఎవ్వడు మీదెఱుంగక యథేచ్ఛ సుఖైక రతిన్ జరింపగా
నవ్వల వంశహాని, వ్రతహాని యశోధన హాని పుట్టదా
నవ్వెడ నమ్మనుష్య పశువయ్యివిపేకి చెడున్ జగంబునన్
నవ్వగపాలు రౌరవమునన్ బడ పాలును నిందపాలునై"
3. 135.

కేవలం కామ పురుషార్థాన్ని ఆశ్రయించిన వానికి కలిగే నష్టాలను పెద్దన మాయా ప్రవరుని ద్వారా వెల్లడించిన తీరు మనకు ఆశ్చర్యాన్ని కల్గించకపోదు. "మీ దెఱుంగక" అంటే పరమ పురుషార్థాన్ని తెలుసుకోక అని అర్థం.

వైదికుడైన పెద్దన ప్రవరుణ్ణి వైదిక నిష్ఠాగరిష్ఠునిగా చిత్రించాడు. అతిథి విషయంలోను, యమనియమాదులను అనుష్ఠించే విషయంలోను ప్రవరుని పాత్రను పెద్దన పరమ పురుషార్థానికి అభిముఖంగా నడిపించాడు.

ముక్కు తిమ్మన ముద్దు పలుకులతో తీర్చిదిద్దబడిన పారిజాతాపహరణ ప్రబంధం సత్యాకృష్ణుల మధ్య ఏర్పడ్డ మనస్పర్థలను తెలుపుతుంది. సత్య అలుక చెందగా, కృష్ణుడు ఆమెను ఓదార్చడమే గాక పారిజాత వృక్షాన్నే ఆమె పెరటి చెట్టుగా నాటటం మొదలైన అంశాలను పైకి వర్ణించినప్పటికీ ఆ ప్రబంధం అంతర్గతంగా పరమార్థాభిముఖంగా రచింపబడిందనడంలో సందేహం లేదు. ఎక్కడ పరమేశ్వరుడుంటాడో అక్కడ ఐశ్వర్యం ఉంటుంది. జ్ఞానం ఉంటుంది. అమృతం ఉంటుంది అనడానికి నిదర్శనంగా కృష్ణుడు (పరమేశ్వరుని అవతారం) లక్ష్మి (ఐశ్వర్యం) నారదుడు (జ్ఞానం) పారిజాత పుష్పం (అమృతానికి సంకేతం) ఒకచోట కలిసి ఉండడం చూస్తాం.

ఈ ప్రబంధం ఆధారంగా చతుర్విధ పురుషార్థాలను ఆయా పాత్రలలో క్రింది విధంగా సమన్వయింపవచ్చు.

ధర్మం - కృష్ణుడు
అర్థం - రుక్మిణి
కామం - సత్య
మోక్షం - నారదుడు

మోక్షానికి సాధనాలు నాలుగు, ఒకటి ధర్మాచరణం, రెండు వైరాగం, మూడు షట్కసంపత్తి, నాలుగు ముముక్షుత్వం.

అముక్తమాల్యద విష్ణు పారమ్యాన్ని ప్రబోధించినప్పటికీ పరమ పురుషార్థమైన మోక్షాన్ని శ్రేష్ఠమైనదిగా ఉద్ఘాటిస్తుంది. మోక్ష సాధనాలను అముక్త మాల్యదలోని ఆయా పాత్రలకు ఈ విధంగా అనుసంధానించి చెప్పవచ్చు.

1. ధర్మాచరణం - విష్ణు చిత్తుడు
2. వైరాగ్యం - కేశిధ్వజుడు
3. షట్కసంపత్తి - మాలదాసరి (శమం, దమం, దుష్టులకు దూరంగా వుండడం, శ్రద్ధ, చిత్తైకాగ్రత అనేవే షట్కసంపత్తి)
4. ముముక్షుత్వం - బ్రహ్మ రాక్షసుడు.

తన రాజ్యం ఖాండిక్యుని వశమైంది. ఈ సందర్భంలో కేశిధ్వజుడు పొందిన వైరాగ్యాన్ని రాయలు వర్ణించిన తీరు ఆయన పారమార్థిక దృష్టికి ఒక ఉదాహరణ.

"ఆ కేశిధ్వజుడంత నాసృపుని, రాజ్యంబెల్ల జేరన్ ఫలం
బాకాంక్షింపక గెల్తుమృత్యువునవిద్యన్ పుకుందున్ తుదన్
జాకుందున్ వడి' యంచు యోగనియతిన్
జ్ఞానాశ్రయుండై మఖా
నీకంబుల్ రచియించు చందోకటికిన్ తీక్షించి తానున్నచోన్"

మృత్యువును జయించడం, పునర్జన్మ లేకుండా చేసుకోవడం, యోగాన్ని అవలంబించడం, జ్ఞానాన్ని ఆశ్రయించడం మొదలైనవి పరమ పురుషార్థానికి సోపానాలు.

కేశిధ్వజుడు ఇంకా ఇలా అంటాడు.

"పరలోక సుఖము శాశ్వత
మరయ మహీరాజ్య సౌఖ్యమల్పానేహాः
పరిభోగ్యం బిందులకై
దురితము గావించి తొలగుదునె పరమునకున్"

పరలోక సుఖం అంటే మోక్షానందం. దాని ముందు మహీరాజ్యం తృణప్రాయం. కనుకనే మోక్ష పురుషార్థాన్ని సాధించాలని అతని పట్టుదల.

విషయం సంసర్గం బంధానికీ, విషయ వైముఖ్యం ముక్తికీ కారణమౌతాయన్న సత్యాన్ని రాయలు వ్యక్తపరిచాడు.

"ప్రాణి కోటికెల్ల బంధంబు, మోక్షంబు
చేరుటకును మనసు కారణమ్ము

విషయ సంగియైన విను బంధకారి:ని
ర్విషయ మైన ముక్తి విభవకారి"

శబ్దస్పర్శరూపరసగంధాలైదు విషయాలు. వీటితో సంబంధం కలిగి ఉండడమే బంధం. సంబంధం లేకుండా ఉండడమే ముక్తి. ఐతే ఈ బంధ మోక్షాలకు హేతువు మనస్సే అని చెప్పడంలో రాయల దార్శనికత ద్యోతకమవుతుంది.

ఖాండిక్యుడు "మనమున కెద్ది శోభాశ్రయము?" అని ప్రశ్నించినప్పుడు కేశిధ్వజుడిచ్చిన సమాధానం పూర్తిగా ఆధ్యాత్మికమైంది.

"అనిన కేశిధ్వజుడు వానికనియెఁ బ్రహ్మ
మాశ్రయంబు మనమ్మునఁ కదియ పరము
సపరముననంగ బొలుచుఁ నందపరమనగ
మూర్తము, పరొంబనగ నమూర్తమనఘ!"

మూర్తము - పాంచభౌతికమైన ప్రపంచం. అమూర్తము - పరమాత్మ. ప్రపంచం మృత్యురూపం. పరమాత్మ అమృతరూపం. మృత్యువును విడిచి అమృతత్వాన్ని పొందాలి (మృత్యోర్మా అమృతంగమయ) అని ఉపనిషత్ సందేశం.

మత్స్యధ్వజుని కథలో కూడా పరమార్థానికి సంబంధించిన విషయమే ప్రస్తావింపబడింది. రాజు భోగిని ఇంటికి అర్ధరాత్రి సమయంలో భోగాభిలాషియై బయల్దేరగా ఒక విప్రుడు పలికిన పలుకులు గమనింపదగ్గవి.

"వినియె నెలచ్చతుర్థ్వయిని, వృష్టి దినాళికిఁ రాత్రికైదివం
బునఁ జరకై వయస్సుననుఁ బూని పరంబున కిప్పుడుద్యమం
బనుపున జేయగా వలయు నంచు పురోహిత ధర్మమాత్యగీ
ల్కోన నల విప్రుడా ద్విజులలోన సుభాషితమున్ పరింపగన్॥

వర్షాకాలంలో నాల్గు నెలలు సుఖించడానికి మిగిలిన ఎనిమిది నెలలు కష్టపడి సంపాదించాలి. అట్టే రాత్రికోసం పగటిపూట, ముసలితనం కోసం యౌవనంలో సంపాదించాలి. అదేవిధంగా పరలోకంలో సుఖపడటానికి ఈ జన్మలోనే ప్రయత్నించాలి. అదేవిధంగా పరలోకంలో సుఖపడటానికి ఈ జన్మలోనే ప్రయత్నించాలని సుభాషితం.

పరమ వైష్ణవుడైన మాలదాసరి మంగళకైశికీ రాగంతో భగవంతున్ని కీర్తిస్తాడు. అతడు బ్రహ్మరాక్షసునికిచ్చిన మాట ప్రకారం తిరిగి వచ్చి పలికిన పలుకులు విష్ణువు తప్ప మరొక దేవుడు లేడన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

"ఎవ్వనిచూడ్కి చేసి జనియించు జగంబు, వసించు నిజ్జగ
బెవ్వనియందు, డిందుమఱియెవ్వని యందిది, యట్టి విష్ణుతో
నివ్వల నొక్కవేల్పు గణియించిన పాతకినౌదునేడు నే
నెవ్విధినైన నిన్గదియనేని" యనన్ విని బంధమూడ్చినన్"

పాట ఫలితంగా బ్రహ్మరాక్షసునికీ, ఆ తర్వాత మాలదాసరికీ భవబంధాలు తొలగిపోతాయి. వారిద్దరికీ విష్ణు సాయుజ్యం లభించింది. అముక్తమాల్యద పూర్తిగా విష్ణు పారమ్యమైన కథలతో అలరారుతుంది.

రాయలు విష్ణుచిత్తుని కథను పరమరమణీయంగా చిత్రించాడు. విష్ణుమూర్తి మీద గోదాదేవికి గల భక్తి ప్రపవత్తులు అపారమైనవి. విష్ణుచిత్తుని ఇల్లు విష్ణుకథలతో ఎల్లవేళల ప్రతిధ్వనిస్తూ ఉండేది. అతిథి మర్యాదలకు అతని ఇల్లు పెట్టింది పేరు. పంచమహాయజ్ఞాలలో ఒకటైన అతిథి యజ్ఞాన్ని పెద్దల లాగా రాయలు కూడా అద్వితీయంగా అభివర్ణించాడు.

"అనిష్టానిధి గేహసీమ నడు రేయాలించినన్ మ్రోయునెం
తే నాగేంద్ర శయానపుణ్య కథలున్ దివ్య ప్రబంధానుసం
ధానధ్యానము "నాస్తి శాక బహుతానాస్త్యుష్ణతా నాస్త్యపూ
పో, నాస్త్యోదన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య మన్నాటలున్"

పింగళి సూరన కళాపూర్ణోదయం కల్పిత కావ్యమే అయినప్పటికీ అందలి ద్వారకాపుర, తిరుమల, కాంచీపుర, శ్రీరంగ, రామేశ్వరాదిక్షేత్రవర్ణనలు; యమునా, కావేరీ తీర్థవర్ణనలు సూరన లౌకిక పారలౌకిక దృష్టికి అద్దం పడుతున్నాయి.

శ్రీరాముని చరిత్రను గానం చేస్తూ సూరన...

"పరమంబగు నీ నామము
కరమామ్నాయములు తారక బ్రహ్మముగా
నిరతిన్ వినుతింపగ నా
తరమే"

అని నామ సంకీర్తన గావించాడు. సూరన యోగ విద్యాభ్యాసకుశలుడంటానికి కళాపూర్ణోదయం ఐదవ ఆశ్వాసంలోని స్వభవుని కథ చక్కని నిదర్శనం.

"విమలాత్మక! వినుము ప్రశ
స్తము జీవాత్మ పరమాత్మ సంయోగము యో
గమన, తదంగము లెనిమిది
క్రమమున వినిపింతు తత్ప్రకారము దెలియన్"

అష్టాంగయోగం పరమ పురుషార్థమైన మోక్షానికి మార్గం చూపుతుంది. పతంజలి యోగదర్శనం పఠిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

సూ పరబ్రహ్మ స్వరూపాన్ని సుగుణమని, నిర్గుణమని రెండు విధాలుగా అభివర్ణించి, సామాన్యులకు సగుణోపాసన సుకరమని తేల్చి చెప్పాడు.

"సగుణమనంగ నింకవిను, శంఖ సుదర్శన ముఖ్యచిహ్నితం
బగు పురుషోత్తమాకృతిఃతదస్యము నిర్మల నిత్య చిన్నయం
బగు పరమాత్మ రూపఃమదియబ్బుట దుర్లభమెట్టి వారికిన్
సుగుణ విలాస చింతనము సల్పగ జల్పగ గాని ధూసరా!"

సూరన చేసిన శారదాపీఠవర్ణన అతని పారమార్థిక దృష్టికి చక్కని ఉదాహరణ. శారదాపీఠం నాల్గు వేదాలకు నిలయమైంది.

"ఋగ్వేద ఘోష సమృద్ధి పెంపొకచోట
నొకచోట యాజుషాభ్యుదయ మహిమ
సామగానధ్వాన చాతుర్యమొకచోట
నొకచోట నాథర్వణోక్తి గరిమ...."

తెనాలి రామకృష్ణుని పాండురంగ మహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం ఈ రెండూ వైష్ణవ క్షేత్ర పారమ్య గ్రంథాలు.

"పాండురంగ మాహాత్మ్యం" కావ్యారంభంలో కుమార స్వామి శివుణ్ణి ప్రశ్నించిన సందర్భాన్ని గమనిస్తే పాండురంగ క్షేత్ర ప్రభావం ఎలాంటిదో అర్థమవుతుంది.

"సర్వాతి శాయియైన దేవుడేనియు, నటువంటి తీర్థమేనియు,
నట్టి సుక్షేత్ర మేని, భోగాపవర్గ
దాయిగలదేని యెఱిగింపు"

మని కుమారస్వామి ప్రశ్నిస్తాడు.

ఐతే శివుడు ఈ కథ కొందరికి వినిపించదగనిదంటాడు. కాని కుమారునికి, పార్వతికి మాత్రం వినిపిస్తాడు.

"శఠమతికి నాస్తికునకు పాషండునకును
కర్మముగుఱించి యాచించు గర్హితునకు
నీ పరమగోప్యమోపుత్ర! యోపురంధ్రి
తప్పిదారియు నెఱిగింప తరము గాదు"

పుండరీక క్షేత్రం శివుని మాటల్లో భోగాపవర్గాలకు కేంద్రం. భోగం అంటే లౌకిక సుఖం. అపవర్గం అంటే మోక్షం. ఈ పుండరీక క్షేత్రంలోనే నిగమశర్మ లాంటి వాళ్ళూ కనిపిస్తారు కాని నిగమశర్మకు వాళ్లెవరూ సాటిరారు. ఇక కాశీ ఖండంలోని మహానంద గుణనిధులను, శివరాత్రి మాహాత్మ్యంలోని సుకుమారుణ్ణి, నారసింహ పురాణంలోని మందేహుణ్ణి, నిరంకుశోపాఖ్యానంలోని నిరంకుశుణ్ణి, ఉద్భటారాధ్య చరిత్రలోని మదాలసుణ్ణి దుష్ప్రవర్తనలో ఒక్క నిగమశర్మ మాత్రమే అధిగమించాడంటే ఆశ్యర్చపడ వలసిన అవసరం లేదు.

పాండురగం మాహాత్మ్యంలో వర్ణింపబడిన అగస్త్య, గాణాపత్య, సాంకర్షణ, జాబాలి, బ్రహ్మ, కలశ, పితృ, చక్ర, లక్ష్మీ, పౌండరీక, ముక్తకేశ, సంగమ తీర్థాలు తెనాలి రామకృష్ణుని భక్తి ప్రపత్తులను, పారమార్థిక దృష్టిని చాటుతున్నాయి.

పౌండరీక దేవతల పూజావిధానాన్ని కవి కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. రాధాకృష్ణుల చరిత్ర కవి పారమార్థిక దృష్టికి చక్కని ఉదాహరణ.

కృష్ణుడు రాధకు ప్రత్యక్షమైన తీరు కడు హృద్యం.

"ఇంద్రచాపంబుగాదిది మౌళితటమున
సవరించు బర్హిపింఛంబుగాని
భిదుర ఘృతంబు గాదిది, పాంచజన్య సం
జాత గంభీర ఘోషంబుగాని
యాశ్రయించిన బలాకావళిగాదిది,
హారి మూక్తాహార యష్టిగాని
ఇదికోల మెఱుగు గాదుదితబంగారంపు
పసిడి గ్రమ్మెడు పచ్చపట్టుగాని
వృష్టిగాదిది కరుణాంబు వృష్టిగాని
నీలమేఘంబుగాదిది, నీలవర్ణ
డౌర! నా మ్రొల ప్రత్యక్షమయ్యె ననుచు
హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి"

పరమేశ్వరుని యొక్క సర్వవ్యాపకత్వం ఇందులో వర్ణింపబడింది. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని ప్రారంభ పద్యం కథా సూచనతోపాటు కవి పారమార్థిక దృక్పథాన్ని తెలియజేస్తుంది.

"శ్రీ విద్యానిధయై మహామహిమచే చెన్నై వసిష్ఠాజ లూ
తావాతాశన సామజాటవిక గో త్రాదేవ నత్కీర రా
జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము దివ్యలింగము మదీ యాభీష్టముల్ సల్పెడిన్"

వసిష్ఠునికి, బ్రహ్మకు, సాలెపురుగుకు, పాముకు, ఏనుగుకు, బోయవాడైన తిన్ననికి, హరద్విజునికి, నత్కీరునికి, వేశ్యాతనయలకు, యాదవాధిపునికి ముక్తిని ప్రసాదించిన దివ్యలింగం నా అభీష్టాలను తీర్చుగాక అని ధూర్జటి శివస్తుతి గావించాడు. శివభక్తి అనే ఏక సూత్రంతో ధూర్జటి ప్రబంధ రచన చేశాడు. కీటకానికి, చక్రికి, మదాంధునికి, చివరికి బహుజీవహంతుకునికైనా సంసార బంధాన్ని తొలగించిన మోక్షనిధిని అందించే శక్తి కేవలం కాళహస్తి పుణ్యక్షేత్రానికుందని ధూర్జటి భావించాడు.

ధూర్జటి సాకారోపాసన చేసినప్పటికీ, నిరాకార వ్యాపక పరబ్రహ్మను కూడా స్తుతించినట్లు ఈ క్రింది పద్యాన్ని గమనిస్తే తెలుస్తుంది.

"తన ఇల్లాలభిలైకమాత, తనర సంతానంబు భూతవ్రజం,
బనులాపంబులు వేదముల్, తన విహారాగాముల్ మౌని హృ
ద్వనజంబుల్, తన సేవకుల్ కమలజాత శ్రీధరుల్ గా జెలం
గిన దేవోత్తమ నమ్మహాత్ముతరమే కీర్తింపగా నేరికిన్"

జగన్మాతయైన పార్వతి ఇల్లాలుగా, సకల ప్రాణికోటి సంతానంగా, పలుకులు వేదాలుగా, విహారక్షేత్రాలు మునుల హృదయపద్మాలుగా బ్రహ్మవిష్ణులు సేవకులుగా గల దేవదేవుణ్ణి కీర్తించడం ఎవరికీ శక్యం కాదని ధూర్జటి అభిప్రాయం. ఈ వర్ణనను బట్టి భగవంతుడు సర్వవ్యాపకుడన్న విషయం ధ్రువపడుతుందిధీ వర్ణనను బట్టి భగవంతుడు సర్వవ్యాపకుడన్న విషయం ధ్రువపడుతుంది. ఆకారం లేనప్పుడే సర్వవ్యాపకత్వం సిద్ధిస్తుంది.

తిన్నడు మూఢభక్తితో శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నాడు. "నాకుంజుట్టము తల్లిదండ్రుల చెలుల్ నాధుండు నీదైవమే" అని మిత్రులతో చెప్పిన తిన్నని భక్తి అపూర్వమైంది. తన శతకంలోను ధూర్జటి ఈ అభిప్రాయాన్నే వెలువరించాడు. "అమ్మయ్యంచును ఎవరినేనన్నన్ నిన్ను నౌ సుమీ" నా తల్లిదండ్రులను పిలుస్తున్నానని నీవనుకోకు, ఈ జన్మలో నా తల్లీ, తండ్రీ గురువూ అన్నీ నువ్వే అంటాడు ధూర్జటి. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని నత్కీరుని కథ విలక్షణమైంది.

నత్కీరుడు ఈశ్వరుని పద్యంలో తప్పుబట్టి, శాపగ్రస్తుడై కుష్ఠ వ్యాధిచే బాధపడి స్వర్ణముఖీనదిలో స్నానం చేసి పవిత్రుడయ్యాడు. శివుణ్ణి సాక్షాత్కరించుకొని విన్నవించుకొన్న తీరు అతని వైరాగ్యాన్ని సూచిస్తుంది.

"ఈ సంసారము దుఃఖా
వాసానందంబుఁ దీని వర్ణింపంగా
నేసుఖము గలుగు దయ న
న్నా సుఖమున గూర్చవే కృతార్థుడనుగుదున్"

"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః"
(సాంఖ్య దర్శనం 1-1-)

ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అని దుఃఖం మూడు రకాలు. దాన్ని పూర్తిగా తొలగించుకోవడమే అత్యంత పురుషార్థం (మోక్షం). ఈ మూడు రకాల దుఃఖాన్నే ధూర్జటి సాంసారిక దుఃఖం అన్నాడు. దాన్ని తొలగించి మోక్షానందాన్ని ప్రసాదించమని శివుణ్ణి వేడు కొన్నాడు.

ధూర్జటి ప్రకృతి వర్ణనల్లోను ఆధ్యాత్మిక విషయాలను పొందు పరిచాడు.

"ఉదయగ్రావము పానవట్ట, మభిషేకోద ప్రవాహంబువా
ర్ధి, దరధ్వాంతము ధూప ధూమము, జ్వలద్దీప ప్రభారాజి కౌ
ముది, తారానివహంబు లర్పిత సుమంబుల్ గా
తమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తిబింబ శివలింగం బొప్పె ప్రాచీదిశన్"

తూర్పున చంద్రుడనే శివలింగం ఉదయించింది. అది ఎలాగుందంటే తూర్పు కొండ పానవట్టంగా, సముద్రమే అభిషేకోదకంగా, చీకటి - ధూపపు పొగగా, వెన్నెల దీపకాంతిగా, తారలు పూలుగా కలిగి తమోదూర సౌఖ్యదమై అలరారుతుందట. ఇక్కడ తమస్సంటే చీకటితో పాటు అజ్ఞానం గ్రహింపబడుతుంది. అజ్ఞానం భవబంధానికి హేతువు. జ్ఞానం ముక్తికి హేతువు. "జ్ఞానాన్ముక్తిః" అని సాంఖ్యదర్శనం (3-23) చెబుతున్నది. ధూర్జటి దృష్టిలో శివలింగం అజ్ఞానంధకారాన్ని తొలగించి జ్ఞానమనే అమృతాన్ని అందివ్వగల్గుతుంది.

ప్రబంధ కవులు వేదాలను, పురాణాలను, సమానంగా గౌరవించినట్లు కనిపిస్తున్నది. వారు పురాణాలనుంచి కథలను గ్రహించినప్పటికీ వాటికి లౌకిక పారమార్థిక విషయాలను జోడించి అత్యద్భుతంగా ప్రబంధ రచనగా వించారు.

ఇహపర సుఖాలను అందించేదే ధర్మం. అర్థకామాల కంటే భిన్నంగా ధర్మాన్ని అవలంబించినప్పుడు అది మోక్షానికి అర్థనిస్తుంది. ప్రబంద సాహిత్యాన్ని అవలోకించి నప్పుడు వైదిక జీవన విధానాన్ని అనుసరించిన ప్రవరుడు విశేషంగా మనల్ని ఆకర్షిస్తాడు. మానవ జీవన పద్ధతికి ప్రవరుడు ప్రతీక. సిద్ధునిచేత, అగ్నిచేత, తల్లిదండ్రులచేత, శిష్యులచేత, లోకులచేత కీర్తింపబడిన వాడు ప్రవరుడు. కళాపూర్ణోదయంలోని శాలీనుడు, తుంబురుడు, అముక్త మాల్యదలోని విష్ణుచిత్తుడు, యామునాచార్యుడు, మాల దాసరి, కేశిధ్వజుడు, పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ అక్క మొదలైనవారు తెలుగు సాహిత్యంలో పారమార్థిక జీవితానికి పట్టుగొమ్మలు. వీళ్ళంతా జ్ఞానాన్ని ఆశ్రయించి ముక్తికి అర్హత సంపాదించినవారే. ఇక తిన్నడు మొదలైనవారు భక్తిచేత పరమాత్మను ప్రసన్నం చేసుకొన్న వారు. తిర్యక్కులకు సైతం మోక్షార్హత కలదని చెప్పిన వాడు ధూర్జటి. ఎంత దుర్మార్గుడైనా క్షేత్రప్రభావం చేత మోక్షార్హతను సంపాదించగలడని నిరూపించినవాడు తెనాలి రామకృష్ణుడు.

పై విషయాలను గమనించినప్పుడు, చతుర్విధ పురు షార్థాలలో, ధర్మార్థకామాల కంటే, మోక్షమే శ్రేష్ఠమైనదని నిరూపించడానికి ప్రబంధ కవులు ప్రయత్నించినట్లు స్పష్టమవుతుంది. ఏనాటికైనా మానవుడు పరమ పురు షార్థాన్ని పొందాలన్నదే మన ఋషుల అభిమతం కూడా.

❖ ❖ ❖

స్వర్గారోహణపర్వమందు నిబిడీకృతమైన ధర్మసూక్ష్మములు

– డా॥. యస్. బేబీరమణి, శాఖాధిపతి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ.

చతుర్విధ పురుషార్థములందు ప్రథమస్థానంలో ధర్మమును తప్పక అనుసరించవలెను. ధర్మ నియమములు సూక్ష్మాతిసూక్షమైనవి. స్థూలదృష్టికి ఇట్టి సూక్ష్మ విషయములు కానరావు. కానీ ఫలములు మాత్రము అనుభవ పూర్వకములు.

ఈ అంశమే శ్రీమహాభారతము మహాప్రస్థానిక పరమునందు చక్కగా వివరింపబడినది. కురుక్షేత్ర యుద్ధానంతరము ధర్మరాజు రపజానురంజకముగా పరిపాలన సాగించినాడు. సోదరులు ఐదుగురు రాజ్యభోగములందు విరక్తులై మోక్షమునకై యత్నించవలెనని తలచినారు.

ధర్మరాజు తన సంపదను యుద్ధ సమయమున గతించిన బంధు జనులకు, దీనులకు, ఆర్తులకు, విపులకు భూదానములు, గోదానములు, సువర్ణదానములు, వస్త్రదానములు, అశ్వములు, గోవులు మొదలైన దానములను మిక్కిలి ప్రతీతితో సమర్పించినాడు. శేషసంపదను అర్జునుని మనుమడైన పరీక్షిత్తునకు అప్పగించినాడు. పురజనులతో మా ఐదుగురి బదులుగా ఈ కుమారుని గ్రహించి రాజ్యకార్యములను గావింపుమని తెలిపి మేరు పర్వత సమీపమునకు పయనమైనారు.

ఆ సమయమున పాంచాలి, పాండవులు ఐదుగురు నడచుచుండగా వారిని ఒక శునకము అనుసరించెను. వారు ఆ విధముగా గమ్యమును చేరుటకు పయనము సాగించుచుండగా ద్రౌపది నేల వ్రాలినది. భీముడు ధర్మరాజుతో ద్రౌపది ఎన్నడూ ధర్మమునకు హాని కలిగించు విధముగా ప్రవర్తింపలేదు. ఈమెకేల ఇట్టి దుస్థితి కలిగినదని ప్రశ్నించాడు. అప్పుడు ధర్మరాజు ద్రౌపదికి ఐదుగురు పతులున్నను, పార్థుని పట్ల పక్షపాత బుద్ధిని చూపినది. అందుచే ఆమె ష్ణసుకృతములు నశించి ఇట్టి స్థితి కలిగినందని తెలిపినాడు. సోదరులు ఆమెను అచటనే వదలి ముందుకు సాగినారు. కొంత సమయమునకు సహదేవుడు కూలిపోగా, భీముడు దుఃఖించి సహదేవుడు అహంకారము లేనివాడు. మా అందరికన్నాను సన్మార్గముతో వర్తించువాడు. ఇతనికిట్టి దుస్థితి ఎందువలన కలిగినదని ధర్మరాజునడుగగా, ధర్మరాజు ఇట్టు పలికాడు. తనను మించిన పండితుడు లేదని గర్వించుట వలన ఇట్లు జరిగినదని, కనుక మానవులు అహంకారము చూప వలదని తెలిపినాడు. మరికొంత సమయమునకు నకులుని శరీరము భూమిపై పడినది. భీముడు ధర్మజుని ఇట్టి స్థితి నకులునికేల కలిగినదని వాటిల్లినాడు. తాను జగదేకసుందరుడనని, తన మోహన రూపము మరియొకరికి లేదని నిరంతరము తలచుటచే ఇట్లు జరిగినదని ధర్మరాజు వివరించినాడు. పిదప అర్జునుడు చలనము లేక ధరణిపై కూలగా, భీముడు మిక్కిలి దురపిల్లి, ఈతడు పవిత్ర చరిత్రుడు. ఎన్నడూ అసత్యముకనలేదు. ఇట్లగుటకు కారణమేమనియడుగగా, ధర్మరాజు ఇట్లు తెలిపినాడు. ఇతడు కౌరవులనందరినీ ఒక్క దినములో సంహరింతునని ప్రగల్భములు పలికినాడు. కానీ అట్లు చేయలేదు. పలుకుటనొకటి, చేయుటనొకటియగుట మిక్కిలి దోషము.

అదియనుగాక అర్జునుడు ధనుర్విద్యలో తనను మించినవారులేరని అహంకారించి సాటి ధనుర్ధలందరినీ గర్హించు స్వభావము కలిగినవాడు. కనుక ఇట్టి ఫలితమును పొందవలసి వచ్చినదని తెలిపినాడు. తుదకు భీముడు నేల రాలినాడు. అతడు మిక్కిలి దీనుడై తనకేల ఇట్టి దుస్థితి సంభవించినదనియడుగగా ధర్మరాజు నీవు అధికముగా భుజించువాడవు. ఎల్లప్పుడూ పెక్కు విధముల వ్యర్థభాషణములు పలుకుచుండుట వలన నీకిట్టి స్థితి కలిగినదని తెలిపి తాను శునకంతో ముందుకు సాగినాడు.

ఆ సమయమున దివ్యరథమును అధిరోహించి ఇంద్రుడు ధర్మరాజు ఎదుట నిలిచి స్వర్గలోకమున వసించుటకై రావలసినదని కోరాడు. అంతట ధర్మరాజు మిక్కిలి దుఃఖముతో పాంచాలి, సోదరులు నను వీడి పోయిన శోకము నన్ను బాధించుచున్నది. వారిని కూడా నాతో వచ్చునట్లుగా అనుగ్రహింపుమని కోరినాడు. అపుడు ఇంద్రుడు వారు తనువులు విడిచి దేవలోకమునకేగినారు. నీవు వారిని అచట చూచెదవని పలుకగా ధర్మరాజు ఈ శునకము వదలక నా వెంట వచ్చుచున్నది. దీనిని కూడా కొనిపోవలసినదని కోరినాడు. శునకమునకు దేవత్వము కలుగటు సంభవము కాదని, కనుక నీవు మాత్రము రమ్మని కోరగా, ధర్మరాజు ఆశ్రమించిన వారిని వదలి పొందిన సిరిసౌఖ్యమును ఈయజాలదు. కనుక నేను అట్లు చేయజాలనని పలుకగా శునకరూపమునున్న యమ ధర్మరాజు నిజరూపమును ధరించినాడు. నిన్ను మించిన పుణ్యచరితలు లేరని పలికి ధర్మరాజును స్వర్గలోకమునకు కొనిపోయినాడు.

అచట ధర్మరాజు తొలుత ఉన్న తానసమునధి రోహించి ఉదయ సూర్యసమానుడైన ధుర్యోధనుని చూచి నాడు. ధర్మరాజు మిక్కిలి ఆశ్చర్యముతో లోభి, పాంచాలిని నిండుసభలో అవమానించిన దుష్టవర్తనుడగు ధుర్యోధ నునకు స్వర్గలోకమునకు అర్హత ఎట్లు కలిగినదని యడుగగా ధరమరాజు వెంట వచ్చిన నారదుడు ఈతడు సమరమునందు వీరమరణము పొందుటచే స్వర్గలోక ప్రవేశము లభించిందని తెలిపినాడు. అపుడు ధర్మరాజు నా తమ్ములర, పాంచాలియున్న ప్రదేశమునకు తనను తోడ్కొని పొమ్మని కోరినాడు. ఒక దేవదూత ధర్మరాజును దుర్గంధముతోను, ఎముకలతోను, అడవి ఈగలతో, దోమలతో, చీకటితో, క్రిమికీటకాదులతో నిండిన దుర్గ మైన దారి వెంట ధర్మరాజును తీసుకొని వెళ్లుచుండగా, ధర్మరాజునకు మరుగుచున్న నూనెలవలె నలనల కాగుచున్న జలములు, ఇనుప సూదులవంటి కొలను, వాడి కత్తులవంటి ఆకులు కలిగిన వనము చేరి యాతనలు అనుభవించు కొన్ని కంఠస్వరములు విని పించినవి. ఆ స్వరములు మిక్కిలి దీనముగా ధర్మరాజు దేహమునుండి వెలువడిన పరిమళపు వాయువులు మాపై వీచుటచే మేముది వ్యసొఖ్యమును పొందుచున్నాము. మాపై దయ గలిగి మరికొంతసేపు నిలువుమని దుఃఖ భారంతో పలికినవి.

ధర్మరాజు మీరెవరని ప్రశ్నింపగా నేను భీముడను, అర్జునుడను, నకులుడను, సహదేవుడను, ద్రౌపదిని అను కొన్ని స్వరములు వినిపించగా ధర్మరాజు మిక్కిలి దుఃఖించి ఇది ఎట్టి ధర్మము? పాపాత్ములైన వారికి స్వర్గము, పుణ్యాత్ములైన వారికి నరకము కలుగుట ఎట్లు సంభవము? ఓ దేవదూతా! నీవు మరలిపొమ్ము. నా వారు వసించు ఈ నరకముందే నేను వసింతునని పలికినాడు. అంతట నరలోకము మాయమై, అమృతమయమైన స్వర్గ లోకము సాక్షాత్కరించినది.

అపుడు ఇంద్రుడు మునులతో, దేవతలతో ధర్మ రాజును చేరి ఇట్టు పలికినాడు. రాజను వానికి నరకము కనుగొనుట తప్పదు. కనుక నీవు నరకమును చూచితివని పలికి స్వర్గలోక నివాసము కల్పించినాడు.

ఈ స్వర్గరోహణపర్వంలో ధర్మమును అనుసరించుట వలన కలుగుది వ్యత్యము. అధర్మ భావము ఇంచుక కలిగినను పొందు ఫలము స్పష్టముగా తెలుపబడినవి. కనుక సర్వజనులు ధర్మమును అనుసరించిన ఉన్నతమైన మోక్షమును పొందగలరు.

❖ ❖ ❖

భాగవత పురాణం – పురుషార్థాలు

– డా॥. బొడిమంచి వెంకటేశ్వర్లు, విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్సెస్,
జేవియర్ భవన్, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.

మన భారతదేశం ఆధ్యాత్మిక సంపదకు మూల కేంద్రం. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలు, ఉపనిషత్తులు, సర్వోపనిషత్సార భూతమైన భగవద్గీత - భారతీయుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెపుతున్నాయి. చతుర్విధ పురుషార్థాల సాధనా పరంగా ఆలోచిస్తే మానవునికి దిశానిర్దేశం చేసే గ్రంథాలుగా ఇవి ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

సంఘం నైతికంగా దిగజారినప్పుడు, ధర్మానికి తిలోదకాలు ఇచ్చినపుడు, కర్తవ్య నిర్వహణ లేని భీతావహ దశలో ఉన్నప్పుడు మిత్రునివలె ధైర్యం చెప్పి బోధించగల సామర్థ్యం గలవి పురాణాలే. అందుకే, వేదాలు ప్రభు సమ్మితాలుగా, పురాణాలు మిత్ర సమ్మితాలుగా, కావ్యాలు కాంతా సమ్మితాలుగా ప్రబోధం చేస్తాయని వాటి వాటి ప్రాశస్త్యాన్ని మనం చెప్పుకుంటూ ఉంటాం. మిత్ర సమ్మితంగా ప్రబోధం చేసే పురాణాలలో భాగవత పురాణానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. దీని కర్త వ్యాస మహర్షి. వక్త శుకయోగి. శ్రోత పరమ భాగవత శ్రేష్ఠుడైన పరీక్షిత్తు.

'ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీ యుర్వీన్ పురాణావళుల్
తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దా నెట్టిదో
తెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జననంబుం సఫలంబ్యు జేసెద బునర్జన్మంబు లేకుండగన్'

- అని పోతనగారు భాగవత పురాణం తనకు తెలుగులో అనువాదం చేసే భాగ్యం లభించినందుకు పురాకృత పుణ్య విశేషంగా అభివర్ణించుకున్నాడు.

భాగవతంలోని ఉపాఖ్యానాలు అందిస్తున్న ఆదర్శాన్ని ఒంటపట్టించుకోవడంలో కూడా ఎంతో ప్రయోజనం ఉంది. జీవన్ముక్తుడు కాగోరు భక్తుడు వయస్సు, లింగం, వర్ణాదులతో నిమిత్తం లేకుండా భగవదనుగ్రహం పొందవచ్చునని ధ్రువోపాఖ్యానం, రుక్మిణీ కళ్యాణం, కుబ్జ ఉదంతాలు సాక్ష్యమిస్తున్నాయి.

మానవుని సాధారణ జీవితం ఒక సరళ రేఖ లాంటిది. దాని ఆద్యంతాలు అర్థం, కామం. అంతకు మించి అది ముందుకు ఎదగడం లేదు. కాని, ఈ రెండింటిని ఊర్ధ్వ ముఖంగా మళ్ళించి వాటిని ఒకే స్థానంలో కలిపేది ధర్మం. అపుడు అర్థ, కామాలు అనగా సంపాదనా సుఖాలు ధర్మ బద్ధాలవుతాయి. అదే ఆదర్శమార్గం. అట్టి ధర్మార్థ కామాల మూడింటిని పరివేష్టించివుండే పరమ ఫలమే మోక్షం. ఈ విధంగా ప్రతి జీవి ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే చతుర్విధ పురుషార్థ సాధనలో అచంచలంగా పయనించాలి.

ప్రస్తుత సమాజం అర్థమే పరమార్థంగా ముందుకు సాగుతుంది. కామం వికార రూపం ధరించింది. ధర్మం అందనంత దూరానికి నెట్టివేయబడింది. మోక్షం అసలు స్మృతిపథంలోనే లేదు. ద్రవ్యార్జనకు ఎంతటి నీచమార్గమైనా ఆశ్రయిస్తోంది. కామ సాఫల్యానికి ఎంతటి క్రౌర్యానికైనా ఒడిగడుతూ వుంది. ధర్మాన్ని పసరంతైనా కనబడనీయకుండా భూస్థాపితం చేస్తోంది. ఇక మోక్షమా! అదొక శూన్యవాదం. అర్థరహితమైన అనుభూతి.

పురుషార్థాల స్వరూపాన్ని తెలుసుకోవడానికి మనకు భారత భాగవత రామాయణాలు ఉత్కృష్ట గ్రంథాలుగా, ప్రమాణాలుగా నిలుస్తున్నాయి. భారతం ప్రధానంగా అర్థాన్ని, రామాయణం కామాన్ని - ఎట్లా ధర్మబద్ధం

చేయవచ్చో తెలియజేస్తాయి. ఇక, భాగవతమేమో మోక్ష పురుషార్థాన్ని ప్రబోధిస్తుంది. ఇట్లాంటి ఉత్తమ రచనలను అందించిన కవీశ్వరులను మనం ఋషితుల్యులుగా భావించి గౌరవించాలి. అందుకే 'కవయ: క్రాంత దర్శన:' - అను ఆభాణకం పుట్టింది. అట్లాగా, 'నా నృషి: కురుతే కావ్యమ్' - లాంటివి పుట్టుకొచ్చాయి.

సమాజం ఒక చైతన్య స్రవంతి. అది నిన్న, నేడు, రేపు ఉండింది, ఉంది, ఉంటుంది. భాగవత రచనా కాలం నాటికి ఆనాటి సమాజం ఎట్లా వుండేదో మనకు తెలీదు. కాని, భాగవతంలో ప్రతిబింబించే సమజం వర్తమాన కాలానికి ఎట్లా ఉపకరిస్తుందో చూడటం చాలా అవసరం.

'ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కడై తోచు పో
లిక నే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్య కదంబంబుల హృత్స రోరుహములన్ నానా వి
ధానూ న రూ
పకుడై యొప్పుచునుండు నట్టి హరి నే ప్రార్థింతు శు
ద్ధుండనై'

కనబడే సూర్యుని దర్శనం స్థూల దృష్టి. కారణం అయన ప్రత్యక్ష కర్మసాక్షి. కనబడని భగవంతుని దర్శనం సూక్ష్మ దృష్టి. కారణం ఆయన పరోక్ష కర్మసాక్షి. అందుకే, ఆ హరికి, సర్వపాప విధారికి నమస్కారం. ఇట్టి ప్రార్థన చేస్తూ మనలో ఆధ్యాత్మిక భావనా భాస్కర తేజాన్ని బలీయం చేసుకుందాం.

ప్రధానంగా భాగవతంలో సత్త్వరజస్తమో గుణాలు, జనన మరణాలు, భక్తి జ్ఞాన కర్మయోగాలు, ధర్మాధర్మ వివేచన, పారమార్థి కాంశాలు ప్రతిపాదించబడినాయి. భాగవతంలోని వివిధ పాత్రల తీరు తెన్నుల ఆధారంగా పురుషార్థాల పాత్ర అంచనా వేయవచ్చు.

ధర్మార్థ కామమోక్షాణాం
యస్యై కోపి న విద్యతే
అజాగళ స్తన స్యేన
తస్త జన్మ నిరర్థకం.

ధర్మం, అర్థం, కామం, మోక్షం - అనే వీటిలో ఏ ఒక్కటైనా చక్కగా తెలిసికొని సరైన మార్గంలో నడువలేని వాడు మేక మెడ చన్నులా నిరర్థక జన్మ కలవాడని మన పూర్వులు ఏనాడో చెప్పినారు.

ధర్మం :

నారదుడు గత జన్మలో దాసీపుత్రుడు. అడవిలో వచ్చి పోయేవాళ్ళకు నీళ్ళిస్తూ యోగులకు సపర్యలు చేస్తుండేవాడు. ఆ వేదవేత్తలు భుజించగా మిగిలిన అన్నాన్ని తినేవాడు. వారి ఆజ్ఞలు నెరవేరుస్తూ చివరకు జ్ఞానోదయం పొందాడు. గుణవంతుణ్ణి చూసి సంతోషం చడం, గుణహీనుణ్ణి కరుణించడం అనే మహత్తర ధర్మం నేర్చుకున్నాడు.

బాల ఘాతకుడైన అశ్వత్థామను చంపుటకు ఉద్యుక్తుడైన అర్జునునితో ద్రౌపది వెరచి వారిని చంపుట ధర్మం కాదని వారించింది. ధర్మాత్మునికి పశుపక్ష్యాదులు కూడా తోడ్పడుట రాముడి పాత్ర ద్వారా, అధర్మవర్తనుని తమ్ముడైనను విడిచి వెళ్ళుట రావణుని పాత్ర ద్వారా మనకు తెలుస్తూ వుంది.

ఉద్రేకంబున రారు శస్త్ర ధరులై, యుద్ధవనిన్ లేరు, కిం
చి ద్రోహంబును నీకు జేయరు; బలోత్సేకంబుతో చీకటిన్
భద్రాకారుల పిన్నపాపల రణప్రౌఢ క్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీ చేతులెట్లాడెనో ?

- అని ద్రౌపది అధర్మంగా తన కుమారులను చంపిన అశ్వత్థామను మందలిస్తుంది.

అర్థం :

కాసులు కలిగినవాడు రాజు కావచ్చు. అర్థం లేని బతుకు నిరర్థకం కావచ్చు. కాని, ధనం దుర్మతులకు మదం కలిగిస్తూ వుండగా ఉత్తమ కీర్తులు ఆత్మహితాన్ని మాని పరశ్రేయానికే, ఆనందానికే తమ దగ్గర గల ధనమే కాక చివరకు శరీరాన్ని కూడా వ్యయిస్తారు.

బలిచక్రవర్తి - సిరిమూట గట్టుకొని ఎవ్వడు పోడని, అతిథుల్ని సాక్షాత్తు భగవత్స్వరూపులుగా సంభావించి వారి కోర్కెలు తీర్చడంలో గల ఆనందం అనుభవించాడు.

కుచేలుడు అర్థార్థియై శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళినా ఆయన దర్శనంతోనే సర్వం ఒనగూడిన తృప్తితో ఏమీ కోరకనే వెనుదిరిగి వచ్చినాడు.

కామం :

దితి అసుర సంధ్యవేళ రతి కూడదని భర్త చెప్పినా వినక, బలవంతంగా తన పంతం నెగ్గించుకొని లోక కంటకులైన సుతులకు తల్లి అయినది.

కామం చేత భ్రష్టాచారుడై శబర కాంతా సంగమంతో తండ్రియైనాడు పురంజనుడు.

ఉత్తానపాదుడు ఇద్దరు భార్యలను కట్టుకొని ఒక్క భార్యపై మాత్రమే మమకార వ్యామోహాలు పెంచు కున్నాడు. ఆమెచే సవతి కొడుకు తన ఎదుటే ఉపా లంభింపబడితే కూడా మౌనం వహించాడు.

యయాతి తన వార్ధక్యాన్ని కుమారులకిచ్చి, వారి యౌవనాన్ని తాను స్వీకరించి సుఖలోలుడు కాదలచినాడు.

రాక్షసులు మోహిని అందాన్ని చూస్తూ అమృతం పంపకంలో ఆమె చేసిన మోసాన్ని గమనించలేకపోయారు.

గోపికల విషయంలో మధుర భావనలతో నవ్వే సమా ధానంగా ఇచ్చి ఆత్మారాముడై వారితో రమించినట్లు పోతన భాగవతం సాక్ష్యమిస్తుంది. ఇట మలిన రహితమైన ప్రేమను, అనుభూతి ప్రదమైన తృప్తిని వారికిచ్చుట ద్వారా కృష్ణుడు సామాన్యంగా భావించే శారీరక సుఖానికే భిన్న మైన అనుబంధాన్ని గోపికలతో సాగించినట్లు గుర్తించ వలసి వుంటుంది.

మోక్షం:

'జీవపరమావధి మోక్షమే సుమా!' - అని సనాతన ధర్మం ప్రబోధిస్తుంది. మోక్షం తాత్వికతా యుక్తమైన భక్తి చేతనే సాధ్యం. భక్తి అనేది ఒక విధమైన చిత్త పరిపాకం. ఆకలిగొన్న లేగదూడ అమ్మపాలకై అలమటించినట్లు, తల్లి ఒడిలోని పసికూన పాలిండ్లను తడుముటలో పొందు అనిర్వచనీయమైన అనుభూతిలాగ, యువతి మనోహరుని పరిష్వంగ సుఖానికై ఆరాటపడు విధంగా, భక్తుని అంత రాత్మ అఖండజ్యోతి దర్శనానికీ, తద్వారా లభించే చిన్మయానందానికీ పలవరిస్తుంది.

భాగవత పాత్రలలో ఖట్వాంగుడు ముహూర్త కాలంలో మోక్షార్హత సంపాదించుకున్నాడు.

తాను బతికేది కేవలం ఏడు దినలే అని తెలిసి ఆ లోపలే ముక్త సంగులైన మునుల బోధల పట్ల పరీక్షిత్తు సంసక్త మనస్కుడైనాడు. కపిలుడు తల్లికే మోక్ష కారణమైన తత్వాన్ని బోధించినాడు.

త్రిపురాసుర సంహార కథ చెప్పిన తర్వాత నారదుడు ధర్మరాజుకు వర్ణాశ్రమ ధర్మాలు చెప్పినారు. అవి 1. సత్యం, 2. దయ, 3. శౌచం, 4. సహనం, 5. దానం, 6. జపం, 7. అహింస, 8. సంతోషం, 9. సమభావం, 10. మనోమార్ధవం, 11. వృద్ధసేవ, 12. మనోనిగ్రహం, 13. ఇంద్రియజయం, 14. బ్రహ్మచర్యం, 15. యుక్తా యుక్త వివేకం, 16. ఉపవాస వ్రతాదులు - సూక్ష్మంగా పరిశీలిస్తే ఇవన్నీ ఏ విధంగా మోక్ష సోపానాలు కాగలవో తెలుస్తుంది.

భాగవత భక్తులలో తమోగుణ ప్రధానుడైన గజేం ద్రుడు, రజోగుణ దీప్తుడు ధ్రువుడు, సత్వగుణ ప్రకాశుడు ప్రహ్లాదుడు ఉన్నారు. జ్ఞాన తేజులైన ఋషులు, భక్తి నిర్భరులైన మునులు, రక్తిమయులై అభిన్నతకోరిన గోపికలు, వైరంతో భగవత్ప్రాప్తి పొందిన రాక్షసులు కనిపిస్తారు.

ధర్మార్థ కామాలు ఆచరించటం మోక్ష పథానికి సోపా పంక్తిని నిర్మించుకోవడమే. ధర్మం ఆచరించే సమయంలో వ్యక్తి బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమా లలో దేనియందుంటాడో ఆ ధర్మాన్ని ఆశ్రయించాలి. బ్రహ్మచారి నిష్టతో గురుశుశ్రూష ఆచరించి అధ్యయనం

చేయాలి. నైష్ఠిక బ్రహ్మచర్యం నుండి చలిస్తే అది ధర్మం కాదు.

ఈ విధంగా మానవుడు అన్ని దశల్లోనూ ధర్మం ఆచరించాలి. భాగవతం ప్రతీక పాత్రల ద్వారా ప్రత్యక్షీకరిస్తుంది. ధర్మం ఆచరిస్తూ శరీర పోషణం పట్ల, ఆశ్రిత జన పరిరక్షణకొరకు అర్థం సంపాదించాలి. ధర్మ బద్ధమైన అర్థార్జన మోహానికి తావీయదు. ఎప్పుడైనా వాటిని తేలికగా త్యజించే మన స్థితిని కలుగజేస్తుంది. పారమార్థిక అర్థాన్ని సముపార్జించుకొని అనగా మోక్ష సామ్రాజ్యం పొందమని భాగవతం ప్రబోధిస్తుంది.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

మహాభారతంలో (ఇతిహాసం) - ఆర్థిక వ్యవస్థ

- బానోత్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

ఇతిహాసం అనగా చరిత్ర అని అర్థం. ఈ విధంగా జరిగింది అని చెప్పుట ఇతిహాసము చారిత్రకమైన ఇతి వృత్తం కలది ఇతిహాసము. ఇతిహాసం అంటే పూర్వకథ అనే అర్థం కలదు. అమరసింహుడు అమరకోశంలో "ఇతి హాసం పురావృత్తమ్" అని పేర్కొన్నాడు. ఆంగ్లంలో ఇతిహాసాలను 'ఎపిక్' అని అంటారు. తొల్లిటి కథలే ఇతి హాసాలు. ఇవి గ్రంధస్థం కాక పూర్వము ఆశురూపంలో ఉండేవి. "ఓక కాలమున ఒక రాజవంశమునకు సంబం ధించిన చారిత్రకాంశము గలది ఇతిహాసము" పింగళి లక్ష్మీకాంతం. ఇతిహాసాలలో కథకథనానికి ప్రాధాన్యం ఎక్కువ. లోకంలో రామాయణ, మహాభారత కావ్యాలను "ఇతిహాసాలు" అంటారు. ఇందులో సూర్యవంశ చరిత్రయే రామాయణం, చంద్రవంశ చరిత్రయే భారతం.

ఇతిహాసాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు, అవి - ఒకటి పరిక్రియ, రెండు పూరాకల్పం. ఏకనాయ కాశ్రితము గల ఇతిహాసాన్ని పరిక్రియ అంటారు (రామా యణం- రాముడు). బహునాయకాశ్రితము గల ఇతి హాసాన్ని పురాకల్పం అంటారు. (మహాభారతం పాండ వులు, కౌరవులు). తెలుగులో తొలి ఇతిహాసం ఆంధ్ర మహాభారతం. సంస్కృతంలో తొలి ఇతిహాసం రామా యణం. సంస్కృతంలో మహాభారతం నూరు పర్వాల శాస్త్రేతిహాసం. ఆంధ్ర మహాభారతం 18 పర్వాల కావ్యాతి హాసం.

మహాభారతం అష్టదశ పర్వాలలో ఆది, సభా, అరణ్య పర్వాలు ధర్మాన్ని, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలు అర్థాన్ని, అనుశాసనిక పర్వం కామమోక్షాలు ప్రతిపాదిస్తాయని మహాభారతానికి వ్యాఖ్యానం వ్రాసిన నీలకంఠులవారి అభిప్రాయం. "భారత: పంచమోవేద:" అని ప్రశస్తి.

ధర్మేచార్థేచ కామేచ, మోక్షేచ భరతర్షభ,
యది హాస్తినతదన్యత్ర, యన్నే హాస్తి తత్క్వచిత్ ॥

మానవులందరికీ అత్యంత ఆవశ్యకమైన చతుర్విధ పురుషార్థాలు అయిన ధర్మార్థ కామమోక్షాలనే మహా భారతము బోధిస్తుంది. పురుషార్తాలలో ధర్మం, అర్థం, కామం, మోక్షము కలవు, ఇందులో అర్థము అనగా ధనము.

మహాభారతంలో (శాం - 2 - 391, 392) భీష్ముడు ధర్మరాజుతో కర్షకులు, వ్యాపారులు, గోరక్షకులే రాజుకు ధనం కూర్చేవారని, వారే అనేక విధాలుగా ఉపయోగ పడుతారని ధనధాన్యాలకు ఉత్పత్తి స్థానాలైన కర్షకాదు లకు కొంచమైనా హాని కలుగకుండ రాజు తన బండా గారాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెపుతాడు.

"జనకుడు బ్రోలె నర్మిలి, బ్రజం బరికించుచు షష్ఠభాగముం
గొనునది, వారిచేత నరిగ్రోటి విధంబుల నాప్తదక్షులం
గని వన గోకులాకర నగ ప్రముఖార్థకరంబు లారయం
బనుచును నన్నిటన్ ధరణి పాలుడు గన్నిడి యున్న బెంపగున్ (శాం. 2-283 ప)"

రాజు ప్రజల ఆదాయంలో ఆరవపాలు పన్నుగా గ్రహించాలని, వారి అనుమతి అనుసరించి పన్నులు వసూలు చేయాలని, పన్నుల కోసం అధర్మాచరణలు చేయకూడదని దానివల్ల ధనము చెడుతుందని, క్రింది విధంగా మహాభారతం తెలుపుతున్నది.

ధనమునకై ధర్మము దెస
ననాదరము సేసేనేని యం నృపతికి న
ద్ధనమును జెడు, దుర్యశముం
బనుగొను ద్రుది దుర్గతియును బాటిన నఘా!

(శాం 2-409)

ప్రజలపై అధికభారం పడని విధంగా పన్నులు ఎట్లా వసూలు చేయాలో భారతం ఎన్నో విధానాలను సూచించింది.

పులిగూనల దిను చందము
గలిగిన నంతటన నిలుచుగాక ధనంబుల్
గలుగునె మీద్రం గావున
జలగ దిగిచినట్లు గొనగ జనునిల సొమ్ముల్

(శాం 2-398)

పులి తన పిల్లలను తిన్నట్లుగా పన్నులు వసూలు చేసినట్లైతే ధనం వృద్ధి చెందదు. అంతటితో ఆగిపోతుంది. కాబట్టి జలగ గ్రహించినట్లుగా గ్రహిస్తేనే బండారం నిండుతుంది. ఏడాదికేడాదికి క్రమంగా పన్నులను అధికం చేసి ధనాన్ని వృద్ధి చేసుకొనవచ్చును. దండింపదగిన వారిని తగు సమయంలో దండిస్తూ వారి సంపదలు ఇతరులు మేచ్చే విధంగా తమ బండారానికి చేర్చవచ్చు. ధనవంతులపై ఈర్ష్యపూని వారి ధనాన్ని అపహరింప ప్రయత్నించకూడదు. సకల ప్రజలను రాజు దయాపరుడై రక్షించాలనే మొదలైన విషయాలను మహాభారతం నిర్దేశించింది.

ధనార్జన విషయంలో "కాపుల్ సభయులు గాకుండా" సంపాదించి ప్రభువులు ఉభయ లోకాల సంసిద్ధిని పొందవచ్చునని, ధర్మమార్గంలో ప్రజల నుండి ధనాన్ని సంపాదించాలే తప్ప మాయలమారియై ఆర్జించడం తగదని భీష్ముడు ధర్మరాజుకు లోక ధర్మాలను తెలుపుతాడు. ముఖ్యంగా దానం విషయంలో కూడా అపాత్రులకు దానం చేస్తే బొక్కసం ఖాళీ అవుతందంటాడు. తాను చెప్పిన విధంగా ప్రవర్తిస్తే కోశమిత్ర రాష్ట్ర బలాలు వృద్ధి చెందుతాయని యుద్ధాలను అపేక్షింపక విరోధులను వధించాలని, సజ్జనులను, దరిద్రులైన భూసురులను రక్షించినట్లైతే గొప్ప ఐశ్వర్యంతో రాజులు విలసిల్లుతారని చెప్పి, ఆవిధంగా ప్రవర్తించిన బలి చక్రవర్తి విషయాన్ని క్రింది విధంగా ప్రస్తావిస్తాడు.

అనిమిషులుం విభీతులగునట్టి పదంబున బేర్చిమున్ విరో
చన తనయుండు భూమిసురజాతి సువృత్తి కసూయ చేసినె
ట్టన సిరి బాయడే బలదృఢంబగు భక్తి విశేష
మూర్జంగా
ననఘ! యతుడు దాప్రిదప నవ్యయ సౌఖ్య విభూతి
నొందడే. (శాం. 2-403)

సంపదల వల్ల దర్పం పుడుతుందని, దానివల్ల బలి సంపదలు కోల్పోయినాడని, తప్పు తెలుసుకుని తిరిగి సంపదలు పొందినాడని భీష్ముడు తెలుపుతూ ప్రజల నుండి పన్నులను ఏవిధంగా స్వీకరించాలో కూడా వివరించాడు. మనస్మృతి జలగ రక్తాన్ని, ఆవుదూడ పాలను, తుమ్మెద తేనెను ఏవిధంగా కొద్దికొద్దిగా స్వీకరిస్తుందో ఆవిధంగా పన్నులను ప్రజల నుండి స్వీకరించాలని పేర్కొన్నది. (మనుస్మృతి-7.129 "ప్రజల చేత పశువుల యందును పసిండియందును ఏబదియగు అంశమును, ధాన్యమున పదియవ భాగమును భాండారంబుగా" పుచ్చుకోవాలని, ఆదాయాన్నునుసరించి, న్యాయాన్నునుసరించి ప్రజల ఆమోదాన్నునుసరించి పన్నులు వసూలు చేయాలని, పన్నులు వేసేటపుడు ప్రజలకు ముందు ఆ విషయాన్ని తెలుపాలని, ప్రతివస్తువుపైన పన్నులు వేయరాదని ఎవరి నుండి పన్నులు ఎట్లా గ్రహించాలో మహాభారతం చెప్తున్నది.

తోటవాడు కుసుమ ఫలాలను కోసినట్లు పన్నులను గ్రహించాలేకాని అడవులను నరికి బొగ్గు చేసినట్లు చేస్తే భూమి పాడవుతుందని భీష్ముడు ధర్మరాజుతో అంటాడు. సార్వకాలీనమైన, సార్వజనీనమైన సత్యాలెన్నో ఈ మాటలలో దాగి ఉన్నాయి.

కోరి తోటవాడు కుసుమ ఫలంబులు
గోయునట్లు రాజు గోన గవలయు
నవ్వనములు నఱికి యుంగారములు సేయు
భంగియైన భూమి పాడు గాదె?

(శాం 2-300)

హీనులగు కర్షకులకును, భూనుత ధాన్యంబు బీజముల వణిజులకున్
మానుగ శతైక వృద్ధిన, నూనముగా ఋణము లిత్తె యుత్తమబుద్ధిన్(సభా. 1-44)

పేదరైతులకు, వర్తకులకు ధాన్యం, విత్తనాలు ఒక శాతం వడ్డీతో ఋణాలిచ్చే పద్ధతి కాక, ఆదాయంలో నాలుగవ వంతైనా, లేదా మూడవ వంతైనా, లేక సగభాగమైనా వ్యయం చేయవచ్చుగాని అంతకు మించి వ్యయం చేయరాదని నారదుడు ధర్మరాజునితో చెపుతాడు. ఆయుధశాల, కోశాగారం, అశ్వశాల, గజశాల, ధాన్యాగారలలో ఉద్యోగులను, సామర్థ్యంతో పాటు, విశ్వాసం కలవారిని మాత్రమే నియమించాలని వివరిస్తాడు.

"ధనమూల మిదం జగత్" అన్నట్లు సుఖదుఃఖాలన్నింటికి ధనమే మూలం. ధనలాభం కలిగిన వాడు అగ్నితో వృక్షం దహించబడే విధంగా నశిస్తాడు. మృత్యువు వల్ల ప్రాణులకు ఎట్లా భయం తప్పదో ధనంకలిగినవాడికి కూడ, రాజ, చోర, స్వజనుల వల్ల భయం తప్పదు. ఆకాశంలో పక్షులు, నీటిలో చేపలు ఏవిధంగా మాంస భక్షణం చేస్తామో, ధనవంతుని చుట్టూ ఎంతో మంది చేరి వాడిని అనేక విధాలుగా భక్షించినట్లుగా హింసిస్తారు. కనుకనే

అర్థసిద్ధి కంటే నరయ నెక్కడు ధర్మ
సిద్ధి గాన సకల సిద్ధులను బ్ర
శస్త భంగిజేరు శాశ్వత కీర్తియు
సంభవించు కలుగు సద్గతి యును

(శాం. 2-403)

శాశ్వతకీర్తి, సద్గతులు ధర్మాచరణం వల్లనే సిద్ధిస్తాయని, "ప్రమాదంబున నర్థకామంబులు హీనంబులైనను ధర్మనిష్ఠం జేసి ధరణీ పరిపాలనంబును స్థిరంబై చెల్లు"నని (శాం. 2వ. 285) మహాభారతం ఉపదేశించింది. రాజనీతి రాజ్యాంగ విధులకు సంబంధించిన ఎన్నో ప్రధాన సూత్రాలను ఆవిష్కరించింది. సర్వకాలాలలో ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పేర్కొని ప్రజల న్యాయపరమైన ఆర్థిక హక్కులను ప్రకటించింది. పౌరహక్కులకు ప్రాతిపదికలను నిర్మించింది. నాడు, నేడు రానున్న తరాలకు, భారత రాజనీతి తత్వానికి మహాభారతమే ప్రధాన ఆధారంగా నిలిచింది. నిలుస్తుంది.

ఆధార గ్రంథములు :

1) శ్రీమదాంధ్ర మహాభారతము (వావిళ్ళ వారి ప్రచురణ)
2) మనస్మృతి, కుల్లూకభట్టు వ్యాఖ్య
3) కవిత్రయ భారతం - రాజనీతి - డా. నేతి అనంతరామశాస్త్రి
4) విమర్శిని (మహాభారతం ప్రత్యేక సంచిక) - డా. పి.జ్యోతి

❖ ❖ ❖

వాల్మీకి రామాయణం ధర్మార్థ యోగములు

– బానోతు స్వామి, పరిశోధకవిద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

రామాయణము ధర్మార్థ కామమోక్షములు అని నాలుగు పురుషార్థములు. సత్త్వ రజస్తములు అనే మూడు గుణములు, జీవి అహంకారము అనే రెండిటి స్వరూప ములు, ఏకభక్తి జ్ఞానము మరియు సత్యముల కలయిక, ప్రవర్తన ప్రభవము వీటి పరిణామాములు అనే వాటిని గూర్చి అద్భుతమైన విధంగా చూపించిన ఒక దివ్య, భవ్య కావ్యము. రామలక్ష్మణ, భరత శత్రుఘ్నులే ధర్మార్థ కామమోక్షములు, విభీషణ రావణ, కుంభకర్ణులు సత్త్వ రజస్తములు. వాలి సుగ్రీవులు అహంకారము మరియు జీవి, భక్తి హనుమంతుడు, జ్ఞానము జాంబవంతుడు, సత్యం సీత, వివిధ పరిస్థితులలో ఈ రూపములు ఈ స్వభావములు ఎట్లా చర్చిస్తాయో, వ్యవహరిస్తాయో ధర్మార్థ కామమోక్షముల సయోగ్యమైన ఐక్యాన్ని ఎలా సాఫల్యం చేస్తాయో చూపించే అద్భుతమైన గాధ రామాయణం.

భారతీయ సంస్కృతి సర్వస్వానికి ధర్మార్థ కామమోక్షము లనే నాలుగు పురుషార్థాలు పరమదాయ దగ్గవి. "పురుషంపై అర్థ్యంతే ప్రార్థ్యంతే ఇతి పురుషార్థ" అని పురుషార్థ శబ్ద వుత్పత్తి. పురుషులచే అంటే సర్వమానవులచే పొందదగ్గవని భావం. ప్రతీ వ్యక్తి జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి పురుషార్థాలు నాలుగు ఆవశ్యం పొంద దగినవని భావం.

వేదం సమస్తము ధార్మలకు మూలం "వేదో ఖిలో ధర్మమూలం" అని సత్యక్తి. "వేద్యంతే జ్ఞాయాంతే లభ్యతే వా ఏభి: ధారాది పురుషార్థం ఇతి వేదం" అని వేద శబ్ద నిర్వచనం. ఈ వాక్యాల వల్ల పురుషార్థాలు వేద ప్రతి పాదాలు అని విషాదమౌతుంది. వాల్మీకి మహర్షి వేద సారాన్ని శ్రీమద్ రామాయణంగా సంతరించడం చేత "వేదం ప్రాచేత సదాసీత సాక్షద్రామాయణత్మానా" అని రామాయణం ప్రశంసించబడింది. పురుషార్థాల స్వరూప స్వభావాన్ని నిరూపించడం చేత రామాయణానికి వేదత్వం సిద్ధిస్తుంది. రామాయణాన్ని నిశితంగా పరిశీలిస్తే పురుషార్థ లలో ధర్మానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడినట్లు వెల్లడౌతుంది. రామాయణ శబ్దానికి " రామస్య అయానం రామాయణమ్ అయ్యతే ప్రాత్యతే అనేన ఇతి రామా యణం" అని వుత్పత్తి. వాల్మీకి రామునికి తరుచుగా ధర్మార్థ, ధర్మవిత్, ధర్మవత్సల ధర్మబృతం, వరం, ధార్మికం అనే విశేషణాలు ప్రయోగిస్తాడు. అంతేకాదు పాత్రాముఖంగా "రామో విగ్రహా ధర్మం" అని చెప్పిం చాడు. పురుషార్థాలలో అర్థ, కామ కామాలు రెండు ధర్మబద్ధమైనపుడు అనుభవించడానికి యోగ్యము లౌతాయి. ధర్మవిరుద్ధములైతే దుష్యములుగా పరిగణించ బడతాయి. కాబట్టి వాల్మీకి ధర్మానికి ప్రాధాన్యమివ్వడం అత్యంత సమర్థనీయమైనది. మోక్ష పురుషార్థల విషయంలో వాల్మీకి మతంలో స్వర్గం ఉత్తమగతి, పర లోకం మొదలగు వాటిని పొందడం యుక్తి అని చెప్పవలసి వుంటుంది. అద్వైత, విశిష్టద్వైత, ద్వైత్వాది సంప్రదాయాలకి సంబంధించిన విషయాలు, రామాయణంలో మృగ ములు, గోవిం రాజియ్య వాఖ్యానంలోని పంక్తుల ఆధా రంగా విశిష్ట ద్వైత్వ సాంప్రదాయానుగుణంగా రామకథను సమన్వయించే పద్ధతి బహుళ ప్రచారంలో వుండడం విశేషం. వాల్మీకి మాత్రం ఏ సిద్ధాంతానికి చెందని వ్యక్తిగానే రామాయణంలో దర్శనమిస్తాడు. శ్రీమద్రామాయణాన్ని మొట్టమొదట చదివినపుడు వాల్మీకి శ్రీమద్రామా యణంలో పురుషార్థాల స్వరూప స్వభావాలను ఉప దేశించినట్టు స్ఫురించింది.

ధర్మ శబ్దనిర్వచనం :

పురుషార్థాలలో ధర్మమెంతో విశిష్టమైనది. ఈ విశ్వం సమస్తము ధర్మాన్ని అశ్రయించే ప్రవర్తిస్తోంది. కాబట్టి

భారతీయ సాహిత్యంలో ధర్మం స్వరూప ప్రాశస్తదికం అనేక విధాలుగా ప్రవచింపబడుతుంది. రామాయణం లోని ఉత్తరాకాండలో రెండవ అధికపాఠంలో సర్వ సిద్ధుడనే బిక్షువు దండంలో తన తలని బద్దలు కొట్టడాన్ని నివేదించుకుంటు ముందుగా రామునికి ధర్మ తత్వాన్ని వివరిస్తూ ఒక శునకం ధర్మాన్ని ఇలా నిర్వచిస్తుంది.

"ధరణాద్ధర్మ ఇత్యహూర్ధర్మెణ విద్మాత ప్రజ:
యశోద్ధరాయతే సర్వం త్రైలోక్యం సచరాచరమ్"

ధర్మం సమస్తాన్ని ధరిస్తుంది. ప్రజలు ధర్మంచే ధరింపబడతాడు. సచార చరమైన లోకత్రయం ధర్మంచే ధరింపబడుతుందని భావం. మహాభారతంలో కర్ణ పర్వంలో కూడా ధర్మ శబ్ద ఉత్పత్తి ఇలా చెప్పబడింది.

"ధరణద్ధర్మ ఇత్యహూర్ధర్మెణ ధర్మోధారయతే ప్రజా:
యత్ స్యాద్ధారణ సయుక్తం స ధర్మయితి నిశ్చయం"

ధరతి విశ్వమైతే ధర్మం ధ్రయాతే అనేక ఇతి ధర్మం అని వ్యుత్పత్తి. వేదవాజ్మయంలో అది నంపూసకలింగ శబ్దం, ధర్మం అని వుంటుంది.

ధర్మం లక్షణం :

వైశేషిక ధర్శనంలో "యతోభ్యుదయ నిశ్రయంస సిద్ధి ధర్మం". అని నిర్వచింపబడింది. ధర్మం అభ్యుదయ నిశ్చయసాలకి హేతువని భావం.

పూర్వ మీమాంస దర్శనంలో జైముని మునిచే "బోధన లక్షణార్థో ధర్మం అని సూత్రింప బడింది. వేదో చోదితమైన యగాదీకం ధర్మం అని అతని అభిప్రాయం.

మనుస్మృతి ద్వితీయాధ్యాయం ఆరంభంలో ఉపో ద్ఘాతంలో వాఖ్యాత కుల్లుభట్టు ప్రకృస్థ పరమాత్మ జ్ఞాన రూప ధర్మనాజ్ఞయ జగత్ త్కారణం బ్రహ్మ పతి పద్యతే" అని ధర్మం శబ్దాన్ని పరమాత్మ బోధకంగా ప్రయోగించారు.

మహాభారతంలో అను శాసన పర్వంలో భీష్ముడు ధర్మరాజుకి ధర్మ స్వరూపాన్ని ఇలా నిరూపిస్తాడు.

"అహింస సత్యమ క్రోధ అనృశంస్య దయస్తత
అర్జవం బైవ రాజేంద్ర నిశ్చతం దర్మలక్షణం"

అహింస, సత్యం, అక్రోదం, అక్రూరత, దామం, అర్జవం అనేవి ధర్మ లక్షణమని నిర్ణయింపబడింది. ఇక్కడ ధర్మ లక్షణం మనస్మృతి మార్గాన్ని అనుసరించింది.

పురుషార్థాలు నాలుగింటిలో అర్థపురుషార్థం అందరిచే సేవింపబడే, స్త్రీలు, పురుషులు, యువతులు, యువ కులు, వృద్ధులు, బాలురు అనే బేధం లేకుండా అందరు అర్థాన్నే ఆపేక్షిస్తారు. లోకంలో ప్రతికావ్యం అర్థంచేతనే సిద్ధిస్తుంది. మానవ మనుగడలో అర్థం లేకపోతే జీవితం గతిస్తుంది.

ఐహిక సుఖహేతువులలో అర్థం ఎంతో ప్రాధాన్యం పొందుతుంది. మహాకవి దండి దశకూమార చరిత్రలో అపహార వర్మ వృత్తాతంలో అర్థపురుషార్థ స్వరూపాన్నే నిపుణంగా నిరూపించాడు. మారిచ మహర్షికి కామాంజరి అర్థపురాష్ట స్వరూపాన్నే "అర్థస్తావ దర్జన వర్ధన రక్షణాత్మకా కృషి పశుపాల్య వాణిజ్య సంధి విగ్రోహాదిపరివార తీర్థ ప్రతిపాదన ఫలశ్చ" అని పేర్కొన్నాడు. అర్థనం, వర్ధనం, రక్షనం అనే మూడు అర్థం ఎక్కువ స్వరూపం.

పురుషార్థాలలో అర్థం ఎంతో ముఖ్యమైనది. ధర్మ కార్య చరణలకి, కామ, పురుషార్థాను భావానికి అర్థమే కారణమౌతుంది. అర్థం లేకుండా ఏ కార్యం ఆచరించ డానికి సాధ్యపడదు. "ధనం మూలం మితం జగత్" అని ప్రసిద్ధి. మహాభారతంలో శాంతి పర్వంలో అర్థం చేతనే తానే సర్వకార్యాలు నెరవేరుతాయి. అర్థం లేకపోతే ధర్మ కామాలు సిద్ధింపవు.

రామ కథను నిశితంగా పరిశీలిస్తే తన పుత్రుడైన భరతునికి రాజ్య పట్టాభిషేకం కర్థవ్యమని ధశరథుని వరం అడగడం చేత కైకేయి అర్థపరులని స్పష్టమౌతుంది. రాముడు ఆమెతో మహార్థ పరోదేవి అనడంలో ఓ దేవి! నేను అర్థపరున్ని కాను, నువ్వు అర్థపరురాలవు అనే భావం ధ్వనిస్తుంది. కాని ఆమె మందార ధర్భోథవల్లనే ఆవిధంగా ప్రవర్తించిందని కూడా వెల్లడౌతుంది. ఆమె అర్థపరురాలు అవడానికి మందార కారకురాలని నిశ్చయించడం సము చితం. రామలక్ష్మణ, భరత శత్రుఘ్నుల, ధర్మార్థ, కామ

మోక్షాలకు ప్రతికయని పౌరాణికులు సమన్వయిస్తారు. అటువంటి సమన్వయం సమర్థింప శక్యం కాదని నా అభిప్రాయం. ఈ విధంగా అర్థ పురుషార్థ తత్త్వం రామాయణంలో వాల్మీకి మహర్షిచే నిరూపించబడింది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. రామాయణంలో పురుషార్థాలు- వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి-2008
2. రామాయణం సమాలోచనం- కాళూరి హనుమంతరావు-2012
3. పురాణేతిహాసాలు-విశేష విశ్లేషణాలు- కేతవరపు రామకోటి శాస్త్రి -2003
4. వాల్మీకి వచన రామాయణం- దేవరకొండ చిన్ని కృష్ణశర్మ-1990

❖ ❖ ❖

కట్టబ్రహ్మన చరిత్ర – ధర్మ నిబద్ధత

– బొలుగొని శోభన్ బాబు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

'అరిగజసింహ వీరపాండ్య కట్ట బ్రహ్మన చరిత్ర' ఒక పద్య కావ్యం. దీని కర్త నల్లదీగ శ్రీనివాసాచార్యులు. వీరు 15.12.1933 తేదీన జన్మించారు. తల్లి చూడమ్మ, తండ్రి నరసింహాచార్య. నల్లగొండ జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని ఇందిరాల గ్రామం వీరి జన్మస్థలం. వీరు బహుగ్రంథకర్త కళాతపస్వి. కవిత్వంతో పాటు చిత్ర లేఖనం, నాట్యాలలోను వీరు నిష్ణాతులు.

నల్లదీగ శ్రీనివాసాచార్యులచే రచింపబడిన 'అరిగజ సింహ వీరపాండ్య కట్టబ్రహ్మన చరిత్ర' లోని ధర్మ సంబంధమైన విషయాలను చర్చించుట ఈ పత్ర రచనోద్దేశ్యం. మొదటగా ధర్మమంటే ఏమిటి, దాని నిర్వచనమేమిటో తెలుసుకోవడం సముచితం.

'ధర్మ'మను పదము సంస్కృతంలోని 'ధృ' అను బీజము నుండి పుట్టినది. 'ధృ' అను శబ్దమునకు అర్థం 'ధరించునది' లేక 'భరించునది' లేక 'సంరక్షించునది' కనుక 'ధర్మ' పదమును ఈ క్రింది విధముగా నిర్వచించిరి.

1. 'ధరతి విశ్వం ఇతి ధర్మ:' - విశ్వమును ధరించునది లేక సంరక్షించుది ధర్మం.
2. 'ధరతి లోకం వేతి ధర్మ:' - లోకమును లేక ప్రపంచను ధరించునది లేక సంరక్షించునది ధర్మమని తెలియబడును.
3. 'యతోభ్యుదయ ని: శ్రేయ స సిద్ధి: స ధర్మ: - ఇహ లోకము నుందు అభ్యుదయమును, పరలోకమునందు శ్రేయస్సును కల్గించునది ధర్మం.
4. మరియు, భగవాన్ శ్రీ వ్యాసమహర్షి మహా భారతంలో క్రింది విధంగా నిర్వచించినాడు.

ధారణాద్ధర్మ ఇత్యాహు : ధర్మో ధారయతే ప్రజా:!
యత్ స్యాద్ధారణ సంయుక్తం స ధర్మ ఇతి నిశ్చయ:!!

'ఏదైతే ధరించునో లేక సంరక్షించునో దానిని ధర్మ మందురు, ధర్మము ప్రజలను సంరక్షించును. ఏదైతే రక్షణాయుతమై (రక్షణతో కూడి) ఉన్నదో దానినే ధర్మమందురు. ఇది నిశ్చయము.

కనుక, మానవాళి మనుగడకు ధర్మమే ఆధారం. ధర్మం యొక్క బలము చేతనే విశ్వము నడచుచున్నది. ధర్మము పూర్తిగా నశించినపుడు, మానవాళి మనుగడకే ముప్పువాటిల్లి, విశ్వము గూడ నశించును. అందులకే 'సత్యం వద, ధర్మం చర' అనే వేదవాక్కు అతి ప్రసిద్ధమైనది. ప్రతి మానవుడు 'సత్యాన్ని పలకాలి, ధర్మాన్ని ఆచరించాలి' అని శ్రుతి మాత ప్రబోధించుచున్నది. ఇదియే మన భారతీయ సంస్కృతికి పునాది.

కట్టబ్రహ్మన చరిత్రలోని వస్తువు ప్రధానంగా తమిళ నాడులోని పాంచాల కురిచ్చి ప్రభువైన వీరపాండ్య కట్ట బ్రహ్మన గాథ. ప్రధానాంశం దేశభక్తి. మానవతా దృష్టి, స్వార్థచింతన అనునవి దేశభక్తికి సాధక బాధకాలైన విషయాలు. బాలరాజు, ఆదిబొమ్ము, కట్టబ్రహ్మన మొదలైన వారు మానవతా దృష్టికి, ఆంగ్లేయులతో పాటు స్వదేశీయులైన యెట్టప్ప, తొండమాన్ వంటి వారు స్వార్థ చింతనకు ప్రతినిధులు. కావ్య కథా గమనానికి ఈ అంశాలు అతి ముఖ్యమైనవి. 'ధర్మకర్మనిష్ఠ' అనునది కథాసూత్రము. దీనికి వేదిక పాంచాలకురిచ్చి.

కట్టబ్రహ్మన జీవితంలో 'ధర్మ' పదార్థము అత్యంత ప్రముఖ స్థానమాక్రమించినట్లు ఈ కావ్యంలో చూడవచ్చు. 'ధర్మ'మను పదమును కట్టబ్రహ్మన చాలాసార్లు చర్చించును. కట్టబ్రహ్మన పుట్టుక కూడా ధర్మంతోనే ముడిపడి ఉంది. అతడు పుట్టగానే ధర్మదీప్తులు దెసలెల్ల నిండినవట(3.255) ధార్మిక స్వేచ్ఛా ప్రతాప సమీరముల్ దక్షిణాశా విధి తాండవించె(3.258)నట. అదే విధంగా

కట్ట బ్రహ్మన తమ్ములతోడ కూడి కడు ధార్మిక బుద్ధిని గల్గి ధరనేలినాడు, కుశీల వైరుల ధీటణగించి ధర్మపథ దీప్తి పెంచినాడు. ఇంకా చెప్పాలంటే కట్టబ్రహ్మన 'సత్య ధర్మైక చింతన సలుపునెపుడు'(4.35) అని కవి తెలియ జేసినాడు.

ధర్మమనేది ఎప్పుడో ఒకప్పుడు అనుసరించాల్సింది కాదు. అది నిత్య కర్మానుసారి. దాన్నొక హోమంలా భావించాలి. దాన్నొక తపస్సులా భావించాలి. దాన్నొక జపంలా నిరంతర సాధన చేస్తూనే ఉండాలి. అంటే కట్టబ్రహ్మన దృష్టిలో 'ధర్మమంటే మంత్రమన్నమాట. మంత్రమేగా జపించబడేది

జపతపాది హోమ శ్రద్ధాత్రయంబున
పేర్మిదాన ధర్మ విధుల బెంచి
భారతోర్వికిపుడు పట్టిన గ్రహణమున్
వీడజేసి స్వేచ్ఛ బెంచవలెను (5.141)

అని తన సభికులను ఉత్సాహపరిచినా,

మా దేశమ్మును ప్రజలను
మా ధాత్రిని రక్షసేయ మావిధి కాదా
మా ధర్మము నెరవేర్చుట
మాదగు విధిగాదె దురిత మానవ! యరయన్
(9.366)

అని ఆంగ్లేయుడైన బానర్ మాన్ ను తెగడినా కట్ట బ్రహ్మన పాత్రకు, ధర్మానికి విడదీయరాని సంబంధం ఉంది. ఇటువంటి వాటిని ఎన్నింటినైనా ఈ కావ్యం నుండి చూపించవచ్చు.

ఆంగ్లేయుల రాయబారైన ఆలందొరకు గౌరదరములతో అర్ఘ విధుల నొసగి, ఆతిథ్యమొనరించి అతనితో

నీపై కోపము లేదు మా కునిసుమంతేనైన సంకోచమున్
దాంపుగోరక దూత కృత్యముల నెంతన్ విస్మృతింజెందకన్
ప్రాపుంజేరితివంత దెల్పుమిట మర్యాదించినా మింత నిన్
పాపంబున్ గన నివ్వమింత నిను నొవ్వంజేయ మే
తీరునన్ (6.199)

అని పల్కిన మాటలు కట్టబ్రహ్మన ప్రభుధర్మానికి నిదర్శనం. దూతకు ఎటువంటి ప్రాణహాని తలపెట్ట కూడదు అనే రాజనీతి ఇందులో ఇమిడి ఉంది. ఈ పద్యం కట్టబ్రహ్మన క్షమకు, శుచిత్వానికి, ఇంద్రియ నిగ్రహానికి, ధీర్విద్యా, సత్యాలకు తార్కాణం. ఇవన్నీ ధర్మ లక్షణాలు.

కట్టబ్రహ్మన ఎటువంటి కష్టాలనైనా సహిస్తాడు కానీ అధర్మ కర్మలను అస్సలు ప్రోత్సహించడు. వైకుంఠపురం లోని ధాన్యాగారాలను కొల్లగొట్టి ధాన్యాన్ని దోచుకొని పోవుటయే కాక ధాన్యాగార రక్షకుడైన సిపాయిని చంపిన దానాపతితో

నిత్యశివార్చన నెదగెడు నీకు
సత్య సౌశీల్యుడై సాగెడు నీకు
యీ నికృష్టపు బుద్ధి యేల నీ కొదవె
మంచి చెడ్డల నీవు మరిచిపోయితివె
పిరికిపందగ నీవు పెరవారి సొత్తు
కొల్లగొట్టగ నీకు నుల్లమెట్లొప్పె
పరుల హింసింపని పరమ శాంతుడవె
కావలి మనిసిని కడతేర్పదగునె? (8.240)

అని కట్టబ్రహ్మన పల్కిన మాటలు గమనార్హం. దానాపతి తన మంత్రియే కాక గురుతుల్యుడు కూడా. అటువంటి దానాపతిని మందలించడం కట్టబ్రహ్మన ధర్మ నిబద్ధతకు కారణం.

ఇదే సందర్భంలో కట్టబ్రహ్మన తన మంత్రియైన దాపతి శివసుబ్రహ్మణ్య పిళ్ళైని రక్షించుకోవడానికి

తమ్ముని బిల్చి తోడితుల దాల్మిన నాంగ్ల విభుత్త మాళికిన్
నెమ్మది వ్రాయుమిట్లు తగునేర్పున తప్పిదమెల్ల మాది రొ
క్కమ్మును ధాన్యమున్ దమకు కావలిసుండిన సంతనివ్వగా
సమ్మతి గల్గినా మనుచు చాటుము తెల్పు క్షమాపణం
బులన్ (8.244)

అని అనడంలో కట్టబ్రహ్మనలో దానవీరుడే కాదు ధర్మవీరుడూ కనబడతాడు. కట్టబ్రహ్మన క్షమాపణలు చెప్పడంలో ధర్మవీర లక్షణముంది. సాధారణంగా లోకంలో కూతురు తప్పు చేస్తే అది తల్లితప్పు, కొడుకు తప్పు చేస్తే అది తండ్రి తప్పు అని పెద్దలంటుంటారు. దానాపతి గురువైనా, మంత్రిగా రాజైన కట్టబ్రహ్మనకు ఈ సందర్భంలో అతడు పుత్రుతుల్యుడే. కాబట్టి ఆ తప్పు కట్టబ్రహ్మనదే అవుతుంది. అందుకే ఆ క్షమాపణ, కాదు కాదు క్షమాపణల వేడుకోలు. చేసిన తప్పును కప్పి పుచ్చాలనుకునే వాడికంటే ఒప్పుకునేవాడే అసలైన వీరుడు. వాడే ధర్మవీరుడు అనబడతాడు. కట్ట బ్రహ్మన అటువంటి ధర్మవీరుడు.

బానర్‌మాన్ సైన్యం పాంచాల కురిచ్చి కోటను ముట్ట డించాక, యుద్ధం ముగిశాక కట్టబ్రహ్మన ఇతర పాళెయ నాయకుల సహాయసంపత్తి కోసం కోట విడిచి పోవాలను కుంటాడు అందుకు అతని తల్లి అంగీకరించదు. అప్పుడు కట్ట బ్రహ్మన తల్లి ఎదుట చేసిన ప్రతినయందు ధర్మవీర సూర్పి గలదు.

నీవననిట్లు నేనిచట నిల్చిన చావది తప్పునే రిపున్
ఏ విధినైన మార్కొనక నెమ్మిన జూతరె! జ్ఞానహీనులే
చావుకు భీతిగాంచెదరు శౌర్య పరాక్రమ సాహసంబు మా
వూపిరి, సత్స్వతంత్రమున మాధర గాచుట ధర్మమౌ గదే
(9.122)

వైరుల శ్వేత జాతులను పట్టి పరాక్రమ మొప్ప యుద్ధమం
దారని పౌరుషంబు పటుదార్ఢ్యత గల్గిన స్థైర్య ధైర్యముల్
భారతదేశ రక్షణకు పాండ్య ధరిత్రికి తోడు గూర్చుచున్
పోరొనరించి సాహసము బూని ధరన్ వడిగాతు మమ్మరో
(9.123)

ఇందులో ఆర్ముగాంబ ఆలంబన విభావము. ఆంగ్లే యుల కోటముట్టడి, యుద్ధావాతావరణం, సేనాపతి వీరయ్య దేవుని మరణం ఉద్దీపన విభావాలు. స్థైర్యం, ధైర్యం, శౌర్యం, త్యాగాలు అనుభావాలు, ధృతి, ఔత్సు క్యము, గర్వము, ఉగ్రత, వితర్కము మొదలైనవి సంచారి భావాలు. వీటి సంయోగంచే నిష్పన్నమైన ఉత్సాహ స్థాయి భావము ధర్మ ప్రధానమగుటచే ధర్మవీర మనబడును. వీటి ఫలితంగా కట్టబ్రహ్మన ధర్మవీరుడు.

ఇక్కడ కట్టబ్రహ్మన తల్లిమాట కంటే దేశ సౌభాగ్యానికే ప్రాధాన్యమిచ్చాడు. అలాగని అతనికి మాతృభక్తి లేదని కాదు. చూతరె, గదే, అమ్మరో అనే పదాలు అతని మాతృ భక్తికి వ్యంజకాలు. కట్టబ్రహ్మన అప్పుడు అలా కోటను విడిచి పెట్టడం వల్ల చారిత్రకంగా కొంత అపవాదుకు లోనయ్యాడు. కవి ఆ అపవాదును తన రచన ద్వారా తొలగించాడు. వ్యక్తి నిష్ఠకంటే సామాజిక నిష్ఠ గొప్పది. అంటే వ్యక్తి ధర్మం కంటే దేశధర్మం గొప్పదని ఈ సందర్భంగా తేలే సారాంశం.

ఈ విధంగా ఈ కావ్యంలో 'ధర్మయుతమైన కర్మనే ఆచరించాలి' అనే సందేశం చాలా చోట్ల దర్శనమిస్తుంది. అయితే ఈ సందేశం కథానాయకుడైన కట్టబ్రహ్మన ముఖంగానే కాక ఇతర పాత్రల ద్వారా కూడా ప్రత్యానుగా, పరోక్షంగా వెల్లడవడం గమనించవచ్చు. ఉదాహరణకు బళ్ళారి ప్రభువు బాలరాజు వద్దకు పంపే సందర్భంలో

'భటుడు నెడదలోన ప్రభు దుష్టబుద్ధికి
నొచ్చుకొనుచు నిలువనోపలేక
కదలిపోయి వేగ కడుదీన వదనుడై
బాలరాజు తోడ పలికెనిట్లు' (2.20)

అని కవి తెలియచేసిన పద్యం గమనార్హం. ఇక్కడ తన ప్రభువు దుష్టబుద్ధి గలవాడైనా భటుడు తన వృత్తి ధర్మాన్ని అనుసరించాడు. తనకు ఇష్టం ఉన్నా లేక పోయినా ప్రభువు ఆజ్ఞను పాటించడం సేవకుని విధ్యుక్త ధర్మం కదా! అలాగే ఈ భటుడు బళ్ళారి ప్రభువు ఆజ్ఞను శిరసావహించాడు. అదే విధంగా డబ్యు. సి జాక్సన్ దగ్గర పని చేసే గోపాలయ్య కట్టబ్రహ్మనతో

'పూర్వము మీ ప్రాపు - బొందిన యేను
మీ యుప్పదిని పెంపు - మీరితినయ్య
గ్రామాధికారిగా - కరణీక మొసగి
ఆ వృత్తిలో మిమ్ము నలరించినాడ
మీ పుణ్యమున నేను - మీ యండలోన
చక్కని బ్రతుకును సాగించినాను
కారణాంతరమున కదలి మీ నుండి
ఇట రామలింగాఖ్య - పటు విలాసాన
బ్రతుకది చెడనుండి బ్రతుకీడ్చు చుంటి
ఈ పరాసుల చెంత నెంగిలైయుంటి'

(7.206)

అని అనడంలో గోపాలయ్యకున్న ధర్మాధర్మ విచక్షణ జ్ఞానం బోధ పడుతుంది. అధర్మ వర్తనులైన ఆంగ్లేయుల చెంత ఉద్యోగం గోపాలయ్య మన: క్షోభకు కారణమని భావించవచ్చు.

ద్వితీయ ఖండంలో ఆదిబొమ్ము బోధనలను విని దొంగల మనస్తత్వంలో మార్పు వస్తుంది. 'ప్రజను హింస చేసి బ్రతుకు జీవితమెల్ల ఆత్మహాని' (2.189) అని వాళ్ళు తెలుసుకుంటారు. అందుకు వాళ్ళు ఆదిబొమ్ముతో

'నేటి నుండి మేము నిత్య సత్యవ్రత
నియమ ధర్మవృత్తి నెన్నుకొనుచు
కాయకష్టమూని ఘనముగ జీవింతు
మవని లోన మిమ్ము మదిని నిలిపి' (2.188)

అని ప్రతిజ్ఞ చేస్తారు. దీన్ని కావ్యార్థ సిద్ధిగా భావించ వచ్చు. 'ఎవరి వృత్తి ధర్మాన్ని వారు సక్రమంగా నిర్వర్తిం చాలి' అని ఈ కావ్యం మనకిచ్చే సందేశం. దీనికి మరొక ఉదాహరణ.

'క్రౌర్యమనెద బొంగ క్రోధంబు కన్నుగప్ప
ఏ విధంబున నీతిని నిహముబాప
వలయునని శిక్షింపబరగితిటుల
అఘమతుండైన వైశ్రాయి యానతిగని'

(9.448)

అని బానర్‌మాన్ కావ్యాంతంలో అనుకోవడం పై విషయాన్నే బలపరుస్తుంది. కాని యెట్టప్ప, తొండమాన్‌లు అందుకు విరుద్ధం. అందుకే వారు చరిత్ర హీనులయ్యారు. కట్ట బ్రహ్మన శాశ్వత కీర్తివంతుడయ్యాడు తను చేసిన ధర్మకార్యాచరణ వల్ల ఈ విధంగా కవి

'ధర్మార్థ కామమోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
కరోతి కీర్తిం ప్రీతిచ సాధుకావ్య నిషేవణం'

అనే కావ్య లక్షణ మర్యాదననుసరించి చతుర్విధ పురుషార్థాలలో ధర్మానికి ప్రాధాన్యమిచ్చి 'కట్ట బ్రహ్మన చరిత్ర' కావ్యాన్ని ధర్మతత్వ ప్రతిపాదకంగా, ధర్మ తత్వ వ్యాఖ్యాన ప్రాయంగా రచించి కృతకృత్యులయ్యారని నిస్సంశయంగా చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అరిగజ సింహ వీరపాండ్య కట్టబ్రహ్మన చరిత్ర - నల్లదీగ శ్రీనివాసాచార్యులు
2. మనుస్మృతి - నల్లందిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు (వ్యాఖ్య)
3. 'సనాతన ధర్మము - దాని విశిష్టత', స్వామి ముకుందానంద.

❖ ❖ ❖

మహాభారతకాలంలో ధర్మము

– డా॥. ఓ. వెంకట ప్రసాదు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వనపర్తి.

ధర్మోరక్షతి రక్షిత: అని నానుడి
ధర్మోహంతి హతో హత :

నీవు ధర్మాన్ని విడనాడితే నిన్ను ధర్మము విడనాడు తుంది. అన్న సూక్తులు ధర్మము రక్షణయందు శిక్షణ యందు సమర్థమైనది. ఆ ధర్మము జీవులకు శ్రేయస్సు నిచ్చుటలో సమర్థమయిందే గాని బాధించేదిగాదు.

మహాభారత కావ్యములో ధర్మము సమగ్రముగా నిరూ పించబడింది. వేదముచే నిరూపింపబడేది ధర్మము. ఏది ధర్మము ఏది అధర్మము అన్నది సూక్ష్మముగా పరిశీలిస్తే గాని తెలియదు.

సంజయరాయబారంలో ధర్మరాజు సంజయునితో ఇలా అంటాడు

"యత్రాధర్మో ధర్మ రూపాణిధత్తే
ధర్మ: కృత్యేదృశ్యతే ధర్మ రూప:
బిభ్రద్ధర్మో ధర్మరూపం తధాచ
విదాంసన్తం సంప్రపశ్యన్తి బుద్యా "

– ఉద్యోగపర్వ 27

స్థూలముగా చూస్తే ధర్మము అధర్మముగా, అధర్మ మము ధర్మముగా కనపడుతుంది. సూక్ష్మముగా విచా రణ చేసినపుడు సత్యము కనపడుతుంది. లేకపోతే ధర్మము అధర్మముగా కనిపిస్తుంది. ఇది బుద్ధిమంతులైన విద్వాంసులు సూక్ష్మజ్ఞానంతో గ్రహిస్తారు అంటాడు.

దుర్వాసుడు కన్యయైన కుంతీదేవికి మంత్రోపదేశానికి గల కారణాన్ని పరిశీలిస్తే, దుర్వాసుని మంత్రప్రభావం వల్ల కర్ణునిపుట్టుక పాండవుల అవతరణము కురుపాండవ వ్యూహాలు కురుక్షేత్ర సంగ్రామము క్షత్రియలోక ప్రళయము అన్నీ దుర్వాసుని మంత్ర ప్రభావముగానే జరిగినట్లు కనిపిస్తున్నాయి.

కుంతి, మాద్రిలు కామపరతంత్రలై పాండవులను సంతానముగా పొందలేదు. కేవలము భర్త ఆజ్ఞప్రకారము జరిగిన పనులు. వారు భర్త ఆనతిని జవదాటకూడదని, భర్త ఆజ్ఞ అనే ధర్మానికి కట్టుబడటంవల్ల జరిగింది. కుంతికి ధర్మలోపం లేకపోయినా బాల్యచాపల్యం వలన మంత్రముతో సూర్యుడిని ఆహ్వానించి కర్ణుడిని కని తన కుమారునిగా చెప్పుకోలేని స్థితి కల్గింది. దేవతలు సంకల్పం వల్ల, వాక్కువల్ల, దృష్టివల్ల, స్పర్శవల్ల, రతివల్ల సంతతి పొందగలరు. దైవసాంగత్యము చేత మనుష్యధర్మమునకు దోషమందదు. దేవతల సంకల్పము వల్ల కుంతికి జరిగిన పుత్రజననము దోషము కాదని వ్యాసులవారు చెప్పారు. కాబట్టి పాండువుల జననములో ఎలాంటి ధర్మలోపం లేదు.

లక్కయింటి దహనానంతరము అరణ్యములో నున్న పాండవులలో భీముని చూసిన హిడింబి భీముని మోహించి పొందుకోరి వివాహమాడుమనగా, భీముడు ధర్మజ్ఞుడగుటవల్ల తన అన్నగారికి వివాహము కానిదే తాను వివాహమాడుట ధర్మమమని నిరాకరిస్తాడు. అపుడు హిడింబి కుంతికి నమస్కరించి భీముని వరించి నట్లు అతనిపొత్తుననుగ్రహింపమని భీముడు అంగీకరింప పోతే బ్రతుకనని, ఆపదలు కల్పించే ధర్మము అధర్మ మమని, రక్షించేది ధర్మమని, నాకు భీముని ప్రసాదించ మని కుంతిని ధర్మరాజును ప్రార్థిస్తుంది. అపుడు ధర్మ రాజు అంగీకరించి హిడింబిని రక్షించుట ధర్మమని ఒక నియమము పెట్టి సూర్యాస్తమయము లోపల భీమునితో విహరించి మావద్దకు తిరిగి పంపవలెనని అంటాడు. భీముడు కూడ తాను కేవలం పుత్రోత్పత్తివరకు మాత్రమే వుంటానంటాడు. ఇక్కడ రాక్షసితో మానవ సంగమము, అందునా పరమనిషిద్ధమైన దివాసంగమము. ఇది

లోకదృష్టిలో ధర్మవ్యతిరేకంగా కనిపిస్తుంది. కాని ధర్మరాజు రాజనీతిని ప్రదర్శించి రాక్షసితో భీమసంగమం వల్ల మహా బలవంతుడైన రాక్షసుని పుత్రునిగా పొందాలను కుంటాడు. పాండురాజు కుమారులైన పాండవులు రాజ్య మంతా తమకే కావాలని పాండవులు పట్టుపట్టలేదు. కారణము కౌరవుల పోషణార్థము అర్ధరాజ్యము వదిలారు. దుర్యోధనుడు కర్ణుడికి అంగరాజ్యమిచ్చినపుడు కూడ పాండవులు అభ్యంతరము పెట్టలేదు. కారణము పాండ వులు పెద్దలు చెప్పినట్లు నడవాలన్న ధర్మస్వభావముతో ధర్మంగా వున్నారు.

బ్రాహ్మణునికి శస్త్రధారణము యుద్ధము చేయుట నిందింపదగినది. తనకు అక్కరలేని పరధర్మమైన దారుణ యుద్ధానికి పూనుకోవటం అధర్మము. అందులో సైన్యాధి పత్యస్వీకారము పొంది చక్రవ్యూహాది దారుణ అసుర వ్యూహములు పన్నుట అధర్మము. అస్త్రములేని వారిమీద బ్రహ్మాస్త్రము ప్రయోగించి మహావీరుని సంహరించుట, కూట యుద్ధములు కల్పించుట మొదలగు అసురధర్మ ములు. అందువల్ల ద్రోణవధ ఘోరముగా జరిగింది ఇది ధర్మమే.

ఆపదయందుకూడ బ్రాహ్మణేతరులు బ్రాహ్మణ ధర్మమును స్వీకరింపదగినది కాదు. కాని పాండవులు ఏకచక్రపురంలో ఆపదదశలో జీవించుటకై బ్రాహ్మణ వేషములు ధరించి భిక్షాటనతో జీవించారు. ఇక్కడ జీవిం చుటకు వేరేమార్గం లేనపుడు నిషిద్ధధర్మమైన ఆచరింప వచ్చు. అధర్మభీతితో జీవనానికి ఇబ్బందియైన ధర్మమాచ రించువాడు దూషింపదగినవాడవుతాడు. ఇట్టి దశలో వృత్యంతరమైన పొంది జీవులు బ్రతుకవలెనని సృష్టికర్త పరమేశ్వరుడు ప్రాయశ్చిత ప్రకరణాన్ని పేర్కొనటంచేత, పాండవులు ఆపద్ధర్మనిర్వహణానంతరము ప్రాయశ్చిత్త ముచేత అధర్మదోషమును తొలగించుకున్నారు.

ద్యూతక్రీడలో ధర్మజుడు నకులుడినే పెట్టుబడిగా పెట్టాడు. కారణము తాను పెద్దవాడు పందెంలో వుండ కూడదు. కాబట్టి పినతల్లి కుమారుడైన నకులుని పందెంలో వుంచాడు. ఏదైనా కోరుకునే అవకాశం వున్న పుడు చిన్నవారికే యివ్వాలి. ఇది ధర్మప్రసిద్ధవ్యవహారం.

ధర్మదేవత యక్షరూపమున వచ్చి ప్రశ్నించగా ధర్మ రాజు చెప్పిన సమాధానములకు యక్షుడు సంతోషించి నీసోదరులలో ఎవరినో ఒకరిని కోరుకో బ్రతికిస్తానన్నపుడు ధర్మరాజు నకులుడు బ్రతకాలంటాడు. అపుడు యక్షుడు ఏకోదరులు బలవంతులైన భీమార్జునులను కోరక నకులుని ఎందుకు కోరావని యడుగగా ధర్మజుడు ధర్మమును మనము పోషిస్తే అది మనల్ని రక్షిస్తుందని, తాను ధర్మాన్ని విడనాడనంటూ కుంతీ జ్యేష్ఠపుత్రుడు బ్రతికే వున్నాడు గనుక మాద్రి జ్యేష్ఠపుత్రుడు గూడ బ్రతికి యుండుగాక యని కోరాడు. అపుడు ధర్మదేవత సంతోషించి నలుగురిని జీవింపజేసింది.

ఈ విధంగా మహాభారతంలోని విషయమంతా ధర్మ బద్ధంగానే జరిగింది.

ఆధార గ్రంథాలు :

1. మహాభారతము - ధర్మసూక్ష్మదర్శనము మల్లాది చంద్రశేఖరశాస్త్రి

❖ ❖ ❖

భారతంలో ధర్మపరిరక్షణ– ఒక పరిశీలన

– డా॥. అల్లంశెట్టి నాగజ్యోతి, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, శ్రీదుర్గ మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, విజయవాడ.

"సహితస్య భావ: సాహిత్యం" అన్నారు పెద్దలు. సమాజానికి అద్దం వంటి సాహిత్యంలో సంఘం యొక్క ప్రతి రూపం, ఆచారాలు, వ్యవహారాలు, మానవుని ప్రతి కదలికను చూపించకలదు. వీలైతే భూత, వర్తమాన, భవిష్యత్తుకి చెందిన అపారమైన జ్ఞాన సంపదనిచ్చేదే సాహిత్యం.

మంచి సాహిత్యం ఉపదేశసహితం. ఎందరో కవులు, రచయితల మనోనేత్రాలే ఎల్లలులేని సాహితీ ప్రక్రియలు. మానవుని అభిరుచి, నాగరికత, భాషా వైవిధ్యాలను బట్టిగాని, మానవుడు సంఘజీవి కాబట్టి తన ఆలోచనలు, భావాలు ఇతరులకు చెప్పుకోవాలి, వారివి కూడా వినాలి అన్న పరిస్థితుల్లో కూడా సాహిత్యంలో అనేక రకాలైన ప్రక్రియలు పుట్టుకొచ్చాయి.

సాహిత్యం అంటే మనోవికాసం కల్గించేది కాబట్టి, ఇది ఏ ప్రక్రియలో ఉన్నా దీని ప్రయోజనం చివరకు హితాన్ని. ఆనందాన్ని, మంచి కీర్తిని కల్గిస్తుంది. సాహిత్య పోకడలు ఆధునిక కాలంలో అనేక శాఖలుగా విస్తరించి ప్రజోపయోగాలకు తగినట్టుగా వివిధ రకాలుగా మానవ లోకాన్ని ఆనందింపచేస్తుంది, ప్రతిభావంతులను చేస్తుంది.

నేటి పోటి ప్రపంచంలో చదువని వారికి, చదువుకున్న వారికి సైతం సాహిత్యపరంగా సాహిత్యం అర్థమయ్యే రీతిలో, ప్రపంచాన్ని కళ్ళముందుకు తెచ్చే 'ప్రచార సాధనాల' ద్వారా సాహిత్యవైశిష్ట్యం వర్ణనాతీతం.

సాధారణంగా ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తితో తన ఆలోచనలు, వైశిష్ట్యం భావాలను పంచుకోవటాన్ని స్థూలంగా 'సమాచారాల చేరవేత' అని వ్యవహరిస్తున్నా. మాధ్యమాలు లేక మీడియా కోసం సాహిత్యపాత్ర అవిభాజ్యమైనది. మాధ్యమాలైన కొన్నింటిలో పత్రికలు, రేడియాలు, టెలివిజన్లు, కేబుళ్ళు, సినిమాలు వ్యాప్తిలోకి వచ్చాయి.

స్వతహాగా కవి ఒక సన్నివేశాన్ని చూచి స్పందించి, ఊహా, కల్పనలతో వ్రాస్తారు. కాని మీడియా సాహిత్యం ఒక్కోరకంగా శిక్షణ, ప్రావీణ్యం, సృజనాత్మకతలు, శ్రద్ధ లాంటివి అవసరం.

వేయి సంవత్సరాల తెలుగు సాహిత్యంలో ఎనిమిది వందల సంవత్సరాల సాహిత్యం ప్రాచీనసాహిత్యం. మిగిలిన రెండువందల సంవత్సరాల సాహిత్యంపై సంస్కృత ప్రభావం, ఆధునిక సాహిత్యం పై ఆంగ్ల ప్రభావం భాగా కన్పిస్తుంది.

తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు చోటు చేసుకున్నాయి. అందులో ముఖ్యమైనవి. ఇతిహాసం, పురాణం, కావ్యం, ప్రబంధం, పదకవిత, ద్విపద, ఉదాహరణం, శతకం, వచనం, చిత్రకవిత, కథాకావ్యం, దండకం, ద్వర్థికావ్యం, అచ్చుతెలుగు కావ్యం, యక్షగానం, హరికథ, బుర్రకథ, చాటువు, అవధానం, జానపద కవిత్వం, నవల, కథ, గల్పికలు, నాటకం, ఏకాంకిక, పాట, ఖండకావ్యం, గేయం, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, మాత్ర చరిత్ర, వ్యాసం, పీఠిక, విమర్శ, లేఖాసాహిత్యం, అనువాదం మొదలైనవి, చాలా వరకు కొన్ని ప్రక్రియలు సర్వజనాదరణ పొందినవి. తెలుగు సాహిత్యంలో విశ్వమానవ సంక్షేమాన్ని కోరే ప్రక్రియలు అసామాన్యమైనవి.

సాహిత్యం సామాజిక ప్రతిబింబం. సమాజం నిరంతరం మార్పునకులోను అవుతుంది. అదే విధంగా సాహిత్యంలో కూడా మార్పులు జరుగుతాయి. సమాజంలో అనేక కట్టుబాట్లు ఉంటాయి. అందరూ ఆ నియమాలకు లోబడి జీవించాలి. నీతి అనేది సంఘానికి సంబంధించినది నైతిక విలువల అంతిమ లక్ష్యం ఆదర్శ సమాజం.

నన్నయ యుగం నుండి తెలుగు సాహిత్య ప్రవాహం అనేక విధాలుగా సుడులు తిరుగుతు పెక్కు మార్పులు, ప్రక్రియలుగా విరాజిల్లి చివరికి నేడు ప్రపంచీకరణ వలన విలక్షణమైన మార్పులతో ప్రభవిస్తుంది.

భారతీయుడైన ప్రతివాడు ఒక్కసారైనా భారతం చదవాలి ఎందుకంటే దీనిలో ధర్మ శాస్త్రం నీతి శాస్త్రాలు మొదలుకొని సర్వ శాస్త్రాలు ఇందులో ఉన్నాయి క్రీస్తు శకం రెండువేల నాటికి ఐదు వేల నూరు సంవత్సరాలు అయింది వ్యాస మహర్షి పది లక్షల పైచిలుకు శ్లోకాలతో మహాభారతం చెబుతూ ఉంటే సాక్షాత్తు ఆ విఘ్నేశ్వరుడు వ్రాసాడు అన్నది సర్వ విధితమే "తింటే గారెలు తినాలి! వింటే భారతం వినాలి" అని ఎవరో ఒక మహా జ్ఞాని చెప్పిన వచనం, దీని విశిష్టత ఏమంటే భారతం ఒక గొప్ప 'ఇతిహాసం'. ఇతిహాసం అనగా ఇలా జరిగిందని స్పష్టీకరించే కథా సంగ్రహం 'మహాభారతంలో శాస్త్రాలతో పాటు శాస్త్రాలు కూడా ఉన్నాయి' అందుకే మహా భారతం 'పంచమవేదం' అన్నారు.

శకుంతలోపాఖ్యానం ఇతిహాసంలోనే చక్కటి సందేశాత్మక ఉపకథ. స్త్రీ పురుషులిద్దరూ వయసులో ఆకర్షితులవడం, తద్వారా పురుషుడు స్త్రీని ప్రేమించి, మోహించి, వివాహం చేసుకుని, అటు పిమ్మట ఆమెను వదిలి వేయు పరిస్థితులు ఆ నాటి నుండి నేటి వరకు కొనసాగుతున్నాయి. ప్రేమ వివాహాలు అయినా ఇటువంటి వైపరీత్యాలు సమాజంలో జరుగుతున్నాయి. మోసం చేయడం పురుషుడు చేసే తప్పిదం మోసపోవడం స్త్రీలకు శాపంగా మారింది. ఏ కాలంలోనైనా ధర్మ, అర్థ, కామ మోక్షాది పురుషార్థాలను పాటించు వారే మనిషిగా గుర్తింపబడ్డాయి. మనిషిగా గుర్తింపబడుట శాస్త్రవచనం. కాని కాలం మారుతుంది మానవునిలో మానవత్వం తో పాటు పురుషార్థాలలో ధర్మం ప్రధానమైనది, కాని దానిని కూడా రక్షించక విడిచిపెట్టి తప్పులు చేస్తున్నాడు.

సమాజాన్ని చెడు మార్గంలో ప్రయాణించేటట్లు ప్రవర్తిస్తున్నాడు. ప్రతిగృహస్థునకు ఈ నాలుగు పురుషార్థాలవలన గృహస్థ ఫలితం దక్కుతుంది. కాని ధర్మాన్ని తప్పి స్వలాభం కోసం ప్రలోభ పడి ధర్మాన్ని రక్షించాల్సినది పోయి, దానిని అనుసరించడం లేదు. దానికి చక్కని ఉదాహరణగా ఆదికవి నన్నయ గారు ఆంధ్రీకరించిన 'ఆంధ్ర మహాభారతం'లోని ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో పొందుపరిచిన ఆణిముత్యం 'శకుంతలోపాఖ్యానం'

ఇతివృత్తానికి వస్తే శకుంతల, దుష్యంతులు గాంధర్వ వివాహం చేసుకుంటారు. కొన్ని దినాలు గడిచాక దుష్యంతుడు వెళ్లి తనకు పల్లకి పంపుతానంటాడు. కాని ఎన్ని రోజులైనా అతని జాడ లేదు. తనకు కుమారునిగా భరతుడు జన్మించుట అతనిని తీసుకొని రాజు వద్దకు వెళ్లినప్పుడు, తను ఎవరో తెలియదని అన్నట్లుగా తిరస్కారం చేస్తాడు. ఆ సందర్భంలో నన్నయ కవి "విమల యశో నిధి పురుష వృత్త మెఱుంగుచు..... నేర్పునె తన్ను మ్రుచ్చిలన్" అన్న పద్యంలో నిర్మలమైన కీర్తి కలిగిన ఓ రాజా! వేదాలు, పంచభూతాలు, ధర్మం ఉభయ కాలాలు, సంధ్యలు, హృదయము, యముడు, సూర్య చంద్రులు, పగలు, రాత్రి అనేవి మహాపదార్థాలు ఉంటాయని అవి నరుల ప్రవర్తనను గమనిస్తూ ఉంటాయని వివరిస్తుంది.

మన వివాహ సంప్రదాయాలలోనే "ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ" అంటూ మంత్రోచ్చారణ ద్వారా పాటించే నియమాలు నేడు కొందరి జీవితాల్లో అవి కేవలం వచన ప్రాయంగానే మిగులుతున్నాయి. ఆచరణలో పాటించక అర్థాలు తెలియక, జీవితాల్లో వెలుగుకు బదులు చీకటిని నింపుకుంటున్నారు. ఈ కావ్యంలో అతను ఎవరో తెలియదన్న దుష్యంతుని మాటలకు కొంతసేపు చింతించి, దుఃఖించి, అతనికి ధర్మోపదేశం చేస్తుంది.

అందులో భాగంగానే భార్య విశిష్టత, కుమారుని ప్రాధాన్యం, సత్యవాక్య మహిమల ద్వారా ధర్మపరిరక్షణ చేయాలని ప్రబోధిస్తాడు. దానిలో భాగంగానే పతివ్రత, గుణవంతురాలు, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారంగా చూసే దుర్బుద్ధి కలవానికి ఇహపర

లోకాలలో సుఖమన్నది ఉండదంటుంది. భార్య పురుషునిలో సగభాగమని, ధర్మార్థ కామ మోక్షాలను సాధించుటకు భార్య ఉపకరణమని, గృహస్థ ధర్మాన్ని బోధించే గురువే భార్య గాను హృదయానందానికి ముఖ్య కారణమని వివరిస్తుంది.

కుమారుడన్న 'పున్నామ' నరకం నుండి తప్పించే వాడని, ఒక్కసారి ఆలింగనం కుమారుడిని చేసుకుంటే ఆ చల్లని కౌగిలింత అనుభవపూర్వకంగా తెలుసుకోమని చెబుతూ, పుత్ర ప్రాధాన్యతను వివరించినది.

"నుతజల పూరితంబులగు నూతులు ..... నొక సూనృత వాక్యము మేలు సూడగన్" అనే పద్యం ద్వారా సత్యమే పెద్ద ధర్మమని, ఎన్నో పుణ్యక్షేత్రాల ఫలం 'సత్యవాక్యం' తో సమానం కాదని వివరించినది. కనుక నాడైనా నేడైనా వివాహ పద్ధతులు వేరైనా, మతాలు వేరైనా వివాహితులైన వారు ధర్మార్థ కామ మోక్ష సాధనను చక్కగా పాటించి పరిపూర్ణ జీవనం కొనసాగించాలనేదే కావ్యాల సందేశం.

పంచమ వేదమైన మహాభారతం గొప్ప ఇతిహాసం. ఈ కావ్యమందు శకుంతలోపాఖ్యానంలో నన్నయ గారు చెప్పించిన ధర్మోపదేశంతో పాటు కుంతి, గాంధారి, ద్రౌపది పాత్ర ద్వారా ధర్మోపదేశం చేయించారు. వీరు ముగ్గురు మాతృత్వ, కర్తృత్వ, నేతృత్వాలకు ప్రతీకలు. మహాభారతంలోనే ప్రధాన స్త్రీ పాత్ర లైన వీరు మన కళ్ళ ఎదుట కూడా కనిపించడం విశేషం. ఎందుకంటే భారతంలో ఏది ఉందో అంతట అదే ఉన్నట్లు మహా భారతంలో ఎన్ని స్త్రీపాత్రలు ఉన్నాయో అన్ని రకాల గుణాలు కలిగిన స్త్రీలు మనకు సమాజంలో కనిపిస్తారు

నవీన పరాశర సూన బిరుదాంకితుడైన తిక్కన సోమయాజి గారు తెలుగు భావ రత్నాలు పొదిగి ఈ స్త్రీ పాత్రలగుణాలను మరింతగా ప్రకాశింప చేశారు. మొదటిగా కుంతీదేవి మాతృమూర్తిగా భారతీయ మాతృత్వానికి ప్రతీకగా, మానవులు ఆచరిం చాల్సిన ధర్మాన్ని ఎంత కఠినమైనా ఆచరిస్తూ, ధర్మ విజయాన్ని ఆకాంక్షిస్తూ అటు రాజ్ఞి ధర్మంను చివరి వరకు ఆచరించి చూపిన కర్తృత్వాన్ని కి ప్రతీక గాంధారి ధర్మ మార్గంలో తాను నడుస్తూ సహధర్మచారిణిగా పాండు సుతులను నడిపించిన స్త్రీమూర్తి. రాజ్యం కోల్పోయిన తన భర్తల కు తిరిగి రాజ్యం వచ్చేదాక తనను అవమానించిన శత్రువులను యుద్ధంలో సంహరించే దాకా, తన తల వెంట్రుకలను ముడవనని శపథం చేసి ధర్మాన్ని గెలిపించిన పాండవుల వీరలక్ష్మి ద్రౌపది నేతృత్వానికి ప్రతీక.

వివరణలోకి వెళితే కుంతీదేవి కౌరవ పాండవులను సమదృష్టితో చూసేది. కుమారులను ధర్మమార్గంలో నడిపించగల స్త్రీ మూర్తి. ఆకలి తెలుసుకొని అన్నం పెట్టడం, ఆగ్రహించాల్సిన సమయంలో ఆగ్రహించడం, కర్ణుని జన్మ విషయం దాచిపెట్టి రాతి గుండెగల స్త్రీ అయినది. కష్టాలు కలిగితే తన సంతానాన్ని చూచి పరితపించిందే గాని నిందించలేని భారతీయ మాతృత్వానికి ప్రతీక వీరమాత కుంతి.

అవిధంగానే గాంధారి పతివ్రత అయిన తాను తానే నేత్ర పట్టాని కట్టుకుంది. భర్త చూడలేని లోకాన్ని తాను చూడనని తన నేత్రాలకు కృత్రిమ అంధత్వాన్ని ఆపాదించుకుంది. రాజైన ధృతరాష్ట్రుడు ధర్మాన్ని కూడా చూడలేక పోయాడు కానీ గాంధారి ధర్మం విషయమై నేత్ర పట్టాని తొలగించుకొని ధర్మ విజయాన్ని అంగీకరించి మహారాజ్ఞిగా తన కర్తృత్వాన్ని నిర్వహించింది. ధర్మాధర్మాల విచక్షణతో ధర్మం వైపు నిలబడిన స్త్రీ గాంధారి అధర్మంతో చేసిన పోరాటంలో ఒక మాతృమూర్తిగా ఓడిపోయి మహారాణిగా ధర్మ విజయాన్ని చూసి ఆనందించింది. పుత్రునిపై ప్రేమను కూడా హృదయం లోకి రానివ్వకుండా ధర్మాన్ని ఆశ్రయించి, ధర్మంజయిస్తుంది అని చెప్పిన ధర్మ శీలి.

భీముడు దుర్యోధనుని అధర్మమార్గంలో చంపాడని విలపిస్తూనే మరుక్షణం ఆ యుద్ధ భూమిలో దుర్యోధనుని చెడ్డపనులను నిరసిస్తూ నిష్పాక్షికంగా ధర్మ విచక్షణతో ఆలోచించింది. చనిపోయిన తర్వాత దుశ్శాసనుని అమానుష చర్య అయిన ద్రౌపదిని సభకు ఈడ్చుకు రావడం వల్ల వాడికి తగిన శిక్ష పడిందని, ధర్మ దృష్టితో మాట్లాడింది

వ్యాస మహర్షిచే ధర్మవేదిని అనిపించుకున్న స్త్రీ మూర్తి గాంధారి. అందుకే కర్తవ్యం విషయంలో భారతీయ స్త్రీలకు ఇలాంటి ధర్మదృష్టి ఉన్న గాంధారియే ఆదర్శం.

ఆంధ్ర మహాభారతంలో విలక్షణమైన పాత్ర ద్రౌపది ఉత్తమ స్త్రీ రత్నానికి ఉండవలసిన సమస్త గుణాలు, సమస్త శక్తులు మేళవించిన మూర్తిమత్వం ద్రౌపది. ధర్మ జ్ఞానంతో ధర్మాన్ని ఆచరిస్తూ అధర్మాన్ని ప్రశ్నిస్తూ ధర్మ యుద్ధాన్ని చేయించి ధర్మమును గెలిపించిన ధీరురాలు ద్రౌపది యుద్ధానికి నేతృత్వం వహించిన స్త్రీ మూర్తి ద్రౌపది.

ధర్మాత్ములు ఎవరనే ప్రశ్న వేసుకుంటే మనకు సమాధానం దొరికేది సంఘసేవకులు, నీతిమంతులు, దానం చేసిన వారని మనకుసమంజసం అయ్యే విషయమే. తద్వారానే మనకు తెలిసిన విషయం 'ధర్మో రక్షిత రక్షితః' అని సూక్తి వాక్యంలో ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. వేదాల ప్రకారం మానవులు ధర్మాలు పాటించి తీరవలసిందే. వ్యక్తి తన బాధ్యతగా నిర్వర్తించవలసిన కర్మలను పద్ధతిగా ఆచరించడమే ధర్మం. అది మాతృ, పితృ, గురు, క్షత్రియుల, రాణులు, పాలకులు ఇలా ఎవరైనా సరే వారివారి ధర్మాలను పాటిస్తేనే సమాజమైనా దేశమైనా పచ్చగా ఉండి నాలుగు కాలాలపాటు మన గలుగుతాయి. అదేవిధంగా ఎక్కడ దయకు స్థానం ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుంది. క్షమ ఉన్నచోట దైవం ఉంటాడు ధర్మాన్ని పాటించినప్పుడే సుఖ సంతోషాలతో ఉంటాడు ఈ విషయంపై పురాణ ఇతిహాసాలు పెద్దపీట వేశాయి.

ధర్మానికి పది లక్షణాలు ఉన్నాయని ధర్మ శాస్త్రాలు చెబుతాయి అవి ఈ విధంగా కలవు 1. ధృతి (ఆత్మ విశ్వాసంతో ఉండడం) 2. దయం (మనసు నియంత్రణ) 3. క్షమ (సహనం కలిగి ఉండటం) 4. శౌచం (శారీరక మానసిక శుభ్రత) 5. అస్తేయం (వేరొకరి సొత్తుకు ఆశ పడకూడదు) 6. ధీ (బుద్ధి కలిగి ఉండడం) 7. విద్య (మంచిచెడులు విశ్లేషించి ప్రవర్తించడం) 8. సత్యం (నీతి నిజాయితీతో జీవించుట) 9. అక్రోధం (భావోద్వేగాలను అదుపులో పెట్టుకోవడం)10. ఇంద్రియ నిగ్రహం (కోరికలకు కళ్లెం వేయడం) ఈ పది లక్షణాలు కలిగి ఉన్నవారే నిజమైన ధర్మాత్ములు

రామాయణంలో ధర్మానికి అద్దం పట్టే ఎన్నో ఘట్టాలు ఉన్నాయి శ్రీరామచంద్రుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు వారి రక్షణకై రాక్షసులను సంహరించాడు. సీత అలా చంపుట న్యాయమేనా అని అడిగితే క్షత్రియ ధర్మం ప్రకారం నేను రాజుగా ధర్మాన్ని పాటిస్తున్నానని అరణ్యం అయినా అయోధ్య అయినా నాకు ఒకటే అని సందేశం ఇస్తాడు.

కీచకుడు ద్రౌపది పట్ల అధర్మానికి ఒడి గడితే రాజైన విరాటుడు ఏమీ చేయలేని స్థితిలో శాంతి వచనాలు చెప్తే, భీముని ప్రేరేపించి కీచక సంహారం చేయించి, అధర్మాన్ని అంతమొందిస్తుంది. అజ్ఞాతవాసంలో రహస్యంగా శత్రువైన కీచకుడిని అంతం చేయించిన ద్రౌపది వల్ల పాండవులు ధర్మ విజయాన్ని సాధించారు. అలాగే రాయబారం జరిగే సమయంలో ధర్మరాజు యుద్ధం వద్దు సంధి అన్నప్పుడు తన స్వాభిమానాన్ని చూపించి శత్రువుని ఎలా చంపాలో కూడా ఒక వ్యూహరచన చేసి భీమార్జున లకు అందించింది. శ్రీకృష్ణుని చేత దుష్టనిగ్రహమునకు పూని ధర్మయుద్ధం జరిగేలా మాటలు తీసుకొని ధర్మ విజయాన్ని సాధించింది ద్రౌపది.

ఈ విధంగా ప్రతి మనిషి సాధించవలసిన పురుషార్థాలు నాలుగు. ఓ కుటుంబానికి యజమానిగా మనిషి తన బాధ్యతలకు త్రికరణశుద్ధిగా నిర్వర్తించడమే కాకుండా ఉద్యోగ విధులను సక్రమంగా పాటించాలి. నేటి మనిషి అర్థ, కామములకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాడు. వీటివల్ల సుఖశాంతులు కలుగుతాయని భ్రమిస్తున్నాడు. ఈ సుఖాల కోసం ధనానికి దాసుడు అవుతున్నాడు. ధనసంపాదన కోసం అధర్మ, అక్రమమార్గాలను అనుసరిస్తున్నాడు. క్షణికానందం కోసం భోగ, భాగ్యాలకోసం ప్రాకులాడుతున్నాడు. వ్యక్తిత్వాన్ని కోల్పోతున్నారు. నీతి, ధర్మ, సత్య మార్గాలను విడిచి పెట్టకూడదు నిజాయితీ

అనేది దైవాంశ. ఎన్ని కష్ట, నష్టాలు కలిగినా ధర్మాన్ని వీడని ధర్మవీరులు మన ప్రాచీన గాథలలో కనిపిస్తారు. వారు ఆదర్శ పురుషులే కాదు, దిశానిర్దేశం చేసే ఋషులు కూడా. చాణక్యుడు ఒక రాత్రి పూట ప్రభుత్వ జమాఖర్చులు రాయవలసి వచ్చింది, ఒక దీపాన్ని వెలిగించి ఆకాంతిలో వాటిని రాశాడు. దానిని తర్వాత ఇంకో దీపాన్ని వెలిగించాడు అతడికి సమీపంలో ఉన్న వ్యక్తి ఎందుకిలా ఒకటి ఆర్పేసి రెండో దాన్ని వెలిగించావు, అని అడుగగా ఆ దీపంతో ఖర్చు ప్రభుత్వానిది. దాని పని అవగానే ఆర్పేసాను. అది ప్రభుత్వం తరపున ఖర్చుపెట్టిన నూనె దీపం. ఇది నా సొంత పనుల కోసం నా సంపాదనతో వెలిగించిన దీపం. అని అర్థశాస్త్రం ప్రావీణ్యుడు, ఆదర్శమూర్తి, నిజాయితీకి, ధర్మానికి చక్కటి ఉదాహరణగా నిలిచాడు. మనిషి తాను ధర్మంగా జీవించడమే కాకుండా అధర్మాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని కూడా చేసుకోవాలి. సర్వకాల, సర్వావస్థల్లోనూ మనల్ని వెన్నంటి కాపాడేది ధర్మమే. సమున్నత వ్యక్తిత్వం ముందు ఎంత సంపద అయినా సాటిరాదు. ప్రతి వ్యక్తి మానవీయ విలువలు పెంపొందించుకుంటూ పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలి. ధనార్జన కూడా ధర్మార్జన కావాలి. సిరి సంపదలు కొబ్బరి కాయ లోని నీరు వచ్చినట్లు తెలియకుండా వస్తాయి. అశాశ్వతమైన సిరి సంపదలను మోహించక సత్య, ధర్మాలను ఆలంబనగా చేసుకోవాలి.

❖ ❖ ❖

వసిష్ఠ రామ సంవాదము – మోక్ష ప్రదాయకము

– డా॥. ఖి. భవాని, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, మేడ్చల్ జిల్లా.

"వసిష్ఠ రామ సంవాదము - మోక్ష ప్రదాయకము" అనే అంశాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డి, తెలంగాణ రాష్ట్రంలో 4-1-2020వ తేదీన "భారతీయ సాంహిత్యం చతుర్వేద పురుషార్థాలు" అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సునకు పత్ర సమర్పణగా సమర్పిస్తున్నాను.

నిర్వచనము :

సంస్కృతములో వాల్మీకి మహర్షిచే రచింపబడిన 'యోగవాసిష్ఠము' మోక్ష రామాయణముగా, వాసిష్ఠ రామాయణముగా అఖండ రామాయణముగా ప్రఖ్యాతి పొందింది. ఇందులో 32,000 శ్లోకములు కలవు. ఈ సంస్కృత కావ్యాన్ని తెలుగులో వచన కావ్యంగా శ్రీ హనుమ రామకృష్ణ గారు 'వసిష్ఠ రామ సంవాదము' అనే పేరుతో వ్రాయడం జరిగింది. యోగవాసిష్ఠము ఒక మోక్ష శాస్త్రమని విసిష్ఠులవారే "మోక్ష పాయాభిదానేయం సంహితో సారీసంహితా.." అని సెలవిచ్చారు. జనన - మరణావస్థలు లేని స్థితిని మోక్షమని, కైవల్యమని అంటారు. శ్రీరాముడికి గురువైన వసిష్ఠుల వారికి మధ్య జరిగిన సంవాదమే ఆధ్యాత్మిక, ఆత్మ ప్రబోధ గ్రంథంగా రూపుదాల్చింది.

విషయ వివరణ :

'నరత్వం దుర్లభం లోకే' అనే నానుడి మానవజననం లభించటం చాలా కష్టమని చెపుతోంది. అలాంటి మానవ జన్మకు ధరార్ధకామ మోక్షములను పురుషార్థములుగా నిర్దేశించినవి. "శృతి వాక్యములు ధర్మార్థకామ మోక్షములగు పురుషార్థములుగా నిర్దేశించినవి"[2] ఇందులో ధర్మార్థకామాలను ప్రవృత్తి మార్గము ద్వారా మోక్షాన్ని నివృత్తి మార్గము ద్వారా సాధజంచాలి. నీతి, నియమాలతో కూడిన జీవితం పురుషార్థాలను సాధించడానికి తోడ్పడతాయి. ఈ పరుషార్థాలు ఎప్పుడూ శుభాన్నే కలిగిస్తాయి కాని చేసే చూసే మానసిక స్థితి వలన వాటి రూపురేఖలు మారుతాయి. "ధర్మార్థకామ మోక్షములను అరీటిచెట్లు కట్టిన ఈ నాల్గు స్తంభములు నిత్యము శుభ చిహ్నాదులై పచ్చనై శోభన హేతువులై యుండును.

ఈ పురుషార్థాలలో మొదటిది ధర్మమయితే చివరిది మోక్షం. పుట్టక-చావుల మధ్య ఉన్నది జీవితం. మనిషి అసలు సాధించవలసింది వదలిలిపెట్టి ఈ జన్మపరంపరలో కొట్టుమిట్టాడుతున్నాడు. అలాంటి వారికి మార్గ నిర్దేశం చేసేదే ఈ గ్రంథము. ధర్మాచరణతో మొదలు పెట్టిన జీవిత లక్ష్యం మోక్షంకావాలి.

ఆత్మ పరమాత్మలో ఐక్యం కావడమే మోక్షంగా చెప్పుకోవచ్చు. మోక్షసాధనకు అవసరమైన ఆత్మజ్ఞానాన్ని అనుభవైక విద్యద్వారా ప్రయత్న పూర్వకంగా సాధించాలి. "సాధన చేయుమురా నీరుడా సాధ్యము కానిది లేదురా' అన్నాడొక కవి. సాధన దవ్వరా ప్రత్యక్షానుభవం ద్వారా ఆత్మ జ్ఞానాన్ని పొందిన యోగిపుంగవులు ఎందరో ఉన్నారు. ధ్రువుడు, గారీదులు, నచికేతుడు, అస్టావక్రడు, జనకమహారాజు, కబీరుదాసు మొ॥న వారు ఆత్మ విద్యతో మోక్షాన్ని పొందారు. సత్కర్మల ద్వారా మనస్సుని అదుపులో పెట్టకోవాలి. మోక్షాన్ని కోరేవారు "మనో నిగ్రహం (శమం), బాహ్యేంద్రియ నిగ్రహం (దమం), ఓర్మి, శాంత స్వభావం, కిరికీలను వదులుకోవడం, శ్రద్ధ, ఆత్మతత్వం మీద నిశ్చలమైన మనోభావం... ఇలా ఆరు గుణాలను[4] ముముక్షువులు సమకూర్చుకోవాలి.

సందేహ నివృత్తి :

ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతూ, చేసే ప్రతి కర్మను ఈశ్వరార్పణం చేస్తూ, అంతటా ఆ పరమాత్మనే వ్యాపించి ఉన్నడని భావిస్తూ మోక్షిగామి కవాలనుకునే మనిషికి ఈ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది. మోక్ష మార్గంలో కలిగే సందేహాలన్నిటికీ ఇందులో జవాబు లభిస్తుంది.

నేను, నువ్వు, పుట్టుక, చావు, బంధం, కర్మ, పుణ్యం, పాపం, బుద్ధి, ఆలోచన, అహం, మనస్సు, శరీరం సంకల్పం, మాయ, యోగము, బ్రహ్మము, జ్ఞానము, మోక్షము మొ॥న అనేక విషయాల గురించి కలిగే సందేహాలను ఈ గ్రంథ పఠనం ద్వారా తీరుతుంది.

కథలు – మోక్షోపాయాలు :

మనిషి మనసు యొక్క లోపలి పొరలను తట్టిలేపేది కథలు. అలంటి కథలను దృష్లాంతాలతో విశ్లేషిస్తూ, సాధకుడు సులభంగా కైవల్య పధాన్ని చేరుకోవడానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయి కొన్ని ఉదాహరణకు:

1. మనిషి కర్మ ద్వారా మోక్షాన్ని సాధించాలా? లేక జ్ఞానం ద్వారా సాధించాలా అనే సందేహానికి ఉపాయంగా 'సుతీక్షుణుడికి అగస్తిముని చెప్పిన కథ.
2. జీవుడు జ్ఞానమును పొంది అజ్ఞానమనే మాయ తొలగుటచే తానే బ్రహ్మమగునని వివరించే 'శుక మహర్షి వృత్తాంతము'
3. "నేను ఆకాశకేసుడనై, విశదాకాశరుపుడనుగా, అనంత-విశాల-అఖండ రూపుడనుగా జ్వకాంణముననే నిలిచియుయున్న వాడను"అని భావించే శుద్ధ చైతన్య రూపుడిని మృత్యువు కూడా ఏమీ చేయజాలదని చెప్పే "ఆకాశజుడి కథ".
4. "ఈ దృశ్యా జగత్తు నిరాకారము, బ్రహ్మ మాత్రము. నంకల్పమునందలి నగరము వంటిది" అని సద్విమర్శ చేసే విస్తారమయిన 'లీలోపాఖ్యానము' కథ. ఈ కథ సత్యాసత్యముల వివేచన, మరణానంతర దేహము, స్థూల సూక్ష్మ దేహములు, జన్మ జనాంతర దృష్టి, స్వప్న జాగృత్ వ్యవస్థలు, బ్రమ్మము మొ॥న అనేక విషయాలను తేటతెల్లము చేస్తుంది.
5. ఇంతకీ నేనెవరు? లేనిది అయినప్పటికి ఉనికిని కలిగి ఉన్నది ఏది? గొప్ప పర్వతములు కూడా ప్రవేశించగలిగే అణువు ఏది? ఈ జగత్తు వాస్తవానికి ఏదై ఉంది? ప్రళయకాలంలో జగత్తు ఎందులో లభిస్తుంది మొ॥గు ప్రశ్నల ద్వారా ఆత్మజ్ఞానము పొందిన 'కర్కటి కథ'
6. మనోనిశ్చయముచే కర్మేంద్రియములను ఉపయోగిస్తూ చేసే కార్యమును ఎవ్వరు కూడా నిరోదఐంచలేరు. 'యద్భావం తత్భవతి' అని నిరూపించే 'ఇంద్ర అహల్యల ప్రహసనము' కథ.
7. 'మన యేన మనుష్యానాం కారణం బంధ మోక్షయో' ఈ మనస్తే బంధమునకు, మోక్షమునకు కారణము. ఆ మనస్సు యొక్క అద్భుత శక్తిని ఎరుకపరిచే 'అడవిలో చిక్కుకున్న బాట సారుల' కథ.
8. మనుష్యులను అహము, అజ్ఞానములో పడవేసేది బంధము అని, నిజానికి బంధమనేదే లేదని చెప్పిన 'బాలకాఖ్యాయిక' కథ.

ఇలాంటి ఎన్నో కథలు సాధకుడి మిధ్యాత్వాన్ని తొలగించి, సంసారీ విముక్తిని చేసే మోక్షగామిగా చేస్తుంది.

ముగింపు :

స్వార్థము, ద్వేషము, హింస, మొదలగు విషమ సంస్కృతిలో నేటి మానవుడి మనుగడ సాగుతుంది. మానవతా విలువలు అడుగంటిపోతున్న తరుణమిది. ఇలాంటి సమయంలో మనిషికి జ్ఞాన మార్గాన్ని చూపి, సత్సంగంతో, సదాచారాలతో మనిసి మనిషిగా మార్చగలిగే గ్రంథము ఇది. మనిషి మనిషిగా మార్చగలిగే గ్రంథము ఇది. మనిషికి ఆధ్యాత్మిక విద్య చాలా అవసరము. యోగము, బ్రహ్మము, ఆత్మ, ధ్యాము మొదలగునవి విషయాల పట్ల మనిషి ఆలోచనా విధానము మారింది. మోక్షముపై ఆసక్తిని చూపే మనిషికి ఆధారభేత మైన ఈ పఠించడం అదృష్టంగానే భావించాలి. మానవుడిగా పుట్టి దేవుడైన రాముడి ద్వారా సర్వమానవాళికి మోక్షమార్గాన్ని కరతలామలకం చేసి కవికి వందనాలు. సర్వదా సర్వమై, సర్వత్రా ద్యానించి ఉన్న ఆత్మతత్వాన్ని తెలుసుకోవడంలో ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగడుతుందనడంలో అతిశయోక్తి లేదు. ❖

ధర్మబుద్ధుడు – గుహుడు

– డా॥. ఐ. భీమమ్మ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, బేగంపేట, హైదరాబాదు.

పురుషార్థాలు : చతుర్విద పురుషార్థాలు "ధర్మార్థకామమోక్షాలు". భారతీయ సనాతన ధర్మాలను అనుసరించి పురుషార్థాలు ప్రస్తావించబడుతాయి. పురుషార్థాలు అంటే కావలనవి, ఉండాల్సినవి, ఆచరించాల్సినవి, పాటించాల్సినవి అని అర్థం.

ధర్మం :

బాధ్యతకు కట్టుబడి జీవించడం అనేది ధర్మం. ధర్మంలో నీతి, నియమం, నిజాయితి, విద్య, న్యాయం, పరిపూర్ణంగా వుంటాయి. వీటిని అనుసరించే ధర్మం కొనసాగుతుంటుంది.

అర్థం :

ధర్మం పాటించి సాధించిన ధనం లేదా కీర్తి లేదా ప్రతిభ, అనుభవం అర్థంగా చెప్పబడుతాయి.

కామం :

ఇక్కడ కామం అనేది శారీరకం, మానసికం! శారీరానికి కావల్సింది కాకుండా, మనసుకు కావల్సినది కూడా కామం. ధర్మార్థాల వలన మనసు పొందే ఆనందం, తద్వారా లౌకికజీవనం, లౌకిక సుఖం కామానికి అన్వయించబడుతాయి.

మోక్షం :

పునఃజన్మరాహిత్యం, బాధ్యతల నుండి విశ్రాంతి, సంసారం నుండి విముక్తి, మరణం... ఇవన్నీ మోక్షానికి అన్వయించబడుతాయి. ఈ నాలుగు పురుషార్థాలను "ఆశ్రమధర్మాలు" అని కూడా అంటారు.

భగవంతుడిని రప్పించిన గుహుడు పాత్ర :

తల్లిదండ్రులతో అయోధ్య పురావాసులతో వీడ్కోలు తీసుకుని శ్రీరామచంద్రుడు సతీసమేతుడై, లక్ష్మణుడు వెంటరాగా అరణ్యవాసానికి బయలుదేరుతాడు. ఇందు నిమిత్తం అరణ్యాన్ని చేరేందుకు సుమంత్రుడు రథసారధిగా బయలుదేరుతారు. మార్గమధ్యలో వేదశ్రుతి, గోమతి, స్యందికా నదులను దాటుకుంటారు. కోసలదేశపు సరిహద్దుల్ని దాటుకుంటారు. రథం గంగానది తీరానికి చేరుకుంటుంది. అక్కడి ప్రకృతి రమణీయ దృశ్యాలు రాముడికి ఎంతో నచ్చుతాయి. ఆరాత్రికి అక్కడే బస చేయాలని అనుకుంటాడు. ఈ క్రమంలో చీకట్లు ముసురుకోగానే రాముడు తన పరివారంతో అక్కడే ఒక చెట్టు వద్దకు వెళ్ళి సేద తీరుతాడు.

ఆ గంగానది తీరంలో వున్న శృంగిబేరపురం రాజ్యానికి అధిపతి గుహుడు. అతడు ఒక నిషాదుడు. అతడికి రాముడు తన పాలనలో వున్న గంగాతీర ప్రాంతానికి చేరుకున్నాడన్న వార్త తెలుస్తుంది. "స్థపతి" అనే బిరుదుతో జనరంజకంగా రాజ్యపాలన చేస్తున్న గుహుడికి రాముడు అంటే చిన్నప్పటి నుండే అభిమానం, ప్రేమ, వాత్సల్యం, మెండుగా వున్నాయి. శ్రీరాముడుని తన హృదయంలో నింపుకుని ఆరాధిస్తుంటాడు. అతడ్ని కలుసుకోవాలని ఎన్నాళ్ళనుంచో తపిస్తుంటాడు. తన కోరిక ఆరోజు ఫలిస్తుందని రాముడి వద్దకు ఆలస్యం చేయకుండా తన పరివారంతో, రాముడు విశ్రాంతి తీసుకుంటున్నా ప్రాంతానికి బయలుదేరుతాడు. రాజమర్యాదలతో రాముడికి స్వాగత సత్కారాలు కూడా సిద్ధం చేసుకుని వెళ్తాడు. కాగా శ్రీరాముడు కనుచూపు మేరలో గుహుడు రాకను గుర్తిస్తాడు. వెంటనే శ్రీరాముడు గుహుడు దగ్గరికి ప్రేమగా ఎదురువెళ్ళి కౌగిలించుకుంటాడు.

ధర్మంతో బతికే ఎవరికైన భగవంతుడే ఎదురు వస్తాడు అనేది ఇక్కడ గుహుడు విషయంలో నిజమైంది. ఇది గమనించాల్సిన విషయం. "అడవి వద్దకు వసంతం వచ్చినట్లుగా ధర్మం వద్దకు దేవుడు వస్తాడు" అనేది గుహుడి విషయంలో నిజమైంది.

గుహుడు శ్రీరాముడి పరిస్థితి తెలుసుకుని విలవిల లాడుతాడు. దుఃఖిస్తాడు. తనవెంట తెచ్చిన విలువైన కానుకల్ని స్వీకరించవలసిందిగా ప్రాధేయపడ్తాడు. కాని శ్రీరాముడు వనవాస దీక్షలో వున్నాడు కాబట్టి ఆకానుకల్ని సున్నితంగా తిరస్కరిస్తాడు. రాజభోగాలు అనుభ వించాల్సిన శ్రీరాముడికి పట్టిన దుస్థితిని చూసి భరించలేక పోతాడు. కనీసం విశ్రాంతి కోసమైన శయనం ఏర్పాటు చేస్తానని గుహుడు అభ్యర్థిస్తాడు. కాని శ్రీరాముడు తన అభ్యర్థనను తిరస్కరిస్తూ గడ్డిపరకలపై పవళిస్తాడు. ఇక్కడ ప్రభువుల వారిని గౌరవించడంలో, ప్రభులవారి అవసరా లను గుర్తించడంలో గుహుడు తన ధర్మాన్ని పాటించాడు. అట్లాగే శ్రీరాముడు స్వయంగా రాజైనప్పటికి అతిథి మర్యాదల్ని తిరస్కరిస్తూ తన వనవానదీక్ష ధర్మాన్ని పాటించాడు. ఈ విధంగా బాల్యమిత్రుల ఇద్దరూ ధర్మా నికి కట్టుబడి కనిపించడం గొప్పవిషయం.

గుహుడు బాధ ఎంతకూ ఉపశమించదు. శ్రీరాముడి కోసం తన రాజ్యాన్ని వదులకోవడానికి సిద్ధపడుతూ ''ప్రభూ'' ఇది నీరాజ్యం. మేము నీసేవకులం, అయోధ్యను మరిపోయి, ఇక్కడ రాజ్యపాలన చేయ వలసిందిగా కోరుకుంటున్నాము'' అంటూ ప్రాధేయ పడ్తాడు. అప్పుడు శ్రీరాముడు గుహుడుని ఓదారుస్తూ తన తండ్రికి ఇచ్చిన మాటను జవదాటలేనని తనదైన ధర్మాన్ని చాటుకుంటాడు. ''పట్టు వస్త్రాలు, పంచభక్ష పరమాన్నాలు, పూలపాన్పులు ఇవేవి అవసరం లేదని, నారచీరలు, కందమూలాలు, గడ్డిపరకలు, ఇవి మాత్రమే తాము స్వీకరిస్తామని'' కూడా శ్రీరాముడు గుహుడితో విన్నవించుకుంటాడు. అంతేకాదు గుహుడిని చూడటమే తనకు దక్కిన బహుమతిగా అభిప్రాయపడ్తాడు. గుహుడు శ్రీరాముడి మాటలకు బాధపడుతూ దుఃఖిస్తాడు. చివరకు బరువైన మనసుతో వీడ్కోలు పలుకుతు గంగానది దాటేందుకు పూలనావను సిద్ధం చేస్తాడు. ఆ నావలో అందరు కూర్చుంటారు. ఆ నావకు గుహుడే స్వయంగా నావికుడుగా పనిచేస్తూ, ఈ విదంగానైనా శ్రీరాముడికి తన సేవను అందిస్తున్నందుకు సంతోషిస్తాడు.

గుహుడు పడవను నడుపుతూనే శ్రీరాముడు గురించి ఆలోచిస్తూ ''నా రాముడికి ఎంత కష్టం వచ్చింది? నా జీవితం మొత్తం రాముడి సేవకు అంకితం చేయాలి. వాళ్ళవెంటే ఒక సేవకుడిగా ఎంతకాలమైన వుండాలి. అరణ్యంలో వాళ్ళకు ఎటువంటి బాధలు కలుగకుండా కాపాడాలి. గిరిజనుడిగా ఎంతటి క్రూరమృగాలనైన తాను వేటాడగలడు. కాబట్టి, రామ సేవకు ఎటువంటి ఆపదలు రాకుండా కాపాడాలి'' అని నిర్ణయం తీసు కుంటాడు.

శ్రీరాముడు గుహుడు నిర్ణయాన్ని గ్రహిస్తాడు. కాని మన్నించలేకపోతాడు. అందుకే కొంతదూరం వెళ్ళాక ఒక తీరాన పడువను ఆపమని విన్నవిస్తాడు. గుహుడిని వెనుతిరిగి వెళ్ళమని చెప్తాడు. ఆ సమయంలో ''ఓ బాల్య మిత్రమా నీవు శక్తిమంతుడవి, ధర్మబుద్ధుడివి, నీతి నియమాల్లో సాటిలేని వాడివి. నీవు చూపించిన అభిమానం విస్మరించలేము. మా కష్టాల్లో కన్నీళ్ళలో నీవు పాలుపంచుకోవద్దు. నీ సేవలు ఈ ప్రజలకు ఎంతో అవసరం ఈ రాముడి మీద ప్రేమను ప్రజల మీద చూపించు నీరాజ్యాన్ని కాపాడుకో...'' అంటూ సెలవు తీసు కుని ఆ తీరప్రాంతం గుండా అరణ్యంలోకి ప్రవేశిస్తాడు గుహుడు కన్నీటి వీడ్కోలు పలుకుతాడు.

ఆ తర్వాత రాముడు పూర్తిగా అరణ్యవాసంలోకి వెళ్ళి పోతాడు. ఇక్కడ గుహుడు రాముడి గురించి ఆలోచిస్తూ కృంగిపోతాడు. కొద్ది రోజుల తర్వాత దశరథ మహారాజు కొడుకుమీద ప్రేమతో కృశించి మరణిస్తాడు. ఈ విపత్కర సమయంలో భరతుడు తిరిగి సుమంత్రుడి సహాయంతో గుహుడి రాజ్యాన్ని చేరుకుని, రాముడి ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తారు. గుహుడు తీరప్రాంతాన వీడ్కోలు తీసుకున్న ప్రాంతం నుండి భరతుడి పరివారంతో ముందుకు వెళ్తాడు. అక్కడ రాముడి ఆచూకీ కనబడు తుంది. గుహుడు, భరతుడు సమీపిస్తున్న సంగతిని లక్ష్మ ణుడు గమనించి ఇద్దరు ఒకటిగా మారి దండయాత్రకు

వస్తున్నట్లుగా అనుమానిస్తాడు. కాని రాముడు అది ఒక అభిమానంగానే భావిస్తు ''ఏదైనా రాయబారం కావొచ్చు'' అని సందేహిస్తాడు. అనుకున్నట్లుగానే శ్రీరామ లక్ష్మణులకు తండ్రి మరణవార్త గుహుడి ద్వారా తెలుస్తుంది. ఈ విధంగా శ్రీరాముడి దుఃఖంలో కూడా పాలుపంచుకున్న గుహుడు ధర్మం అనే పురుషార్ధానికి గొప్ప దర్పణం వంటివాడు.

ముగింపు :

ఉత్తములు ధర్మానికి కట్టుబడి వుంటారు. ధర్మం వీళ్ళకు ప్రాణం కంటే గొప్పది, రాజ్యం కంటే పెద్దది. గుహుడు పాటించిన ధర్మం ఇటువంటిదే. కాబట్టి తన ధర్మం కోసం త్యాగానికి కూడా సిద్ధం అయ్యాడు. ధర్మం అనేది ఉత్తముల లక్షణం అని నిరూపించింది. రామాయణంలో ''గుహుడు'' పాత్ర నిడిది చిన్నదయినా, కర్తవ్యాల దృష్ట్యా ఎంతో పెద్దదిగా కనిపిస్తుంది. హృదయం విశాలమైనప్పుడు ధర్మం విస్తరిస్తుంది అనే తత్వం గుహుడి విషయంలో నిజం అయ్యింది. ధర్మం త్యాగాన్ని కూడా ప్రేమిస్తుంది అనేందుకు గుహుడి పాత్ర ఒక ఉదాహరణ.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్రామాయణము - సిరిపల్లె వెంకట సుబ్రహ్మణ్య సోమయాజి.
2. వాల్మీకి రామాయణము - శ్రీనివాస శిరోమణి.
3. మొల్ల రామాయణం - శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ.
4. రామాయణ అరణ్యకాండలోని ఆశ్రమాలు-శ్రీరాముని దర్శనాలు - ఆచార్య సూర్యాధనుంజయ్.

❖❖❖

ఆర్థిక దుస్థితికి అద్దంపట్టిన 'మంచి అడుగు' కథ

– డా॥. జడా సుభ్బారెడ్డి, సహాయ ఆచార్యులు, రాజీవ్ గాంధీ ఫ్లైనిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఏపీఐఐటీ, నూజివీడు.

కథ – ఉపోద్ఘాతం :

కథ అంటే చెప్పడం లేదా సంభాషించడం అని అర్థం. వాస్తవానికి కొంత కల్పన చేర్చి కథ చెప్పడం పూర్వకాలం నుండీ వాడుకలో ఉంది. సంస్కృతంలో ఇతివృత్తంలోని భేదాల్ని బట్టి కథా, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథ అనే పేర్లు ఉంటే, తెలుగులో మాత్రం కథ, కథానిక అనే పదాలు వాడుకలో ఉన్నాయి. తెలుగుసాహిత్యంలో కథ ఒక విశిష్టమైన ప్రక్రియగా ప్రసిద్ధి చెందింది. పూర్వకాలంలో పిల్లలకు అన్నం తినిపించడానికి, నిద్రపుచ్చడానికి కథలు చెప్పడం అనేది తెలుగునాట పల్లెటూళ్లల్లో అలవాటుగా ఉండేది. కేవలం వినోదానికి మాత్రమే చెప్పుకున్న కథలు రానురానూ ఫ్లినానికి వేదికలుగా నిలవడం విశేషం. 1910లో గురజాడ దిద్దుబాటుతో మొదలైన తెలుగు కథాప్రయాణం నేటివరకూ సాగుతూనే ఉంది. సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూనే వాటికి పరిష్కార మార్గాల్ని అన్వేషించే దిశగా కూడా తెలుగుకథ ప్రసిద్ధిలో ఉంది. కేవలం భౌతిక వాతావరణాన్ని మాత్రమే కాకుండా వ్యక్తిలోని భిన్నపార్శ్వాలను, అంతరంగ కల్లోలాన్ని కూడా చిత్రించడం తెలుగుకథలోని ప్రత్యేకతగా వెలుగులోకొచ్చింది.

'కథ – చతుర్విధ పురుషార్థాలు :

భారతీయ సంస్కృతికీ, వ్యక్తిగత జీవన విధానానికీ పట్టుగొమ్మలుగా నిల్చేవి ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలు. మనిషి పుట్టినప్పటినుండీ చనిపోయేవరకూ పాటించవలసిన చతుర్విధ పురుషార్థాలను మన శాస్త్రాలు ఎప్పుడో చెప్పాయి. ప్రతీ మనిషి ధర్మాన్ని ఆచరించాలి, ధర్మజీవితాన్ని గడపడం అలవాటుగా చేసుకోవాలి. ధర్మాన్ని తాను పాటిస్తూ ఇతరుల చేత పాటించేలా చేయాలి. మనిషి తన జీవితం గడపడం కోసం అర్థాన్ని సంపాదించాలి. తనమీద ఆధారపడిన వాళ్ల అవసరాల కోసం ధనార్జన చేయాలి. ధర్మబద్ధంగా శాస్త్రాలు చెప్పినట్టుగా కోర్కెలను తీర్చుకోవాలి. మోక్షాన్ని చేరుకోవడానికి అవసరమైన భక్తిమార్గాలను అనుసరించాలి. మనిషి సమాజంలో జీవించడానికి తప్పనిసరిగా చతుర్విధ పురుషార్థాలను అనుసరించాలి. ధర్మార్థకామ మోక్షాలు అనే నాలుగు ధర్మాలను పాటించడంలో ఏమాత్రం అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా దాని ప్రభావం వ్యక్తిమీదనే కాకుండా వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. కనుకనే తెలుగుసాహిత్యంలోని అన్ని ప్రక్రియలలోనూ చతుర్విధ పురుషార్థాల ప్రస్తావన మనకు కనిపిస్తూనే ఉంటుంది. వ్యక్తి జీవితంలో అంతర్భాగాలైన పురుషార్థాల ప్రస్తావన లేకుండా సాహిత్యం పరిపూర్ణత పొందదు. కథ, నవల, నాటకం మొదలైన అన్ని ప్రక్రియల్లోనూ చతుర్విధ పురుషార్థాల్లోని ఏదో ఒక ప్రక్రియ ప్రధానపాత్ర వహిస్తుంది. కథలు సమాజాన్ని, వ్యక్తుల మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని చిత్రించే వాతావరణాన్ని కలిగివుంటాయి. ఈ ఉద్దేశ్యంతోనే కట్టా రాంబాబుగారి 'మంచి అడుగు' కథలోని ఆర్థిక కోణాలను వివరించడం ఈ వ్యాస పరిధిగా భావిస్తున్నాను.

'మంచి అడుగు' కథ – ఇతివృత్తం :

మంచి అడుగు కథ ఆర్థిక దుస్థితిలోని అంతరంగ కల్లోలాన్ని హృద్యంగా చిత్రించిన కథ. డబ్బు లేకపోతే కలిగే మానసిక స్థితిగతులను, డబ్బులద్వారా తీర్చుకునే అవసరాల కోసం తొక్కే అడ్డదారులను చిత్రించిన కథ. సమస్యను బలంగా చిత్రిస్తూనే దాని పరిష్కారానికి రావలసిన చైతన్యాన్ని కూడా తెలియజేసిన కథ. 'తెల్లవారుతుందంటే సులోచనకు ఎక్కడలేని దిగులు ముంచుకొస్తుంది. పొట్లాటతో ప్రారంభమవుతుంది ప్రతిరోజు. 'పొద్దున్నే ఎక్కడి నుంచొత్తాయే డబ్బులు? మీ బాబుగాని

సంపాదించింది మూటగట్టుకుని కూర్చున్నానునుకుంటున్నావా?' తల్లి పోట్లాట పెట్టుకుంటుంది. రూపాయి కోసం ఆ పోట్లాట" అంటూ ప్రారంభమైన కథ, కథలోని ఆర్థిక కోణాన్ని చూపిస్తూనే ఉంటుంది.

రూపాయి లేని కారణంగా గడిపే జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో మన ఊహలకు కూడా అందకుండా చిత్రిస్తారు రచయిత. సులోచన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతుంటుంది. తెల్లవారుతుందంటే భయం వేస్తుంది సులోచనకు. ఆమె ఇంటికిగానీ, ఆమె నివసించే పేటలో గానీ మరుగుదొడ్డి లేదు. పేటలో నుండి నడుచుకుంటూ కొంతదూరం వెళ్లవలసి ఉంటుంది. ఇంటిదగ్గర నుండి ఆరుబయటకు నడిచి వెళ్తుంటే అందరి కళ్ళూ తనను వెక్కిరిస్తున్నట్టు, దారిలో ఎదురైన తన క్లాసుమేట్సు తనను చూసి నవ్వుతున్నట్టు అనిపిస్తుంటుంది. అందుకే తెల్లారగానే ప్రతిరోజూ తల్లిని ఒక రూపాయి అడిగి ఇంటికి కొంచెందూరంలో మున్సిపాలిటీవాళ్లు కట్టించిన మరుగుదొడ్డికి వెళ్తుంది.

అలా వెళ్తున్నప్పుడల్లా ఎన్నో ఆలోచనలు చుట్టుముడుతుంటాయి. తండ్రి పనిచేయగా వచ్చిన డబ్బులన్నీ తాగుడుకు తగలేస్తుంటాడు. తల్లి మూడిళ్లలో పనిచేయగా వచ్చిన డబ్బులతోనే అద్దె ఇంట్లో ఉంటూ అతి కష్టంమీద ఇల్లు గడుపుతుంటుంది. సులోచనను కూడా చదువు మాన్పించి పనిలో పెట్టాలని తల్లి కోరిక. కానీ చదువు మీద ఉన్న ఆసక్తితో బాగా చదువుకుని మంచి ఉద్యోగం చేసి మరుగుదొడ్డి ఉన్న ఇంట్లోకి మారిపోవాలని ఆలోచిస్తుంటుంది. 'ప్రతి చిన్న విషయానికి డబ్బులకోసం తడుముకోవడమే' అనుకుంటుంది.

పాత్రచిత్రణ :

కథ పరిమిత పాత్రలతో, ఒక సన్నివేశాన్ని చిత్రించే ప్రక్రియ. ఒక సంఘటనను, దానికి కారణాలను, పరిష్కార మార్గాలను చొప్పించడానికి అవకాశమున్న ప్రక్రియ. 'మంచి అడుగు' కథలోని పాత్రలు ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో దిగజారిన పాత్రలుగా, ఆర్థిక పరిస్థితులకు ఎదురీది చైతన్యాన్ని నింపుకునే పాత్రలుగా మన కళ్ల ముందు కదలాడతాయి.

కుంటి వెంకటేశులు :

కౌంటర్ దగ్గర డబ్బులు వసూలుచేసే కుంటి వెంకటేశులు మరుగుదొడ్డి అవసరాల నిమిత్తం వచ్చే అడవాళ్లను కన్నార్పకుండా చూడడం, చీప్ జోక్సు వేయడం, పెద్దగా అరుస్తూ హంగామా చేయడం ఇతని పని. కొంతమంది అడవాళ్లు అతన్ని తిట్టి చీవాట్లు పెట్టినా అతని ధోరణి మారదు. సులోచన రూపాయి తీసుకుని మరుగుదొడ్డికి వెళ్ళినప్పుడల్లా కన్నార్పకుండా చూస్తుంటాడు వెంకటేశులు. అతని చూపులకు ఇబ్బందిపడినా ఏమీ మాట్లాడని సులోచనని చూసి 'నువ్వంటే నాకు ఇష్టం. నువ్వు డబ్బులివ్వకపోయినా పర్వాలేదు' అంటాడు. డబ్బులకు ప్రతిఫలంగా "రోజూ పొద్దుటే వచ్చినప్పుడు నాకొక ముద్దిస్తే చాలు" అంటాడు. అలాకాకుండా "రోజూ ముద్దులివ్వడం కుదరదంటే ఒక్కసారి నాతో గడుపు. నువ్వు ఎప్పుడూ డబ్బులివ్వక్క ర్లేదు" అంటాడు. వాడిముఖం మీద చాచి కొట్టాలన్నంత కోపం వచ్చినా అణుచు కుని తన నిస్సహాయస్థితికి తనలో తనే కుమిలిపోతుంది. రూపాయికోసం రోజూ తల్లితో గొడపడడం వాడికి తెలియడం వల్లే తన పట్ల వాడంత చులకనభావం ఏర్పర్చుకున్నాడని, డబ్బు లేదు కాబట్టి ఏ పనికైనా ఒప్పుకుంటుందనే భావంతో వాడున్నాడనీ బాధపడుతుంది.

అరుణ :

అరుణ, సులోచనలిద్దరూ క్లాసుమేట్సు, ఒకే వీధిలో నివాసముంటారు. సులోచన కుంటుంబం కంటే అరుణ కుటుంబంలో ఎక్కువమంది ఉంటారు. అయినా అరుణ దగ్గర ఎప్పుడూ డబ్బులుంటాయి. ఒకరోజు అరుణతో "మీ అమ్మగానీ నాన్నగానీ నీకు డబ్బులిస్తారా?" అని అడుగుతుంది. దానికి సమాధానంగా "ఇంకా నయం. మీ అమ్మ పోట్లాడితే ఇస్తుంది. మా అమ్మ అరిచి గీపెట్టినా నయాపైసా ఇవ్వదు. అందుకే నా మార్గం నేను చూసు

కున్నాను" అంటుంది. అర్థంకాలేదన్నట్లుగా ముఖంపెట్టిన సులోచనతో "ఏముంది? ఆ వీర్రాజు గాడికి కావల్సింది వాడికిస్తే మనకి కావలసిన డబ్బులు మనకిస్తాడు" అంటుంది. పరిస్థితి అర్థమై "అలా చేయడం తప్పు కదూ" అంటుంది. దానికి సమాధానంగా ఇలా చెప్తుంది అరుణ.

"తప్పో ఒప్పో నాకు తెలియదు సులోచనా. ఒక్క రూపాయి కోసం మనం ఎంత పోట్లాడవలసి వస్తుందో నీకు తెలుసుగా! ఎందుకంత కష్టపడాలి. తింటానికి తిండి ఉండదు, ఇంట్లో మరుగుదొడ్డి ఉండదు. చిన్నచిన్న కోరికలు కూడా తీరవు. అటువంటప్పుడు నా దారి నేను చూసుకోకపోతే ఎలా? నీక్కూడా ఇష్టమైతే చెప్పు. వీర్రాజు గాడి ఫ్రెండొకడు నీ గురించి ఎప్పుడూ అడుగుతుంటాడు. వాడితో గడిపితే పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు" అంటుంది.

అరుణ తప్పొప్పుల సంగతి పక్కన పెడితే ఆర్థిక పరిస్థితులు వారిని ఎంతగా ప్రలోభపెడతాయో, తప్పులు చేయడానికి ప్రేరేపిస్తాయో ఆలోచిస్తే మనసు ద్రవించి పోతుంది. అరుణ మాటలకు సులోచన ఏమీ అనలేక మనసులోనే బాధపడుతుంది. ఆర్థిక పరిస్థితులు వ్యక్తుల్ని ఎలా దిగజార్చుతాయో అర్థంచేసుకుంటుంది. మరుగు దొడ్డి లేకపోవడం వల్ల ఆరుబయటకు వెళ్ళిన ఆడ వాళ్లు తేళ్ళు, పాములు కరిచి ఎలా చనిపోతున్నారో కూడా ఈ కథలో చెప్తాడు రచయిత. ఏపూట కాపూట తినడానికి ఇబ్బంది పడేవాళ్లు సరిగా ఇల్లే కట్టుకోలేరు. దానికి తోడు మరుగుదొడ్డి కట్టడమంటే వాళ్లకు తలకు మించిన భారంగా పరిణమిస్తుంది. అందుకే మగవాళ్లు ఏ సమయంలోనైనా రోడ్డుపక్కనో మరోచోటునో ఆరు బయలు స్థలంగా ఉపయోగించుకుంటారు. కానీ ఆడ వాళ్లు మాత్రం రాత్రిపూటో, తెల్లవారుజామునో బయటికి వెళ్లడం వల్ల విష సర్పాల బారినపడి ప్రాణాలు కోల్పో తున్నారని ఆలోచిస్తుంది సులోచన. ఆ ఆలోచనలో నుండి తను మార్చవలసిన సమాజ నిర్మాణం కనిపిస్తుంది. తీసుకు రావలసిన మార్పు గురించి సులోచన ఏ ఆలోచన చేసిందో, ఏమి నిర్ణయాలు తీసుకుందో రచయిత మనకు చెప్పకుండా పాఠకుల ఆలోచనకే వదిలేస్తాడు.

ముగింపు :

మంచి అడుగు కథ మంచి ఆలోచనకు పునాది వేసిన కథ. ఆర్థిక పరిస్థితులవల్ల అవసరాలకు లొంగిపోయి వ్యక్తిత్వాన్ని పాడుచేసుకున్న పాత్రగా అరుణను కళ్ల ముందుంచుతూనే, పరిస్థితులు ప్రేరేపిస్తున్నా డబ్బుకోసం తప్పు చేయకుండా సమాజంలో చైతన్యానికి, మార్పుకు అడుగులేసిన పాత్రగా సులోచన కనిపిస్తుంది. డబ్బు మనిషిచేత ఎలాంటి ఆలోచనైనా చేయిస్తుంది, ఎలాంటి పనికైనా పురికొల్పుతుంది. చివరకు ప్రాణాలు తీయడానికి కూడా డబ్బే ప్రధాన పాత్ర పోషిస్తుంది. లోకంలో డబ్బు సంపాదించడానికి మార్గాలెన్నో ఉన్నా, ధర్మబద్ధంగా సంపాదించడం అనే పురుషార్థసూక్తిని నేర్పించే కథగా మంచి అడుగు కథ మన మనోఫలకంలో నిల్చిపోతుంది.

❖ ❖ ❖

మనుచరిత్ర – ధర్మానుశీలనం

– డా॥. జంపాల అనూరాధ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గార్ల, మహబూబాబాద్ జిల్లా, తెలంగాణ.

ఉపోద్ఘాతం:

తెలుగు పంచకావ్యాలలో విశిష్టత గలిగి తొలి ప్రబంధంగా కీర్తించబడుతున్న కావ్యరాజం మనుచరిత్ర అనే స్వారోచిషమనుసంభవం.

రాయల అష్టదిగ్గజకవులలో వయస్సు రీత్యా, పాండితీ రీత్యా, అగ్రేసరుడైన అల్లసాని పెద్దన తన జిగిబిగి కవితా అల్లికతో నిర్మించిన అనితరసాధ్యవర్ణనాకావ్య సామ్రాజ్య మిది. చతుర్విధ పురుషార్థలక్షణాలను ఈ కావ్యంలో గుర్తించగలం. ముఖ్యంగా సామాజిక లక్షణంగా ధర్మాన్ని నిర్దేశించి, ధర్మానుసారంగా లోకాన్ని సాగించటంలో తన కావ్యం ద్వారా పెద్దన తన కర్తవ్యాన్ని అత్యంత నిబద్ధంగా నిర్వర్తించాడు.

పరిశీలనా విశిష్టత :

సాహిత్యం సమాజహితం కోరుతూ ఉంటుంది. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యకారులు, రసానందానకి ఎంత ప్రాధాన్యతనిచ్చారో, సమాజ కళ్యాణానికీ అంతే ప్రాధాన్యతనిచ్చారు. సామాజికాంశాల విషయంలో నిబద్ధంగా ఉంటూ సమాజం ధర్మబద్ధంగా సాగేలా తమ రచనల్లో పురుషార్థాలని వాటి ఔన్నత్యాన్నీ తెలిపేలా సంఘటనాత్మకంగా వివరించారు. మనుచరిత్రలో వివిధాంశాల పరంగా 'ధర్మ' విస్తృతిని కవి ఏవిధంగా వివరించారో స్థూలంగా పరిశీలించటం ఈ వ్యాస విశిష్టత.

లక్ష్యం :

ధర్మనిర్వచన పరిశీలన, ధర్మం - వివిధ భావనలు, కాలం-ధర్మం మొదలైన అంశాల పరిశీలన చేసి మను చరిత్ర పరంగా వాటిని విశ్లేషించటం వ్యాస ఉద్దేశ్యం. కావ్యపరంగా 'ధర్మ' బోధన జరిగిన రీతి, రాయలకాలం నాటికి స్థిరపడి ఉన్న వివిధ ధర్మరీతులు ఈ గ్రంథంలో నిక్షిప్తం చేయబడిన పద్ధతిని పరిశీలించి, సమాజహితం కోసం మనుచరిత్రలోని 'ధర్మ' ప్రస్తావన సాగినరీతిని పరిశీలించటం ఈ వ్యాస లక్ష్యం.

ధర్మం :

చతుర్విధ పురుషార్థాలలో ఇది మొదటిది. విస్తృత స్వరూపం గలది. వేదకాలం నుండి నేటివరకు ధర్మం కాలగతిని మార్పు చెందుతుంది. అయితే ఈ మార్పు కొన్ని విషయాలకు పరిమితం. మొదట ఋగ్వేదంలో ధర్మ శబ్దాన్ని గమనించగలం. ఐతరేయ బ్రాహ్మణంలో ధర్మపద ప్రయోగం ఉంది కానీ అర్థం స్పష్టంగా లేదు.

బృహదారణ్యకోపనిషత్‌లో ధర్మ - సత్యములు అభేదము చెప్పబడింది. ఉపనిషత్తులు ధర్మవిభాగాల్ని ప్రస్తావించాయి. జైమిని మహర్షి "చోదనాలక్షణోధర్మం:" అని నిర్వచించారు. మనుస్మృతిలో "వేదాఖిలోధర్మ మూలం" అని పేర్కొన్నారు.

"ధరతి విశ్వం ఇతిధర్మ:" అంటే విశ్వమును ధరించు నది ధర్మం. ధర్మ శబ్దం, వేదపరంగా నపుంసక లింగం గానూ లౌకిక ప్రయోగాల్లో పుంలింగ పదంగానూ కని పిస్తుంది. "పరమాత్మయే ధర్మం" అని మనుస్మృతికి కల్లూ భట్టు ప్రతిపాదన.

పాశ్చాత్యులైన పి.వి.కాణే. మోనియర్ విలియమ్స్ వంటి అనేక మంది ధర్మ శబ్దాన్ని తమతమ పద్ధతుల్లో విశ్లేషించారు. మనువు ధర్మ లక్షణాల్ని మనుస్మృతి ద్వితీయాధ్యాయంలో ధృతి, క్షమ, దమం, అస్తేయం, శౌచం, ఇంద్రియనిగ్రహం, ధీ:, విద్య, సత్యం, అక్రోధం అనే దశ విధాలుగా తెలిపాడు.

షష్టాధ్యాయంలో మళ్ళీ "అహింసాసత్యమక్రోధ: అనృశంస్యందమస్తథా !
ఆర్జవం , చైత రాజేంద్ర । నిశ్చితం ధర్మలక్షణం"

అని పెక్కురీతులుగా తెలిపాడు.

మహాభారతం ప్రకారం ధర్మం పదిహేను అర్ధభేదాలలో వాడబడింది. ధర్మం, అంటే - ప్రకృతి స్వభావం, పురుషార్ధం, వేదవిహితకర్మ, వర్ణధర్మం, ఆశ్రమధర్మం, జాతిధర్మం, కులాచారం, లోకాచారం, లోకరీతి, సముచిత వర్తన, న్యాయం, విధి, శీలం, అహింసాది గుణాలు, పుణ్యకర్మ అని భారతంలో వివిధ సందర్భాలలో ఉటంకించబడింది.

కవిత్రయపు అనంతరకవులు దాదాపు ధర్మాన్ని పై విధాలుగానే స్థిరీకరించి, ధర్మాన్ని వివిధ సందర్భాలలో ఒక్కో విధంగా నిర్దేశించారు. పెద్దన కూడా మనుచరిత్రలో ఈ విధమైన సందర్భోచిత ధర్మబోధనే ఎంచుకున్నాడని చెప్పాలి. నిజానికి మనువు తన ధర్మశాస్త్రంలో రెండవ అధ్యాయం 12వ శ్లోకంలో ధర్మాన్ని - వేదములు చెప్పినది, పురాణ ఉపనిషత్ బోధనలు, సదాచారులైన పెద్దల నడవడి నుండి గ్రహించేది, తన అంతరాత్మ బోధించేది అని నాలుగు విధాలుగా విభజించాడు. పెద్దన తన రచనలో ఈ విషయాన్ని గుర్తించి ధర్మస్వరూపాన్ని అవగతం చేసుకుని వివరించారు అనేది సత్యం.

మనుచరిత్ర – ధర్మ స్వరూపం :

మనుచరిత్ర వర్ణనాత్మక కావ్యం. ఇలాంటి క్లిష్ట కథాగమనంలో అడుగడుగునా వర్ణనల బహువర్ణాల చిత్రాలను చిత్రిస్తూ కూడా పెద్దన ధర్మప్రశస్తిని కావ్యంలో అంతర్భాగం చేయటం గొప్ప విషయం.

ప్రథమాశ్వాసం 50 వ పద్యంలో వర్ణాశ్రమధర్మాల ప్రస్తావనలో నాలుగు వర్ణాల వారి ధర్మాలను వివరించారు. శూద్రవర్ణాన్ని శ్రామికులుగా చెబుతూ ఆదిబిక్షువు ఆకలి తీర్చగలవారని కీర్తించటం పెద్దన నిశితదృష్టికి నిదర్శనం.

ప్రథమాశ్వాసం 52 వ పద్యంలో ప్రవరుని గుణగణ, రూపలావణ్య వివరణలో పరోక్షంగా ప్రవరుడు "ధర్మ విరుద్ధ కామానికి" వ్యతిరేకి అనే భావాన్ని అందిస్తారు.

ప్రథమాశ్వాసం 66 పద్యంలో ప్రవరుని ఇంటికి వచ్చిన సిద్ధుడు - గృహస్థాశ్రమ వివరణ చేస్తూ గృహస్థు నిర్వహించాల్సిన ధర్మాల్ని వివరిస్తాడు.

ద్వితీయాశ్వాసం 46వ పద్యంలో కవి ప్రవరునిలోని ధీ: అనే ధర్మలక్షణాన్ని నిరూపించారు. 60వ పద్యంలో ప్రవరునిచే ఇంద్రియ నిగ్రహ ప్రాధాన్యతని వివరింప చేసారు.

తృతీయాశ్వాసం 100వ పద్యంలో మాయా ప్రవరుడు, వరూధినితో మాట్లాడుతూ దయ, పరోపకారం అనే ధర్మ లక్షణాల్ని ప్రస్తావిస్తాడు. అలాగే 133, 134 పద్యాలలో ఐహిక సుఖాలు, అశాశ్వతాలు అని వివరిస్తాడు.

చతుర్థాశ్వాసం 66వ పద్యంలో రాజధర్మమైన ఆర్త త్రాణ పరాయణత్వం చూపబడింది. 87వ పద్యంలో మనోరమ సఖులైన విభావసి, కళావతుల ద్వారా క్షమ, స్నేహధర్మం అనే ధర్మ లక్షణాలు నిరూపించబడినాయి. 93 వ పద్యంలో సద్విద్య ఎవరి నుండైనా గ్రహించవచ్చు అనే ధర్మ సూక్ష్మ ప్రస్తావన ఉంది.

పంచమాశ్వాసంలో 28 వ పద్యంలో ఇందీవరాక్షుని ద్వారా ప్రత్యుపకారం అనే ధర్మలక్షణం నిరూపితమైంది.

షష్ఠమా శ్వాసం 15వ పద్యంలో రాజధర్మమైన రక్షణ, ప్రత్యుపకారం అనే ధర్మలక్షణాల్ని ప్రస్తావించటం జరిగింది. 49 వ పద్యంలో బ్రాహ్మణ ధర్మ వివరణ, ఇంద్రియనిగ్రహం కోల్పోవటం వల్ల వచ్చే అనర్థాలు వివరించారు. 66వ పద్యంలో దాంపత్య ధర్మము వ్యక్తపరచబడింది. 81వ పద్యంలో జింకల ద్వారా ధర్మహీన కామాన్ని నిరసింపచేసారు. 101 వ పద్యంలో స్వారోచిషుని గుణాలను వివరిస్తూ శాంతి, దాంతి, దయ, సత్యము, శౌచములతో నిష్కామంగా విష్ణువు గూర్చి తపము చేసాడని తెలుపుతూ కవి ధర్మపురుషార్థ లక్షణాలని వివరించారు.

స్వారోచిషమనుసంభవం అనే నామాంతరం గల మనుచరిత్ర ప్రబంధంలో భూలోకపాలకుడైన మనువు పుట్టుక, దానిలోని ప్రత్యేకతా విశేషాలు, భూలోకాన్ని పాలించే వానిలో (స్వారోచిషునిలో) దేవ, గంధర్వ, రాక్షస, జంతు, వన, మానవ లక్షణ నిరూపణలో భాగంగా కవి, ఆయా సమూహాల ధర్మలక్షణాల్ని ఆయా పాత్రల ద్వారా

సంఘటనాత్మకంగా కథలో నిరూపించిన తీరు అనన్య సామాన్యం.

వర్ణనలను మినహాయించి కేవలం కథాపరమైన దృష్టితో పరిశీలించి ధర్మపురుషార్థాన్ని కవి ఎలా నిరూపించారో గమనించటం ముఖ్యంగా ఈ వ్యాసం సాగింది. పరిమితుల దృష్ట్యా పద్యాలను కేవలం సంఖ్య ద్వారా సూచించి వివరించాను. కథాకథనాలలో అంతర్నిహితంగా ఉన్న ధర్మప్రస్తావనను గ్రహించటమే లక్ష్యంగా పరిశీలించాను. అందువల్ల కథ విషయమై వివరణలు ఈ వ్యాసంలో ఉండవు.

ముగింపు :

పంచకావ్యాలలో ఒకటిగా పేరొంది, తెలుగులో తొలి ప్రబంధమైన మనుచరిత్రలో "ధర్మ" ప్రస్థావన - వివరణల పరిశీలన లక్ష్యంగా ఈ వ్యాసం సాగింది. వివిధ కథా సంఘటనల అంతర్భాగంగా ఈ కావ్యంలో ధర్మలక్షణాలైన సత్యం, దానం, ధీ:, విద్య, అక్రోదం, క్షమ, భూతదయ, ఇంద్రియ నిగ్రహం, కృతజ్ఞత, అతిథ్యం, మాతాపితరుల భక్తి, గురుభక్తి, స్నేహం, పాతివ్రత్యం, వంటి వాటితో బాటుగా రాజధర్మాలైన రక్షణ, ఆర్తత్రాణపరాయణత్వం లతోబాటు బ్రాహ్మణధర్మాల్ని ఇతర వర్ణధర్మాల్ని వివరించిన అనేక సంఘటనలని గమనించటం జరిగింది. వాటిలో ధర్మలక్షణ సంయుతాలైన కొన్ని పద్యాల్ని స్థూలంగా వివరించటం జరిగింది. మొత్తం మీద మనుచరిత్ర కావ్యం, రచనా కాలంనాటి ధర్మలక్షణ స్వరూపాలకి ఒక నమోదుగా ఉంది. ఆకాలం నాటికి వాడుకలో ఉన్న, ప్రాచీన ధర్మశాస్త్రాలలోని ధర్మలక్షణాలని వివిధ వర్గాల పరంగా కథాంతర్గతంగా నిరూపించటంలో ఈ కావ్యం తనదైన ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

❖❖❖

కావ్యం – చతుర్థ పురుషార్థం

– డా॥. కాకునూరి సూర్యనారాయణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్.

''కవిర్మనీషీ పరిభూః స్వయంభూః'' వంటి వేదమంత్రం - "కవయః క్రాంతదర్శనః" వంటి లోకోక్తి - "శబ్దార్థౌ సహితౌ కావ్యం" - భామహుడు; "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం" - దండి; "రీతిరాత్మా కావ్యస్య" - వామనుడు; "ధ్వనిః కావ్యస్య జీవితం" - ఆనందవర్ధనుడు; "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" - జగన్నాథ పండితరాయలు వంటి అనేక నిర్వచనాలతో పాటు సాహిత్య దర్పణ కారుడైన విశ్వనాథుని "వాక్యం రసాత్మకం కావ్యం" అనే ఘంటానాదాత్మక నిర్వచనంతో మనవారి రస సిద్ధాంత వివేచనా శక్తి మేరుశిఖరాన్ని తాకింది.

క్రీ.పూ. 5వ శతాబ్దికి చెందిన భరతుడి నుండి, భామహుడు, దండి, ఉద్భటుడు, వామనుడు, ఆనంద వర్ధనుడు, కుంతకుడు, భోజుడు, క్షేమేంద్రుడు, మమ్మటుడు, రుయ్యకుడు, జయదేవుడు, విద్యానాథుడు, విశ్వనాథుడు.... ఇలా నేటి కేశవమిశ్రుడు (అలంకార శేఖరం), అప్పయదీక్షితులు (కువలయానందం), జగన్నాథ పండితరాయలు (రస గంగాధరం) వరకు వీరంతా చేసిన అప్రతిహత సాహిత్య మీమాంసా శాస్త్ర చర్చలో, వెలువరించిన కావ్యశాస్త్ర గ్రంథాలు తమ అపూర్వ ప్రతిభాపాటవాలతో సారస్వతాభిమానులను రసానంద సాగరంలో ఓలలాడించాయి.

అయితే కావ్యం ఎందుకొరకు? కావ్య రచన లేక పఠన పాఠనాదుల వల్ల కలిగే ప్రయోజనమేమిటి? అనే విషయం ఈ వ్యాసంలో ప్రతిపాదించదలచిన అంశం. ఆ ప్రయోజనం కావ్యానందంద్వారా లభించే చతుర్థ పురుషార్థోపలబ్ధి అని నిరూపణ చేయటం సమాధానం.

కావ్య ప్రకాశ కర్త మమ్మటుడు (1050-1150) ప్రతిపాదించిన ప్రసిద్ధ నిర్వచనమిది...

"కావ్యం యశసేర్థకృతే వ్యవహార విదే శివేత రక్షతయే
సద్యఃపర నిర్వృతయే కాంతా సమ్మిత తయోపజేశయుజే"

కావ్యం - 1. యశస్సు; 2. ధనం; 3. వ్యవహార విజ్ఞానం; 4. అశుభ నివారణం; 5. తత్క్షణ జీవన్ముక్తి ప్రదాయకమైన ఆనంద తన్మయత్వం 6. కాంతా సమ్మితమైన కర్తవ్య ప్రబోధం అనేవాటి కొరకు అని వివరించే ఈ నిర్వచనం చాలావరకు సమగ్రమైంది అనాలి.

శాశ్వతమైన కీర్తి వైభవం యశస్సుగా కవీశ్వరులకు లభిస్తుంది అని భర్తృహరి (...నాస్తి తేషాం యశఃకాయే జరామరణజమ్...) నీతి శతక విద్వత్పద్ధతిలో వివరించాడు. చతుర్విధ పురుషార్థాల సాధన అనంతరం లభించే ప్రయోజనమే కీర్తి. ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే ఈ నాలుగు పురుషార్థాలకు చతుర్వర్గమనే ప్రాచుర్యం కూడా ఉంది. ఇందులో పరమ "పర" పురుషార్థమైనది మోక్షమని తెలుసుకోవడమే కావ్యం కల్గించే ప్రయోజనం. నన్నయ గారు భారతంలో శకుంతల చేత దుష్యంతునకు ధర్మబోధ చేస్తూ, ఇల్లాలు - "ధర్మార్థ కామ సాధనకుపకరణంబు" అంటాడు. ధర్మేచ, అర్థేచ, కామేచ త్రయైషాః నాతి చరితవ్య అనే ధర్మసూత్రానికి ఇది అనుసరణ. కావ్యం ద్వారా ధర్మబోధ చేయవచ్చు అనే విషయానికి ఒక ఉదాహరణ. "విశ్వశ్రేయః కావ్య"మని శబ్దానుశాస మూల సూత్రాన్ని అప్పకవీయం ఈవిధంగా వర్ణించింది.

"ధర్మములలోన నుత్తమ
ధర్మము కావ్యము నిజంబు ధరనెవ్వనికి కా
ధర్మము చేకుఱు నతడు సు
ధర్మ ను వచియించు వెక్కు డైవత యుగముల్"
(ప్ర.ఆ.14)

అని వివరించాడా శాస్త్ర కావ్యకర్త. సత్యం వద, ధర్మం చర వంటి వేద వాక్యాలకు "సూనృత వాక్యము మేలు

సూడగన్" వంటి పలుకులు నేర్వదగినవి. మమ్మటుని నిర్వచనంలోని వ్యవహార విజ్ఞానం అనే భావనను ఇక్కడ సూచించవచ్చు.

ఇక "అర్థకృతే" అనే పదం ప్రత్యక్షార్థంలోనే వుంది. ధనమంటే ఏమిటనే ప్రశ్నతో వచ్చే గౌణ, సూచ్యార్థాదుల ప్రసక్తి పక్కన బెగితే ఈషణ త్రయాలలో ఉన్న రెండవదైన ధనేషణను కావ్యరచన ద్వారా సాధించవచ్చునని పండితులు నేటికాలంలో నిరూపిస్తున్నారు. శ్రీనాథ, పెద్దనాదులను కూడా ఈ సందర్భంగా స్మరించుకోవాలి. తృతీయ పురుషార్థ సంబంధితంగా, కాంతా సమ్మిత తయోపదేశ యుజమైనవిగా కావ్యాదులను అలంకారిక లోకం విశ్లేషించింది. వేదములు ప్రభు సమ్మితములు; శాస్త్రములు మిత్ర సమ్మితములు; కావ్యములు కాంతా సమ్మితములనే రామరాజ భూషణుని నిర్వచనాన్ని జ్ఞాపకం చేసుకుంటే ఇక మిగిలింది మోక్షమే.

"ముచిల్ మోక్షణే" - బంధనాల నుండి విముక్తి అని చెప్పే ఈ భావనను సద్యఃపర నిర్వృతమని మమ్మటుడు వివరించాడు. అంటే జీవనానికి తత్క్షణమే అంటే కావ్య పఠన మాత్రం చేతనే లేదా శ్రవణ మాత్రం చేతనే జీవన్ముక్తి ప్రదాయికమైన ఆనంద తన్మయత్వం లభిస్తుందని అనుకుంటే అదెలా పొనగుతుంది? అనేది ప్రశ్న. సాహిత్యం ఆలోచనామృతం కదా! సద్యఃపర నిర్వృతత్వం కలగదు, వెంటనే మోక్షం లభించదు. "...అంగనా జన విలాసాలాప లీలా సమ ప్రాదుర్భావములు" అనే కావ్యాలంకార సంగ్రహ వివరణను ఉదాహరణగా స్వీకరిస్తే ఇలా ఉంటుంది. - పప్పులో పోపు వేయడం వస్తే చాలు ఇల్లాలు అనే శబ్దం స్త్రీకి రమ్యంగా అమరుతుంది కాని ప్రేయసి అన్న నామం శోభించాలంటే అతి తీవ్రమైన ప్రేమాగ్ని జ్వాలలలో కాలితే కాని కుదరని వ్యవహారం అని అడవి బాపిరాజు తన శకుంతల అనే కావ్యంలో ఉపమించాడు. ఈ ఊహ ఎంత సౌందర్య భరితమైనదో! ఇది ఇట్లుంటే కావ్యం చదవడం లేక వినడం ద్వారా కలిగే ఆనందం ఎటువంటిదనేది మరో ప్రశ్న. ఇది తేలితే కాని కావ్యం, చతుర్థ పురుషార్థ సాధనం అవునో కాదో నిరూపింపబడదు.

"రమ్యాణి వీక్షమధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుఖోభవతి యత్సుఖితోపి జంతుః
తచ్చేతసా స్మరతి రూపమబోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాణి"

ఇది కాళిదాసు మహాకవి చేసిన మధురమైన ఊహ. లలిత కళలలో కవిత్వమొకటి. ఇది కాక చిత్రలేఖ నాదులున్నాయి. అందమైన చిత్రాన్ని, ప్రకృతి రామణీయతతో కూడిన ఒక ప్రదేశాన్ని చూస్తే ఒక అవ్యక్తానందం కలుగుతుంది. సంగీతం కూడా లలితకళలకు చెందిందే. మధురమైన శబ్దాన్ని విన్న మనస్సు పర్యుత్సుఖి తత్త్వం (తత్క్షణమే లభించే రసానందానుభూతి- మోక్షం) పొందుతుంది. ఈ సందర్భాలలో సద్యఃపర నిర్వృతి పొందవచ్చు. కాని కావ్యం వల్ల అలా కుదరదే! చిత్ర, దృశ్య సందర్శన కంటిద్వారా స్వీకరింపబడుతుంది. రస ధ్వని శ్రవణేంద్రియం ద్వారా పరామర్శింపబడుతుంది. చెవికి, కంటికి విశ్లేషించే శక్తి లేదు. ఇవి ఉపకరణాలు మాత్రమే. మరి పర్యుత్సుఖి తత్త్వం ఎలా కలిగిందనుకుంటే జనాంతర సౌహృదగత భావనలు మనిషిని జంతువుల నుండి వేరుచేస్తున్నాయని ఆ కవికుల గురువు ఊహ. అనలు ఔత్సుక్యమంటే ఎక్కువైన కోరిక. లిలీష (ఇత్యౌత్సుక్యాదపరిగణయన్... మేఘదూతం). సంగీత, చిత్రలేఖన, కావ్యాదుల సృష్టికర్తలు వేరుగా ఉన్నారు. వాటిలోని స్వారస్యాన్ని గుర్తించి, అనుభవించి, పలవరించి, పరవశించే భావుకులు వేరుగా ఉంటారు. అయితే వీటన్నిటిలో కావ్యగత స్వభావం వేరు. ఇది ద్విధాభూతమైనది. 1. ఆలోచనామృతం కాగా 2. సద్యఃపర నిర్వృతత్త్వం. ఈ రెండు భిన్న పార్శ్వాలైతే వీటి ఫలితాంశంగా సాధించే ప్రయోజనం మళ్ళీ ఒక్కటే. అది చతుర్థ పురుషార్థ సాధన.

"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసు" అని వేద ప్రమాణం. అట్లాగే లోకంలో మరొక

మాట ఉన్నది. ''శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే'' అనేది. ఆ మాటకొస్తే శ్రీశైలంలో ఉన్న వేలాది మందితో పాటు దర్శించుకునే లక్షలాదికి మళ్ళీ జన్మలు లేవన్నమాటేగా! ''దేవోత్సవే హరేర్దృష్ట్వా..'' కూడా ఇటు వంటిదే! లోకంలో నేడు బహుళ ప్రచారం పొందిన ప్రవచనకర్తలున్నారు. వారు ఏ దైవాన్ని స్తోత్రపాఠం చేస్తుం టారో ఆ ప్రవచనంలో ఆ దైవనామం మాత్రమే మారు తుంటుంది. అంతే! మిగతా ఉపమానాది అలంకారాలు, భాషా చమత్కార చణుకులు, హావ భావ విన్యాసపూర్వక పసుపు కుంకాల కుంకుంబొట్లు, పొల్లు కూడా మారదు. అన్ని ప్రవచనాల సారాంశం ఒక్కటే. సారస్వతంలో భాషా జ్ఞాన శబలత పెరిగితే విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. అంతేకాని సద్యఃపరనిర్వృతమైన తత్క్షణ జీవన్ముక్తి దాయకమైన ఆనందం శ్రోతకు లభించదు. ఆ స్థితి పొంద గలగడమే మోక్షం. అదే చతుర్థ పురుషార్థం. ఈ విషయం అర్థం కానంతవరకు విషయాంతర్గత లోతు తెలియనంత వరకు బాహిరమైన సౌందర్య విషయాలలో పడి సాహిత్య భవనపు సోపానాలెక్కుతూ ఉంటాడు. ఆ మెట్లు ఎన్నటికీ తరగవు. ఆ ప్రవచనం అట్లా సాగిపోతూనే ఉంటుంది. శ్రోతలలా తలలూపుతూనే వుంటారు. విషయగత జ్ఞానం కనక శబ్ద సౌందర్య మోహంలో పడి కొట్టుకుపోతుంటారు. ''కర్తవ్యోపదేశ క్రియావాద ప్రక్రియనెన్న కావ్య మహిమల్ వర్ణింపగా శక్యమే'' అనే రామరాజ భూషణుని కావ్యాలం కార సంగ్రహ వివరణ కావ్య ప్రయోజనం ఇంకేదో ఉ న్నది అని సూచిస్తున్నదనుకుంటే అది చతుర్థ పురుషార్థ మనుకోవాలి. ఒక నాటకం, సినిమా చూచే వేళలో, అందులో కథ ఉంటుంది, కథనం ఉంటుంది, పాత్రలుంటాయి, సన్నివేశ పరికల్పనముంటుంది - రసావిష్కరణమవుతుంది. చూచేవారికి ఆనందం కలుగు తుంది. మైమరపుతో ''పర''ధ్యాస తొలగి ఆవిష్కృత రస భావానికి తలొగ్గడం ఉంటుంది. కావ్యం విషయం అట్లా కాదు. ఇక్కడ ప్రధానంగా ఊహ ఉంటుంది. దృశ్య శ్రవణ మాధ్యమాల ప్రమేయం లేని స్థితి ఉంటుంది.

ఇతర కళల విషయాల్లో, బాహిరమైన అంశాలను మనస్సు పరిశీలన చేసి ఒక ఆనందానుభూతిని భావకుడు పొందగలిగితే, ఇది ఆలోచనానుభవ స్థితిగా మొదటిది అనాలి. ఇక రెండవదిగా మనస్సు గ్రహించిన విషయా లను అంతఃకరణం వరకు తీసుకెళ్ళే స్థితిని మీమాంసా శాస్త్రం అందిస్తుంది. ఆ స్థితిని చేరుకున్న భావుకుడికి మాత్రమే బ్రహ్మానంద సమాన కావ్యానందోపలబ్ధి కలుగు తుంది. అటువంటి అపురూప స్థితిలో క్షణమాత్రంలో పొందగలిగే చరమస్థాన స్థితి సద్యఃపర నిర్వృతి. ఇటు వంటి స్థితిని చేరుకోవడానికి శాస్త్ర పరిజ్ఞానం కావాలి. ''అరసికాయ కవిత్వ నివేదనం శిరసి మాలిఖ మాలిఖ మాలిఖ'' కారాదు. అప్పుడే లభించిన విద్యా విషయాను భూతి పూర్వక విషయ వివేచనా జ్ఞానం కావ్య పఠనాను భూతిని లోలోపలకు తీసుకువెళ్తుంది. ఊహ లోపలి వైపు ప్రయాణిస్తుంది.

"జగ్రాహ పాఠ్యమృగ్వేదాత్సామభ్యో గీతమేవచ
యజుర్వేదాదభినయాన్ రసానాథర్వణాదసి"

యజుర్వేదం నుండి అభినయం, ఋగ్వేదం నుండి వాక్కు, సామం నుండి సంగీతం రాగా, అథర్వణ వేద ఊతంతో రసావిష్కరణ చేస్తూ రూపక ప్రదర్శన ఉండాలని, పూర్వ ఋషుల మాట. ఇది నాటక విషయం. అసలు నాటకాభినయానికి పూర్వం నాటక సృష్టి ఉండాలి కదా! అంటే ఈ నాలుగు అవస్థలతో పాటు చూచేవారి హృదయ స్పందనలు సైతం ఊహించి ఉండాలి. అటువంటి స్థితి పొందితే అట్లా చేసిన ఆ రచన వల్ల ఆ కావ్యకర్తకు సద్యఃపర నిర్వృతి లభిస్తుంది. పాఠకుడికి సైతం కవి హృదయంతో సంసర్గ స్థితి ఏర్పడినప్పుడు అదే ఫలం దొరుకుతుంది. అంటే కావ్యం రసాశ్రయమై ఉండాలి. కావ్య పాఠకుడు కావ్యగత రసానుభూతిని పొందగల పరిపర్వతను పొంది ఉండాలి. ఇప్పుడు మోక్షమంటే దేహత్యాగ భావనతో ముడిపడినది కాక, ఆ శరీర సంబంధిత ఉనికి విడిచిపెట్టి, దాని పర్యవసిత జ్ఞానానికి సంబంధించింది అవుతుంది. కావ్యాంతర్గత

రసానుభూతితో మైమరచిపోవడం అని లౌకికభాషలో చెప్పవచ్చు. ఇక్కడ మళ్ళీ ఒక ప్రశ్న ఉత్పన్నమౌతుంది. పాఠకుడికి నచ్చే విషయం కావ్యంలో ఉన్నప్పుడే అతడి మనస్సు ఆ రస భావ స్థిరీకరణకు సిద్ధపడుతుంది. అంటే పూర్వమే ఆ కావ్యమందలి భావ సంబంధిత పరిజ్ఞానం కొంత పఠితకుండాలి. సారస్వతాభిలాష కొంత మేలు కలిగించినప్పటికీ ఇక్కడ శాస్త్ర పాండిత్యం అవసర మౌతుంది.

"న విద్యతే యద్యపి పూర్వ వాసనా - గుణానుబంధీ ప్రతిభావమద్భుతమ్... కృశే కవిత్వేపి జనాః కృతశ్రమా - విదగ్ధ గోష్ఠీషు విహర్తుమీశతే" అని దండి తమ కావ్యాదర్శ ప్రథమ పరిచ్ఛేదంలో వివరించినట్లుగా "పూర్వ వాసనా గుణానుబంధీ" పూర్వజుల సంస్కారంతో సంబంధించినది. అంటే గొప్ప ప్రతిభ లేకపోయినా అభ్యాసం చేత, ఉపాసింపబడిన దైవానుగ్రహం చేత, కవి కావ్యసృష్టి చేస్తాడు. ప్రతిభ, దారిద్ర్యం చేత ఉత్తమ కావ్య నిర్మాణం చేయలేకపోయినా, సారస్వత సేవ చేసిన వారౌతారు. ఉత్తమ కావ్య రసాన్ని ఆస్వాదించే శక్తిని సంపాదించుకోగలుగుతారు. అలాగే సరస కావ్య గోష్ఠి లలో రాణించగలుగుతారు కూడానూ! బాలానందినీ వ్యాఖ్యనందించిన ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు - "శ్రుతంచ" అనే చోట వ్యాకరణ, మీమాంస, న్యాయ, సాహిత్య, ఛంద, అలంకార, శ్రుతి, స్మృతి, పురాణ ఇతిహాస - ఆగమ, నాట, అభిధానకోశాదుల, (కామశాస్త్ర, అర్థశాస్త్ర, యోగశాస్త్రాదులు) విద్యాభ్యాసం కావ్యజ్ఞుల వద్ద చేయడం వల్ల అవి కావ్య సంపదకు కారణ మౌతాయని వివరించారు.

సప్త సంతానాలలో ఒకటైన కావ్య సృష్టి ఆ కావ్యకర్తకు, అతడి నూట ఒక్క కులము వారికి ముక్తి కలిగిస్తుందని, అప్పకవీయం (ప్రథమాధ్యాయం - 15) వర్ణిస్తుంది. చివరగా "అనంతావై రసాః" రసములు అనంతములు ప్రతి భావము కూడా రసవంతమే అవుతుంది. భావహీన మైన రసం కాని, రసవర్జితమైన భావం కాని ఉండవు. ఉండవలసిందల్లా సహృదయత, భావ శబలతలతో కూడిన రసగ్రహణ పారత్వం. ఇది లేకపోతే ఏ శబ్దం కూడా ఆస్వాదయోగ్యం కాదు. మాట్లాడే చిలుకను బహుమతిగా పొందిన ఒక మాంసాహార ప్రియుడికి, ఆ చిలుక పలుకులు రుచిస్తాయా? లేక దాని మాంసగత సాదుత్వ లక్షణం ప్రీతిదాయకమౌతుందా? ఏ భావం వల్ల, ఇంకేవిధమైన భావానుభావాదులతో కూడా మనస్సు చెదరదో, అటువంటి రసభావం వల్ల లభించే కావ్య ప్రయోజనం చతుర్థ పురుషార్థ సిద్ధి. లోకంలో బహుళ ప్రచారంలో పొందిన మాట ఒకటి ఉన్నది. "రసో వై సః" తైత్తిరీయ ఉపనిషత్తులోని ఏడవ అనువాకంలోనిది. విద్వాంసులకే బ్రహ్మ /మోక్ష ప్రాప్తి అని శంకరభాష్యం ఈ అనువాకానికి ముక్తాయింపునిస్తుంది. "అసద్వా ఇద మగ్ర ఆసీద" నే అనువాకం నడుమ వచ్చేదే ఈ మంత్ర చరణం. అవ్యాకృత బ్రహ్మమనగా జీవేశ్వరులకు అభిన్న నిరూపణం. తండ్రి నుండి కుమారుడు పుట్టాడంటే "అంగాదంగాత్సంభవసి హృదయాదధి జాయతే.." కుమారుడు తండ్రికి వేరు కాడు. ఆ బ్రహ్మమే అతీంద్రియమైన రస స్వరూపం. ఏది సుకృతమో అంటే స్వ కర్తృకమో అది బ్రహ్మం. ఆ రసభావం పొందినవాడు నిర్భయుడై బ్రహ్మభావ స్థితిని పొందుతాడు. అతడికి కలిగే స్థితి బ్రహ్మానందం. కావ్యకర్తను ఈశ్వరుడిగా, పఠితుడిని జీవుడిగా ప్రతీకాత్మకంగా గుర్తిస్తే వీరికి లభించేది బ్రహ్మానంద సదృశ కావ్యానందోపలబ్ధి. దానివల్ల పొందేది చతుర్థ పురుషార్థ సిద్ధి.

చతుర్థ పురుషార్థాలు కంటికి కనిపించేవి కావు. అనుభవైక వేద్యాలు మాత్రమే. అందులోనూ మొదటి మూడింటికీ కొంత లౌకికమైన లౌల్య సంబంధ మార్గాలున్నాయి. కానీ చతుర్థపురుషార్థ సిద్ధికి అంతర్ముఖీనత్వమే సోపాన పంక్తి అవుతుంది.

ఆ దారిన నడిచేవాడు కావ్యాత్మ తెలిసినవాడు. అతడికి లభించేది ముక్తి. అతడు ముక్త జీవనుడు. ❖

నిర్దేశిత జీవన విధులు పురుషార్థాలు

– డా॥. కల్పగంతుల మధుసూదన్, ప్రాచార్యులు, శ్రీసాధన డిగ్రీ కళాశాల, మార్కాపురం.

ఉపోద్ఘాతం :

సంస్కృతంలోని పురుష శబ్దము స్త్రీ-పురుష అనే తారతమ్యంలేని సకల మానవాళిని సూచిస్తుంది. జనులందరు విధిగా ఆచరించాల్సిన ప్రమాణాలను వాటి పరమార్థాన్ని, తద్వారా ఒనగూరే ప్రయోజనాలను విశేష అనుభవశీలురైన మన పెద్దలు పురుషార్థాలు అంటూ సూచించారు. పురుషార్థాలు ధర్మ, అర్థ, కామ, మోక్షాలని మొత్తం నాలుగు. ద్రష్టలైన మహర్షులు మన జీవితాన్ని సార్థకం చేసుకొనేందుకు ఖచ్చితమైన విధులుగా ఈ నాల్గింటిని నిర్దేశించారు. మొదటగా 'ధర్మ' స్వరూపాన్ని పరిశీలిద్దాం.

ధర్మము :

'ధరతి విశ్వమితి ధర్మ:' లోకస్థితికి పరమాధారమైన దానిని ధర్మము అంటారు. న్యాయము, నీతి, నిజాయితీ, కృతజ్ఞత, ప్రేమ, కరుణ, సత్యము అనే గుణాల సమగ్ర స్వరూపమే ధర్మం. చరాచర సృష్టిలోని సకల రూపాలకు వాటివైన తత్వాలు, కర్తవ్యాలు ఉంటాయి. ఈ కర్తవ్యాలు, తత్వాలనే ఆయా స్వరూపాల తాలూకు ధర్మాలు అని చెబుతుంటారు.

వస్తువులనుబట్టి, వ్యక్తులనుబట్టి, పరిస్థితినిబట్టి, కాలన్నిబట్టి, విధులనుబట్టి, అవసరాలనుబట్టి ధర్మం అనేక విధాలుగా నిర్వచించబడుతుంది. సత్యనిష్ఠ, ప్రాపంచిక హితం పరమావధిగా ధర్మనిర్ణయం జరుగుతుంది. ఇలా జరిగిన ధర్మవివేచననే ధర్మ సూక్ష్మాలు అంటారు. మానవ కోటి మొత్తమూ ఐకమత్యంతో, పరస్పర ప్రేమానురాగాలతో, ఒకరికొకరు సహకరించుకుంటూ సంఘస్ఫూర్తి కలిగి ప్రకృతిని, ప్రాణికోటిని సమాదరిస్తూ జీవించాలని, అలా జీవించటమే మానవధర్మమని మన పెద్దలు, మహర్షులు సూచించారు. అంతేకాకుండా జీవనానికి ఆధారభూతమైన విత్త సమపార్జన, కుటుంబపరమైన, సంఘపరమైన వాంఛలు, నిండైన జీవనం తాలూకు ఆనందపు అనుభూతి అనునవి అందరికి అవసరమని వివరిస్తూ మన పెద్దలు వీటిని పురుషార్థాలుగా చెప్పారు. 'వేద హితంబులును శాస్త్ర విహితంబులును శిష్ట చరితంబులను ననజెప్పనొప్పి ధర్మములు మూడు విధముల దనరుచుండు గడగియిన్నియు సద్గతి కారణములు' అంటారు ప్రబంధ పరమేశ్వరునిగా పేరుగాంచిన మహాకవి ఎఱ్ఱన తన మహాభారత అరణ్య పర్వ శేష పూరణంలో. వేద శాస్త్రాదిక విషయ జ్ఞానంవల్ల, గొప్పవారి నడవడివల్ల మనం ధర్మాల్ని గ్రహించి ఆచరించాలట.'ఎవ్వలన ధర్మంబు గలుగు నవ్వలనికి జయంబు కలుగుట తప్పదు' అని భారత కర్ణపర్వంలో కవిబ్రహ్మ తిక్కన అంతిమవిజయం ధర్మానిది మాత్రమే అంటూ ధృవీకరించారు.రాజు సాక్షాత్తు ధర్మ స్వరూపుడైతే మంత్రులూ ధర్మ పరమైన దయా స్వరూపులవుతారని 'యథారాజా తథాప్రజా' వంటి ఆర్యోక్తులు విశదపరుస్తున్నాయి. ధర్మం ధర్మంచేతనే ప్రవర్తిల్లుతుంటుందని, ధర్మం వినాధర్మాన్ని మరేశక్తీ నియంత్రించలేదని బౌద్ధంకూడా ప్రబోధిస్తోంది. మన సనాతన వ్యవస్థకూడా.....'సత్యం బ్రూయాత్. ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియమ్ ప్రియంచ నానృతం బ్రూయాత్ ఏష ధర్మ: సనాతన:' అంటోంది. మనమందరం నిరంతరం సత్యాన్నే మాట్లాడాలి. మనం మాట్లాడే సత్యం ఆనందదాయకమైనదిగా ఉండాలి. ఎదుటివారిని బాధించేది సత్యమైనా సరే దానిని విస్మరించాలి. అలాగని పదుగురి ఆనందం కోసమైనా సరే అసత్యాన్ని మాత్రం చెప్పకూడదు. నిబద్ధతను నిర్ణయించే ఈ జీవన సూత్రమే భారతీయ సనాతన ధర్మం. పితృవాక్య పాలనలో అరణ్యానికి ప్రయాణమౌతూ శ్రీరాముడు తన మాతృమూర్తి కౌసల్యాదేవికి ప్రణమిల్లా

డట. మొదట మూర్ఛిల్లిన కౌసల్యాదేవి అంతలోనే తేరుకొని రాముని కఠోర ధర్మదీక్షను గుర్తెరిగినదై కుమారుడు అడవికి వెళ్ళడం తథ్యమని నిర్ణయించుకొని ఆస్థాన పురోహితులను పిలిపించి అనేక పూజలు, దేవతా ప్రార్థనలు నిర్వహించింది.

"ఓ ఇంద్రుడా! అడవిలో నా బిడ్డను కాపాడు. ఓ అగ్నిదేవుడా! ధర్మతత్పరుడైన శ్రీరామచంద్రుణ్ణి సంరక్షించు. దేవతలారా! రామునికి ఆపదలు కలగకుండా చూసుకోండి. తోడు నిలవండి" అని విన్నపాలు చేసుకొని బిడ్డను సమీపించి "ధర్మత్వామభిరక్షతు" అంటూ శ్రీరామా! ఏ ధర్మంకోసమైతే నీవు పరితాపం చెందుతావో అలాంటి శాశ్వతమైన, లోకహితమైన, ఆదర్శనీయమైన ధర్మమే నిన్ను కాపాడుగాక అని ఆశీర్వదించిందట.

రామాయణంలోని మరో సంఘటన కూడా ధర్మ ప్రాముఖ్యాన్ని విశదపరుస్తుంది. అరణ్యవాసం చేస్తూ చిత్రకూట పర్వతప్రాంతంలో ఉన్నటువంటి రాముణ్ణి తిరిగి తీసుకుని వెళ్ళేందుకు భరతుడు వచ్చాడట. రాముడు ప్రేమతో సోదరుణ్ణి అనునయిస్తూ "భరతా! నీ పరిపాలన సంపదలచేత ధర్మాన్నిగాని, ధర్మంచేత సంపదల్నిగాని, అధికమైన కోరికలచేత ధర్మ అర్థాలనుగాని బాధించటం లేదుకదా!" అంటూ యోగక్షేమాలను విచారణ చేశాడట. 'కచ్చిదర్థేనవాధర్మం, అర్థం ధర్మేణవాపున: ఉభౌ వా ప్రీతిలోభేన, కామేనచ నబాధసే,' ధర్మంచేత, అర్థంకాని, అర్థంచేత ధర్మంగాని, కామంచేత అర్థంధర్మాలుగాని ఇబ్బంది పడకూడదని రామాయణం చెబుతోంది. పురుషార్థాలు సైతం వాటి పరిమితులు దాటకుండా ధర్మంతో అనుసంధానమై మనల్ని నడిపించాలట.

'ధర్ముపు సర్వంబునకు హితంబుగ వలయున్
ధర్మజ్ఞులైన పురుషులు ధర్మమునకు బాధసేయు
ధర్ముపునైనన్ 'ధర్మముగా మదిదలపరు' ...

అంటూ అదికవి నన్నయ.....

'అర్థసిద్ధికంటె నరయు నెక్కుడు ధర్మ
సిద్ధి, దాన సకల సిద్ధులు బ్ర
శస్తభంగి జేరు. శాశ్వత కీర్తియు సంభవించు, గలుగు సద్గతియును'

అంటూ ఉభయ కవిమిత్రుడు తిక్కన... 'ధర్మంబు బహుమార్గ దుష్టంబయి సూక్ష్మంబయియుండు' అని ఎఱ్ఱన...

ధర్మస్వరూపాన్ని మహాభారతంలో విశదపరిచారు. శాశ్వతంగా మన వెంటే నడిచే ధర్మమే అసలైన ధర్మమని, నిస్వార్థంతో విద్యుక్త కర్మాచరణచేసే ధర్మజ్ఞులను దైవమే అనుసరించి అండగా నిలుస్తుందని 'ధర్మమునె పలికిన దైవంబు తోడయా' అంటూ ప్రజాకవి వేమన వాక్రుచ్చారు. 'బొంది యెవరి సొమ్ము పోషింప బలుమారు ప్రాణమెవరి సొమ్ము...ధర్మమే తన సొమ్ము' అని చాటిన వేమనార్యుని మాటలు సదా స్మరణీయాలు.

'బలవానప్య ∩ శక్తో సౌ
ధనవానపి నిర్ధన:
శ్రుతవానపి మూర్ఖశ్చ
యోధర్మ విముఖో జన:'

అంటోంది శతశ్లోకి. ఎవరైతే ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తారో అలాంటివారు బలవంతులైనప్పటికీ అసమర్థులు గాను, ధనవంతులైనప్పటికీ దరిద్రులుగాను, విద్యావంతులైనప్పటికీ మూర్ఖులుగాను పరిగణింపబడతారట. ధర్మప్రాముఖ్యం అంతటిది.

అర్థము :

'అర్థతే ఇత్యర్థ:' అని శబ్దానికి వ్యుత్పత్తి. అర్థం అంటే అందరిచేత కోరబడేది అని మనం గ్రహించవచ్చు. ప్రయోజనము, క్రియాశీలత, కృషి అనే విషయాల్లో కూడా అర్థ శబ్దం ప్రయోగించబడుతూ ఉంటుంది.

ప్రతి మనిషికీ పనియెడల ఆసక్తి, క్రియాశీలత అవసరమని, కోర్కెలను తీర్చగల శక్తి క్రియాశీలత వల్లనే సమకూరుతుందని, శ్రమైక జీవనమే మానవజన్మకు

పరమ ప్రయోజనమని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. పురుషార్థాలలో ద్వితీయమైనదైన 'అర్థం' నిజానికి అద్వితీయమైనది. జనతకు పురుషార్థాలు ప్రధానమై నప్పటికీ అర్థ, కామ, మోక్షాలు ధర్మయుతంగానే ఉండి తీరాలని, ధర్మబాహ్యమైన అర్థ,కామ, మోక్షాలు వికృత ఫలితాలిస్తాయని పెద్దలు హెచ్చరించారు.

ఈ పురుషార్థమే తక్కిన ప్రాణికోటి నుండి మనల్ని వేరు చేస్తోంది. అన్ని ప్రాణుల ఆహార అవసరాలకు వలసిన సంపత్తి కొంతమేర పరిశ్రమలో ప్రకృతిలో సహజం గానే లభ్యమౌతోంది. కానీ మానవాళి పరిస్థితి అలాకాదు. ఆహారంతో పాటు ఇల్లు, దుస్తులు, వసతులు.. ఇలా అనేకం మన జీవన సౌఖ్యాలకు అవసరమౌతున్నాయి. ఇవన్నీ ప్రకృతిలో అట్టే దొరకవు. మనం తయారు చేసుకోవాలి. లేదా ఇతరులు, నిపుణులు చేసిన వాటిని సమకూర్చుకోవాలి. ఈ క్రమంలో జరిగే వనరుల సమీకరణ, సంపాదన కూడా ధర్మయుతంగానే ఉండాలని మన సారస్వతం ప్రబోధిస్తోంది. 'న్యాయోపార్జిత విత్తేన/ కర్తవ్యం హ్యాత్మరక్షణం/అన్యాయేనతు యోజీవేత్/సర్వకర్మ బహిష్కృత:' అని పరాశర స్మృతి వివరిస్తోంది. న్యాయంగా సంపాదించుకున్న ధనంతోనే మనల్ని మనం పోషించు కోవాలి. అన్యాయార్జితంతో ఎవరైతే జీవనం చేస్తుంటారో అలాంటివారు సకలకర్మలనుండి బహిష్కృతులులౌతారట. అర్థానికి అనేక విశిష్టతలు కూడా చెప్పబడ్డాయి.యస్యార్థ స్తస్య మిత్రాణి... యస్యార్థ స్తస్యబాంధవా:/యస్యార్థ స్తస్య ప్రమాన్‌లోకే..యస్యార్థ స్తస్య పండిత:/ యస్యార్థ స్తస్యవిక్రాంత: యస్యార్థసచ బుద్ధిమాన్/యస్యార్థ నమహా భాగో.. యస్యార్థ న మహాగుణ: అని రామాయణం సూచించిన విషయమిది. సంపదలు కల వారికే స్నేహితులు, బంధువులు మిక్కిలిగా సమకూరు తారట. సంపదలతోనే గొప్పవారిగా గణుతికెక్కుతారట. సంపదలుగలవారి వద్దనే పాండిత్య, పరాక్రమాలు జతకడ తాయట. సంపదలతోనే మహాత్ములుగానో.. మహా గుణోపేతునిగానో మన్ననలందుకుంటామట. విషయం ఎంత సార్వకాలీనమైనదో గమనించండి. ఇవాల్టికీ ఇదే లోకనీతి.

గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతున్నట్లుగా లోకం విత్తం చుట్టూ పరిభ్రమిస్తుంటుంది. సంపదల అవసరాన్ని చెప్పిన మన ఇతిహాసాలే సంపదలు ఒకవేళ మితిమీరినా, ధర్మబాహ్యమైనా అనర్థదాయకాలౌతాయని, అవి ఒక్కొక్క సారి కలహానికి సైతం దారితీస్తాయని హెచ్చరిస్తున్నాయి.

దశహస్తేన సమీకర/సహస్ర హస్తేన వినిమయ అంటూ అపౌరుషేయ వాఙ్మయం సర్వులను శక్తివంచన లేకుండా కష్టపడి పదిచేతులా సంపాదించమని, ఆ సంపాదనను మన చుట్టూ ఉన్న ప్రాణికోటికి ప్రపంచానికి ఆనందం కలిగించడం కోసం వెయ్యి చేతులతో ఖర్చు పెట్టమని చూచిస్తున్నాయి. ఎదుటి వారి ఆకలి తీర్చలేని, పదుగురికి సాయపడలేని సంపద వృధా అవుతుందని, బంధీకృతం చేయబడిన విత్తం ఆనందసంధాయకం కాజాలదని వేదం ప్రబోధిస్తోంది.

'విద్యమానే ధనే లోభాత్/దాన భోగ వివర్జితమ్/ పశ్చాన్నాస్తీయ యోభ్రూయాత్/సోక్షయం నరకం వ్రజేత్' ఎవరైతే ధనం ఉండికూడా దాన భోగ వివర్జితులై, లోభియై,కటిక పేదలను సైతం యీసడించుకుంటూ జీవిస్తుంటారో అలాంటి వారు నిరంతరం నరకాన్ని అనుభవిస్తారని హితోపదేశం సూచిస్తోంది. విత్త ప్రీతి అనేది ధర్మయుతంగానే కాకుండా ఒక నియతి ప్రకారంగా కూడా ఉండాలట.నియతిలేని ధనకాంక్షఖేదదాయకమౌతుం దట. ఎవరు జీవించి ఉంటే తన దాన ధర్మాదికాలవల్ల పదుగురికి జీవిక కలుగుతుందో అట్టివారి జీవితమే అసలైన జీవితమని విక్రమార్క చరిత్ర వివరిస్తోంది. ఒక కోతి గ్రామ వీధుల్లో సంచరిస్తూ.. ఆకలికి తాళలేక చాలా జాగ్రత్తగా గమనించి యజమాని ప్రక్కకు వెళ్ళి నిర్జనంగా ఉన్న ఒక కిరాణా అంగడిలో ప్రవేశించిందట. కోతి ఆకలి తీరేందుకు అక్కడ చాలా పదార్థాలే ఉన్నాయి. ఎక్కువ ఉన్నాయి కనుక ఎంపిక మొదలైంది. కోతికి అనేక ఆలోచనలు సమయం గడిచిపోతుండగా ఒక సన్నని

మూతిగల పెద్ద సీసాలో జీడిపప్పులు కనిపించాయి. చాలా సంబరపడింది. కొన్ని తడవలుగా పట్టినన్ని పప్పులు తిన్నది. అంతలో అక్కడకు తిరిగివచ్చిన యజమాని కోతిని చూశాడు. కోతిని తరిమేందుకు కర్రపుచ్చుకున్నాడు. పరిస్థితిని గమనిస్తూ కూడా కోతి జీడిపప్పుపై వ్యామోహం వదులుకోలేకపోయింది. అత్రం మరింత పెరిగి గుప్పెట నిండా జీడిపప్పులు పట్టుకుంది. ఈ గుప్పెడు జీడిపప్పుతో పారిపోవాలని ప్రణాళిక వేసుకుంది. సీసా మూతి సన్నగా ఉండడంతో కోతి బైటకు రావడంలేదు. చేతిలో పప్పును వదిలేస్తే కోతి సునాయాసంగా వెళ్ళిపోవచ్చు. అసలే చౌర్యం... దానితో పాటు అపరిమిత అర్థాపేక్ష కోతికి యజమాని చేత చావు దెబ్బలు తెచ్చి పెట్టింది. అర్థ సంపత్తి కోసం అర్రులు చాచకుండా, ధర్మవర్తనతో, ఓర్పుతో, కృషితో క్రమానుగత వృద్ధి కోసం ప్రయత్నించాలని హితోపదేశం ప్రబోధిస్తోంది. జలబిందు నిపాతేన/ క్రమశ:పూర్వతేఘట:/సహేతు స్సర్వ విద్యానాం/ ధర్మ స్యచ, ధనస్యచ ఒక్కొక్కు నీటి బొట్టుతో క్రమంగా కుండ నింపినట్లు విద్యలనుగాని, ధర్మాన్ని గాని, ధనాన్నిగాని ఓరిమితోనే సాధించుకోవాలి. అదే శ్రేయోదాయకము అంటూ మన పెద్దలు చెప్పిన సుద్దులు సదా స్మరణీయాలు.

కామము :

ధర్మ, అర్థ, కామ, మోక్షములుగా చెప్పబడే చతుర్విధ పురుషార్థాలలో వేటికవి అత్యంత కీలకమే అయినప్పటికీ కడపటి మూడునూ ధర్మంతో కలిసి ఉంటేనే రాణిస్తాయని, జనజీవనం ధర్మయుతంగా జరగడమే శాంతి సౌభాగ్యాలనిస్తుందని పెద్దలు ప్రవచించారు. పురుషార్థాలలో మూడవదిగా చెప్పబడే కామము అత్యంత కీలకమైనది కూడా.

'కామ్యతే అనేన ఇతికామ:' కోరబడేదానికి కోరిక అంటారు. లౌకికంగా ఈ పదం మరింత విస్తారమై, విశృంఖలమై, దోషభూయిష్టమైనదిగాను, గర్హనీయమైనదిగాను, ప్రమాదకారిగాను గుర్తించబడుతోంది. పురుషార్థాలలో చెప్పబడిన కామానికి, అరిషడ్వర్గాలలోని కామానికి వ్యత్యాసం ఉంది. కోరిక ధర్మయుతంగా ఉంటే అది పురుషార్థ కామము, కోరికలు అనుచితంగాను, ధర్మబాహ్యంగానూ ఉన్నట్లయితే అది అరిషడ్వర్గ కామము అని విజ్ఞతతో మనం గ్రహించవచ్చు. కోరికలను సుఖాలకు ప్రవేశద్వారాలుగా పెద్దలు నిర్వచిస్తూ ఉంటారు. మనల్ని పుట్టుకనుండి మరణం దాకా కోరికలు వెంటాడుతూనే ఉంటాయి. కోరికలపైనే జీవితం ఆధారపడి ఉంటుంది.ఒక దశలో కోరికలే మనల్ని నడిపిస్తుంటాయి. మానవుల పురోగతైనా, అధోగతైనా కోరికలపైన, వాటి ఫలితాలపైన ఆధారపడి సంభవిస్తూ ఉంటుంది.

మన కోరికలలో, మన సంకల్పంలో పవిత్రత ఉండి తీరాలి. జ్ఞానవంతులం కావాలని కోరుకోవచ్చు. మంచి వారిగా పదుగురి మన్ననలు పొందాలని కాంక్షించవచ్చు. సత్కర్మల ద్వారా జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనం అభిలషించవచ్చు. కృషిద్వారా, శాస్త్రవిజ్ఞానం ద్వారా మన సమాజానికి ఇతోధిక మేలు చేయాలని సంకల్పించవచ్చు. చీకాకులులేనటువంటి ఆనందమయ, ఆరోగ్యమయ జీవితాన్ని ప్రశాంతంగా అనుభవించాలని, గుర్తింపు పొందాలని ఆశపడవచ్చు., తప్పు కాదు. ఐతే మన కోరిక సాధనకు చేసే ప్రయత్నం ధర్మయుతంగానే సాగాలి. ధర్మయుత ప్రయత్నంద్వారా కామితాలు తీర్చుకునేందుకు సంకల్పించాలి. అందుకు అవసరమైన మనోబలాన్ని ధర్మమూర్తుల ఆదర్శజీవనం ద్వారా, సత్సాంగత్యం ద్వారా, ఇతిహాస ప్రమాణాల ద్వారా స్వీకరించాలి. ఇలా పొందిన ధార్మిక జీవనశక్తిని 'సంస్కారం' అంటారు. ఉత్తమ సంస్కారంగలవారి కోరికలు తప్పకుండా ఉత్తమంగానే ఉంటాయి. అప్రయత్న సుఖాలను ఉత్తములు ఆశించరు. స్థిరచిత్తంతో, లోకహితం కోసం ఉత్తములు విద్యుక్తధర్మాచరణ చేస్తూ ఫలితాలను ప్రసాదభావనతో స్వీకరిస్తుంటారు. అలాంటి నైష్ఠికులను ధర్మవేత్తలుగా పెద్దలు నిర్వచిస్తుంటారు. ధర్మ రహితమైన కామానికి వశమైన వారు ముందుగా తమ ప్రాభవాన్ని, పౌరుషాన్ని

కోల్పోతారు. దు:ఖం ఆవరిస్తుంది. అది మనోబలాన్ని, ధైర్యాన్ని దెబ్బతీస్తుంది. తద్వారా ఏ పనినీ నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

'కిమార్య కామస్య వశం గతేన/ కిమాత్మ పౌరుష్య పరాభవేన/అయంప్రియా
సంప్రియతే సమాధి:/ కి మత్ర యోగేన నివర్తితేన'

రామాయణం కిష్కింధకాండలోని వాల్మీకి మహర్షి శ్లోకమిది. దేవతలు, ఋషులు, గురువులు, మునులు అనబడే బుద్ధిజీవులుసైతం ధర్మరహిత కామ ప్రలోభాలకు చిక్కి ఎలాంటి కష్టాలు అనుభవించాల్సి వచ్చిందో, ఎంతటి అప్రతిష్ట భరించాల్సి వచ్చిందో మన పురాణాలు, ఇతిహాసాలు ఉదాహరణలతో సహా వివరించాయి.

స్త్రీలపట్ల అనుచితమైన కామం వల్ల రావణుడు అనే చక్రవర్తి కుటుంబ, పుత్ర, మిత్ర, బంధు, పరివార సమేతంగా సర్వనాశనమైనాడు. అనుచిత రాజ్యకామం వల్ల కురువంశ సార్వభౌముడు దుర్యోధనుడు అంతరించాడు. అధికారంతోనో ..ఐశ్వర్యంతోనో.. అహంకారంతోనో ప్రజ్వరిల్లిన కామం పతనహేతువౌతుందని భాగవతంలోని గజేంద్రమోక్ష కథ నిరూపిస్తోంది. మనసును జాగృతపరచుకోలేని వ్యక్తులు కామవశులై తాము చేస్తున్న తప్పిదాన్ని గ్రహించగలిగి కూడా ఆత్మోద్ధరణపట్ల అశక్తులై అగ్ని కీలలకు చిక్కిన మిడతల్లాగా జీవితాన్ని ఆహుతి చేసుకుంటుంటారు. 'మంచి-చెడులను' విశ్లేషించడంలో ఆత్మ అత్యంత బలమైనది. ప్రామాణికమైనది కూడా ఆత్మ విచారణ వల్ల చేతనతో బుద్ధిని సంస్కరించుకున్నవారు ఒకవేళ కాలానుగత దోషాలకు లోనైనప్పటికీ వాటిని అధిగమించి సత్కీర్తిని పొందగలుగుతారు. ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించేవారు మాత్రం తాత్కాలిక విజయాలు పొందినప్పటికీ జీవితంలోని ప్రశాంతతను పొందలేరు.

'కామోపభోగ సుఖములు/వేమాఱునుం
బురుషుడనుభవించుచునున్నన్/కామంబు
శాంతి బొందదు/ ధూమధ్వజు డాజ్య వృష్టి

ద్రుంకుడు పడునే' భోగాలకు, సుఖాలకు బానిసలైన వారికి కామమనేది శాంతించదట.నేతితో తడుస్తున్న అగ్నిలాగా కోరికలు ప్రజ్వరిల్లుతూ ప్రకోపిస్తూ ఉంటాయట. పోతన మహాకవి భాగవతంలో చెప్పిన లోకనీతి యిది.'దశావతార చరిత్ర' అనే కావ్యాన్ని రచించిన కవి ధరణిదేవుల రామయ మంత్రి కూడా సందర్భానుగతంగా కామాన్ని గురించి ' కామము ధైర్యవారణ నికామము, దుర్దమ దుష్క్రియాలతా/రామము, సత్క్రియాధృతి విరామము, క్రోదముఖాది వంచక/క్షేమము,నాస్తికత్వమతి సేమము, దుర్వ్యసనాబ్ధిరాట్సుధా/ధామము, సర్వదుష్ట గుణధామము, దాని బరి గ్రహింతురే, ఎన్నో అవలక్షణాలకు మితిమీరిన కోరికలే కారణమని తెలిసినప్పటికీ, కామం వల్ల లోకనీతి చెడుతుందని, దాష్టీకాలు సంభవిస్తాయని,తద్వారా దు:ఖం వాటిల్లుతుందని గ్రహింపగలిగినప్పటికీ మనం కామ విముక్తులం కాలేకపోతున్నా అంటారు. రామయమంత్రి. కామమే దుర్వ్యసనాలపట్ల కాకుండా లోకహితంపట్ల ప్రవర్తిల్లితే మనసమాజమంతా సంపూర్ణ ప్రేమానురాగాలతో, మానవతతో ప్రగతిశీలంగా వర్ధిల్లుతుంది. మంచి జరగాలన్నా కూడా మంచి జరగాలన్న తాలూకు భావన, లక్ష్యం అవసరం. ఈ సద్భావన సైతం కామమే. 'కామిగానివాడు కవికాదు, రవికాడు/ కామిగాక మోక్షగామికాడు! అని చెప్పిన తత్త్వవేత్త వేమనార్యుని మాటలు సదాస్మరణీయాలు.

మోక్షము :

జనజీవన విధిని క్రమబద్ధీకరిస్తూ చిరయశస్కులను చేయగల ఆచరణ మార్గాలైన పురుషార్థాలలో కడపటిదే కాకుండా అత్యంత కీలకమైంది 'మోక్షం'. పనుల తాలూకు ఫలితాలు ఎలా ఉండాలో ఈ పురుషార్థం సూచిస్తుంది. 'ముచ్ల్మోక్షణే' అనే ధాతువు ఈ శబ్దమాతృక 'మోక్ష: బంధవిమోచనం' బంధవిముక్తే మోక్షం. ఇది పూర్తి మానసికమైనది. పురుషార్థాలన్నీ మనోవాక్కాయ కర్మలనే త్రికరణాల ఏకీకరణతో ఆచరించాల్సినవే అయినప్పటికీ మోక్షం కార్యసాఫల్యతకు సంబంధించిన ఆత్మతృప్తికి

సంకేతంగా నిలుస్తుంది. దు:ఖాలనుండి, పాపాలనుండి మనలను విడిపించేది అనే అర్థంలో 'అమరకోశం' లో మోక్షశబ్దం చెప్పబడింది. ముక్తిఅని, కైవల్యమని, సాయుజ్యమని, పునరావృత్తిరాహిత్యమని అనే అర్థాలలో ప్రయోగించబడే ఈ శబ్దానికి 'మోహాన్ని విడిచిపెట్టడం' అనేదే స్థూల అర్థం. కపిలమహర్షి కూడా తాపత్రయ నివారణమే మోక్షం అంటూ వివరిస్తారు.

మోక్షమంటే పరిపూర్ణమైన మనశ్శాంతి అని యోగుల అభిమతం, మోక్షసాధన పొందగల పరిపక్వత తొలి మూడు పురుషార్థాలైన ధర్మార్థకామాలను సక్రమంగా ఆచరించడం ద్వారానే పొందగలుగుతాం.

మోక్షాన్ని తురీయపురుషార్థం అని చెబుతారు. వచ్చే జన్మకై వలసిన సంపద అని మోక్షాన్ని చాలామంది భావిస్తుంటారు. కొందరు మోక్షాన్ని మరణమనుకుంటారు. మోక్షమంటే చచ్చిసాధించేదికాదు. బ్రతికి మనదైన జీవనం ద్వారా అనుభవించాల్సింది. అనుభూతి చెందాల్సింది.

మోక్షాన్ని అనుభూతి చెందడం అంటే అంత సులువైంది కాదు. ఈ అనుభవానికి, అనుభూతికి ఆత్మజ్ఞానం కావాలి. మనలో ఆత్మజ్ఞానపరమైన పరిణితి కావాలి. విషయవాంఛలపై వైరాగ్యభావన ఏర్పడాలి. ప్రకృతిని, ప్రాణులను సమానంగా చూడగల, పరుల కష్టాలను తనవిగా భావించగల సహృదయత అలవడాలి. ఇతరుల ఆనందాలకు సైతం అనుభూతి చెందగల, పరవశించగల పరిపక్వత సిద్ధించాలి.

తనను అయోధ్యకు తిరిగిరమ్మని ఆహ్వానించేందుకు భరతుడు చిత్రకూటపర్వత ప్రాంతంలో శ్రీరామచంద్రుని వద్దకు వెళ్ళగా రాముడు ప్రేమతో తమ్ముణ్ణి అనునయిస్తూ ఉపనిషత్తుల సారాన్ని, జీవిత స్వభావాన్ని కర్తవ్యవిధులను... ఇంకా అనేకానేక ధర్మాలను, ధర్మసూక్ష్మాలను చెబుతాడు. గడచిపోయినకాలం తిరిగిరాదని. అహోరాత్రాలు నిరంతరం మన ఆయుష్షును తగ్గిస్తుంటాయని, మనం నిలిచినా, నడచినా... చేతనంగా వున్నా, అచేతనంగా వున్నా ఆయుర్దాయం తగ్గకమానదని మృత్యువు ప్రతివారినీ వెంటాడుతూనే ఉంటుందని, విధిని ధిక్కరించడం ఎంతటివారికైనా అసాధ్యమని ప్రబోధిస్తాడు. విస్తారమైన నీటిప్రవాహంలో కొన్ని కట్టె పుల్లలు కలసి కొంతదూరం అలలతో తేలుతూ ప్రయాణించి, తిన్నగాకొన్ని మలుపుల్ని సైతం అధిగమించి గమిస్తూ... గమిస్తూ ఎక్కడో ఒకచోట విడిపోతుంటాయని, బాటసారులగుంపు వెళుతుండగా త్రోవలోని యాత్రీకులు గుంపుతో కలసి ప్రయాణిస్తుండే విధంగా తాతముత్తాతల జీవనమార్గంలో మనంసైతం యాత్ర సాగిస్తుంటామని, అయితే జన్మగతమయిన కాలప్రయాణంలో మనవిధులు, బాధ్యతలు సంతోషపూర్వకంగా నిర్వర్తించాలని, కర్తవ్య నిర్వహణలోని తృప్తిని ఆస్వాదించడమే అసలైన మోక్షమని చెబుతాడు.

రామాయణాన్ని నిశితపరిశీలనతో తెలుసుకుంటే మనం జీవితం యొక్క యథార్థస్థితిని తప్పక గ్రహించగలుగుతాము. ఒక్కకుటుంబ బాధ్యతలేకుండా మనకున్న సామాజిక బాధ్యతలు, వాటిని పవిత్ర సంకల్పంతో లోకహితంకోసం నిర్వర్తించే విధానాలు వంటివి తెలుసుకోగలుగుతాం. తద్వారా మోక్షతత్వం కూడా బోధపడుతుంది. శ్రీచింతాదీక్షితులవారి గురించి మునిమాణిక్యం వారు చెప్పిన ఒక చిన్న సంఘటన మోక్షస్వరూపాన్ని మరింత ప్రభావవంతంగా మనముందు ఆవిష్కరిస్తుంది. ఒకసారి ఇంటివసారా అరుగుమీద ఒక గుడ్డ పరుపుకొని చింతాదీక్షితులవారు పడుకొని విశ్రాంతి తీసుకుంటున్నారట. నిశ్శబ్దంగా ప్రకృతిని చూస్తూ విశ్రాంతిలో ఉన్నారాయన. ఆ రోజుల్లో సినిమా ప్రచారరథాలు మైకులు కట్టుకొని చిన్న కరపత్రాలనుకూడా జనానికి పంచుతూ తిరుగుతూండేవి. ఒక్కొక్కసారయితే మైకు ఉండే బండికి ముందువైపు మంగళవాద్యాలు కూడా ఏర్పాటు చేస్తుండేవాళ్ళు. సినిమా హంగామా గ్రామాల్లోకి ప్రవేశిస్తే చాలు పిల్లలంతా ఎగబడేవాళ్ళు, సినిమాబండివాళ్ళు పంచే రంగుల కరపత్రాలకోసం అర్రులుచాస్తూ పరుగులు పెట్టేవారు.

ఆరోజున అలాగే సినిమా బండి, దానివెంట పిల్లలగుంపు కరపత్రాలకై పరుగులు. పాపం ఒకపిల్లాడికి కరపత్రాలు అందలేదు. బండివెంట పరుగులుతీయలేక నిరాశతో ఏడుస్తూండడం చింతాదీక్షితులవారు చూశారు. పిల్లాడి నిరాశతాలూకు దు:ఖం ఆయన్ను తల్లడిల్లేలా చేసింది. పడుకొని పరీక్షిస్తున్న మనిషి ఒక్కపట్టున లేచి కండువాను నడుముకుచుట్టి పరుగులంఘించి, బండివాడినుంచి కొన్ని కరపత్రాలు అందుకొని ఏడుస్తున్న పిల్లాడికి అందించాడు. కోరిక తీరిన పిల్లాడు సంతృప్తితో దు:ఖాన్ని మింగేస్తూ ముంజేతులతో కన్నీళ్ళు తుడుచుకుంటూ దీక్షితులవారివైపు చూసి ఆనందంగా ఒకనవ్వు నవ్వాడట. పిల్లావాడి సంతృప్తి తాలూకు ఆనందం చింతా దీక్షితులవారిని పరమానంద భరితుణ్ణి చేసింది. ఎంతో తృప్తిగా మళ్ళా అరుగుమీద శయనించారు. అలౌకికమైన మహాదానందమంటే అదే. దాన్నే ఆత్మానందం అని కూడా చెబుతారు. అలాంటి పారవశ్యస్థితినే మోక్షం అని గ్రహించాలి.

త్రికరణశుద్ధిగా చేసే పనులు, నిస్వార్థసేవ, లోకహితార్థమైన ఆచరణ మనకుకూడా ఇలాంటి అనుభూతినే కలిగిస్తాయి. స్వార్థాన్ని విడిచిపెట్టి ధర్మయుతంగా చేసేపనుల ఫలితాలు తాలూకు తృప్తినే 'మోక్షం' అంటారు.

'త్యాగమొక నెలవు శమనం/యోగంబుత్తరము. దాని కూర్ప్వముసంతో/షాగమము మోక్షలాభో/ద్యోగికి నివి గమ్యభూములు' అంటారు ఉభయకవిమిత్రుడు తిక్కన సోమయాజి మహాభారతం శాంతిపర్వంలో పెద్దలు సూచించిన ధర్మమార్గంలో చరిస్తూ స్వీయసంస్కృతిని, ఆచారాలను గౌరవిస్తూ, అందరిపట్ల గౌరవమన్ననలతో మసలేవారు, శతృభావనకు తావివ్వనివారు, ఏ మాత్రమూ అలసత్వానికి లోనుకాకుండా నిరంతరం కార్యోన్ముఖులై శ్రమించేవారు, సేవలో తరించేవారు. విధులను కర్తవ్యాలను దైవీభావంతో పవిత్రంగా నిర్వర్తించేవారు. ప్రయత్నం తాలూకు ఫలితాలను కర్మలబ్ధాలుగా ఎరుకతో గ్రహించి స్వీకరించేవారు ముక్తిని అనుభవిస్తున్నవారేనని, మోక్ష మార్గాలంటే అవేనని మన పురాణాలు, ఇతిహాసాలు అనేక ఉదాహరణలతో ప్రబోధిస్తున్నాయి.

ఉపసంహారం :

వేదభూమియైన మనదేశంలో కొన్ని విశిష్టమైన ధర్మాలు, సంప్రదాయాలు అనుశ్రుతంగా గ్రహించబడుతూ, పాటించబడుతూవచ్చాయి. ద్రష్టలైన మహర్షులు అత్యంత గొప్పదైన మానవజన్మను చరితార్థం చేసుకోగల సూక్ష్మమార్గాలను మనకు ప్రభోదించారు. వైజ్ఞానిక దృక్పథంతో మన సాంస్కృతిక వైభవానికి మహోన్నతంగా పట్టం కట్టాల్సిన తరుణంలో, మిడిమిడి జ్ఞానంతో పెద్దల మాటలను వితర్కిస్తూ నానాటికీ మనం దిగజారిపోతూండడం చింతించాల్సిన విషయం. ఉదాత్త జీవనానికి సోపానాలుగా పెద్దలు చెప్పిన హితవచనా లను ఆలకించడం, అనుసరించడం వినా జన్మసార్థక్యానికి మరో మార్గంలేదు. ప్రపంచానికే జ్ఞానభిక్షపెడుతూ, గురుపీఠంగా ఆరాధించబడుతున్న మన భరతదేశంలో ప్రజానీకం సుప్త చేతన ప్రేలాపనలనుండి విముక్తమై జాగృతి పొందుతారని ప్రగాఢనమ్మకం. చీకట్లుభేదిస్తూ వచ్చే వెలుగులా మన అజ్ఞానం తొలగడం అనివార్యం. శుభ ఘడియలకై నిరీక్షిద్దాం!

ఉపయుక్త గ్రంథాలు :

1. స్వధర్మ సర్వస్వము - కె. రామకృష్ణారెడ్డి
2. భారతీయ సంస్కారములు - దేవరకొండశేషగిరిరావు
3. భారతీయ తత్వశాస్త్రం - డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ
4. హిందూ మతము - జటావల్లభుల పురుషోత్తం
5. వేదాలలో వైజ్ఞానిక విశేషాలు - కుప్పా వేంకటకృష్ణమూర్తి
6. ఆత్మసాక్షాత్కారము - భగవాన్ శ్రీరమణమహర్షి
7. శ్రీమదాంధ్రామహాభారతము - కవిత్రయ ప్రణీతము - తి.తి.దే ప్రచురణము.

❖

యయాతి చరిత్ర – ధర్మార్థకామమోక్షాలు

– డా॥. ఎన్. దీపిక, సహాయాచార్యులు, తెలుగు విభాగం, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ.

భారతీయ జీవన విధానానికి ఒక ప్రత్యేకత ఉంది. హైందవ ధర్మం ప్రతి మనిషి చతుర్విధ పురుషార్థాలనే నాలుగు గమ్యాలు కలిగి ఉండాలని సూచిస్తుంది. భారతీయ సంస్కృతిలో పురుషార్థాలకు ప్రాముఖ్యత ఎక్కువ. జీవితంలో ప్రతి సందర్భాన్ని ఆనందంగా మలచుకోవాలన్నా సృష్టిలోని ప్రతి పార్శ్వాన్ని దర్శించాలన్నా, ఆస్వాదించాలన్నా ప్రతి మనిషి ఈ నాలుగు పురుషార్థాలకు కట్టుబడి ఉండాలి. అవే ధర్మార్థకామమోక్షాలు. మానవ జీవన వికాసానికి ఇవే ప్రధానమైనవి. మొదటి మూడు గృహస్థాశ్రమ ధర్మాలు. అనగా గృహస్థులు పాటించవలసిన ధర్మాలు. వ్యక్తి ధర్మానికి బద్ధుడై ధనాన్ని సంపాదించాలని, తద్వారా సుఖాలు అనుభవించాలని అంటారు. కనుకనే "ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి" అని పెళ్ళిలో ప్రమాణం చేయించబడుతుంది. వానప్రస్థాశ్రమంలో భార్య, భర్త కలిసి ఉంటూనే లౌకిక భోగాలకు దూరంగా ఉండి, మోక్షార్థులై జపతపాదులు నిర్వహించవచ్చు. పురుషార్థాల్లో ప్రధానమైన ధర్మం, అర్థం, కామం ధర్మబద్ధంగా ఉన్నప్పుడే మోక్షమార్గం సులభమౌతుంది. సన్యాస ధర్మం అనగా మోక్షమును మాత్రము కోరుతూ మిగిలిన మూడు పురుషార్థాలను త్యాగం చేయడం. ఈ నాలుగు పురుషార్థాలు మహాభారతంలోని యయాతి పాత్ర యందు చూడవచ్చు.

ఇంద్రపదవి నలంకరించిన నహుషుడి కుమారుడు, మహాజ్ఞాన సంపన్నుడు యయాతి మహారాజు. ఇతడు ఇబ్బందిలో నున్న దేవయానిని వివాహమాడి ఆమె వలన ఇద్దరు పురుష సంతానాన్ని పొందుతాడు. తరువాత దేవయాని సేవిక రాక్షసరాజు వృషపర్వుని కూతురైన శర్మిష్ఠతో కూడి ముగ్గురు పురుష సంతానాన్ని పొందుతాడు. శుక్రాచార్యుని శాపం వలన వచ్చిన తన ముసలితనాన్ని తన కుమారునికిచ్చి, అతని యవ్వనాన్ని పొంది దేవయానితో అనేక సంవత్సరాలపాటు సుఖాలను అనుభవిస్తాడు. చివరకు తన పుత్రుని వద్దనున్న తన వార్ధక్యాన్ని తిరిగి పొంది, వేల సంవత్సరాలు తపస్సు చేసి స్వర్గలోకము నందు అనేక భోగాలను అనుభవించాడు. చివరకు ఇంద్రునిచే శపించబడి నక్షత్రలోకమునందు ఉండిపోతాడు.

యయాతి – ధర్మము :

నూతిలోనున్న దేవయానిని రక్షించే క్రమంలో యయాతి కేవలం దయ కలిగినవాడై ఆమెను నూతి నుండి బయటకు లాగి రక్షించి తన మార్గమును తాను పోయాడు. ఇచ్చట ఎంతో ధర్మయుక్తంగా ప్రవర్తించాడు. దేవయాని బ్రాహ్మణ కన్య కనుక ఆమె పట్ల ఎటువంటి ప్రేమ భావాన్ని వ్యక్తపరచక పోవడం వలన రాజు వర్ణధర్మాన్ని కాపాడినట్లు చెప్పవచ్చు.

శుక్రాచార్యుడు శర్మిష్ఠపై కోపంగా ఉన్న దేవయానితో ఇలా అంటుంది.

అలిగిన నలుగక, యెగ్గులు
పలికిన మఱి విననియట్ల ప్రతివచనంబుల్
పలుకక, బన్నము వడి యెడఁ
దలఁపక యున్నతఁడె చూవె ధర్ముజ్ఞుఁ డిలన్.

"ఇతరులు కోపిస్తే కోపించకుండా, ఇతరులు నిందలు పలికితే మరి వాటిని వినట్లే మారుపలుకక, అవమానం పొందికూడ హృదయమందు తలవకుండా ఉన్నవాడే భూమి యందు ధర్మమెరిగినవాడు" అనీ, "శర్మిష్ఠ వయసులో చిన్నది, రాజకుమారి. దానితో ఏంటని" ధర్మవర్తనం గూర్చి తెలియజేస్తాడు.

దేవయాని చెలికత్తెలతో కూడి ఉన్న సమయంలో రెండవసారి దేవయానిని చూసిన యయాతి మహారాజు, శర్మిష్ఠ మొదలగువారి వివరములడుగు సందర్భంలో

తనను వివాహమాడమని దేవయాని యయాతిని కోరుతుంది. అట్టి సందర్భంలో క్షత్రియుడైన యయాతి బ్రాహ్మణ కన్య అయిన దేవయానిని వివాహం చేసుకొనలే నని అంటాడు. అన్ని వర్ణాల యొక్క, ఆశ్రమాల యొక్క ధర్మాలు కాపాడే యయాతి అట్టి పని చేయలేనని గట్టిగా చెప్పడం వలన అతనిలోని ధర్మనిష్ఠ, రాజుగా అతని నిబద్ధత ప్రస్ఫుటమవుతుంది.

ధర్మాధర్మ నిర్ణయం శాస్త్రప్రకారం చేయబడుతుంది. ఇక్కడ శాస్త్రకారుడి వంటి శుక్రాచార్యుడు చెప్పింది ధర్మవిరుద్ధంగా ఉండదని లోకులు విశ్వసిస్తారు. శుక్రా చార్యుడు దేవయాని అభిమతానికి విరుద్ధమైన ధర్మం చెప్పడు. కాబట్టి యయాతి చేత ముందే కరగ్రహణం చేయబడిన దేవయానిని మరొకరు పాణిగ్రహణం చేయ డానికి వీలులేదని, ఆ విధంగా జరిగితే ధర్మవిరుద్ధమని, అధర్మ వైరుధ్యాన్ని తొలగించడ మంటే ఈ జన్మకు "యయాతియే దేవయాని భర్త" అని నిర్ణయమయ్యే విధంగా దేవయాని తన గడుసరితనాన్ని ప్రదర్శించి శు క్రాచార్యుడి ద్వారా 'అధర్మ దోషం లేకుండా' వరం పొంది అతని ద్వారానే యయాతికి చెప్పించింది. గురువు మాట మీద గౌరవంతో యయాతి దేవయానిని వివాహం చేసుకోవడం ద్వారా అతనికి పెద్దలమీద ఉన్న భక్తి ప్రపత్తులు, ధర్మంపై ఉన్న విశ్వాసం వ్యక్తమవుతుంది.

శర్మిష్ఠ మనసులో యయాతిని భర్తగా భావించుకొన్న సందర్భంలో "ఈ రాజునంద నా హృదయంబు దవిలి" అనే తరువోజ పద్యంలో లోకం యొక్క భారం వహించే వాడు, ఇతరులకు మేలు చేసేవాడు, ధర్మము నందాసక్తి గలవాడు, ధర్మానికి కట్టుబడినవాడు కనుక అతనిని పొందాలనుకుంటుంది.

శాస్త్రవిహితమైన కర్మలు చేయడం, ప్రతి జీవియందు దయ కలిగి ఉండడం, సత్య వాక్యం పలకడం శ్రేష్ఠమైన ధర్మాలు అనబడతాయి. క్షత్రియ ధర్మం, ఇతరులకు ఇబ్బంది కలిగించని నడవడిక, సజ్జనులకు హాని కలిగిం చని ధర్మాలు యయాతి పాటించాడు. కాబట్టి యయాతి ధర్మ పురుషార్థాన్ని సాధించినవాడేనని చెప్పవచ్చు.

యయాతి – అర్థము :

పురుషార్థాలలో రెండవది అర్థం. "ధనం మూల మిదం జగత్" అని చెబుతుంది నీతిశాస్త్రం. మనిషి జీవనానికి తప్పనిసరి అయినది. అర్థం మనిషిని మాయామోహితుని చేస్తుంది. అందుకే అర్థం ఎంత అవసరమో అంతే పొందాలి. ఈ ధనాన్ని ధర్మమార్గంలో సంపాదిస్తూనే తనకు ఇతరులకు వినియోగపడేలా చూసుకోవాలి. మితిమీరిన ధనం మనిషిని అశాంతికి గురిచేస్తుంది. ధనం అంటే కేవలం బంగారమో, డబ్బో, రత్నరాశులో కావు. కొందరికి తపస్సు ధనం, మరికొందరికి జ్ఞానం ధనం, ఇంకొందరికి ఆరోగ్యం ధనం, కొంతమందికి ధర్మం ధనం, మరికొంత మందికి కీర్తి ధనం. యయాతి మహారాజు. కనుక అతను ప్రత్యేకంగా అర్థ సంపాదన చేయవలసిన అవసరంలేదు. ప్రజలకు ఏ ఆర్థిక ఇబ్బందులు లేకుండా, పన్నుల భారం లేకుండా పరిపాలన చేశాడు. కీర్తివంతమైన పాలన సాగించాడు. అర్థం అంటేనే కర్మ ఫలితం. ఏదో రూపంలో ధర్మనిర్వహణ చేసినవారికి ఇది చెందుతుంది. యయాతి తన జీవిత కాలంలో గొప్ప తపస్సు చేసి బొందితో స్వర్గ ప్రాప్తిని పొంది, స్వర్గలోకమందు ఎనలేని కీర్తిని గడించి, నక్షత్రలోకంలో ఉండగలిగాడు. ఇదే ఇతను సాధించిన రెండవ పురుషార్థం అర్థం. ఇది ధర్మంతో కూడిన అర్థమేనని చెప్పవచ్చును.

యయాతి – కామము :

పురుషార్థము లందు అతి సంక్లిష్టమైనది కామము. ఇది పురుషార్థము లందేకాక అరిషడ్వర్గములందు కూడా కలదు. కనుక దీనిని సాధించుటలో మనిషి మిక్కిలి జాగరూకుడై ఉండాలి. కోరిక లేక కర్మ లేదు. గృహస్థా శ్రమ ధర్మము నందు అతి ముఖ్యమైనది ఈ పురుషార్థం. సంతాన ప్రాప్తిని పొంది, లోకము నందు మానవ మను గడకు, సద్గతిని పొందడానికి అవకాశము కలిగించేది ఈ పురుషార్థమే.

ధర్మయుతమైన కామమే యయాతి యందు చూడగలము. దేవయానిని వివాహం చేసుకొనుట

యందు, ఆమె వలన సంతానం పొందుటకును వాంఛను కలిగి ఉండాలి కనుక అట్టి కోరిక కూడా ధర్మంతో కూడినదని శుక్రాచార్యుడు చెప్పిన అనంతరమే ఆమెను వివాహమాడి, ఆమె వలన సంతానాన్ని పొందుతాడు.

శర్మిష్ఠ యయాతి యందు మనసుపడి, నా యజమానురాలైన దేవయానికి భర్త కాబట్టి నాకు కూడా నీవే భర్తవు. ఇది ధర్మ మార్గమని చెబుతూ ఈ లోకంలో భార్య, సేవకురాలు, కుమారుడు అనేటటువంటివి విడువని పరస్పర ధర్మాలని, అంతేకాకుండ

వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణ విత్తమాన భంగమందుఁ
జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొందడధిప

ప్రాణాలకు హాని కలిగినపుడు, ధనం అపహరింపబడే సమయంలో, వధించేందుకు సిద్ధంగా ఉన్న బ్రాహ్మణుడిని రక్షించేటప్పుడు, స్త్రీజనసమాగమ విషయంలో, పెళ్ళి వేళలందు అసత్యమాడవచ్చునని ఒప్పుకునేటట్లుగా వివేకాన్ని ప్రదర్శించి, అతని ద్వారా ముగ్గురు పుత్ర సంతానాన్ని పొందింది. ఈ విధంగా చూస్తే యయాతి మహారాజు యొక్క కామవాంఛలు ధర్మయుక్తములైనవే నని భావించవచ్చు.

యయాతి – మోక్షము :

పురుషార్థాలలో నాల్గవది, చివరిది మోక్షము. యయాతి జీవితంలో ధర్మయుతమైన నడవడిక మోక్ష సాధన కొరకే అన్నట్లుగా ఉన్నది. తేజస్సు యొక్క మహాత్మ్యం చేత, స్వర్గలోక పుణ్యంచేత, స్వర్గాది లోకాలలోని సౌఖ్యాలననుభవించి, ఇంద్రునిచేత, మనుమలచేత వందల యేళ్ళు గొప్పగా కీర్తించబడినవాడు యయాతి.

యయాతి తన కుమారుడైన పూరుడికి అంత: బహిశ్శత్రువుల సముదాయాల్ని జయించే మార్గాలను బోధించానని ఇంద్రునికి తెలుపగా "ఏం తపస్సు చేశావు, వందల యేళ్ళు స్వర్గలోక పుణ్యంచేత స్వర్గాదిలోకాలలో సౌఖ్యం అనుభవించావు. ఇది అసాధారణము" అని ఇంద్రుడు పలుకగా "దేవతలు, దైత్యులు, యక్షులు, రాక్షసులు, మానవులు, ఆకాశ సంచారులు, సిద్ధులు, మునులు చేయ శక్యంగాని తపస్సు చేశాను. వీరి తపస్సులేవి నా తపస్సుతో సమానం కావు" అని చెప్పాడు.

యయాతి గర్వానికి ఇంద్రుడు కోపించి శపించడం, ఆ శాపము, కోపము సమంజసమని తన తప్పును తెలుసుకొని అంగీకరించిన ఉదాత్త స్వభావం కలవాడు. ఇదే విషయాన్ని తన మనుమలైన 'అష్టకాదులకు' చెప్పి తన లోపాన్ని గ్రహించిన ఔదార్యం కలవాడు. ఇష్టం లేకపోయినా కష్టమని చెప్పకుండా, దేవయానిని భార్యగా స్వీకరించిన ధీరుడు. మనసు లగ్నమైనా, శర్మిష్ఠను స్మరించకుండానే కార్యసిద్ధిని పొందిన ఘనుడు. క్షత్రియ ధర్మపరంగా జీవితాన్ని గడిపి, కోరికలను తీర్చుకొని, చివరకు తననితాను తెలుసుకొన్న మోక్షగామి.

మోక్షానికి పునాది కూడా ధర్మమే. ధర్మార్థ కామాలకు కుటుంబంతో, సమాజంతో సంబంధాలుండాలి. కాని మోక్షం మాత్రం పూర్తిగా వ్యక్తిగతమే. ఇచ్చట యయాతి తన ప్రయత్నంతో ఈ నాలుగు పురుషార్థాల మధ్య దిశానిర్దేశం చేసుకుని జీవన సాఫల్యాన్ని పొందాడనడంలో ఎలాంటి సందేహం లేదు.

❖ ❖ ❖

మోక్షానికి భక్తి సోపానం

– డా॥. ఎం. లక్ష్మకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం), బేగంపేట్, హైదరాబాద్.

భగవంతుని సృష్టిలో 84 లక్షల జీవరాశులు సృష్టింప బడ్డాయి. అవి చరములు, అచరములు అని రెండు విధాలుగా ఉన్నాయి. కొండలు, చెట్లు అచరములు. నీటిలో ఈదేవి, గాలిలో ఎగిరేవి, భూమిమీద తిరిగేవి అని మూడు రకాల జీవులు చరములు. చరించే జీవులలో ఉద్భీజములు, అండజములు, స్వేదజములు, జరాజయ ములు అని నాలుగు విధాల జన్మలు. మనిషి జరాజ యము నుండి అంటే మావి నుండి జన్మించే జీవి. మాన వుడు ఐదు కర్మేంద్రియములు (కాళ్ళు, చేతులు, నాలుక, పాయువు, ఉపస్థ), ఐదు జ్ఞానేంద్రియములు (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం), ఐదు వాయువులు (ప్రాణ వాయువు, అపాన వాయువు, వ్యాన వాయువు, ఉదాన వాయువు, సమాన వాయువు), ఐదు తన్మాత్రలు, నాలుగు అంతరింద్రియములు (బుద్ధి, తనువు, మనస్సు, అహంకారము) మొత్తం 24 రకములైన అవయవములతో నిత్యము అనేక కర్మలను చేస్తూ పుణ్యపాపములను సముపార్జించుకుంటాడు.

సృష్టి అంతా ఆవరించివున్న చైతన్యమే పరమాత్మ, ప్రతిజీవిలో అంతర్భూతమై వుండేది జీవాత్మ. ఈ జీవాత్మ పరమాత్మలో ఐక్యమొందడమే మోక్షప్రాప్తి. పుణ్యపాప ముల సమస్థితే మానవజన్మ. మనిషిగా పుట్టి మనం చేసే పనుల ఫలితంగానే ముక్తి లేదా పునర్జన్మ ఆధారపడి వుంటుంది. మోక్షం పొందాలని అందరి మనసులోను ఉంటుంది. కానీ ప్రయత్నము చేయలేక ఆ ఆలోచనను వదిలిపెడతారు. మోక్షం సులభ దుర్లభము. "ఆత్మ వత్సర్వభూతాని" అనే సూత్రాన్ని పట్టుకున్నట్లైతే ముక్తి మార్గము దొరుకుతుంది. సృష్టిలో ప్రతి ప్రాణిని తానుగానే భావించడం ప్రథమ కర్తవ్యం. మనిషి తనను ఒక పురుగు లోనో, కుక్కలోనో, పందిలోనో చూసుకోలేడు. మానవుడు సృష్టించిన అన్ని ప్రాణులలో కెల్ల మానవుడు ఉత్కృష్టుడు. సృష్టిలోని ప్రాణులన్నింటిలోను ఉన్నది ఆత్మ ఒక్కటే. ఆ ఆత్మనే భగవంతుడు అని మనిషి అర్థంచేసుకొనడానికి పెద్దలు కొన్ని విషయాలను చెప్పారు. అవి :

1. ముముక్షుత - బంధనములను విడచుట.
2. విరక్తి - ఇహపర లోకములలోని అవమానము లను, గౌరవములను లెక్కించకుండా ఉండడం.
3. అంతర్ముఖత - జ్ఞానేంద్రియాలతో అంతరాత్మను దర్శించుకోవాలి.
4. పాపవిముక్తి - మనిషి తన దృష్టిని దుర్మార్గము నుండి సన్మార్గము వైపు మళ్ళించాలి.
5. నక్త్రవర్తన - సత్యమును మాట్లాడుతూ, నియమనిష్ఠలతో ఉంటూ, అంతర్ముఖుడై ఉండాలి.
6. మనోవాంఛ - లోకంలో గల ప్రియమైన వాటిని వదిలివేసి, శ్రేయస్కరమైన వాటినే కోరుకోవాలి.
7. నిగ్రహశక్తి - మనస్సును, ఇంద్రియములను స్వాధీనములో ఉంచుకోవాలి.
8. నిరపేక్ష - అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను విడిచి వివేక వైరాగ్యాలను అలవర్చుకోవాలి.
9. సద్గురువును ఆశ్రయించాలి - బ్రహ్మజ్ఞానము లేదా మోక్షమును సాధించాలి అంటే ముందుగా ఆ మార్గములో ప్రయాణిస్తున్న సద్గురువును ఆశ్రయించాలి.
10. భగవత్కటాక్షము - మోక్షం కోరుకునే వారికి కావలసిన ముఖ్యమైన అంశము భగవంతుని యొక్క కరుణతో కూడిన చూపు. ఇహపరాలను, మానావమానములను, దుర్మార్గములను, దుష్ప సాంగత్యమును, ప్రియమైన వాటిని విడిచిపెట్టి,

జ్ఞానేంద్రియాలను స్వాధీనంలో ఉంచుకొని, నిగ్రహశక్తితో నద్గురు సత్సాంసాంగత్యంతో ఉన్నట్లయితే మోక్షము సులభంగా దొరుకు తుంది.

పై పది అంశాలను దృష్టిలో పెట్టుకొని నిరంతరం భగవంతుని ధ్యానంలోను, ధ్యానలోను, కర్మలోను ఆచరించి, ఆ లోకములోని కర్మ ఫలితాల నుండి విముక్తి పొందాలి.

ప్రహ్లాదుడు, ధృవుడు, ఉపమన్యుడు, మార్కండే యుడు, సిరియాళుడు, గొడగూచి, కుబ్జ, మీరాబాయి, శబరి మొదలగువారు పురాణాలలోను ఆధునికయుగం లోను భగవధ్యానంతో ముక్తి పొందినవారు. అన్నమయ్య, త్యాగయ్యు, క్షేత్రయ్య, రామదాసు, తుకారాం మొదలైన ఆధునికయుగ భక్తులు కీర్తనము అనే సాధనముతో దైవాన్ని చేరుకున్నారు. భగవంతుని చేరాలంటే భక్తిమార్గమే ఉత్తమమార్గమని వీరి కథలు నిరూపిస్తున్నాయి.

"శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మ నివేదనం" అని భక్తి తొమ్మిది విధాలుగా ఉంది.

1) శ్రవణం :

భగవంతుని లీలలను వినుట, పరీక్షిత్తు మహారాజు తన అంత్యదశలో భాగవత కథలను విని విష్ణులోకాన్ని పొందాడు. ప్రహ్లాదుడు తల్లి కడుపులో వున్నప్పుడే శ్రీమన్నారాయణుని లీలలను విని గొప్ప భక్తుడైనాడు.

2) కీర్తనం :

నిరంతరం భగవంతుని కీర్తించడం. ఆయన మహిమ లను పాడడం. నారదమహర్షి నిరంతరము శ్రీమన్నా రాయణుని నామాన్ని కీర్తిస్తూ లోకసంచారం చేస్తుంటాడు. ఆధునియుగంలో అన్నమయ్య తన పదాలతో శ్రీ వేంకటేశ్వరుని కీర్తించాడు. రామదాసు భద్రాచల రామ చంద్రుని కీర్తించాడు. త్యాగయ్య, క్షేత్రయ్యలు నిరంతర పదసంకీర్తనలతో తరించారు. మీరాబాయి శ్రీ కృష్ణుని భక్తిలో మునిగి తేలింది.

3) స్మరణం :

భగవంతుని నామాన్ని అనుక్షణం స్మరించడం. ప్రహ్లాదుడు నిరంతరంగా శ్రీమహావిష్ణు లీలలను, శ్రీమన్నా రాయణుని నామాన్ని స్మరించుకుంటూ ఆపదల నుండి తప్పించుకొని చివరకు శ్రీమహావిష్ణువును చేరినాడు.

4) పాదసేవనం :

భగవంతుని పాదాలను ఆశ్రయించి ఉండదు. శ్రీమహాలక్ష్మి ఎల్లప్పుడు శ్రీమన్నారాయణుని పాదాల చెంతనే ఉండి సేవ చేస్తుంది.

5) అర్చనం :

అనునిత్యము భగవంతుని అర్చించి పూజించడం. విష్ణుచిత్తుని కుమార్తె అయిన గోదాదేవి శ్రీరంగనాయకుని పూలమాలతో అర్చించి, వివాహం చేసుకుంది. కుబ్జ సుగంధలేపనాలతో, పుష్పాలతో శ్రీకృష్ణుని అర్చించి అందమైన రూపాన్ని పొందింది.

6) వందనం :

భగవంతునికి వినమ్రులై సాష్టాంగపడుట. దేవునికి త్రికరణశుద్ధిగా నమస్కరించుట. అక్రూరుడు బలరామ కృష్ణులకు చేసిన నమస్కారము వారికి సర్వస్య శరణాగతి చేసి నమ్మిన వందనము.

7) దాస్యం :

భగవంతుడిని స్వామిగా లేదా ప్రభువుగా భావించి, తాను సేవకునిగా లేదా బంటుగా భావించి ప్రవర్తించడం దాస్యభక్తి అవుతుంది. శ్రీరామబంటు హనుమంతుడు, శ్రీమహావిష్ణువు వాహకుడు గరుత్మంతుడు దాస్యభక్తిలో ప్రముఖులు.

8) సఖ్యం :

భగవంతుని సఖునిగా, మిత్రునిగా భావించి పూజించే భక్తి. శ్రీకృష్ణునికి గోపికలు చేసిన సేవ సఖ్యభక్తికి మంచి ఉదాహరణ. శ్రీకృష్ణ సుధాముల మైత్రి, భగవంతుని మిత్రునిగా భావించిన సుధాముడు బంగారు భవనాన్ని పొందాడు.

9) ఆత్మనివేదనం :

మనోవాక్కాయ కర్మలతో భగవంతుని అర్చించుట ఆత్మనివేదనం అవుతుంది. భగవంతుని స్మరిస్తూ, కీర్తిస్తూ, అర్చిస్తూ సర్వస్య శరణాగతి చేసి వేడుకొనుట ఆత్మ నివేదనం. భగవంతునికి తన మనస్సును, పనులను, వాక్కును సమర్పించి అర్చించడం. శ్రీరామకృష్ణపరమ హంస తన జీవితమంతా కాళీమాతను అర్చిస్తూనే గడిపాడు. వివాహం జరిగినా బ్రహ్మచర్యం పాటించాడు. తనను తాను భగవంతుని సేవకే అంకితంచేయుట ఆత్మనివేదన మార్గము.

హిందూధర్మంలో "పరోపకారార్థమిదం శరీరం" అనే మాట ఉంది. మన పురాణేతిహాసాలను పరిశీలించినట్లైతే ఎంతోమంది తమ జీవితాలను ఇతరులకు మేలు చేయడానికే అంకితంచేశారు. దధీచి తన వెన్నెముకను ఇంద్రునికి ఇచ్చి వజ్రాయుధం తయారుచేయించాడు. శిబిచక్రవర్తి పావురం కొరకు తన తొడ మాంసాన్ని ఇచ్చి రక్షించాడు. ఎవరైతే ఇతరులకు నిస్వార్థంగా సహాయం చేస్తారో వారు భగవంతునికి ప్రీతిపాత్రులై మోక్షం పొందుతారు. మానవ సేవే మాధవ సేవగా భావించ వలెనని ధర్మం సూచిస్తుంది. తన కొరకు దాచుకోకుండా ఇతరులకు సహాయపడేవారే మోక్షానికి అర్హులు. నిష్పాట్యం, నిర్మోహత్వం, నిష్కామకర్మ, నిస్వార్థచింతన మోక్షానికి గుణాలు. ఇటువంటి వారికి భగవంతుడు నిత్యం తోడుగా నీడగా ఉండి సహాయపడతాడు. చివరికి తనలో ఐక్యం చేసుకుంటాడు.

హిందూధర్మంలో ఉన్నట్లే బౌద్ధమతం, జైనమతం, సిక్కుమతం, తదితర మతాలలోను భగవదైక్యం చెందడం ఉంది. బౌద్ధమతంలో మోక్షాన్ని నిర్వాణము అంటారు. జైనమతంలో కేవలిన్, కైవల్య, నిర్వాణ అంటారు.

సిక్కుల మత స్థాపకుడైన గురునానక్ రచించిన గురు గ్రంథ సాహెబ్‌లో "నేను ప్రపంచాన్ని, స్వేచ్ఛను కోరుచ కోవడం లేదు. కేవలం నా దేవుణ్ణి చూడాలను కుంటున్నాను" అని, భగవంతుని చేరుకోవడమే ముక్తి అని ప్రవచించారు.

ఈ విధంగా చతుర్విధ పురుషార్థాలలో మోక్షము అత్యంత ప్రాముఖ్యమును సంతరించుకున్నది. భక్తి మార్గాన్ని అనుసరించి మోక్షాన్ని చేరుకోవడం సులభమైన పని. నవవిధ భక్తులను అనుసరించి ఎంతోమంది భక్తులు ముక్తిని పొందారు. ప్రాచీనులు అర్వాచీనులు కూడా భక్తినే సోపానంగా గ్రహించి మోక్షసింహాసనాన్ని అధిరోహిస్తు న్నారు.

❖ ❖ ❖

ప్రబంధ కావ్యాల్లో ప్రతిఫలించిన మోక్ష సాధన

– డా॥. వై. శ్రీలత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంటుమిల్లి, కృష్ణా జిల్లా.

ఉపోద్ఘాతం :

ధర్మార్థకామమోక్షాలనే నాలుగు పురుషార్థాలు ప్రతి మనిషీ తప్పక ఆచరింపదగినటువంటివి. ఈ నాల్గింటిలో చివరిది మోక్షం. ధర్మం, వ్యక్తికీ సమాజానికి మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేస్తుంది. సమాజంలేని ఆటవికునికి ధర్మంతో పని వుండదు. సమిష్టి సుఖ జీవనం కోసం ప్రతి మనిషి కొన్ని నియమాలకు కట్టుబడి బ్రతకాలి. ఆ కట్టుబాటే ధర్మం. సంఘం ఏర్పడిన తర్వాతనే ధర్మం ఏర్పడింది. అందుకే గౌతమ బుద్ధుడు 'సంఘం శరణం గచ్ఛామి' అని సంఘాన్ని వేడుకున్నాడు. వ్యక్తిగత సామాజిక సుఖ జీవనం కోసం ధర్మరక్షణ మనిషికి విధి అయింది. "ధర్మో రక్షతి రక్షిత:" ధర్మాన్ని నీవు రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది అన్నారు. తనను తాను కాపాడుకోవడం కోసం మనిషికి ధర్మ రక్షణ తప్పని సరి అయింది. అటువంటి ధర్మం, అర్థ, కామాలను (సంపాదన, అనుభవాలను) కూడా దారి తప్పకుండా పట్టివుంచి నడిపిస్తుంది. ధర్మం ఇహపర సుఖాలనందించే ఉత్తమోత్తమ సాధనం. ధర్మబద్ధంగా (సంఘ వ్యతిరేక పద్ధతులలో కాకుండా) ధనార్జన చేసి, కోరికలను, అవసరాలను తీర్చుకున్న తర్వాత వచ్చేది మోక్షదశ. అర్థకామాలకంటే భిన్నంగా ధర్మాన్ని ఆచరించినప్పుడే మోక్షార్హత కల్గుతుంది.

మోక్షం అంటే విడిచిపెట్టడం అని అర్థం. ధర్మ యుతంగా సంపాదించుకున్న అర్థకామాలు యోగాలు. యోగమంటే కలయిక. వాటిని చెదరనీయకుండా పట్టివుంచడమే క్షేమం. యోగక్షేమాలు గార్హస్థ్య ధర్మాలు. 'యోగక్షేమం వహామ్యహం' అన్నాడు వాసుదేవుడు. సంయోగం కలయిక అయితే వియోగం వాటి ఎడబాటు. సంయోగం చెందినదేదైనా వియోగం చెందక మానదు. సామాన్యార్థంలో చెప్పాలంటే, చిరకాలంగా మనం క్షేమంగా కాపాడుకుంటున్న దేహం, భార్యాబిడ్డలు, ఇల్లు, వాహనం మొదలైన సమస్త వస్తువులు, ఐశ్వర్యం మొదలైన వన్నీ యోగరూపాలే కాబట్టి, అవి మనల్ని విడిచి వెళ్లక ముందే వాటి మీద ఆసక్తిని విడిచిపెట్టి నిశ్చింతగా జీవించడం మోక్షంగా చెప్పవచ్చు.

ప్రబంధకాలంనాటి సమాజంలో భిన్నమతాలు, సంస్కృతుల ప్రభావంతో ప్రజల్లో నైతిక విలువల పతనం లాంటి కారణాలు ప్రబంధకవులు బాధ్యతను పెంచాయని చెప్పవచ్చు. అందుకే ప్రబంధకావ్యాలలో చతుర్విధ పురుషార్థాలకు తగిన ప్రాధాన్యం లభించింది. చతుర్విధ పురుషార్థాలలో ధర్మార్థకామములకంటే మోక్షమే శ్రేష్ఠమైందని ప్రబంధ కావ్యాలు కూడా చెబుతున్నాయి. ప్రబంధ కావ్యాలలో మోక్షసాధనను రెండు రకాలుగా కవులు వర్ణించినట్లు తెలుస్తున్నది. ఒకటి వైదిక జీవనంతో జ్ఞానాన్ని సముపార్జించి మోక్షార్హత పొందడం, రెండవది భక్తితో మోక్షార్హత సాధించడం.

మనుచరిత్రలోని ప్రవరుడు, కళాపూర్ణోదయంలోని శాలీనుడు, తుంబురుడు, ఆముక్తమాల్యదలోని విష్ణు చిత్తుడు, యామునాచార్యుడు, మాలదాసరి, కేశిధ్వజుడు, పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ అక్క మొదలైన వారంతా వైదిక జీవనాన్ని, జ్ఞానాన్ని ఆశ్రయించి మోక్షానికి అర్హత సాధించగా, తిన్నడు మొదలైనవారు భక్తితో పరమాత్మను సేవించి మోక్షార్హత పొందారు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం గ్రంథంలో ధూర్జటి తిర్యక్కులు సైతం భక్తితో మోక్షాన్ని పొందగలవని వర్ణించాడు. ముక్కుతిమ్మన తీర్చిదిద్దిన పారిజాతాపహరణ కావ్యంలో నారదుని పాత్రకూడా మోక్షసాధనను తెలియజేస్తుంది.

మనుచరిత్రలో మోక్షసాధన :

ప్రబంధ సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు అందరికంటే

ఎక్కువగా ఆకర్షింపబడేది ప్రవరుడు. మానవ జీవన పద్ధతికి ప్రవరుడు ప్రతీక. ఇతడు వైదిక జీవన విధానంతో సిద్ధుడు, అగ్ని, తల్లిదండ్రులు, శిష్యులు, ప్రజలచేత కూడా కీర్తింపబడినాడు. ప్రవరుని పాత్ర ద్వారా ధర్మ బద్ధమైన జీవనాన్ని, మోక్షసాధన ఆవశ్యకతను బోధించడమే పెద్దన లక్ష్యం. ఇందుకు ఆనాటి ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులే కారణం. ధర్మం తప్పుతున్న సమాజాన్ని దారిలో నడిపించడానికి ప్రవరుని పాత్ర పెద్దనకు బాగా తోడ్పడింది. పెద్దన ప్రవరుణ్ణి ధర్మ నిష్ఠా గరిష్ఠునిగా చిత్రించాడు. సమాజానికి ఆదర్శం కాగలిగి, కర్తవ్యోపదేశం చేయగల్గిన పాత్రను ప్రవరుని ద్వారా పెద్దన సృష్టించాడు. అతిథి విషయంలోను, యమనియమాదులను అనుష్ఠించే విషయంలోను ప్రవరుని పాత్రను పెద్దన పరమ పురుషార్థానికి అభిముఖంగా నడిపించాడు. ధార్మిక ప్రవృత్తితోనే మోక్షార్హతను పొందగలరనే సామాజిక సందేశాన్ని అందించడం ద్వారా, ధర్మబద్ధమైన జీవనానికి మోక్షాన్ని నిర్దేశించాడు. యమనియమాదులను నిష్ఠగా ఆచరించే ప్రవరుడు ఎప్పుడూ ధర్మం తప్పలేదు. పంచ మహా యజ్ఞాలను కూడా పరమ నిష్ఠగా ఆచరించాడు కనుకే మోక్షార్హతను పొందాడు.

ఆముక్తమాల్యదలో మోక్షసాధన :

విష్ణు భక్తి ప్రబోధిత కావ్యమైన ఆముక్తమాల్యదలో పరమ పురుషార్థమైన మోక్షం అత్యంత శ్రేష్ఠమైందిగా వర్ణింపబడింది. పంచమహాయజ్ఞాలలో ఒకటైన అతిథి యజ్ఞాన్ని పెద్దనలాగా రాయలు కూడా అద్వితీయంగా అభివర్ణించాడు.

మృత్యువును జయించడం, పునర్జన్మ లేకుండా చేసుకోవడం, యోగాన్ని అవలంబించడం, జ్ఞానాన్ని ఆశ్రయించడం మైదలైనవి పరమపురుషార్థానికి సోపానాలు అని రాయలు కేశిధ్వజుని చేత చెప్పిస్తాడు.

"ఆ కేశిధ్వజుడంత నానృపుని, రాజ్యంబెల్ల జేరన్ ఫలం
బాకాక్షింపక గెల్తుమృత్యువునవిద్యన్ పుట్టకుందున్ తుదన్
జాకుందున్ వడి యంచు యోగనియతిన్ జ్ఞానాశ్ర
యుండై మఖా
నీకంబుల్ రచియించు చందొకటికన్ తీక్షించి తానున్న
చోన్"

(ఆముక్తమాల్యద 3-18)

కేశిధ్వజుడింకా ఈ విధంగా అంటాడు.

"పరలోక సుఖము శాశ్వత
మరయ మహీరాజ్య సౌఖ్యమల్పానేహ:
పరిభోగ్యం బిందులకై
దురితము గావించి తొలగుదునే పరమునకున్"

(ఆముక్తమాల్యద 3-49)

పరలోక సుఖమంటే మోక్షానందం. దానిముందు ఇహలోక సుఖాలు తృణప్రాయం. కనుకనే మోక్ష పురుషార్థాన్ని సాధించాలని అంటాడు. విషయాలపట్ల ఆసక్తి బంధానికీ, అనాసక్తి ముక్తికీ కారణమౌతాయని రాయలు చెప్పాడు. ఈ విషయాన్ని మనం జాగ్రత్తగా అర్థం చేసుకోవలసి ఉంది.

అర్థకామావసరాలు, క్షీణదశకు వచ్చిన తర్వాత జ్ఞానంకల పురుషుడు గృహపాలనా బాధ్యతలను (యోగ క్షేమాలను) సంతానానికి అప్పగించి మోక్షాచరణతో విశ్రాంత సుఖాన్ని అనుభవిస్తాడు. ఈ దశనే పూర్వులు 'వానప్రస్థాశ్రమం' అన్నారు. ఈ మాటకు అడవిలో జీవించడమని అర్థం. దీన్ని అధునిక కాలానికి అన్వయించుకుంటే పురుషుడికి (జీవుడికి) గృహమే వనతుల్యం కావాలని, మనం అడవిలో చెట్లు, పక్షులతో, జంతువులతో ఏవిధంగా సంభాషించలేక మౌనంగా ఉంటామో, ఇంట్లోకూడా అలాగే గడపాలని. తామరాకు మీది నీటి బిందువులాగా నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా గడపాలని. ఇంట్లో ఈ విధంగా అంటీ ముట్టనట్లు ఉండటమే మోక్షంగా చెప్పవచ్చు. అర్థకామాలేగాక మోక్షం కూడా ధర్మబద్ధంగా స్వానుభవంలోకి కావాలి. వివాహ సమయంలో భార్యకు "ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ నాతిచరామి" అని చేసే

ప్రమాణానికి కట్టుబడి గృహస్థుడు తన బాధ్యతను నిర్వర్తించాలని ప్రబంధకావ్యాలు బోధిస్తున్నాయి.

కళాపూర్ణోదయంలో మోక్ష సాధన :

పింగళి సూరన కళాపూర్ణోదయం కల్పిత కావ్యమే అయినప్పటికీ అందులోని ద్వారకాపుర, తిరుమల, కాంచీ పురం, శ్రీరంగ, రామేశ్వరాది క్షేత్రవర్ణనలు, యమునా, కావేరీ తీర్థవర్ణనలు మోక్షార్హతను కలిగించే తీర్థాలుగా వర్ణించబడటం సూరన లౌకిక, ఆధ్యాత్మిక దృష్టికి అద్దం పడుతున్నాయి. ఐదవ ఆశ్వాసంలోని స్వభవుని కథ సూరన యోగాభ్యాస కుశలతని తెల్పుతాయి. మోక్షసాధనలో యోగజీవన ప్రాధాన్యతను స్వభవుని పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు.

"విమలాత్మక! వినుము ప్రశ
స్తము జీవాత్మ పరమాత్మ సంయోగము యో
గమన, తదంగము లెనిమిది
క్రమమున వినిపింతు తత్ప్రకారము దెలియన్"

(కళాపూర్ణోదయం 5-135)

పతంజలి యోగదర్శనంలో చెప్పబడిన యమనియ మాది అష్టాంగయోగాచరణ పరమ పురుషార్థమైన మోక్షానికి మార్గం చూపుతుంది.

పాండురంగ మాహాత్మ్యంలో మోక్ష సాధన :

ఆంధ్ర పంచకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన కావ్యం పాండురంగ మాహాత్మ్య. క్షేత్ర ప్రభావంచేత నిగమశర్మలాంటి ఎంతటి దుర్మార్గుడైనా మోక్షార్హతను సంపాదించగలడని నిరూపించినవాడు తెనాలి రామ కృష్ణుడు. తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం కావ్యాలు రెండూ వైష్ణవ క్షేత్ర పారమ్య గ్రంథాలు. క్షేత్ర మాహాత్మ్యాన్ని వివరించే గ్రంథాలు. పాండురంగ మాహాత్మ్యంలో వర్ణింపబడిన నిగమశర్మోపాఖ్యానం, రాధిక, సుశీల మొదలైనవారి కథలు,సుశర్మోపాఖ్యానం, అయుత నియతుల వృత్తాం తాలు పురుషార్థాల ఆచరణావశ్యకతను వివరించేవి. అగస్త్య, గాణాపత్య, సాంకర్షణ, జాబాలి, బ్రహ్మ, కలశ, పితృ, చక్ర, లక్ష్మీ, పౌండరీక, ముక్తకేశ, సంగమ తీర్థాలు తెనాలి రామకృష్ణుని భక్తి ప్రపత్తులను, ఆధ్యాత్మిక దృష్టిని వెల్లడిస్తున్నాయి.

శ్రీకాళహస్తి మాహత్మ్యంలో మోక్ష సాధన :

ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మాహత్మ్యం కూడా క్షేత్ర మాహత్మ్యాన్ని తెలిపే గొప్ప ప్రబంధకావ్యం. ఈ కావ్య ప్రారంభ పద్యం "శ్రీ విద్యానిధియై మహా మహిమచే...." లో వసిష్ఠునికి, బ్రహ్మకు, సాలెపురుగుకు, పామును, ఏనుగుకు, ఆటవికుడైన తిన్ననికి, హర ద్విజునికి, నత్కీరునికి, వేశ్యాపుత్రికలకు, యాదవరాజుకు ముక్తిని ప్రసాదించిన దివ్యలింగం నా అభీష్టాలను తీర్చు గాక అని ధూర్జటి శివస్తుతి చేసాడు. శివభక్తిని నిరూపిం చడం అనే ఒకే ఒక అంశంతో ధూర్జటి ఈ ప్రబంధ రచన చేశాడు. కీటకానికి, చక్రికి, మదాంధునికి, చివరకు బహుజీవహంతకునికైనా సంసార బంధాన్ని తొలగించి మోక్షనిధిని అందించే శక్తి కేవలం కాళహస్తి పుణ్యక్షేత్రాని కుందని ధూర్జటి భావించాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం లోని నత్కీరుని కథ ఎంతో గొప్పగా చిత్రించబడింది. సంసారాన్ని దు:ఖమయంగా నత్కీరునిద్వారా ధూర్జటి ఈ విధంగా చెప్పిస్తాడు.

"ఈ సంసారము దు:ఖా
వాసానందంబు: దీని వర్ణింపగా
నేసుఖము గలుగు దయ న
న్నా సుఖమున గూర్చవే కృతార్థుడనగుదున్"

(శ్రీకాళహస్తి మాహాత్మం 3-221)

"అథ త్రివిధ దు:ఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థ: - దు:ఖం ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అని దుఖం మూడు రకాలుగా సాంఖ్యదర్శనంలో(1-1) చెప్ప బడింది. దాన్ని పూర్తిగా తొలగించుకోవడమే అత్యంత పురుషార్థం (మోక్షం)గా సాంఖ్యం వివరించింది. ఈ మూడు రకాల దు:ఖాన్నే ధూర్జటి సాంసారిక దు:ఖం

అన్నాడు. ఇక్కడ దు:ఖం అంటే ఈతిబాధల వలన కలిగే దుఖంగా భావించాలి. అజ్ఞానం వలన కలిగే అంధకారమే దు:ఖం. దాన్ని తొలగించి మోక్షానందాన్ని ప్రసాదించమని శివుణ్ని వేడుకున్నాడు. ధూర్జటి దృష్టిలో శివలింగం అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానమనే అమృతాన్ని మోక్షార్హతను అందించగల్గుతుంది.

ముగింపు :

ప్రబంధకవులు పురాణాలనుండి కథలను గ్రహించినప్పటికీ వాటికి కల్పనలను, పురుషార్థాల ప్రాధాన్యతను, అవశ్యకతను జోడించి అత్యద్భుతంగా ప్రబంధరచన చేశారు. చతుర్విధ పురుషార్థాలలో ధర్మార్థకామాలకంటే, మోక్షమే శ్రేష్ఠమైందని నిరూపించడానికి ప్రబంధకవులు ప్రయత్నించినట్లు తెలుస్తుంది. ఏనాటికైనా మానవుడు పరమ పురుషార్థమైన మోక్షాన్ని పొందాలన్న ఋషుల భావన ప్రబంధ కావ్యాలలో అత్యద్భుతంగా ప్రతిఫలించింది.

ఆధార గ్రంథాలు :

1. ఆముక్తమాల్యద, వావిళ్లవారి ప్రతి, 1914
2. ఆత్మావలోకనం(వ్యాస సంపుటి), డాక్టర్ గుమ్మడపు రామకృష్ణ రాయణం, స్వీయ ప్రచురణ, ఖమ్మం, 2002
3. కళాపూర్ణోదయము, వావిళ్లవారి ప్రతి, 1925
4. సాంఖ్యదర్శనము, పండిత గోపదేవశాస్త్రి వ్యాఖ్య, ఆర్యసమాజం, కూచిపూడి వారి ప్రచురణ, 1983
5. సారస్వత లోచనం(వ్యాస సంపుటి), ఆచార్య మసన చెన్నప్ప, ప్రమీలా ప్రచురణలు, హైద్రాబాదు, 2001
6. పాండురంగ మాహాత్మ్యము, వావిళ్లవారి ప్రతి, 1952
7. మనుచరిత్రము, వావిళ్లవారి ప్రతి, 1951
8. శ్రీకాళహస్తి మాహాత్మ్యము, వావిళ్లవారి ప్రతి, 1956

❖ ❖ ❖

గుణనిధి కథ – ధర్మార్థ కామ మోక్షాలు

– గొంగులూరి కృష్ణవేణి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, సెంట్రల్ యూనివర్సిటి హైదరాబాదు,

మానవ మనుగడ ఎలా సాగాలో చెప్పే వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ఆధునిక కాలంలో పాగా వేసిన కథలు, నవలలు మన జీవన విధానాన్ని చిత్రించాయి. అవి కేవలం పుస్తకాలకే పరిమితమై ఆచరణలో కనబడడం లేదు. మానవ జీవనం వేదాల్లో శాస్త్రాల్లో తెలిపిన విధంగా ధర్మబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి ఉండాలి. అప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తుంది. ఆ నియమ నిబంధనలు చతుర్విధ పురుషార్థాలు అయినా ధర్మార్థ కామమోక్షాలు.

ఇప్పటివరకు వచ్చిన అన్ని రకాల రచనల్లో చతుర్విధ పురుషార్థాలు నిక్షిప్తమై ఉన్నాయి. అది మనం చూసే దృష్టి కోణం మీద ఆధారపడి ఉంటుంది. అటువంటి వాటిలో సుపరిచితమైనది గుణనిధి కథ. గుణనిధి కథను 'శివరాత్రి మహాత్మ్యం' అనే కోణంలోనే ఇప్పటివరకు ప్రసిద్ధి. దీనిలో గల చతుర్విధ ధర్మాలను నా కోణంలో వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాను.

శ్రీ నాథుడు రచించిన 'కాశీఖండం' చతుర్థాశ్వాసంలో 'గుణనిధి' కథ కలదు.

పూర్వము కాంపిల్య నగరంలో యజ్ఞదత్తుడు - సోమిదమ్మ అనే బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. వేద, వేదాంగాలు, శాస్త్ర, పురాణాలు అన్నిటిలో ప్రావీణ్యత ఉన్న యజ్ఞదత్తుడు రాజాదరణ పొంది రాజగురువుగా నియమింపబడ్డాడు. వీరి ఏకైక సంతానం గుణనిధి. అతను చెడు సావాసాల వలన జూదమునకు బానిసయ్యి, ఆ జూద క్రీడ కోసం దొంగతనాలు కూడా మొదలు పెట్టాడు. తల్లయిన సోమిదమ్మకి ఇవన్నీ తెలిసినా గారాబంతో మందలించకపోగా, భర్తకు ఈ విషయాలు తెలిస్తే ఎక్కడ కోప్పడతాడో అన్న భయంతో మౌనం వహించేది. యజ్ఞదత్తుడు రాజమందిరంలో కార్య కలాపాలలో నిమగ్నమై కొడుకుని పట్టించుకునేవాడు కాదు. ఎప్పుడయినా కొడుకు గురించి భార్యను వాకబు చేస్తే, ఆవిడ పుత్ర ప్రేమతో చదువుకోడానికి గురువు గారి వద్దకు వెళ్ళాడనో, గుడికి వెళ్ళాడనో అబద్ధం చెప్పి భర్తను మభ్య పెట్టేది. దానితో గుణనిధికి అడ్డు, అదుపు లేక ఇంటిలో నగలన్నీ దొంగిలించి మరీ జూదమాడి ఓడిపోతూ ఉండేవాడు. అలా తన తండ్రికి రాజుగారిచ్చిన వజ్రపు ఉంగరం కూడా జూదంలో పెట్టి ఓడిపోయాడు. ఆ ఉంగరం గెలుచుకున్న వ్యక్తి అనుకోకుండా యజ్ఞదత్తుని కంట పడటం, యజ్ఞదత్తుడు ఆ ఉంగరం తనదని గుర్తించి అతనిని నిలదీయటం, అతను జూదంలో గుణనిధి వద్ద గెలుచుకున్నానని చెప్పటంతో యజ్ఞదత్తుని నోట మాట రాలేదు. ఆ రోజు దాకా కొడుకు ఏమి చేస్తున్నదీ తనకు తెలియని పరిస్థితిలో ఉన్నందుకు సిగ్గుపడుతూ, భార్యా బిడ్డల మీద కోపంతో ఇంటికి వెళ్లి, కొడుకు చెడు సావాసాలకు లోనయిన విషయం తన వద్ద దాచినందుకు భార్యను మందలించాడు. ఇంతలో జరిగిన విషయం తెలుసుకున్న గుణనిధి ఇంటికి వచ్చే సాహసం చేయలేకపోయాడు. తన మిత్రులెవరూ కూడా తనకి తల దాచుకోవటానికి సహకరించలేదు. చెంతనే ఉన్న గౌతమీ నది దాటి ప్రక్క ఊరు చేరుకున్నాడు. ఆ రోజు మహాశివరాత్రి కావడంతో ఊరి చివరన ఉన్న శివాలయంలో భక్తులు నైవేద్యాలు సమర్పించి, తమ శక్తి కొలదీ జాగారాలు చేసి, మెల్లిగా నిద్రలోకి జారుకున్నారు. జనాలంతా పడుకున్నారని నిర్ధారించుకున్నాక, ఆకలితో ఉన్న గుణనిధి శివునికి అర్పించిన ప్రసాదాలను తీసుకుని తిందామని గర్భ గుడిలోనికి వెళ్ళాడు. చీకటిలో ఏమీ కనిపించక, తన పైవస్త్రాన్ని చించి వత్తిగా చేసి అక్కడ ఉన్న నూనెతో దీపాన్ని వెలిగించాడు. ఆ వెలుతురులో ప్రసాద పాత్రలు కనిపించేసరికి ఆనందంతో వాటిని

తీసుకుని బయటకి నడుస్తుండగా గుడిలో నిద్రిస్తున్న ఒక భక్తుని కాలు తగిలి, నందీశ్వరుని మీద పడి, తల పగిలి చనిపోతాడు. ఊరి నుండి పారిపోతూ పవిత్ర మయిన గౌతమీ స్నానం, తిండి దొరకనందున ఉప వాసం, వెలుతురు కోసం శివాలయంలో వెలిగించిన దీపం, ప్రసాదాల కోసం చేసిన సగం జాగారం, ఇవన్నీ అనుకో కుండా చేసినా శివరాత్రి పర్వదినం నాడు చేసి మరణిం చటం వలన గుణనిధికి కైలాస ప్రాప్తి లభించింది. అందు కనే "జన్మానికో శివరాత్రి" అంటారు.

గుణనిధి బ్రాహ్మణుల ఇంట్లో పుట్టినప్పటికీ పేకాట, జూదం, వంటి సప్త వ్యసనాలు కు బానిస అయి తల్లి దండ్రులను లెక్కచేయకుండా, పెడచెవిన పెట్టి ఇంట్లోని వస్తువులను తాకట్టు పెట్టి, జల్సాలు చేసేవాడు. వీటన్నిం టినీ తెలుసుకున్న తండ్రి యజ్ఞదత్తుడు గుణనిధి పై మమకారం చూపకుండా, తన వంశం నిర్వంశం అయినా పర్వాలేదు అనుకుని ఒక్కగానొక్క కొడుకుని ఇంటి నుండి బహిష్కరిస్తాడు.

ఒక కోణంలో తను ఆచరించాల్సిన ధర్మాన్ని మరచి, మంచి పుత్రునిగా ఏదో ఒక పని చేసుకుంటూ సంపా దనతో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత మరిచి బాధ్యతారాహితుడు అయిన గుణనిధి ని మనం చూడ వచ్చు. గుణనిధి తన ధర్మాన్ని మరిచాడు. అనంతమైన కోరికలతో నిర్వర్తించాల్సిన విధులను చేయకుండా, సప్త వ్యసనాలకు బానిసగా మారిన గుణనిధిని మనం చూడ వచ్చు.

ఇదే గుణనిధి గృహ బహిష్కృతుడై బయటకు వచ్చిన తర్వాత తన తప్పులన్నిటినీ తెలుసుకుని పశ్చాత్తాప పడడం, ఎలా ప్రాయశ్చిత్తం చేసుకోవాలో అన్వేషించడం వంటివి మనం చూడవచ్చు. తల్లిదండ్రులను తలచు కుంటూ ఆకలికి అలమటిస్తూ శివరాత్రి రోజున శివా లయంలో శివారాధన, దీపారాధన, ఉపవాసం, జాగరణ వంటివి తన స్వలాభం కోసం చేసినప్పటికీ తెలిసి చేసినా, తెలియక చేసినా దైవ పూజ అనేది మనల్ని కాపాడుతుంది అని శివదూతలు యమదూతలతో పలికే సందర్భంలోని ఈ పద్యాన్ని గమనిద్దాం.

సీ. అశన మబ్బక యున్న నైనను శివరాత్రి
యొరంత ప్రొద్దును నుపవసించె
నోగిరంబు హరింప నొనవెట్టు కొనియైన
వేగునంతకు జేసే జాగరంబు
పాత్రావలోకనోపాయంబునకునైన
వెలనైన దీపంబు వెలుగ జేపె
జూడనొల్లకయైన జూచె నీశ్వరుమౌళి
బరులు చేసిన యట్టి ప్రసవ పూజ

తే. జచ్చే విధిమూడియైనను జంద్రధరుని
నగరి మోసాల బె ద్రోవ నట్టనడుమ
సూక్ష్మ ద ృష్టి విచారించి చూచినప్పు
డింతకంటెను ధర్మంబు లెవ్వి కలవు
(కాశీఖండం, చతుర్థాశ్వాసం, 133వ పద్యం)

పుణ్యకార్యాలు చేయాలని సంకల్పించి పుణ్యాలు చేయడం ఒకటి. సంకల్పించుకోకుండానే చేసిన ఏ పని అయినా పుణ్యంగా పరిణమించడం ఒకటి. మొదటిది సామాన్యము. రెండవది విశేషము. సూక్ష్మమైన శివ ధర్మం ఇలాంటి విశేషాలను కలిగి ఉంది. అన్నము దొరకక గుణనిధి పస్తులు ఉన్నాడు. ఆరోజు శివరాత్రి అని అతనికి తెలియదు. అయినప్పటికీ పస్తులు ఉండడం అనేది శివరాత్రి ఉపవాసం గా పరిణమించింది. గర్భగుడిలోని నైవేద్యాన్ని దొంగిలించడానికి అక్కడున్నవారు నిద్ర పోయేంతవరకు అతను కూడా నిద్ర మాని మేలుకొనే ఉన్నాడు. అది శివరాత్రి జాగరణము గా పరిణమించింది. చీకటిలో పదార్థాలన్నింటినీ స్పష్టంగా చూడటం కోసం మినుకు మినుకు మంటున్న దీపాన్ని తన ధోవతి అంచును వత్తిగా చేసి, నేతిలో తడిపి వెలిగించాడు. అది శివరాత్రి నాడు పరంజ్యోతి అయిన శివునికి, జ్యోతి వెలిగించినట్లయింది. ఆ దీపపు వెలుగులో శివుని పై భక్తులు చేసిన పూజ అనుకోకుండా గానే చూడడం

తటస్థించింది. అది శివ దర్శనం గా పరిణమించింది. ఇవన్నీ స్థూల దృష్టికి యాద్రృచ్ఛికంగా కనిపించవచ్చు. కానీ ఇన్ని యాదృచ్ఛికాలు కూడా ఒక్కసారి ఇలా క్రమంగా (ఉపవాసం, జాగారం, దీపారాధనం, శివ సందర్శనం) సంభవించడం సూక్ష్మ దృష్టితో విచారించవలసిన అంశం. ఇవి అప్పటికప్పుడు తన స్వలాభం కోసం చేసినప్పటికీ చివరికి మోక్షం లభించింది.

శివదూతలు గుణనిధి చేసిన పనులను వివరించి యమదూతలను పంపించి, గుణనిధి దివ్య విమానం లో ఎక్కించుకొని శివలోకం తీసుకొనివెళ్ళారు. ఈ విధంగా ఎక్కడైనా చేసే పనిలో ధర్మాన్ని మనం ఎంతవరకు ఆచరిస్తున్నాం అనేది ప్రధానం. ధర్మరక్షణ కోసం మనం ఏ ప్రయత్నం చేసినా అది మనల్ని రక్షిస్తుంది.

ధర్మో రక్షతి రక్షితః

❖❖❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

"మూడో పురుషార్థ" యుక్తి శక్తిగా...

– డా॥ జె. సీతాపతి రావు, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణాజిల్లా

1. సమాధాన సకలం మూడో పురుషార్థం :

చతుర్విధపురుషార్థాలు ఆర్ష విజ్ఞానంలో ఉన్నాయ్. మూడో పురుషార్థానికి అంత ప్రాముఖ్యం ఎందుకు? ధర్మ, అర్థ, కామ, మోక్షాలు పురుషార్థాలు అని చాలా మందికి తెలుసు. ధర్మంతో అర్థాన్ని, ధర్మంతో కామాన్ని, స్వీకరించి అర్థ కామాల్ని వదిలేయడమే మోక్షం. ఇది ఒక పద్ధతి. దీనికి భిన్నంగా వ్యక్తి చేస్తే? దానికి ఉన్న పూర్వాపరాల స్థాయి ఎంత? ఆర్ష విజ్ఞానాన్ని దుర్వినియోగం జరిగితే రక్షించేది ఎవరు? యోగశక్తి, తాంత్రిక శక్తుల్ని వ్యక్తి స్వార్థానికి వాడేస్తే? అఘోరాలు ఎవరు? విదేశస్థులు ఎలాంటి ప్రలోభాలకు లొంగిపోతారు? బ్రహ్మచర్యం దాని స్థితి ఎలాంటిది? స్వేచ్ఛా కాముకత్వ సిద్ధాంతాన్ని ఎలా గమనించాలి? స్త్రీ పురుషులు ఎలా ఆకర్షించుకుంటారు? అసలైన ప్రేమ ఎక్కడ ఉంటుంది? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం "మూడో పురుషార్థం" నవల.

లండన్ నుంచి మొదలై నేపాల్ వరకు, మధ్యలో హైదరాబాద్, ఆగ్రా, బృందావన్, అస్సాం, ఇస్కాన్ వారు, యోగులు, అఘోరాలు, ఉపాసకులు, తత్త్వశాస్త్రం, యోగశాస్త్రం, తార్కిక శాస్త్రం, తంత్ర శాస్త్రం, వైద్య శాస్త్రం, కామ శాస్త్రం మొదలైనవి అవసరమైన చోట చాలా జాగ్రత్తగా వాడారు రచయిత, చివుకుల పురుషోత్తం.

2. పాత్రాన్వేషణ :

పాశ్చాత్యుల విశృంఖల శృంగార తత్త్వాన్ని ఫ్రాయిడ్ లాంటి వారి భావాలను, తాంత్రిక భావాలతో మేళవించిన తత్త్వమే గిరీష్ మహర్షి. ఒక బలమైన తాంత్రిక, తార్కిక, వేదాంతి, స్త్రీలకు సూపర్ పవర్ గా మోక్షాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో చాలా మందిని విచ్చల విడిగా మానహారణ చేస్తూ విదేశస్థుల్ని ఎలా వాడుకుంటున్నారో చూపడం ఒక వంతు. ఒక సామాన్యుడు యోగ సాధన చేసి లక్ష్య సిద్ధికోసం పడిన ఆవేదన, ఇబ్బందులకు నిలయం రాఘవరాం.

ఆశ్రమాలను పెట్టి, కామ వాంఛల్ని రెచ్చగొట్టి, దాన ధర్మం చేసినట్లుగా స్త్రీని వందల కొద్ది మగ మృగాలు అనుభవించడం దానికి ఒక అందమైన పేరుతో ఆకట్టుకోవడం ఆధునిక సమాజానికి కలంకం. దీన్ని గొప్పగా చెప్తూ ఇండియా వాళ్ళు పనికిమాలిన వారుగా, అమెరికా, లండన్ వాళ్ళే గొప్ప అని చెప్పే వారికి ఇది ఒక చురక, వాళ్ళ కామవాంఛలకు చురకత్తె.

ఆర్ష ధర్మ సిద్ధాంతాలు విశ్వమానవాదర్శాలు. అధునాతన, భౌతిక శాస్త్రీయ భావనలు. యోగా ప్రపంచానికి పంచిన పరమాన్నం. వైద్యునికి ఆశ్చర్యం కలిగేలా రోగిని బతికించడం ఈ ఆర్ష విజ్ఞాన సాధనా శక్తి. సంకల్ప సిద్ధి, సత్సాధన, కఠోర దీక్ష, లోపాల్ని అధిగమించే స్థితిలో ఎక్కడో చిన్న దానంగా సాయం తీసుకున్నవారు చివరలో గుర్తుపెట్టుకొని కృతజ్ఞతల్ని చూపడం ఈ కథలో కొస మెరుపు, ఉత్కంఠతా సన్నివేశాలు.

భారతదేశంలో పుట్టి, వైద్యవిద్యను నేర్చుకొని లండన్ లో అవకాశం వస్తే డబ్బుకోసం వెళ్ళిన జోగారావు కుటుంబంతో సంబంధాలు లేకుండా అంతరించిన జీవితాన్ని సాధికారంగా వర్ణించారు. "జోగారావ్! ఎందుకు నీవు విదేశాలకు వెళ్ళడం? పరుగెత్తి పాలు త్రాగడం కంటే, నిల్చుని నీళ్ళు త్రాగడం మంచిది" అని చెప్పిన నరశింహయ్య మాటల్ని లక్ష్యపెట్టక వెళ్ళిన కుటుంబంలోని సరస్వతిని కాపాడుకోడానికి పడిన అవస్థలు వర్ణనాతీతం.

3. భారతీయ సంస్కృతి ఐం సరస్వతి :

సరస్వతి అందగత్తే. తనది ఇండియా ఆ పైన తెలుగు వాళ్ళకు పుట్టిందే కానీ మొత్తం విదేశీ అలవాట్లే. తెలుగు

మాత్రం నేర్చుకుంది. ఆమెకు 18 సంవత్సరాలలోపే ఇద్దరి అక్కలు చనిపోయారు. ఒకామే ప్రేమించి మోసపోయి, ఇంకో అక్క బలాత్కారానికి గురై ఆత్మహత్యలు చేసు కున్నారు. ఆ ఒక్క పిల్లను అన్నగారింట ఆనందంగా పెంచుదాం అన్న ఆలోచనతో పంపగా వచ్చిన ఆజాను బాహు అందగత్తే సరస్వతి. భారతదేశం అంటేనే అసహ్యం నరనరాన ఉన్న అమ్మాయి. పాత విధానాలు, అసలు వీళ్ళకు ఏమీ తెలియవన్న నమ్మకం ఉన్న సరస్వతి సెక్స్ పట్ల వీళ్ళకు పవిత్రత ఎందుకు? అది ఒక సాధారణ అంశంగానే చూసింది.

రాబర్ట్‌తో సరస్వతి మొదటి సమాగమం చేసింది. వాడు సరస్వతి కంటే రెండు సంవత్సరాలు చిన్నవాడు. పీటర్ వాళ్ళ పేరెంట్స్ పెళ్ళికి తిరస్కరించారు. ఆ తర్వాత ఇండియాకి వచ్చింది. సుందరం అనే వ్యక్తితో శారీరక వాంఛలకు స్వాగతించింది. సుందరానికి అప్పటికే పెళ్లి అయి ఇద్దరి పిల్లలకు తండ్రి.

వరసకు బావ అయిన రాఘవరాం ను ఆకర్షించాలని ప్రయత్నించినా అతడు ఆమె ఆకర్షణకు లొంగలేదు. పైగా పీటర్ అన్నవాడి నుంచి రక్షించాడు. అయినా సరస్వతిని పీటర్ నుంచి గిరీష్ లాంటి 200 వందలమంది నుంచి శీల రక్షణ చేయలేకపోయాడు. దానికి కారణం సరస్వతి ఉన్న ప్రీ సెక్స్ ఆలోచనే. అదే ఆమె కొంపను ముంచి, చివరకు బతుకు జీవుడా అని మోక్షం కోసం ప్రయాణం చేయడం ఆలోచనాత్మకమైనది. మొదట్లో పెంకిదిగా ఆ తర్వాత అమాయకమైన పాత్రగా, పిచ్చి పట్టినదానిలా కనిపించడం ఈ పాత్ర స్థితి.

4. భారతీయ సంస్కృతి ? రీటా :

సరస్వతి పాత్రకంటే భిన్నమైన విదేశీ పాత్ర రీటా. అమెరికన్ అయినప్పటికి ఇస్కాన్ ద్వారా భారతదేశానికి వచ్చి, భారత దేశం పట్ల విపరీతమైన భక్తి భావనను కనపరిచిన వ్యక్తి. వీళ్ళిద్దరూ రెండు ధృవాలు. సరస్వతి రాఘవరాం ను పెళ్లి చేసుకుంటుందని మొదట అని పిస్తుంది. కానీ అతడు చేసుకోడు. రీటా ను పీటర్ ఇష్టపడతాడు. అతడు పెళ్లి చేసుకుంటాడని అనుకుంటూ ఉంటాం. కానీ ఆమె అతన్ని ఇష్టపడదు.

బాధ్యతలు బరువులతో నలిగిపోతున్న కర్తవ్య నిష్ఠ పాత్ర రాఘవరాం. తమ్ముడికి ప్రేమ వివాహం చేసి, వాడికి ఉద్యోగం వచ్చేవరకు పోషిస్తాడు. అయినా వాడు చెడ్డ అలవాట్లకు లోనైన మొదటి సారి తన శక్తికి మించి అప్పుచేసి సహాయపడతాడు. రెండోసారి అలా చేస్తే క్షమించడు. దానితో విషం తాగి చనిపోతాడు. చుట్టాల తిట్ల భరిస్తాడు.

రాఘవరాం అయ్యప్ప దీక్ష చేపడతాడు. బ్రహ్మచర్య దీక్ష బాగా చేసే ప్రయత్నం చేస్తాడు. తండ్రి, తల్లి అప్పటికే చనిపోతారు. చిన్న ఉద్యోగంతో ఇద్దరు చెల్లెళ్లతో జీవనం చేస్తూ ఉంటాడు. అప్పుడే వాళ్ళ జీవితంలో ప్రవేశించిన అమెరికన్ రీటా అలియాస్ రుక్మిణి మొదటిగా సరస్వతితో పాటు విమానంలో పరిచయమైన రాఘవరాం కు పరి చయం అవుతుంది.

5. సెక్స్ ఈజ్ ప్లెజర్! ప్యూర్ ప్లెజర్! :

'ఒక పురుషుడు, స్త్రీకి మధ్య మాత్రమే కలిగే ప్రేమ అసలు ప్రేమ కాదంటాడు' భగవాన్. అది సంకుచిత ద ృక్పథం అంటాడు భగవాన్! సెక్స్ అనేది కాఫీ హౌటల్ లో కాఫీ తీసుకున్నంత సహజంగా ఉండాలంటాడు. ప్రేమే ఎస్‌కేఎస్ స్వాతంత్ర్యంలో వికసించి సర్వమానవ ప్రేమగా పరిణమిస్తుంది. 'మూడు వందల మంది సన్యాసులు, రెండువందల మంది సన్యాసినులు గిరీష్ ఆశ్రయంలో సాధన చేస్తున్నారు' (మూడో పురుషార్థము, పుట 314) అనడంలో సెక్స్ పట్ల గిరీష్ అలియాస్, అలియాస్ మదన్ లాల్, అలియాస్ పాండురంగ..... ఇలా పేర్లు మార్చుకున్న తెలివైన వ్యక్తి చేసిన ఒక దొంగ నియో సన్యాసి ఆశ్రమం.

'సెక్స్ ఈజ్ ప్లెజర్! ప్యూర్ ప్లెజర్! అనేకమైన మూఢ నమ్మకాలూ అన్న భావనలూ సెక్స్ లోని ఆనందాన్ని తగ్గించివేస్తాయి. అన్నిటికంటే ఘోరమైన విషయం ఏమి టంటే, సెక్స్ విషయాలు మాట్లాడదానికే భయపడతారు

ఇండియన్స్!.... చివరకు భార్యా, భర్తలు కూడా అది పాపమే అన్న భావంతో ఉంటారు.. సెక్స్ విషయంలో ఇండియన్స్‌ను ఆరోగ్యవంతులుగా చేయాలంటే యూరప్, అమెరికాలలోని యావన్మంది సెక్సాలజిస్టులను ఇండియాకు తెచ్చి, ఈ రోగాన్ని పూర్తిగా తగ్గించాలి. అందుకు శతాబ్దం పడుతుంది' (పుట 57) అనే అమెరికన్ వ్యక్తి పీటర్ భావనను, రచయిత పలికించాడు.

పైగా ఈ దేశస్థులకు సెక్స్ భావనను ఆరోగ్యకరంగా భావించిన భారత దేశంలో తెల్లవాళ్లు ప్రవేశించి ఈ దేశంలో దేవాలయాల మీద బూతు బొమ్మల్ని చూసి నోళ్ళు నొక్కుకున్నారు. అయినా ఆ బూతు బొమ్మలు స్త్రీని దేవతగా పూజించాలన్న భావనను దెబ్బతీయలేక పోయారు. కానీ స్త్రీని వ్యాపార వస్తువుగా, భోగ్య పదార్థంగా దిగజార్చి, స్త్రీలపై అత్యాచారాలు జరిపించింది, జరిపింది తెల్లవాళ్లే అని రాఘవరాం అనడం కొసమెరుపు.

6. ప్రతీ మూడ్ కు ఒక గాడ్ :

దైవత్వపు ఔన్నత్యాన్ని ప్రదర్శించినవారిలో అవతార పురుషుడు దేవుడు ఉన్నాడు. వాళ్ళంతా పెర్ముటేషన్ కాంబినేషన్ వల్ల అసంఖ్యాకులు అయ్యారు. అయ్యప్ప స్వామి ఆంజనేయుడిలా బ్రహ్మచర్యానికి చిహ్నం. సెక్స్, శృంగారం, బూతు సమాజంలో మితిమీరి పోయిన రోజు బ్రహ్మ చర్యానికి స్థానం ఏర్పడుతుంది. ఎక్కువ మంది బ్రహ్మచారులే అయితే దాంపత్య జీవితానికి ఆదర్శంగా సీతారాములుంటారు. ఒకే పెళ్ళాంతో కాపురం చేసి బోర్ కొట్టిన వారికి పదహారు వేల గోపికలతో విహరించిన కృష్ణుడు ఉంటాడు. ప్రతి మూడ్ కు ఒక గాడ్ ఉన్నాడు. నపుంసకులకు కూడా పేడి రూపంగా ఉన్న బృహన్నల దేవుడుగా కనిపిస్తాడు.

నిజానికి పరబ్రహ్మ అవగాహనకే కానీ, వారికి దేవుళ్ళ అవసరం ఉంటుంది. ఒక గదిలో టి.వి, ఫ్యాన్, లైటు ఉన్నాయి. వీటిని నడిపించేది విద్యుచ్ఛక్తి. విద్యుచ్ఛక్తి ఒకేలా ఉంటుంది. కానీ అది నడిపించే మిషన్ల స్వరూపం అసంఖ్యాకం. టి.వి సినిమా చూపుతుంది. లైటు కాంతిని ఇస్తుంది. ఫ్యాన్ గాలిని ఇస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ అసంఖ్యాకమైనా దేవుళ్ళను నడిపించే శక్తి ఏకైక శక్తి పరబ్రహ్మ శక్తి. (పుటలు 116-117) అని గ్రహించాలి. స్త్రీని శక్తిగా పోల్చడం ఇందులో భాగమే నని సూచన.

7. హంస దర్శనమే మోక్ష మార్గం :

ప్రాణమనేది ఎలా ఉంటుందో వైద్యులు ఇంత వరకూ చెప్పలేదు. ప్రాణం జీవాత్మ కలిసి ఉంటాయి. ఆ రెండింటిలో చలించేది ప్రాణమైతే చలనాన్ని కలిగించేది చైతన్యం. జీవాత్మ దానికి రేడియేషన్. దేహం అంతా వ్యాపించినా ప్రప్రథమంగా వెన్నుపూసలో రస గ్రంథి దాని స్థానం. ఆ రస గ్రంథి ఫస్ట్ లుంబార్ వెర్టెబ్రీ నుండి వెన్ను పూస మధ్యగా పైకి వెళుతుంది. ఫోర్త్ వెంట్రికల్ దాకా రసగ్రంథి నాడులు కలిసి వెళతాయి. అక్కడ నాడులు చీలి భ్రూమధ్యానికి వెళితే, రస గ్రంథి ఇంకా కొంచెం పైకి పోయి థర్డ్ వెంట్రికల్గా ఏర్పడుతుంది.

థర్డ్ వెంట్రికల్ నుండి రెండు ద్వారాల గుండా రసం ప్రవహించినట్లున్నా ఫస్ట్ అండ్ సెకండ్ వెంట్రికల్స్ ద్వారా ప్రవహిస్తుంది. ఈ రస గ్రంథి మొత్తం ఆకారం ఒక పక్షిలాగా ఉంటుంది. దానిని భారతీయుల హంస అన్నారు. దాని దర్శనం కలిగిన వారిని పరమహంసలన్నారు. వెన్నుపూసలోని రస గ్రంథి హంసకు సన్నని తోక. థర్డ్ వెంట్రికల్ హంస పొట్ట. అక్కడ నుండి లామినా టెర్మినాలిస్ అనబడే బ్రెయిన్ స్ట్రక్చర్ హంస ముక్కు. ఆ ముక్కు మూడవ కన్ను ప్రాంతంలో ఉంటుంది.

ఫస్ట్ అండ్ సెకండ్ వెంట్రికల్స్, సెరీబ్రం అంతా లోతట్టుగా వ్యాపించి హంస రెక్కలలాగా ఉంటాయి. వెన్నుపూసలో, సెరీబ్రంలో ప్రవహించే సెరోబ్రోస్పైల్ ఫ్లూయిడ్ అంతా ఎక్సరేలో పడే విధంగా రేడియో ఒసేక్ ఇంజక్షన్ ఇవ్వండి. అప్పుడు ఎక్సరేలో కనిపించే ఆకారం హంసను పోలి ఉంటుంది. భారతీయ ఆధ్యాత్మిక చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి హంస దర్శనం చేసుకున్న వారు వేలకు వేలు కనిపిస్తారు. కానీ అలా హంస దర్శనం చేసుకున్నవారు పాశ్చాత్య దేశాల మొత్తంలో ఒకే ఒక్కరున్నారు. అతనే ఏసుక్రీస్తు. (పుటలు 122-123)

ఇది రాఘవ రాం పాత్ర ద్వారా రచయిత చేసిన విశ్లేషణ. హంస దర్శనం అంటే మోక్ష గమనం. బైబిల్ లో స్వర్గం నుంచి ఒక హంస దిగి ఏసు క్రీస్తులో కలిసి పోయింది. ఆ రోజే క్రైస్తవులు నెత్తిన నీళ్ళు చల్లి బాప్టిజం ఇస్తారు. సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ లో ప్రతి ధ్వనించిన చైతన్యం జలజ్యోతి రూపంగా హంస రూపాన్ని సంతరించుకుని ఉంటుందట. 'ఆపో జ్యోతి రసో మృతం బ్రహ్మ'. 'అహం బ్రహ్మాస్మి' నేనే బ్రహ్మను అన్నారు వేదాంతులు. తద్వారా మోక్షాన్ని పొందటం వారి లక్ష్యం.

8. ఆధ్యాత్మికత - యోగ మోక్షం :

చతుర్విధ పురుషార్థాలలో భారతీయులకు ఉన్న విశిష్ట వ్యక్తిత్వం ఆధ్యాత్మికత. దానికి వారధి యోగ, జ్ఞాన మార్గాలు. ఇంకో ఉత్కంఠను రేపే విషయాన్ని రచయిత వివరించాడు. ఏసు క్రీస్తు యవనంలో ఇండియాకు వచ్చి పన్నెండు ఏళ్ళు యోగాభ్యాసం చేసి పరమ హంస అయ్యారు. ఇజాయిల్ వెళ్ళారు. అప్పుడు యూదులు ఆయన సిద్ధాంతాన్ని ఒప్పుకోక పోవడం వల్ల శిలువ వేశారు. శిలువ వేయడం ఆ దేశంలో ఉండే మరణ శిక్ష. ఏసు క్రీస్తు సర్వమానవ సౌభ్రాత్రుత్వాన్ని బోధించి అహింసా వగైరాలను చెప్పగానే అక్కడ స్థానం కోల్పోయాడు.

నరసింహయ్య పంకజం పాత తరానికి వారథులు. సుందరం వృత్తి రీత్యా వైద్యుడు. సరస్వతి అందానికి లోనైన కాముకుడు. అలాంటి పాత్రే నరసింహయ్య కారు డ్రైవరు రాజా. విచ్చలవిడి శృంగారానికి ప్రతీకగా గిరీశ్ మహర్షి పీటర్లు కనిపిస్తారు.

అమెరికా నుంచి వచ్చిన రీటా అలియాస్ రుక్మిణీ కృష్ణ భక్తురాలుగా భారతదేశంపట్ల ఆధ్యాత్మికను నింపుకున్న మనసుగలదిగా కనిపిస్తుంది. రాఘవరాంకి చేదోడువాదోడుగా భారతీయత నిండిన స్త్రీగా తనను తాను మార్చుకోవడంలో కృతకృత్యురాలయింది. గిరీష్ మహర్షి ఇచ్చిన షాక్ నుంచి తేరుకోవడానికి రాఘవరాంకి చాలా సమయం పట్టింది. రుక్మిణీ సహాయంతో సదాశివయ్య అనే రాజరాజేశ్వరి ఉపాసకుని సహాయంతో రాఘవరాం జబ్బు నుంచి బయట పడ్డాడు.

రాఘవరాం గిరీష్ మహర్షి బండారం బయట పెట్టాలని అతని వ్యక్తిగత జీవితాన్ని తెలుసుకోవాలని ప్రయత్నించాడు. ఆ నేపథ్యంలో సన్యాసి వేషం వేశాడు. అఘోరాల దర్శనం అయింది. గిరీష్ అనే వాడు ఆజ్మీర్ లో ఫకీర్ అబ్దుల్లాగా పేరు మార్చుకున్నాడని తెలుసుకున్నాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయిన గిరీష్ అలియాస్ పాండురంగ శనీశ్వర దేవాలయం దగ్గర చాలా మంది సన్యాసులతో కూర్చొని చాలా విషయాలు నేర్చుకున్నాడని, తరగతుల్లో ప్రథమ స్థానాన్ని సంపాదించాడని, ఎం.ఎ. ఫిలాసపీ చదివాడని రాఘవరాం అన్వేషించాడు. అఘోరేశ్వర్ అనే అఘోరాను దర్శించాడు రాఘవరాం. పాండురంగ వాక్చాతుర్యంతో రహస్య యోగాలు నేర్చుకొని స్త్రీ సాంగత్యాలకు అలవాటు పడ్డ పశువుగా అఘోరేశ్వర్ చెప్పాడు.

అఘోరేశ్వర్ సికింద్రాబాద్ స్టేషన్ లో ఆకలితో ఉన్నప్పుడు అతనెవడో తెలియకపోయినా బిచ్చగాడిగా ఉన్న అగోరేశ్వర్ కు చపాతీలు, కూర, అన్నం పెట్టి కడుపు నిండా భోజనం పెట్టాడు రాఘవరాం. ఆ విషయాన్ని అగోరేశ్వర్ గుర్తుపెట్టుకున్నట్లు గా రచయిత వివరిస్తాడు.

9. స్త్రీతోనే తంత్ర విద్య సాధ్యం :

తంత్ర విద్య ప్రాచీనమైనది. అస్సాం దీని పుట్టినిల్లు. విక్రమ్ సింఘ్ పేరుతో తంత్ర శాస్త్రంలో ప్రసిద్ధుడైన చంద్ర కాంత శర్మ దగ్గర ఆ విద్యా రహస్యాలను నేర్చుకున్నాడు. తత్త్వ శాస్త్రంలో మౌలిక భావనగా తత్త్వం అంటే నీవు, నీ ప్రపంచం. తత్ అంటే పరమాత్మ. త్వం అంటే నీవు. నీవు అంటే ఎవరు? జీవుడిలోని కోరిక. ఆ కోరికలు బలంగా బంధిస్తాయి. అవి తీరాలంటే అనుభవించాలి లేదా వదిలేయాలి. తాంత్రిక సాధనంలో స్త్రీ సహాయం అవసరం. అవిడ సాయంతో కుండలినీ శక్తిని జాగరణం చేసుకుంటారు. అవిడను ప్రత్యక్ష దైవంగా భావిస్తారు. కానీ విక్రమ సింఘ్‌కి ఇచ్చిన యోగిని ద్వారా శక్తులను

సంపాదించి చంద్రకాంత్ శర్మను మోసం చేసి ఏవోవో కలగలిపి, స్త్రీ సాంగత్యానికి అలవాటు పడి, పారిపోయిన విక్రమ సింఘే, గిరీష్. అయితే ఆమలోలి అనే యోగ విద్యని భైరవి మాతగా ఒక యోగిని అభ్యాసం చేస్తుందని, ఆమెను చూసిన వ్యక్తిలోని శక్తిని హరిస్తుందని, అలాంటి సమ్మోహన సిద్ధిని సాధించిందని, ఇదంతా విక్రమసింఘే మీద పగ తీర్చుకోవాలని భైరవి మాత సంకల్పించు కుందని చంద్రకాంత శర్మ వివరిస్తాడు. భైరవి సహాయంతో గిరీష్‌ని అంతరింపజేసి సరస్వతిని కాపాడటం ఒక మలుపు. గిరిష్ ఆశ్రమంలో ఏకాంతంగా ఉన్నప్పుడు హార్ట్ అటాక్ వచ్చిందని, నర్వస్ బ్రేక్ డౌన్ అయి చనిపోయాడని ఇలా ఊహాగానాలు వచ్చినట్లు గిరీశం కథను ముగిస్తాడు, రచయిత.

10. మోక్ష మార్గం :

మొత్తం మీద మోక్షం పొందాలనుకున్నవారు కేవలం కామం ద్వారా మోక్షం పొందలేరని, హృదయ పూర్వకంగా శక్తిని ఉపాసించాలని, యోగ్యుడైన గురువు, యోగ సాధన అవసరాలుగా కనిపిస్తాయని సూచిస్తారు. ఆత్మ, మనస్సు, మోక్షం, నరకం, దేవుడు మొదలైనవి శక్తిగా ఎలా మార్చు కోవాలో రాఘురాం, సదాశివయ్య, చంద్రకాంత్ శర్మ పాత్రలద్వారా సూచించే ప్రయత్నం రచయిత చేశారు. మనుషులు ప్రతీదీ గుడ్డిగా నమ్మినంతకాలం గిరీష్ లాంటి దొంగ బాబాలకు వారి అమాకత్వం ఆయుధాలే. 'నువ్వు దేవుడితో మాట్లాడితే ప్రార్థన, దేవుడు నీతో మాట్లాడాడంటే పిచ్చి' అని సుప్రసిద్ధ సైకియాట్రిస్టు థామస్ సాజ్ సూక్ష్మంగా చెప్పిన సత్యాన్ని ఈ నవలలో సాలోచించాలి. సాజ్ దృష్టిలో మతాన్ని సృష్టించిన మనిషే మత్తును కూడా సృష్టించుకున్నాడంటారు.

మాటలగారడీలో పడి కొట్టుకుంటున్నామని సాజ్ వాదన. జబ్బు వస్తే, డాక్టర్లు నయం చేయాలేగాని, ఉద్దేశాలు అంటగట్టరు. సైకియాట్రిలో ఉద్దేశాలు చుస్తున్నారు. ఒక 42 ఏళ్ళస్త్రీ తాగి, కారునడుపుతుండగా, పోలీసు పట్టుకొని వూపిరి పరీక్ష (తాగుడు నిర్ధారణకు) చేయబోగా ఆమె నిరాకరించింది. తన్నేసింది, అరిచింది. గొడవ చేసింది. కోర్టులో న్యాయమూర్తి ఎదుట చెబుతూ, బహిష్టుకు ముందు లక్షణాలుగా తన ప్రవర్తనను వివరించింది. కోర్టు ఆమెను వదిలేసింది! సాజ్ యిలాంటి ఉదాహరణలు యిస్తూ, నేరానికీ రోగానికీ తేడా చూడ నప్పుడు యిలాంటి స్థితి వస్తుందన్నాడు. సైకియాట్రి పేర్కొనే అనేక లక్షణాలు వ్యక్తిగత, ఆర్థిక, చట్టబద్ధ, సామాజిక, రాజకీయరంగాలకు చెందినవని, వైద్యరంగం లోకి రానివనీ సాజ్ చూపారు. సాజ్ వాదనలకు సమా ధానం చెబితే, సైకియాట్రిస్టుల వృత్తు దెబ్బతింటుంది. ఆదాయం పోతుంది. కనుక వాదనకు దిగరు. శాస్త్రీయ వివరణకు పూనుకోరు. తమ పలుకుబడి వినియోగించి పెత్తనం చేస్తున్నారు. ఇలాంటి లక్షణాలతో పాటు గిరీష్ కు ఇంకో రెండు ఆకులు ఎక్కువనే చదువుకున్నాడు. పాశ్చాత్యుల అర్థ కామాలను పట్టుకొని మోక్షగాములు కావడం కంటే భారతీయ తాత్వికులు చూపిన యోగా, ఉపాసనశక్తిని సక్రమంగా వాడుకున్నప్పుడే మూడో పురుషార్థయుక్తి శక్తిగా మారుతుందని శాస్త్రీయంగా సాధికారికంగా ఈ నవలలో చర్చించారు.

ఆధారాలు :

1. అంతర్జాలం
2. ఆంధ్ర మహా మహాభారతం- కవిత్రయం(తిరుమల తిరుపతి ప్రచురణ)
3. మూడో పురుషార్థం నవల- చివుకుల పురుషోత్తం
4. సిగ్మండ్ ఫ్రాయిడ్
5. Insanity : The Idea and Its Consequences - Thomas Szasz

❖ ❖ ❖

"జానపద సాహిత్యంలో ధర్మ, అర్ధ, కామ మరియు మోక్షాలు

– ఖలీమ్ పాషా, తెలుగు అధ్యాపకులు, ఫాతిమ విద్యా కళాశాల, ఫాతిమనగర్, కాజీపేట, వరంగల్ అర్బన్, తెలంగాణ.

పరిచయం :

జానపదం అంటే గ్రామం. జానపదాల్లో నివసించేవారు జానపదులు. జానపదులకు వారి జీవనానికి సంబంధించిందంతా జానపదమే. వారు జీవనవిధానంలోని మంచి చెడులన్ని జానపదమే. జానపదుల వృత్తులు, ఆహారం, విశ్వాసాలు, అలంకరణలు,ఆచారాలు, నమ్మకాలు, పాటలు, సామెతలు, పొడుపు కథలు, కథలు మొదలైనవి జానపద సాహిత్యం పరిధిలోకి వస్తాయి. జానపద సాహిత్యం ప్రపంచ మానవ జీవితమంత విస్తృత పరిధి కలదు. విశ్వమానవ జీవన విధానానికి మూలాలైన చతుర్విద పురుషార్థాలు జానపద సాహిత్యంతోనే ముడివేసుకున్నవి. భూమిపై మానవుని రాగద్వేషాలు విచక్షణ కలిగిననాడే పురుషార్థాలు పుట్టాయని తద్వారా జానపద సాహిత్యం పుట్టిందని కూడా చెప్పవచ్చు. జానపద విజ్ఞానం లేని జాతి ఏది ప్రపంచంలో ఉండదు. భౌగోళికంగా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న విశ్వాసాల్లో, జీవన విధానాల్లో కొన్ని సారూప్యాలు ఉంటాయి. ఆహార సేకరణ దశను దాటి మానవుడు ఆహారోత్పత్తి దశకు చేరుకున్నప్పుడే జానపదాలు ఏర్పడుతాయి. తద్వారా జానపద సాహిత్యం వెల్లివిరుస్తుంది.

గ్రాంధిక సాహిత్యానికి మూలాలు జానపదంలోనే కనబడతాయి. దంపుడు పాట, ఇసుర్రాయిపాట, బతుకమ్మ పాట, కోలాటం పాట, మోట పాట, మొదలైన శ్రామిక గేయాలే ఆ తర్వాత తరువోజ, మంజరి ద్విపద, ద్విపద, తేటగీతి, ఆటవెలది, సీసం, మొదలైన పద్య ప్రక్రియలుగా రూపుదాల్చాయి.

లక్ష్యాలు :

అ. జానపద సాహిత్య పుట్టుక, జానపదుల జీవితాన్ని తెలుపుట.

ఆ. చతుర్విద పురుషార్థాలు అయిన ధర్మ, అర్ధ, కామ, మోక్షాల మధ్య సంబంధమును తెలుపుట.

ఇ. సామాజిక జీవనమే జానపద సాహిత్యము అని తెలుసుకొనుట.

ఈ. ప్రాచీన యుగంలో కవుల రచనా విధానంలో జానపద సాహిత్య విధానం తెలుసుకొనుట.

ఉ. జానవద సాహిత్యం ద్వారా చతుర్విద పురుషార్థాలు అయిన ధర్మ, అర్ధ, కామ మరియు మోక్షం ద్వారా పొందే విలువలను తెలుపుట.

ఊ. జానపద సాహిత్య పరమార్థిక గేయాల పరమార్థమే మోక్షమని తెలుసుకొనుట.

ప్రాచీన యుగంలో జానపద సాహిత్యంలో పురుషార్థల ద్వారా విలువల స్థాపన.

నన్నయ్య తన రచనలో తన కాలంలో వ్యాప్తిలో ఉన్న నాగగీతాలు అనే రాగయుక్త గేయాలను అభినయంతో కూడిన అంతులను పేర్కొన్నారు. మన భారత దేశ సాహిత్య చరిత్రలో జానపద సాహిత్యం రెండు వేల సంవత్సరాల నాటిదిగా భావిస్తున్న భరతుని నాట్య శాస్త్రంలో దేశి నాటక రూపక ప్రక్రియల వివరణలు ఉన్నాయి. హాలుని గాధా సప్తశతిలో వివిధ పరోక్ష ఆధారాలు ఉన్నాయి. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర, బసవ పురాణం అనే శైవసాహిత్య గ్రంధాలను దేశి సాహిత్యంలో రచించాడు. ద్విపద చంధస్సు జానపద సాహిత్యానికి దగ్గరి రూపం. జానపద గేయాల్లో ఈ చంధస్సు రూపాలు ఉన్నాయి. జానపదులైన శివభక్తుల జీవితాలను, కథలను, విపులంగా వర్ణించిన సోమన వాటిలో భాగంగానే జానపద కళలను వివరించాడు. వీని ద్వారానే శివైక్య మోక్ష విధానాన్ని తెలియపరిచినాడు.

బసవ పురాణంలో చెప్పిన భక్తి పాటలు శివ భక్తుల ఇండ్లలో వేదాల్లాగా వల్లించేవారట. అవే చతుర్విద

పురుషార్థాలుగా భావించేవారట. పండితారాధ్య చరిత్రలో సోమనాధుడు దేశి కళా రూపాల్లో వెడయాక (వికట నర్తనం) చిందు కోడంగి యాటలు, కోణంగి ఆట (ఇది హాస్య నృత్యం) పేరిణి, బహునాటకాలు, బహురూపుల వెడ్డంగము, అమర గందర్వాందనల నృత్యానుకరణలు, పక్షుల ఆటలు, గడాటలు, దొమ్మరాటలు, భారతాది కథల ఛాయాచిత్రాలు, బొమ్మలాటలు, పగటి వేషాలు, మొదలైన వర్ణనలో మరియు శివరాత్రి జాగరణ సమయంలో చేసే వేడుకలు, ఉత్సవాల ద్వారా లోకం పోకడలను, ధర్మ సమ్మతమైన విషయాలను, న్యాయ సమ్మతమైన విషయాలను, మనో వైజ్ఞానిక విలువలను, ఆధ్యాత్మిక విలువలను, ఆర్థిక విలువలను, నైతిక విలువలను పొందడం ద్వారా చతుర్విద పురుషార్థాలు అయిన ధర్మ, అర్థ, కామ, మోక్షం జరుగుతుందని ప్రగాఢ విశ్వాసాలను ప్రకటించారు సోమన గారు.

జానపద సాహిత్యం, జానపదుల జీవితం :

జానపద సాహిత్యంలో ప్రదర్శన కళలు మనస్సును రంజింపచేయడానికి ఏర్పడినవైనా వాటిలో జానపద జీవితం ప్రతిఫలిస్తూనే ఉంటుంది. ఎందుకంటే కళలు కూడా జీవితం నుండి పుట్టినవే. జీవితం అంటే కేవలం సామాజిక సంబంధాలు మాత్రమే కాదు. జానపదుల ధార్మిక జీవితానికి సంబంధించిన నమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయాలు, పూజలు, వ్రతాలు, మొదలైనవన్ని జీవితంలోని భాగాలు. మత సంబంధమైన కర్మ కాండలు తర్వాతి కాలంలో పండుగలు, ఉత్సవాలుగా మారటాన్ని మనం గమనించవచ్చు. యక్ష గానాల వంటి జానపద రూపకాలలో ప్రాచీన కాలం నాటి ధార్మిక సాంప్రదాయాలను సూచించే స్తుతులు, పూజలు కూడా చోటు చేసుకుంటాయి. అవే జానపదుల జీవితంలోని ప్రధాన ఘట్టాలైన పురుషార్థాలు. ఈ కళలు జీవితం నుండే పుడుతాయి. జీవిత సత్యం ద్వారా ధర్మాలను ఆచరించడం జరుగుతుంది. వాటిని వారు అమలులోకి పెట్టి ప్రదర్శిత కళలను చేయడం జరుగుతుంది. వారి యొక్క కోరికలను సాధ్యమైనంత వరకు ఉన్నవాటితో తృప్తి చెందడం గమనించవచ్చు. పారమార్థిక గేయాలలో ఇమిడి ఉన్న పరమార్థం ద్వారా మోక్ష సాధనకు గురవుతారని వారి ప్రగాఢ విశ్వాసం.

ఏ పనినైనా పాటలు పాడుతూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అలవోకగా పూర్తి చేసే నిష్ట జానపదులది. ఈ విధంగా శ్రామిక గేయాలను పాడుతూ తమ సంపదను వృద్ధి చేసుకుంటు 'అర్థ' (సంపద)ను గడిస్తారు. ఈ విధంగా "శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్" అన్న శ్రీశ్రీ మాట జానపదుల విషయంలో అక్షర సత్యం.

జానపద సాహిత్యం – జనకళ – రంజన కళ :

జానపద సాహిత్యంలో జన కళలు ఎప్పుడు ప్రయోజన కళలే కాని అవి మనో రంజనాలు కూడా. సత్కావ్యానికి చెప్పిన లక్షణాలన్ని సత్కళా రూపాల్లో ప్రతి దానికి వర్తిస్తాయి.

భామహుడు సాధుకావ్య ప్రయోజనాన్ని ఇలా చెప్పాడు.

ధర్మార్థకామ మోక్షేసు
వైచక్షణ్యం, కళాసుచ
కరోతికీర్తిం ప్రీతించ
సాదు కావ్య నిషేవణం

చతుర్విద పురుషార్థాల పట్ల కళలలో కూడా విచక్షణా జ్ఞానాన్ని, కీర్తిని, ఆనందాన్ని సాదు కావ్యానుభవం కలిగిస్తుంది. ఆదిలో మనకు మూడే పురుషార్థాలు ఉండేవి. వీటినే త్రివర్గ పురుషార్థాలుగా పిలిచేవారు. మధ్యలో మోక్షాన్ని తీసుకువచ్చారు. వాత్సాయనుడు తన కామసూత్రాలను రచిస్తున్న కాలంలో (క్రీస్తు పూర్వము రెండవ శతాబ్ది) మూడే పురుషార్థాలు ఉండేవి. అందుకే మొట్టమొదట "ధర్మార్థ కామేభ్యోనమః" అని మూడింటికే నమస్కారం చేశాడు. బాల్యంలో ఆర్థిక విద్య గ్రహణాన్ని, యవ్వనంలో కామాన్ని, ముసలి తనంలో ధర్మాన్ని ఆచరించాలని చెపుతూ పరమతాపేక్ష వల్ల మాత్రమే ఇక్కడ

మోక్షాన్ని వార్ధక్యంలో ఇమిడ్చాడు. ధర్మం అంటే యుగ ధర్మం, అర్థం అంటే తత్కాల జాతీయార్థిక విధానం, కామం అంటే కులాచారాలు అంగీకరించే వావి వరసలున్న వాళ్ళు చట్ట సంబంధంగా పెట్టుకునే లింగ సంబంధాలు. ఏ సమాజంలోనైనా ప్రజా జీవితం సాఫీగా సాగాలంటే ఈ ధర్మార్థ కామాలు మూడు సజావుగా సాగాలి. ధర్మం ఎప్పుడూ ప్రభు సమ్మితం, అర్థం మిత్ర సమ్మితం, కామం కాంతా సమ్మితం అని చెప్పుకోవచ్చు.

వర్ణాశ్రమ ధర్మాలు ఏర్పడకముందు నుంచి మానవ సంఘాలలో అర్థ కామాలు తప్పనిసరిగా ఉండేవి. తిండి కోసం తిప్పలు పడడం, ఆహార సేకరణ దశలోను, తీరు తెన్నులు ఏర్పర్చుకొనడం, ఆహారోత్పత్తి దశలోను మానవ సంఘాల ఆర్థిక విధానాలు రూపొందాయి. ఇప్పటికి జానపద సాహిత్యం - కళా కారులలో ఇంటిల్లిపాది వివిధ కళలకు అంకితం అవడం చూస్తున్నాం. జానపదుల జాంబ పురాణం, మాతా పురాణం మొదలైనవి అష్టాదశ పురాణాల్లో వేటికి తీసిపోవు.

ముగింపు :

జానపద సాహిత్యం మన జాతీయ సంపద అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఆసేతు హిమాచలం - ఆ మాటకొస్తే ప్రపంచంలో ఉండే ప్రతి మానవుడి హృదయాన్ని ఆ హృదయం పొందే సుఖాలను, దుఃఖాలను, అనుభవాలను అన్నింటిని మనం అనుభవించేటట్లు చేసేవే జానపద సాహిత్యంలోని అంశాలు. జానపద సాహిత్యమే ఇతిహాసాలకు మూల కందాలని చెప్పడంలో అతిశయోక్తి లేదు. మానవుని రాగద్వేషాలు, విచక్షణ వలననే చతుర్విద పురుషార్థాలు తెరపైకి వచ్చాయని ధర్మ, అర్థ, కామ అనే త్రివర్గ పురుషార్థాలు మనం బ్రతకడం కోసమని, చివరి పురుషార్థమైన మోక్షంను పరమ పురుషార్థంగా భావించి ఇదే మానవ జన్మ లక్ష్యమని, జానపద సాహిత్యం ద్వారా జీవిత సత్యాలను, ధర్మ సమ్మతమైన సత్యాలను ఆచరించడం జరుగుతుంది.

కానీ ప్రస్తుతం ఆధునిక యుగ ప్రభావం వల్ల సాంకేతిక విజ్ఞానాభివృద్ధి ప్రపంచ స్వరూప స్వభావాలను మార్చి వేస్తున్నది. నగరాలు అభివృద్ధి చెందుతున్నాయి, పల్లెలు మాత్రం కుంచించుకుపోతున్నాయి. పేదల బతుకుల్లో వెతను నిండుకుంటున్నాయి. వ్యాపార, వాణిజ్య, సాంస్కృతుల ప్రబలడం వల్ల స్వార్థం పెరిగిపోయింది. సమిష్టి కుటుంబాలు విచ్ఛినమై వ్యష్టి కుటుంబాలు ఏర్పడుతున్నాయి. కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు తరిగిపోతున్నాయి. మానవ విలువలు, నైతిక విలువలు ఆచార సాంప్రదాయాలు, ప్రాధాన్యాన్ని బోధించే పాటలు, కథలు మరుగునపడిపోతున్నాయి. జానపదుల పండుగల్లో ప్రదర్శించే కళా రూపాలకు పాశ్చాత్యీకరణ ప్రభావం వల్ల ఆదరణ లభించడంలేదు. కళాకారుడు తమ కళలను వదిలి పట్టణాల్లో కూలీ పనులు వెతుక్కుంటున్నారు.

ఈ విధంగా జానపద సాహిత్యం కనుమరుగయ్యే పరిస్థితిని రానివ్వకుండా జానపద కళా రూపాలు, కళల పట్ల చైతన్యం తీసుకువచ్చి ధర్మ, అర్థ, కామ, మరియు మోక్ష మార్గాల ద్వారా మానవ విలువలను, నైతిక విలువలను, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే విధంగా ప్రయత్నం చేయాలని అభిలశిస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

అ: డాక్టర్ నాయిని కృష్ణ కుమారి 1990 "తెలుగు జానపద గేయ గాథలు" తెలుగు అకాడమి
ఆ: మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి 1992 "తెలుగు వారి జానపద కళా రూపాలు"
ఇ: డాక్టర్ జి.నాగయ్య 1995 "తెలుగు సాహిత్య సమీక్ష" మొదటి సంపుటం, నవ్య పరిశోధక ప్రచురణలు (తిరుపతి)
ఈ: డాక్టర్ జి.నాగయ్య 1995 "తెలుగు సాహిత్య సమీక్ష" రెండవ సంపుటం, నవ్య పరిశోధక ప్రచురణలు (తిరుపతి)

ఉ: ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి 1991 "తెలుగు సాహిత్య చరిత్ర" - ప్రథమ భాగం

ఊ: డాక్టర్ ఆర్వీఎస్ సుందరం 1993 "జానపద సాహిత్య స్వరూపం" విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.

ఎ. రచయితల బృందం 2009 డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఎంఎ, జానపద విజ్ఞానం

ఏ. ఆరుద్ర రచనలు 2010 "ప్రజా కళలూ-ప్రగతి వాదులూ" విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్.

❖❖❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

"రామో విగ్రహవాన్ ధర్మః"

- కందిళ్ల వనదుర్గి రోహిణి, తెలుగు అధ్యాపకురాలు, ఎ.పి. సోషల్ వెల్‌ఫేర్ ఐ.ఐ.టి. మెడికల్ అకాడమి, ఈడుపుగల్లు, విజయవాడ, కృష్ణాజిల్లా.

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యమైన రామాయణ మును రచించి, వాల్మీకి మహర్షి "ఆదికవి"గా కీర్తిని పొందాడు. రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం అను మూడుపేర్లు దీనికి కలవు.

"కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్"

ఇక్ష్వాకు వంశంలో పుట్టి, రాముడనే పేరుతో ప్రఖ్యాతి వహించిన వ్యక్తిలో ఈ సద్గుణాలన్నీ వున్నాయి. శ్రీరాముని ప్రతీకార్యమూ అనుకరించదగినదే.

ABSTRACT (నైరూప్యము) :

శ్రీరాముడు సాక్షాత్తూ పరబ్రహ్మ పరమాత్మ. అతడు ధర్మ సంరక్షణార్థం, లోకోద్ధరణ కోసమే అవరించాడు. శ్రీరాముని ప్రతీ కార్యమూ అనుకరించదగినదే. శ్రీరాముని మాతృభక్తి, పితృభక్తి, ఏకపత్నీవ్రతం, భ్రాతృప్రేమ, సఖ్యప్రేమ శరణాగతి వాత్సల్యం, కృతజ్ఞత్వం, ప్రజా రంజకత్వం, పరాక్రమం, నిర్భయత్వం వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం, జీవకారుణ్య భావన, ప్రకృతి లాలన" ఇలా జీవిత పార్శ్వాలెన్నింటినో పట్టి చూపిస్తుంది. రామాయణం ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే, మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నిస్తుంది. వాల్మీకి రామాయణంలో శ్రీరామ చంద్రుని గుణవర్ణన అద్భుతంగా ఉందనెడి భావన కలదు. మన దేశంలోనే కాదు, ప్రపంచంలోని పలు దేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది.

శ్రీరాముని ఆదర్శ గుణాలు :

శ్రీరాముని మాతృభక్తి : శ్రీరాముని మాతృభక్తి ఆదర్శవంతమైనది. దానిని సంపూర్ణంగా వర్ణించడం అసంభవం. కైకేయీ మాత శ్రీరాముని పట్ల కఠోరంగా ప్రవర్తించినా, ఆమె పట్ల ఎల్లప్పుడూ భక్తిప్రపత్తులతో ఉంటూ, ఈవిధంగా అంటాడు.

"యస్యా మదభిషేకార్థే మానసం పరితప్యతే
మాతా నఃసాయధా నస్యాత్ సవిశంకా తధాకురు
తస్యాః శంకామయం దుఃఖం ముహూర్తమపి నోత్సహే
మనసి ప్రతి సంజాతం సౌమిత్రేఽముపేక్షితుమ్"
నబుద్ధి పూర్వం నా బుద్ధం స్మరామీహ కదాచన
మాతృణాం వా పితుర్వాహం కృతమల్పంచవిప్రియమ్"

లక్ష్మణా! నా రాజ్యాభిషేకం కారణంగా పరితపిస్తున్న కైకేయీ మాతకునాపట్ల ఏవిధమైన సందేహం కలుగకుండా ఉండేలా నువ్వు వ్యవహరించాలి. ఆమె మనసులో సందేహం కారణంగా కలిగిన దుఃఖాన్ని నేను క్షణకాలం కూడా భరించలేను అని పలికెను. ఇదే కాకుండా చిత్రకూటం నుండి మరలే వేళలో భరతునితో రాముడంటాడు. సోదరా! భరతా! కైకేయీ మాత నీకోసం రాజ్యకాంక్ష వలన స్వార్థం కారణంగా చేసిన దానిని నీవు మనసులో ఉంచుకోకు అని పలికెను. శత్రుఘ్నునితో కూడ సోదరా! నేను నీమీద, సీతమీద ప్రమాణం చేసి చెపుతున్నాను. నువ్వెప్పుడూ కైకేయీ మాతని సేవిస్తూనే ఉండాలి అంటాడు. అడవులలో ఉండే కాలంలో లక్ష్మణుడు కైకేయిని నిందిస్తాడు. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణునితో సోదరా! నువ్వెప్పుడూ కైకేయీ మాతను నిందించరాదు. అనే మాటల వల్ల శ్రీరామునికి అన్య మాతల పట్ల ఉన్న శ్రద్ధా భక్తులని గమనించగలం. ఒకనాడు దశరథ చక్రవర్తి యొక్క ఇతర రాణులందరూ రామచంద్రుడు అరణ్యాలకు పోయే వేళ విలపిస్తూ ఈవిధంగా అంటారు.

"కృతేష్వచోదితః పిత్రా సర్వస్యాన్తఃపురస్య చ
గతిశ్చ శరణం చాసీత్ సరామోఽద్య ప్రవత్స్యతి॥
కౌసల్యాయాం యధాయుక్తో జనన్యాం వర్తతే సదా
తధైవ వర్తతేఽస్మాసు జన్మప్రభృతి రాఘవ"

తండ్రి ఆదేశించకపోయినా రాముడు నేడు అడవులకు వెళుతున్నాడు. అతడు తన తల్లి అయిన కౌసల్యతో వ్యవహరించినట్లే మన విషయంలో కూడా ప్రవర్తించి నాడు. దీని వలన రామభద్రుని మాతృభక్తి మనకు తెలుస్తున్నది.

శ్రీరాముని పితృభక్తి : శ్రీరాముని పితృభక్తి కూడా అద్భుతంగా ఉంది. తండ్రి ఆదేశాన్ని పాలించే విషయంలో కైకేయీ మాతతో శ్రీరాముడు ఈవిధంగా అంటాడు.

"అహం హివచనాత్ రాజ్ఞః పతేయమపి పావకే
భక్షయేయం విషం తీక్ష్ణం పతేయమపి చార్ణవే!
నహ్యతో ధర్మచరణం కిఞ్చిదస్తి మహత్తరమ్
యధాపితరి శుశ్రూషా తస్యవా వచన క్రియా!!

ప్రభువులు ఆదేశిస్తే నేను అగ్నిలోనైనా దూకుతాను. కఠోర విషాన్నైనా తాగుతాను. సముద్రంలోనైనా పడి పోతాను. పితృసేవ, పిత్రాజ్ఞను పాలించడం వేటికి మించిన ధర్మం ప్రపంచంలో మరొకటి లేదు. ఆ తరు వాత అతడు తల్లి కౌసల్యతోకూడా ఈవిధంగా అంటాడు.

"నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుంమమ
ప్రసాదయే త్వాం శిరసా గన్తుమిచ్ఛామ్యహం వనమ్"!

"అమ్మా! నీ పాదాలపై శిరసు నుంచి ప్రసన్నురాలివి కావలసిందిగా ప్రార్థిస్తున్నాను. పితృవాక్యాలను తిరస్కరించే శక్తి నాకు లేదు. కాబట్టి నేను అడవులకు వెళ్లబోతున్నాను. రామచంద్రుని బాల్యగాధలు వర్ణించే వేళలోకూడా అతడు సర్వదా పితృసేవలో ఉండే వాడనే ఉంది.

ఏకపత్నీ వ్రతం : రామచంద్రుని ఏక పత్నీ వ్రతం అత్యంత ఆదర్శవంతమైనది. అతడు కలలోకూడా సీతాదేవిని తప్ప, ఇతరులెవరినీ వరించలేదు. సీతను అడవులకు పంపివేసిన తరువాత యాగం చేయవలసి వచ్చి, భార్య కావలసి రాగా, అతడు సీతాదేవి స్వర్ణ మూర్తితోనే కార్యాన్ని నెరవేర్చుకుంటాడు. కావాలనుకుంటే అతడు ఆ సమయంలో రెండో పెళ్ళి చేసుకొనేవాడు. దానివలన అతనికి అపకీర్తి కలుగదు. స్త్రీకి పాతివ్రత్య విధానమున్నట్లే పురుషునికి ఏకపత్నీ వ్రతము అవసరమను విషయాన్ని చరితార్థం చేసి చూపాడు. స్త్రీ పురుష సంబంధం భోగానుభవం కోసం కాదు. ధర్మాచరణ కోసమని తెలియజేశాడు.

శ్రీరామచంద్రునికి సీతపట్ల ఎంత ప్రేమ ఉందో సీతను అపహరించిన తరువాత గల ఘట్టాన్ని చదివితే మనకు కొంత మేరకు తెలుస్తుంది. శ్రీరాముడు పరమ వీరుడు, ధీరుడయినా కూడా ఓసామాన్య మానవునిలాగ విరహంతో పిచ్చివాడిలా, పశు, పక్షి, వృక్ష, లత, పర్వ తాలను కూడా సీతజాడను గురించి ప్రశ్నిస్తూ, అనేక విధాల విలపిస్తూ ఓ వనము నుండి మరో వనానికి తిరుగుతూ ఉంటాడు. అప్పుడప్పుడూ దుఃఖంతో మూర్ఛ పోతాడు. ఆ సమయంలో వర్ణన మిక్కిలి హృదయ విదారకంగా ఉంటుంది.

భ్రాతృప్రేమ : శ్రీరామచంద్రుని భ్రాతృప్రేమ కూడా మహోన్నతమైనది. అతడు తన సోదరులయందు విశేషమైన ప్రేమను కలిగి ఉండేవాడు. ఎల్లప్పుడూ వారిని రక్షిస్తూ ఉండేవాడు. వారిని ప్రసన్నంగా ఉంచడానికి ప్రయత్నించే వాడు. సోదరులు నలుగురూ ఒక్కసారే గుఱ్ఱాలు ఎక్కి విహరించేవారు. రామచంద్రునికి లభించే ఉత్తమ వస్తు, ఆహార పదార్థాలలో ఏవి లభించినా అతడు వాటిని ముందు సోదరులకిచ్చేవాడు. శ్రీరామునికి సోదరిలందరియందూ సమాన ప్రేమే వున్నా, లక్ష్మణునికి మాత్రం రామునియందు విశేష స్నేహం ఉండేది. అతడు కొన్ని క్షణాలైనా రామునితో ఎడబాటుని సహించలేక పోయేవాడు.

"అమ్మా! భరతుడు నా లాగే నిన్ను సేవిస్తాడు" అని పలుకుతూ, అదే సమయంలో సీతను భవనంలోనే ఉండమని నచ్చచెబుతూ ఈవిధంగా అంటాడు.

"భ్రాతృపుత్రసమౌ చాపి ద్రష్టవ్యౌ చ విశేషతః
త్వయా భరత శత్రుఘ్నౌ ప్రాణైః ప్రియతరౌమమ॥"

సీతా! నా సోదరులైన భరత శత్రుఘ్నులు నాకు ప్రాణాల కన్నా అత్యంత ప్రియులు. కనుక నీవు వారిని నీ సోదరులవలె, పుత్రులతో సమంగానే కాక, అంతకన్నా ప్రేమగా చూసుకోవాలి. తరువాత లక్ష్మణుడు తాను కూడా అడవులకు వస్తానని చెప్పినపుడు రాముడు లక్ష్మణునితో అక్కడే ఉండమని నచ్చచెబుతూ.

"స్నిగ్ధో ధర్మరతోధీరః సతతం సత్పథే స్థితః
ప్రియః ప్రాణసమో వశ్యోవిజేయశ్చ సఖాచమే"!

లక్ష్మణా! నీవు నా స్నేహితుడవు. ధర్మాన్ని ఆచరించే వాడివి, ధీరుడవు, సన్మార్గంలో నడిచేవాడివి. నాకు ప్రాణంతో సమానుడవు. నా వశమందుండునట్టి వాడవు. అజ్ఞాపాలకుడవు. స్నేహితుడవు కూడా" అని పలికెను. వనవాసకాలంలో కూడా శ్రీరాముడు లక్ష్మణునికి, సీతకూ సుఖాన్ని చేకూర్చాలని ప్రయత్నించేవాడు. రామరావణ యుద్ధం జరిగినపుడు రావణుని శక్తి లక్ష్మణుడిని మూర్చిల్లేలా చేయగా, రాముడు దుఃఖించిన తీరు చూస్తే అతనికి లక్ష్మణునిపై ఎంత ప్రేమ ఉన్నదీ తెలియుచున్నది.

సోదరుల కోసమే రాజ్యాన్ని స్వీకరించడం, భరతుని రాజ్యాభిషేక విషయాలను విని, పరమానందంగా తన హక్కును విడిచి పెట్టడం, కైకేయి కారణంగా తన రాజ్యాభిషేకం ఆగిపోయినా భక్తి భావంతో ఆమెను ఆదరించడం, భరతుని గుణాలను గానం చేయడం, భరతునిపై అనుమానం, కోపం కలిగిన లక్ష్మణునికి నచ్చచెప్పడం, స్వార్థాన్ని పరిత్యజించి అందరి యందూ ప్రేమ కలిగి ఉండడం, కృతఘ్నునికి ఇష్టం లేకపోయినా, అతనిచేత రాజ్యాన్ని పాలింప జేయడం ఈవిధంగా శ్రీరాముని ఆదర్శ భ్రాతృ ప్రేమయందు మనం నీతిని గ్రహించాలని భావన.

సఖ్యప్రేమ : శ్రీరామునికి తన మిత్రులయందు కూడా వెలకట్టలేని ప్రేమ ఉంది. ఆయన తన మిత్రుల కోసం ఎంతగా సహకరించినా దానిని అసలు తన మనసులో ఉంచుకునే వాడే కాదు. కానీ తన విషయంలో మిత్రులు చేసిన అల్పకార్యాల విషయంలో కూడా వారిని ప్రశంసించేవాడు. అయోధ్యలో శ్రీరామునికి రాజ్యాధిషేక మైన తరువాత, ప్రధాన వానరులను తన దగ్గరికి పిలిచి, ప్రేమగా చూస్తూ ఈవిధంగా అన్నాడు.

"సుహృదోమే భవన్తశ్చ శరీరం భ్రాతరస్తథా॥
యుష్మాభిరుద్ధృతశ్చాహం వ్యసనాత్ కాననౌకసః॥
ధన్యోరాజా చ సుగ్రీవో భవద్భిః సుహృదాం వరైఃll

"వానరులారా! మీరు నా మిత్రులు, సోదరులే కాదు, నా శరీరాంగాలు కూడా. ఆపదల నుండి మీరు నన్ను కాపాడారు కనుక మీ వంటి శ్రేష్ఠులైన మిత్రులు కల సుగ్రీవరాజు ధన్యుడు. సుగ్రీవాది మిత్రులు కూడా రామచంద్రుని సఖ్య ప్రేమను గురించి పదే పదే ప్రశ్నించే వారు. వారు రాముని కోసం తమ ప్రాణాలను సయితం వదిలిపెట్టడానికి సిద్ధమయ్యేవారు. రామభద్రుడూ, అతని మిత్రులూ ధన్యులు. మైత్రి అంటే అలాగే ఉండాలి.

శరణాగత వాత్సల్యం : శ్రీరామచంద్రుని శరణాగత వాత్సల్యం అనేక ఘట్టాలలో వచ్చినా, రావణుని చేత అవమానింపబడిన విభీషణుడు, రాముని శరణువేడి వచ్చిన ప్రసంగం భక్త జనులందరికీ ఆనందమును కలుగజేస్తుంది. ధర్మయుక్తంగా విభీషనుడు రావణునికి సలహా యిచ్చినా, రావణుడు విభీషణుని మాటలను వినకపోగా నిండు సభలో అతడిని అవమానించాడు. అప్పుడు విభీషణుడు అక్కడ నుండి నిరాశతో దుఃఖంతో శ్రీరాముని శరణు వేడతాడు. అతడు ఆకాశమార్గం ద్వారా రావడం చూసి సుగ్రీవుడు వానరులందరినీ, సావధానంగా ఉండమంటాడు. ఇంతలోనే విభీషణుడు వచ్చి ఆకాశం లోనే నిలబడి ఆర్తభావంతో "నేను దురాత్ముడైన రావణుని తమ్ముడను. నాపేరు విభీషణుడు. రావణుని చేత అవ మానింపబడిన నేను శ్రీరామచంద్రుల శరణు వేడ వచ్చాను. జీవకోటి కంతటికీ శరణదాత అయిన రామ భద్రులకు నా రాకను గురించి సూచించండి" అని అంటాడు. అది విని, సుగ్రీవుడు వెంటనే శ్రీరాముడిని చేరి, విభీషణుడు వచ్చాడన్న విషయాన్ని తెలియజేస్తూ

ప్రభూ! జాగ్రత్తగా పరీక్షించి, ముందు, వెనుకలు ఆలోచించి మీకు తోచిన రీతిని చేయండి" అన్నాడు. హనుమంతుడు విభీషణుని నిజమైన శరణాగతునిగా వర్ణిస్తూ అనేక యుక్తులతో, వినయంతో సలహా ఇచ్చాడు. ఈవిధంగా అందరి మాటలూ విన్న తర్వాత రామచంద్రుడన్నాడు.

"మిత్ర భావేన సంప్రాప్తం నత్యజేయం కథఞ్చన।
దోషో యద్యపి తస్యస్యాత్ సతామేతదగర్హితమ్॥"

మిత్రభావంతో వచ్చిన విభీషణుని నేను ఎప్పటికీ వదలను అతనిలో ఏమైనా దోషం ఉన్నా అతనికి ఆశ్రయం ఇవ్వడం తప్పు కాదు. అప్పుడు కూడా సుగ్రీవుడు ఒప్పుకోలేదు. అప్పుడు శ్రీరాముడు సుగ్రీవునకు నచ్చజెప్పాడు.

వానర గణాధీశా! నేనే కోరుకుంటే - యావద్భూమండలంలోని పిశాచ, దానవ, యక్ష, రాక్షసులను అంగుళ్యగ్రభాగంతో అంతం చేయగలను. కనుక భయపడవలసిన పనేలేదు. శత్రువైనా సరే, చేతులు జోడించి దీనముగా శరణుజొచ్చి అభయమును వేడగా అతనిని అంతం చెయ్యరాదు. ఒక్కసారి నేను నీవాడను! అని నన్ను శరణు వేడు వారిని సర్వప్రాణుల నుండి నిర్భయంగా ఉంచుతాను అన్నది నా వ్రతం నేను ఇతనికి అభయమిచ్చాను కనుక నీవు విభీషణుడిని తీసుకురా. ఆ విధంగా శ్రీరాముడు ప్రేమ భరిత దృష్టి వచనాలతో అతనికి ధైర్యాన్ని ప్రసాదించాడు. లక్ష్మణుని ద్వారా సాగరజలాలను తెప్పించి, విభీషణుడిని అక్కడే లంకా రాజ్యాభిషిక్తుడిని చేశాడు.

కృతజ్ఞత్వం : శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ పరబ్రహ్మ పరమేశ్వరుడు. అతని శక్తి అపారమైనది. అతడు స్వయంగా ఏదైనా చేయగలడు. సీతాన్వేషణలో రాముడు - రావణుని ద్వారా యుద్ధంలో దెబ్బతిని పడిన జటాయువును చూస్తాడు.

''నికృత్తపక్షం రుధిరావసిక్తం తం గృధ్రరాజం పరిగృహ్యరాఘవః! క్వమైథిలీ ప్రాణసమా గతేతి విముచ్య వాచం నిపపాతభూమౌ॥

రెక్కలు తెగిపడిపోగా శరీరమంతా రక్తసిక్తమై పడిపోయిన జటాయువును తన హృదయానికి హత్తుకుని, ప్రాణప్రియమైన జానకి ఎక్కడికి పోయింది? అంటూ రఘునాథుడు నేలమీద పడిపోయాడు. ఆపై జటాయువు రావణుని గురించి చెప్పి, వాడు సీతను అపహరించిన వృత్తాంతాన్ని వినిపిస్తూ, ప్రాణాలను కోల్పోగా శ్రీరామచంద్రుడు స్వయంగా తన చేతులతో దాని దహన సంస్కారం పూర్తి చేశాడు. ఎట్టి అద్భుతమైన కృతజ్ఞత?

హనుమంతుడు సీతజాడ తెలుసుకుని వచ్చిన తరువాత రాముని కలిసిన వేళలో పదే పదే రఘునాథుడు హనుమా! జానకి జాడ తెలియజేసి, నీవు వన్నూ, రఘువంశాన్ని, లక్ష్మణుడినీ కూడా రక్షించావు. ఈ ప్రియ కార్యమునకు బదులుగా నీకు ఇవ్వడానికి నా దగ్గర ఏ వస్తువూ లేదు. నా సర్వస్వమైన ఆలింగనాన్ని ఇస్తున్నాను. అంటూ శ్రీరాముడు హనుమంతుని గాఢమైన ఆలింగనం చేసుకుంటాడు. రాజ్యాభిషేకానంతరం హనుమంతునికి సెలవునిచ్చే వేళ అతడు చేసిన సేవా కార్యములను తలచుకుంటూ రాముడంటాడు.

"ఏకస్యోపకారస్య ప్రాణాన్ దాస్యామితే కపే।
శేషస్యేహోపకారాణం భవామ ఋణినోవయమ్॥
మదజ్గే+ జీర్ణతాం యాతు యత్త్వయోపకృతం కపే
నరః ప్రత్యుపకారాణామాపత్స్వాయాతి పాత్రతామ్॥"

"హనుమంతా! నీవు చేసిన ఒక్కొక్క ఉపకారానికి నేను నా ప్రాణాలను అర్పించినా నేను నీకు ఋణపడియే ఉంటాను. నీద్వారా జరిగిన ఉపకారాలన్నీ నా దేహంలోనే లీనమైపోవాలి. వాటిని తీర్చే అవకాశం నాకు రాకూడదు. "ఆపదలు వచ్చినప్పుడే మానవుడు ప్రత్యుపకారాలకు పాత్రుడవుతాడు" అంటాడు రాముడు. దీనిని బట్టి శ్రీరాముని కృతజ్ఞతాభావం ఎంతటి ఆదర్శవంతమైనదో మనకు తెలుస్తుంది.

ఉపసంహారం :

శ్రీరాముని మహత్త్వ పూర్ణమైన అనంఖ్యాక ఆదర్శాలను వర్ణించడం అసంభవమే మహాకవులందరూ

శ్రీరామచరిత్రను వర్ణించి తన వాణిని సఫలం చేసుకోవాలని ప్రయత్నించిన వారే.

"చరితం రఘునాధస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్॥"

ఉపయుక్త గ్రంథములు :

1. వాల్మీకి రామాయణం

❖❖❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

"మోహక్షయమే మోక్షము – పురుష ప్రయత్నము అదే ఆనందసూత్రము"

– డా॥ యస్.పి. కృష్ణవేణి
అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల, సదాశివపేట.

– శ్రీ యస్. శ్రీనివాస్
ఇంజనీర్, న్యూజీలాండ్.

పురుష ప్రయత్నము :

పురుష ప్రయత్నమంటే కోరే వస్తువులను పొందడానికి చేసే యత్నము. 'ఉద్ధరీతాత్మ నాత్మానం' తన్ను తానే ఉద్ధరించుకొనవలయునని శాస్త్రములు, మహాత్ములు తెలుపుచున్నారు. శాస్త్రములు, పెద్దలు దారి చూపుదురు. కాని నడువివలసినది తానే. గ్రంథములు ఆత్మను వర్ణించును గాని అనుభవింపచేయవు. అందువల్ల కేవలము భగవంతునిపై భారమువేసి తాను చేతులు కట్టుకొని సాధన చేయకుండ కూర్చుండరాదు. "God helps those who help themselves".

తమ్ముతాము ఉద్ధరించుకొన యత్నించు వారిపై దైవానుగ్రహముండును. అనగా ఆత్మ తనవైపు లాగు కొనును. గాలికి దీపము పెట్టి దేవుడా నీదే భారము అను అవివేకముండరాదు. సోమరికి ఏ రంగములో గూడ విజయము చేకూరదు. బలీయమైన పురుష ప్రయత్నముతో సాధించనిదంటూ ఉండదు. పురుష ప్రయత్నమునకు ఆత్మ అను అర్థమున్నది. జీవుడు దేవుడుగా మారుటకు దుస్సంస్కారము దూరమొనరించుటకై దృఢతర సాధన అవసరము. సంకల్పించినంత మాత్రమున పనులు నెరవేరవు. బలిష్టమైన సింహము గూడ నోరు తెరచుకొని పడుకుంటే జంతువులు తమంతట తాము వచ్చి నోట బడవు కదా! సాధనమున పనులు సమకూరు ధరలోన, యను నానుడి ఏర్పడినది. 'పురుషార్థేన జాయతే' పురుష ప్రయత్నము వల్ల జయము చేకూరునని వశిష్టుల వారున్ను తెలిపిరి. 'కృషితో నాస్తి దుర్భిక్షమ్, కృషి చేస్తే కరువు ఉండదు. ఏ సూక్తిని పరిశీలించిన తన్ను తానే ఉద్ధరించు కొనే భావమే కానబడును. వ్రాతకు కర్త - చేతకు తా కర్త' తన చేతను బట్టి నొసటి వ్రాత యుండును. ఈ విధముగా దైవవాణి మన చేతులు మన నెత్తిపైననే పెట్టునది. అంతా దైవమే ఇస్తాడని ఏమి చేయకుండా ఉండే వారలను సోమరులు అందురు. పురుష ప్రయత్నముతో (ఆత్మ శక్తితో) ప్రారబ్ధాన్ని కూడ ఎదిరించి సఫలీకృతులైనవారు కార్యశీలురు. అప్పటికి ఫలితము లభించకున్న అందు మన దోషమేమి లేదు.

చెడు లోహములతో కలిసిన పనికిరాని బంగారము స్ఫుటము వల్ల అపరంజిగా మారే అవకాశము ఉన్నది. సంస్కారము బొగ్గులాంటిది కాదు. కడిగితే పోకపోను. వరిగింజపై పొట్టు లాంటిది. దంచితే పోతుంది. ఇనుము త్రుప్పు కడిగితే పోతుంది. రత్నాకరుడు లాంటి గజదొంగ సాధునంగమముతో మహర్షిగా మారినాడు గదా! "అపిచత్సుదురాచారో, భజతేమాం అనన్యభాక్, సాధురేవ" దురాచారుడైనను సాధనవల్ల సాధువుగా మారును. "జ్ఞానాగ్ని దగ్ధ కర్మానాం", కార్యసాధన, కార్యశక్తి, గ్రహణ శక్తి, సహన శక్తి, నిర్మాణ శక్తి, శ్రద్ధను బట్టి వస్తుంది. 'శ్రద్ధామయం పురుషో పురుషశక్తి శ్రద్ధామయ' శక్తితో ముడిపడినది అని గీత నుడివినది. రజోగుణమునుండి సత్వగుణమునకు క్రమ వికానము నొందవలసి యుండును. ఇందు పురుష ప్రయత్నము ప్రధానము.

మనయేవ మనుష్యాణాం, కారణంబంధమోక్షయో:
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్॥
(కాత్యాయనీ ఉపనిషత్తు)

భావం : బంధమోక్షములకు (రెండింటికి) మనస్సే కారణము. విషయాసక్తమగు మనస్సు బంధమును విషయ సంబంధములేని మనస్సు మోక్షమును కలిగించును.

"ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి
అయమాత్మా స్తుర్యామ్య మృత: అహం బ్రహ్మాస్మిత
మహావాక్యై: ప్రతిపాదితమర్థం, తయేతే మన్త్రా ప్రతిపాదయంతి

(హయగ్రీవోపనిషత్తు)

భావం : మహావాక్యములు నాలుగు. 1) ప్రజ్ఞానం బ్రహ్మ, 2) అహం బ్రహ్మాస్మి, 3) తత్త్వమసి, 4) అయ మాత్మా బ్రహ్మ. ఈ నాలుగు మహా వాక్య మంత్రములను అంతర్యామిగా నున్న పరమాత్మను అద్వైత తత్వముగా ప్రతిపాదించుచున్నది.

అదిత్య చతురోవేదాన్, ధర్మశాస్త్రాని మానవ:
యోవై బ్రహ్మ నజానాతి, దర్వీపాక రసం యథా:॥

భావం : నాలుగు వేదములను, ధర్మ శాస్త్రములను అధ్యయనం చేసి, పరబ్రహ్మమును తెలియనివాడు పాకము యొక్క రుచిని గరిటె తెలుసుకోలేని రీతిగా పరమాత్మను తెలియలేకున్నాడు.

"ఆనందసూత్రం" :

కారణజన్ములు, శంకర భగవత్పాదులు, రమణ మహర్షి, విశిష్ట అద్వైత సిద్ధాంతపరుడు భగవత్ రామానుజాచార్యులు మొదలగు ఆచార్యులు మహాదార్శనికులు జీవిత పరమసత్యాలను అనేక కోణాల్లో ఆవిష్కరించి మానవ మేధకు తాత్విక చింతనం జోడించారు. మానవుడు తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు ఎదుర్కొనే ఆలోచనా స్రవంతికి అక్షర రూపం ఇచ్చారు. దు:ఖానికి, అపజయానికి, ఆశాభంగాలకు మూలమైన అనేక కారణాలను సృష్టిస్తూ ఆలోచనాగ్ని రగిల్చి ఉపదేశంగా తీర్చిదిద్దుతూనే కనిపిస్తున్న గురువుని కనబడని భగవంతున్ని అంటే అంతరాత్మను అనుసరిస్తూ జీవితాన్ని ఆనంద నందనం చేసుకోనున్నారు. ఆధునిక మానవ జీవనశైలిలో వస్తున్న విపరీత ధోరణులకు పరిణామాలకు ఉపశమన యోగంగా ఆచార్యులు అనుగ్రహించిన విచారధారే "కదలని సిరి...ఆత్మవిద్య".

జీవితమంటే ఎన్నో విషయాలను తెలుసుకోవడం మాత్రమే కాదు. వాటిని ఆచరించడం కూడా. మానవ జీవితం అత్యంత పరిమితమైనది. లక్ష్య గమ్యాలు దూరం తరగనివి. అందుకే దారి చూపించి ఒడుపు నేర్పే గురువును అంతరంగ శక్తిగా వెలిగే దైవాన్ని స్మరిస్తూ జీవించాలి. మితిమీరిన సంపదలు సంపాదించి మోహ, వ్యామోహ వ్యసనాలు పెంచుకొనేకంటే మంచి ఆలోచనలతో మంచిపనులు చేసి ధర్మమార్గములో పొందిన సంపదను ఆనందంగా అనుభవించాలి. ఆశ ఉండాలి. దురాశ ఉండకూడదు. అది దుర్దశకు దారితీస్తుంది. సృష్టిలో ఏ లోపం లేదు. ఉన్నదంతా చూసే చూపులోనే ఉంది. స్త్రీ సౌందర్యం ఉత్తముడికి ఆహ్లాదం కలిగిస్తుంది. అధముడికి అతృత కలిగిస్తుంది. ధర్మ కామం వల్ల వ్యక్తికి, వ్యవస్థకు నష్టమేమీ లేదు. ఇంద్రియ నిగ్రహమే చేయవలసిన సాధన. డబ్బుంటే లోకం నీ చుట్టూ ఉంటుంది. అది లేనినాడు లోకం నిన్ను వీడుతుంది. తరిగిపోయే, కరిగిపోయే లౌకిక ధనం తోనే స్థితి, గతి ఏర్పడుతాయి. కదలని సిరే ఉన్నత విద్య. అదే ఆత్మ విద్య. అది వినయాన్ని, వివేకాన్ని, విచక్షణను, తృప్తిని, ప్రశాంతతను అనుగ్రహించి, ఆనందాన్ని కలిగిస్తుంది. ఒంట్లో ఊపిరి ఉన్నంత సేపు మన దేహం 'శివం' అది లేనపుడు 'శవం'. శరీరానికున్న పరిమితి ఇది. శరీరమున్నంత కాలం అట్టిపెట్టికొని ఉన్న భార్య భర్తలు సైతం వారివారి శవాలను చూసి భయపడతారు.

మోహక్షయమే మోక్షం :

లోకంలో ఉన్నతంగా శక్తివంతంగా సర్వహితంగా జీవించడానికి ఈ శరీరమే సాధనం. గుర్తెరిగి వర్తిస్తే శ్రేయోదాయకం. ఎవరికి ఎవరో, ఎవరి మూలాలు ఏవో ఎవరికీ తెలియదు. జీవన ప్రవాహంలో కలుసుకొని కొంత దూరం, కొంత కాలం ప్రయాణించే సహ యాత్రికులం. ఈ సత్యం తెలుసుకొని స్పృహతో జీవించగలగడం ఎంతో అవసరం. ప్రశాంతంగాను, నిశ్చలంగాను ఉంటుంది. శుద్ధత్వము, సిద్ధత్వము కలుగుతాయి. సంసారపరమైన

బాధ్యతలను ఉదాత్తంగా నిర్వహించగల చిత్తశుద్ధి కారణంగా ఏమి అంటించుకోని స్థిమితత్వం లభిస్తుంది. ఈ క్రమంలో ప్రపంచం పట్ల మనసు ఏర్పరచుకొనే మోహవ్యామోహాలు నశిస్తాయి. మోహక్షయమే మోక్షం. మోక్ష మంటే మరణం. అంతర సుఖం కాదు. మోక్షమంటే నిర్మలానందం. అటువంటి ఆనందమే జీవితానందం. బంధు జనబలం, యవ్వన బలం, ధనబలం, ఇవేవీ బలం కాదు. ఈ మూడు నిజానికి ఎంతో కాలం ఉండవు. కనురెప్పపాటులో కాలం వీటన్నింటిని హరించి వేస్తుంది. కాలచక్రం ఆగదు. ఆపదు. చీకటి వెలుగు, ఆశ నిరాశ, ఎత్తు పల్లం, జయం, అపజయం, జననం, మరణం, ఇవన్నీ కదిలే చక్రంలోని ఆకులే. కాలం ఆడుకునే ఈ ఆటను చూస్తున్న మనిషి ఆయువు క్షణక్షణం ఆవిరైపోతున్నది. ఇదంతా చూసికూడా మానవుడు తనలోని ఆశలను, ఆకాంక్షలను, అహంకారాన్ని మమకారాన్ని, వదులుకోలేకపోతున్నాడు. పన్నెండు శ్లోకాలలో జగద్గురువు శంకరాచార్యుల వారు మానవుడి అశాంతికి మూలమైన ప్రస్థావనే ద్వాదశ మంజరీక స్తోత్రం. ఏ పేరున పిలుచుకున్నా సనాతన బోధకుని సనాతదివ్యభావలహరి, భజగోవిందమ్, అందులోని సత్సంగం గురించి శంకరాచార్యులు ఈ విధంగా వివరించారు.

సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చల తత్వే జీవన్ముక్తి:

తా॥ మంచి సాంగత్యం వల్ల అస్సంగత్వం ఏర్పడుతుంది. అసంగత్వం వలన వ్యామోహరాహిత్యం ఏర్పడుతుంది. నిర్మలమైన మనస్సుకు మోక్షం లభించడం సులభం.

'ఓం తత్సత్'

❖❖❖

రాజనీతి – రాజధర్మాలు (ఆముక్త మాల్యద నుండి)

– డా॥. మామిడాల రమేశ్ బాబు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

శ్రీ కృష్ణ దేవరాయలు :

స్వయంగా మహాకవియై, విద్వత్ కవులను తన ఆస్థానమునకు సముచితముగా ఆహ్వానించి, గౌరవించి వారిచే మనోహరములైన కావ్యములను రచింపజేశాడు శ్రీ కృష్ణదేవరాయలు. ఈ రాజకవి చంద్రునికే సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు అనే బిరుదులున్నాయి. శ్రీ కృష్ణదేవరాయల పరిపాలనా కాలము (1509-1529) ఆంధ్రదేశమునకే కాక ఆంధ్ర సారస్వతమునకు కూడా స్వర్ణయుగము. రాయల వారి సాహితీ సభ "భువన విజయము", దీనిలో అష్టదిగ్గజ కవులుగా ప్రసిద్ధికెక్కిన ఎనిమిది మందికవులతో పాటుగా వారి శిష్యులు, మరెందరో కవులు వారి ఆస్థానములో గౌరవించబడ్డారు.

రాయలవారు కూడా సంస్కృతాంధ్రములో గొప్ప పండితుడు. ఈ రెండు భాషలలో ప్రౌఢమైన కవిత్వాన్ని రచించారు. రాయల వారి సంస్కృత కావ్యములు ఎక్కువ ప్రచారములో లేనప్పటికీ, రాయల వారి అద్వితీయ ప్రబంధం "ఆముక్తమాల్యద మరియు జాంబవతీ పరిణయం" అను రూపకము మాత్రమే ప్రస్తుతం లభ్యమవుతున్నాయి. ఈ రెండింటి ఆధారంగానే రాయలవారు ఎంతటి ప్రౌఢ కవియో మనం చెప్పవచ్చు. వారి రచనలు గానే భావింపబడుతున్న మదాలస చరిత్ర, సత్యవధూ ప్రీణనము, సకలకథా సారసంగ్రహం, జ్ఞానచింతామణి, రసమంజరి కావ్యాలు అలభ్యం.

ఆముక్తమాల్యద :

దీనికే విష్ణుచిత్తీయం అనే నామాంతరం (మరోపేరు) కూడా కలదు. రాయలవారికి శ్రీకాకుళ ఆంధ్ర మహా విష్ణువు కలలో కనబడి ఒక కావ్యాన్ని రాయమని ఆజ్ఞాపించాడట. ఆ ఆజ్ఞను పాటించి ఆంధ్రభాషలో ఈ ఆముక్త మాల్యదను రచించాడట. ఆముక్త మాల్యద అనగా "తాను ధరించిన మాలను ఇచ్చేది" అని అర్థం. తాను ధరించిన మాలలను శ్రీ రంగనాయకునకు అందించిన భక్తురాలు గోదాదేవి. ఈ గోదాదేవి విష్ణుభక్తుడైన విష్ణు చిత్తుని యొక్క పెంపుడు కూతురు. ఈ గోదాదేవి - శ్రీ రంగనాయకుల రసరమ్య చరిత్రయే ఆముక్త మాల్యద ఇతివృత్తం. కథా ఇతివృత్తాన్ని ద్రావిడ ప్రబంధముల నుండి గ్రహించబడినది. ద్రావిడ వైష్ణవ మతంలో ప్రసిద్ధులైన పన్నిద్దరు (12) ఆళ్వారులలో విష్ణుచిత్తుడు ఒకరు. ఈ విష్ణుచిత్తుడినే పెరియాళ్వార్ అని కూడా అనేవారు. ఈతని పెంపుడు కూతురే గోదాదేవి, ఈమెకే ఇంకొక పేరు 'ఆండాల్' (లక్ష్మీదేవి).

విష్ణుచిత్తుడు శ్రీహరి భక్తుడు. శ్రీహరికి అర్పించ దలచిన పుష్పమాలికలను ముందుగా గోదాదేవి ధరించి యథా ప్రకారముగా ఉంచేది. ఈ మాలలతో విష్ణుచిత్తుడు తెలియక శ్రీహరిని అలంకరించేవాడు. కావుననే దీనికి 'ఆముక్త' అనగా ధరించి విడిచిన "మౌల్య" అనగా పూలదండను 'ద' అనగా ఇచ్చునది అని అర్థము.

విష్ణుచిత్తుడు పాండ్యరాజు కోరికపై వైష్ణవమత ప్రచారము చేయుటయు, గోదాదేవిని శ్రీ రంగనాయకునకు ఇచ్చి పెండ్లి చేయుటయు దీనిలో కలదు. కావున దీనికి 'విష్ణు చిత్తీయం' అనే పేరు కూడా ఉంది.

ఆముక్త మాల్యద ఏడు ఆశ్వాసముల ప్రౌఢ ప్రబంధం. ప్రథమాశ్వాసములో శ్రీవిల్లి బుత్తూరు వర్ణన, విష్ణుచిత్తుని భక్తి తత్పరత ఉండగా, ద్వితీయాశ్వాసంలో పాండ్యరాజు మత్స్యధ్వజుని రాజధాని మధురాపురి వైభవము, గ్రీష్మ ఋతువర్ణన, విష్ణుచిత్తుని మధురా యాత్రలున్నాయి. తృతీయాశ్వాసములో ఖాండిక్య కేశిధ్వజుల సంవాదం వివిధ మతానువాదాలు ఉన్నాయి.

చతుర్థాశ్వాసములో విష్ణుచిత్తుని విజయము, దశావతారాల స్తుతి, యామునాచార్యుని వృత్తాంతము ముఖ్యాంశాలు కాగా పంచమాశ్వాసంలో గోదాదావి జననము, యవ్వనం, గోదాదేవి పూర్వజన్మ వృత్తాంతం ఉన్నాయి. షష్ఠాశ్వాసములో మాలదాసరి కథ, బ్రహ్మరాక్షసుని కథ, మాలదాసరి - బ్రహ్మరాక్షసుల సవాదము ఉన్నాయి. ఇక సప్తమాశ్వాసంలో బ్రహ్మరాక్షసి పూర్వ వృత్తాంతము (సోమశర్మ), గోదాదేవిని భూదేవి అంశలో జన్మించినదిగా విష్ణుచిత్తుడు తెలుసుకొనుట, దేవతల కోరికపై శ్రీ విలిబుత్తూరులో గోదా-శ్రీరంగనాథుల కళ్యాణము ప్రధానాంశములుగా ఉన్నాయి.

యామునాచార్యులు బోధించిన రాజధర్మములు:

లక్ష్మీదేవి కోరిక మేరకు యామునాచార్య వృత్తాంతాన్ని చెబుతున్నాడు మన్ననారు (శ్రీమహా విష్ణువు). యామునాచార్యులు పాండ్యుని కొల్వుకు బోవుట, మతవాగ్వివాదము జరుపుట, యామున విజయం, యామునుడు రాజగుట, యామునకు జ్ఞానోదయంబగుట, యాముడు తన కుమారునకు రాజ ధర్మములు బోధించుట చతుర్థాశ్వాసము నందు కలవు. ప్రధాన కథకు దీనితో సంబంధము కలవు. ప్రధాకథకు దీనితో సంబంధములేనప్పటికీ రాయల వారు తను ఆచరించేరాజనీతిని, తన గురువు మంత్రియగు తిమ్మరుసు బోధించిన రాజధర్మాలు ఈ సందర్భంగా మనం చూడవచ్చు. ఈ ధర్మాలు నాటికి నేటికీ ఆచరణీయాలే. కావున ఒక అధికారి, ఒక నాయకుడు కలిగి ఉండాల్సిన ధర్మాలను ఈ సందర్భంగా మనం గమనించవచ్చు. ఇక్కడ అముక్త మాల్యదలో 84 పద్యాలలో వివరించిన ఈ రాజధర్మాలు - నీతిలో వ్యవహారంలో కూడా సర్వకాలీనమైన కొన్ని ధర్మాలను ఇక్కడ ప్రస్తావించదలచాను.

"ఏ పట్టున విసువక ... " అంటూ ఏ సమయము నందైనా రాజు విసుక్కోకుండా ప్రజల్ని రక్షించాలి. వారు చెప్పుకునే సమస్యలను శ్రద్ధగా వినాలి. గొప్ప పనులకు కుత్సిత జనులను నియమించకూడదు. రాజు ప్రజల మేలు కోరితేనే, ప్రజలు రాజు మేలు కోరుతారు.

మొదట బెనిచి పిదప గుదియింప నెవ్వాడు
దనుదు తొంటిహీన దశ దలంప
డలుగు గాన శీల మరియుచు గ్రమవృద్ధి
బెనిచి వేళ వేళ బనులు గొనుము – చ.ఆ.208

ఎవడైనా ముందు పెద్దవాణ్ని చేసి ఆ తర్వాత తగ్గిస్తే వాడు మొదట్లో ఉన్న తన తక్కువ స్థితిని తల్చుకోడు. ఉన్నత స్థితి నుంచి క్రిందపడ్డాడనే బాధపడతాడు. కాబట్టి శీలవంతులైన వాళ్ళని గుర్తించి వాళ్ళని క్రమక్రమంగా వృద్ధిలోకి తీసుకురావాలి.

ధనముఖ్యము కేవల మే
పనికిన్ రాజస్థగలిగి పలువురు ప్రభువుల్
పనినేయక తద్వశ్యం
బునకు నలోభాన్నశం స్యముల్ బుతముజెలుల్

డబ్బు వల్లె అన్ని పనులు కావు. పనిచేసే వాళ్ళకి ఆ పని మీద ఆసక్తి, రాజు మీద విశ్వాసము ఉండాలి. అలాంటి వాళ్ళ విషయంలో రాజు కూడా లోభి లాగా కాక విరివిగా డబ్బివ్వాలి. కొన్నిసార్లు దాపరికం లేకుండా ఉండాలి.

డబ్బు వసూలు, దేవాలయాధికారము ఎప్పుడు కూడా ఒక్కడికే ఇవ్వొద్దు. అలా ఆ ఒక్కడు చేసే తప్పు వల్ల వాడితో పాటుగా రాజుగారు కూడా పాపాన్ని పంచుకోవల్సి వస్తుంది.

రైతు ముందుగా పొలాన్ని స్వాధీనం చేసుకొని తర్వాత దాని చుట్టూ ముళ్ళకంచె నాటి, దుక్కిదున్ని, చెత్తను ఏరివేసి, విత్తనాన్ని నాటుకుంటాడు. రాజు కూడా తన రాజ్యాన్ని అలాగే చూసుకోవాలి.

"మొదలనె యొరుదల కాని
జెదరంగ నాడ కాత్మజింతింపుపదిం"

అంటూ ఎవడన్నా అబద్దాలు చెపతున్నాడని అనుమానం వస్తే వెంటనే వాణ్ణి ఏమీ చెయ్యొద్దు. జాగ్రత్తగా కూడి విషయం బాగా ఆలోచించి నిజంగానే అబద్దాలు చెబుతున్నాడని నిశ్చయం చేసుకోవాలి. అప్పుడు కూడా

వాణ్ణి పనిలో నుంచి తీసేయొద్దు. కేవలం నీకు దూరంగా ఉంచు.

కార్యమొక్కడు గనిన మత్స్యరమున నొ
కండు గా దని ఖండించు గన్నెఱింగి
యిరువురను గాదనక కొల్పు, విరిసి మీద
నల్ల వాడెన్నినది సేయనగు శుభంబు

గట్టి వాడొకడు ఒక పని సాధించటానికి మార్గం కనుక్కొని చెప్తె, వాడంటె ఈర్ష్య ఉన్న మరొకడు దానికి వ్యతిరేకంగా చెప్తాడు. అక్కడ ఎవరి వైపు వెళ్లకుండా, ఆ తర్వాత మాత్రం మొదటి వాడు చెప్పినట్టు చెయ్యాలి.

చెడ్డ మంత్రులు చాలా విధాలుగా ప్రమాదాలు కలిగిస్తారు. వాళ్ళ సంగతి చూడటానికి గట్టి వాణ్ణి, మంచివాణ్ణి నియమిస్తే వాడే వాళ్ళ విషయం చూస్తాడు.

అధికారులు ఎప్పుడు రాజుకు మిత్రులు కారు. వాళ్ళ రాబడి వాళ్ళు చూసుకొనే వాళ్ళే. చెడ్డ పనులు చేసే అధికారులను పూర్తిగా వదిలేయకుండా అతి జాగ్రత్తగా నడిపించాలి.

అహితుడు వేడిన నేలెడు
మహి సగమేనిచ్చి తెగని మైత్రిగొని విభుం
డహి భయము మాన్పికోదగు
నహి భయ మహి భయముకంటె నధికము కాదే (249)

రాజుకి ముఖ్యమైన ప్రమాదము లోపలి శత్రువుల నుంచి, అందువల్ల లోపల శత్రువులున్నపుడు శత్రురాజు యుద్ధానికొస్తే వాడికి సగం రాజ్యం ఇచ్చైనా సంధి చేసుకొని ముందు లోపలి శత్రువుల్ని అణచాలి.

ఎంత చిన్న చోటులోనైనా వ్యవసాయానికి నీళ్ళ వసతులు రాజు కలిగించాలి. దాని వల్ల పంటలు పెరిగి పన్ను వసూళ్ళు ఎక్కువ అవుతాయి. అలాగే పేదల దగ్గర తక్కువ పన్నులు తీసుకొని వాళ్ళు వృద్ధిలోకి వచ్చేటు చేస్తే తర్వాత వారి నుంచి కూడా మంచి ఆదాయమొస్తుంది.

రాజు తన ఆదాయంలో సగం సైన్యం కోసం, మిగిలిన దాన్లో సగం దానాలకి, భోగాలకి, మిగతా సగం ఖజానాను నింపటానికి వాడాలి. రాజ్యంలో దొంగల భయం లేకుండా చేయాలి.

రాజు ఎప్పుడూ నీతిమార్గంలో నడవాలి. తను తెలుసుకోవలసిన విషయాలు వీలైనంత వరకు స్వయంగా తెలుసుకోవాలి. తెలియని వాటిని ఆప్తుల్ని, మిత్రులను అడగాలి. తెలియని విషయాల్లో తన అభిప్రాయమె ఒప్పు అని వాదించకూడదు. రాజు భోగాలను అనుభవిస్తున్నా ఎలుగుబంటిలాగా ఒక కంటితో ఎప్పుడూ రాజ్యం లోపలి, బయటి శత్రువుల్ని కనిపెట్టుకొని ఉండాలి. రాజు శూరుడైన తన కొలువులో తనను పొగుడుతుంటె వినుగు చూపకుండా వినాలి. దీని వల్ల పొగిడేవారు తన అవసరాల్లో ఉత్సాహంగా కష్టపడతారు. రాజు చెయ్యకూడని పనులు ఏమిటంటే క్రూరమైన శిక్షలు వేయటం, చెప్పుడు మాటలు వినకపోవటం, శత్రువు సంధికి వచ్చినపుడు తిరస్కరించటం, విశ్వాసం లేని వారిని దగ్గరుంచుకోవడం, విశ్వాసపరులను దూరంగా ఉంచటం, వ్యసనాలు ఉండటం, జనాల యొక్క కష్టాలు లోతుగా తెలియకపోవటం.

రాజు దినచర్య కూడా ఇలా ఉండాలి. పొద్దున్నే వైద్యులు, జోస్యులను కలవాలి. జాము పొద్దు తర్వాత డబ్బు విషయాలు కనుక్కోవాలి. ఆ తర్వాత వ్యాయామం చేయాలి. ఎందుకంటే రాజు తన రాజ్యాన్ని ఎలా కాపాడుకుంటాడో, తన శరీరాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. వంటవాళ్ళకి ఆజ్ఞలు ఇవ్వాలి. మధ్యాహ్నం దేవతార్చన, ధర్మగోష్ఠి, భోజనం, సందెవేళ చారులతో ముచ్చట్లు రాత్రికి గానసభ, సుఖనిద్ర.

రాజు భోజనంలో రకరకాల పదార్థాలు ఉంటాయి. కావున బాగా ఆకలిగా ఉంటె తప్ప తినకూడదు. చారుడు (గూఢచారి) రాజు ఊరి వాడై ఉండాలి. నానాభాషలు తెలిసినవాడు, ఇతర చారులెవరో తెలియని వాడు, మిగిలిన చారులకతను తెలియని వాడుగా ఉండాలి.

చేయునది రాజ్య మాట యఘ
మే యవధిగ నీగు వార, మే మన జవదా
మ్నాయంబు నశ క్యాను
ష్టేయము జెప్పెడు స్వశక్తి చేయగ జెప్పున్ (284)

రాజ్యం చేసేప్పుడు ఎన్నో పాపాలు మూటకట్టుకోక తప్పదు. వీలైనంత అధర్మం జరగకుండా చూసుకోవటం అవసరం. నీ ధర్మాన్ని నువు నిర్వర్తించు.

ఇలా సర్వకాలీన మైన ధర్మాలను, నీతిని రాయలవారు యామునాచార్యుల పాత్రద్వారా పలికించారు. ఒక విధంగా ఇవి తను ఆచ రించిన ధర్మాలే. కావుననే కృష్ణదేవ రాయలు కేవలం ఆంధ్రులచరిత్రలోనే కాక భారతీయ చరిత్రలో కూడా ప్రత్యేక స్థానాన్ని పొందారు.

విదేశీ యాత్రికులు కూడా విజయసామ్రాజ్య వైభవాన్ని, రాయల వారి పరిపాలనా దక్షతను తమ గ్రంథాలలో రాయడం వల్ల రాయలకీర్తి విశ్వవ్యాప్తం అయింది.

ఉపయుక్త గ్రంథాలు :

1) ఆముక్త మాల్యద - వావిళ్ల పబ్లికేషన్స్
2) ఆముక్త మాల్యద - విశ్వనాధవారి పీఠిక
3) కావ్యలహరి - దివాకర్ల వేంకటావధాని వ్యాసం
4) శ్రీ కృష్ణ దేవరాయలు - సంగన భట్ల నర్సయ్య
5) కృష్ణదేవరాయల "ఆముక్తమాల్యద" వ్యాసం - కె.వి.ఎస్. రామారావు

❖❖❖

రామాయణము – ధార్మికాంశాలు

– ఎస్. చంద్రశేఖర శర్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

వేదవేద్యే పరేపుంసి జాతే దశరతాత్మజే
వేద: ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా

వేదమే కావ్యంగా ఆదికవి వాల్మీకి నోట పలికిందని సహృదయుల అభిప్రాయం. లోకోత్తరమైన వాఙ్మయాన్ని లోక సమ్మతమైన కావ్యంగా జనరంజకంగా రూపొందించాడు వాల్మీకి మహర్షి.

ఈ సకల చరాచర ప్రపంచం నశించకుండా దేని వలన నిలబడుతుందో అదే ధర్మము.

"ధ్రియతే అనేన ఇతి ధర్మ:"
"ధారయతే ఇతి ధర్మ:"

ధర్మమే ఈ జగత్తును నిలబెడుతుంది. ఇదే అర్థాన్ని శృతి వాక్యమయిన 'ధర్మో విశ్వస్య జగత: ప్రతిష్టా''. వేదాలు, ఉపనిషత్తులు శృతి, పురాణాలు, వీటన్నిటిలో ధర్మం గురించిన ప్రస్తావన ప్రముఖంగా చెప్పబడి ధర్మ ప్రయోజనాన్ని ప్రతిపాదిస్తున్నాయి. భారత, భాగవత, రామాయణాల్లో కూడా చతుర్విధ పురుషార్థాల గురించే చెప్పబడింది. రామాయణంలోని ప్రతి పాత్రలో ఈ ధర్మాలు చెప్పబడ్డాయి. పురుషార్థమన్న మాట సంకుచితంగా కేవలం పురుషులకు చెందినది అనుకోవడం పొరపాటే. పురుష శబ్దానికి మనిషి అని అర్థం.

ధర్మార్థ కామ మోక్షాలు ఒక దాని కొకటి అనుసంధానమై నిలబడతాయి. ప్రతి మనిషి ముందుగా ధర్మంగా ప్రవర్తిల్లుట మీద మిగిలిన పురుషార్థాలు ఆధారాపడి ఉంటాయి. అందుకనే కాబోలు "ధర్మో రక్షతి రక్షిత:" అన్నది ప్రధానంగా నిలిచింది. దీనిని బట్టి సర్వ పురుషార్థాలు ధర్మమునే ఆధారంగా చేసుకొని నడుస్తున్నవనే చెప్పవచ్చు.

రామాయణాన్ని పరిశీలించినపుడు మనకు అది ఒక ఆదర్శప్రాయమైన గ్రంథంగా కనిపిస్తుంది. భాగవతం ఆధ్యాత్మికతకు, భారతం ఒక సాంఘిక ఇతివృత్తానికి ఉదాహరణలుగా నిలిచినా రామాయణం మాత్రం ఆదర్శ ప్రాయమైన గ్రంథరాజముగా నిలబడింది. అందుకు కారణం రామాయణంలోని చాలా పాత్రలలో ఈ చతుర్విధ పురుషార్థాలు ప్రతిబింబిస్తాయి.

ధర్మమనేదానికి ఇదమిత్థమయిన అర్థం చెప్పడం కంటే, నియమబద్ధమయిన జీవనశైలి అని చెప్పవచ్చు. రామాయణంలో ప్రతి పాత్రలోనూ ధర్మాన్ని దర్శించ గలుగుతాము. రాముని‌లో పితృ వాక్య పరిపాలన అనే ధర్మపాలనలో రామాయణం కథంతా నడిచింది. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ అనేవి లోక కళ్యాణ హితమయిన అంశము ఆధారంగా రాముని పాత్ర కూడా మామూలు మానవుని వలె కష్టాలు పొందినట్టు చూస్తాము. రాముని వనవాస అంశాన్ని తీసుకున్నప్పుడు లక్ష్మణుని పాత్రలో ధర్మబద్ధత ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ప్రస్తుత కాలంలో ఈ అంశం సుదూరమయినా, నాడు అన్న, వదినలకు సేవ చేయుటకు లక్ష్మణుడు సైతం అడవులకు వెళ్ళడం ఈ నవీన సమాజానికి అంతుబట్టని విషయమయినా ఇది ధర్మ సూక్ష్మమయిన విషయం.

రామాయణంలో ఊర్మిళాదేవి లాంటి పాత్ర "నభూతో న భవిష్యతి". ఏ పురాణాలు, ఏ ఇతిహాసాలు, ఈనాటి ఆధునిక గ్రంథాలు పరిశీలించినా అటువంటి పాత్ర కనిపించదు. లక్ష్మణుడు సహితం వనవాసానికి వెళ్ళటాన్ని తనకు తానుగా అంగీకరించటం, ఆ 14 ఏళ్ళపాటు సుదీర్ఘ నిద్రకు వెళ్ళటం వంటి సన్నివేశాలు రామాయణంలో మణిమకుటాలు. ఇలా సకల జీవ రాశులలో కూడా ఈ ధర్మాన్ని రామాయణ కర్త చూపించటం, గమనించదగిన విషయం. జాంబవంతుడు, హనుమ, జటాయువు, ఉడుత ఇలా అన్నింటిలోనూ కూడా ధర్మం ప్రతిపాదించబడింది.

సీతాపహరణ ఘట్టంలో రావణుడు సీతను కొనిపోవు చున్నప్పుడు ఆ అధర్మాన్ని చూడలేక జటాయువు రావణాసురుణ్ణి ఎదుర్కోవటం అనేది ఒక వైవిధ్యమయిన అంశం. రావణుని పరాక్రమం ముందు తాను బ్రతుకు తుందో లేదో కూడా ఆలోచించని జటాయువు పాత్ర అమోఘమయినది.

ఇలా ధర్మాన్ని కేంద్ర బిందువుగా చేసికొని రామాయణ పాత్రలన్నింటినీ నడిపించిన రామాయణ కర్త ధర్మం వెంటనే మిగిలిన పురుషార్థాలు సిద్ధించినట్టుగా గోచరింప చేశాడు. "యతో ధర్మస్తతో జయ:" అన్నట్లుగా ధర్మమును వెన్నంటే అర్థ, కామ, మోక్షాలు ఆధారపడి ఉంటాయని నిరూపితమయినది. రామాయణంలోని ఏ పాత్రకు కష్టం, సుఖం కలిగినా ఇవన్నీ ధర్మముపై ఆధారపడిన లోక కళ్యాణం కోసం జరిగినదని చెప్పవచ్చు.

మానవ జీవన గమనంలో గృహస్థాశ్రమ ధర్మము యొక్క ప్రశస్తి ఉంది. గృహస్తు కానివాడు ధర్మాచరణ చేయడం కొంతవరకు కష్టము. ధర్మ బద్ధమయిన జీవితం నడవడానికి గృహస్థాశ్రమ ధర్మమే గొప్పదని చెప్పబడినది. సత్య వాక్య పరిపాలన, పితృవాక్య పరిపాలన, భ్రాతృ ప్రేమ, వైవాహిక వ్యవస్థ, స్వామిభక్తి, ఆశ్రితపాలన, ప్రతిజ్ఞా పాలన, లోక మర్యాద, వైవాహిక జీవితం, రాజనీతి ధర్మం, లోకహితం మరియు భూతదయ వీటన్నిటినీ ఆధారంగా చేసుకొని ధర్మం నిలబడుతుంది.

ఇలా రామాయణంలో ప్రతి పాత్రలో ఇన్ని ధర్మాలు ఉండటం వలన రామాయణం ఒక ఆదర్శప్రాయమయిన గ్రంథంగా నిలిచింది. అన్ని గ్రంథాలలో వలె కాకుండా కేవలం చతుర్విధ పరుషార్థాల వలన రామాయణానికి ఇంతటి ప్రశస్తి కలిగిందని చెప్పడంలో సందేహం లేదు.

❖❖❖

జానపద సాహిత్యంలో ధర్మము

– యస్. రజిత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హనుమకొండ.

పురుషార్థాలు అంటే వ్యక్తికి కావలసినవి.

మానవుడు జీవితంలో వేటిని ప్రార్థిస్తాడో వాటిని పురుషార్థములు అంటారు.

1) ధర్మము : మత లేక సామాజిక నియమాలకు కట్టుబడి జీవించడం.
2) అర్థము : ధన సంపాదన మరియు కీర్తి.
3) కామము : శారీరక లేక ఇంద్రియ లేక లౌకిక సుఖాలు.
4) మోక్షము : పునర్జన్మ రాహిత్యము లేక భవ బంధాల నుండి విడుదల.

ధర్మమును కనుక తీసుకొన్నట్లయితే అదేదో అధ్యాత్మికత అనాల్సిన పని లేదు. వ్యక్తిగత ఆహార విహారాల్లో పాటించే శారీరక ధర్మాలు కూడా ఉంటాయి. జిహ్వ చాపల్యం, ఇంద్రియాలపై అతి వ్యామోహం లేకుండా ఉండటం కూడా ధర్మం చెబుతుంది. ధైర్యము క్షమ, దమము, అస్తియము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, నిర్మలబుద్ధి, విద్య, సత్యం, అక్రోథం ఇవన్నీ వ్యక్తిగత ధర్మాలు. ఇవి అన్ని మనసును, బుద్ధిని నియంత్రించి నడిపిస్తాయి. ఆత్మానందం కోసం అన్నింటిని త్యజించ గలిగేవి ధర్మం.

జానపద సాహిత్యం:

జానపదులు పాడుకొను గేయములే జానపద గేయములు. జానపదులనగా పల్లెటూరివారు, జానపద గేయంలకు మరియొక పేరు పల్లెటూరి పాటలు. ఈ గేయముల మాధుర్య మనుభవైక వేద్యము. జానపద సాహిత్యమందునే మన జాతీయ జీవన మధికముగా ప్రతిబింబించును. మనదేశమందలి మత పరిణామములు, వీరుల యుదంతములు, పతివ్రతల విశ్వాసములు, వినోదములు, వేడుకలు, సౌందర్య సాభాగ్యములు, సంయోగ వియోగములు, సుఖదు:ఖములు, ఆటల అభిరుచులు వేయేల తుడుమ మొదలుకొని దేవతార్చన వరకు మన సంస్కృతియంతయు నీగేయము లందు కనిపించును.

ప్రాచీనం నుండి ఆధునిక జానపద సాహిత్యంలో ధర్మం :

జానపద గేయములు కూడా శిష్ట సాహిత్యము వలనే వివిధ పురాణేతి వృత్తములు కలవి బహుళప్రచార మందున్నవి. వేదముల తరువాత మనకు రామాయణ, భారత, భాగవతములే మాననీయములు, సంస్కృతములో ఆదికావ్యమైన రామాయణ గాథాప్రభావ ఆంధ్ర జానపదుల హృదయములపై నెంతయో కలదు. జానపద సాహిత్యంలో అవాల్మీకీయ అంశాలు ఎన్నో కలవు.

రామాయణ కథాగేయములందు లంకాయగము పాట బహుళ ప్రచారము గల గేయము, కైకమ్మ కోరిక ప్రకారము సుమిత్రతో మా యన్న, మావదినె పదునాలుగు యేండ్లు వన ప్రవేశమమ్ము-వారి వెంటా నేను తల్లి వెళు తాను దీవెనలు ఇవ్వమమ్మ - "యని కోరగా కన్నకడు పైనను సుమిత్ర" శ్రీరాములు తండ్రిగా సీతమ్మ తల్లిగా భావింపు లక్ష్మున్నా ప్రొద్దు ప్రొద్దునలేచి వదినె పాదంబులకు దండమైన బెట్టుము - తోటలా పండ్లన్ని దొన్నెలో బెట్టుకొని మీదుగా దెచ్చియిమ్ము - పదునాలుగు యేండ్లు తర్లిపోయిన మీరు కలియరండని పలికెను". రామునితో అరణ్య వాసమునకు తాను బయలు దేరెఅని నియెనే కాని సుమిత్ర మాత్రము పుత్ర వియోగమునకు సిద్ధబడి అన్నగారి సేవలు చేయుమని దీవించి పంపుట ఆమె గొప్పతనమును సూచించును. ఇక్కడ మనకు మన కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వర్తించే సాధనంగా శరీరం ఉపయోగించాలి అనే ధర్మాన్ని సుమిత్ర తన కుమారుడైన లక్ష్మణునికి బోధించింది.

జానపద సాహిత్యంలో పల్నాటి వీరులకు సంబంధించిన గాథలందు మన పూర్వుల యుద్ధ దర్మములు కాననగును. గురిజాల యుద్ధం పూర్వభాగంలో విరుగబొడువ పోవుచున్న బ్రాహ్మానాయునికి తల్లి శీలమ్మ మొనర్చిన యుపదేశ ఆమె దర్మనియతిని పతాక మెత్తుచున్నది. బ్రహ్మానాయునితో యామె

'చొచ్చి పొడువకు మన్న చొరబారి నీవు, అంతకంతకు దాగి అధములైనున్న కట్టె మోపుల వారి కలకూరి వారి, దండించి శీలాల తగనుండువారి, పసుల కాపరులను బలుసుకూరాకు, తిని యడవులలోన దిరిగేటి వారి, చెన్నారగుళ్ళలో జేరిన వారి.... నెలకొని రాత్రుల నిద్రించిరేని, ఆవేళ బోడుచుట యధిక పాపంబు... ప్రొద్దుగూకు వేళ పొడువ దోషంబు, పడమటి ప్రొద్దున పాడి ధేనువుల, పాలకై సతులు పరగ నురుద్రాళ్ళు, తల కోలలను బట్టి తనరాన బితుక, నావేళ కోటపై నార్పంగ రాదు... భస్మముగా గాలి పశులు సమసినను, అటువంటి దోషంబు అణగదెన్నటికి' అనియును బ్రాహ్మణుల భట్ల, దాసరుల, భక్తుల స్త్రీల శిశులు, పశువుల, శరణార్థుల, చంపగూడదనియును ధర్మబోధన మొనర్చెను.

కాటమరాజు కథ కూడ మన పూర్వ యుద్ధ దర్మములకు పట్టుగొమ్మ, దేశింగు రాజు కథలో భారతీయుల యుద్ధ ధర్మము చక్కగా నగుపించును.

జానపద సాహిత్యంలో గృహజీవనమున కవిత్వమునకు స్త్రీలే యధికముగా నాలంబనములు, స్త్రీల జానపద గేయాలలో సీతమ్మను సాగనంపుచు బుద్ధులు చెప్పి నట్టుల జానపదుల అప్పగింతల సమయమున పాడుకొందురు.

సెలవిచ్చి మాయమ్మ సెలవిచ్చినాము - చెలగి నీ అత్తింట్ల బుద్ధి గలిగుండు ఎవ్వరేమాడిన ఎదురాడకమా - వీధిలో నిలుచుండి కురులిప్పకమ్ము.....

'అరిటాకు వంటిది ఆడజన్మంబు' కనుక క్రొత్త యింటికి పోవు తమ బిడ్డల కన్ని బుద్ధులు చెప్పుట తల్లితండ్రులు తమవిధిగా భావింతురు. ధర్మము అంటే వ్యక్తిగత ఆహార విహారాల్లో పాటించే శారీరక ధర్మాలు కూడా ఉంటాయి. ఈ ధర్మాలన్నింటిని తల్లి తన బిడ్డకు అప్పగింతలలో స్త్రీ కి కలిగిన ధర్మాలన్నింటిని వివరిస్తుంది.

జానపద సాహిత్యంలో శ్రామిక గీతములనే పలువురు పండితులు పాటక జన సారస్వతమని పిలిచిరి. శ్రామిక గేయంలు హృదయ లేదా మేథాగత భారమును తొలగించి ఉల్లాసమును కలిగించు గేయములే శ్రామిక గేయంలు. శ్రామికుడి హృదయ భారం ఈక్రింది గేయంలో కలదు.

ఏటికేతంబెట్టి పుట్లు బండించి
ఎన్నడో మెంతుకెరుగరన్నా - నేను గంజితో మెతుకెరుగరన్నా
కాళ్లేయి కడుక్కొని కట్టమీద కూసుంటే
కాకి దన్ని పోయెరన్నా కాకి పిల్లదన్నే పాయరనాన్ని
పోరుకు చాల్లేక పోయికాడ కూసుంటే
పోరి దన్ని పోయెరన్నా పోరి తల్లి పోయెరన్నా
చుక్కపొద్దున లేచి బొక్కెనెత్తపోరగ
బొక్క బోర్లు బతితేరన్నా - నేను పక్కలిరగాబడితిరన్నా
నాదేటి బ్రతుకాయేరన్నా - నేను నాడె చావక పోతెరన్నా

కష్టజీవులు తమ జీవితంలోని సుఖదు:ఖాల, రాగ ద్వేషాల అనుభూతుల్ని పాడుకున్న పాటే యిది.

ప్రాచీన జానపద సాహిత్యం పరంగా చూస్తే ధర్మ, అధర్మాలను భారత, భాగవత, రామాయణంలోని పాత్రల పరంగా ధర్మంను వివరిస్తుంది.

తల్లితండ్రులు తమశిశువులకు నేర్పే అభ్యాసము ఉగ్గుపాలతో మొదలువుతుంది. పిల్లలకు వినిపించే ఈ జానపద పాటల వలన పిల్లల గ్రహణశక్తి, ధర్మ మార్గములు పిల్లలకు తెలియును.

పెద్దలు భక్తి వినయాలతో స్మరించె సీతమ్మ పేరు వలన బాల బాలికలలో ప్రేమ మరియు సానుభూతి కలుగుతుంది. సీతమ్మను వారు తమ తోడుగా భావించి గౌరవింతురు.

సీతమ్మ వాకిటా చిరుమల్లె చెట్టు - చిరుమల్లె చెట్టెమో చితక పూసింది.
చెట్టు కదలాకుండా కొమ్మ వంచండి - కొమ్మ విరగకుండా పూలు గోయండి.
అందులో పెద్దపూలు దండ గుచ్చండి - దాచుకో సీతమ్మ రాముడంపేడు
దాచుకోకుంటేను దోచుకుంటారు

అని పాడుకొంటారు.

చెట్టుకదలకుండా కొమ్మవంచి, కొమ్మ విరగకుండా పూలు కోయగల సామర్థ్యం కలుగుతుంది, వారి బుద్ధి కూడా వికసించుతుంది.

ఆదునిక జానపద సాహిత్యంలో శ్రామిక గేయాల రూపంలోనే ధర్మ, అధర్మాలను, వ్యక్తి యొక్క జీవన తత్వాన్ని వివరిస్తాయి.

మేదరోల్ల చిన్నది గంపలు తయారుచేసి, సంతలో అమ్మడానికి పోయింది. రెడ్డి కొడుకు కొంగుబట్టి నిలేసినాడు.

నీకంటే సక్కనోడు నాయింటి సిన్నవాడు - నీమేడ కంటే సక్కనిది
నామేదర గుడిసె - ఓరోరి రెడ్డి కొడుకు పొద్దెల పోదుర?

తన భర్త సక్కనోడు. రెడ్డి మేడ కన్న తన గుడిసె సక్కనిది అని అతిశయంగా చెప్పడమే గాక పొద్దు బోని పనులెందుకు చేస్తావ్? అని మందలించింది.

భూమిని, శ్రమను నమ్ముకున్న ఉన్నత మానవులు జానపదులు. భూమిని శ్రమను అమ్ముకుంటూ అంతా డబ్బుగా మార్చుకుంటూ విశ్వవిపణి వీధిలో ఈనాడు మానవుడే ఒక వస్తువు అయిపోయినాడు. ఫలితంగా కొన్ని వేల సంవత్సరాల పాటు కొనసాగుతు వచ్చిన మానవ సంబంధాలు, నిజాయితితో కూడిన మానవ జీవితం గ్రామీణ జీవితంలో యిప్పుడు కనిపించడం లేదు.

ఈ నేపథ్యంలో జానపద గేయములు మానవ జీవితంలో గల ఒడుదొడుకులు, ధర్మా, అధర్మాలు రాబోయే తరాల వారికి ఒకప్పటి మానవ జీవన సంబంధ బాంధవ్యాలు చూపించగల "విజ్ఞాన సర్వసాలు" ఈ గేయులు.

ఉపయుక్త గ్రంథావళి :

1) తెలుగు జానపద గేయ సాహిత్యం - శ్రీ బిరుదురాజు రామరాజు
2) జానపద గేయాలు - విద్వాన్ దస్తగిరి.
3) త్రివేణి - ఆంధ్రప్రదేశ్ జానపద గేయులు.

❖ ❖ ❖

జానపద సాహిత్యం – ధర్మార్థ కామమోక్షాలు

– పి. మల్లికార్జున్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ప్రాచీన కాలము నుండి జానపద సాహిత్యమునకు కవులు, పండితులు, ప్రాధాన్యతను ఇవ్వలేదు. సాహిత్యంలో మార్గ సాహిత్యం, దేశి సాహిత్యం అను రెండు వర్గాలు కలవు. మార్గ సాహిత్యము రాజులు, కవులు, పండితులచే ఆదరించబడింది. దేశ సాహిత్యము పామరజనులచే ఆదరించబడింది. మార్గ సాహిత్యాన్ని శిష్ట సాహిత్యమని, దేశి సాహిత్యాన్ని జానపద సాహిత్య మని పిలుస్తున్నారు.

జానపదులు అంటే సాధారణంగా గ్రామ వాసులే అనుకుంటారు. జానపదం అంటే గ్రామం. అందులో నివసించే వారినే జానపదులుగా వ్యవహరిస్తారు. సాంకేతిక విజ్ఞానం వలన సమాజం అనేక మార్పులకు గురవు తున్నది. కావున జానపదులు అంటే ఒక భాష లేదా జాతి లేదా ఒక వృత్తి లేదా ఒక ప్రాంతానికి సంబంధించిన జన సముదాయం కావచ్చు. జానపద సాహిత్యం జానపద విజ్ఞానంలో ఒక భాగం.

జానపద విజ్ఞానం



జానపద సాహిత్యం ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుంది. ఈ సాహిత్యం ఎప్పుడు, ఎక్కడ పుట్టిందో ఖచ్చితంగా చెప్పలేము. దాని వలన ప్రజల యొక్క ఆచారాలు సంప్రదాయాలను, సంస్కృతులను తెలుసు కోవచ్చు. జానపద సాహిత్యమును గ్రామ సాహిత్య, లోక సాహిత్య అని ఔత్తరాహికులు వ్యవహరిస్తారు.

జానపద సాహిత్యం – పలువురి అభిప్రాయాలు :

జానపద సాహిత్యమును కొందరు ప్రముఖ వ్యక్తులు పలు రకాలుగా పేర్కొన్నారు.

1) మల్లంపల్లి సోమశేఖర శర్మ – అనాదృత వాఙ్మయం
2) శ్రీ పాద గోపాల కృష్ణ మూర్తి – దేశి సారస్వతం
3) తల్లా వర్జల శివశంకర శాస్త్రి – పదవాఙ్మయం
4) ఖండవల్లి లక్ష్మీరంజనం – ప్రజావాఙ్మయం
5) వేటూరి ప్రభాకర శాస్త్రి – మధుర గీతాలుగా పేర్కొన్నారు.

పారమార్థిక గేయాలు – మోక్షం :

మోక్షం కోసం కృతాయుగంలో ధ్యానములు, తపస్సులు చేసేవారు. తేత్రయుగంలో యజ్ఞాలు చేసేవారు. ద్వాపర యుగంలో అర్చనలు చేసేవారు. కలి యుగంలో భగవన్నామస్మరణ ప్రధానమని దేవి భాగ వతంలో చెప్పబడింది. నామ స్మరణను కొందరు పాటల రూపంలోనూ, శ్లోకాల రూపంలోనూ, మంత్రాల రూపం లోను చేస్తారు. భగవంతుని నామ స్మరణ చేయడానికి ఉపయోగపడే పాటలే పారమార్థిక గేయాలుగా చెప్ప వచ్చు. వీటిలో లాలిపాటలు, మేలు కొలుపు పాటలు, మంగళ హారతులు, భజన కీర్తనలు మొదలగునవి.

భజన కీర్తనలలో ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలు, రామదాసు కీర్తనలు, తూము నరసింహ దాసు కీర్తనలు, పాండురంగని కీర్తనలు, వేపూరు హనుమద్దాసు కీర్తనలు, మన్నెంకొండ హనుమద్దాసు కీర్తనలు రాకమచర్ల వెంకట దాసు కీర్తనలు ఇలా ఎన్నో సంకీర్తనలు కలవు. సంకీర్తనల ద్వారా ఎంత మంది మోక్షాన్ని పొందారు. కలియుగంలో మోక్షం కలగాలంటే భజన కీర్తనల ద్వారా భగవంతుని నామాన్ని స్మరించడమే. సంకీర్తనల ద్వారా భగవంతుని కోసం ఎలా మైమరచిపోతారో ఈ పాటలో చూద్దాం.

రండి పుణ్యాత్ములారా । శ్రీ రంగని భజనకు రండి ధర్మాతులారా ॥
రండి మనమందరము । కోదండరాముల భజన సేయ॥
దండధరుని బట్టుల బట్టి । గుండెలదరగొడుదాము ॥
ప్రొద్దు ప్రొద్దున లేచి । మనమంతట పరిశుద్ధిగా స్నానంబు చేసి॥
పాపములు చేయ నేల । ఈ సంసార కూపములు కూలనేల ॥
రేపేయమ దూతలొచ్చి । కోపమున మనల బట్టి కొట్టి కొట్టి తీసుకపోయేరు ॥ ॥రండి॥

అంటూ పాడుతూ మైమరచిపోతారు.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.
2) ఆంధ్ర వాఙ్మయము చరిత్రము - దివాకర్ల వెంకటావదాని.
3) ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం.

❖❖❖

కె.వరలక్ష్మి గారి 'పక్షులు' కథలో ధర్మార్థాల ప్రాముఖ్యత

– పోతురాజు దుర్గాదేవి, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతము :

ఆహారము, నిద్ర మొదలగు విషయములలో మనుష్యులకు మిగిలిన ప్రాణులకు ఎటువంటి బేధము లేదు. వివేకము ఒక్కటే ఇతర జంతువుల నుండి మానవుని వేరు చేయుచున్నది. వివేకము లేని మనిషి రెండు కాళ్ళ జంతువు అంటారు. మానవుడు తను ఈ లోకములో ఎలా జన్మించాను, ఏమి సాధించాలి అని తప్పక ఆలోచించాలి. అలా ఆలోచించే మన పెద్దలు మానవుడు చతుర్విద పురుషార్థాలు సాధించాలి అని తెలియచేశారు.

"ధర్మము" మొదటి పురుషార్థము 'ధారణాద్ధర్మ:" అనే ఉత్పత్తిని బట్టి లోకమును ధరించునదే ధర్మము అంటారు.

అర్థము అనగా ధనము అని అర్థము. ఇది రెండవ పురుషార్థము "ధనమూలమిదం జగత్" అన్నట్లుగా ప్రపంచం అంతా ధనముపై ఆధారపడి ఉన్నది. ఈ ధనం లేకపోతే ఏ పని సాధించలేరు.

కామము అనగా కోరిక అని అర్థము. జీవితములో ప్రతి ఒక్కరికి ఎన్నో కోరికలు ఉండును. వాటిని తీర్చుకొనుట కూడా పురుషార్థమే. అయితే ఆ కోరికలు అనేవి ధర్మబద్ధములు అయినప్పుడే వాటికి విలువ. ధనము సంపాదించుటలో ఎట్లా ధర్మము విడువరాదో అలాగే కోరిక సాధించే విషయములో కూడా ధర్మమును అతిక్రమించరాదని తెలియచేశారు.

మోక్షము అనగా విడుదల అని అర్థము. శాశ్వతమైన ఆనందస్థితిని చేరుకోవడమే మోక్షము అని పెద్దలు తెలియచేశారు.

రచయిత్రి పరిచయము :

తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేటలో వెంకటరమణ, బంగారమ్మ దంపతులకు అక్టోబరు 24వ తారీఖు, 1948వ సంవత్సరములో కె.వరలక్ష్మి గారు జన్మించారు. వీరి ప్రాథమిక విద్య జగ్గంపేటలో పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి యమ్.ఎ. పట్టా పుచ్చుకున్నారు. 1964వ సంవత్సరములో కె.రామ్మోహనరావు గారితో వివాహము జరిగినది. వరలక్ష్మి గారి కలము నుండి వెలువడిన వివిధ సాహిత్య ప్రక్రియలు 140కి పైగా కథలు, 4 నవలికలు, కవితలు, వ్యాసాలు, వివిధ పత్రికలలో ప్రచురించబడ్డాయి. కొన్ని నాటికలు రేడియోలో ప్రసారము అయ్యాయి. వీరి సాహిత్య సేవకు గాను ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

పక్షులు కథ ఇతివృత్తం :

మాధవరావు, శ్యామల భార్యాభర్తలు. వారి ఒక్కగా నొక్క కొడుకు కిరణ్. బాధ్యత లేని భర్త మాధవరావు. భార్య శ్యామల ఎంతో కష్టపడి స్కూలు టీచరుగా పని చేస్తూ సంసారము చూసుకుంటూ కొడుకుని చదివించుకుంటుంది. నిర్లక్ష్య ధోరణి తన ప్రవృత్తిగా కలిగిన మాధవరవు భార్యతో గొడవలు పడి భార్యకు తెలియకుండా ఇంకో వివాహము చేసుకుని, భార్యకు అక్రమ సంబంధాలు ఉన్నాయని ఆ కారణంగా విడాకులు కావాలని కోర్టును ఆశ్రయిస్తాడు. పెద్దవారు ఎవ్వరు ఆసరా లేని శ్యామల కోర్టుకు వెళ్ళుతుంది. విడాకులలో భాగంగా కొడుకు కిరణ్‌ను కోర్టు వారు ఎవ్వరితో ఉంటావు, మీ అమ్మతోనా ! మీ నాన్నతోనా ! అని అడిగితే, 15 ఏళ్ళు పెంచిన తల్లిని కాదని తండ్రితో ఉంటానంటాడు. కిరణ్ చెప్పిన సమాధానానికి దిగ్భ్రాంతికి గురియైన శ్యామల తేరుకోలేక పోతుంది. ఇంటికి వెళ్ళిన శ్యామలకి చెట్టుపై ఉన్న కొంగ ఎగరలేని తన పక్షి పిల్లలకి ఆహారము తినిపించటం చూస్తుంది. ఎగరటానికి ప్రయత్నిస్తూ ఒక కొంగ పిల్ల క్రిందకు పడటం, అయినా తల్లి కొంగ పట్టించు

కోకుండా మిగిలిన పిల్లలకు ఆహారము అందివ్వటం చూస్తుంది. క్రింద పడ్డ కొంగ పిల్ల రెక్కలు విప్పార్చి చెట్టుపైకి ఎగరడానికి ప్రయత్నించి ఎగురుతుంది. అప్పుడు శ్యామల తనలో తాను కిరణ్ కూడా ఇంతే రెక్కలు వచ్చి ఎగిరిపోయాడు అని సమాధాన పరచుకుంటుంది. కాని ఆమెకు కిరణ్ ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకున్నాడో ఎంత ఆలోచించినా అర్థం కాదు. ఒక 10 రోజుల తరువాత శ్యామలకు కిరణ్ వద్ద నుండి ఒక ఉత్తరము వస్తుంది. అందులో "అమ్మా నేను తీసుకున్న నిర్ణయానికి నీవు కోపంగా ఉంటావని తెలుసు. కాని నాన్న పిన్నికి పిల్లలు లేరు. నీవు వస్తే ఈ ఆస్తి మొత్తం నీకే వస్తుంది. ఇక మొత్తం నీ ఇష్టం అని అన్నారు". అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను అని ఉంటుంది. మానవ బంధాలను అర్థము అనే డబ్బు ఎలా శాసిస్తుందో రచయిత్రి ఈ కథ ద్వారా తెలియచేశారు. ఒక మానవుడు ధర్మ మార్గములో నడుచుకోవాలి కాని మాధవరావులా ఏ వ్యక్తి నడుచుకోకూడదు అని మాధవరావు పాత్ర ద్వారా తెలియచేశారు. అర్థము ప్రాధాన్యత గలదే కాని మాతృత్వాన్ని ధిక్కరించేది కాదు అని తెలియచేశారు. కాని సహజ మార్పును స్వాగతించాలి అని కథలోని చిన్న కొంగ కథ ద్వారా తెలిపారు. తల్లి కొంగ ధర్మ మార్గము, శ్యామల ధర్మమార్గముకు మధ్య పోలిక అత్యద్భుతంగా చూపారు.

ముగింపు :

ఆత్మీయ సంబంధాలన్ని "ధనమూలమిదం జగత్" అన్నట్లుగా ఆర్థిక సంబంధాలతో కలిసిపోయే ఆధునిక ఆవిర్భవించటం మన సంస్కృతీ సాంప్రదాయాలకు నష్టమే. చతుర్విద పురుషార్థాల ప్రాధాన్యత తెలియ చేయడం ఒక గొప్ప ప్రయత్నం అనడంలో అతిశయోక్తి లేదు. వాటిని తెలియచేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అది మనందరి బాధ్యత.

చతుర్విద పురుషార్థాల పరమార్థం
సమాజ అభ్యున్నతికి అవసరం

ఆధార గ్రంథ సూచిక :

1) కథా మంజరి
2) అతడు నేను కథా సంపుటి - కె.వరలక్ష్మి గారు.

❖ ❖ ❖

బసవపురాణం – ముగ్ధభక్తి – మోక్షసిద్ధి

– ఆర్. మహేందర్ రెడ్డి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట, తెలంగాణ.

వేదాల సారానికి భక్తి రసామృతాన్ని జోడించి, సమాజ సంస్కరణదృష్టితో భక్తిమార్గం ద్వారా పురుషార్థ సాధనకు మార్గం వేస్తూ, కులమతాలకతీతంగా, పండిత పామర జనరంజకంగా జానుతెనుగులో, గానయోగ్యమైన ద్విపద ఛందస్సులో తొలితెలుగు ప్రజాకవి పాల్కురికి సోమన రాసిన దేశీపురాణం 'బసవపురాణం'. ఇందులో సుమారు డెబ్భైకి పైగా శివభక్తుల కథలున్నాయి. వారిలో నిర్మలమైన ముగ్ధభక్తి ద్వారా మోక్షం పొందిన వారి విశేషాలను, ముగ్ధభక్తి మోక్షసిద్ధికి ఎలా మార్గం వేస్తుందో తెలిపే అంశాలను వివరించడమే ఈ వ్యాస ఉద్దేశము.

హిందుధర్మసంప్రదాయం సూచించిన ఆశ్రమధర్మా లన్నింటిలో గృహస్థాశ్రమం ఉన్నతమైంది. ఇది మిగతా ధర్మాలన్నింటికి ఆధారంగా నిలుస్తుంది. గృహస్థుగా మానవులు పొందవలసిన అంశాలు ధర్మార్థకామమోక్షాలు అవే చతుర్విద పురుషార్థాలు. వీటిలో ముఖ్యమైనవి ధర్మము - మోక్షము. ధర్మబద్ధమైన జీవనంలో అర్థ కామా లను పొందినపుడు మాత్రమే వానప్రస్థాశ్రమములో వాటిని సులువుగా త్యజించే శక్తి కల్గి మోక్షసాధనకు మార్గం సుగమమవుతుంది.

సాధారణంగా ప్రతి మానవుని జీవితంలో అనంతమైన కోరికలుంటాయి. జ్ఞానవంతులు వాటిలో ధర్మబద్ధమైన కోరికలు తీర్చుకుంటూ ప్రశాంతంగా ఉంటారు. తరువాత శాశ్వత ప్రశాంత సుఖం కోసం కోరికలు వదలివేస్తూ మోక్షసాధన కోసం ప్రయత్నం చేస్తారు. ఎంత ధర్మబద్ధంగా ఉన్నప్పటికీ అర్థకామాల వలన కలిగే ఆనందం. మోక్ష సాధనకు అడ్డుగానే పరిణమిస్తుంది. శరీరం - మనస్సు - బుద్ధికి అతీతంగా ప్రకృతిలోని ప్రతి అణువులో పర మాత్మను దర్శించినపుడే మోక్షసాధనకు మార్గం ఏర్పడు తుంది. భగవద్గీతలో చెప్పినట్లు కర్మ-జ్ఞాన-భక్తి యోగాలు మోక్షసాధనకు మార్గం సూచిస్తాయి. వీటిలో భక్తియోగంతో ముగ్ధభక్తి ద్వారా మోక్షం పొందిన వారి కథలు తెలుగు సాహిత్యంలో విరివిగా కన్పిస్తాయి.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో చాలా వరకు భక్తి సంబంధ సాహిత్యమే కన్పిస్తుంది. అలాంటి భక్తి సాహిత్యంలో మోక్షం అనే ఉత్తమ పురుషార్థానికి మన తెలుగు కవులు పెద్దపీట వేశారు. సాహిత్యాన్ని రాజస్థానాల నుండి, పండితుల గోష్ఠి నుండి సాధారణ ప్రజల వద్దకు తీసుకుపోయిన ప్రజాకవి పాల్కురికి సోమన. ప్రజలు పాడుకునే రోకటి పాటలకు దగ్గరగా ద్విపద ఛందస్సులో స్థానిక భక్తుల గాథలను జానుతెనుగులో రాసిన తొలి తెలుగు దేశీపురాణం బసవపురాణం, ఇందులో పాల్కురికి సోమన నిండైన శివభక్తితో తన కంటే ముందటివారు, సమకాలీనులు అయిన ఎందరో శివ భక్తుల కథలను నిక్షిప్తం చేశారు.

భాగవతంలో చెప్పబడిన నవవిధభక్తిమార్గాల కంటే ఉన్నతమైంది ముగ్ధభక్తి. మోక్ష సాధనలో వినూత్నమైన. విశేషమైన భక్తిమార్గమిది. ముగ్ధత్వం అంటే కల్మషం లేని స్థితి. మనసుకు ఎలాంటి మాలిన్యమంటని నిర్మల వ్యక్తిత్వం. స్వార్థభావం లేకుండా స్వపరభేదం పాటించ కుండా ప్రవర్తించే తత్వము. ఆధ్యాత్మికంగా దృష్టిలో అణువణువులో పరమాత్మను దర్శించగల పరిపూర్ణ పరిణతి పొందిన స్థితినే ముగ్ధత్వం అనవచ్చు.

శివుడు హాలాహలం స్వీకరించడాని తెలుసుకున్న రుద్రపశుపతి అనే శివభక్తుడు ఎంతో చింతిస్తాడు. "తల్లియున్న విషము త్రావనేలిచ్చు" అని బాధపడు తాడు. విష స్వభావం వలన శివునికి బదులుగా తానే మరణించడానికి సిద్ధపడతాడు. అది చూసి శివుడు ప్రత్యక్షమవగా కంఠంలో దాచిన విషాన్ని ఉమ్మివేయమని

కోరుతాడు. ఈ భక్తుని మాటలకు శివుడు ఎక్కడ విషాన్ని ఉమ్మివేస్తాడో, ఎలాంటి ప్రళయం వస్తుందోనని దేవతలు భయపడుతారు. శివుడు ఎంత నచ్చచెప్పినా రుద్రపశుపతి వినకుండా మొండిపట్టుపడుతాడు. అతని నిర్మలమైన ముగ్ధభక్తికి మెచ్చిన శివుడు రుద్రపశుపతికి భవ బంధాల నుండి విముక్తి కల్గించి మోక్షం ప్రసాదించి శాశ్వతంగా తన అంకపీఠముపై స్థానం కల్పిస్తాడు.

చోళమండలపు శివభక్తుడైన నక్కనైనారు దంపతులు శివపూజ చేస్తున్న సమయంలో శివునిపై ఏదో పురుగు పారుతుందని భావించిన ఆయన ఇల్లాలు నోటితో ఊదుతుంది. అది చూసి నక్కనైనారు శివునిపై తన భార్య నోటి తుంపరలు పడి అపచారం జరిగిందని భావించి ఇల్లాలిని తిట్టి వెళ్లగొడతాడు. తిరిగి రాత్రి శివపూజ చేస్తున్న సమయంలో తన భార్య దూపొడ్చిన స్థలంలో కాకుండా మిగతా శివలింగం అంతటా పొక్కులు లేచి ఉండడం గమనిస్తాడు. నక్కనైనారు వెంటనే భార్య దగ్గరకు వెళ్ళి విషయం చెప్పి బ్రతిమాలి ఇంటికి తోలుకొని వచ్చి శివ లింగపై ఊదమని చెప్తాడు. శివలింగంపై పొక్కులు చూసిన ఆ ఇల్లాలు "అయ్యో నాభర్త తిట్టాడని నేను వెళ్ళిపోయాను. ముందే నేను లింగమంతటా ఊది ఉంటే ఇంత దారుణం జరిగేది కాదు. దీనికంతటికి నేనే కారణం" అని భావించి ప్రాణత్యాగానికి సిద్ధపడుతుంది. ఆమె నిర్మలమైన ముగ్ధభక్తికి మెచ్చిన శివుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకొమ్మంటాడు. ఆ దంపతులు నిరంతర శివపాదాశ్రయం ఆకాంక్షించగా శివుడు వారికి మోక్షం ప్రసాదించి తన పాదాల వద్ద చిరస్థానం కల్పిస్తారు.

బసవ పురాణంలో తృతీయాశ్వాసానికి మణిపూసవంటి భక్తురాలి కథ బెజ్జమహాదేవి కథ. శివభక్తురాలైన బెజ్జమహాదేవి శివునికి ఇతర దైవాలకు అలంకరణ విషయంలో ఉండే భేదాలను గమనించి శివునికి తల్లి లేకపోవడం వల్లనే స్మశానంలో ఉంటూ, విబూది రాసుకుంటూ జంతుచర్మాలు, పాములు ధరిస్తున్నాడని ఆవేదన చెందుతుంది. తల్లి లేకున్నా కూడా ఇంతవాడుగా ఎదిగిన శివుడు తల్లి ఉన్నట్టయితే ఇంకా ఎంతో గొప్పవాడై ఉండేవాడని భావించి తానే తల్లియై శివునికి అనేక బాల్యోపచారాలు చేసింది.

"యేకమేవాహిరూపేణ" "సాధకస్సంస్మరేత్తదా" అనే స్మృతి వాక్యాలను బట్టి "భక్తుడెబ్బంగిగా భావించు శివుడు - వ్యక్తిగా తద్రూపుడై యుండుటరుదు" అయినా శివుడు బాలుడై బెజ్జమహాదేవి సేవలను స్వీకరిస్తాడు. ఆమె భక్తిని పరీక్షింపదలచిన బాల శివుడు ఒక రోజు ఏమి తినకుండా మాట్లాడకుండా ఉంటాడు. అతన్ని చూసి భయపడి బెజ్జమహాదేవి నానా రకాల ఉపచారాలు చేస్తుంది. శివుడు మారు మాట్లాడకపోవడంతో "చాలుజూడంగ నీ సంకటం బింక - బాలుండ నీమీద ప్రాణములివ్వడుతు" అని ప్రాణ త్యాగానికి సిద్ధపడగా శివుడు ప్రత్యక్షమై బెజ్జమహాదేవి ముగ్ధభక్తికి మెచ్చి మోక్షం ప్రసాదించి ఆమెను "ముల్లోకాలకు ముత్తవ్వ" అని పిలిచి శాశ్వత నిత్యత్వాన్ని ప్రసాదించాడు.

శివ భక్తుడైన శివదేవుని చిన్న కూతురు గొడగూచి. ఒకరోజు ఆమె తల్లిదండ్రులు ఊరెళ్తూ ప్రతిరోజు శివునికి కుంచెడు పాలు ఆరగింపు పెట్టమని గొడగూచికి చెప్పి వెళ్తారు. తండ్రి మాట ప్రకారం గొడగూచి శివునికి పాలు ఆరగింపు పెట్టగా శివుడు ఆ పాలను స్వీకరించడు. అది చూసి భయపడిన గొడగూచి "కాచుట సాలదో కమ్మ వల్వమినో" అని నానా రకాలుగా శివున్ని ప్రశ్నిస్తుంది. అటుకులు, నెయ్యి ఇస్తానని ఆశపెట్టి బుజ్జగిస్తుంది. కోపించి అరచి భయపెడుతుంది, బతిమాలుతుంది. శివుడు పాలుత్రాగకపోతే తనతండ్రి తనను చంపుతాడు ఆ చావేదో ఇపుడే చస్తానని భావించి "తన తల శివునితో దాకించుకొనగా" ఆమె ముగ్ధభక్తికి మెచ్చిన శివుడు నవ్వుతూ వచ్చి పాలుత్రాగుతాడు. ఇలా ప్రతిరోజు గొడగూచి శివునికి పాలు ఆరగింపు పెట్టి వస్తుండగా ఒక రోజు తండ్రి ఎదురై పాలు ఏవని అడుగుతాడు. శివుడే తాగాడని చెప్పిన కూతురు మాటలు నమ్మని శివదేవుడు మరుసటిరోజు గొడగూచితో పాలు పట్టించుక వచ్చి శివునికి ఆరగింపు

పెడ్తాడు. కానీ శివుడు పాలు ఆరగించడు. అది చూసిన శివదేవుడు గొడగూచి అబద్ధం చెప్పిందని భావించి పట్టి చంపబోతాడు. భయపడిన గొడగూచి "హాలింగ హాలింగ" అంటూ శివున్ని వేడుకోగా శివుడు తన హృదయం తెరిచి గొడగూచిని తనలో ఐక్యం చేసుకుంటాడు. కూతురిని పట్టుకోబోయిన శివదేవునికి గొడగూచి వెంట్రుకలు చిక్కుతాయి. ముగ్ధభక్తితో గొడగూచి పొందిన మోక్షసిద్ధికి నిదర్శనంగా లింగంపై వెంట్రుకలు ఉండిపోతాయి.

కంచి పట్టణానికి చెందిన నాట్యమిత్తండి అనే శివ భక్తుడు తాండవాకారంలో ఉన్న శివున్ని చూసి భయ పడుతాడు. వాయురోగం సోకడం వల్లనే శివుడు అలా ఉన్నాడని భావించి తన ఆస్తినంతా అమ్మి వైద్యం చేయిస్తాడు. అయినా కూడా శివతాండవ రూపం మారక పోవడంతో ప్రాణత్యాగానికి సిద్ధపడతాడు. శివుడు ప్రత్యక్షమై నాట్యమిత్తండికి తాండవాకార రూప విశేషాలను వివరించి "అనురాగాలీలమైనతుల మౌర్ధ్యమున - మించిన నాట్యమిత్తండి మహిమ" కు మెచ్చి శివుడు మోక్షం ప్రసాదించి దివ్య విమానంలో కైలాస ప్రాప్తిని కల్గిస్తాడు.

శ్రీకాళహస్తికి చెందిన ఉడుమూరి కన్నప్ప వేటకు వెళ్లి అడవిలో ఉన్న లింగాన్ని చూసి అచ్చెరువంది భక్తితో ఉపచారాలు చేస్తాడు. ముగ్ధభక్తితో కన్నప్ప పుక్కిటి నీటితో శివున్ని అభిషేకించి, మాంసాన్ని నివేదిస్తాడు. కన్నప్ప భక్తిని పరీక్షించదలచిన శివుడు తన కంటి నుండి ధారాపాతంగా రక్తాన్ని స్రవిస్తాడు. అది చూసి భయపడిన కన్నప్ప. కంటికి కన్నే మందు అని భావించి బాణంతో తన కన్నును పెరికించుకొని శివునికి అర్పిస్తాడు. వెంటనే రక్తం కారడం ఆగిపోతుంది. కాని శివుని రెండవ కంటి నుండి రక్తం కారడం మొదలవుతుంది. అది చూసి వ్యాధికి తగ్గ మందు దొరికిందని భావించిన కన్నప్ప రెండవ కన్నును కూడా పెరికించబోగా శివుడు ప్రత్యక్షమై తిరిగి అతనికి కన్నులు ప్రసాదిస్తాడు.

"కన్నర్పితము సేసె - కానలోకమున - కన్నప్పడనగ మహోన్నతికెక్కు" మని కన్నప్పకు మోక్షం ప్రసాదిస్తాడు.

బసవపురాణం చతుర్థాశ్వాసంలోని సిరియాళుని కథలో సిరియాళ - సంగళవ్వ దంపతుల భక్తిని పరీక్షించడానికి శివుడు జంగమ వేషంలో వారింటికి భోజనానికి వస్తాడు. తనకు నరమాంసం కావాలని కోరగా సిరియాళ దంపతులు వారి కుమారున్ని వధించి వండి జంగమకు వడ్డిస్తుంది. కొడుకు మీద ప్రేమతో తలను వండకుండా దాచిపెట్టడం గమనించిన జంగమయ్య తనకు తల మాంసం కావాలంటాడు. చేసేదేమిలేక సంగళవ్వ కొడుకు తలను కోసి వండి పెడ్తుంది. కానీ జంగమయ్య సకుటుంబంగా తనతో కల్సి కూర్చుంటే తప్ప భుజించనని కొడుకుని పిలమని చెప్పగా సంగళవ్వ భక్తితో ఎలుగెత్తి కొడుకుని పిలుస్తుంది. అందరికీ ఆశ్చర్యం కల్గిస్తూ మరణించిన కొడుకు ప్రాణాలతో తిరిగి వస్తాడు. ధర్మబద్ధమైన గృహస్థాశ్రమ నిర్వహణకు, అతిథి సేవాసత్కారానికి నిర్మలమైన నిశ్చలమైన భక్తిభావానికి మెచ్చి శివుడు సిరియాళ దంపతులకు మోక్షం ప్రసాదిస్తాడు.

అలా కైలాస ప్రాప్తి పొందిన సిరియాళుడు భక్తిగర్వంతో మెలగడాన్ని గమనించిన శివుడు సిరియాళున్ని భూలోకానికి తొలుకవచ్చి అతనికంటే గొప్పభక్తులైన నిమ్మవ్వ, నరసింగనాయరులను చూపించి భక్తివలన కలిగే గర్వానిన తొలగించి శాశ్వత ముక్తి కల్గిస్తాడు.

ఎణుమూర్తి నాయనార్ అనే శివభక్తుడు ప్రతిరోజు శివున్ని గంధంతో అభిషేకించేవాడు. కాలక్రమేణా అతని సంపద తరగిపోయి గంధము కొనడానికి సంపద లేక తన శరీరాన్ని కోసి రక్త గంధంతో శివున్ని అభిషేకిస్తాడు. అతని భక్తితత్పరతకు మెచ్చి శివుడు మోక్షము ప్రసాదించి సశరీరంగా కైలాసప్రాప్తి అనుగ్రహిస్తాడు.

చీకటివేళ వర్షంలో తడిసి వచ్చిన అతిథికి గృహస్థ ధర్మం తప్పకుండా ఇంటి కప్పును చలిమంటగా వేసి అలికిన విత్తనాలను కడిగితెచ్చి వేయించి పెట్టి క్లిష్ట పరిస్థితులలో కూడా అతిథి సేవా ధర్మాన్ని పాటించి

మోక్షం పొందిన దంగలి మారయ్య కథ ద్వారా సక్రమమైన ధర్మాచరణము మోక్షానికి మార్గం వేస్తుందని నిరూపించాడు.

శివాజ్ఞ మేరకు శ్రీశైలంలో తపస్సు చేసుకుంటున్న మాదిరాజయ్యను పరీక్షించడానికి శివుడు గొల్లపిల్లనిగా మారి మేకల మందతో ఆ ప్రాంతానికి వెళ్లి రాజయ్య కూర్చున్న తుమ్మచెట్టు కొమ్మలను నరుకుతాడు. తపోభంగమైన రాజయ్య బాలున్ని చూసి కోపించగా శివుడు ప్రత్యక్షమై అరిషడ్వర్గాలను జయించకుండా ఎంత గొప్పవాడైనా కూడా పురుషార్థసాధనకు పనికిరాడని "రోసి సంసారము బాసి యెక్కింత - యాసించెనేనియు నదివెల్లిగాదె" అని మోక్ష మార్గాన్ని సూచిస్తాడు.

వీరితో పాటు మేక పెంటికలో శివలింగాన్ని దర్శించిన కాటకోటని కథలో కుంచాన్ని శివలింగంగా భావించి పూజించిన బల్లేశు మల్లయ్య కథలో, నిరంతరం శివభక్తుల రక్షణయే దీక్షగా గలిగి ముక్తి పొందిన ఇరువదండారి కథలో, శివుడికై నిర్మించిన గుడితోపాటు సశరీరంగా కైలాసప్రాప్తి పొందిన దీపకదళియారు కథలో... భక్తిమార్గం ద్వారా ధర్మ నిర్వహణ ద్వారా మోక్ష సాధనకు ఏర్పర్చుకునే మార్గాలను వివరించారు.

ఈ విధంగా శివున్ని విగ్రహంగానే, దైవంగానో, కాకుండా తమ తోటివానిగా సశరీరుడైన స్నేహితునిగా, బిడ్డగా, బంధువుగా, భావించి సేవించి తమ నిర్మలమైన నిష్కలంకమైన ముగ్ధభక్తితో మోక్షప్రాప్తిని పొందిన శివభక్తుల కథలు బసవపురాణంలో కన్పిస్తాయి. భవబంధాల నుండి విముక్తి పొంది ఈశ్వర సాన్నిహిత్యం పొందడమే మోక్షం అని భావించినపుడు ఆ మోక్ష సాధనకు నిర్మలమైన ముగ్ధభక్తియే మార్గమని.

"కావున తొల్లి ముగ్ధ స్వభావులకు
దేవుండు కృపసేయు తెల్లమిట్టనుచు" పాల్కురికి సోమన బసవ పురాణంలోని భక్తుల కథల ద్వారా నిరూపించాడు.

❖❖❖

ప్రవరుడు – ధర్మార్థకామమోక్షాలు

– డా॥. రొడ్డోలు శ్రీనివాస్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నల్లగొండ.

ఎనభైనాలుగు లక్షల జీవరాశుల్లో దుర్లభమైనది మానవ జన్మ. ధర్మార్థ కామ మోక్షాలు మానవులు ఆచరించవలసిన చతుర్విధ పురుషార్థాలు. పురుషార్థాలు అంటే వ్యక్తికి 'కావలసినవి'. ధర్మార్థకామమోక్షాలు మానవుడు సాధించాల్సిన లక్ష్యాలని వేదాలలో చెప్పబడింది. పూర్వం బ్రహ్మచర్యంలోనే వీటికి సంబంధించిన విజ్ఞానాన్ని గురువులు చక్కగా బోధించేవారు. ఇవి మానవ జీవన వికాసానికి ప్రధానమైనవి. ధర్మ మార్గంలో అర్థాన్ని కామాన్నీ సాధించి మోక్ష మార్గంలో సాగిపోవడం జీవుని కర్తవ్యంగా మనుచరిత్ర కావ్యంలో ప్రతిపాదించబడింది.

ప్రవరుడు - ధర్మం :

చతుర్విధ పురుషార్థాలలో మొదటిది ధర్మం. వేదమే ధర్మానికి మూలం. 'ధర్మో రక్షతి రక్షితః' - ధర్మాన్ని రక్షించు, ఆ ధర్మం నిన్ను రక్షిస్తుందని వేదం చెబుతుంది. హిందూ దేశానికి ధర్మక్షేత్రమని పేరు. ధర్మావతారమెత్తి మనుష్యులకు ధర్మప్రవర్తన గూర్చి తెలియచేశాడు శ్రీరామచంద్రుడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అని కీర్తించబడ్డాడు. ధర్మానికి వేదాలు ప్రమాణాలు. ధర్మా ధర్మ విచక్షణ వచ్చినపుడు సత్పురుషులు ఆలోచించి తగిన నిర్ణయం చేసి ధర్మ పక్షపాతులై వ్యవహరిస్తారు. ఇటువంటి ప్రామాణికమైన ధర్మాన్ని ఆచరించినవారు ఇహలోకాల్లో కీర్తిని, సుఖాన్ని పొందుతారు. సత్యము, అహింస, ఇంద్రియ నిగ్రహము, అస్తేయము, అపరిగ్రహము, ధృతి, శౌచము, శాంతి, క్షమ, ఓర్పు మొదలగు సుగుణములన్నీ ధర్మమునకు అవయవాలై ఉన్నాయి.

ధర్మం అంటే విధి నిర్వహణ. బ్రహ్మచారికి వేదాధ్యయనము, గురు శుశ్రూష, ఇంద్రియ నిగ్రహము, పెద్దల యందు గౌరవము ప్రధాన ధర్మములు. గృహస్థునకు ఏకపత్నీవ్రతము, తల్లిదండ్రుల సేవ, అతిథి సత్కారము, ధర్మ సంతానము, ఆచార నిర్వహణము, అనాథుల యందు ఆదరణ, బీదలకు సహకారము ప్రధానములు. వానప్రస్థుడు ధర్మ వ్యవహారబద్ధుడై వయోభారాన్ని దృష్టిలో ఉంచుకొని, కర్మలయందు స్వార్థమును వీడి వైర్యాగ్యము కలిగి ధర్మపత్నిని సంతానమున కప్పగించి కామక్రోధాదులను జయించి నిర్లిప్తుడై శేష జీవితమును లోకోద్ధరణకై ధర్మ ప్రబోధనే ఏకైక లక్ష్యంగా ఆత్మ సాక్షాత్కారంతో సన్యసించుట యుక్తమైనది. సంక్షిప్తంగా తను, తన కుటుంబం, సమాజం, రాజ్యం గురించి ఆలోచించడం ధర్మం. తనకోసం తాను చేసేది స్వార్థం. అది అధర్మం.

'అక్కడ పుట్టిన చిగురు కొమ్మైన చేవ'(మను. ప్ర. ఆ. 50) అని చెప్పినట్లు ప్రవరుడు బ్రాహ్మణ శ్రేష్ఠుడు, ధర్మ వీరుడు. అతిథి సేవాపరాయణుడు. గృహస్థే సమాజానికి ఆధారం కాబట్టి అతడు ఉత్పత్తిని పెంచి ధనార్జన చేయాలి, సంతానాన్ని కనాలి, అతిథి అభ్యాగతులను సేవించాలి. గృహస్థు తన ధర్మం తప్పితే సమాజ జీవనం అస్తవ్యస్తం అవుతుంది. ప్రవరుడు ఆదర్శ గృహస్థుడు. ప్రవరుని జీవనం ధర్మబద్ధమైనది. తల్లిదండ్రుల సేవించడం, త్రికాలాలలో అగ్నినారాధించడం, అతిథులను ఆదరించడం, అధ్యయన అధ్యాపనలు చేయడం మొదలగునవి అతని ధర్మనిష్ఠను తెలియజేస్తున్నాయి. ప్రవరుడు మనోనిగ్రహం, వైరాగ్యం, కలవాడు. వరూథిని తన మాటకారితనంతో, అందంతో, ప్రేమతో ప్రవరుడిని వశపర్చుకోవాలని చూస్తుంది. కానీ వరూథిని అగ్నిపరీక్షకి తట్టుకొని ప్రవరుడు నిలబడ్డాడు. ధర్మానికి కట్టుబడి ఉండాలా, ఆకర్షణకు లొంగిపోవాలా అన్న అన్న సందర్భంలో ధర్మానికే కట్టుబడి ఉంటాడు.

ప్రవరుని భార్య సోమిదమ్మ. అంటే సోమయాజి భార్య అని అర్థం. సోమిదమ్మ ఆనాటి గృహిణులకు ప్రతినిధి.

"వండ నలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ నతని గృహిణి"(మను. ప్ర. ఆ. 56). ఆమె సాక్షాత్తు అన్నపూర్ణాదేవి వంటిది. సోమిదమ్మ వెయ్యి మంది అతిథులు ఇంటికి వచ్చినా అలిసిపోకుండా వంట చేసి పెడుతుంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఏ సమయంలో అతిథి వచ్చినా అన్నం పెట్టేది. అంటే ప్రవరుని ఇంట్లో నిత్యం అన్నదాన సంతర్పణ జరుగుతూ ఉంటుంది. ఇది చాలా గొప్ప ఆచారం. ఆచారాలు ఒక జాతి సంస్కృతికి పట్టుగొమ్మలు. సోమిదమ్మ ఆనాటి గృహిణులకు ప్రతినిధి. అలాంటి సహధర్మచారిణి ఉన్నది కాబట్టే అతని ధర్మదీక్ష నిరంతరాయంగా సాగిపోతున్నది. వరూథిని ఎంతగా మభ్యపెట్టినా ప్రవరుడు లొంగకపోవడానికి ముఖ్యమైన కారణం ఆమె. సోమిదమ్మ వంటి అనుకూలవతియైన భార్య ఉండబట్టే ప్రవరుడు ఇంద్రియ నిగ్రహాన్ని ఎన్నడూ కోల్పోలేదు. ప్రవరుడు ధర్మమార్గాన్ని వీడకపోవడానికి, అతని వ్యక్తిత్వం ప్రకాశించడానికి సోమిదమ్మే హేతువు.

ప్రవరుడు - అర్థం :

'అర్థం', అంటే కర్మ ఫలితం. ధర్మ నిర్వహణ ద్వారా లభించే ఫలితం. అర్థం మనిషి జీవనానికి తప్పనిసరైనది. మనిషిని మాయామోహితుని చేసేది అర్థమే. అర్థార్జన ధర్మం తప్పి ఉంటే అది వినాశనమే. అర్థం ధర్మమార్గంలో సంపాదిస్తూనే తనకు, ఇతరులకు వినియోగపడేలా చూసుకోవాలే కాని, తరతరాలకి దాచడానికి కాదు. అర్థం ఎంత అవసరమో తెలుసుకున్నప్పుడే మనిషికి సుఖం, శాంతం. పరద్రవ్యాపహరణం, మనుష్య ధర్మం కాదు. పరదారాపహరణంతో రావణాసురుడు తన నాశనం తానే తెచ్చుకున్నాడు. పరద్రవ్యం అలాంటి వినాశనకారే. ధనం అనగా కేవలం రత్నరాసులో, బంగారమో లేక డబ్బో కాదు. కొందరికి తపస్సు ధనం. మరికొందరికి జ్ఞానం ధనం. ఇంకొందరికి ఆరోగ్యం ధనం. కొంతమందికి ధర్మం ధనం. మరికొంత మందికి కామం ధనం.

ప్రవరుడు ధన విద్యా సంపదలు గలవాడు. అన్నదాత. అతని మాన్యక్షేత్రాలు చక్కగా పంటల నందిస్తున్నాయి. కాబట్టి పరుల ముందు చేయి చాచాల్సిన అవసరం లేదు. అతని సౌశీల్యాన్ని, కులమును, గుణమును, నియమ నిష్ఠలను చూసి రాజులు అతనికి అగ్రహారములు, భూములు దానముగా ఇవ్వాలని చూసినా అతడు స్వీకరించచేవాడు కాదు. అతని ఇంట పాడికి పంటకు కొదువలేదు. అంతేకాక ప్రవరుడు

ఆ పురిఁ బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి, భా షాపరశేషభోగి, వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీ క్షాపరతంత్రుఁ, డంబురుహగర్భ కులుభరణం, బనారతా ధ్యాపనతత్పరుండు, ప్రవరాఖ్యుఁడలేఖ్య తను విలాసుఁడై. (మను. ప్ర.ఆ. 51)

ప్రవరుడు గొప్ప వాక్చాతుర్యం, పలురకాల యజ్ఞాలు, పుణ్యకార్యాలు దీక్షగా చేసేవాడు, ఎల్లప్పుడు వేదాధ్యయనం చేయడంలో ఆసక్తి కలవాడని పెద్దన వర్ణించాడు. ఇవన్నీ ప్రవరుడు కలిగివున్న గుణ సంపదలు.

సోమిదమ్మ వంటి అనుకూలవతియైన భార్యను కలిగివుండడం, తల్లిదండ్రులు జీవించి ఉండడం, వారు సంసార భారమును వహించుచుండడం, ప్రవరుడు దానములు చేస్తూ, భోగాలను అనుభవిస్తూ, అతిథిసేవను ఆచరిస్తూ, మంచి శిష్యులను కలిగి సుఖించడం, జపతపాలు, యాగాలు, హోమాలు చేయడం, తద్వారా ఇంద్రియ నిగ్రహం, పరస్త్రీ విముఖత్వం సాధించడం ప్రవరుని సంపద(అర్థాలు)లని చెప్పవచ్చు. ఉపాయం, సాహసంతో ధర్మబద్ధంగా అర్థాన్ని సంపాదించాలి. అధర్మ బద్ధంగా సంపాదించిన అర్థం నిరర్థకం అవుతుంది. దాని వల్ల ప్రశాంతత లోపిస్తుంది.

ప్రవరుడు - కామం :

కామం గొప్ప పురుషార్థం. గృహస్థాశ్రమంలో మంచి సంతానాన్ని జాతికి అందించడానికి, భార్యాభర్తల మధ్య ఉన్న సంతోషాన్ని, తృప్తిని తెలియజేసే ప్రక్రియ కామం. కామం అనే దానికి రెండర్థాలు. మొదటిది అన్నిటిమీద కావాలనే కోరిక. రెండవ అర్థం స్త్రీ పురుషుల మధ్య

ఉండే శరీరక, మానసిక సంబంధం. కనుక, కామం అంటే కేవలం స్త్రీ పురుష శరీర సుఖమనే కాదు. "కామి కాక - మోక్షకామికాడు". కామం, తీరాకే మోక్షం. ధర్మార్థ కామ మోక్షాలు కర్మతోనే ప్రారంభం. కోరిక లేక కర్మ లేదు. కర్మకి కారణం కోరికే. ఒకటి తీరకుండానే మరొకటి మనసులోనో, మతిలోనో ఉంటుంది. కామం అగ్ని వంటిది. అది ఎన్నటికీ చల్లారదు. జ్ఞానులకు అది నిత్య వైరి. కామం మనుష్యులను జ్ఞానం వైపు వెళ్ళనీయదు. ఇంద్రియములు, మనసు, బుద్ధి ఈ కామమునకు నివాసస్థానములు. కామం మనుష్యులను మోహితులుగా చేస్తుంది. ధర్మానికి విరుద్ధం కాని కామమే తృతీయ పురుషార్థం.

'మాతృవత్పరదారాంశ్చ పరద్రవ్యాణి లోష్టవత్' పర స్త్రీలను మాతృమూర్తిగా పరద్రవ్యాన్ని మట్టివలె చూడాలని చెబుతుంది నీతిశాస్త్రం. ప్రవరుడు ఏకపత్నీ వ్రతుడు. మనో నిగ్రహం కలిగినవాడు. పరస్త్రీ పొందు మీసాలపై తేనె లాంటిదని భావించి వరూధినిని తిరస్కరించాడు. ప్రవరుడు తన ఇంట అతిథ్యం తీసుకున్న యాత్రికులు తాము చూచి వచ్చిన ప్రదేశాలలోని వింతలు విశేషాలు కంటికి కట్టినట్లుగా చెప్పడం వల్ల వాటిపై ఆసక్తి పెరిగింది. పుణ్యక్షేత్రాలను గూర్చి, నదీనదాలను గూర్చి, హిమాలయ సౌందర్యాలను గూర్చి వర్ణించిన విషయాలు అతని అంతరంగంలో జీర్ణించుకొని పోయాయి. ముఖ్యంగా హిమాలయ దర్శనాభిలాశ మరీ బలోపేతమైంది. ఎలాగైనా ఆ కోరిక తీర్చుకోవాలనే తపన అతనిలో అధికమైంది. బలీయమైన కోర్కె లక్ష్యంవైపు నడిపించింది. ప్రవరుడు సిద్ధునితో 'నెణకలు గట్టుకొన్న మఱి యేండ్లును బూండ్లును బట్టు'(మను. ప్ర.ఆ.73) మీరు వర్ణిస్తున్న ప్రదేశాలు చూడాలంటే పెక్కు సంవత్సరాలు పడతాయి. మీకిది ఎలా సాధ్యపడిందో దయచేసి సెలవీయండి' అంటాడు. అప్పుడు సిద్ధుడు ఇది పరమ రహస్యం అయినా నీకు చెపుతాను వినమని 'నా వద్ద పాదలేపన మనే దివ్యౌషధము ఒకటున్నది. దాని ప్రభావం వల్ల వాయు వేగంతో సూర్య చంద్రుల సంచారం ఎందాకా ఉంటుందో అందాకా వెళ్ళి రాగలుగుతాను" అంటాడు. ఆ మాట విన్న ప్రవరుడు "కౌతుక భర వ్యగ్రాంత రంగుడై", (మను. ప్ర.ఆ. 77) కుతూహలంతో నిండి తొందరపెడుతున్న మనస్సు గలవాడౌ ఆ లేపనాన్ని తన కనుగ్రహించమని సిద్ధుడిని అభ్యర్థించడం, దానికి సమ్మతించిన సిద్ధుడు ఆ లేపనాన్ని ప్రవరుని కాళ్ళకు పూసి తన దారిన తాను వెళ్ళి పోవడం జరిగింది. ప్రవరుడూ హిమాలయాలను దర్శించాలని సంకల్పించి హిమాలయాల వైపు వెళతాడు. ఈ విధంగా ప్రవరుని కోరికలు ధర్మబద్ధమైనవి.

ప్రవరుడు - మోక్షం :

పునర్జన్మ రాహిత్యము లేక సంసారచక్రము నుండి విడుదల మోక్షం. జన్మబంధాలనుండి జీవి విడుదల కావడానికి అత్యవసరం. మోక్షమనేది మరణానంతర ఆధ్యాత్మిక భావన కాదు. ప్రాణంతో ఉన్నపుడే తన స్వరూపాన్ని తెలుసుకొని, స్వస్వరూపాను సంధానమవడమే మోక్షం. మోక్షమంటే ముక్తి అనీ, కైవల్యమని అనుకోవచ్చు. కానీ బాధ్యతల భారం నుండి ఎప్పటి కప్పుడు విడుదల పొందుతూ, కోరికల నుండి, ఉపశమనం పొందడాన్నే మోక్షం అని చెప్పవచ్చు. అనేక బంధనాల్లో చిక్కుకున్న జీవుల విముక్తికి ఎవరికి వారే మార్గం వెతుక్కోవాలి. ఆ అన్వేషణకై వ్యక్తి భగవత్తత్వంపై శ్రద్ధతో ప్రయత్నిస్తే ఫలితం హస్తగతం అవుతుంది. పురుషార్థాల్లో ప్రధానాంశం ధర్మం. అర్థ కామాలు ధర్మబద్ధమైనప్పుడే మోక్షమార్గం సులభమౌతుంది.

ధర్మార్థకామాలను సమన్వయిస్తూ మోక్షాన్ని సాధించాలి. మోక్షమంటే మనసును త్యాగం చేయడమే. జీవించి ఉన్నప్పుడే సాధించాల్సినది. మనిషి ముందు జీవన్ముక్తుడు కావాలి. భార్యాభర్తలు తమ బంధనాల నుండి దూరం కావాలి. సంబంధాలను దూరం చేసుకోవాలి. యతి సూక్తంలో ఈ విధంగా చెప్పబడింది. "న కర్మణా నప్రజయా ధనే నత్యాగేనైవ అమృతత్వమానసు"

అనగా కర్తవ్యాలను వదిలి పెట్టాలి. సంతానాన్ని, చూట్టూ వున్న పరివారాన్ని త్యజించాలి. ధనం సంపాదించాలనే ఆలోచన వదులుకోవాలి. ఆత్మ ప్రశాంతతో జీవించాలి.

మనస్సులో కోరికల తీవ్రత యొక్క పరాకాష్టయే వరూధిని ప్రవరుని కౌగిలించుకోవడం. అక్కడే ప్రవరునికి జ్ఞానోదయమైంది. తల్లిదండ్రుల బోధలు, గురువులు అనుగ్రహించిన విజ్ఞానం, సమాజం అందించిన సంస్కారం, మానవ విలువల పట్ల తానేర్పరచుకున్న అవగాహన, ధార్మిక చింతన అతనికి కర్తవ్యాన్ని ఉపదేశించాయి. దానితో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. భగవంతుడిని తలచాడు. ఆమెను నెట్టివేశాడు. అంటే మోహాన్నీ భ్రమలనూ మనసు లోతులలో నుండి నెట్టి వేసుకున్నాడు. తనలోని మాలిన్యాన్ని కడిగి వేసుకున్నాడు. 'యజ్ఞ కోటులం బావనులౌటకున్ ఫలము మా కవుగిళ్ళ సుఖించుటే కదా'(మను. ద్వి. ఆ. 54) మీరు చేసే యజ్ఞయాగాదికాల ఫలితం స్వర్గంలో మా కౌగిళ్ళలో సుఖించడమే కదా అని వరూధిని అంటుంది. 'ఆ సుఖమేదో నేనిక్కడే ఇస్తారమ్మ'ని ప్రలోభ పెడుతుంది. అతడు సమ్మతింపడు. ఆమె దూషిస్తుంది. చివరగా మోహాన్ని దాచుకోలేక అతడిని కౌగిలిస్తుంది. అది భరించలేని ప్రవరుడు "హా శ్రీహరీ" అంటూ ముఖాన్ని తిప్పుకొని వరూధినిని త్రోసివేసి, అగ్నినారాధించి తన గృహానికి చేరుకుంటాడు. అంతటి నిగ్రహం కలిగిన వాడు కాబట్టే అగ్నిదేవుడు ప్రవరునికి సహాయం చేసాడు.

ధర్మార్థ కామ మోక్షంగా ప్రతి మనిషి తన గృహస్థ జీవితాన్ని నిర్వహించుకుంటూ వుంటేనే సమాజ వ్యవస్థ సురక్షితంగా వుంటుంది. ధర్మాన్ని రక్షించు, ఆ ధర్మం నిన్ను రక్షిస్తుందని సూక్తిని మనసున నిలుపుకుని జీవనయానాన్ని సాగించాలి. ఆ ధర్మమే, సత్యమే మానవుని భగవంతునికి దగ్గరగా చేరుస్తుంది. వివాహ సమయంలో కన్యాదాత వరునిచే ధర్మార్థకామాన్ని వదిలి చరించనని ప్రతిజ్ఞ చేయిస్తాడు. గృహస్థాశ్రమంలో భార్యాభర్తలు దేవతారాధన చేసే సందర్భంలో చతుర్విధ పురుషార్థ ఫల సిద్ధర్థ్యం అని సంకల్పం చేసుకుంటారు. 'ధనం మూల మిధమ్ జగత్', 'సుఖస్య మూలం ధర్మం', 'ధర్మస్య మూలం అర్థం', 'అర్థస్య మూలం రాజ్యం'. మనిషి సుఖంగా జీవించడానికి కారణం అతని ధర్మాచరణే. దానధర్మాలు చేయడానికి మూలం అర్థం. అర్థానికి కారణం సమిష్టి కృషి. అర్థానికి మూలం కుటుంబ సభ్యులు కలిసి సమన్వయంతో కృషి చేయడం. ఈ నాలుగు పురుషార్థాల మధ్య సమన్వయం లేకపోతే, అప్పుడు జీవితం మొత్తం గందరగోళంగా ఉంటుంది. కావున మానవునికి ధర్మార్థకామమోక్షాలు అత్యంతావశ్యకమైనవి.



మహాభారత మహేతిహాసంలో చతుర్విధ పురుషార్థాలు

– టేకుమళ్ళ వెంకటప్పయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ప్రెసిడెన్సీ కాలేజి, చెన్నై, తమిళనాడు.

సృష్టిలో ప్రతి వస్తువులోనూ పరమాత్మను దర్శించాలంటే, ప్రతి మనిషి నాలుగు పురుషార్థాల సాధనకు కట్టుబడి ఉండాలి. అవే ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. భగవంతుడనే దర్శకుడు అందరికీ తలో పాత్ర ఇచ్చి కొద్దిసేపు ఈ ప్రపంచ నాటకరంగస్థలం మీద నటించండని పంపితే మనందరం పరిమితిని మరిచిపోయి నటిస్తూ, తద్వారా వచ్చే ఆపదలను ఎలా పరిష్కరించుకోవాలో, ఎలా గట్టెక్కాలో తెలియక సకల చికాకులకు లోనవుతున్నాం. అయితే నిర్మలంగా, నిరహంకారంగా మన బాధ్యతలు మనం నిర్వర్తిస్తే పరిస్థితి అలా ఉండదు. ఆవిషయాన్నే మన పురాణేతిహాసాలు ఉద్ఘాటిస్తున్నాయి. మహాభారతంలో చెప్పబడ్డ చతుర్విధ పురుషార్థ సాధన ఏమిటో తెలుసుకోబోయే ముందు కొన్ని ప్రాథమిక విషయాలను పరిశీలిద్దాం.

పురుషార్థాలన్న పదం మనం శాస్త్రాల్లో చదువుతూ ఉంటాం. ఆ విషయాన్ని సరిగ్గా సరైన రీతిలో అర్థం చేసుకోవలసిన అగత్యం ఉంది. పురుషార్థాలంటే మనుష్య లక్ష్యాలు. పురుషార్థాలంటే కేవలం పురుషులకు మాత్రమే నిర్దేశించబడినవని కాదు. పురుషులకు, స్త్రీలకు ఇద్దరికీ లక్ష్యాలు. "అర్థయతే సర్వై: మనుష్యై: ప్రార్థ్యతే ఇతి అర్థ:" దేన్నైతే మానవాళి కోరుకుంటుందో అది అర్థ:. మనిషికి రకరకాల లక్ష్యాలుంటాయి. కాబట్టి ఏ మానవ లక్ష్యమైనా అర్థ: అనే అనవలసి ఉంటుంది.

ఈ నాలుగుపదాలను కొంచెం స్థూలంగా పరిశీలిద్దాం.

1. ధర్మం :

ధర్మం విశ్వం ఇతి ధర్మ: అనగా విశ్వాన్ని ధరించేది, సంరక్షించేది ధర్మం. "యతోభ్యుదయని శ్రేయస సిద్ధి: స ధర్మ:" అనగా ఇహలోకంలో అభ్యుదయాన్ని పర లోకంలో శ్రేయస్సును కలిగించేది ధర్మం. మానవాళి మనుగడకే ధర్మం ఆధారం. "యతోధర్మస్తతో జయ:" అంటే ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ విజయం ఉంటుంది. ఈ విషయాన్నే మహాభారతం ప్రభోదించింది.

2. అర్థం :

ధనమూలమిదం జగత్. అర్థానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నది అయితే "అర్థవంతుడు న్యాయము తప్పక మరియే ఉపాయము చేతనైననూ ద్రవ్యము సంపాదించవచ్చును" అనే నానుడి ఉన్నది. కనుక మహాభారత గాథలో అన్యాయంగా, అధర్మంగా, అక్రమంగా అవినీతి పద్ధతుల ద్వారా సంపాదించినదేదీ నిలవదని వ్యాసుడు నిరూపిస్తాడు.

3. కామం :

కామం అంటే కోరిక అని అర్థం. అయితే మన్మధ భావం అనే అర్థంలోనే ఈ పదం రూఢికెక్కడం గమనార్హం. అయితే ఈ కామసుఖం కూడా ధర్మబద్ధమయిందయి ఉండాలి. కనుక ధర్మాన్ని అనుసరించే కామాన్నే కోరుకోవాలి అలా కానట్లైతే వినాశనం తప్పదని చెప్తోంది మహాభారతం.

4. మోక్షం :

మోక్షమంటే విడుదల. బంధాలనుండి విడుదల కావడం. మానవ జన్మనెత్తడం. సుఖదు:ఖాలకు లోను కావడం. పాపకార్యాలు చేయడం మళ్ళీ మళ్ళీ జన్మ లెత్తుతూ మోక్షానికి దూరం చేసుకోవడం సహజం. ధర్మ రాజు యజ్ఞ యాగాదులద్వారా, ఉత్తమ సాధనల ద్వారా ఈ స్థితిని తప్పించుకుని మోక్షాన్ని చేరడం స్వర్గారోహణ పర్వంలో మనం చూడవచ్చు.

మహాభారతం మన జాతీయ గ్రంధం. ఈ ఇతిహాసంలో వ్యాసమహర్షి ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే చతుర్విధ పురుషార్థాలను సాధించడానికి అవసర

మయ్యే విజ్ఞానం మొత్తం చక్కగా పొందుపరచాడు. వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తుల సారం ఇందులో సముచితంగా చోటు చేసుకున్నందువలననే ఈ గ్రంధం "పంచమ వేదం"గా భాసిల్లుతోంది. సూతుడు భారత కధ శౌనకాది మునులకు వివరించి "ధర్మే చార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ! యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్" అంటాడు. అంటే "ధర్మార్థ కామమోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశం ఏదైనా మరొకచోట ఉండవచ్చు, కానీ లేని అంశం మరెక్కడా ఉండ"దని ఘంటాపధంగా చెప్పబడింది. అది నూటికి నూరుపాళ్ళు నిజం. భగవద్గీత మహాభారత ఆత్మ, పాండవ చరిత్ర శరీరం, చతుర్విధ పురుషార్ధ విజ్ఞానం జీవితం, ఇతిహాసాలు, ఉపాఖ్యానాలు జవసత్వాలు. మానవ ధార్మిక జీవన ప్రవ ృత్తికి మహాభారతం ప్రాణా ధారం.

మహాభారతంలో ఆది సభారణ్య పర్వాల్లో ధర్మం, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, సౌప్తిక, స్త్రీ పర్వాలలో అర్ధం, శాంతి పర్వంలో కామ, మోక్షాలనే రెండు పురుషార్ధాలు వాటికి సంబంధించిన అనేక ధర్మాలు కామ పురుషార్ధానికి అంగాలుగా చెప్పబడ్డాయి. అనుశాసన, అశ్వమేధ, ఆశ్రమ, మౌసల, మహాప్రస్థాన పర్వాలలో చతుర్విధ పురుషార్ధ సాధనాలైన తీర్ధ, క్షేత్ర సందర్శనాలు, దానధర్మాది అంశాలు వివరించబడ్డాయి. శాంతిపర్వంలో శోకతరుణోపాయం అనే పేరుతో మోక్షం అనే పురుషార్ధం విపులంగా చర్చించబడింది.

"నజాతు కామాన్న భయాన్నలో భా/ ద్ధర్మం జహ్యా జ్జీవితస్యాపి హేతో:/ ధర్మో నిత్య స్సుఖదు:ఖే త్వనిత్యే/ జీవో నిత్యో హేతురస్య త్వనిత్య:" అని స్వర్గారోహణ పర్వంలో చెప్పబడింది. కోరికవల్లగాని, భయం వల్లకాని, లోభంవల్లకాని, చివరకు ప్రాణోపాయ సమయంలో కూడా ధర్మాన్ని విడిచి పెట్టకూడదు. ధర్మం నిత్యం. సుఖదు:ఖాలు అనిత్యాలు. కాబట్టి జీవుడు నిత్యం తత్కారణం అనిత్యం అని గ్రహించి ధర్మాన్ని అనుసరించి తీరాల్సిందేనని నొక్కి చెప్తాడు. అందుకే ధర్మరాజు చేత "ధర్మో రక్షతి రక్షిత:" అని చెప్పించాడు.

మహాభారత గ్రంధమంతా ధర్మంగా నడిచిందా? కేవలం కౌరవులు మాత్రమే అధర్మాన్ని అనుసరించారా? పాండవులు అసలు ధర్మమే తప్పలేదా అనే ప్రశ్నలు కొన్ని మనల్ని సదా వేధిస్తూ ఉంటాయి. ధర్మం, న్యాయం అనేవి అన్ని కాలాలలోను ఒకే విధంగా ఉండవు. కాలాన్ని బట్టి మారుతూ ఉంటాయి. సత్యధర్మాలకు వ్యతిరిక్త మయినదంతా అధర్మమే! అని మనం అనుకుంటే జరా సంధవధ, భీష్మవధ, ద్రోణవధ, కర్ణవధ, దుర్యోధనుని ఊరుభంగం మొదలైనవి అధర్మాలని మనలను భాదించినా వాటి విషయంలో మనం కృష్ణపరమాత్మ దృష్టి కోణంలో మాత్రమే అలోచించవలసి ఉంది. వారి వారి అవతార సమాప్తి చేయడం, అధర్మాన్ని అధర్మంతోనే జయించడం వంటి యుగధర్మాలను మనం నిశితంగా ఆలోచించవలసి ఉంది.

మహాభారతం చదివాక మనకు కలిగే జ్ఞానాన్ని చెప్పుకోవడం ఈ సందర్భంగా సముచితమని భావిస్తున్నాను. జీవితంలో గెలవడానికి జాలి, దయ, మంచితనం మాత్రమే ఉంటే చాలదని, పరిస్థితులు, సమయాన్ని బట్టి నడుచుకోవాలనేది కర్ణుని పాత్ర మనకు తెలియజేస్తుంది. చెడు స్నేహం ఊహలకి అందని జీవితం నాశనం చేస్తుందని శకుని ద్వారా తెలుస్తుంది. కౌరవుల నాశనానికి పరోక్షంగా బీజాలు వేసింది కూడా శకునే! బేధాలు చూడని నిజమైన స్నేహం జీవితంలో ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందనడానికి కృష్ణుడు, కర్ణుడు పాత్రలు గొప్ప ఉదాహరణలు. కురుక్షేత్రంలో పాండవుల పక్షాన శ్రీకృష్ణుడు, కౌరవుల పక్షాన కర్ణుడు నిలిచి ఏస్థాయిలో ఉపయోగపడ్డారో తెలిసిందే. దుర్యోధనుడి కోపం, అధికమైన రాజ్యకాంక్ష కారణంగా కౌరవులు నాశనం అయ్యారన్న విషయం విదితమౌతుంది. అరణ్యవాసం, అజ్ఞాతవాసం సమయంలో పాండవులకు గతంలో నేర్చుకున్న ఇంటి, వంట

పనుల వల్ల అత్యంత క్లిష్ట సమయంలో ఉపయోగ పడ్డాయి. అలాగే మనకి సంబంధించిన దాని కోసం ఎంత కష్టమైనా విడువకుండా పోరాడాలని పాండవుల ధృఢవైఖరి తెలియజేస్తోంది. కౌరవులతో పోల్చుకుంటే పాండవుల సైన్యం చాలా తక్కువ. అయినా కానీ, పాండవులు ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధితో పోరాటం చేసి విజేతలుగా నిలిచారు. పిల్లల పట్ల అతి ప్రేమ నష్టం కలిగిస్తుందనడానికి ధ్రుతరాష్ట్రుడే ఉదాహరణ. విద్యను జీవితాంతం నేర్చుకోవడమే ఉత్తమ లక్షణం అనడానికి అర్జునుడే ఉదాహరణ. నిత్యం నేర్చుకోవడం వలన ఖచ్చితంగా విజయం వరిస్తుంది. కొన్నిసార్లు శత్రువులు కూడా మిత్రుల రూపంలో ఎదురవుతారనేది విషయం తెలియజేయడానికి విదుర, ద్రోణ, భీష్మ పాత్రలే నిదర్శనం. మహిళలను ఆపదలనుంచి కాపాడాలని, అలా కాకపోతే అనర్థాలకు దారితీస్తుందనేది ద్రౌపది వస్త్రాపహరణమే ఉదాహరణ. మిడిమిడి జ్ఞానం అత్యంత ప్రమాదకరమన్న విషయం పద్మవ్యూహంలోనికి వెళ్లడమే కానీ కానీ బయటపడటం తెలియక తనకున్న అర్ధ జ్ఞానంతో అభిమన్యుడు లాంటి మహావీరుడే నేల కొరగడంతో అర్ధమవుతుంది. స్త్రీని అవమానించరాదనే సత్యం భారతంలోని ప్రధాన అంశం. కేవలం ద్రౌపదికి జరిగిన అవమానంవల్ల పెంచుకున్న కోపం చివరికి వారిని, సామ్రాజ్యాన్ని నామ రూపాలు లేకుండా చేసిందన్న సత్యం విశదం చేస్తాడు సాత్యవతేయుడు.

"అర్థకామాలు కాదు జీవిత పరమార్థం ధర్మం అని ఒకటుంది దాన్ని సాధించడానికి ప్రయత్నిస్తే అర్థకామాలు వాటంతటవే సిద్ధిస్తాయి. నా మాట వినండి. భౌతికమైన అర్థకామాల కేసి పరుగులు తీస్తే కౌరవులకు పట్టినగతే పడుతుంది ఎవరికైనా" అని ఘోషిస్తూ వ్యాసభగవానుడు మహాభారతేతిహాసాన్ని లోకానికి ప్రసాదించాడన్న విషాయాన్ని గమనించాలి.

"ఊర్ధ్వ బాహోర్విరౌమ్యేష న కశ్చిదపి శృణోతిమే/ ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే (సంస్కృత భారతం స్వర్గా 575) ధర్మం వల్లనే అర్థకామాలు సిద్ధిస్తున్నాయే, ఆ ధర్మాన్ని మాత్రమే మానవాళి సేవించండని చేతులెత్తి ఆక్రోశిస్తున్నా నా మాట ఎవరూ పట్టించుకోరేం? అని ప్రశ్నిస్తూ మహాభారతగాథ కేవలం ఒక చరిత్రగా కాక చతుర్విధపురుషార్థ సర్వస్వంగా ముగించాడు వ్యాసభగవానుడు.

మహాభారతంలో ఒక పద్యం చెప్పి ముగిస్తాను.

"ఒరులేయవి యొనరించిన
నరవరయప్రియము తన మనంబునకగుదా
నొరులకునవి సేయకునికి
పరాయణము పరమధర్మపథములకెల్లన్"

యితరులు ఏమి చేస్తే నీకు అప్రియం అనిపిస్తుందో అదే పని నీవు ఇతరుల విషయంలో చేయకూడదు అన్న గొప్ప సూక్తి అందరం పాటించదగ్గదన్న ఆశాభావంతో స్వస్తి.

❖ ❖ ❖

ఆంధ్ర మహాభాగవతం – చతుర్విధ పురుషార్థాలు

– పున్న ధనలక్ష్మి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాల, నాంపల్లి, హైదరాబాదు.

మానవుని సాధారణ జీవితం ఒక సరళరేఖలాంటిది. దాని ఆద్యంతాలు అర్థం, కామం. అంతకు మించి అది ముందుకు ఎదగడం లేదు. కాని, ఈ అర్థం, కామం అనే వాటిని ఒకే స్థానంలో కలిపేది ధర్మం. అపుడు అర్థ, కామాలు అనగా సంపాదనా సుఖాలు ధర్మబద్ధమవు తాయి. అటువంటి ధర్మార్థ, కామాల మూడింటిని పరిపూర్ణంగా తెలుసుకున్నవారే మోక్షం పొందుతారు. సమాజం ఒక చైతన్య స్రవంతి. అది నిన్న, నేడు, రేపు ఉండింది, ఉంది, ఉంటుంది. కానీ భాగవత రచనా కాలం నాటికి ఆనాటి సమాజం ఎట్లా వుండేదో మనకు తెలీదు. కానీ భాగవతంలో ప్రతిబింబించే సమాజం వర్త మాన కాలానికి ఎట్లా ఉపకరిస్తుందో చూడటం చాలా అవసరం.

వేదాంత పరిభాషలో ప్రతి జీవాత్మను "పురుషుడు" అనీ, విశేష లోకాలతో కూడిన శక్తిక్షేత్రాన్ని "ప్రకృతి" అనీ అంటున్నాం. ఈవిధంగా పురుషుడు "ఆత్మక్షేత్రం"గా మరి ప్రకృతి "శక్తిక్షేత్రం"గా ఒక మహామూల చైతన్యం నుంచి బయటకు వచ్చి రెండు విధాలుగా విభజించబడింది. అలాగే మూల చైతన్యం నుంచి ఒక ఆత్మక్షేత్రంగా విడివడి బయటికి వచ్చి అనేక అంశాత్మలుగా విడివడి ఖనిజ లోకంలో ఉన్నపుడు ఖనిజాత్మగా, వృక్షలోకంలో వృక్షా త్మకగా, జంతులోకంలో ఉన్నపుడు "జంతు ఆత్మగా", మానవలోకంలో ఉన్నపుడు "మానవాత్మ"గా, దైవ లోకంలో ఉన్నపుడు "దైవాత్మ"గా, ప్రకృతి లోకంలో ఉన్నపుడు "ప్రకృతి ఆత్మ"గా ఈ విధంగా రకరకాలుగా జీవాత్మలు తయారవుతాయి.

ఈ విధంగా ప్రకృతి క్షేత్రాన్ని "ప్రకృతి" అన్నట్లుగా మొత్తం ఆత్మక్షేత్రాన్ని "పురుషుడు" అంటారు.

ఆత్మ పరిణామంలో భాగంగా మానవలోకంలోకి ప్రవేశించిన "పురుష ఆత్మకు" నాలుగు విధాలైన ధర్మాలుంటాయి. వాటినే

1. ధర్మ
2. అర్థ
3. కామ
4. మోక్షాలనే "చతుర్విధ పురుషార్థాలు" అంటారు.

ఈ విధంగా చతుర్విధ పురుషార్థాలు

"కామం + అర్థం = ధర్మం + మోక్షం" అనీ వీని గురించి క్రింద వివరించాను.

"యథా గుణః తథా కర్మ
యథా అంతరంగః తథా బహిరంగః"

అనగా నీ లోపల ఏముందో అదే బయటికి వస్తుంది మరి నీవు చేస్తున్న కర్మలు నీ గుణాలను బట్టే ఉంటాయి. అని అర్థం. సృష్టి క్రమంలో గుణాలు ఎల్లప్పుడు మారు తూనే ఉంటాయి. ఈ విధంగా మారుతున్న గుణాలను బట్టి మారే కర్మలను "చతుర్వర్ణాలు" అంటారు. అలాగే ఆ "మూలచైతన్యం" నుంచి ఒకానొక పురుషక్షేత్రం, ఒకానొక ప్రకృతి క్షేత్రం వచ్చి ఒకదానితో ఒకటి లీనం అయి పుంఖాను పుంఖాలుగా లోకాలు ఏర్పడి, రకరకాల గుణాల కారణంగా రకరకాల జీవాత్మలు పుట్టుకొచ్చాయి. "వీటన్నింటికీ నేను అవ్యయుడిలా, అకర్తగా మరి సాక్షి లాగా మాత్రమే ఉన్నాను సుమా! అని నాలో నుంచి వచ్చినా కూడా, నేను మాత్రం వ్యయం కాలేదు.. "అవ్యయం"గానూ మరి "అకర్త"గానూ మాత్రమే ఉన్నాను అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునితో అంటారు. అదేవిధంగా ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే వీటిలో ఏ ఒక్కటైనా చక్కగా తెలిసికొని సరైన మార్గంలో నడువలేనివాడు మనిషి జీవితంలో పనికిరాని వాడుగా మిగిలిపోతాడు.

ధర్మం :

ఒకానొక తల్లి బిడ్డను కన్నపుడు ఆ తల్లి తన శరీర భాగాన్ని కోసుకుని తను వ్యయం అయ్యి పిల్లలను పుట్టించిందా? లేదే?! తల్లి తల్లిగానే ఉండి తన స్వంత ఇచ్ఛానుసారం బిడ్డను పుట్టించిందంతే! ఆ పిల్లలు కూడా తమ స్వంత ఇష్టానుసారమే ఆ తల్లికి బిడ్డలుగా జన్మించారు. ఇక్కడ ఎవరికి ఎవరు కర్తలు కారు. ఇక్కడ ఎవ్వరూ వ్యయం కాబడలేదు. కనుక అలాంటి మూల సూత్రాల సారాన్నంతా అవగహన చేసుకున్న యోగీశ్వరులంతా ధ్యానంలో కూర్చుని కళ్ళు మూసుకుని "తమ ద్వి నేత్రాలతో కోటానుకోట్ల లోకాలనూ, పుంఖానుపుంఖాలుగా జన్మలు తీసుకుంటున్న జీవులనూ చూసి విస్మయంతో ఆ సృష్టి యొక్క రచనను తిలకిస్తూ ఉంటారు.

నారదుడు గత జన్మలో దాసీపుత్రుడు. అడవిలో వచ్చి పోయేవాళ్ళకు నీళ్ళు ఇస్తూ, యోగులకు సపర్యలు చేస్తుండేవాడు. ఆ వేదవేత్తలు భుజించగా మిగిలిన అన్నాన్ని తినేవాడు వారి ఆజ్ఞలు నెరవేరుస్తూ చివరకు జ్ఞానోదయం పొందాడు. గుణవంతుణ్ణి చూసి సంతోషించడం, గుణహీనుణ్ణి కరుణించడం అనే మహత్తర ధర్మం నేర్చుకున్నాడు.

అర్థం :

కాసులు కలిగినవారు రాజు కావచ్చు. మంచి మేడలలో జీవించవచ్చు. భోగభాగ్యాలను పొందవచ్చు. అర్థం లేని బ్రతుకు వ్యర్థమే కదా! అంటే ఎందుకూ పనికి రానిది అర్థం. ధనం మనిషి జీవితంలో ఎక్కువయ్యే కొద్దీ మదాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా ఆత్మ తృప్తిని పొందలేక మదం మత్తులో ఆనందానికి తమ దగ్గర గల ధనమే కాక చివరకు శరీరాన్ని కూడా దహింప చేస్తుంది.

బలిచక్రవర్తి - సిరిమూట గట్టుకొని ఎవ్వడు పోడని, అతిథుల్ని సాక్షాత్తు భగవత్స్వరూపులుగా సంభావించి వారి కోర్కెలు తీర్చడంలో గల ఆనందం అనుభవించాడు.

కామం :

పురుషాత్మ మొదట తామసప్రవృత్తితో కూడిన శూద్రవర్ణంలో జన్మించినపుడు "అహం దేహోస్మి" అంటూ "నేను దేహమే" మరేమీ కాదు అనుకుంటూ ఉంటాడు. వాళ్ళకు కామం కావాలి. ఇంకా బాగా తినాలి. బాగా పడుకోవాలి అనుకుంటూ భౌతికపరమైన సౌఖాలకోసమే జన్మంతా వినియోగిస్తారు. ఇది ఆత్మ యొక్క "శైశవస్థితి". ఇలాంటి స్థితి నుంచి నేనొక దేహమే కాదు నా కంటూ మనస్సు ఉంది. ఒక ఆత్మ కూడా ఉంది అని ఏది మంచి ఏది చెడు అనే అనుభవాలు గడిస్తూ, మెల్లిగా "బుద్ధిని" ఉపయోగించి మంచి, చెడుల ధర్మ నిర్ధారణ చేసుకుంటూ, మెల్లమెల్లగా దేహం + మనస్సు + బుద్ధి కలిసి పనిచేసే స్థాయిలోని క్షత్రియ వర్ణంలో జన్మ తీసుకుంటుంది. దీనినే "యౌవనాత్మస్థాయి" అంటారు. అంటే 100% కామ ప్రవృత్తిలోనే ఉంటూ "అహం కామోస్మి" అన్న స్థితి నుంచి క్రమంగా "అహం కామోస్మి ... అర్థోస్మి" 50% + 50% చొప్పున ఉంటూ అనుభవాలు గడిస్తూ క్రమంగా "అహం కామోస్మి + అర్థోస్మి + ధర్మోస్మి" అంటూ 25%.... 25%.... 50% చొప్పున ఉంటూ అనుభవాలు గడిస్తూ క్రమంగా "అహం కామోస్మి ..... అర్థోస్మి + ధర్మోస్మి + మోక్షోస్మి" అంటూ చివరికి అన్ని గుణాలకు అతీతంగా 100% మోక్షస్థితిలో ఉండి నిర్గుణుడిగా మారుతుంది.

కొందరు "కామం అసలే ఉండకూడదు" అంటారు. ప్రతి ఒక్క వ్యక్తికీ మాట్లాడే హక్కు ఉంది! అయితే మాట్లాడే మాటలో పట్టు ఉండాలి. తెలియని వాళ్ళూ మాట్లాడతారు. కొద్దిగా తెలిసినవాళ్ళూ మాట్లాడతారు. సంపూర్ణంగా తెలిసిన వాళ్ళూ మాట్లాడతారు. అయితే కొందరు మాట్లాడితే సరిగా ఉంటుంది వినడానికి హాయిగా ఉంటుంది. అదే విధంగా ఏమీ తెలియని వాడు లేదా తెలిసీ తెలియని వాడు మాట్లాడితే అది వ్యక్తిగతంగానే ఉంటుంది. కానీ స్పష్టంగా ఉండదు.

మోక్షం :

ఆకలిగొన్న లేగదూడ అమ్మ పాలకై అలమటించినట్లు. తల్లి ఒడిలోని పసికూన పాలిండ్లను తడుముటలో పొందు అనిర్వచనీయమైన అనుభూతిలాగ, యువతి మనోహరుని పరిష్వంగ సుఖానికై ఆరాటపడు విధంగా, భక్తుని అంత రాత్మ ఆఖండజ్యోతి దర్శనానికి, తద్వారా లభించే చిన్మయానందానికీ పలవరిస్తుంది.

మనిషి ''మోక్షం కావాలంటే కామానికి, అర్థానికి, ధర్మానికి దూరంగా సంసారాన్ని వదిలిపెట్టి ఏ హిమాలయానికో వెళ్ళాలి అని చెప్పేవాళ్ళంతా ఏమీ తెలియని వాళ్ళే. ఈ నాటి మానవులకు బాధ్యతలు సరిగా లేక పెరిగే విధానంలో తేడాలున్నప్పటికీ తాను మృగంలా మారుతున్నాడు. అలా మారడానికి మనిషి పుట్టుక కావచ్చు. పెరిగిన వాతావరణం కావచ్చు. వయసులో వచ్చే మార్పులు కావచ్చు. మనం సమాజాన్ని చూస్తున్న విధానంలో తేడా ఉండవచ్చు. కానీ మనిషి ఇవన్నీ తన విధిలోని భాగాలు మాత్రమే. ఇవన్నీ నేను నా స్వానుభవంతో తెలుసుకున్నాను. ఏ పుస్తకాల్లోనూ లేవు. నా జీవిత సత్యాలను నేను ప్రకటించడం నా ధర్మం. నా ధర్మాన్ని నేను పాటిస్తున్నాను. మీరు దీనిని స్వీకరించాలా లేదా అన్నది మీ ఇష్టం, మీ ధర్మం.

ఈ విధంగా కామాన్ని, అర్థాన్ని, ధర్మాన్ని మరి మోక్షాన్ని గురించి నేను తెలుసుకున్న సత్యాలన్నీ, నా ముందు ఒక్కరు కూర్చున్న వాళ్ళకు మరియు లక్షల మంది కూర్చున్నా నేను చెప్పే సత్యంలో మార్పు ఉండదు. నా ధర్మాచరణలో మార్పు ఉండదు.

శ్రీకృష్ణుడి జీవితాన్ని తీసుకున్నట్లయితే కృష్ణుడు తన కామాన్ని తను చూసుకున్నాడు. సంతోషంగా అష్ట భార్యలతో జీవించాడు. తన అర్థాన్ని తను పాటించాడు. చక్కగా రాజై రాజ్యాన్ని పాలించాడు. ఎన్నో సంపదలను కూడగట్టుకున్నాడు. తన ధర్మాన్ని తాను పాటించాడు. చెప్పవలసిన వాళ్ళకు చెప్పాల్సినవన్నీ చెప్పి జగద్గురువయ్యాడు. మరి పుట్టినప్పటి నుంచీ ఎల్లప్పుడూ మోక్ష స్థితిలో ఉన్నాడు. భగవంతుడయ్యాడు.

కనుక ఇలా చతుర్విధ పురుషార్థాలను సమంగా ఆచరించే వాడినే '' పురుషోత్తముడు'' అంటాం.

ఈ విధంగా మానవుడు అన్ని దశల్లోనూ ధర్మం ఆచరించాలి. భాగవతం ప్రతీక పాత్రల ద్వారా ప్రత్యక్షంగా మనకు కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తుంది. ధర్మం ఆచరిస్తూ శరీర పోషణం పట్ల, ఆశ్వత జన పరిరక్షణకొరకు అర్థం సంపాదించాలి. ధర్మ బద్ధమైన అర్థార్జన మోహానికి తావీయదు. ఎప్పుడైనా వాటిని తేలికగా త్యజించే మన స్థితిని కలుగజేస్తుంది.

అంటే కామం నుంచి తమోగుణం, అర్థం నుంచి రజోగుణం, ధర్మం నుంచి సాత్విక గుణం మరి మోక్షం నుంచి శుద్ధ సాత్విక గుణం ఉద్భవించాయి. కనుక ఈ విధంగా మనిషి పరిపూర్ణంగా పరిణితి చెందాలంటే కామం, అర్థం, ధర్మం, మోక్షం నాలుగూ కావాలి.

❖❖❖

రామాయణ అయోధ్యకాండలోని ధర్మము

– డా॥. కపిల భారతి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, పింగళి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వరంగల్, తెలంగాణ.

రామాయణమును మలుపు తిప్పిన కాండ అయోధ్య కాండ వాల్మీకి రామాయణంలో అయోధ్యకాండ దాదాపుగా 170 సర్గలతో ఉంది. శ్రీరాముడిని "రామో విగ్రహ వాన్ ధర్మః" అని కీర్తించడానికి అలవాలమైన కాండ అయోధ్యకాండ. అయోధ్యకాండ మొత్తం "ధర్మం"ను గురించే వివరిస్తుంది. దశరథ మహారాజు పాటించిన ధర్మము, శ్రీరాముడు అనుసరించిన ధర్మము, శ్రీరాముడు కౌసల్యకు చెప్పిన ధర్మము, సీతమ్మ ఆచరించిన ధర్మము, గుహుడు ఆదరించిన ధర్మము, భరతుడు ధరించిన ధర్మము.. ఇలా ఏ పాత్ర చూసినా ధర్మమును ఆచరించిన విధమునకు ఆయువుపట్టుగా నిలిచిన కాండ అయోధ్యకాండ. ఇందు కథాగమనమును పరిశీలించినచో....

దశరథ మహారజు శ్రీరామునికి యౌవరాజ్య పట్టాభిషేకము చేసి రాజ్య భారమును అప్పగించదలిచినాడు. అనుకున్నదే తడవుగా ప్రజలను, సామంతులను, మంత్రులను సమావేశపరిచాడు. తన కోరికను తెలియజేశాడు. అంటే రాజు స్వతంత్రునిగా నిర్ణయం తీసుకోకుండా ప్రజల, సామంతుల, మంత్రుల అభిప్రాయం తెలుసుకున్నాడు. ఇది రాజ ధర్మము. అంతేకాడు సకల సులక్షణములు కలిగిన జ్యేష్ట కుమారుడికి సింహాసనం ఇవ్వడం కూడా రాజధర్మము ఇక్ష్వాకుల సంప్రదాయం కూడా.

దశరథుడు శ్రీరాముడిని పిలిచి రేపు నీకు యౌవరాజ్య పట్టాభిషేకం చేస్తాను అని చెప్పి మనుస్మృతిలో చెప్పబడిన పది వ్యసనములను వాటిన వలన వచ్చు అనర్థములను వివరించి అప్పటికి వెళ్ళిపొమ్మని తరువాత మళ్ళీ పిలిచి తనకు కనిపించే దుష్ట శకునములను తాను కైకేయ మహారాజుకు ఇచ్చిన మాటను (కైక కుమారునికి రాజ్యం ఇస్తానని) గురించి చెప్పి తన అంతరంగాన్ని బయట పెట్టాడు. ఇది పితృధర్మము. తండ్రి మందిరం నుండి రాముడు తల్లి కౌసల్య వద్దకు వచ్చి అమ్మా! రేపు యౌవ రాజ్య పట్టాభిషేకం అని తండ్రి గారు అన్నారు కనుక నీవు మాతో పాటించవలసిన నియమాలు పాటింపజేయ మని కోరగా (సీత కూడా ఆ సమయంలో అక్కడే ఉంది) తల్లి కౌసల్య సీతారాములకు తదనుగుణ ఆశీస్సు లను ఇచ్చి పంపివేసింది. శ్రీరాముడు సీతతో తన మందిరము చేరగా వశిష్టుడు వచ్చి వారు పాటించవలసిన నియమములను చెప్పి వెళ్ళిపోతాడు.

రాజుల అంతఃపురములలో జరిగే కుట్రలకు, కుతంత్రాలకు దశరథ మహారాజు అంతఃపురమేమి అతీతము కాదు. అది మనకు మంధర పాత్ర ద్వారా అవగతమౌతుంది. మంధర కైకను చేరి చేసి దుర్బోధ ఫలితమే కైక దశరథ మహారాజును వరాలు కోరడం - రాజు నిస్సహాయుడిగా నిలిచిపోవడం. దశరథుడు కైకకు వరములను ఇచ్చి తీర్చలేదు. దశరథుడిని సాక్షీభూతంగా పెట్టుకొని కైక యే తన వరాలను తానే తీర్చుకుంది. అందు మొదటి వరం రాముని వనవాసం నెరవేరింది. రెండవది నెరవేరలేదు. కారణం భరతునికి గల ధర్మబద్ధత. దశ రథుడు నిస్సహాయుడిగా నిలబడగా సత్యముతో కూడిన ధర్మబద్ధ వరములను నెరవేర్చుటకు శ్రీరాముడు అడవు లకు పయనమైనాడు.

"ధర్మహి పరమోలోకే ధర్మే సత్య ప్రతిష్ఠితమ్
ధర్మ సంశ్రితమే తచ్చ పితుర్వచనముత్తమమ్"

అంటే ధర్మములో సత్యము కూడా ఉంది. అందు వలన ధర్మమును వదిలితే సత్యమును కూడా వదిలి వేయాలి. సత్యముతో కూడిన ధర్మమును ఆచరించాలి కాని ఒక్క ధర్మమే లేదా ఒక్క సత్యమే పట్టుకోవడం

ప్రమాదకరం కాబట్టి దశరథుని మాటల్లో ధర్మ సత్యములు ఉన్నాయని లక్ష్మణుని హితబోధ చేస్తాడు రాముడు. ధర్మ అర్థ కామ మోక్షములలో ధర్మమే ప్రధాన మైనదని వివరిస్తాడు. అట్లే తల్లి కౌసల్యాదేవి శోకిస్తూ తానుకూడా అడవులకు వస్తానని అన్నప్పుడు తన తండ్రి పట్ల ఆమె బాధ్యతను గుర్తు చేస్తాడు. ఆయనను చూడ వలసిన అవసరం గురించి చెబుతాడు. తప్పని పరిస్థితు లలో తల్లి ఆశీస్సులు ఇచ్చి పంపగా సీత వద్దకు వస్తాడు రాముడు. సీతా! నేను తండ్రి గారి అనుజ్ఞ మేరకు అడవు లకు వెళ్ళుచున్నాను. నీవు ఇక్కడే ఉండి అత్తమామలకు సేవ చెయ్యి. మరుదులను బాగా చూసుకో అని చెప్పగా సీత నేను మీ వెంటే అడవులకు వస్తానని అంటుంది. కాదనలేకపోయాడు శ్రీరాముడు ఎందుకంటే ధర్మం గురించి కౌసల్యకు చెప్పిన విషయాలు సీతకు వర్తిస్తాయి కాబట్టి. మరి లక్ష్మణుడి భార్య ఊర్మిళతో తాను అడవులకు వెళ్ళుచున్నట్లు చెప్పిన అంశం గోచరించదు. పైగా సుమిత్రాదేవి లక్ష్మణుని ఆశీర్వదిస్తూ ''నీవు శ్రీరాముని యందు అమితమైన అనురాగముతో సంచరించడానికే పుట్టావు. కనుక శ్రీరాముడు వనవాసము నకు వెళ్ళుచున్నాడు నీవు కూడా వెళ్ళి అన్నకు వశవర్తివై ఉండుమని అలా ఉండడమే పరమధర్మమని, నీ కర్తవ్యమని చెప్పింది. లక్ష్మణుడు కూడా తన అన్ననే ఆచార్యునిగా చేనుకొన్నవాడు. అతనినే దైవముగా భావించినవాడు. చిన్నప్పటి నుండి కూడా రామ లక్ష్మణులు, భరత శత్రుఘ్నులు ఒకరికి ఒకరిగా పెరిగారు. కనుక లక్ష్మణుడు శ్రీరాముని అనుసరించుట ధర్మముగానే పరిగణించవలెను.

శ్రీరాముడు అడవులకు పయనమైనపుడు రాముడి వెంట అయోధ్యపుర వాసులు కొందరు బయలుదేరతారు. అలా వెళ్ళినవారు ఆనాటి రాత్రి అందరూ ఒకచోట నిద్రిస్తారు. మరుసటి తెల్లవారుజామున రాముడు, లక్ష్మణ సీతతో కూడి సుమతునితో సుమంత్రా! పైరులంరూ అలసి నిద్రించుచున్నారు. వీరు మేల్కొనే లోపు నీవు నన్ను కోసల రాజ్యం దాటించాలి ఎలాగైనా అని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు సుమంత్రుడు రథమును కొంతదూరం అయోధ్య వైపు తీసుకొని వెళ్ళి తిరిగి శృంగి భేరపురమే చేర్చుతాడు. శృంగి భేరి పురము నందు గుహుడు ఇచ్చిన ఆతిథ్యమును స్వీకరించి గుహుడితో మర్రిపాలు తెప్పించు కొని జఠాధారులైన రామలక్ష్మణులు గంగను దాటి ప్రయోగవైపు ఆ తరువాత భరద్వాజ ఆశ్రమం చేరు కుంటారు.

ఇక్కడ అయోధ్యలో శ్రీరాముడు అడవులకు వెళ్ళిన తరువాత సుమంతుడు తిరిగి వచ్చి రాముడు భరద్వాజ ఆశ్రమం చేరుకున్నారని చెప్పిన తరువాత దశరథుడు రాముడిని కలవరిస్తూ మరణిస్తాడు. దశరథుని మరణా నంతరం భరతుడు అయోధ్యకు వస్తాడు. వశిష్ఠుల వారి పిలుపునందుకొని అలా వచ్చిన భరతునికి అయోధ్య కళా విహీనంగా కనిపిస్తుంది. తల్లి కైక భరతునికి తన తండ్రి గురించి అడిగినప్పుడు శ్రీరాముని అడవులపయనం గురించి దశరథ మహారాజు మరణం గురించి చెబుతూ తాను అడిగిన వరాల ఫలితంగా భరతుడికి రాజ్యం ప్రాప్తిం చినదని కనుక నువ్వు తండ్రి అంత్యక్రియల అనంతరం పట్టాభిషేకం చేసుకో అని తెల్పుతుంది. అప్పుడు భరతుడు మనకు అసలైన ధర్మానికి ప్రతీకగా గోచరిస్తాడు. భరతుడు పలికిన పలుకులు ధర్మానికి ప్రతీకలు, శ్రీరాముడు ఎంత ధర్మపరుడో భరతుడు కూడా అంతే ధర్మాత్ముడు.

పట్టాభిషేకం జరిగితే అది రాముడికే జరగాలని అదే ఇక్ష్వాకు వంశం సంప్రదాయమని ధర్మమని భరతుడు తల్లికి చెప్పి తండ్రి అంత్యకర్మల తరువాత అయోధ్య పురవాసులందర్నీ తీసుకొని రాముని వద్దకు పయన మౌతాడు. గుహుడ్ని కలుసుకొని గుహుడి సహాయంతో భరద్వాజుని ఆశ్రమం చేరి శ్రీరామ దర్శనం చేసుకొని రాముడిని అయోధ్యకు రమ్మని బ్రతిమాలుతాడు. అయినా రాముడు తండ్రి వాక్పరిపాలనకు కట్టుబడి ఉంటానని తెల్పగా శ్రీరాముడి పాదుకలను తెచ్చి పట్టాభిషేకం చేసి తాను జటాధారియై నంది గ్రామంలో

నివసించిన ధర్మవర్తనుడు భరతుడు. ఇలా రామాయణంలో అయోధ్యకాండ ధర్మానికి ప్రతీకగా, ధర్మములను ఆచరించిన పాత్రలకు ఆలవాలంగా రామాయణ కావ్యమును రామావతరణ దిశ వైపునకు మరల్చిన కాండగా నిలిచిపోయింది.

"సర్వేజన సుఖినోభవంతు"

ఉపయుక్త గ్రంథసూచి :

1. శ్రీమాన్ దాశరథి రంగాచార్య, 1963, శ్రీమద్రామాయణము, సికింద్రాబాద్, శ్రీరామ బుక్ డిపో.
2. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ, 2013, శ్రీ మద్రామాయణము, హైద్రాబాద్, రైతు నేస్తం ప్రెస్.
3. అజ్జరపు వెంకటరావు నిర్మలం, 2014, శ్రీరామ చరిత్ర, న్యూఢిల్లీ, సౌభాగ్య నిర్మలం ఫౌండేషన్.
4. మొల్ల రామాయణం.
5. గోన బుద్దారెడ్డి ద్విపద రామాయణం.

❖❖❖

సి. ఉమాదేవి గారి మాటే మంత్రము : కథలో కుటుంబ వ్యవస్థ అర్థం – ప్రాధాన్యత

– కె. సురత్నం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఉపోద్ఘాతం :

అగ్గిపుల్ల, కుక్కపిల్లి, సబ్బుబిళ్ళ హీనంగా చూడకుదేన్ని కవితామయమేనోయ్ అన్నీ... అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లుగా కవిత్వానికి కథనానికి అర్థంకాని కథాంశము ఏదీ ప్రపంచంలో లేదు. కథ అనే మట సంస్కృత భాషలో నుండి వచ్చిందే. కథ వాక్యప్రబంధే అనే ధాతువు నుండి ఈ మాట పుట్టింది. కొన్ని వాక్యాలను చేర్చి ఒక విషయాన్ని వివరించడమే కథ. కథ - కథనిక మొదలైన పదాలెన్నో ఈ ధాతువు నుండి పుట్టాయి. కథ అనే మాట మనకు చిన్నప్పుడే పరిమయం అవుతుంది. చిన్న పిల్లలు తాతయ్య, అమ్మమ్మ, నాయనమ్మ దగ్గర చేరి కథలు వింటూ నిద్రపోవటం ఉమ్మడి కుటుంబాల్లో ఇది వరకు తరచుగా కనిపించిన దృశ్యం. పిల్లలు పెద్దవారిని కథ చెప్పమని వేధించడం కూడా సాధారణమే. చెప్పిన కథనే తిరిగి చెప్పబోతే ఇది పాత కథేనని వాళ్ళ గుర్తు పెట్టేసేవాళ్ళు. కనుక పెద్దవాళ్ళు కూడా కొంత కొంత మార్పు చేసి చెప్పటం కూడా మామూలే.

కథలకు మూలాలలని చెప్పదగిన విషయాలు వేద కాలం నుండి ఉన్నాయి. బ్రహ్మణాలలోను కథలు కనిపిస్తాయి. పురాణే ఇతిహాసాలు మొదలైనప్పటినుంచి కథా సాహిత్యం విస్తరించింది. ఇది వరకు జరిగిపోయిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని వివరించటమే ఇతిహాసము. "ఇతి = ఈ విధంగా, ఆస = జరిగినది, హ = ఆట" అని ఇతిహాస శబ్దానికి అర్థము. భారతమంతా కథలే అయినా శాంతి, అనుశాసనిక పర్వంలలో ధర్మరాజు కొన్ని ప్రశ్నలడగటం దాన్ని వివరిస్తూ దీన్ని తెలిపే ఒక కథ ఉన్నది అనటం ఈ సందేహానికి ఆ కథ సమాధానం కావడం కనిపిస్తుంది. కనుక సాహిత్యానికి కథ కొత్త ప్రక్రియగా కాదు. కానీ ఇప్పుడున్న కథకు ఇదివరకు ఉన్న కథకు విషయములో కాని, ఆకారంలో కాని పోలిక లేదనటం కూడా సాహసమని విమర్శకులు అంటారు. "తెలుగు కథానిక" అనే పుస్తకంలో కథకు - కథానికకు ఉన్న భేదాన్ని పెద్దలు చెప్పిన కొన్ని నిర్వచనాలను భారత సాహిత్యంలోని కొన్ని ప్రాచీన కథా మూలాలను వివరించారు.

రచయిత్రి పరిచయం :

సరస్వతీదేవి, నారాయణరెడ్డి దంపతులు కుమార్తె సి. ఉమాదేవి గారు ఫిబ్రవరి 4, 1947, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతి దగ్గర మదనపల్లిలో జన్మించారు. సి. ఉమాదేవి గారు విశాఖపట్నంలో ఎం.ఏ., బి.ఇడి. పూర్తి చేశారు. విద్యారంగంలో పదిహేడు సంవత్సరాలు శ్రీనగర్‌లో విద్యానికేతన్ ప్రారంభించి, ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించారు. రచన వ్యాసంగం ప్రవృత్తిగా సి.ఉమాదేవి గారు అనేక కథలు, నవలలు రచించారు.

వీరి నవలలు : శిలాపుష్పాలు, సాగర కెరటం, కేర్ టేకర్; కథా సంపుటాలు : చిన్నగుండె చప్పళ్ళు, మాటే మంత్రం ఉన్నాయి. సి. ఉమాదేవి గారి రచనల్లో అమృత్వం కవితకు డా॥. పోతుకూచి సాహితీ అవార్డు, మానవతకు చిరునామా కవితకు ఎక్సరే అవార్డు వచ్చాయి. సాహిత్యబుధిలో నీటి బిందువు కావాలన్నది సి.ఉమాదేవి గారి ఆకాంక్ష.

మాటే మంత్రము – ఇతివృత్తానుశీలన :

బాల్యము నుండి ముసలితనం వరకు జీవితంలో

వివిధ దశలు ఉంటాయి. ప్రతి దశలోనూ మనస్సు స్వభావం మారుతుంది. వయస్సుకు మనస్సుకు సరైన లంకె కుదరాలి. వయసుతోపాటు వచ్చే ఆలోచనలను కూడా అర్థం చేసుకొనగలిగే వారు ఉండాలి. వయో వృద్ధులు అయ్యాక వాళ్ళని అర్థం చేసుకునే పిల్లలు ఉంటే పరిస్థితి అనుకూలంగానే జరిగిపోతుంది. తరాల మధ్య జీవన విధానంలో ఉన్న సంఘర్షణను వర్ణించే కథ "మాటే మంత్రము".

అచ్యుతం ఒక రిటైర్డ్ ఉద్యోగి ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. భార్యతో పెద్దతనంలో కొడుకు కోడలితో కలిసి ఉంటున్నాడు. అలా ఉంటే జీవితం బాగానే నడిచేదేమో! కానీ..... అచ్యుతం భార్య సులోచన అనుకోకుండా మరణించింది. అచ్యుతం జీవితంలో అయోమయం ఏర్పడింది.

పోనీ పిల్లలైనా కాసేపు తనతో ఆడుకుంటారా అంటే... వాళ్ళ ఆటలకు వాళ్ళు వెళ్ళిపోవడం చూచి అచ్యుతం నొచ్చుకొనేవాడు. కొడుకు ఎప్పుడైనా వచ్చి వాకింగ్‌కి వెళ్ల లేదని పలకరించినా పరమానంద పడేవాడు. కొడుకు కూడా కొంతసేపు మొక్కుబడిగానే మాట్లాడలేక మాట్లాడి వెళ్ళిపోయేవాడు. ఇక కోడలు తన గురించి విసుక్కోవడం అచ్యుతం కొడుకు రమా మనుమడు బడికి వెళ్లి చదువు కుంటున్నాడు. కొడుకు పనిలోకి వెళ్ళిన తర్వాత అచ్యుతం ఏమీ తోచేది కాదు. సాయంకాలం కాకముందే పిల్లల గురించి ఎదురుచూచేవాడు బడి నుంచి పిల్లలు రావడం కొద్దిగా ఆలస్యం అయితే ఆరాటపడి కోడళ్ళను అడు గుతూ ఉండేవాడు. పిల్లలు వచ్చేలోపు మామగారి ఆరాటం చూసి రమ విసుక్కునేది. అదే అచ్యుతానికి ఇబ్బందిగా ఉండేది. కొడుకుతో చెప్పడం విని బాధ పడేవాడు. తన కాలంలోనే ఉన్న మానవ సంబంధాలతో ఇప్పటి మనుష్యుల తత్వాన్ని సరిచూసుకుని బాధపడే వాడు.

అచ్యుతం బాధ కొడుకు అర్థం చేసుకున్నాడు. తండ్రితో కబుర్లు చెప్పే వాళ్ళు ఎవ్వరూ... లేకపోవడం వలన ఇలా జరుగుతుందని అనుకున్నాడు. ఇంటికి ఒక కొత్త తీసుకుని వచ్చాడు. తండ్రి పడ్డ ఆరాటాన్ని కొడుకు అర్థం చేసుకోలేకపోయాడు. చెప్పిన మాట విని తన భావాన్ని అర్థం చేసుకొని తోడుగా ఎలా ఉపయోగపడు తుందని అచ్యుతం పడే మనోవ్యథను కొడుకు అర్థం చేసుకోలేకపోయాడు.

ఉపసంహారము :

కొన్ని సమస్యలు భౌతికమైనదని ఆరోగ్యం జరుగు బాటు ఇవి ప్రపంచమంతటికీ కనిపించే సమస్య. ఈ సమస్యలకు పిల్లలు యోగ్యులు అయినట్లయితే సరి చేస్తారు. ఆత్మీయులు అనుభూతి చూపిస్తారు. ఆరోగ్యం బాగుంటే జరుగుబాటు ఉంటే ఆయనకేం పెద్దతనం కూడా రాజా లాగ బతుకుతున్నాడు అని అంటారు. ఎవరి కైనా కష్టం సుఖం చెప్పుకోకపోతే అనవసరంగా బాధపడు తున్నారని ఆక్షేపిస్తారు. పెద్దతనంలో తోచకపోవడం అనేది ఒక ముఖ్యమైన ఘట్టం. మాట్లాడే తోడు ఉండాలి. భార్యభర్తలిద్దరు జీవించి ఉంటే ఆ సమస్య రాదు. అచ్యుతం ఇలాంటి వారికి ప్రతినిధిగా ఈ కథలో కని పిస్తాడు. ఇక కోడలు కూతుళ్లు కూడా పెద్ద వారి ఆరాటం అర్థం కాదు వాళ్ళ ఆరాటాన్ని వీల్లు తమను బాధిం చటంగా భావిస్తారు. ఈ సంఘర్షణ పెద్దవాళ్ళున్న అన్ని కుటుంబాల్లో ఎప్పుడో ఒకప్పుడు సాధారణంగా జరిగేదే. మరికొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధా శ్రమం చేర్చడం కూడా జరుగుతుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. శిలాపుష్పం - సి. ఉమాదేవి విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2006.

2. సాంఘిక నవల - కథా శిల్పం - సి. మృణాళిని విల్ కమల్ పబ్లికేషన్స్.

3. నవలా శిల్పం - పల్లపాటి వెంకటసుబ్బయ్య, విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2006.

4. సాగర కెరటం - సి. ఉమాదేవి, విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2008.

5. మాటే మంత్రము - సి. ఉమాదేవి, జె.వి. పబ్లికేషన్స్, 2014.

❖❖❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

కేనోపనిషత్తు – మోక్షమార్గము

– డా॥. ఆర్. వరలక్ష్మి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, విశ్వవిద్యాలయ మహిళా కళాశాల, కోటి, హైదరాబాద్.

జ్ఞానానికి సంబంధించిన వేదాలు రెండు ఖండాలుగా విభజింపబడ్డాయి. జ్ఞానకాండ, కర్మకాండ. ఇక్కడ కర్మకాండ అభ్యుదయానికి సాధనము వంటిది అని అందరూ అంగీకరించినదే. దానిలో జ్యో అష్టోమాది కర్మలను వివరించారు. జ్ఞానకాండ ఆత్మ జ్ఞానానికి సంబంధించిన చాలా మార్గాలను చూపించింది. ఈ జ్ఞానకాండనే 'ఉపనిషత్ కాండం' అని లోకంలో వ్యవహారంలో కలదు. ఈ ఉపనిషత్తులు వేదాల యొక్క అంతిమ భాగంలో ఉండటం వలనర వాటిని "వేదాంతం" అని కూడా అంటారు. ఉపనిషద్ శబ్దం యొక్క అర్థాన్ని తీసుకున్నట్ల యితే అజ్ఞానాన్ని నశింపచేసేవి మరియు ఆత్మజ్ఞానాన్ని కలిగించేవి అనే అర్థం అవగతమవుతుంది.

'ఉపనిషద్' అనే పదానికి 'జ్ఞానము, బ్రహ్మవిద్య' అని అర్థం. 'సద్' అనే ధాతువునకు 'ఉప' 'ని' అనే ఉపసర్గలు చేర్చగా ఉపనిషత్ పదం నిష్పన్నమైనది. "ఉపనిషాదయతి ఇతి ఉపనిషత్" అనే విగ్రహ వాక్యం చేత, 'అజ్ఞానాన్ని సమూలంగా నశింపచేసేది" లేదా "బ్రహ్మ దగ్గరకు చేర్చేది" అని అర్థం. అజ్ఞానాన్ని తొలగించి స్వస్వరూప సాక్షాత్కరం కలిగించేది విద్య, అది జ్ఞానము అది ఉపనిషత్ జ్ఞానము. స్మృతులల్లోను, సూత్రాలలోను, పురాణాలలోను, కావ్యాలలోను, నాటకాలలోను ఈ ఉపనిషత్ శబ్దం ప్రయోగింపబడింది. వాటన్నిటిలో ఉపనిషత్ అనగా రహస్యం, తత్త్వం, సారము, తాత్పర్యము, బ్రహ్మ విద్య, జ్ఞానము, ఆత్మవిద్య, మోక్ష విద్య అని తీసుకోబడింది.

ఉపనిషత్తుల్లో ముఖ్యంగా చెప్పబడింది అజ్ఞాన వినాశనము, బ్రహ్మలో ఐక్యం కావడానికి కావలసిన విద్య ముఖ్యంగా చెప్పబడింది. బ్రహ్మజ్ఞానము, విషయము, మోక్షము, ప్రయోజనము, ప్రతిపాద్య ప్రతిపాదక భావం, సంబంధము, సాధన చతుష్టయ సంపన్నుడు అధికారి అను అనుబంధ చతుష్టయం దానిలో వివరించబడ్డాయి. ఆత్మవిద్య, బ్రహ్మవిద్య, మోక్షవిద్య, ముక్తికి మార్గం చూపేవి, కూడా ఈ ఉపనిషత్తులే.

మోక్షము :

చతుర్విద పురుషార్థాలైన ధర్మ, ఆర్థ, కామ, మోక్షాలల్లో ధర్మ, ఆర్థ, కామాలను మూడు మానవుడు తనంతట తాను సాధించుకోవచ్చును. కాని చివరిదైన మోక్షం మాత్రం సాధించడానికి ఉపనిషత్ జ్ఞానం అవసరం అవుతుంది. ఈ మోక్ష మార్గాన్ని చూపించేవే ఉపనిషత్తులు. ఉపనిషత్తులు మోక్ష ప్రదాయకాలు, జ్ఞాన ప్రదాయకాలు.

జనన మరణ రూప సంసారబంధముల నుండి శాశ్వతముగా అనగా తిరిగి పుట్టక ఉండకుండా, విముక్తిని పొంది, పరమానంద స్వరూపుడైన పరమాత్మను చేరుటయే మోక్షము.

వేదాంతసారము ప్రకారము 'ముముక్షుత్వం - మోక్షేచ్ఛా" ముముక్షుత్వము అనగా మోక్షము పొందాలన్న తపన. శాంతుడు, దాంతుడు ప్రశాంతమైన హృదయము గలవాడు జితేంద్రియుడు, భ్రమ ప్రమాదాది రహితుడు, గురువు ఆజ్ఞను శిరసా వహించువాడు, సద్గుణవంతుడు, ఎల్లవేళల గురువును అనుసరించువాడు, మోక్షమునకై తపించువాడును అగు శిష్యునకు ఆధ్యాత్మ విద్య ప్రసాదించవలెను' అని ఉపదేశ సాహస్రి యందు చెప్పబడింది.

కేనోపనిషత్తులోని మోక్షమార్గం :

కేనోపనిషత్తు సామవేదానికి సంబంధించినది "కేన" అనే పదంతో ఇది ప్రారంభమయింది. అందుకే దానికా పేరు వచ్చింది. కేన అనగా దేనిచేత, ఎవనిచేత? అని ప్రశ్న, ప్రశ్నించడం అవసరం అని ఉపనిషత్తులు సూచిస్తున్నాయి. ఈ ఉపనిషత్తులో 35 మంత్రాలు

ఉన్నాయి. ఈ ఉపనిషత్తులో శిష్యుడు గురువు గారికి ప్రశ్నిస్తున్నట్లు ఉంటుంది కానిఎక్కడ గురుశిష్యుల పేర్లు ఉండవు. 'సాధనే ఏకైక మార్గం' అని ఈ ఉపనిషత్ సూచిస్తుంది.

ఈ ఉపనిషత్ మనోబుద్ధి అహంకారాలు ఉన్నప్పుడే సత్యాన్వేషణ సాధ్యమనీ, అందువల్ల ఆత్మ అన్ని జీవులలో ఉన్నా 'మోక్షం' అనేది ఒక్క మానవుడికే సాధ్యపడు తుందని కేనోపనిషత్ వివరిస్తుంది.

ఓం ఆప్యాయస్తు మమాజ్ఞాని, వాక్ ప్రాణశ్చక్షుః శ్రోత్రమథో బల మిందియాణి చ సర్వాణి, సర్వం బ్రహ్మోప నిషదం, మహం బ్రహ్మ నిరాకుర్యాం మామా బ్రహ్మ నిరాకరోదనిరాకరణ సస్త్య నిరాకరణం మేస్తు, తదాత్మని నిరతే య ఉపనిషత్సు ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు.

అనే శాంతి పాఠముతో మొదలైంది ఈ ఉపనిషత్తు. నా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఆరోగ్యంగా, శక్తిమంతంగా ఉండుగాక, నాకు భగవంతునికై భక్తి విశ్వాసాలు ఉండుగాక, నన్ను భగవంతుడు అను గ్రహించుగాక. సద్గుణ సంపన్నుడనై ఉండుదును గాక, అని మొదట ప్రార్థనలో చెప్పబడింది.

కేనోపనిషత్తులో మొదటి ప్రశ్న ఈ విధంగా అడుగ బడింది.

కేనేషితం పతతి ప్రేషితం మనం?

కేన ప్రాణః ప్రథమః పైత్రిమెక్తిః

కే నేషతాం వాచమిమా వదన్తి?

చక్షుః శ్రోత్రం క ఉదేవో యునక్తి?

ఇది కేనోపనిషత్తులోని మొదట ప్రశ్న, మనస్సుకెలా ఆలోచనలు కలుగుతాయి?

ఎవరిచే అది ప్రేరేపించబడుతుంది? ఒకచోట కూర్చొనినప్పుడు మరొక విషయం ఒక్కక్కప్పుడు అసంబద్ధ విషయమైనా గుర్తుకొస్తుంది? దానికి కారణమేమి? ఇది ఒక ప్రశ్న. మనిషికి ప్రాణము ఎలా వచ్చింది? ఉచ్ఛ్వాస నిశ్వాసాలను ఎలా తీసుకొంటున్నాడు? బలవంతంగానైనా ప్రాణాలను నిలుపుకోవాలని ఎందుకనుకొంటున్నాడు? ఇది రెండవ ప్రశ్న. వాక్కు ఎవరి ఇష్ట ప్రకారం ప్రవర్తి స్తున్నది. భావాన్ని వాక్కు ఎలా అనుసరిస్తుంది. ఇది మూడవ ప్రశ్న. చక్షురింద్రియము శ్రోతేంద్రియమును తన తన పనులు చేయునట్లు ప్రేరేపించునది ఎవరు? ఇది నాలుగవ ప్రశ్న.

పై నాలుగు ప్రశ్నలకు సమాధానం కేనోపనిషత్తులో ఈ విధంగా వివరించారు. మనో దేహ ప్రాణేంద్రి యాదులు ఆయా కార్యములను చేయుచున్నవి. కాని వాస్తవమున అవి అన్నియు అచేతనములు. అచేతనము లైన రథాదులు చేతనములగు పురుషాదులచే నడుపబడి నట్లు అచేతనములను, ఈ దేహాదులను కూడా నడుపు ఒక చైతన్య స్వరూప ఉండును. ఈ చైతన్య స్వరూపం ఎటువంటి.

అన్ని విధములగు చలనములకు ప్రాణమే నిమి త్తము, అందుచే దానికి ప్రథమ ప్రాణము అని పేరు. ఈ ఆత్మ శ్రవణేంద్రియమునకు శబ్ద గ్రహణ శక్తిని ప్రసాదించినది ఈ ఆత్మయే. మనస్సునకు మనస్సు, వాక్కునకు వాక్కు, ప్రాణమునకు ప్రాణము, నేత్రమునకు నేత్రము, కావున వివేకవంతులు మన ఇంద్రియాదులే ఆత్మ అనెడు భ్రాంతిని విడచి దేమం దారా పుత్రులందు నేను, నాది అను అభిమానము లేనివారై ముక్తిని పొందు దురు.

ఈ తత్వజ్ఞానాన్ని తరువాత తెలుసుకుందాంలే అని ఊరుకోకూడదు, ఈ మనుష్య జన్మలోనే ఇప్పుడే ఈ జన్మలోనే తత్వాన్ని తెలుసుకోమని మోక్షాన్ని పొందమని కేనోపనిషత్ ఘోషిస్తుంది.

ఇహ చే దవే దాదధ సత్యమస్తి న చేదిహావే దాన్మహతా వినష్టిః

భూతేషు భూతేషు విచిత్య ధారాః ప్రత్యాస్మాల్లో కాదమృతాభవన్తి ॥ 5 ॥

ఈ మనుష్య జన్మలో ఉన్నప్పుడే పరమార్థతత్వాన్ని తెలుసుకోవాలి. మోక్షాన్ని పొందాలి. అట్లా చేయనిచో గొప్ప నష్టము వాటిల్లును. కావున బుద్ధిమంతులు స్థావర జంగమాత్మకములైన అన్ని భూతములలోను ఉన్న ఆత్మ స్వరూపమును సాక్షాత్కరింప చేసుకొని మమకార అహంకారాలను వదిలి సంసార బంధము నుండి దూరముగా ఉండి స్వస్వరూపమగు అమృతత్వమును పొందుచున్నారు.

భగవద్గీత యందు మోక్షమార్గం గురించి ఈ విధంగా చెప్పబడింది.

"స్వే స్వే కర్మణ్య భరతః సంసిద్ధిం లభతే నరః

తమ తమ స్వాభావిక కర్మల యందు తత్పరులైన వారు భగవత్ప్రాప్తి రూప పరమసిద్ధిని నిస్సందేహముగా పొందుదురు (మోక్షసన్యాస యోగము 45 శ్లోకము)

సాక్షాత్తు మోక్షస్వరూపుడైన పరమేశ్వరుని యందే కర్మలన్నింటిని సన్న్యసింపుమని అనగా త్యాగమొనర్చుమని దాని ద్వారా ముక్తిని పొందుమని మోక్షసన్యాసయోగము మనకు తెలుపుతుంది. బ్రహ్మమును తెలుసుకొనుట అనగా

ప్రతి బోధవిదితం మతమమృతత్వం హి విన్దతే
ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేమృతమ్ ॥4॥

బుద్ధికి సంబంధించిన ప్రతి ఒక్క ప్రతీతి మందును ఆత్మ సాక్షిగా ఉండి దానిని ప్రకాశింపచేయును అను జ్ఞానమే సరియైన జ్ఞానము. అనగా స్వప్నము నుండి మేల్కొనినట్లు ఒక్క మారుగా సమస్త సంస్కారములను తొలగించుకొని తెలుసుకొన్నప్పుడే బ్రహ్మను తెలిసికొన్నట్లు అగును. దానిచే మోక్షమును పొందును. సామర్థ్యమును పొందవలెనని ఆత్మ చేతనే పొందగలుగుతాము. ఆ ఆత్మ జ్ఞానముచే మోక్షమును పొందును.

బ్రహ్మస్వరూపమును తెలుసుకొనుట :

బ్రహ్మ తెలియబడనిది కావున, ఈ బ్రహ్మము ఉంది అని తెలియచేయడానికి కేనోపనిషత్తులో ఒక ఉపఖ్యానము కలదు. దేవాసురులకు యుద్ధము వచ్చినప్పుడు బ్రహ్మ దేవతలకు విజయము సంపాదించి పెట్టెను. ఈ విధముగా బ్రహ్మ వలన దేవతలకు విజయము కలుగగా దేవతలు గొప్పతనమును పొందిరి.

దేవతలకు కలిగిన ఆ మిథ్యాభిమానమును చూచి బ్రహ్మ వారి ఎదుట ఒక యక్షుడు రూపంలో ప్రత్యక్ష మయ్యెను. దేవతలకు ఆ యక్షుడు ఎవరో అర్థం కాలేదు. అప్పుడు దేవతలు తేజస్వియైన జాతవేదుని (అగ్నిని) ఆ యక్షుడు ఎవరో తెలుసుకొని రమ్మని పంపించారు. యక్షు డెవరో తెలుసుకోవడం కూడా ఒక పెద్ద పనేనా అను కుంటూ వారితో అలాగే అని చెప్పి యక్షుడు వద్దకు అగ్ని అతివేగంగా వచ్చాడు. తన ముందు నిలుచున్న అగ్నిని చూచి యక్షుడు నీవెవరవని ప్రశ్నించాడు. లోకాన్ని తన వెలుగుతో వెలిగించే తేజఃపుంజమైన తనను నీవెవరు అని అడుగడమేమిటి అని అగ్ని దేవుడు కోపంగా మండి పడుతూ నేను ఎవరో తెలియదా నీకు, నేను జాతవేదు డను (అగ్నిని) అని అన్నాడు.

దతభ్యద్రవత్ తమభ్యవదత్,
కోసీత్యగ్నిర్వా అహమస్మీత్య బ్రవీజ్జాతవేదా
అహమస్మీతి ॥ 4 ॥

ఈ విధంగా జాతవేదుడను అను ప్రసిద్ధ నామ దేయుడవైన నీలో ఏమి సామర్థ్యమున్నది? అని యక్షుడు అగ్నిని ప్రశ్నించెను. "ఈ పృథ్విపై ఉన్న సకల వస్తు జాలమును కాల్చివేయగలను" అని అగ్ని సమాధానము చెప్పెను. అపుడా యక్షుడు "ఈ గడ్డి పరకను కాల్చుము" అని ఒక గడ్డి పరకను అగ్ని ముందు పడవేసెను. అగ్ని తనకున్న శక్తినంతయు చూపుచు ఆ గడ్డి పరకపైకి వెళ్ళెను. కాని దాని కాల్చలేకపోయెను. ఈ యక్షుడెవరో నేను తెలుసుకొనజాలను అని అనుచు అక్కడి నుండి తిరిగి వెడలిపోయెను.

తరువాత దేవతలు వాయువులో "ఓ వాయుదేవా ఆ యక్షుడెవరో తెలుసుకొనుము" అని పలికిరి, "అట్లే తెలుసుకొనెదను" అని వాయువు పలికెను. వాయువు

అతి శీఘ్రముగా దగ్గరకు వెళ్లెను. యక్షుడు నీ వెవరవు, అని ప్రశ్నించెను.

నేను వాయు వనియు, మాతరిశ్వ అనియు ప్రసిద్ధుడను అని వాయువు సమాధానము చెప్పెను. అప్పుడు యక్షుడు వాయువు ముందు ఒక గడ్డి పరకను వేసి, దానిని పైకి ఎత్తుము" అని పలికెను. వాయువు తన శక్తినంతయు వినియోగించి కూడా ఆ గడ్డి పరకను పైకి ఎత్తలేకపోయెను. తరువాత దేవతలో అగ్రగణ్యుడైన ఇంద్రుడు ఆ యక్షుడి వద్దకు వచ్చెను. ఇంద్రుడు యక్షుని వద్దకు సమీపించగానే యక్షుడు అంతర్ధానమయ్యెను. యక్షుడు అంతర్ధానము కాగానే ఇంద్రుడు ఎవరో కదా అని ధ్యానించుచుండెను.

అపుడు అతనికి ఆ యక్షుడి యందు ఉన్న భక్తిని గ్రహించి, బ్రహ్మ విద్యయే రుద్ర ప్రత్నియైన ఉమా రూపముతో ప్రత్యక్షమయ్యెను. బంగారు ఆభరణములతో అలంకరింపబడిన, ప్రకాశించుచున్న ఆ ఉమా రూపిణి యగు విద్యను చూచి దేవేంద్రుడు సర్వజ్ఞుడగు పరమేశ్వరుని భార్యయైన ఈమెకు ఆ యక్షుడు ఎవరో తెలుసునని భావించి, ఆ యక్షుడు ఎవరు అని ప్రశ్నించెను. "మీకు ఇపుడు కనిపించిన ఆ యక్షుడు బ్రహ్మయే. ఆ బ్రహ్మయే మీకు విజయమును సాధించి పెట్టగా మీరు గొప్ప తనమును పొందుచున్నారు" అని ఉమా చెప్పెను.

మీరు భగవంతుని శక్తి వల్లనే దేవతలయ్యారు. ఆయన కారణంగానే సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ప్రపంచమంత వ్యవహరిస్తున్నది. భగవంతుని ఆజ్ఞ లేనిది గడ్డిపోచ కూడా కదలదు. శివుని ఆజ్ఞ లేనిది చీమయినా కదలదు అని బ్రహ్మోపదేశము చేసెను. అపుడు ఆ ఇంద్రుడు ఇది బ్రహ్మయే అని విషయమును గ్రహించెను. అగ్ని వాయువు, ఇంద్రుడు ఈ ముగ్గురు దేవతలను ఈ బ్రాహ్మకు చాలా దగ్గరగా వెళ్ళినారు అది బ్రహ్మయను విషయమును గ్రహించినారు. అందుచే వారు ఇతర దేవతల కంటే అతిశయము కలవారై ఉన్నారు. ఇంద్రుడు మొదటి బ్రహ్మజ్ఞాని, ఉమాదేవి (హైమావతి - హిమవంతుని కుమార్తె) స్త్రీ రూపంలో ఆవిర్భవించిన విద్య. ఆమె అనుగ్రహ వాక్యంలో ఉపదేశంతో బ్రహ్మమునకు తన కంటె ముందు ఎవరు వెళ్ళినంత దగ్గరగా వెళ్ళి, ఇతరులెవరూ తెలుసుకొనక ముందు మొదట ఇంద్రుడు బ్రహ్మమును తెలుసుకొన్నాడు. కనుకనే అన్య దేవతల కంటే ఇంద్రుడు శ్రేష్ఠుడు, దేవతలకు ప్రభువు, 'దేవరాజు' అయినాడు.

బ్రహ్మము అనగా నిత్యము, సర్వజ్ఞము, సర్వగతము, నిత్యతృప్తి, నిత్యమైనది, శుద్ధమైనది, బద్ధమైనది, ముక్తమైనది మొదలైన స్వభావములు కలిగిన విజ్ఞాన మానందమే బ్రహ్మ. బ్రహ్మ సాక్షాత్కారం కొరకు సాధకుడి హృదయాలో తీవ్రమైన తపన కలిగినప్పుడు ఆ కోరికను ఇంకా తీవ్రము, తీక్షణము చేయడానికి, పరమాత్ముడు సాధకునికి కన్నుమూసి తెరిచినట్లు మెరుపులా ఒక్కసారి మెరిసి, కన్ను తెరిచేసరికి అంతర్ధానమవుతాడు.

బ్రహ్మము ప్రకాశ స్వరూపం కనుక తన స్వరూపాన్ని మెరుపులో ఒక్కక్షణం ప్రకటించుచున్నది. బ్రహ్మమంటే మెరుపు మెరవడం కన్ను మూయడం వంటిది. అదియే బ్రహ్మ. మరొకటి కాదు. ఇది ఉపాస్యం కాదు. అయినా సేవిస్తూనే ఉంటారు. అది దైవం బాహ్య ప్రకృతికి, ఆధ్యాత్మం అంతరంగానికి సంబంధించినవి, ఇదియే ఆ బ్రహ్మమును గురించిన ఉపదేశం.

ముగింపు :

బ్రహ్మవిద్యకు తపస్సు, దమము, కర్మ మొదలైనవి పాదముల వంటివి. వేదములు, వేదాంములు శిరస్సు వంటివి. ఇవి అన్నియు ఉన్నప్పుడే బ్రహ్మ విద్య, మానవుడు పాదములతో నడిచినట్లు నడుచును. సత్యమును పాటింపవలెను. కావున బ్రహ్మజ్ఞానమునకై తాత్త్వన్వేషణకై మనో నిగ్రహమును, ఇంద్రియ నిగ్రహమును, మంచి కర్మలను ఆచరించుట మొదలైనవి అవి ఈ ఉపనిషత్తు మనకు ప్రబోధించుచున్నది. చాలా సులువుగా సరళ మార్గములో మోక్షమును పొందుట అనే విషయం ఈ కేనోపనిషత్తు మనకు వివరిస్తున్నది.

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః

పదసూచి :

సాధన చతుష్టయము అనగా

1. నిత్య, అనిత్య వస్తువుల విచారణ
2. ఇహపరలోకములలో సుఖముల ననుభవించవలె ననెడు కోరిక లేకపోవుట.
3. శమము మొదలగు ఆరు గుణములు కలిగి ఉండుట. శమము అనగా శమాదిషట్కము - శమము, దమము, ఉపరతి, సమాధానము, శ్రద్ధ అనునవి ఆరు గుణములు)
4. మోక్షము పొందవలెనను కోరిక, ఈ నాలుగు సాధన చతుష్టయమని చెప్పబడును.

అనుబంధ చతుష్టయము అనగా

1. అధికారి, విషయము, సంబంధము, ప్రయోజనము అనుని నాలుగు అనుబంధ చతుష్టయము.

ఉపయుక్త గ్రంథములు :

1. తైత్తిరీయ కేన ప్రశ్న ముండక మాండుక్యోపనిషత్తులు - డా॥. పుల్లెల శ్రీరామచంద్రుడు, సురభారతి సమితి, హైదరాబాదు.
2. శ్రీమద్భగవద్గీత, డా॥. కృష్ణమాచార్యులు, గీత ప్రెస్, గోరఖ్‌పూర్.
3. సంస్కృత సాహిత్య చరిత్ర - ముదిగొండ గోపాల్‌రెడ్డి గారు, తెలుగు అకాడమి.
4. వేదాంత సారము - వేద భారతి ఆచార్య ఎ. రాములు గారు.
5. శ్రీ భగవద్గీత ఉపనిషత్తులు - డా॥. కసిరెడ్డి గారు, జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్.

❖❖❖

జానపద రామగాథలు – వ్యక్తి ధర్మం

– ఎ. మృణాళిని, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ మరియు పిజీ కళాశాల, గజ్వేల్, తెలంగాణ.

నిత్యజీవితంలో మానవుల నీతీ నియమాలను ఇతిహాస పురాణ కథలకు జోడిస్తూ జానపదులు వ్యవహారిక భాషలో వారివారి ప్రాంతీయ పలుకుబడులు నుడికారాలతో అనేక ప్రక్రియా రూపాల్లో జానపద సాహిత్యాన్ని సునంపన్నం చేశారు. ''రామో విగ్రహవాన్ ధర్మః'' అన్నట్టుగా ధర్మానికి ప్రతిరూపమైన ఆ రాముని చరిత్రను కావ్యంగా మలిచారు వాల్మీకి. ఆదికవి వాల్మీకి తరువాత ఈ ప్రపంచంలో ఎన్నో వేలకు పైగా రామాయణాలు వెలువడ్డాయి. గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం అనీ, భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, కంబన్ రామాయణం, ఆధ్యాత్మిక రామాయాణం, శతకంధర రామాయణం, నిర్వచనోత్తర రామాయణం ఇలా ఎన్నో రామాయణాలు ఎంతోమంది కవులచే రచింపబడినవి. వీటన్నింటితో పాటు జనపదాలలో నివసించే పల్లీయులు అంటే జానపదులు తమ ఊహశక్తి మేరకు రామకథను గానం చేశారు. సీతారాములను అవతార పురుషులుగా కాక తమ నిత్య జీవితాల్లో సాధారణంగా వారు చూసే స్త్రీ పురుషుల వలె భావించి రామాయణానికి సంబంధించిన ఎన్నో గేయాలను రచించారు.

జానపదులు వాల్మీకి రామాయణాన్ని అనుసరించి ఎక్కువ మొత్తంలో రామాయణ సంబంధ గేయాలు రాసినప్పటికీ వారు తమ యొక్క జీవితాల్లోని కష్ట సుఖాలను ఆ సీతారాములకు ఆపాదించి, ఆయా సంఘటనలు ఎదురైనప్పుడు వారు ఏ విధంగా ప్రతిస్పందించేవారు స్వాభావికంగా ఆ గేయాల్లో తమ యొక్క కల్పనలతో వ్రాశారు. వాల్మీకి రామాయణం తరువాత వచ్చిన గోనబుద్ధారెడ్డి రామాయణంలో, భాస్కర రామాయణాలలో ఆవాల్మీకమైన అంశాలతోపాటు అప్పటికే జానపద సాహిత్యంలో ఉన్న రామాయణానికి సంబంధించిన ఎన్నో విషయాలు కనిపిస్తాయి. జానపద సాహిత్యం శిష్ట సాహిత్యానికి మార్గదర్శకంగా నిలిచిందని దీని వల్ల స్పష్టమౌతుంది. జానపద రామ గాథలలోని అంశాల ఆధారంగా వ్యక్తి ధర్మనిరూపణం చేయడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం. వాల్మీకి రామాయణం కన్నా భిన్నంగా ఉన్నప్పటికీ రాముని యొక్క ధర్మాన్ని బలపరిచేవిధంగా ఉండడం విశేషం.

రామాయణం - చతుర్విధ పురుషార్థాలు :

మానవ జీవితం సక్రమంగా సవ్యదిశలో సాగాలంటే మనం పాటించవలసినవి చతుర్విధ పురుషార్థాలు. అవే ధర్మం, అర్థం, కామం, మోక్షం. ఈ చతుర్విధ పురుషార్థాల వివరణ, వాటిని పాటించే విధానము అడుగడుగునా మనకు రామాయణంలో కనిపిస్తుంది. కొంత లోతుగా పరిశీలిస్తే ఈ జానపదులు వ్రాసిన రామాయణాల్లో మనం ఈ చతుర్విధ పురుషార్థాలను గమనించవచ్చు.

చతుర్విధ పురుషార్థాలలో ధర్మం :

చతుర్విధ పురుషార్థాలలో ప్రప్రథమైన మరియు శక్తివంతమైన ధర్మం గురించి చర్చించుకుందాము. ధర్మం అంటే ఖచ్చితంగా ఇదీ అని చెప్పలేం. ధర్మం అంటే విధి. భగవద్గీతలో చెప్పినట్టుగా ''యద్యదాచరతి శ్రేష్ఠః'' ధర్మము అంటే ఉత్తములు వేటినైతే ఆచరిస్తారో వాటినే జనులు ప్రమాణంగా తీసుకుంటారు. అదే ధర్మంగా చెప్పవచ్చు. రామయణ గాథలలోని విభిన్న పాత్రలు ఈనాటికీ మానవాళికి ఆదర్శంగా నిలవడం మనం గమనిస్తూనే ఉన్నాం.

భార్యాభర్తల అనుబంధం :

రాముడు దశరథుని ఆజ్ఞ మేరకు కైకేయి యొక్క మాటలను అనుసరించి పుత్రధర్మంగా వనవాసానికి

బయలుదేరగా సీతాదేవి రాముడి వెంట తాను కూడా వస్తానంటే రాముడు వద్దన్నాడు. అప్పుడు సీతాదేవి

"మాను పారిన తీగ మాను తప్పిన వెనుక మరియెట్లు నిల్వగలదూ.
చముురు లేని దివ్వె ఎంతకాలముదాక వెలిగేది"

అని పలికింది. సీత యొక్క పతి భక్తీ సతీ ధర్మం మనకు ఈ విధంగా తేటతెల్లమవుతుంది.

ప్రజాభిమానాన్ని పొందిన రఘురాముడు :

మంథర మాటలు విని స్వతస్సిద్ధంగా మంచి మనసు గల కైకేయి చెప్పడు మాటలు విని భరతుని పట్టాభిషేకము, రాముని పద్నాలుగేళ్ళు వనవాసం చేయమని కోరింది. రాముడు దానిని అనుసరించి సీతాలక్ష్మణ సమేతుడై అడవులకు పయనమవుతుండగా అయోధ్యానగర వాసులందరు వారిని వెంబడించారు. ఎంత వద్దన్నా వినలేదు. ఇక్కడ రామున్ని విడవలేక ప్రజా ధర్మాన్ని పాటించారు ప్రజలు. చివరికి రాముడు 'యీ రాత్రి ఇచటను ఇరువుగా నిద్రించి తెల్లవారిన వెనుక తేరు దోలింతాము కాపుననుమనమింక కలిసి నిద్రిం తాము' అని చెప్పి రాత్రికి రాత్రే సీతాలక్ష్మణులతో వారికి అందకుండా వెళ్ళిపోయారు.

ఏకపత్నీవ్రతుడిగా రాముడు :

ఏకపత్నీవ్రతుడైన శ్రీరాముడి వద్దకు శూర్పణఖ వచ్చి రాముడి సౌందర్యాన్ని చూసి తనను పెళ్ళిచేసుకోమని కోరింది. అతడు "ఇంటి పురి తీసి ఇటు మళ్ళమనుచు వీపున వ్రాలు వ్రాసెను" దీనిని బట్టి రాముడు తన పతి ధర్మాన్ని చాటి చెప్పాడు. అంతే కాక రావణుడు సీతనప హరించిన సందర్భంలో సీతను కోల్పోయిన రాముడు పంపా సరోవర ప్రాంతశోభను చూసి ఆ సరోవరంలో

"మడుగులో పుష్పముల్ - మదనబాణము లయ్యె-
లోత్పలంబులు - నెలత కన్నులబోలు -
యీ చక్రవాకముల్ - ఈపద్మముకుళముల్ ఇంతి కుచములబోలు -
చారు శైవాలంబు సీత కురులనుబోలు"

హంస నడకలు సీత నడకలుగా, పద్మాల రేఖులను సీత కన్నులుగా, కోకిల రవాలను సీత పలుకులుగా, చేపల మిలమిలను సీత చూపులుగా, కమలాలను సీత వదనంబుగా ఊహించుకొని శ్రీరాముడు విలపించిన సమయంలో, మాయలేడిని చూసి సీత మనసు పది కోరగా తెచ్చి యిచ్చే సమయంలో, ఆంజనేయుడు లంకకు సీతాదేవికి రాముడి యొక్క సమాచారాన్ని అందించడా నికి వెళ్లిన సందర్భంలో సీతాదేవి గుర్తుపట్టేందుకు రాముడు సీత యొక్క ఆనావాళ్ళు కొన్ని ఆంజనేయుడితో ఇచ్చి పంపిన సందర్భంలో కూడా శ్రీరాముడికి సీతాదేవికి పట్ల ఉన్న బాధ్యత, భార్య పట్ల తన యొక్క ధర్మం కనిపిస్తుంది.

దాసుడిపై వాత్సల్యం :

హనుమంతుడు శ్రీరాముడి పట్ల అడుగడుగునా తన యొక్క దాస్య భక్తిని నిరూపించాడు. లంకలో ఉన్న సీతాదేవికి రాముడు పంపించిన ఆనవాళ్ళతో గుర్తుపట్టేట్టు చేసి రాముని గురించి సీతాదేవికి తెలియజేశాడు. అదే విధంగా లక్ష్మణుడు మూర్ఛిల్లిన సందర్భంలో రాముడు "ఇలలో నల్గురము ఇపు డన్నదమ్ములము, ఇటు పైని మా తోటి హితువు మీరంగ, ఐదవవాడగుచు అలరారు చుంద్రువు నీవ"ని కోరాడు. ఎవరూ తేనేలి సంజీవిని తెచ్చి లక్ష్మణుని పునర్జననానికి మూలకారకుడైయ్యాడు. ఆంజనేయుడు సంజీవనిని తీసుకొని వచ్చే సందర్భంలో రావణుడు కాలనేమి వంటి రాక్షసులను పంపి ఆంజనేయుడి కార్యాన్ని భగ్నం చేయాలనుకున్నాడు. ఆంజ నేయుడు వాళ్ళతో భీకర పోరాటం చేసి సంజీవనిని తీసుకువచ్చాడు. ఈ కాలనేమి వృత్తాంతం వాల్మీకి రామాయణంలో లేదు. అదేవిధంగా సీతారామచంద్రుల పట్టాభిషేక సందర్భంలో అందరూ కట్నాలు చదివించారు. అప్పుడు సుగ్రీవుడు ఒక మణిహారాన్ని బహూకరించాడు రాముడు సీతతో 'ఎవ్వరి మూలమున వృద్ధిబొందితివో వారి కిమ్మన'గా సీతమ్మ 'నాయాత్మబంధుండ జీవ రక్షకుడా మాయన్న హనుమంత రమ్మను'చు "బిలిచే

తన చేత కంఠమాల హనుమంతుకేసె' ఇలా భృత్య ధర్మాన్ని పాటించిన హనుమంతుడు కేవలం సీతకే కాదు అందరికీ ప్రీతిపాత్రుడే.

స్నేహబంధం :

రావణుడి ఆగడాలు భరించలేని రావణుని సొంత సోదరుడైన విభీషణుడు అన్నను ఎన్నిసార్లు వారించినా వినలేదు. విభీషణుడు ధర్మంవైపు నిలిచి రాముడి ప్రాపుపొందాడు. రాముడు తన శత్రువైన రావణుడి సోదరుడు విభీషణున్ని సైతం మిత్రునిగా భావించాడు. రావణుని మరణ రహస్యం తెలియకుంటే రావణుని చంపడం రాముడితో అయ్యేపనికాదు. 'నాభిలో అమృతాన్ని కొల్లగొట్టినచో రావణుడి మరణం సంభవిస్తుంద'ని తన అన్న మరణ రహస్యాన్ని విభీషణుడు తెలియజేయడంలో మిత్రధర్మం ప్రతిబింబిస్తుంది. రావణ వధ అనంతరం లక్ష్మణుడు ఇక్కడే ఈ బంగారం వంటి లంకలో ఉందామని కోరగా రాముడు

"అపి స్వర్ణమయీ లంకా నమోరోచతె లక్ష్మణా
జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపిగరీయసీ"

అంటూ జన్మభూమిపై ఉన్న ప్రేమను తెలియ జేశాడు. లంకానగరానికి విభీషణున్ని రాజును చేశాడు.

అన్నదమ్ముల అనుబంధము :

జానపదుల రామాయణంలో బహుళ ప్రచారం పొందిన అంశాలు ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణదేవర నవ్వు, శ్రీరామచంద్రుడు పద్నాలుగేండ్ల అరణ్యవాసం పూర్తి చేసుకున్న తరువాత అయోధ్య నగరానికి సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేతంగా తిరిగి వచ్చినప్పుడు లక్ష్మణుడు సరాసరి తన భార్యయైన ఊర్మిళాదేవి స్థితి గురించి తెలుసుకోకుండా రాముని యొక్క పట్టాభిషేక పనులలో నిమగ్నమౌతాడు. స్త్రీ యొక్క హృదయం స్త్రీకే అర్థమవుతుంది కాబట్టి సీతాదేవి లక్ష్మణుని ఊర్మిళాదేవిని కలసిరమ్మని రామునితో చెప్పింది. ఇక్కడ పదునాల్గేండ్ల అరణ్యవాసం తరువాత కూడా తన సొంత భార్య అయిన ఊర్మిళాదేవిని పట్టించుకోకుండా ఇంకా తన అన్నగారి పనుల్లోనే నిమగ్నమై ఉన్న లక్ష్మణుని చూస్తుంటే తమ్మునికి అన్న పట్ల ఉండవలసిన గౌరవం, ప్రేమ కనిపిస్తాయి. ఇదే భాతృ ధర్మం. ఈ ధర్మాన్ని అనుసరించడంలో రాముడే లక్ష్మణుడికి ఆదర్శప్రాయుడు. రావణవధ జరిగే సందర్భం కన్నా ముందు విభీషణుడికి ఎదురెళ్ళి లక్ష్మణుడు రావణుని శక్తిచే మూర్ఛితుడవుతాడు. అతన్ని చూసి రాముడు

"చేరు తెగి ముత్యములు చెదరి రాలినగతి
రాలెను కన్నీరు రాముకన్నులను"

కన్నీరు మున్నీరవుతాడు. రాముడు ఆంజనేయుడిని బతిమాలి లక్ష్మణుని పై ప్రేమతో ఎలాగైనా బ్రతికించుకోవాలని భాతృ ధర్మాన్ని పాటించి సంజీవినికై పంపించాడు. ఇలా అన్నదమ్ములు నిరంతరం ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తూ లోకానికి భాతృధర్మాన్ని తెలియజేశారు.

లక్ష్మణుడు ఊర్మిళాదేవి శయ్యాగృహానికి చేరుకొని తానవరో తెలుపకుండా శయనిస్తున్న ఊర్మిళాదేవి పక్కన కూర్చొని "కొమ్మ నీ ముద్దుముఖమూ సేవించగోరినాడే చంద్రుడూ" అని వర్ణించగా ఒకటా రెండా పద్నాలుగేళ్ళు మూసిన కన్నులు తెరవకుండా పడి ఉన్న ఊర్మిళ....

"అయ్య మీరెవ్వరయ్యా మీరింత యాగడంమ్మున కొస్తిరీ
సందుగొందుల వెదుకుచూ మీరింత తప్పుశాయగ వస్తిరీ"

అంటూ ఆమె లక్ష్మణుడిని తప్ప ఇతరులను భర్తగా ఊహించలేని సతిధర్మం కనిపిస్తుంది. అంతటితో ఊరుకోక వచ్చినవాడు లక్ష్మణుడని తెలియక

"ఒకదాలి కోరిగాదా ఇంద్రునికి ఒడలెల్ల హీనమాయె,
పరసతిని కోరిగాదా రావణు మూలముతో హతమాయెను,
ఒకడాలి కోరిగాదా కీచకుడు ప్రాణములు కోలుపోయె,
ఇట్టి ద్రోహములు మీరు యెరుగుండి యింత ద్రోహము కొస్తిరా"

ఇలా ధర్మాన్ని బోధించింది. ఈ మాటలు విన్న లక్ష్మణుడు "కత్తి వరదీసి యపుడూ లక్ష్మణుడు తా

వేసుకొందు" ననెను అనగానే కన్నులు తెరిచిన ఊర్మిళా భర్తను చూసి భర్త పాదాలపై వాలింది. కరిగిపోయి హృదయోద్వేగురాలైంది.

"మా తండ్రి జనకరాజూ మిము నమ్మి మరచి పెండ్లిజేసెనూ
చిత్త మొకదిక్కునుంచి సమయమున చిన్నబుత్తురు పురుషులూ"

అని దెప్పి పొడిచింది. లక్ష్మణుడు ఊర్మిళాదేవి యొక్క ప్రేమను తెలుసుకొని తాను కూడా నిద్రాహారాలు మానిన సంగతి తెలిసి హృదయభారాన్ని తగ్గించుకున్నాడు. ఈ విధంగా ఊర్మిళా లక్ష్మణుల దాంపత్య ధర్మం జానపదులు చక్కగా వివరించారు.

శ్రీరాముని పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడు నవ్విన ఘట్టం జానపదుల హాస్యానికి, ఊహాశీలతకు నిదర్శనం. ఆ నిండు కొలువులో

"కలకల నవ్వే లక్ష్మణదేవ రపుడూ, కలతలు పుట్టెనూ కవులందరికీ,
కిలకిల నవ్వే లక్ష్మణదేవురపుడూ కిలకిల నవ్వగా ఖిన్నుడయె రాజూ"

లక్ష్మణుడు అకారణంగా నవ్వాడు. సభలోనివారు కొంత కించపడ్డారు. ఎవరి ఊహకు తగ్గట్టుగా వాళ్ళు కారణాలు ఊహించుకున్నారు. గంగను తలపై మోస్తున్నందుకు నవ్వాడని శివుడు, అన్నను చంపి తను రాజైనందుకు నవ్వాడని విభీషణుడు, అడరాని మాటలాడిన అడవారిని నమ్మరాదని నవ్వాడని జానకి, రావణుని చంపి ఆలిని తొడపై కూర్చోబెట్టుకున్నందుకు నవ్వాడని శ్రీరాముడు అనుకున్నారు. దీనినే చేష్టావ్యంగ్యం అంటారు. సభలోని వారినిట్లా అవమానపరిచినందుకు శ్రీరాముడు తప్పు చేస్తే తమ్ముడిని సైతం వధించవచ్చునన్న ధర్మాన్ని చాటి చెబుతూ లక్ష్మణున్ని ఒరలోనున్న కత్తితీసి చంపబోతాడు. లక్ష్మణుడు రాముని పాదాలపై పడి తాము వనవాసానికి వెళ్ళినప్పుడు సీతారాములు నిద్రించగా కాపలాగా ఉన్న తనని నిద్రాదేవి ఆవహిస్తుంటే తాను ఆ ప్రభావానికి లోనుకాక నిద్రాదేవితో "పో పో మ్మ యోధ్యాపురీ నగరునకు వెగా ధవుని బాసినట్టి సతియుండ....." అని అయోధ్యా నగరంలో తన భార్యయైన ఊర్మిళాదేవి వద్దకు వెళ్ళమని చెప్పాడు. అప్పుడు వెళ్ళి నిద్రాదేవి మళ్ళీ మీ పట్టాభిషేక సందర్భంలో తనను ఆవరించిందని అందుకే నవ్వానని కారణాన్ని వెల్లడించారు. ఈ కారణాన్ని విన్న రాముడి గుండె జారిపోయినది. తమ్ముడు చేసిన త్యాగానికి, నిష్కళంక సోదర ప్రేమకు తన తొందర పాటును గ్రహించి తను తీసిన కత్తితో తానే చంపుకోవాలని చూడగా వసిష్ఠులు మొదలైనవారు అడ్డుకున్నారు. లక్ష్మణస్వామికారోజు పద్నాల్గేండ్ల నిద్ర. రాముడు లక్ష్మణుడి వద్దకు వచ్చి పాదాలు ఒత్తుతున్నాడు.

"మీ అడుగులొత్తెటి ప్రాయమ్ము వాణి
అహల్య పావనమైన అడుగు మీ యడుగు
బలిశిరస్సుననున్న అడుగు మీ యడుగు
మీ యడుగులొత్తుదురు సకలదేవతలు"

ధర్మ నిరతి :

"యథా రాజా తథా ప్రజా" అంటారు. రాజు ఏ విధంగానైతే వ్యవహరిస్తాడో ప్రజలు కూడా అదేవిధంగా వ్యవహరిస్తారు అనేది దీని అర్థం. చాకలి నిందకు తట్టుకోలేక రాముడు సీతను అరణ్యవాసానికి పంపించినట్టు వాల్మీకి రామాయణంలో ఉంది. సీతాదేవిపై నిందమోపి అడవులలో వదిలిన ఘట్టానికి జానపదులు ఓ అందమైన కథను కల్పించారు. అది ఇలా ఉంది. శూర్పణఖ యతి వేషంలో అయోధ్యకు వచ్చింది. రాముడు వేటకు వెళ్ళాడు. సీత ఆ మాయా యతి వేషంలో ఉన్న శూర్పణఖకు గౌరవ స్థానమిచ్చి అతిథి సత్కారాలు చేసింది. కోరిన బహుమతులిస్తానన్నది.

"రావణుపటమూ వ్రాసియిచ్చితే - బ్రతుకుదు నేనీలోకములోను"

ఇలా రావణుడి పటాన్ని రాసిమ్మని మాయాయతి శూర్పణఖ కోరింది. లంకాపురంలో జనకుని స్థానంలో చూసిన రావణుని అంగుళీయకము మాత్రమే చూసానని

దాన్ని పటంలో రాసి ఇచ్చింది. శూర్పణఖ మాయ మాటలచే బ్రహ్మను మెప్పించి ఆ పటముకు ప్రాణం పోయించింది. ఆ పటంలో ఉన్న రావణుని చూసి సీతాదేవిని భయపడింది.

"పటమొచ్చి ముందర నిలుచుండి - రావే పోదము లంకకు ననుచు - సీతను బట్టుకు ఆపదబెట్టెను - జానకి బట్టుక యీడ్వదొడంగెను"

సీతాదేవి తన మంచం క్రింద ఆ పటాన్ని దాచింది. రాముడు తిరిగివచ్చిన తరువాత సీతాసమేతుడై ఆ మంచంలో నిద్రించుచుండగా ఆ పటము రాముడికి ఎదురుపడింది. సీతాదేవిని ఆ కారణంతో అవమానించి రాముడు అడవులకు పంపించాడని జానపదులు చక్కని కల్పనలు చేశారు. జనులు ఏమనుకుంటారో అన్న భయంతో కాక నీతినియమాలను అనుసరించి రాజ ధర్మంగా సీతమ్మతల్లిని అరణ్యవాసమునకు పంపిన తీరు ఊహారమణీయము. భారతం ఏ విధంగానైతే ధర్మజ్ఞులకు ధర్మశాస్త్ర గ్రంధంగా, నీతి విచక్షణులకు నీతిశాస్త్రంగా, పౌరాణికు లకు మహాపురాణ నముచ్చయంగా కనిపిస్తుందో జానపదులు రామాయణాన్ని ఆసాంతం చతుర్విధ పురుషార్థాలైన ధర్మ, ఆ్థ, కామ, మోక్షాలు ప్రతిబింబించే విధంగా వ్రాశారు. వేదాలకు ప్రతిపాదితమైన ఈ పురు షార్థాలను నిత్యజీవితంలో ఏ విధంగా పాటించాలో మన కళ్ళముందు కదలాడే పాత్రల ద్వారా అందరికీ అర్థ మయ్యే విధంగా తెలియజేశారు. శిష్టుల కంటే కూడా సమర్థవంతంగా జానపదులు ఈ చతుర్విధ పురుషార్థ లను సీతారాముడు మొదలైన పాత్రల ద్వారా చెప్పకనే చెప్పారు. సీతారాములు ఈ చతుర్విధ పురుషార్థాలను పాటించి మానవాళికి మార్గదర్శకంగా నిలిచారు. తప్పని సరిగా మన జీవితాన్ని సరైన మార్గంలో నడపటానికి ఈ చతుర్విధ పురుషార్థ లను, ముఖ్యంగా ధర్మాన్ని పాటించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. మానవాళి మనుగడ ధర్మబద్ధం కావడా నికి జానపద రామగాథలు దోహదపడుతున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - డా॥. బిరుదురాజు రామరాజు గారు.
2. తెలుగు జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి.
3. వాల్మీకి రామాయణం.
4. రామాయణం - స్త్రీల పాటలు.
5. రామకథా సుధార్ణవము - లాడె సుందరనారాయణ.
6. సూక్ష్మ రామాయణం - ఆది నారాయణదాసు.

❖ ❖ ❖

మోక్షపథసోపానం ధర్మం

– డా॥. ఒళిభన్ని శ్రీలత, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో మానవుని జీవన విధానం పూర్తిగా మారిపోతుంది. మనిషి అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నానని అనుకొంటున్నాడు. కానీ అదే సమయంలో నైతికంగా, ఆధ్యాత్మికంగా దిగజారు తున్నాడు. భోగలాలసకు, ధనవ్యామోహానికి లోనయి, వాటి సాధనకు అనేక అధర్మమైన పనులు చేస్తున్నాడు. అందువలన సమాజ అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ రకమైన పరిస్థితిలో మార్పు రావాలంటే నేటి సమాజంలో మనిషి ఆలోచనా విధానంలో మార్పు తప్పనిసరిగా రావాలి. మనిషి వ్యక్తిత్వంలో పరివర్తన అన్నది కలగాలి.

ఇటువంటి సమస్యను గుర్తించే మన వేదాలలో ఇతి హాశాలలో పురాణాలలో మనిషి ధర్మబద్ధమైన జీవన విధా నంలో జీవించడానికి కావలసిన చతుర్విధ పురుషార్థ లయిన ధర్మార్థ, కామ, మోక్షాలను ఎలా సాధించుకోవాలో చెప్పారు. రామాయణంలో శ్రీరాముడు, సీతమ్మ తల్లి, భారతంలో శ్రీకృష్ణుడు, ధర్మరాజు మొదలగు మహాను భావులు ఆదర్శవంతమైన జీవన విధానాన్ని వారు ఆచ రించి సమాజానికి చూపారు.

మనకి రాముణ్ణి మూర్తీభవించిన ధర్మానికి ప్రతి రూపంగా "రామో విగ్రహన్ ధర్మః" అంటారు. రాముడు ఒక సాధారణ మానవునిలా జీవించి ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మ మార్గాన్ని తప్పకుండా జీవనం సాగించి, ఒక ఆదర్శ వంతమైన కొడుకుగా, అన్నగా, భర్తగా, రాజుగా ఇలా అన్ని రకాలుగా సమాజానికి ఆదర్శంగా నిలిచారు. అందు వల్ల రామాయణ, మహాభారతాలను చదవడం ద్వారా జీవితంలో చతుర్విధ పురుషార్థాల ప్రాశస్త్యం తెలుస్తుంది. అటువంటి చతుర్విధ పురుషార్థాలలో ధర్మం యొక్క గొప్పతనాన్ని గురించి నేను నా యీ ప్రస్తుత వ్యాసంలో చర్చిస్తాను.

ఉండేలా మాలకొండారెడ్డి గారు ధర్మం మార్గంలో జీవన విధానం గురించి చెపుతూ అందరూ ధర్మమార్గంలో నడచినప్పుడే ఆనందంగా ఉంటారని చెపుతూ.....

నరుని గీత మీద నడుచును పొగబండి
జాత నడుచు, ఋషుల గీత మీద
గీత దాటిరేని కీడు రెడింటికి
మనసు విప్పి వినుము మంచిమాట

ఈ ప్రపంచంలో ప్రతీ జాతికీ ప్రతీ మతానికీ వారి వారి సాంప్రదాయాల ప్రకారం వారికి ఒక ధర్మశాస్త్రం ఉంటుంది. ఆ ధర్మశాస్త్రంలో చెప్పబడిన నీతి నియ మాలు లేదా వారు ఆచరించే మత గ్రంథాలు చెప్పే నియమాలు వారు అనుసరిస్తారు. అలా కాకుండా వారి ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే జీవితం నాశనమవుతుంది. కవి పద్యంలో చెప్పినట్లుగా రైలు పట్టాలు అనేవి రైలు వెళ్లడానికి వేయబడ్డాయి. ఆ పట్టాల మీద వెళ్తేనే రైలు గమ్యం చేరుతుంది. అలా కాకుండా ఆ పట్టాలు తప్పి పోతే, రైలు తిరగపడి ప్రమాదం సంభవిస్తుంది.

ఈ పద్యంలో చెప్పినట్లు చతుర్విధ పురుషార్థాలలో ధర్మాన్ని గురించి చెప్పినప్పుడు వేదాలు, ఇతిహాసాలు, ఆయా మత గ్రంథాలలో చెప్పినవి అందరూ ఆచరించక పోవడం వలనే నేడు అనేక సమస్యలు వస్తున్నాయి. నేటి మానవుడు చిన్నతనం నుండి ఈ వేదాలు, పురాణాల సారాన్ని అలవరచుకొని ధర్మమార్గంలో వెళ్ళాలి.

మహాభారతంలో ధర్మ ప్రాశస్త్యం గురించి విదుర నీతిలో చెపుతూ.....

సారపు ధర్మమున్ విమల స్యము బాపము చేత బొంకుచే
బారము బొందలేక చెడబారినదైన యవస్థ దక్షులే
వ్వార లుపేక్షసేసిరది వారలచేగటు గాని ధర్మని

స్తారకమయ్యు సత్య శుభదాయకమయ్యును దైవ
ముండెడున్.

పాపాలు చేయడం వలన ధర్మానికి, అబద్ధాలు ఆడడం వలన సత్యానికి హాని కలుగుతుంటే సమర్థులు చూస్తూ ఊరుకుంటే అది వారికే హాని కలుగుతుంది. కానీ ధర్మాన్ని కాపాడడానికి, సత్యాన్ని కాపాడి శుభాలను కల్గించడానికి దైవమున్నదన్న విషయం మరువకూడదు.

ఇల్లు కాలుతుంటే కళ్ళప్పగించి చూడడం నేరం అనే సామెత మనకందరికి తెలిసినదే. నేటి సమాజంలో అనేకమంది కేవలం డబ్బు సంపాదించడమే పరమావధిగా పెట్టుకొని అనేక అరాచకాలు చేస్తున్నారు. అధర్మ మార్గాలలో పయనించి చివరికి జీవితాన్ని దుఃఖ సాగరంలోకి స్వయంగా వారే నెడుతున్నారు. అదేవిధంగా అసత్యాన్ని పలుకుతూ అనేక దుర్మార్గాలు చేస్తున్నారు. సాధారణంగా కోర్టుల్లో చూస్తుంటాం, దొంగ సాక్ష్యాలు చెప్పింది, అన్యాయంగా తప్పు చేసి కూడా బయట తిరుగుతున్న వారిని చూస్తున్నాం. అదేవిధంగా ఏ తప్పు చేయపోయినా దొంత సాక్ష్యానికి బలైన వారు సమాజంలో నిత్యం కనిపిస్తునే ఉన్నారు. కాబట్టి ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవారుకోవాలి.

మహాభారతంలో విదురనీతిలో నిజమైన ధర్మబద్ధమైన జీవన విధానం గురించి చెపుతూ.....

ఒరు లేయవి యెనరించిన
నరవర! యప్రియము దనమనంబునకు దా
నొరులకు నవి సేయకునికి
పారాయణము పరమధర్మపథముల కెల్లన్.

ఇతరులు ఏం చేస్తే మనకు బాధ కలుగుతుందో అది ఇతరులకు చేయకుండా ఉండడం పరమోత్తమైన ధర్మము. అన్ని ధర్మశాస్త్రాల సారాంశమిదే అని భావము.

తిక్కన గారు ఒక్క పద్యంలో జీవిత పాఠాన్ని వివరించారు. అందుకే ''యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి నతత్ క్వచిత్'' అన్నారు. అంటే మహాభారతంలో ఏదైతే ఉన్నదో, బయట అదే ఉన్నది. మహాభారతంలో లేనిదేదీ బయట లేదు అని అర్థము. ఈ పద్యానికి తగ్గట్టుగా ఒక మనిషి సంపూర్ణ వ్యక్తిత్వ వికాస నిర్మాణానికి ఈ ఒక్క పద్యము చాలు. ఒకరి వలన శారీరకంగా, మానసికంగా మనం బాధపడినప్పుడు, ఆ బాధ మనం అనుభవించినప్పుడు, మన ద్వారా ఆ బాధ ఇతరులకు కలగకూడదు అని మనం అనుకొనప్పుడు ఆ మనిషి పరిపూర్ణమైనవంతుడవుతాడు.

కానీ దురదుష్టవశాత్తు నేటి సమాజంలో కత్తిని కత్తితోనే తీయాలి, ముళ్ళును ముళ్లుతోనే తీయాలి అన్న సిద్ధాంతం ఉపయోగించడం వలన మనిషి అధర్మ మార్గంలో కూరుకొనిపోతున్నాడు. మన సనాతన వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు ఇదే నిజమైన ధర్మమని చాటాయి. కాబట్టి ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవరచుకొనే క్రమంలో ఈ పద్యం యొక్క సారాన్ని జీవితంలో అలవరచుకుంటే సరిపోతుందని చెప్పడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా మహాభారతంలో విదుర నీతిలోనే ఎవరు ధర్మజ్ఞుడు అన్నదానికి మరొక పద్యంలో కూలంకషంగా వివరిస్తూ.....

అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మరి విననియట్ల ప్రతివచనంబుల్
వలుకక బన్నమువడి యెద
దలపక యున్న తడ చూవె ధర్మజ్ఞుడిలన్.

ఒకరు కోపగిస్తే కోపగించని వాడు, ఒకరు దూషిస్తే, ఆ దూషణ వాక్కులు విననియట్లుండి తిరిగి దూషించని వాడు, తాను భంగపాటు చెందిన కూడా ఏమాత్రం బాధపడనివాడు ధర్మజ్ఞుడని ఈ పద్య భావము.

ఎవరు ధర్మబద్ధమైన జీవనం గడుపుతాడో వాడు ధర్మజ్ఞుడు. సాధారణంగా భౌతికశాస్త్రంలోని చర్యా ప్రతిచర్యా సిద్ధాంతం వలె మనకు ఎవరైనా దూషించాలి, ఎవరినా అవమానిస్తే అవమానించాలని అనుకొంటాము. కానీ అది పద్ధతికాదు. కానీ ధర్మజ్ఞుడు అన్నవాడు కోపతాపాలకు అతీతంగా ఉంటాడు. ఉదాహరణకు రామ

యణంలో శ్రీరాముడు, మహాభారతంలో ధర్మరాజు మొదలకు వారు ధర్మజ్ఞులుగా కనిపిస్తారు.

అదేవిధంగా మహాభారతంలో ధర్మమార్గాన్ని గురించి చెపుతూ.....

తగిన వేషంబు దను దాన పొగడకొనమి
నొచ్చియును గీడు పలుకమి యిచ్చి వగవ
కునికి, దనకెంత నడవకయున్న పథము
తప్పకుంటుట నడవడి కొప్పు సేయు.

పై పద్యంలో ఎవరి పనివారు సక్రమంగా నిర్వర్తించాలి, తనను తాను పొగుడుకోకుండా ఉండాలి. అవమానం పొంది కూడా తిరిగి దూషించకుండా ఉండాలి. దానం చేసి అందుకు విచారించకుండా ఉండాలి. జీవితంలో తనకెన్ని ఎదురుదెబ్బలు తిన్నా ధర్మపథం తప్పకుండా ఉండడం నీతిమంతుని లక్షణాలుగా చెప్పారు.

నేటి సమాజంలో చూస్తున్నాం, ఎవరి పనివారు సక్రమంగా చేయకపోవడమే అనేక సమస్యలకు కారణం అవుతుంది. ఒక బాధ్యతమైన పదవిలో ఉన్న వ్యక్తి తన పరిధిలో ఉన్న వాటిపై దృష్టి పెట్టాలి కాని, తనకు సంబంధంలేని విషయాల జోలికివెళ్ళకూడదు. మనల్ని మనం పొగుడుకోకూడదు. ఆంగ్లంలో ఒక సామెత ఉన్నది గొప్పవారు వారి గురించి వారు చెప్పకోరు, సమాజం వారి గొప్పతనం చెపుతుంది. అందువల్ల అబ్దుల్ కలాంని భారత క్షిపణి పితామహుడిగా మనం కీర్తిస్తున్నాము కానీ తాను తన గొప్పతనం గురించి ఎక్కడా చెప్పకోలేదు.

అదేవిధంగా ఏదైనా దానం చేసినప్పుడు దాని గురించి మర్చిపోవాలి. గతం గతః అన్నారు పెద్దలు. అంతేకానీ ఒక వస్తువు లేదా డబ్బు లేదా మరేదైనా దానం చేసిన తర్వాత ఎందుకు దానం చేశాను అని దాని గురించి తిరిగి ఆలోచించకూడదు. అలాగే జీవితంలో ఎన్నో కష్టాలు వస్తాయి. శ్రీరాముడు వంటి ధర్మస్వరూపులకే ఎన్నో కష్టాలు పడ్డారు. శ్రీరాముడు ఒక సాధారణ మనిషిగా వాటికి ఎదురు నిలిచి ఆదర్శవంతమైన జీవనాన్ని సమాజానికి చూపారు. ఆ విధంగా ఎన్ని కష్టాలు వచ్చినా మనం నీతి తప్పి అధర్మమార్గంలో వెళ్లకూడదు.

భర్తృహరి సుభాషితాలలో సజ్జనుడికి ఉండే సహజ గుణాల గురించి చెపుతూ.....

ఆపదలందు ధైర్యగుణ మంచిత సంపదలందు దాల్మియున్
భూపసభాంతరాళమున బుష్కలవాక్చాతురత్వ, మాజి బా
హపటుశక్తియున్, యసమునం దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్ బ్రకృతి జన్య గుణంబులు సజ్జనాళికిన్.

ఈ పద్యంలో సజ్జనుని సహజ గుణాలు గురించి చెపుతూ ఆపదలందు ధైర్యగుణం కలిగి ఉంటారు, సమస్యలు వచ్చినప్పుడు ఓర్పుగానే ఉంటాడు. రాజసభలో వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తాడు. యుద్ధంలో భుజశక్తిని కలిగి ఉంటాడు, కీర్తిపై కోరిక కలిగి ఉంటాడు, విద్యను నేర్చుకోవాలన్న ఆశ కలిగి ఉంటాడు.

ధర్మమార్గంలో వెళ్ళేవాడు ఆపదలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొంటాడు. మహాభారతంలో పాండవులు ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మమార్గాన్ని నమ్ముకొన్నారు కానీ బాధపడలేదు, భయపడలేదు. అదేవిధంగా సంపదలు వచ్చినప్పుడు ఓర్పు కలిగి ఉండడం అన్నది నేటి సమాజంలో అందరిలో కనిపించడం లేదు. చిన్నయసూరి నీతి చంద్రికలో సంపదలు ''తటి చంచలంబులు'' అంటాడు. అంటే ఆకాశంలో మెరిసే మెరుపుతో సమానమని అర్థం.

అంటే మెరుపు ఒకసారి వచ్చి పోయినట్లుగా సంపదలు కూడా ఒకసారి వస్తుంటాయి. పోతుంటాయి. కానీ అవి ఉన్నప్పుడు, లేనప్పుడు మనిషిఎలా ఉన్నాడన్నది చలా ముఖ్యమైన విషయం. రామా యణంలో నార వస్త్రాలు కట్టుకొని కందమూలాలు తిన్నాడు, రాముడు

ధర్మజ్ఞుడు కాబట్టి రెండూ ఒకే విధంగా తీసుకొన్నాడు. నేటి సమాజం కూడా అలా తీసుకొన్నప్పుడే జీవితంలో స్థిరచిత్తంతో నిలబడగలము.

సభలో సభికులు నచ్చినట్లుగా మాట్లాడగలిగే నేర్పు ఉండాలి. యుద్ధంలో భుజబలం చూపాలి. రాముడు ఎంత శాంతగుణం కలవాడు అయినా యుద్ధంలో పాల్గొన్నప్పుడు భుజబలాన్ని చూపాడు. రాజుకి యుద్ధం చేయడమన్నది క్షత్రియ ధర్మం. కాబట్టి నేటి మానవునికి కూడా మనం భుజ బలం చూపే సమయం వచ్చినప్పుడు ధైర్యంగా పోరాడాలి. సజ్జనుడికి విద్య యందు కోరిక కలిగి నిరంతరం కొత్త విషయాలు నేర్చుకోవాలను కొంటాడు. అదేవిధమైన కోరిక అందరికీ ఉండాలి. ఈ విధంగా ధర్మజ్ఞుడు ఏ విధమైన ఉత్తమ గుణాలు కలిగి ఉన్నాడో అదేవిధమైన గుణాలు అందరూ నిజజీవితంలో పాటించి ఉత్తమ జీవనం విధానాన్ని అలవర్చుకొని జీవించాలి. చివరిగా చతుర్విధ పురుషార్థాలను చిన్నతనం నుండి పిల్లలకు చెప్పాలి. పూర్వం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు ఇంటి దగ్గర నాన్నమ్మ, అమ్మమ్మ, వంటి వారు పిల్లలకు ఈ చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ, కామమోక్షాల గురించి చెప్పి, వీటిని పాటించడం వలన జీవితంలో ఏ విధంగా ఉత్తమ సంస్కారవంతులుగా తయారవుతారో చెప్పేవారు. నేడు పరిస్థితి మారిపోయింది ఎవరికి వారే ఎమునా తీరే అన్న విధంగా ఉంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అయ్యాయి. ఇంటి దగ్గర అమ్మ, నాన్న వారు వారి పనుల్లో వారు ఉండడం వలన వారు పిల్లల మనస్తత్వాన్ని పట్టించుకోకపోవడం బాధాకరం, అందుకే పూర్వం కన్నా ఇప్పుడు నేరాలు పెరిగిపోవడానికి ఇది ఒక కారణమన్న విషయాన్ని మరువకూడదు. ఆకాశ హర్మ్యాలు వంటి భవంతులు, మనిషిని పోలిన మనుసులు రోబోలు సృష్టించడం ఇదే మానవాభివృద్ధి అనుకొంటే చాలా పొరపాటు. మనిషి మనిషిగా, మానవత్వ ఉన్న మనిషిగా మరి ఈ చతుర్విధ పురుషార్థాలను జీవితంలో ఆచరించి ఉత్తమ మానవులుగా మారాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆంధ్ర మహాభారతం - కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎఱ్ఱన) తిరుమల తిరుపతి దేవస్థానం.
2. శతక మంజరి - నవోదయ బుక్ హౌస్.
3. తెలుగు జాతి వివేకం - సంకలనం, డా॥. ఉండేలా మలకొండారెడ్డి.
4. తెలుగు యువత - వ్యాస సంకలనం, - 3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు, విజయవాడ.

❖ ❖ ❖

ఆచంట శారదాదేవి కథల్లో ధర్మార్థ కామ మోక్షాలు

– డా॥. సూర్యకాంతి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, అరోరా'స్ డిగ్రీ & పీజీ కళాశాల, హైదరాబాదు.

రవీంద్రనాథ్ ఠాగూర్, దేవులపల్లి కృష్ణశాస్త్రి, చెహూన్, కాథరీన్, మాన్స్‌ఫీల్డ్‌లను అభిమానించే ఆచంట శారదాదేవి కథలలో ఒక విషాదపు జీర అలుముకుని ఉంటుంది. ప్రకృతి ఆస్వాదన, సంగీతం పట్ల అభిరుచి ఎవరినీ నొప్పించని సున్నితత్వం ఉన్న పరిస్థితుల్లోనే ఏదో ఒక ఉపశాంతిని కనుక్కుని జీవితాన్ని నడుపుకోవడం, కొంత మానసిక విశ్లేషణ. ఆమె రచనల్లో ముఖ్యాంశాలుగా ఉంటాయి. స్త్రీల జీవితాలలో జెండర్ పాత్రని గుర్తించడం ఉన్నా, దాన్ని ఎదిరించలేని పాత్రలు... ప్రేమా ఆరధనలకు ప్రాముఖ్యం. లోకం పోకడ, కొన్ని తాత్వికమైన ఆలోచనలను, అనుభవాలను, హాయిగా చదువుకుపోయే లలితమైన శైలిలో వ్రాస్తారు.

1950ల మొదలుకొని విరివిగా వ్రాసిన ప్రసిద్ధ కథా రచయిత్రులలో శారదాదేవి ఒకరు. "పగడాలు", "ఒకనాటి అతిధి", "అమ్మ", "మరీచిక", "అడవిదాగిన వెన్నెల", ''పారిపోయిన చిలుక'', ''మారిన మనిషి'' వంటి ప్రాచుర్యం పొందిన కథలతో కలిసి దాదాపు వంద కథలు వ్రాసి ఉంటారు. ఆరు కథా సంపుటాలు వెలువరించారు. అన్నీ అన్నీ కలిపిన ఒక సమగ్రమైన సంకలనం వెయ్యి నందున ఇప్పుడు ఆ సంపుటాలలో కొన్ని మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొదటి కథ 1945లో చిత్రాంగి అనే పత్రికలో వ్రాశారు.

ఆమె వ్రాసిన కథలన్నింటిలోకి "పారిపోయిన చిలుక" అనేది అద్భుతమైన కథ. అందులో శిల్పం తాత్వికత, వర్ణన, వస్తువు జంత్రగాత్ర విద్యాంసుల స్వర సమ్మేళనంలా కలిసిపోయి ఉంటాయి. ఇది కామాక్షమ్మ కథ...., యువతలకుండే జీవనాకాంక్షలన్నీతో కళకళలాడుతూ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. సామాన్య కుటుంబంలో పుట్టిన కామాక్షమ్మ థర్డ్ ఫారం (ఎనిమిదో తరగతి) వరకే చదువుకుంది. తన స్నేహితురాలిలా తనకు కూడా ఒంటినిండా నగలుంటే బావుండును అనుకుంటుంది. కుటుంబ పరిస్థితుల వాళ్ళ ఆమెకు పరిహానేళ్ళ వయస్సులో ముప్పై ఏళ్ళ సుందర్‌రావుతో పెళ్ళి కుదురుస్తున్నప్పుడు "వంటి నిండా నగలు పెడతారా?" అని తల్లినడిగింది. పల్లెలో మామిడితోటా ఇల్లూ వాకిలీ నౌకర్లూ, చాకర్లూ ఉన్న సుందర్‌రావుకి భార్యగా ఆ ఇంట్లో అడుగు పెట్టిన కామాక్షమ్మ త్వరలోనే అతని వస్తు సముదాయంలో తనూ ఒకతేననీ అతనికీ, తనకీ మధ్య ప్రేమ అటుంచి కనీసం భావ ప్రసారం కూడా లేదనీ, అంత ఇంట్లో తనకి మానవ స్పర్శ కరువైందనీ తెలుసుకుంది. అతను రోజూ దగ్గరున్న బస్తీకి పొద్దున వెళ్ళి రాత్రికొస్తాడు. వచ్చాక కూడా ఆమెతో మాట మంతీ లేదు. ఆమె పలకరించినా వెళ్ళి రేడియో వినమంటాడు. అతని వ్యాపకాలు అతనివి. కనీసం అతను రోజూ బస్తీకి వెళ్ళి చేసే వ్యాపారమేమిటో కూడా ఆమెకి తెలియదు. ఆమెకి చెప్పవలసిన అవసరం అతనికి లేదు. అంత వంటరి తనంతో ఉన్న కామాక్షమ్మకి ఒకనాడు గాయపడ్డ చిలుక దొరికింది. దాన్ని దగ్గరకు తీసి పంజరంలో పెట్టి చిన్నారి అని పేరు పెట్టుకుని దాని పోషణలో దానికి మాటలు నేర్పడంలో ఆనందం వెతుక్కుటుంది. కానీ ఒకనాడు పొరపాటున పంజరం తలుపు తీసిపెడితే చిలుక పారిపోయింది. ఆమె దిగులు పడింది. మళ్ళీ వసంతం వచ్చి మామిడి చెట్లు పూతకి రాగానే చిలుకలు తోటలోకి వస్తున్నాయి. ఒకదాన్ని పట్టి తెచ్చి పంజరంలో పెడతానని తోటమాలి అంటే కామాక్షమ్మ వద్దంటుంది. వాటిని స్వేచ్ఛగా వచ్చి తోటలో తిరిగి పోనిమ్మని వాటిని చూడడంలోనే ఆనందం ఉందనీ అంటుంది. పంజరంలోని చిలుకకూ, తనకూ పోలిక అర్థం అయినా అలా ఎగిరిపోవాలన్న కోరిక ఆమెకి లేదు. స్నేహరాహిత్యం

ఆమెను బాధించిన విషయం కథనం అద్భుతంగా ఉంటుంది.

చాలా కథా సంకలనాలలో చేర్చబడి బహుళ ప్రాచుర్యం పొందిన కథ "పగడాలు'... కథ. అడుకుంటూ పడేసుకున్న పగడాల దండ తీశాడన్న అభియోగంతో ఇంటి ఎదురుగా ఉండే ముసలి లక్ష్మన్న తాతనూ అతని మనువరాలు సీతనూ అనుమానించి పోలీసుల్ని కూడా పిలుస్తారు. వాసంతి తల్లిదండ్రులు. ఆ దండ ఖరీదుకి డబ్బివ్వమంటారు. దండ ఖరీదు ఇవ్వలేని తాత తన దగ్గరున్న పదమూడు రూపాయలూ ఇచ్చి దణ్ణం పెడతాడు. కానీ చివరికి పగడాలు, చివరికి పగడాలు, బీరువా కింద దొరికాక కూడా ఆ విషయం అతనికి చెప్పి డబ్బు వాపస్ ఇవ్వకపోగా ఆ విషయాన్ని గుట్టుగా ఉంచడం చిన్నారి వాసంతిని బాధ పెట్టింది. పెద్దల పట్ల భయ భక్తుల వల్ల ఆ విషయాన్ని అలాగే దిగమింగుకుంది. తరువాత వాసంతిని సీతతో ఆడడానికి పోనివ్వలేదు. వాళ్లని దూరం నుండే చూస్తూ ఉండేది. వివాహమై ఒక బిడ్డకు తల్లి అయినాక పుట్టింటికొచ్చిన వాసంతికి ఆ విషయాలన్నీ గుర్తుకురావడంగా కథ మొదలౌతుంది. అప్పటి ఆటపాటలు ఆనాటి ఇంటి వాతావరణం. లక్ష్మన్న తాత మనవరాలు సీతతో తన ఆటలు, పోలీసు రిపోర్టు తాత తన దగ్గరున్న డబ్బు అంతా ఇచ్చెయ్యడం అన్నీ గుర్తొస్తాయి. వాళ్ళేమయ్యారని తల్లిని అడుగుతుంది. ఆవిడ స్వభావం ప్రకారం అదంత ముఖ్యవిషయం కాదన్నట్లు ముఖం చిట్లించుకుంటూ మాట్లాడుతుంది. ఆ పగడాలు ఇంకా వాసంతి మెడలోనే ఉన్నాయి. అవి గుండెల్లో కొట్టుకున్నాయి. గుండెల్లో గుచ్చుకునే ఆ పగడాలని ఆ చేదు జ్ఞాపకాలనీ ఆమె ఎందుకు మోస్తోందో తెలీదు. చెప్పింది వినడమే పద్ధతిగా పెరిగిన వాసంతి, ఆ పగడాలని అలా గుచ్చుకున్నా ఉంచుకోవాలనుకుని ఉండవచ్చు. పిల్లలలో చిగురించే స్పందనలను పెద్దల లౌక్యం కబలించడం సహజమే పెద్దదై బిడ్డ తల్లి అయిన వాసంతి ఆ పెంపకపు నీడనించీ బయటకి రాకపోవడం ఒక కారణం కావచ్చు.

ఇవికాక ఇతర అంశాలను స్పృశించిన కథల్లో చెప్పుకోదగ్గది. "కారుమబ్బులు". ఒకే ఆఫీసులో పనిచేసే యువతీ యువకులిద్దరు పరిచయం పెరిగి ఇష్టపడి పెళ్ళిచేసుకుని కలిసి మెలిసి కాపురం చేసుకుంటూ ఉండగా భార్యకి ప్రమోషన్ వచ్చింది. ఆమె తన కొలీగ్స్‌కు పార్టీ ఇస్తే ఇతను వెళ్ళడు. ఆ క్షణం నుంచీ అతని ప్రవర్తనలో మార్పొచ్చింది. అతను ఆత్మన్యూనతతో బాధ పడుతున్నాడని గ్రహిస్తుంది. అతను అక్కడ రాజీనామా చేసి వేరే ఉద్యోగం చేసుకుంటానంటే ఆమె రాజీనామా చేసి అతన్ని సంతోష పెడుతుంది. అతని మనసుకి పట్టిన మబ్బు విడిపోయింది కానీ ఆమె ఇప్పుడు అతనికి అంత సన్నిహితంగా మెలగలేకపోయింది. తన ప్రమోషన్‌ని సహించలేకపోయిన అతని సంకుచితత్వం గుర్తొస్తూ ఉంటుంది. ఆ మబ్బేదో తనని ఆవరిస్తున్నదని అనిపిస్తుంది. కానీ తన ప్రవర్తనకు తనే నవ్వుకుని అందులో నుంచీ బయటకి రావాలనుకుటుంది. ఉదాత్తంగా ప్రవర్తించడం స్త్రీలు అలవాటు చేసుకోవాలి కదా! "అందం" అనే కథలో మాలతి అందమైన స్త్రీ పసితనం నుంచీ ఆమె అందం అందరినీ ఆకర్షించేది. అది ఆమెను ఒక్కొక్కసారి చాలా చికాకు పెట్టేది కూడా. చిన్నప్పుడు బుగ్గలు పునకడం, కౌగిళ్ళలో బంధించడం వంటివి. రాను రాను ముసలి వాళ్ళు కూడా తినేసేలాగా చూడ్డం అబ్బాయిలు వెంటపడ్డం ఇవ్వన్నీ స్త్రీల సహజ అనుభవాలే. అట్లాగే తోటలో అందంగా పూసిన పూలను తెంచేదాకా కొంత మందికి తోచదు. చెట్టునుంటే కళ్ళకీ మనసుకీ ఆనందం కలిగించే పూలను తెంపి ఒక్కక్షణం ఆనందించి పడెయ్యడమూ అంతే సహజం. మాలతి అందం చూసి ముగ్ధుడైన జడ్జిగారబ్బాయి ఆమెన కోరి వృద్ధాప్యంలోని ఒంటరి తనంలో ఒక స్నేహం కోసం ఆశపడి, జీవనోత్సాహం నసించిపోకుండా కాపాడుకోవడం కోసం "బిందువు" కథలో రంగాజమ్మ దేవయ్యతో స్నేహం చేస్తుంది. "అమ్మ" అనే కథలో ఒకమ్మాయి తన తల్లి అమిత తెలివైందీ, చురుకైందీ అని అందరికీ చెప్పి నమ్మిస్తుంటుంది. నిజానికి

ఆమెకు అసలు తల్లి లేదు. ఈ ''డెల్యూజన్'' ఆ అమ్మాయికి కొంత ఉపశమనాన్ని కలిగిస్తుంది. దాన్ని ప్రశ్నించకుండా ఆమె నాలా బ్రతకనివ్వడమే ఆమెకు చేయగల ఉపకారం అంటుంది రచయిత్రి. ఇట్లా మానసిక వైచిత్రుల మీద శారదాదేవి మరికొన్ని కథలు కూడా వ్రాశారు. అడవి దాగిన వెన్నెల కథలో తపతి, సవతి తల్లి వలన అనేక బాధలు పడుతుంది. ఆమెని నిలువరించలేని తండ్రి తపతిని వేరే ఊరు రహస్యంగా తీసుకువచ్చి రామలక్ష్మి కూడా స్వతంత్రురాలు కాదు. ఆమె మనుగడ కోసం గోవిందయ్య చెప్పుచేతల్లో ఉంది. గోవిందయ్య కన్ను తపతిపై పడ్డం రామలక్ష్మిని కలత పెట్టింది. గోవిందయ్య కంటపడకుండా ఒక రాత్రి ఇంటి వెనుక అడవిలో దాక్కున్న తపతి అక్కడే మరణించింది. మరొక కథలో మధ్యతరగతి జడత్వం ఉదాసీనతలు ఎన్ని నష్టాలకు వేదనలకు కారణమౌతాయో చక్కగా చెప్పారు. మొత్తం మీద శారదాదేవి కథల్లో ఆవేశం ఉండదు. ఆత్మశోధనతోనో ఇతరుల బోధతోనో అధ్యయనం అనుభవాల ద్వారానో చైతన్యం పొంది కార్యాచరణకు సిద్ధపడే పాత్రలూ తక్కువే... ఉన్నస్థితిలోనే ఒక ఉపశాంతిని వెతుక్కుని దాన్ని రేషనలైజ్ చేసుకునే పాత్రలే ఎక్కువ కనపడతాయి. ఒక ''చందమామ'' అనే కథలో మాత్రం ప్రధానపాత్ర భర్త వేధింపు మాటలు పడలేక బిడ్డను తీసుకుని పుట్టింటికొచ్చింది. వేధింపు మాటలు ఆపినాకే తిరిగొస్తానంటూ అందుకోసం ఎదురుచూస్తుంది. శారదాదేవి గారి కథల్లో తండ్రులందరూ చాలా మంచి వాళ్ళు... ఆడపిల్లల్ని ప్రేమగా అక్కున చేర్చుకునేవాళ్ళు.

1922లో జన్మించిన శారదాదేవి గారిది అసలు విజయవాడ. మద్రాస్‌లోని విమెన్స్ క్రిష్టియన్ కాలేజీ లోనూ ప్రెసిడెన్సీ కాలేజీలోనూ చదివారు. 1954 నుంచీ 77 వరకూ తిరుపతి పద్మావతీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆచంట జానకిరామ్ గారిని వివాహం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. 1999లో మరణించారు.

❖❖❖

'కరుణ' చూపని 'ప్రసన్న' – 'ప్రసన్న'త చూపిన 'కరుణ' – 'శిశిరనంతరవేళ'లో 'సుందరం'

– **యుద్ధనపూడి దీప్తి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

'శిశిరానంతరవేళ' కథారచయిత్రి సాయిపద్మ. విజయనగరం జిల్లా గజపతినగరం సొంత ప్రాంతం. మార్చి 10, 1972లో పుట్టారు. సామాజిక కార్యకర్తగా చురుగ్గా పనిచేస్తున్నారు. ఆదివాసీ, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు నడుపుతున్నారు. భర్త ప్రజ్ఞానంద్‌తో కలిసి వికలాంగులు, వృద్ధుల కోసం గ్లోబల్ ఎయిడ్ అనే సంస్థ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. "శిశిరానంతరవేళ' ఈవిడ రాసిన మూడవ కథ. ఈ కథ 'సారంగ' అంతర్జాల పత్రికలో జులై 2013న ప్రచురించబడింది.

'శిశిరనంతరవేళ' శీర్షికలోనే ఇతివృత్తం దాగి ఉంది. శిశిరంలో ఏం జరుగుతుందో అందరికీ తెలిసినదే... ఆకుల్ని రాల్చేసి చెట్లన్నీ మోడువారిపోతాయి. అంతటితో అయిపోయిందనుకుంటే అదే పొరపాటు. ఆ తరువాతే మొదలవుతుంది అసలు కథ.... రెండు చినుకులు పడగానే మోడువారిన చెట్లన్నీ చిగురించడం మొదలుపెడతాయి. అద్భుతమైన అందాల్ని రంగరించుకుంటూ మునుపటి కంటే కళాత్మకంగా కనిపిస్తాయి. ఆపై కథ మనకి తెలియంది కాదు... పచ్చని ఆకులు, విరబూసిన పూపులు, లేత పూతలు, పిందెలు, కాయలు, పండ్లు... అద్భుతం కదా!!

'పడినచోటే ఉండిపోతే పరుగు విలువ ఏం తెలుస్తుంది. ఓటమే వెంటపడకపోతే విజయం ఎలా వరిస్తుంది'. పడాలి, లేవాలి, ఓడాలి, గెలవాలి ఆపైన తలెత్తుకు నిలబడాలి. నమ్మిన వాళ్ళు వంచిస్తే ఆ వంచనకు ఎదురీది మనదైన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలి. ఈ అంశాన్ని తీసుకుని రాసిన ఈ కథ శిశిరంలో ఉన్న జీవితాలకు దిక్సూచి అవుతుంది.

తన ప్రమేయం లేకుండా పోలియో వల్ల అవిటివాడిగా మారిపోయిన సుందరం ఈ కథలో కథానాయకుడు. ప్రేమించిన వాడు మనసును కాక శరీరాన్ని వాడుకుని మోజు తీరాక ఆ శరీరాన్ని వేశ్యాగృహాలకు అమ్మివేస్తే చేసేది ఏం లేక అక్కడే వేశ్యగా మిగిలిపోయి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్న కరుణ ఈ కథలో కథానాయకురాలు. సత్తి, సుందరం స్నేహితుడు. ప్రసన్న సుందరం భార్య. ఈ నలుగురి మధ్య సాగే కథే 'శిశిరానంతరవేళ'.

విధి వంచితులని, విధి ఆడే వింతనాటకంలో పావులని, విధికి బలైపోయారని నలుగురు అంటుంటే ఆ మాటలు విని నిస్సహాయంగా మా బతుకులు ఇంతే అని అనుకోకుండా బ్రహ్మ రాతల్ని మన బతుకుల్ని మార్చుకోవాలంటే అది మన చేతులోనే ఉంటుంది అని తెలియచెప్పే కథ ఇది. అవమానాలు, ఛీత్కారాలు, ఛీదరింపులు ప్రతి మనిషి జీవితంలోనూ ఉంటాయి కాకపోతే ఒక్కొక్కరిది ఒక్కో కోణం. అంతమాత్రానే జీవితపు చరమాంకాన్ని చేరుకుంటే...? సమయాన్ని బట్టి మనల్ని మనం మార్చుకోవాలి. ఒక్కసారి సమాంతర రేఖలమవ్వాలి. ఒక్కోసారి వక్రరేఖలై పెనవేసుకుపోవాలి.

కథ చివరిలో.... వేశ్యావృత్తిలో ఉన్న కరుణని పెళ్లి చేసుకుందామనుకుంటున్న సుందరాన్ని ప్రశ్నించిన స్నేహితుడు, సత్తితో సుందరం అనే మాటలు ఈ కథకు ఆయువుపట్టుగా కనిపిస్తాయి. "నా అవిటితనం నేనెలా తెచ్చి పెట్టుకోలేదో, వేశ్య అవుదామని తనుకూడా అనుకోలేదు" అని సుందరం అన్న మాటలు ప్రతి పాఠకుడినీ ఆలోచింపచేస్తాయి. నిజమే ఊహించనది జరగడమే జీవితం. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే అది

జీవితం ఎలా అవుతుంది. ఇవే మాటల్ని రచయిత్రి సుందరం, ప్రసన్న ద్వారా పలికిస్తారు.

ప్రసన్న అందగత్తె. నా అన్న వాళ్ళు ఎవరూ లేని ప్రసన్న అనాథశరణాలయంలో పెరుగుతుంది. అదే శరణాలయంలో ఉన్న రాజు ప్రసన్నను పెళ్లిచేసుకోవాలనుకుంటాడు. రాజు కుంటివాడు. ఆ కారణంచేత ప్రసన్న రాజుని తిరస్కరిస్తుంది. శరణాలయం మాష్టారు చెప్పినా ఒప్పుకోదు. పైగా "నాకున్నది అందం ఒక్కటే, నేను ఇలా ఇక్కడే ఉండిపోను. నా అందం ఇచ్చే ప్రతీ సౌకర్యం కావాలి..." అని శరనాలయం మాష్టారికి చెప్పేస్తుంది. కానీ గత్యంతరం లేని స్థితిలో ప్రసన్న అవిటివాడైన సుందరాన్ని పెళ్లిచేసుకోవలసి వస్తుంది. ప్రసన్న సుందరంకు ఉన్న ఉద్యోగం చూసి పెళ్లిచేసుకుందే తప్ప తనపై ప్రేమ ఉండి కాదు. గతంలో కూడా సుందరానికి వాళ్ళమ్మ సంబంధాలు చూసినప్పుడు సుందరం చేసే ఉద్యోగం నచ్చింది కానీ సుందరానికి ఉన్న అవిటితనం నచ్చలేదు. ఇప్పుడు ప్రసన్న కూడా.....

"అదృష్టం అందమైన శరీరాలలో లేదు. అందమైన మనసులో ఉంటుంది" అని శరణాలయం మాష్టారు చెప్పిన మాటలకు ఆలోచించిన ప్రసన్న అక్కడినుంచి బయటపడడానికి సుందరాన్ని ఒక మార్గంగా ఎంచుకుంది. సుందరాన్ని భావనను రచయిత్రి మనకు కలిగిస్తారు. (వేశ్యాగృహంలో కలిసిన కరుణతో చేసింది వ్యభిచారం అనడం కంటే సంసారం అనే భావన కూడా కలుగుతుంది.) సుందరం మంచితనాన్ని, బలహీనతగా వాడుకోవాలి అనుకుంటుంది ప్రసన్న. కామం, కోరిక, ప్రసన్నని ఇష్టపడడం ఇవన్నీ సుందరం బలహీనతలు... ప్రసన్న ప్రవర్తనకు విసిగి వేసారి 'జీవితం సులభంగా దొరకడు...' అంటాడు సుందరం. 'నాకు మాత్రం ఈజీగా దొరికిందా జీవితం?' అనుకుంటుంది ప్రసన్న.

అందంగా ఉన్న ప్రసన్నకు అవిటివాడైన సుందరంతో కాపురం చేయడం ఇష్టముండదు. తనలాంటి అందగత్తెకు సుందరం తగినవాడు కాదని తన అభిప్రాయం. అందుకే సంవత్సరం గడిచినా సుందరాన్ని సంసారిక జీవితంలో విఫలుడిని చేసి ఆడిస్తూ ఉంటుంది. తనతో కలిసి బతకాలని, కాపురం చేయాలని ఆశపడే సుందరంతో ఒక ఒప్పందం కుదుర్చుకుంటుంది. "ఆరె నెలల సంపాదన... రెండు లక్షలు, మూడు తులాల బంగారం... తన పేరిట డెబ్భైవేల పిక్స్‌డ్ డిపాజిట్..." అది తన విలువ. సుందరంతో కాపురం చేస్తుంది. కథారంభంలోనే వేశ్య దగ్గరికి వెళ్లొద్దని సుందరం స్నేహితుడు సత్తి, సుందరంతో వాదిస్తూ ఎవరు లేని ఒక అనాథను పెళ్లి చేసుకుని "వాళ్ళకి కావలసింది ఇచ్చి.... నీకు కావలసింది నువ్వు తీసుకోలేవూ...." అంటాడు. సత్తి దృష్టిలో వాళ్ళకి కావలసింది ఒక కుటుంబం. సత్తి మాట విని అనాథని పెళ్ళి చేసుకుంటాడు సుందరం. కానీ కథ తారుమారయ్యింది. ప్రసన్నకి కావలసింది కటుంబం కాదు 'డబ్బు'. అది ఇచ్చాడు. తనకు కావలసిన సంసార సుఖాన్ని అనుభవించాడు. వేశ్య దగ్గరకు వెళ్లకూడదని స్నేహితునికి పెళ్లి చేశాడు సత్తి. పెళ్లి చేసింది ఎవరూ లేని అనాథతోనా? లేక వేశ్యతోనా? అది మనల్ని మనం ప్రశ్నించుకోవలసిన ప్రశ్న.

ప్రసన్న హింస భరించలేక సుందరం విడాకులు కోరతాడు. ఇంకెవరైనా అయితే బాధపడే వారేమో కానీ ప్రసన్న కదా! చాలా సంతోషపడింది. ఈ అవిటివాడి నుంచి విముక్తి కలుగుతున్నందుకు. "పడుకోవడానికి బేరం చెల్లించావు కదా విడిపోవడానికి కూడా మంచి బేరం..." అప్పుడు కూడా బేరం పెట్టింది. అడిగిన డబ్బును అప్పుచేసి బ్యాంక్‌లో లోన్ తీసుకుని ప్రసన్నకు సర్ధుబాటు చేసి విడాకుల పత్రాల మీద సంతకాలు తీసుకుని ప్రసన్న నుంచి విముక్తి పొందాడు సుందరం. సుందరాన్ని వదిలించుకుంది ప్రసన్న. "ఏ ఉద్యోగం చేసినా, కింది తరగతి నుండి మధ్య తరగతికి ప్రమోట్ అయిన మగవాడి ఆయువు పట్టు పరువు" అదే పట్టుకుంది ప్రసన్న. "బంగారు గుడ్లు పెట్టే బాతుని కోసుకుతిన్నా కూడా మంచిదే. అది సరిగ్గా వర్కవుట్ అయితే..." అని రచయిత్రి

పలికించిన మాటలు అక్షర సత్యాలు అనిపిస్తాయి ఈ కథ చదివితే.

సుందరం కింది నుంచి పైకి వచ్చినవాడే. చినప్పుడే పోలియో సోకినా ఒక కాలు ఈడ్చుకుంటూ నడిచినా వీలైనంత వరకు తన కాలుని కవర్ చేసుకుంటూ ఆత్మ విశ్వాసం మెండుగా ఉన్న వ్యక్తిగా కనిపిస్తాడు సుందరం. అందుకే "ఒరే.. సత్తిగా మనం కాళ్లీడ్చినా.. మన బతుకులు ఈడ్చినట్టు ఉండకుండా చూసుకోవాలిరా....!!" అంటాడు.

గుళ్ళో ప్రసాదాలు తింటూ.... ఆ ఇంట్లో ఈ ఇంట్లో పాచి పని చేసి సంపాదిస్తూ కష్టపడి చదివించింది సుందరం తల్లి. తండ్రి చిన్నతనంలోనే తాగి తాగి చచ్చిపోయాడు. ఎక్కడా ఫెయిల్ అవకుండా బాగా చదివి ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగం సంపాదించాడు. "అమ్మ చాలా కష్టపడిందిరా... నా బతుకు పరుగు తీయాలని.... తను నిమిషం నిమిషం కాలం ఈడ్చింది" అంటాడు సుందరం. అందుకే "వికలాంగ కోటాలో ఉద్యోగం సంపాదించినా ఎప్పుడూ రిలాక్స్ కాలేదు" అనే మాటలు కూడా ఈ నేపథ్యంలో కనిపిస్తాయి. మనిషి నిరంతరం ఏదో ఒకటి చేస్తూ ముందుకు పోతూనే ఉండాలి. ఎక్కడైనా ఆగిపోతే ఆగినట్టే ఉంటుంది. అందుకే సుందరం ఆగలేదు. రిలాక్స్ అవలేదు. అమ్మని పని మాన్పించాడు. సుందరం గొప్పవాడిగా పరిణామం చెందాడు. అట్టడుగు స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి కదా పరువు, ప్రతిష్ట ఇవి సుందరానికి ఆరో ప్రాణం. అందుకే ఆ ఆరోప్రాణాన్నే పట్టుకుని ఆట ఆడించి ఆడించి తనకు కావలసింది తీసుకుని సుందరాన్ని ఓడించిందో....! గెలిపించిందో....! మొత్తం మీద ప్రసన్న వెళ్లిపోయింది.

కరుణ ఒక వేశ్య. ప్రేమించిన వాడు మోసం చేసి వేశ్యాగృమాలకు అమ్మి తనని వేశ్యగా మార్చేశాడు. ఈ విషయం తెలిసినా కరుణ తల్లిదండ్రులు పెద్దగా ఏం పట్టించుకోలేదు. కరుణని వదిలేశారు. అందుకే కరుణకి మానవ సంబంధాల మీద పెద్దగా నమ్మకం లేదు. కాబట్టే అక్కడి నుంచి తప్పించుకుని బయటకి వెళ్లి బతకాలనే ప్రయత్నం తను ఎన్నడూ చేయలేదు. ఎందుకంటే అక్కడి నుంచి ఎక్కడికి వెళ్ళినా తను మళ్ళీ మనుషుల మధ్యకే వెళ్ళాలి కదా! పైగా పైకి ముసుగులు వేసుకుని నటించే బయటి ప్రపంచం కంటే ముసుగులన్నీ తీసి నగ్నంగా కనిపించే వేశ్యాగృహాలే నయం అనుకుంది. అందుకే ఇష్టం లేకపోయినా అక్కడే సర్దుకుపోయింది.

సుందరం చేసింది తప్పని చెప్పాలో ఒప్పని చెప్పాలో తెలియదు కానీ ఒకసారి వేశ్యాగృహానికి వెళతాడు. అక్కడే పరిచయమవుతుంది కరుణ. కరుణ అసలు పేరు కరుణ. కానీ వేశ్యాగృహంలో తనపేరు కరీనా. కానీ సుందరం అక్కడికి వచ్చినప్పుడు పొరపాటున కరీనా అనకుండా కరుణ అని తన అసలు పేరు చెప్పి నాలుక కొరుక్కుంటూ సుందరాన్ని చూస్తూ ఉండిపోతుంది. సుందరానికి తను నచ్చిందో, తన పేరు నచ్చిందో, అసలు పేరు చెప్పిన తన నిజాయితీ నచ్చిందో తెలియదు కానీ సుందరం కూడా కరుణనే ఎంచుకున్నాడు. కరుణ కూడా అవటివాడని, వీడితో కూడా అవసరమా అని అనుకోలేదు. "ఎవడైతే ఏంటి...? మరీ ఎక్కువగా హింసించకుండా ఉంటే చాలు" అనుకుంది.

గదిలోకి వెళ్ళిన కరుణ జాకెట్ విప్పబోతుంటే.. "వద్దు మీకిష్టమేనా... కాసేపు మాట్లాడుకుందాం.. నాకు కొత్త" అన్నాడు. తన సర్వీస్‌లో ఆ మాటల వినడం అదే మొదటి సారి. ఎవ్వరూ... ఎప్పుడూ.. చివరకు ప్రేమించిన వాడు కూడా అడగలేదు. అలా సుందరానికి కరుణకి పరిచయం. ఆ పరిచయమే సత్తికి ఇష్టముండదు. వేశ్యల దగ్గరకి పోతే ఏమైనా రోగాలు వస్తాయని సత్తి భయం. కరుణ దగ్గరికి వెళ్ళి వచ్చిన ప్రతిసారి సుందరానికి సత్తికి చిన్నపాటి యుద్ధం. తాటుకు మంటలాగా! కరుణ దగ్గరికి వెళ్ళి "ఎన్నో తీరని కాంక్షలని తీరాలు దాటించి, సగర్వంగా ఉన్న వాడి మొహం చూస్తే" సత్తి మెత్తబడిపోతాడు. కరుణ మంచి స్నేహితురాలని, తను నాకు చాలా విషయాలు నేర్పుతుందని.. ఇంకా ఏవో చెప్పబోతుంటే "సాని దాని

దగ్గర నువ్వు సంసారం ఎలా చేయాలో తెలుసుకోనక్కర లేదురా ఒరేయ్...." అంటూ సత్తి ఆ విషయాన్ని దాటేసే వాడు.

నిజానికి కరుణ సుందరానికి చాలానే నేర్పింది. "శరీరం ఏమిటో... ఎలా ప్రేమించాలో... ఆడదాని శరీరం ఏమిటో..." ఇలా చాలా నేర్పించింది. ఈ సందర్భంలో రచయిత్రి కరుణతో పలికించిన మాటలు నిజంగా భలే నవ్వొస్తాయి... నిజమే కదా అనే భావనను కలుగజేస్తాయి. "నా కస్టమర్ లే కదా నా యూనివర్శిటీ..." సుందరం కూడా కరుణకు చాలా నేర్పించాడు. "మనిషంటే.. మగాడంటే నేర్పించాడు. అనుభవానికి సంగమానికి కూడా తేడా" ఏమిటో నేర్పించాడు.

వాస్తవానికి సుందరం కరుణను కలిసినప్పుడు తనకు "మగవాడనే స్పృహ లేదు. ధ్యాసంతా తన కుంటితనం మీదే.. నెమ్మది నెమ్మదిగా అతనిలో స్వచ్ఛత, పసి పిల్లాడిలాంటి మనసు, కష్టాలను చూసి రాటుదేలినతనం, అయినా ఒక నెమ్మదితనం, నా గాయాలకు సానుభూతి లేపనం. నా శరీరం పచ్చిగా ఉంటే పడుకోనిచ్చేవాడు. నన్నే అలా చూస్తూ మాట్లాడుతూ ఉండేవాడు. అతను వెళ్లిపోయాక నా కళ్ళల్లో నీళ్ళు. మనసులో హాయి...!" ఇది కరుణ మనసులో సుందరం స్థానం. "నాకూ ప్రపంచానికి కిటికీ సుందరం" అంటుంది కరుణ. అవును కదా బయట ప్రపంచంతో సంబంధాలు లేని కరుణకు ప్రపంచాన్ని కళ్ల ముందుకు తెచ్చేది సుందరమే కదా! సుందరానికి పెళ్లయ్యి వెళ్లిపోయేటప్పుడు చాలా బాధపడుతుంది కరుణ. అవును మరి "మగాది పైశాచికత్వానికి పీలికలై... రక్తపు చారికలైన ఒళ్ళు.. సుందరం కళ్లల్లో నీళ్ళు. ఎన్ని ఆయింట్‌మెంట్‌లు కొని తెచ్చి రాశాడో తెలీదు. రెండు రోజులు కస్టమర్‌లా వచ్చి..." శారీరక సుఖాన్ని అనుభవించి పోకుండా మానసిక ఆనందాన్ని అందించే సుందరాన్ని ఎలా మరిచిపోగలదు కరుణ. అయినా సర్ధుకుపోయింది కరుణ.

కథలో ఈ సంఘటన దగ్గరికి వచ్చే సరికి సెక్స్ వర్కర్ల దయనీయ స్థితి గురించి అలిశెట్టి ప్రభాకర్ రాసిన "తనువు పుండై... తాను పండై.. తాను శవమై... వేరొకరి వశమై.. తను ఎడారై... ఎందరికో ఒయాసిస్సై..." అనే వాక్యాలు జ్ఞప్తికి వచ్చి కంటతడి పెట్టిస్తాయి. "సుందరానికి సంసారం నేర్పిన మాష్టార్ని కదా... మాష్టారు ఎప్పుడూ స్కూల్‌లోనే ఉండాలి. స్టూడెంట్స్ కదా... ఒక్కో దశ దాటి వెళ్తూ ఉండాలి" ఇప్పుడు సుందరం ఒక దశ దాటి ఇంకో దశకు వెళుతున్నాడు. పరిణామం తప్పదు కదా...!!

మనిషి జీవితంలో అనేక పరిణామాలు. ఒకటి కాదు రెండు కాదు వేలకు వేలు.. కొన్ని మంచి చేస్తాయి. కొన్ని చెడు చేస్తాయి. ఇప్పటివరకూ సుందరం జీవితంలో వచ్చిన పరిణామాలు ఏవీ సుందరాన్ని ఇబ్బంది పెట్టలేదు. పెళ్లి ఈ పరిణామం సుందరాన్ని తన అస్తిత్వం కోల్పోయి బతికేలా మార్చేసింది. తన మీద తనకే చిరాకు వచ్చేలా మార్చేసింది. అందుకే తనని అర్ధం చేసుకోని, తన ఉద్యోగానికి తన డబ్బుకి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే భార్య ప్రసన్నకు విడాకులు ఇచ్చేశాడు. ఆ కథ అంతా మనం పైన చర్చించుకున్నాం.

అనాథ శరణాలయం, సుందరంతో పెళ్లి శిశిరం అనుకుంది ప్రసన్న. మోసగించబడి వేశ్యగా మారిన కరుణ జీవితంలోకి సుందరం ప్రవేశించడం కాస్త ఊరట కలిగించినా పెళ్లి చేసుకున్న సుందరం తిరిగిరాదని చాలా బాధ పడిపోతుంది. సుందరం లేని కరుణ జీవితం శిశిరం. ఇటు కరుణకు దూరమై, కట్టుకున్న భార్యకు దూరమై ఒంటరిగా మిగిలిన సుందరం జీవితం శిశిరం. ఈ కథలోని ప్రధాన పాత్రలన్నీ ఇప్పుడు శిశిరంలో ఉన్నాయి. మరి ఈ పాత్రలకు శిశిరాంతరవేళ ఎలా ఉందో చూద్దాం.

ప్రసన్న సుందరానికి కావలసింది ఇచ్చింది. తనకు కావలసింది తీసుకుంది. తనకు కావలసింది డబ్బు. అదే సర్వం అనుకుంది. 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి' అన్నట్టు తన ప్రయత్నం తాను చేసింది. ప్రసన్న అలా చేయడానికి కారణాలు మనం అన్వేషించలేము.

తనతోపాటు అనాథ శరనాలయంలో పెరిగిన నాగలక్ష్మి కి పెళ్లయ్యి అత్తగారింటికి వెళుతుంది. కానీ కొద్దిరోజులకే అందం తగ్గిపోయిందని నాగలక్ష్మి భర్త నాగలక్ష్మిని వదిలేస్తే మళ్ళీ గత్యంతరం లేక అనాథ శరణాలయానికే చేరి అందరికీ వండిపెడుతూ కాలం వెళ్ళబుచ్చుతూ ఉంది. తన బతుకు కూడా అలా కాకూడదనేమో తన జాగ్రత్తలో తను ఉందనిపిస్తుంది.

సుందరం మళ్ళీ కరుణను వెదుక్కుంటూ వేశ్యాగృహానికి వెళతాడు. కరుణ కూడా సుందరాన్ని చూసి చాలా సంతోషపడుతుంది. భార్య యోగక్షేమాలు అడుగుతుంది. సుందరం నాన్చకుండా అన్నీ చెప్పేసి నేరుగా విషయానికి వచ్చి "నేను అవిటివాడిని, నువ్వు వేశ్యావృత్తిలో ఉన్నావు. ఇలా తెలిసిన విషయాలు కాకుండా నన్ను చేసుకోవడానికి నీకు అభ్యంతరం ఏమైనా ఉంటే చెప్పు....!" అని సుందరం అడగ్గానే కరుణ కాస్త ఆలోచనలో పడుతుంది.

"కరుణా - మనం పెళ్లి చేసుకుందాం. శారీరక సుఖం కోసం మాత్రమే కాదు. కలిసి ఉండడం కోసం. గతంలో మీ దగ్గరికి రావడం.. డబ్బులిచ్చి నీ శరీరాన్ని కొనుక్కోవడం ఎంప్పుడూ తప్పనిపించలేదు. ప్రసన్నతో కలిసిన ప్రతి నిమిషం వ్యభిచారం చేస్తుంటే ఎలా ఉంటుందో అలా అనిపించింది... ఆమె లేకపోతే నేను ఉండలేనా? ఇదేనా నా జీవితం అనిపించేది. ముఖ్యంగా నగ్నమైన నా అవిటితనం తన కళ్ళల్లో నిద్రలేపిన అసహ్యం తలచుకుంటే, ఆమెతో సుఖించినందుకు నామీద నాకే అసహ్యం వేసేది. నరకం చూశాను కరుణా..!!" అని సుందరం తన ఆవేదనను వ్యక్తం చేస్తుంటే కరుణ కన్నీటి పర్యంతమవడం మనం ఊమించవచ్చు. "ఆమెకు డబ్బు కావాలి. నేను నా అవిటితనం వద్దు. ధర్యే... అర్థేచ... లో తనకు అర్థమయింది కేవలం ఆర్థికమే. అది తెలిసి కూడా నేను తనతో..." కరుణ ఒప్పుకుంది. సత్తి సంశయంలో పడ్డాడు. "నా అవిటితనం నేనెలా తెచ్చిపెట్టుకోలేదో, వేశ్య అవుదామని తనుకూడా అనుకోలేదు" అని సుందరం చెప్పిన మాటలతో సత్తి కళ్ళు చెమర్చాయి. "నా బాధను అర్థం చేసుకున్న నా స్నేహితుడు నా శక్తి" అని సుందరం సంతోషపడతాడు. నిజమే కదా మన బలం మన బలహీనత అన్నీ స్నేహితులే కదా!!! కరుణ, సుందరం పెళ్లి జరిగిపోయింది. "నేను నాల ఉండటంలో ఉన్న సంతోషం దేనికీ సాటిరాదు. నేను నిజంగా తెలివైన మంచివాడిని అని నాకిప్పుడిప్పుడే నమ్మకం కలుగుతోంది". అని సుందరం తనలో తాను అనుకోవడంతో కథ ముగుస్తుంది.

ప్రస్తుత సమాజానికి ఇలాంటి కథలు చాలా అవసరం. ఆత్మన్యూనతా భావాలు పెరిగిపోయి అన్నీ కోల్పోయాము అనే భావనలో నేటి తరం తీసుకునే నిర్ణయాలు దారుణాతి దారుణం. ఏమీ లేకపోయినా ఎదగొచ్చు, అన్నీ కోల్పోయినా ఎదగొచ్చు (అవయవాలు కావచ్చు, అవసరాలు కావచ్చు) అనడానికి ఈ కథ నిలువెత్తు నిదర్శనం. తింటానికి కూడా లేని స్థితి నుంచి ప్రభుత్వ ఉద్యోగం వరకు ఎదిగిన సుందరం, పెళ్లయి అన్నీ కోల్పోయి మళ్ళీ బతుకు సమరంలో గెలిచిన సుందరం... ప్రేమించి, ఇంటి నుంచి బయటకు వచ్చి ప్రేమించినవాడి చేత అమ్మబడి, వేశ్యగా మారి అన్నీ కోల్పోయిన కరుణ, సుందరాన్ని చేరుకొని బతుకుబాటలో సేదతీరిన వైనం... 'మనిషి చచ్చి కాదు సాధించాల్సింది బతికుండి సాధించాలి' అనడానికి ఈ ఒక్క కథ సరిపోదూ...!!!

❖❖❖

ఆంధ్ర మహాభారతం – గాంధారి 'ధర్మం'

– డా॥. యస్.పి. సంజీవరెడ్డి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎర్రగుంట్ల, కడప జిల్లా.

ప్రస్తావన :

మానవుని జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఎట్టి సంఘటనలు జరిగినా, ఎలాంటి ఒడు దుడికులు కలిగినా వాటి నుంచి కలిగే మంచి ఫలితాలకు పొంగిపోక, చెడు ఫలితాలకు క్రుంగిపోక, మనోధైర్యంతో స్వపర భేదం లేకుండా, నిష్పాక్షికంగా సమాజ సమ్మతమైన ధర్మం మార్గాన పయనించే మానవుడు వ్యక్తిపరంగా, సమాజపరంగా ఒక విశిష్టమైన స్థానాన్ని పొందగలడు. ధర్మమార్గాన పయనించి విశిష్టమైన స్థానాన్ని పొందడానికి స్త్రీ పురుష భేదం లేదు. పుత్రులపై మమకారంతో కొన్ని సందర్భాల్లో అధర్మ స్థానాన్ని పొందడానికి స్త్రీ పురుష భేదం లేదు. పుత్రులపై మమకారంతో కొన్ని సందర్భాల్లో అధర్మ మార్గాన నడిచిన ధృతరాష్ట్రుడికన్నా, అవినీతులైన కుమారుల పట్ల పుత్ర ప్రేమకంటే ధర్మానికి ప్రాధాన్యత ఇచ్చిన ధర్మవేదికగా గాంధా కవిత్రయ భారతంలో ప్రముఖమైన స్థానాన్ని పొందినట్లు కన్పిస్తుంది.

తల్లిదండ్రులతో గాంధారి "ధర్మం" :

గాంధారి అంధుడైన ధృతరాష్ట్రుని తండ్రి మాట ప్రకారం వివాహం చేసుకోవడం స్పష్టమయింది. సహజంగా అంధత్వం కలిగిన భర్త కొరకు కృత్రిమ అంధత్వాన్ని ఆపాదించుకొన్న అర్థాంగిగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో గాంధారికి పతిపై గల భక్తి, ప్రేమ స్పష్టమవుతున్నాయి. ఈ సందర్భంలో గాంధారి త్యాగనిరతి స్పష్టమవుతోంది. మాతృదేవోభవ, పితృదేవోభవ అనే ధర్మమార్గంలో నడిచింది. కాబట్టి తండ్రి కోరికను అనుసరించి ప్రవర్తించింది.

భర్త విషయంలో గాంధారి "ధర్మం" :

కృష్ణరాయబార సందర్భంలో ధృతరాష్ట్రునిచే పిలిపించబడ్డ గాంధారి వచ్చి భర్తతో

"నీ పుత్రుడవినీతు డగుట యెఱిగి,
యెఱిగి వాని వశంబున నేల పోయె
దీపు పాండవులకు నేమి ఇచ్చితేని,
నడ్డపడ నెవ్వరికి వచ్చు నదిప....."

అని పలికింది. అధిప అను సంభోధనలో రెండర్థాలు కన్పిస్తున్నాయని చెప్పవచ్చు మామూలుగా రాజా అని సంబోధనం ఒక అర్థం. మరొక అర్థంలో కురు సామ్రాజ్యధిపతిని' కాబట్టి నీవు అధికారాన్ని ఉపయోగించి కుమారుని దండించి పాండవులకు రాజ్యాన్ని ఇవ్వవలసిందని సూచన. అధిప అను సంబోధనము సాభాప్రాయమని "జక్కా వేంకట రమణప్ప' చెప్పారు. అజ్ఞాపించడమే కాని బ్రతిమాడుట ధృతరాష్ట్రునికి తగదన్న అభిప్రాయం ఈ పదం వలన స్ఫురిస్తుంది.

మూలంలో గాంధారి ధృతరాష్ట్రునితో అవినీతుడయిన దుర్యోధనునికి రాజ్యం లభించింది. కొడుకు పాపచింత తెలిసి నీవు వాని బుద్ధినే అనుసరించావు. వీడు కామక్రోధ మోహితుడు, లోభగ్రస్థుడు, దురాత్ముడు, మూఢుడు, దుస్సహాయుడు, నిన్ను బలవంతంగానైనా మరల్చడానికి అసాధ్యుడు. అట్లాంటి వానికి రాజ్యం ఇచ్చినందుకు తగిన ఫలితం వచ్చింది. సామము చేత తరించడానికి వీలయ్యే ఆపదపట్ల దండాన్ని ఎవడు ప్రయోగిస్తాడు అని పలికింది.

శత్రువులు దాడి చేయకుండా ఉండాలంటే పాండవులతో కలిసి ఉండాలని, పాండవులు బలవంతులు కాబట్టి సామమార్గాన్నే పోవాలి. కాని దండాన్ని ప్రయోగించరాదని హితబోధ చేసినట్లుగా మనకు కన్పిస్తుంది. కేవలం స్వప్రయోజనాన్ని ఆశించి పలికినట్లుగానే ఉంది కాని, ఆమెలోని నిష్కళంకమైన ధర్మగుణం బహిర్గతమవడం లేదు.

తెలుగు భారతంలో కొడుకు అవినీతిని తెలియజేస్తూ పాండవులకు ఏమి ఇస్తే వద్దనే వారు ఎవరు రాజా అని పలికి రాజుగా భర్త అధికారాన్ని గుర్తు చేసి కుమారుల దుష్టత్వాన్ని శిక్షించమని హితబోధ చేసిన ధర్మవేదినిగా, నిశ్వార్థ సంభాషణ చేసిన ధర్మశీలగా మరింత ప్రకాశించిం దని చెప్పవచ్చు.

కుమారుల విషయంలో గాంధారి 'ధర్మం' :

దుర్యోధనుడు యుద్ధ రంగానికి వెళ్లే సమయంలో జయము కలిగేటట్లు దీవించమని తల్లిని కోరాడు. అప్పుడు గాంధారి దుర్యోధనితో

"..... ధర్మం
బేతల ననూనమగు సిద్ధ జయ మాతకు నెట్లయిన సిద్ధమగు"

అని పలికింది.

ఆశీర్వాదం కోరిన కుమారునితో ధర్మము ఎక్కడ ఉంటుందో జయము అక్కడ ఉంటుంది అని పలక డంతో గాంధారి ధర్మశీలత్వం మరింత కాంతిమతంగా ఉన్నదని చెప్పవచ్చు. ఎంతో గాంభీర్యంతోనూ, నిగ్రహం తోనూ గాంధారి హృదయం నుండి ఈ మాటలు వెలువడి ఉంటాయి. ఏ తల్లి కుమారులకు అపజయాన్ని, మర ణాన్ని కోరడు గాంధారి అట్లా పలకడం వల్ల ఆమెకు మాతృ హృదయం లేదని చెప్పడం అసత్యమే అవుతుంది. స్త్రీ పర్వంలో కుమారుల మృత కళేబరాలను చూచి విలపించిన గాంధారి తీరుతెన్నులు ఆమెలో ఉన్న మాతృ హృదయాన్ని, పుత్రప్రేమను స్పష్టం చేస్తున్నాయి. ధర్మశీల కాబట్టి పుత్రులు విషయంలో కూడా నిష్పాక్షికంగా పలికింది. మూలాను గుణంగా ఉన్నది.

యుద్ధ భూమికి వచ్చిన గాంధారి పుత్రశోకంతో ముందు పాండవాగ్రజుని శపించాలనుకోవడం, వ్యాసుడు శమించమనడం స్పష్టమయింది. ఆ సందర్భంలో గాంధారి తన కుమారుతలను గూర్చి వ్యాసునితో

"..... దుర్యోధనుతులు తనంబున శకునియు
గర్ణ దుశ్శాసను లును
దుష్టాత్ములగుట..... "

చేతను మరణించారని పలికింది.

అంతట పుత్రశోఖంలో కూడా గాంధారి కుమారులను గూర్చి అట్లా పలకడం వల్ల ఆమె ధర్మగునం బహిర్గమవు తోంది. పుత్రశోఖాన్ని అనుభవిస్తూ కూడా గాంధారి కొడుకు తులువతనాన్ని శకుని కర్ణ దుశ్శాసనుల దుష్టత్వాన్ని నిష్పాక్షికంగా చెప్పగలిగిన ధర్మశీల.

కోపావేశంతో ఏ తల్లి అయినా కుమారుని దుర్గుణా లను చెప్తుందేమో కాని మరణించి ఉన్న కొడుకును చూస్తూ ఆవేదన చెందే సమయంలో, అందులో తన కుమారుని ఎవ్వరైతే చంపారో అట్టి భీమునితో ఆమె కన్న కొడుకును గూర్చి అట్లా పలికిందంటే గాంధారి ఎంతటి ధర్మమూర్తో తెలుస్తున్నది. ఆమెలో ధర్మబుద్ధి ఎంత పరిపక్వత చెందిందో వెల్లడవుతోంది.

ముగింపు :

మొత్తం మీద గాంధా ధర్మవేదినిగా వ్యాస భారతంలో కన్న కవిత్రయ భారతంలోనే అనేక సందర్భములలో తేజోవంతంగా ప్రకాశించి మరింత విశిష్టమైన స్థానాన్ని పొందిందని చెప్పవచ్చు.

గాంధారి ఆంధ్రమహాభారతం మొత్తంలో ఒకటి రెండు చోట్ల సామాన్యవలె ఈర్ష్యాసూయ జనితగా కనిపించినా వెంటనే వివేకంతో ధర్మమార్గాన నడిచింది. స్వపర భేదం లేకుండా కనబరచిన ఆమె ధర్మగుణం అందరికి ఆదర్శం తంగా ఉంది.

ఈ సందర్భంలో డా॥. నందుల గోపాల కృష్ణమూర్తి మాటలు గమనించదగనవి. "మొట్టమొదటి అసూయాది మానవ సహజములైన బలహీన-తలకు బానిసయ్యును గురుసార ధీరబుద్ధియై ప్రశాంత చిత్తమును అలవరుచు కొని మనస్సులోని పాశవిక భావములను ప్రక్షాళనము చేసికొని ధర్మశీలముతో మెలగి సర్వజనుల అభినందన ములను పొందుచున్నది. అందుచేతనే ఆమె జగన్మాత"

ఆధార గ్రంథాలు :

ఆచార్య బిరుదురాజు రామరాజు : తెలుగుజానపద గేయ సాహిత్యము
వెలమల సిమ్మన్న : తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు
శ్రీనాథుడు : పల్నాటి వీర చరిత్ర
చిలకమర్తి లక్ష్మీనరసింహం : చిలకమర్తి వినోదములు

❖❖❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

భగవద్గీత – ధర్మాధర్మ, కర్తవ్యబోధ

– డా॥. పి.వి. లక్ష్మణరావు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ఆర్.జి.యూ.కే.టి., నూజివీడు, కృష్ణా జిల్లా.

వివేకవిత్వాన్ని వెలయింపజేసి, సంసార సాగరాన్ని దాటింపజేసి జనన, మరణ చక్ర భ్రమణ బాధను బాపేది విద్య. అది నిత్యం, సత్యాన్ని, ప్రత్యగాత్మను ప్రసాదించే పరమ ప్రయోజన వరం. విద్యా దానాంచితుడు తాను తరించి తనను అర్థించిన వారిని తరింపజేస్తాడు. కొవ్వొత్తి దీపం ఇంటివరకే పరిమితం. విద్యాదీపం విశ్వమంతటా విజ్ఞానాన్ని వెలయింపజేస్తుంది. 'విద్యాదదాతివినయం వినయాత్ యాతి పాత్రతాః! పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాత్ ధర్మం తతఃసుఖ॥ 'విద్యతో వినయగుణం, దానితో పాత్రత అనే సమర్థత, సమర్థతతో సంపాదన, ధన సంపాదనతో ధర్మాచరణ లభిస్తుంది. చతుర్విధ పురుషార్థాల్లో మొదటిది ధర్మం. 'ధర్మఃకీర్తిర్ద్వయం స్థిరం' అనే నీతివాక్యం, జీవితం, లోకం, యౌవనం, ధనం, భార్యాబిడ్డలనే విషయవాంఛలు అశాశ్వతాలు. కానీ ధర్మం, కీర్తి ఈ రెండే శాశ్వతాలు. ఈ పవిత్ర ప్రయోజనాలు రెండూ విద్యవల్లనే లభిస్తాయి. విద్యాహీనుడు పశుతుల్యుడు అనే నానుడిని మనస్సులో నిలిపి ప్రతి ఒక్కరూ విద్య నేర్వాలి.

అసలైన విద్య - జీవన విలువలు :

వ్యక్తిలో సహజంగా ఉన్న పరిపూర్ణత్వాన్ని వెలికితెచ్చేదే విద్య. మనిషిలో ఉండే దుర్మార్గాన్ని దహనం చేసి సద్గుణాన్ని వెలికితీసేదే విద్య. సద్గుణ సంపత్తి పెరినప్పుడు మనిషి సంకుచిత ప్రవృత్తి నుంచి చెడు గుణాల నుంచి విముక్తుడవుతాడు. అందరికీ విద్య కావాలనేది మంచి ఆశయం. చదువుకుంటే సదసద్వివేక చతురత కలుగుతుందని ప్రహ్లాదుడి తండ్రి దానవరాజు హిరణ్యకశిపుడి చేత పోతన చెప్పించాడు. ఏది మంచో ఏది చెడో నిర్ణయించుకోగలిగే తెలివిని చదువు ప్రసాదిస్తుందని అర్థం. ముక్తిని కలిగించేది విద్య అని ఒక సంస్కృతోక్తి చెబుతోంది. విద్యలో ఉన్న నిగూఢమైన రహస్యాన్ని సత్యాన్ని అతి సామాన్యులకూ అందజేయవలసి ఉంది.

విద్యాబోధనలో నియత, అనియత అనే రెండు పద్ధతులు ఉన్నాయి. నియత విద్యలో విద్యాబోధనకు ఒక పాఠ్య ప్రణాళిక, పాఠ్యగ్రంథాలు, ఉపకరణాలు ఉంటాయి. అనియత విద్య దీనికి భిన్నమైనది. చదవడం, రాయడం రానివాణ్ణి విద్యావంతుణ్ణి చేసే విధానమిది. నియత విద్య లేదా ఔపచారిక విద్య తెలియజేసేది మాత్రమే. అనియత విద్యలో వింటున్నవి గుండెను తాకుతాయి. కథలు, వీధి నాటకాలు, పురాణాలు, హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, తోలుబొమ్మలాటలు... వంటివి ఒకప్పుడు నిరక్షరాస్యులకు సైతం జ్ఞానాన్ని ఇచ్చేవి. మన జానపద వాఙ్మయం చాలా గొప్పది. భగవద్గీత శ్లోకాల సారాన్ని పాటల రూపంలో పాడుకున్నారు. రామాయణ, మహాభారత గాథలను పల్లెపదాల్లో గానం చేసేవారు. నేడు పొట్టకూటి కోసం డిగ్రీలు సంపాదించుకోవడానికి చదువుకున్నదే విద్య అని అనుకుంటున్నాం. జానపదులు తమ సంతోషాన్ని, విచారాన్ని, భక్తిని, ప్రేమను, ఉద్వేగాలను చాలా సహజంగా వారికి తెలిసిన భాషలో వ్యక్తం చేస్తున్నారు. ఆ పాటలు సంస్కృతికి దర్పణాలు. జాతికి జీవన గీతం జానపద గీతక' అన్నాడొక కవి. ఒకప్పుడు ఇదే నియత విద్య, గురుకులాల్లో గురువులు శాస్త్రాలు నేర్పిస్తే ఆ అవకాశం లేనివాళ్ళు సాంస్కృతిక కళారూపాల నుంచి జ్ఞానం పొంది, జీవన విలువల్ని గ్రహించేవారు.

ఒకప్పుడు దేవాలయాలు విద్యాలయాలుగానూ పనిచేసేవి. అక్కడ ఉత్సవాల్లో జరిగే పురాణ కాలక్షేపాలు, నాట్యాలు, సంగీత కచేరీలు పామరుల్ని సంస్కృతీ సంపన్నులను చేసేవి. వెనుకటి రోజుల్లో పిల్లల్ని

పాఠశాలకు పంపక ముందు తల్లి తొలి గురువుగా పాటలు నేర్పేది. కథలు చెప్పేది. అనగనగా ఒక రాజు.. ఆ రాజకు ఏడుగురు కుమారులు..' ఈ కథను ఎన్ని తరాలవారు విన్నారో! కాళ్ళా గజ్జె, కంకాలమ్మ, వేగుచుక్కా వెలగ మొగ్గ.." వంటి పాటలు పిల్లల్ని అలరించేవి. సంవాద రూపంలోనూ చదువు నేర్పేవారు. ప్రశ్నోత్తర పద్ధతి ఉండేది. ఈ పద్ధతి ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది. భగవద్గీతా సంవాద రూపమే కదా!

నాటిరోజుల్లో ఒక పావు వంతు విద్య మాత్రమే గురువు ద్వారా అందేది. ఒక పావు వంతు సహధ్యాయులు, మరో పావు వంతు తన ఆలోచన, మిగిలిన పావు వంతు అనుభవం ద్వారా లభించేలా పూర్వులు విద్య నేర్పేవారు. గురువు బోధించేది తక్కువ, శిష్యుడు నేర్చుకునేది ఎక్కువ అనే భావనకు దృష్టాంతంగా ఉండేది నాటి విద్యావిధానం. ఇది నిజమైన భారతీయ విద్యావిధానం. ఆలోచన, అవగాహన కల్పిస్తూ మనిషిని తీర్చిదిద్దేదే సరైన విద్య.

భారతీయ విద్యావ్యవస్థ - చతుర్విధ పురాషార్థాలు:

సృష్టిలో ప్రతి ప్రకృతి శక్తినీ దేవతగా భావించడం భారతీయ సంప్రదాయంలో విశిష్టత. మన జీవితంలో అత్యవసరమైన ధనం మన దృష్టిలో వట్టి రూపాయి కాదు. సాక్షాత్తూ లక్ష్మీదేవి, అలాగే జ్ఞానాన్నిచ్చే విద్య కేవలం చదువు కాదు. సాక్షాత్తూ సరస్వతీ దేవి. అటువంటి సరస్వతీదేవిని బమ్మెర పోతన తన భాగవతంలో విశేషంగా ప్రార్థించాడు. ఆ పద్యం భారతీయ విద్యావ్యవస్థ మొత్తాన్ని ప్రతిబింబిస్తుంది.

'క్షోణితలంబు నెన్నుదురు సోకగ మ్రొక్కినతింతు సైకత
శ్రోణికి చంచరీకయు సుందరవేణికి, రక్షితామర
శ్రేణికి తోయజాతభవ చిత్త వశీకరణైక వాణికిల్
వాణికి, అక్షదామశుక వారిజ పుస్తక రమ్య పాణికిన్"

ఈ పద్యం చివరిపాదంలో సరస్వతీ దేవి చేతుల్లో జపమాల (అక్షదాయం), చిలుక (శుకం), పద్మం (వారిజం), పుస్తకం ఉంటాయని వర్ణించాడు. మనం ఇప్పుడు చూస్తున్న సరస్వతి చిత్రంలో జపమాల, పుస్తకం ఉండి మరో రెండు చేతుల్లో వీణవాయిస్తూ ఉంటుంది. పోతన ఈ మూర్తినే వర్ణించి ఉంటే వీణ ఎందుకకు వదిలేస్తాడు? పైగా చేతుల్లో లేని పద్మాన్ని, చిలుకను, చేతుల్లోనే ఉన్నట్లుగా ఎందుకు వర్ణిస్తాడు? అంటే మనం చూస్తున్న సరస్వతీమూర్తి.. పోతన వర్ణించిన మూర్తి వేరి అర్థమవుతుంది కదా! అయితే వీణ లేకుండా అక్షదామశు కవారిజ పుస్తకాలు చతుర్భుజాల్లో ధరించిన ఈ మూర్తి ఎవరు? పోతన వర్ణించింది 'శారదామూర్తి' అని, ఆవిడ వైదిక విద్యలకు అధిదేవత అని.. మనం చూస్తున్న సరస్వతీమూర్తి లౌకిక విద్యలకు అధిదేవత అని వేదవిద్య లోను, సంస్కృత సాహిత్యంలోనూ నిష్ణాతులైన పెద్దల అభిప్రాయం. శృంగేరీ శారదాపీఠం వారు ప్రకటించిన శారదామూర్తి ఇందుకు సమర్థన. ఆ తల్లి చేతుల్లో ఈ నాలుగూ ఉంటాయి. వీణ ఉండదు.

కాబట్టి, పోతన ప్రార్థించిన వాణి లలితాదేవి యొక్క జ్ఞానస్వరూపంగా భావించే 'శారదాదేవి' అని బోధపడు తుంది. భారతీయ జీవన విధానంలో ధర్మ, అర్థ, కామ, మోక్షాల సాధనే జీవిత లక్ష్యంగా భావిస్తారు. విద్య ద్వారా ఈ చతుర్విధ పురాషార్థాలను సాధించడమే లక్ష్యమని 'శారదామూర్తి' చేతుల్లోని నాలుగు ప్రతీకలు సూచిస్తు న్నాయి. అమ్మవారి చేతుల్లోని పుస్తకం ధర్మానికి ప్రతీక. పద్మం అర్థానికి ప్రతీక. లక్ష్మీదేవి పుట్టింది దాని నుండే కదా! ఇక, మన్మథుడి వాహనమైన చిలుక... కామ పురుషార్థానికి ప్రతీక. నాలుగోచేతిలోని జపమాల మోక్షానికి ప్రతీక. జపతపాల ద్వారానే కదా సిద్ధిపొందేది! విద్య ద్వారా ఈ నాలుగు పురాషార్థాలనూ సాధించాలని... అప్పుడే మనిషికి భవబంధాల నుంచి విముక్తి అని తెలియజేయడం కోసమే విద్యాదేవత తన చేతుల్లో ఆ నాలుగు వస్తువులనూ ధరించిందని గ్రహించవచ్చు. 'సావిద్యా యా విముక్తయే' అని గదా ఆర్యోక్తి!!

భగవద్గీత గొప్పదనం :

బేసిగ్గా ఒక సినిమా పాట - మూడు నెలలకు

పాతదైపోతుంది. ఒక కథ - ఆర్నెల్లకు పాచిపోతుంది. ఒక నవల - ఏడాది తర్వాత కనుమరుగైపోతుంది. అలాగే నిరుడు రాసిన పుస్తకానికి అదే సంవత్సరంలో కాలం చెల్లడం చూస్తున్నాం! కానీ వేల ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా నిత్య చైతన్య ప్రవాహమై, దారిమరిచిన బాటసారికి కర దీపికై, సమస్త భూమండలాన్ని దివ్యశక్తితో ముందుకు నడిపిస్తున్న ఏకైక గ్రథం - ఇగిరిపోని గంధం - భగవద్గీత. మరి ఒకటా రెండా 5,152 సంవత్సరాల క్రితం ఉప దేశించబడి నిత్యం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట... బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లోనూ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ లెక్చర్స్‌లోనూ, మోటివేషనల్ స్పీచుల్లోనూ, మోరల్ వ్యాల్యూస్ చర్చల్లోనూ... ఏదో ఒక సందర్భంలో 'గీత' గురించి మాట్లాడుకోవడం జరుగుతూనే ఉంది.

అమెరికన్ సెనేట్‌లో 'భగవద్గీత' మీద ప్రమాణం చేసి, కాంగ్రెస్ సభ్యురాలిగా తులసీ గబ్బర్డ్ పదవీ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు దేశమంతా గర్వపడుతూ చప్పట్లు చరచడం... గీత శక్తిని ప్రపంచానికి చాటడమే అవుతుంది. పైగా... 'భగవద్గీతా కింది దధీతా..' భగవద్గీతను ఏ కొంచెం అధ్యయనం చేసినా వాడి గురించి యముడు చర్చించం డని శంకరాచార్య... 'జ్ఞానం గురించి లోతైన అవగాహన నాకు భగవద్గీత వల్లే ఏర్పడింది' అని మాక్స్‌ముల్లర్... 'శాశ్వతమైన ప్రమాణాలు గల ఉపదేశానికి సంక్షిప్త రూపమే భగవద్గీత. ఇది భారతీయులకే కాదు మానవ లోకానికంతటికీ సుస్థిరమైన ఉత్తమ ప్రయోజనాన్నిస్తుంది' అని ఆల్డస్ హక్స్లీ... 'ప్రతిఫలాపేక్ష విడిచి కర్మలను ఆచరించడమనే అద్భుతమైన సూచననిచ్చి, మానవ బలహీనత్నల్ని రూపుమాపి ఉత్తమ సమాజాన్ని నిర్మించగలిగే బలాన్నివడం భగవద్గీత గొప్పదనం' అని స్వామి వివేకానంద... ఇలా మహానుభావుల అనుభవాల్లో భగ వద్గీత గురించి వింటుంటే, గీత లౌకిక ప్రయోజనాలనీ, పారమార్థిక ప్రయోజనాలనీ రెండూ ఇస్తుందనే నమ్మకం కలగడం! కాబట్టే - గీత మీద ప్రమాణం చేస్తే అంతా నిజమే చెప్పాలన్నంత పవిత్రతను ఆ గ్రంథానికి ఆపా దించటం జరిగింది.

అసలు భగవద్గీత ఏం చెబుతుంది? :

ధర్మాధర్మాల గురించి చెబుతుంది. కర్తవ్యం గురించి చెబుతుంది. నాగరికత అంటే కోరికలను తీర్చుకోవడం కాదు... అదుపులో పెట్టుకోవడమని చెబుతుంది. అనం దంగా జీవించడం ఎలాగో చెబుతుంది. సుఖం.. శాంతి.. త్యాగం.. యోగం.. అంటే ఏమిటో చెబుతుంది. ఏది శాశ్వతమో ఏది అశాశ్వతమో చెబుతుంది. పాపపుణ్యాల వివరణ ఇస్తుంది. ఆత్మ తత్త్వ నిరూపణ చేస్తుంది. స్వకల్యాణం కోసం కాక లోక కల్యాణం కోసం జీవించమని చెబుతుంది. జ్ఞానం.. మోక్షం.. బ్రహ్మ.. ఆధ్యాత్మం అంటే ఏమిటో చెబుతుంది. ఎవరు పండితుడో ఎవడు స్థిత ప్రజ్ఞుడో చెబుతుంది. ప్రతిఫలాపేక్ష లేకుండా కర్మ చేయడంలో ఉండే ఆనందం ఎంతో చెబుతంది. మంచి పనులు చేసేవాడికి లభించే శాశ్వత కీర్తి ఎంతో చెబు తుంది. పరమాత్ముడికి ఎవడు ఇష్టుడో చెబుతుంది. ఆయన్ను చేరే మార్గాన్ని చూపిస్తుంది. కర్మ, భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా వేలు పట్టుకుని నడిపించి, మనిషిని దైవాన్ని చేస్తుంది. నీలానే ఇతర ప్రాణికోటినీ ప్రేమించ మని చెబుతుంది. అనారోగ్యకరమైన భావోద్వేగాలను నియంత్రిస్తుంది. ఏ పని చేసినా త్రికరణశుద్ధిగా, ఫలితం పరమాత్మ వంతుగా భావించి, భవ బంధాలను వదలి చేయడమే మనిషి కర్తవ్యం.. ఇదే గీతా సారాంశం!

యుగయుగాలకి తరగని మేధో నిధి - భగవద్గీత:

అసలు కృష్ణుడు అర్జునునికి ఉపదేశం మొదలెడు తూనే - 'అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజా వాదాంశ్చ భాషసే/ గతాసూ న గతా సూంశ్చ నాను శోచంతి పండితా! దుఃఖింప తగనివారిని గూర్చి దుఃఖిస్తున్నావు' అన్నాడు. నిజానికి మనం చేస్తున్నదీ ఇదే! ఏది అవసరమో అది వదిలేసి, అనవసరమైన విషయాల గురించి ఎక్కువ ఆలోచించి బాధపడుతుంటాం! దీని గురించి ఎంత ఆలోచించాలో, ఎవరి గురించి ఎంత ఆలోచించాలో తెలుసుకోవడమే వివేకం! ఫేస్‌బుక్కుల ముందు విలువైన సమయమంతా పాడు చేసుకుంటున్న యువతరానికి భగవద్గీత పుస్తకం ప్రయోజనమేమిటో చెప్పాల్సి ఉంది.

'క్షుద్రం హృదయ దౌర్బల్యం.... త్యక్త్వోత్తిష్ఠ..!' నీచమైన మనోదౌర్బల్యాన్ని వీడి యుద్ధానికి సంసిద్ధుడవై లే!' అంటూ జాతృతపరచి, జీవనగమ్యానికి చేర్చే స్ఫూర్తి నిస్తుంది గీత! భగవంతుడు కోరికని బట్టి ఇవ్వడు. అర్హతను బట్టి ఇస్తాడు. జ్ఞానులూ అంటే. ఆసక్తిని బట్టీ, అర్హతను బట్టీ జ్ఞానాన్ని ఉపదేశిస్తారు. 'శిష్యస్తేహం.. శాధిమాం త్వాం ప్రపన్నం.. దైన్యంతో ఆలోచనాశక్తిని కోల్పోయాను. శిష్యుడిగా అర్థిస్తున్నాను. సరైన మార్గం చూపించు!' అని అర్జునుడు శరణు వేడాకే కృష్ణుడు గీత బోధ మొదలుపెట్టాడు. ఆసక్తిలేని వాడికి ఏ విషయమూ పట్టుబడదు. అందుకే 'ఆసక్తి లేనివాడికి భగవద్గీత ఉపదేశించవద్ద'న్నాడు కృష్ణుడు.

(ఇదంతే నా తపస్కాయ - 18-67).. భగవద్గీతే కాదు, ఏ సబ్జెక్టయినా అంటే! వేదికపైన ఉపన్యాసకుడు చెప్పిందే చెబితే బోర్ కొట్టేస్తున్నాడంటారు. కాలేజిలో లెక్చరర్ చెప్పింది మళ్లీమళ్లీ చెప్పాలి. దీన్ని రివిజన్ అంటారు. 'గీత'లో కృష్ణుడు చేసిందీ ఇదే! భగవద్గీతలోని వందల శ్లోకాల ఔపోసన పట్టాల్సిన పనిలేదు. బట్టీ పట్టి కంఠశోష తెచ్చుకోమనడం లేదు. ఒక నాలుగైదు శ్లోకాలు చాలు. అవి డీకోడ్ చేసుకుంటే బస్. వ్యాపారం మూడు పువ్వులు - ముప్పై ఆరు కాయలవుతుంది. నమ్మబుద్ధి కావడం లేదు కదా. అయితే ఒక్కసారి అవేంటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన! మా కర్మ ఫలహేతుర్భూః మాతే సంగోఅస్త్వకర్మణి॥" అంటే, నువ్వు కర్మలు చేయడానికి మాత్రమే. ఆ కర్మఫలాలకు అధికారివి కాదు. ప్రతిఫలేక్షతో ఎట్టిపరిస్థితుల్లో కర్మలు చేయకు. అలాగని చేయడం మానకు అని అర్థం. ప్రతీ ఆంట్ర ప్రెన్యూర్'కు ఈ శ్లోకం వర్తిస్తుంది. చేయాల్సిన పని గురించి రెండే రెండు ముక్కల్లో నిక్షిప్తమైన సార్వజనీన సత్యం ఇది. ప్రతీ వ్యాపారి ఇదే సూత్రం మీద పని చేయాలి. ప్రతిఫలం గురించి ఆశించకుండా చేసుకుంటూ పోవడమే. ప్రాసెస్ ఎంజాయ్ చేసుకుంటూ తీరం చేరు కోవాలే తప్ప... ఎంతసేపూ ఫైనల్ ఔట్‌పుట్ మీదనే ఏకాగ్రత చేయొద్దు. అలా అని పూర్తిగా ఆశావాదం లేకుండా పనిచేయమని కాదు. ఆశ పడటం తప్పు కూడా కాదు. కానీ ఎలాంటి చర్యా లేకుండా - గాల్లో దీపం పెట్టే దేవుడా నీవే దిక్కు అంటే మాత్రం కష్టం. చేయాల్సింది చేయాలి. ఫలితం సంగతి తర్వాత ముందు ధైర్యంగా అడుగేయాలి. అంతేకాని అమ్మో అని భయపడి మధ్యలోనే జారుకుంటే ఎన్నటికీ గమ్యాన్ని ముద్దాడలేం.

"వాసంసి జీర్ణాని యథా విహాయ, నవాని గృహ్ణాతి నరోపరాణి।, తథా శరీరాణి విహాయ జీర్ణాని, అన్యాని సంయాతి నవాని దేహీ!!" అంటే, 'చిరిగిపోయిన బట్టలను పడేసి, మనం కొత్తబట్టలు ఎలా కట్టుకుంటామో, జీర్ణమైన శరీరాన్ని వదిలిన ఆత్మ కూడా - మరోకొత్త దేమంలోకి ప్రవేశిస్తుంది' అని అర్థం. ఆంట్రపెన్యూర్లు కూడా అంతే. వెర్సటాలిటీ చూపించాలి. దేన్నయినా స్వీకరించేలా ఉండాలి. అవే సక్సెస్ రుచి చూపిస్తాయి. ముఖ్యంగా మార్పును ఎప్పటికప్పుడూ గమనించాలి. కొత్త ట్రెండ్ ఫాలో అవ్వాలి. నా ఇష్టం - నాకు అదే ఇష్టం అంటే - వాళ్లు అక్కడే ఉండిపోతారు. అలా కాకుండా కొత్తదాని కోసం అన్వేషించాలి. కొత్తదనాన్ని చదివేయాలి. కొత్త అవకాశాల కోసం ఎదురుచూడాలి. అదే నిజమైన ఆంట్ర ప్రెన్యూర్ లక్షణం. బిజెనెస్ అంటేనే నిరంతర ప్రయాణం. వ్యాపారి నిరంతరం పథికుడు. నాలుగు గోడల మధ్యనే ఉంటే ప్రపంచం ఏనాటికీ అర్థం కాదు. మొండిగా ఉండొద్దు. ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి. సంకుచిత భావాలు వదిలేయాలి. స్పాంజి నీళ్లను పీల్చుకున్నట్టు అనుభవాల్ని పాఠాలుగా మలుచుకోవాలి. అప్పుడే గమనం వేగం అందుకుంటుంది.

"క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమ। స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్‌ప్రణశ్యతి॥" అంటే, కోపం వల్ల అవివేకం, అవివేకం వల్ల మతిమరుపు, మరుపుతో బుద్ధినాశనం, బుద్ధినాశనంతో మనిషే నాశనం. ఇదొక యాంగర్ మేనేజ్‌మెంట్ లాంటిది. ఆంట్ర

ప్రెన్యూర్లకు మస్టుగా ఉండాల్సిన లక్షణం. లేకుంటే చెప్పుడు మాటలు విని, వాస్తవాలతో పనిలేకుండా ఆలోచించి బుర్రపాడు చేసుకుంటారు. మైండ్‌లో ఒకరకమైన కన్‌ఫ్యూజర్ ఇయేట్ అవుతుంది. దాంతో సహజంగానే మతిమరుపు వస్తుంది. ఆటోమేటిగ్గా లక్ష్యం నుంచి తప్పుకుంటాం. అందరిముందు నవ్వుల పాలవుతాం. అందుకే కోపాన్ని జయించాలి. టెంపర్‌ని అదుపులో ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో సహనం కోల్పోవద్దు.

"తస్మాదసక్త స్సతతం కార్యం కర్మ సమాచార!, ఆసక్తో హ్యాచరన్ కర్మ పర మాప్నోతి పూరుషః॥" కాబట్టి, చేసే పని, దాని ఫలితము మీద అదే పనిగా ఆసక్తి ఉండొద్దు. కర్మ ప్రకారం చేసుకుంటూ పోవాలంతే అంటాడు శ్రీకృష్ణ భగవానుడు. వ్యాపారమూ అంతే. ఓపెన్ మైండెడ్‌గా ఉండాలి. ఇన్నవేటివ్‌గా ఆలోచించాలి. మార్కెట్ మార్పులను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలి. అంతేగాని బైనాక్యులర్ పట్టుకుని ఎలుకను వేటాడినట్టుగా ఉండొద్దు.

"ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ!, యథోల్బేనావరీతో గర్భస్తథా తేనేదమావృతమూ॥" అంటే - పొగ చేత నిప్పు, ధూళి చేత అద్దం, మావి చేత గర్భస్థ పిండం కప్పబడినట్లే, కోరికల చేత జ్ఞానం కూడా కప్పబడి ఉంటుంది అని అర్థం. ఆంట్రప్రెన్యూర్లు వెతుక్కోవాలే గానీ ఇందులో బోలెడంత నిగూఢార్థం దాగివుంది. కప్పేసే ప్రతీదీ మనల్ని మిస్ లీడ్ చేస్తుంది. ఫర్ ఎగ్జాంపుల్.. ఒకచోట మంట అంటుకుంది అనుకుందాం. వెంటనే పొగ దాన్ని కప్పేస్తుంది. ఎదురుగా వుండే అద్దం మీద ధూళి - నిప్పును, పొగను రెండింటినీ దాచేస్తుంది. అంతులేని కోరికలు నాలెడ్జ్‌ని కిల్ చేస్తాయి. అంతేకదా మరి. ఎక్కడ తగ్గాలో అక్కడ తగ్గాలి. ఎక్కడ నెగ్గాలో అక్కడ నెగ్గాలి. విచక్షణా జ్ఞానమే వ్యాపారం.

ఉపయుక్త గ్రంథ, వెబ్‌సైట్ల సూచి :

1. https://www.eenadu.net/antaryami/story/119038203
2. https://www.andhrajyothy.com/artical?SID=612825
3. భగవద్గీత.

❖❖❖

మార్కండేయ పురాణంలో ధర్మార్థకామమోక్షాలు

– నాగరాజు, స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల, సిద్దిపేట, తెలంగాణ.

శ్లో॥ యదాయదాः ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

ఇలా ధర్మాన్ని గురించి తెలిపే అనేక శ్లోకాలు హిందువుల మత గ్రంథంగా భావింపబడిన భగవద్గీతలో తెలుపబడినాయి. ఇలాంటి సూత్రాల వలన హిందూ ఒక మంతంగా కాకుండా ఒక ధర్మంగా భావించబడుతుంది. ఇలా హిందూ ధర్మం అనేది భారతీయ ధర్మంగా సనాతన ధర్మంగా భావించబడుతుంది.

మతం అంటే ఒక పాక్షిక వాదము అని మాత్రమే అర్థం అలంటి హిందు మతం ఒక ధర్మంగా భావించ బడుతుంది.

ధర్మం అంటే ఒక వ్యక్తి ఆచరించవలసిన ఆచరించే ఒక జీవిన విధానం అంతేకాని ఒక వ్యక్తో, వ్యవస్తో ఏర్ప రచిన విలువల ప్రాతిపదికన ఏర్పడినది కాదు అది జ్ఞానం వల్ల ఏర్పడిన ఆధ్యాత్మిక అపౌరుషేయ వ్యవస్థ ధర్మం.

ధర్మంతో మానవుడు తన జీవితంలో అర్జించేవి అర్థం, కామం, మోక్షం. అర్థం మానవుని జీవితాన్ని ముందుకు సాగిస్తే కామం మానవుని జీవితాన్ని ప్రతి ఫలితింపజేస్తుంది. మోక్ష మానవుని జీవితానికి విముక్తి ప్రసాదిస్తుంది. ఈ మూడింటిని ధర్మంగా పొందినప్పుడు ఆ వ్యక్తి వ్యవస్థలో ఒక ఆదర్శ ప్రాయునిగా ఉంటాడు. అందుకనే వాటిని చతుర్విధఫల పురాషార్థాలు అంటారు.

అలాంటి చతుర్విధ ఫల పురుషార్థాల గూర్చి వేదాలలో, ఉపనిషత్తులలో, పురాణాలలో, సంస్కృతి సాంప్రదాయాలలో ఎంతగానో వివరింపబడినాయి.

భారతీయ ఇతిహాసాలుగా కీర్తింపబడుతున్న రామాయణం - మహాభారతంలో ధర్మార్థకామ మోక్షాలకు నిలువటద్దంలా దర్శింపబడుతున్నాయి. ఇవేకాకుండా పురాణం పంచమవేదం ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అదర్వణ, వేదములే కాక పురాణాలు పంచమ వేదంగా భావించబడుతున్నాయి.

పురాణం అనగా పాణిని ప్రకారం "పునాభవమ్" అనగా ప్రాచీన కాలంలో అని అర్థం యాస్కుని నిరుక్తం ప్రకారం "పురాణం పురానవం భవతి" అంటే ప్రాచీనమైనదైనను క్రొత్తదిగా ఉండే దానిని పురాణం అంటారు. ఈ పురాణాలకు స్వరూపంగా నారాయణుడిని భావిస్తారు. అందుకే నారాయణుడిని పురాణ పురుషునిగా కీర్తిస్తారు.

పురాణాలని కృష్ణద్వైపాయనుడగు వేదవ్యాసుడు 18 మహ పురాణాలుగా విభజించారు. పురాణాలను మొదట వేద వ్యాసుడుసూతరోమ హర్షణునికి బోధించాడు. అలా బోధించబడిన 18 మహా పురాణాలు

"మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వ చతుష్టయం"
'అ'న'ప' లింగ 'కూ' 'స్కా' ని పురాణాన్ని పృధక్ పృధక్"

ఈ అష్టాదశ పురాణాలలో మొదటి పురాణంగా బ్రహ్మ పురాణాన్ని భావిస్తుంటారు. 7వ పురాణంగా ప్రథమాంధ్ర మహపురాణంగా కీర్తించబడుతున్న మార్కండేయ మహా పురాణం దీనిని మారన ఆంధ్రీకరించాడు.

ఈ పురాణం తెలుగు సాహిత్యంలో అనేక కవ్యాలకు కానాచి. మార్కండేయ మహాపురాణం, మార్కండేయ మహాముని చేత చెప్పబడిన పురాణం కాబట్టి దీనిని మార్కండేయ పురాణం అన్నారు.

ఈ పురాణం అతి ప్రాచీనమైన పురాణంగా భావింపబడుతుంది. ఈ మార్కండేయ పురాణంలో 136 అధ్యాయాలు ఉన్నాయి. ఇందులో శ్లోకాల సంఖ్య 9000 గా ఉన్నప్పటికి ఇప్పుడు కేవలం 6900 శ్లోకాలు మాత్రమే లభిస్తున్నాయి. అయితే సృష్టిలో ఉన్న ప్రతి వస్తువు వివిధ లక్షణాలను కల్గి ఉంటుంది. కాబట్టి పురాణాలు కూడా 1. స్వర్గం, 2. ప్రతిస్వర్గం, 3. వంశం, 4. మన్వంతరం,

5. వంశాను చరితము అనే లక్షణాలను కల్గి ఉంటాయి. అయితే మార్కండేయ మహాపురణం మధుర కల్పం గురించి మరియు స్వారొచిష మను సంభవం వివరింప బడింది. ఈ పురాణాన్ని మార్కండేయ మహాముని మరియు ధర్మపక్షలు జైమినికి వివరించిన కథలే ఈ మార్కండేయ పురాణం. ఈలాంటి మహా పురాణాలలో ధర్మార్థ కామమోక్షం గురించి వివరింపబడి ఉంది.

ఈ పురాణం మొదట ధర్మపక్షులు వృత్తాంతం మొదలవుతుంది. ఈ ధర్మ పక్షుల వృత్తాంతంలో ఆ పక్షుల తల్లితార్జి తండ్రి ద్రోణుడు ఆ పక్షుల తల్లి మహాభారత యద్ధంలో మరణిస్తుంది. అలా మరణించిన పక్షి పిల్లలను "శమికుడను" మునిచేత రక్షింపబడినారు.

దీని వలన మానవునికి ఇతర జీవులను రక్షించాలనే ధర్మాన్ని మనకు తెలియజేస్తుంది. అయితే ధర్మం అనేది నీరులా పాత్ర స్వభావాన్ని బట్టి తన స్వభావాన్ని మార్చు కుంటుంది. అందుకే ధర్మం అనేక రకాలుగా తెల్పబడు తుంది.

సత్యం, ధర్మం, స్నేహధర్మం, పత్ని ధర్మం, పుత్ర ధర్మం, క్షత్రియ ధర్మం వివిధ రకాలుగా తెల్పబడుతున్న ధర్మాలుగా మార్కండేయ పురాణ మొదట సత్య ధర్మాన్ని గురించి తెల్పబడినదే.

సత్యం అనగానే మనకు గుర్తుకు వచ్చే వారు సత్య హరిశ్చంద్రుడు., సత్య హరిశ్చంద్రుడు విశ్వామిత్రుణ్ణి రాజ సూయ యాగమునకు కావల్సిన ధనమునం ఇస్తానని మాట ఇవ్వగా దానికై తన రాజ్యాన్ని భార్య పిల్లల్ని త్యజించినప్పటికి తాను ఇచ్చిన మాటకై తనను తాను అమ్ముకొని, ఇచ్చిన మాట తప్పకుండా చివరకు మోక్షాన్ని పొందుతాడు. ఇలా ధర్మాన్ని అనుసరిస్తే మోక్షం కలుగు తుందని మనకు తెలుస్తుంది. దత్తాత్రేయ మహత్య వర్ణలలో కౌశికుడు మరియు అనసూయ వృత్తాంతంలో పత్ని ధర్మాన్ని "మధలసోపాఖ్యానంలో" ఋతధ్వజుడు నాగ కుమారుల యొక్క స్నేహం వారు మధలసన తన తండ్రి ద్వారా మరల ఋతధ్వజనునికి ఇవ్వడం వలన స్నేహ ధర్మం మదలస తన కుమారులకు వివిధ ధర్మాలు గృహస్తు ధర్మాలకు వివరించింది.

స్వారోచిషా మనుసంభవ వృత్తాంతంలో బ్రహ్మణుని యొక్క ధర్మాన్ని వివరింపబడింది.

చతుర్విద ఫలాలలో 2వ దానిగా తెలుపబడుతున్న అర్థం (ధనం), ధనం లేనిది మనిషి మనుగడ సాధించ లేడు అలాంటి ధనం గురించి మార్కండేయ పురాణంలో అధికంగా వివరింపబడలేదు. ఇందులో దత్తాత్రేయో పాఖ్యానంలో రాక్షసులు దత్తాత్రేయుని భార్య అయిన లక్ష్మీదేవిని అపహరించినప్పుడు వారు లక్ష్మీని తలపై మోస్తారు అప్పుడు దత్తాత్రేయుడు.

లక్ష్మీ ఉండే స్థానాల గురించి దాని వలన ప్రయోజనం గురించి వివరించాడు. అదే కాకుండా ఇందులోనే కార్త వీర్యుడు ఐశ్వర్యాన్ని కోరుకోవడం మొదలగునవి స్త్రీ దానం, విద్యదానం గురించి మధాలోసోపాఖ్యానం.

స్వారోచిషా మనుసంభావంలో వివరింపబడినది.

"కామం" ఇది జీవసృష్టికి మూలం అలాంటి కామం గురించి దత్తాత్రేయ ఉపాఖ్యానంలో కౌశికుడు అనే విప్రుడు కుష్టువ్యాధి బాధితుడైనా? తనకు భార్య ఉన్న ప్పటికి అతడు వేశ్యను కోరుకోవడం దాని వలన జరిగిన పరిణామాల గురించి వివరింపబడింది. మదాల సోపాఖ్యానంలో ఋతుధ్వజుడు అను కువలయాశ్వుడు మదాలసను చూసినప్పుడు వారి ఇరువురి మధ్య జనించిన కామోద్రేకం సహజంగా చిత్రీకరించాడు. అదే కాకుండా స్వారోచిష మనుసంభావం.

శృంగార, కామ ప్రవృత్తులకు నిలయంగా కనిపిస్తుంది. ఇందులో వరూధిని ప్రవరునిపై మనస్సు పడడం ప్రవరునిపై వరూధిని వివిధ కామ చేష్టలతో లోబరుచు కోవాలనుకోవడం దానిని ప్రవరుడు తిరస్కరించడం. అలా వరూధిని విరహ వేదనకు గురికావడం తర్వాత మాయ ప్రవరుడు. వరూధిని కామించడం వారి కలయిక వలన మనువు జన్మించడం ఇలా స్వారోచిష ఇందేవరాక్షసుడ్ని చంపుట అతణ్ణి చూసి మనోరమ, కళావతి విభావతిని,

పరిణయమడడం అడవిలో విహరించడం వారితో రోజూ కామించడం వంటి వృత్తాంతంలో కామం గురించి వివరించాడు. ఇలా మార్కండేయ పురాణంలో ధర్మార్థ కామామోక్షా లను గురించి వివరించారు. అంతేకాకుండా వివాహ వ్యవస్థ గురించి వివరిస్తూ వివాహం అనేది ధర్మార్థ కామంను, సిద్ధింపజేస్తాయని వాటి ప్రాధాన్యతను గృహస్థ ధర్మాలను గురించి ఈ పురాణాలతో రమ్యంగా వివరించారు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమార్కండేయ మహాపురాణం (వచనం) - అవంచ సత్యనారాయణ, ఇమ్మడిశెట్టి ఆక్కేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్, 2007.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

పురాణాలు ధర్మార్థ కామమోక్షాలు

– డా॥ శంకర్ అనంత, ఓల్డ్ పిజి హాస్టల్, ఉస్మానియా యూనివర్సిటి, తార్నాక, హైదరాబాద్.

భారతీయ సాహిత్యంలో అష్టాదశ పురాణాలకు ఉన్న ప్రశస్తి మరొక గ్రంథానికి లేదంటే అతిశయోక్తి కాదు. మహాభాగవతం అష్టాదశ పురాణాల్లో చేరనప్పటికీ అది భక్తకోటికి కల్పతరువు. నవవిధ భక్తులకు ఆటపట్టు. వ్యాసులవారు మహాభాగవత కథలను అద్భుతంగా చిత్రించాడు. భగవంతుని అవతార వాదాన్ని పురాణకవులెల్లరూ సమర్థించినవారే. పురాణ కవులు ఎంతటి లౌకిక దృష్టి కలవారో అంతటి ఆధ్యాత్మిక దృష్టిగలవారు. మానవులు భౌతికమైన సుఖాలు అనుభవిస్తూనే శాశ్వతమైన సుఖం అనగా మోక్షం పొందాలని పురాణాలు మనకు ఉపదేశిస్తాయి. భాగవత పురాణంలో ధర్మార్థ మోక్షాలు ఏ విధంగా చిత్రింపబడినాయో తెల్పడానికి ముందు సుమతీ శతకకారుడు చెప్పిన ఒక పద్యాన్ని ఈ సందర్భంలో గుర్తుచేసుకోవడం పొరపాటు కాదనిపిస్తుంది.

"ఉడుముండదె నూరేండ్లును
పడియుండదె పేర్మిపాము పదినూరేండ్లున్
మడుగున కొక్కెర యుండదె
కడు నిల పురుషార్థపరుడు కావలె సుమతీ"

మనిషి ఎంతకాలం జీవించినప్పటికీ తన జీవిత కాలంలో చతుర్విద పురుషార్థాలను సాధింపక తప్పదు. పురుషార్థాలను సాధించటమే మానవ ధర్మమని సుమతీ శతకకారుని ఉపదేశం. అందుకు గాను ఈ పద్యంలో చక్కని దృష్టాంతాలను ఇచ్చినాడు. ఉడుము నూరేండ్లు ఉన్నప్పటికీ, పాము వెయ్యేళ్ళు ఉన్నప్పటికీ, మడుగులో కొక్కెర ఎంతకాలం ఉన్నప్పటికీ ప్రయోజనం లేదని, మనిషి మాత్రం ఎంతకాలం జీవించినా పురుషార్థాలను సాధించాలని చెప్పడం ఈ పద్యంలోని విశేషం. వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభాగవతాన్ని సహజకవి పోతన అద్భుతంగా తెనిగించాడు. భాగవతంలోని కథలు పైకి భక్తిని ప్రబోధిస్తున్నప్పటికి మనిషి ఏవిధంగా జీవించాలో మనకు ప్రబోధిస్తున్నాయి. ధర్మం అంటే ఎవరైనా, ఏ కాలంలోనైనా, ఎక్కడివారైనా తప్పక ఆచరింపదగిన ఒక వ్యవస్థ. ధర్మం తప్పకూడదని మనిషి ధార్మికుడైతే అర్థకామాలతోపాటు మోక్షాన్ని కూడా పొందగలడని భాగవత పురాణం చెబుతుంది. ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందనే నానుడి లోకంలో ప్రసిద్ధమైనది. ధర్మం అంటే సదాచారమే. సత్యం, అహింస, బ్రహ్మచర్యం, మొదలైనవన్నీ ధర్మాలే. ధైర్యం, శౌర్యం, పరోపకారం, ఈశ్వర భక్తి మొదలైనవి ధర్మాలే. ముఖ్యంగా ధర్మం అన్నప్పుడు వర్ణాశ్రమ ధర్మాలు గుర్తుకువస్తాయి. ఆయా ధర్మాలను అనుసరించినప్పుడు మానవులు ఆయా వర్ణాలుగా గుర్తింపబడుతారు. అంతేగాక ఆయా ఆశ్రమాల్లోది ఆయా ధర్మాలను అనుసరించినప్పుడు మానవులకు పూర్ణత్వం లభిస్తుంది. బ్రహ్మచర్యాశ్రమము విద్యాబుద్ధులను నేర్పితే, గృహస్థాశ్రమం ఆశ్రమం భార్యా పుత్రులవల్ల, కుటుంబ సభ్యులవల్ల సుఖసంతోషాలను కలిగిస్తుంది. వానప్రస్థాశ్రమం నిష్కామకర్మకు, జ్ఞానానికి, ఆశ్రయభూతమయ్యింది. జ్ఞాన సాధనలో వానప్రస్థాశ్రమం తోడ్పడితే, మోక్ష సాధనలో సన్యాసాశ్రమం ఉపయోగపడుతుంది. కనుకనే ఆశ్రమ ధర్మాలను వేదాది శాస్త్ర గ్రంథాలు మనకు ఆచరణయోగ్యమైనవిగా సూచిస్తాయి. నూరేళ్లూ జీవిస్తూ సత్కర్మలను ఆచరిస్తూ నూరేళ్లూ జీవించమని వేదం చెబుతుంది. ఈ నూరేళ్ల కాలంలో మానవుడు ధార్మికుడై ఉండాలి. ధర్మబద్ధమైన జీవనమే అర్థకామాలను, చతుర్థ పురుషార్థమైన మోక్షాన్ని అందిస్తుంది.

భాగవతము అనేక సందర్భాల్లో ధర్మం యొక్క ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుంది. భాగవతంలో కృష్ణునియొక్క మహిమలే చోటుచేసుకున్నాయి. శ్రీకృష్ణుని ధర్మప్రబోధం

భాగవతకథల్లో అడుగడుగునా కనిపిస్తుంది. పరీక్షిన్ మహారాజు కలిపురుషుణ్ణి నిగ్రహించి ధర్మపరిపాలన చేసిన విధానము భాగవతంలోని ప్రథమ స్కంధంలో గ్రహింప బడింది. రాజు మొదలుకొని సామాన్యుని వరకు ధర్మ బద్ధమైన జీవితాన్ని గడిపినప్పుడు అతడు ప్రపంచ బంధ నాల నుంచి విడివడి మోక్ష సామ్రాజ్యంలో ప్రవేశించ గలుగుతాడు. కలిపురుషుడు పరీక్షితుతో నీ రాజ్యంలో నాకు చోటు ఎక్కడా అని ప్రశ్నించగా ఆ రాజు అతనికి నాలుగు స్థానాలు సూచించాడట. వాటిలో 1) ప్రాణివధ 2) జూదం 3) చౌర్యం 4) మద్యపానం. ఇట్లే అసత్యం, అహంకారం, కామం, హింస, వైరం, ఇట్టి ఐదు ప్రదేశాల్లో ఉండమని చెప్పి మిగిలిన స్థలాలను స్పృశించరాదని ఆదేశించినాడు. అందువల్ల "విశ్వంభరకు నిర్భరంబైన సంతోషంబు సంపాదించి" పెట్టినవాడు అయినాడు పరీక్షిన్మహారాజు. ధర్మం అనగా సత్యం, అహింస. సత్య మేవ జయతే అన్న సూక్తి ధర్మం పట్ల మానవులకు అపేక్షను ఉద్భవింపజేస్తుంది. ధర్మానికి ప్రతినిధులుగా భాగవతంలోని పాత్రలు గోచరిస్తారు. ధ్రువుడు, ప్రహ్లా దుడు, అంబరీషుడు, విదురుడు, భీష్ముడు మొదలైన వారు ధర్మం తప్పనివారు. ఈ కథలను చదివినప్పుడు మనలో ధార్మిక ప్రవృత్తి పెరుగుతుంది. భాగవతంలోని చతుర్థ స్కందంలో పృథ్చక్రవర్తి జ్ఞాన వైరాగ్యాలను సంపాదించి ముక్తినొందిన విషయం ప్రస్తావింపబడింది.

సీ॥ కర్మంబులను యథాకాలదేశోచిత బలవిత్తములు గాఁగ బరగ్రుధర్మ
ములను బ్రహ్మార్పణ బుద్ధిని జేసి కర్మాసక్తుఁడగుచు సమాహితుండు
ప్రకృతికంటెను దన్నుఁబరమైన యాత్మను గర్మ సంచయ సాక్షిగాఁగ బుద్ధి
నర్థిఁదలంచుచు నాచరించుచునట్ల మెఱుని సామ్రాజ్య లక్ష్మీసమేత

తే॥ మందిరోద్యాన వనభూములందు రాజ్య,
గరిమ వర్తింపఁగా నహంకార రహితుఁ
డగుచుఁదన చిత్తమున నింద్రియార్థములను,
దగులకయ యుండె సన్మహోదారుఁడగు ము.

ధర్మబద్ధంగా జీవిస్తూ సంపాదించిన ధనంతో కుటుంబ పోషణ జరపాలని భాగవతం చెబుతుంది. ఒక సారి భాగవతంలోని కుచేలుని కథను మనం పరిశీలిస్తే అతడు ధర్మబద్ధమైన జీవితం కలవాడని తెలుస్తుంది. అధర్మానికి పాల్పడి, ధన సంపాదనకు ప్రయత్నించిన వాడుకాడతడు. ఎవరు ధర్మాన్ని తెలుసుకుంటారో వార తదనుగుణంగా అర్థకామాలను సాధిస్తారు. విదురుని కథ, అంబరీషుని కథ, రంతీదేవుని కథ మనకు అర్థపురుషార్థం విషయంలో ఎట్లా వ్యవహరించాలో తెలుపుతున్నాయి. ధర్మం కేవలం అర్థకామాలనేకాక మోక్షాన్ని కూడా కలిగి స్తుంది. నారదుడు ధర్మరాజుకు వర్ణాశ్రమ ధర్మాల గురించి చెప్పిన సందర్భం గమనింపదగినది. ఇందులో ఏవర్ణంవారు ఏధర్మం పాటించాలి. ఏ ఆశ్రమంలో ఉన్న వాళ్ళు ఏ ధర్మాన్ని అనుసరించాలో వివరంగా చెప్ప బడింది. శుచి, తపస్సు, సత్యం, జ్ఞానం, అగ్రవర్ణములవారి ధర్మములు కాగా శౌర్యం, ధైర్యం, వీర్యరక్షణ, క్షత్రియ ధర్మాలుగా చెప్పబడ్డాయి. ధర్మార్థకామములయందు కోరిక కలిగి ఉండడం వైష్ణవ ధర్మంగాను, గోరక్షణ శు చిత్వం, పరులను సేవించుట మొదలైన గుణాలు శూద్ర ధర్మాలుగా చెప్పబడ్డాయి.

ప్రతియుగంలోనూ మానవులకు ధర్మమే సుఖాన్ని కలిగిస్తుందనీ, ధనంగానీ, కీర్తిగానీ సంపాదించుటలో ఏమరుపాటు ఉండరాదని భాగవతం సూచిస్తుంది. ఇందులోనే పాలం దున్ని జీవించే కర్షక వృత్తి అర్థ సంపా దనలో శ్రేష్ఠమైందని, ఒకరిని యాచించిపొందే ధనంకంటే కర్షక వృత్తిని అవలంభించి సంపాదించడమే శ్రేష్ఠమని, భిక్షం ఎత్తి ధనాన్ని పొందటం కంటే పొలాల్లో పరిగెలు ఏరుకొని జీవించడంమేలని చెప్పడంవల్ల మనిషి కష్టపడి సంపాదించాలనే విషయం స్పష్టమవుతుంది.

సీ॥ వినుము, కర్షణాదిక వృత్తికంటెను మేలు యాచింప నొల్లని యట్టివృత్తి,
ప్రాప్తంబుఁగైకొని బ్రదుకు కంటెను లెస్స యను దినంబును ధాన్యమడిగికొనుట,

కామం అంటే కోరిక. విపరీతమైన కోరికలు దుఃఖానికి కారణమౌతాయి. భాగవతం కోరికలను అదుపులో పెట్టుకొని, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపమని ప్రభోదిస్తుంది. ధ్రువుని కథలో సురుచి, సునీతి అనే ఇద్దరు సవతులు కనిపిస్తారు. సునీతిది ధర్మబద్ధమైన కోరికలు కనుకనే ఆమె తన కుమారున్ని తపస్సుకు పంపించి పరమాత్మ సాక్షాత్కారానికి కారణం అయింది. రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని పరిశీలిస్తే ప్రజల దృష్టిలో రుక్మిణీ, కృష్ణులు ఒకరికొకరు తగినవారు. రుక్మిణీ కృష్ణున్నే కోరుకున్నది. కానీ ఆమె అన్న రుక్మిణీని శిశుపాలుడికి ఇవ్వాలని కోరుతాడు. ధర్మబద్ధమైన రుక్మిణీ కోరిక నెరవేరుతుంది. గజేంద్రమోక్షం కథలో గజేంద్రుడు ఆడ ఏనుగులతో సరస్సులో దిగి జలకాలు ఆడాలనుకున్నాడు. తన విహారం చేత సరస్సును కకావికలం చేశాడు. అందువల్ల అతడు మొసలిచే బందీ అయ్యాడు. కోరికలు దుఃఖానికి కారణమౌతాయి. చివరికి గజేంద్రుడు "నీవే తప్పని తపంబెరుగ" భగవంతున్ని ప్రార్థించి ఆ మడుగునుంచి బయట పడటమే గాక మోక్షాన్ని పొందుతాడు.

మోక్షాన్ని పొందాలంటే సాంసారిక బంధనాల నుంచి బయటపడాలి. గజేంద్రుడు యోగిగా మారి మోక్షాన్ని పొందినట్లు చెప్పబడింది. అందుకే గజేంద్రమోక్షం కథ సుప్రసిద్ధమయింది. తన కర్మ ఫలాలను భగవంతునికి అర్పించడం వల్ల జీవుడు మోక్షానికి అర్హత సంపాదించుకుంటాడు. భీష్ముడు గానీ, విదురుడు గానీ, ప్రహ్లాదుడు గానీ, వీళ్ళంతా ఆవిధంగా వ్యవహరించినవారే అందుకే వారికి మోక్షం సంప్రాప్తమయింది. భారతంలో కనిపించే భీష్ముని కథ భాగవతంలో ఉంది. అర్జునుడు కృష్ణునితో కలిసి అంపశయ్యమీదున్న భీష్ముని దగ్గరికి వస్తాడు. అప్పుడు కృష్ణుడు ఏదైన కోరిక కోరుకోమని భీష్మున్ని అడుగుతాడు. భీష్ముడు "మా విజమున్‌జేరెడు వన్నెకాడు మదినిఆవేశించున్" ఎల్లప్పుడూ తన హృదయంలోకి ఆహ్వానిస్తాడు. ఇదే బ్రహ్మ సాక్షాత్కారం అంటే. ఎవరికి బ్రహ్మజ్ఞానం కలుగుతుందో వారు మోక్షానికి అర్హులవుతారని భీష్ముని కథాసన్నివేశం తెలియజేస్తుంది. భాగవత దశమ స్కందం కృష్ణుని యొక్క లీలలకు ఆలవాలమయింది. గోపగోపికా జనం సమస్తం కృష్ణుని మీద తమ భక్తిని చూపెట్టారు. తత్ఫలితంగా వారందరు ముక్తికి అర్హులయినట్లు భాగవతం చెబుతుంది. జడభరతుని కథ ముక్తి అనేది ఒక జన్మలో వచ్చేది కాదని అనేక జన్మలు ఎత్తితే కానీ లభిస్తుంది అనేది నిరూపిస్తుంది. భాగవతంలోని భక్తుల యొక్క కథలన్నీ మోక్షంతో ముడివడ్డవే. ఎంత దుర్మార్గుడయినా అంత్య కాలంలో నారాయణ శబ్దాన్ని ఉచ్చరిస్తే మోక్షం లభిస్తుందని అజామిహిరుని కథ చెబుతుంది. మొత్తం మీద భక్తి చేత మోక్షాన్ని పొందవచ్చునని మహాభాగవతం ప్రభోదిస్తుంది.

❖ ❖ ❖

గుణనిధి కథలో మోక్షరీతి

– డా॥. చిలకా అనిత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

15వ శతాబ్దానికి చెందిన శ్రీనాథునిచే విరచితమైన కాశీఖండం 1200 శ్లోకాల ప్రౌఢ రచనగా ఫరిడవిల్లింది. "కాశీఖండం అయ:పిండమ్, నైషదం విద్వదౌషదమ్" అని పేరు గాంచింది. అంటే ఇది ఇనుప ముద్దతో సమానం. అంత తేలికగా అర్థమయ్యేది కాదు. దీనిలో వింధ్యపర్వత విజృంభణ, అగస్తుడు కాశిని వదలి రావడం, ఆ మహర్షి దక్షిణ తీర్థయాత్రలు చేయటం, కుమారస్వామి కాశీ మహాత్మ్యాన్ని వర్ణించటం వంటి కథలు సుప్రసిద్ధమైనది. కాశీ ఖండంలోని ఉపాఖ్యానాలలో కుబేరవృత్తాంతమనే పేరు గల గుణనిధి కథ మిక్కిలి రమణీయంగా ఉంటుంది.

కాంపిల్య నగరంలో వేదవేదాంగాలు పఠించిన యజ్ఞ విశారదుడు యజ్ఞదత్తుడు. ఆయన కొడుకే గుణనిధి. లేక లేక పుట్టిన సంతుకావడం వల్ల గారాబంగా పెంచింది తల్లి సోమిదమ్మ. తండ్రి ఎప్పుడు కొడుకు గురించి పట్టించుకునే తీరికే ఉండేది కాదు. అన్నీ తల్లే చూసుకునేది. గుణనిధి చెడు స్నేహాలు చేసి జూదరులతో తిరిగే వాడు. కొడుకు చేసే అన్ని తప్పులను తల్లి కప్పిపుచ్చేది. యజ్ఞదత్తుడు అప్పుడప్పుడు కొడుకు గురించి అడిగితే చదువుకోవడానికి వెళ్లాడని సర్ధిచెప్పేది. స్నానం చేశాడా? సంధ్య వార్చాడా? అగ్నిహోత్రకార్యాలు చేశాడా? అంటే అవన్నీ చేశాడని భర్తతో నమ్మబలుకుతుంది.

పెళ్ళి చేస్తేనైనా తిక్కకుదురుతుందని పెళ్ళిచేశారు. అయినా గుణనిధి ప్రవర్తనలో మార్పురాలేదు. అంతే కాకుండా కొడుకుతో సోమిదమ్మ నీ ప్రవర్తన గురించి నీవు చేసే పాడు పనుల గురించి నిన్ను కప్పిపుచ్చుతునన్న విషయం మీ నాన్నకు తెలిస్తే నిలువునా చంపుతాడని నీ ప్రవర్తనే నా చావుకు కారణం అవుతుందని హెచ్చరించినా స్పందించడు. ఉన్నత వంశం పరువు కాపాడమని, మీ నాన్న యజ్ఞయాగాదులు చేసి సోమయాజులు అయ్యారని రాజగౌరవం పొందినవాడని, తను తన భర్త సంపదను పుష్కలంగా పొందిన దాన్ని అని చెబుతుంది. నాయనా నీకు నిండా ఇరవైయేళ్ళు. శివుని దయవల్ల పుట్టిన వాడివి నీ భార్యకు పదహారేళ్ళ ప్రాయం. ఇంతటి ఉత్తమ సంపద కలవాడివి నీ అత్త ఉత్తమ ఇల్లాలు నీ మామ ఉదాత్తుడు. మేనమామ మంచి పేరు కలవాడు. వీరందరికి చెడ్డపేరు తీసుకురావద్దని బ్రతిమలాడింది. నీవు ఈ విధంగా చెడు ప్రవర్తనతో జూదరులతో తిరుగుతున్నావని రాజుకు తెలిస్తే మనకిచ్చిన మాన్యాలన్నీ వెనక్కి తీసుకుంటాడు. మనకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా కరువవుతుంది అని కూడా చెబుతుంది. అదంతా చెవిటి వాడి ముందు శంకం ఊదినట్లయింది.

ఒకనాడు యజ్ఞదత్తుడు రాజభవనం నుండి ఇంటికి తిరిగి వస్తుంటే ఒక జూదగాడు ధరించిన ఉంగరం తనదిగా గుర్తిస్తాడు. అది రాజు గారు తనకు కానుక ఇచ్చినది. అది యజ్ఞదత్తుడు ప్రేమతో భార్యకిస్తాడు. అటు వంటి రత్నాల ఉంగరం గుణనిధి పుణ్యమా అని జూదగాడి వ్రేలి మీదకెక్కింది. ఆ ఉంగరాన్ని రెప్పవాల్చకుండా చూసి ఆ జూదగాణ్ణి ఆపి "ఈ ఉంగరం నీకెలా వచ్చింది? నిజం చెప్పు లేదంటే రాజు దగ్గరకెళితే నీకు తగిన శాస్తి జరుగుతుంది. అనిన తరువాత ఆ జూదరి జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పి తన దగ్గర తాకట్టు పెట్టిన వస్తువుల చిట్టా విప్పుతాడు.

అక్షర ధూర్తులలోన నీయనుగు గొడుగు
దొరయు నంతటి యక్ష ధూర్తుండు లేడు
క్షితి తలంబున యాగదీక్ష తులలోన
గీర్తినీయట్టి యాగ దీక్షితుండు లేడు

యజ్ఞయాగాదుల్లో యజ్ఞదత్తుడంతటి వారు లేనట్లే అక్షర ధూర్తుల్లో గుణనిధి అంత అక్షర ధూర్తుడు లేడని

చెప్పడంతో అవమానం, సిగ్గు, కోపంతో ఇంటికి యజ్ఞ దత్తుడు భార్యతో సోమిదమ్మా ఏం చేస్తున్నావు? నీ కొడుకు ఎక్కడికి వెళ్లాడు? నీకు నేనిచ్చిన నవరత్నాలతో చేసిన ఉంగరం తీసుకొని త్వరగా రా!

"మధ్యాహ్న సంధ్యా సమాగమం బిది తీర్థ
మవధరింపుము సంధ్య యాచరింపు - (4.105)

ఆ ఉంగరం ధరించి నేను అగ్నికి హరిర్ధానం చెయ్యా లంటాడు. భర్త మాటలకు సోమిదమ్మ భయపడింది. కాని విషయం బయట పడకుండా కొడుకు చేసిన తప్పు లను కప్పిపుచ్చే ప్రయత్నంలో ఆత్మరక్షణలో పడి ఆ విష యాన్ని బయకు కనిపించకుండా సమయోచితంగా మాట్లా డటం గమనించదగ్గ విషయం. తాను పనిలో ఉన్నానని హడావిడిలో ఎక్కడో పెట్టెలో పెట్టి మరచి పోయానని, అది ఇప్పుడు వెదకి తీసి ఇచ్చే తీరిక లేదని ఇది మధ్యా హ్నం సంధ్య చేసే సమయం కాబట్టి త్వరగా స్నానం చేసి సంధ్యవార్చి, అగ్నికార్యం ముగించి శివారాధన చేసి పంచయజ్ఞాలు నిర్వర్తించమని, మొగసాలలలో అనేక మంది బ్రహ్మణోత్తములు ఎదురు చూస్తున్నారని వండిన వంటలు చల్లారి పోతాయని చల్లారిన పదార్థాలు రుచిగా ఉండవని కమ్ముకొని మాట్లాడింది సోమియమ్మ. కొడుకు ప్రవర్తనపై ఉగ్రుడైన యజ్ఞదత్తుడు వాడెన్నడు చదువు కోడానికి వెళ్ళలేదు, సంధ్యవార్చలేదు, అగ్నిహోత్ర కార్యాలు చెయ్యలేదు ఇవన్నీ చేశాడని చెప్పే దానివి

సాధ్యాయ మెన్నెండు జదువంగ బోకుండ
బోలునే చదువంగ బోయెననుట (4-107)

ఇవన్నీ నమ్మి నేను నా కొడుకు బాగోగులు చూసు కోలేక భ్రష్టుణ్ని చేసుకున్నాను. అని యజ్ఞదత్తుడు అంతటితో ఆగలేదు 'బేదలో మంజిష్ట' ఎక్కడికి పోయిం దని అడిగాడు వేశ్యాగృహంలో తాకట్టు పడిం దేమో? అని ఎద్దేవా చేశాడు. పట్ట సూత్రం, పసిడి ఒడ్డాణం ఎక్కడికి పోయాయి? కటీరమొక్కాయా? వెన్నెల వన్నెలు నీనే దీపస్తంభానికి చెందిన రత్నసాల భంజిక ఎక్కడికి నడిచి పోయింది? రత్నఖచితమైన హంస తూలిక డోల విహారతల్పం ఎక్కడికి పోయింది? ఊచ ముట్టగ ఏకైక పుత్రుణ్ణి నిలువున పాడుచేశావే నిర్భాగ్యు లారా అని ఊగిపోతాడు. ఎక్కడికక్కడ తప్పులు కప్పిపుచ్చే ప్రయత్నంలో సోమిదమ్మ కూడా తనను తాను మోస గించుకుంటూ భర్తను కూడా మోసగించింది ఇదంతా కూడా కొడుకు మీద మమకారంతోనే చేసింది. అతంటితో ఆగకుండా యజ్ఞదత్తుడు విలువైన వస్తువుల గురించి ఆరాతీస్తే సోమిదమ్మ సమాధానం చెప్పలేక నీళ్లు నములు తుంది.

ఏడబోయెనో కదా మేడలో మంజిష్ఠ?
పెను బండువున నైనబెట్ట జాల (4.108)

విలువైన పట్టుశాలువ పండుగనాడు ధరించడానికి వీలులేకుండా పోయింది. అది వేశ్యాగృహానికి చేరి ఉం టుందని వాపోతాడు. చివరికి హంసతూలికా తల్పం కూడా పోయిందని గమనించి గుండె బరువెక్కుతుంది. యజ్ఞదత్తుడు ఎంతటి ప్రణయమూర్తో - అంతటి ప్రళయ మూర్తి ఉన్న ఒక్కగానొక్క బిడ్డను నిలువునా పాడుచేశా వని చెప్పి "చాలునింక నాపాలికి చచ్చిన వాడు కొడుకు" - గుణనిధి అనువాడు కుల విషంబు" అని అంతటితో ఆగక సోమిదమ్మను నువ్వు నాకు భార్యగా తగిన దానివి కాదు అని వదిలి పెట్టాడు. ఆరోజుల్లో గృహస్థ ధర్మం నిర్వర్తించడం పాడింపబడేది కాబట్టి మరొక శ్రోత్రియ పుత్రిని వివాహ మాడాడు.

గుణనిధి సంగతి తండ్రికి పూర్తిగా తెల్సిపోయిందని, తల్లిని కూడా వదిలేశాడని తెల్సుకొని ఇంటికి రాకుండా దేశం మీదకు బయలు దేరాడు. దేశ దిమ్మరి అయ్యాడు. ఆకలితో అలమటించాడు. సమయానికి అన్నం దొరికేది కాదు. ఉండడానికి నెలవు దొరికేది కాదు. తన తల్లిలాగా ఆకలి గమనించి పెట్టే కరుణామయి ఎవరుంటారు అని బాధపడ్డాడు. ప్రొద్దు పొడిచే సరికి గిన్నెలో పెరుగన్నం వడిపిందెలలో అన్నం పెట్టే తల్లి గుర్తొచ్చి రోదిస్తాడు.

అరుణ భస్తి బింబ ముదమాద్రి వయింపుడతేర గిన్నెలో
బెరుగును వంటకంబు వడిపిందియలుం గుడువంగ బెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే ?
హరి హర! యెవ్వరింక గడుపారసిపెట్టెద రీప్సితార్థముల్"

పశ్చాత్తాపంతో క్రుంగి పోతాడు. ఆకలికి అలమటించి అన్నానికి మొహం వాచిపోతాడు. ఒక రోజు ఒక పుణ్యాత్ముడు అభిషేకాలు, జాగరణలు, పారాయణాలూ జరపడానికి పూనుకొని ప్రసాదాలు తయారు చేయించి గర్భగుడిలో ఉంచుతాడు. అందులో ఆ పదార్థాలు సువాసనలు క్రుమ్మరింస్తాయి. ఆ వాసనను గమనించిన గుణనిధికి నోట నీరూరుతుంది. ఆ పక్వాన్న పాత్రను దొంగతనంగా తీసుకురావడానికి ప్రయత్నించి విఫలుడౌతాడు. ఒక భక్తుని కాలివ్రేలు తగిలి "దొంగ దొంగ" అని అరిస్తే పదిమంది లేచారు. గుణనిధి పరుగెత్తుతుంటే వెంటాడి పట్టుకొని కొట్టి చంపుతారు. నడిరేయి నిద్రపోతున్నప్పుడు గదిలో ఒక వస్తువును దొంగ తనంగా తెచ్చుకోవాలంటే దొంగ ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటాడో అన్ని జాగ్రత్తలతో గర్భగుడిలో ఉన్న ప్రసాదాలను తీసుకొని వెళ్లే ప్రతయత్నం చేశాడు. మెల్లగా అడుగుల చప్పుడు కూడా కాకుండా ముని వేళ్లలో గర్భాలయంలోకి కీనీడలో అడుగులు వేస్తూలోనికి ప్రవేశించితే దీపం కొడికట్టింది. దీపాన్ని పెద్దదిగా చెయ్యటం కోసం దీపాంకురాన్ని ఎగదోసి తన వస్త్రంలో కొంత చింపి వత్తిగా చేసి నేతిలో ముంచి దీపం వెలిగించాడు. అంటే దీపారాధన చేశాడన్న మాట. చనిపోయిన గుణనిధి తీసుకెళ్లడానికి యమభటులు ఒకవైపు, మరోవైపు శివభటులు వస్తే ఇద్దరికి వాదులాట జరిగితే యమభటుల ప్రకారం జూదరి, అబద్దాలకోరు, దొంగ, పాపి కాబట్టి యమలోకమయిన నరకానికి వెళ్లాలి. కాని శివభటులు మాత్రం శివరాత్రి అన్నం దొరకకపోయినా ఉపవాసం ఉన్నాడు. (కారణం ఏదైనా కావచ్చు అన్నం దొరక్కపోయినా సరే) అనుకోకుండానైనా జాగరణ చేశాడు. వాస్తవంగా అయితే ఆకలితో నిద్రపట్టక ఆకలిని తట్టుకోడానికి నైవేద్యం దొంగతనానికి పూనుకున్నాడు. శివరాత్రి నాడు జాగరణ చేశాడు. ఇవన్నీ సంకల్పితాలైనా అసంకల్పితాలైన సరే విషయం ఏదైనప్పటికి చివరకు శివాలయ ప్రాంగణం లోనే మరణించుట జరిగింది కాబట్టి అతనికి శివలోక ప్రాప్తికి అర్హుడై పుణ్యలోకాలు పొందాడు.

ఈ కథలో గుణనిధి చెడపుట్టాడు. యజ్ఞదత్తుడు పేరు నిలుపుకోవడానికి పుట్టాడు. యజ్ఞ దీక్షలో నిమగ్నుడై యజ్ఞదత్తుడు ఇంటి పట్టున ఉండి యోగక్షేమాలు చూడలేక కొడుకుని భ్రష్టుణ్ణి చేశాడు. తండ్రి పర్యవేక్షణ లేక పెద్దవారి పట్ల స్త్రీలపట్ల గౌరవం లేక విచ్చల విడిగా చెడు వ్యసనాల బారిన పడి చెడిపోయిన గుణనిధి యజ్ఞదత్తుడుకి పుట్టటవల్లనో తండ్రి చేసిన పుణ్యఫలం వల్లనో శివలోక ప్రాప్తి కల్గింది. లోకంలో దుర్మార్గుడైన కొడుకు ఉండవచ్చుకాని దుర్మార్గపు తల్లి ఉండదని సోమిదమ్మ నిరూపించింది. గుణనిధి ఎంతటి దుర్మార్గుడైనప్పటికి తల్లిని పల్లెత్తి మాట అనలేదు. పైగా ఇల్లు వదిలిన తరువాత తల్లితనకై పడిన అగచాట్లను గుర్తుకుతెచ్చుకొని తల్లితన ప్రాణం వంటిదని కీర్తించాడు. తరువాత కూడా తల్లిని స్మరించే కృతజ్ఞత గుణనిధిలో కలిగినది. తనకు వచ్చిన దీన, హీనస్థితిని తలచుకొని "హరహర" అనుకొన్నాడు. ఇది అతనిలో ఇంగువ కట్టిన గుడ్డగా మిగిలిన శిష్ట సంస్కారం. ఆ శివస్మరణయే అతనిని శివమరణానీ, దాని వల్ల శివలోకాన్ని జన్మాంతరంలో కుబేర పదవినీ కల్గించాయి.

❖ ❖ ❖

ప్రబంధయుగం మోక్షసాధనలో ఆముక్తమాల్యద

– చక్రవర్తుల రమణ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), సిద్దిపేట.

ప్రతి ఉదయం సూర్యోదయం అవుతుంది కాని నీలో జ్ఞానోదయం అయినపుడు నీజీవితంలో వెలుగు వస్తుంది ని భరత్

అన్నట్లుగా ప్రకృతిని సంబంధించిన సత్త్వరజస్తమో గుణములు అవిచేసే పనులు ధర్మార్థకామ మోక్షయందు శూన్యమైనపుడు అవికల్పించే సుఖము వల్ల ఏర్పడే అనుభూతి జీవునకు నిత్యానందం కల్గిస్తుంది. అస్థితినే మోక్షము అంటారు. అంటే జీవికి యదార్థజ్ఞానము అవలంబించాలి. దానివల్ల అవిద్య మిథ్యాజ్ఞానము రాగ ద్వేషము, అధర్మము, అన్యాయము విషయాసక్తి మొదలైన ప్రవృత్తులు దూరమవుతాయి. దీని వల్ల పరమాత్మ సంబంధం ఏర్పడి జీవి పరమానంద బరితుడు అవుతాడు. ఆ పరమ సుఖప్రాప్తియే మోక్షము.

అలాంటి మోక్షమునకు మార్గము మానవుని నాడులలో ధ్యానము వలన వరమానందంతో యుక్తి నొసగుతూ, యోగాభ్యాసమువలన పరమాత్ముని యోగ ప్రాప్తి నొంది మోక్ష సుఖాన్ని విస్తరింప చేసుకుంటాడు. ఈ విధంగా అంతఃకరణ మనోవాక్కాయములందు శుద్ధి అయిన తర్వాత పరమానందమునకు కారణ భూతుడవుతాడు. ఇదంతా తన ఆత్మయందు ఉపాసన విధానముతో ఉపాసనా యోగ సంబంధముతో కూడి ఉంటుంది. అలా ఉన్నపుడే ఉపాసనా యోగ ఫలితము తొందరగా అత్యంత దగ్గరగా ఉంటుంది. ఆఫలితము పరిపక్వత చెంది ఆనందంతో నిండి మోక్ష సుఖాన్ని చేరుతుంది. ఈ విధంగా దశేంద్రియములు, మనస్సు బుద్ధి, చిత్తము, అహంకారము, విద్య, స్వభావము శరీరము, బలముల యందు ప్రవృతిగా మారుతుంది.

మానవుడు సర్వశక్తి సంపన్నుడు ప్రపంచంలో ఏ ప్రాణికి లేని వాక్చాతుర్య నైపుణ్యాన్ని మానవునకు కల్పించారు. అందుకే మానవుడు సర్వశక్తి సంపన్నుడు. అంతేకాదు ఆద్యంత రహితుడు, వ్యాపకుడు, సర్వ పదార్థాలకు వారసుడు అవకాశస్వరూపుడు. అలాంటి మానవుడు దారణకు, పాలనకు, వినాశనానికి కర్త ఇన్ని గుణగణాలు కలిగిన మానవుడు ఆ పరమాత్మకు సమానుడే ఇలాంటి మానవుడు మోక్షసాధనకు ఉపాసనను మార్గంగా ఎంచుకుంటే ప్రపంచమునందు అన్ని ప్రాణుల హృదయములందు వ్యాపకుడై ఆత్మపరిశీలనకు దోహదవుతాడు. ఇలాంటి ఆత్మ పరిశీలనకు దోహదపడే కావ్యాలు అనేకం ఉన్నాయి. ప్రబందయుగంలో వచ్చిన అష్టాదశ వర్ణనలతో కూడిన ప్రబంధములల్లో ధర్మార్థకామ మోక్షముల ప్రస్తావన ప్రబంధకులు సమపాలల్లో ప్రస్తావించనైనది. స్వర్ణయుగంలో ధర్మపరిపాలకుడైన రాజు శ్రీకృష్ణదేవరాయలు విరచించిన కావ్యం ఆయుక్త మాల్యద అనే ప్రౌఢప్రబందము ప్రాచీన సాహిత్యమందు ప్రత్యేక విశిష్టంను ప్రాచుర్యాన్ని పొందినది. భారతంలో అనేక శాస్త్రాలున్నాయి. శాంత రసాన్ని చర్చిస్తూ భారతం అనే మహాకావ్యం గూర్చి ఆనంద వర్ధనుడు 'శాస్త్రకావ్యం అని, భారతంశాస్త్ర దృష్ట్యా మోక్ష పురుషార్థాన్ని, కావ్య దృష్ట్యా శాంతరసాన్ని ప్రతిపాదిస్తుందని' అన్నారు. కావ్య, శాస్త్ర దృష్టి రెండు కలిసినట్టిది భారతం.శాస్త్ర కవి కావ్యంలో రసనందను పండించగలడు. కావ్యకవి శాస్త్రంలో తర్కాన్ని వేరు చేయగలడు. రెండింటిలో ప్రావీణ్యం కలవాడు ఉభయకవి. ఇలా రెండింటిలో ప్రావీణ్యం కలిగిన మోక్ష పురుషార్థాన్ని బోధిస్తూ పాండిత్య విశిష్టతను తెలియజేస్తూ రసానుభూతిని కలిగించే రచన శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద.

'విద్వత్కవయ్యకవయ్య కేవలకవయ్య కేవలం కపయ్య అన్న ఆర్యోక్తి ప్రకారం రాయలు తన ఆముక్త మాల్యదలో విశిష్టాద్వైత మత రహస్యములు రాజనీతి మొదలగు

అంశాలను విపులీకరించారు. ఈ రాజనీతి ఆముక్త మాల్యదలోనే అధికంగా కనబడుతుంది. వైష్ణవరహస్యాలు, ఆళ్వార్లు పండించిన వైష్ణవము అనే బోధననే ఆముక్తంగా చెప్పడం విశేషం ఇందులో భగవంతుడే సర్వ నియంత జీవులకు వ్యక్తిత్వం లేదు.భగవంతుని చేతిలో ఒక ఉప కరణంగా చెప్పాడు. ఆముక్త మాల్యదలో పూలమాలను ముందే దాల్చి శ్రీరంగనాథునకు ఒక చిన్నది ఇస్తుంది. ఆమెనే రంగనాథుడు పెండ్లాడడం ఇందలి ప్రధాన వస్తువు, ఈ కథ సంస్కృత పురాణాల నుండి కాక ద్రావిడ ప్రబంధం నుండి గ్రహించబడింది. అన్ని ప్రబంధముల వలె శృంగార రస ప్రధానముకన్నా శాంత, భక్తిరస ప్రధానం ఎక్కువ ఇందులో గోదారంగానాథుల వివాహకథ మాత్రమేకాక పెంపుడు తండ్రి విష్ణుచిత్తుని కథ ఖాండిక్య కేశిధ్వజ సంవాదము యమునాచార్య చరిత్ర, చండాల బ్రహ్మరాక్షస సంవాదం అనే ఉపఖ్యానాలున్నాయి. విష్ణు పురాణం నుండి ఖాండిక్య కేశిద్వజ సంవాదం, వరాహ పురాణం నుండి మాలదాసరికథను గ్రహించి విష్ణు మహత్మమును బోధించినారు. గ్రంథమునందు కేవలం రెండు మార్లు మాత్రమే ఆముక్త మాల్యద అనే పేరును వాడారు. అనేక మార్లు విష్ణు చిత్తుడు అనే పేరును వాడారు. అందుకే దీనికి విష్ణుచిత్తీయం అనే నామాంతరం కూడా ఉంది. పేరులోనే తెలుస్తున్నది. పరమాత్మయందు చిత్తము నిల్పునట్టివాడు విష్ణుచిత్తుడు. అలాగే గోదా (ఆండాళ్ళు) విష్ణు చిత్తులు ఇద్దరు ద్రావిడ దేశములో ప్రసిద్ధులైన పన్నిద్దఱాళ్వురులలోనివారు. భూదేవియే విష్ణు చిత్తునకు జన్మించింది (దొరికింది). భూదేవి గోదాదేవి యగుటచే పూర్వ జన్మస్నేహము వలన మరాళికా సగ్వినీ, ఏకావళీ, హరిణీ, మనోజ్ఞ అనే పేర్లు కలిగిన నాగకన్యకలు విల్లిపుత్తూరు గ్రామంలో బ్రహ్మణ గృహములందు అవతరించి గోదాదేవి చెలులు మాదిరిగా ఉన్నారని శ్రీకృష్ణదేవరాయులు చెప్పిరి.

త్రివిక్రముడైన విష్ణువు యొక్క ప్రేమను పొందగోరిన భూదేవి అంశయైన గోదాదేవి విరహబాధ నొందుతుంటే విష్ణుచిత్తుడు. భార్య వున్నా రామకృష్ణ పరమ హంసలాగా దాంపత్యధర్మ ప్రతీకగా ఉండి సంతానవంతుడు కాలేక పుత్రిక యొక్క విరహతాపంను ఒక తపస్సే అనుకున్నాడు. రామకృష్ణ పరమహంస 'మానవ స్వబావాన్ని విడనాడి ఐహికమైన బ్రహ్మజ్ఞానాన్ని పొందాలనుకునే మానవులు తప్పనిసరిగా కుండలినీ ప్రబోధం పొందాలని' అన్నారు. అలాంటి కుండలినీ ప్రభావం యొక్క మహిమ ఆయుక్త మాల్యదలో పంచమాశ్వాసాంతంలో తెలియజేసారు.

కంధరనీలవర్ణ, మధుకైటభ నాగసుపర్ణ, యోగి హృ
ద్గంధిభిదోద్ధ భోగి వనితా స్వనవత్ శ్వసనప్రవచ్చిర
స్సంధివసన్నిశాపతి రసప్రుతి దుగ్దపయోధి వీచికా
మంధర కేళికాదర, సమాశ్రిత పంక్తిశిరోధిసోదరా.

మేఘచ్ఛాయ శరీరం కలిగి మధుకైటభులన్న పాము లకు సుపర్ణుడై కుండలినీ యోగుల హృదయగ్రంధి భేదనం వల్ల లేచిన కుండలినీ బుసలకు అని కొనసాగిన ఈ పద్యం యోగశాస్త్ర సంబంధం కలది. గ్రంధి, భోగి వనితా నిశాపతి, శిరస్సంధి, రసస్రుతి ఈ శబ్దాలు కుండలినీ యోగంలో సాంకేతిక శబ్దాలు.

మానవ శరీరంలో ఆరు చక్రాలున్నాయి. మూలా ధారం, స్వాధిష్ఠానం, మణిపూరం, అనాహతం, విశుద్ధి, అజ్ఞాచక్రాలు, మొదటి గ్రంధి జాగ్రదవస్థాకారకుడైన విశ్వనామక జీవుడు, రెండవది స్వప్నావస్థాకారకుడైన తైజసనామకుడు, నిద్రావస్థ అనుభవించని వాడికి స్మృతి కలుగదు అవిద్యాది దోషములనెడి అంధకారమునుండి విడిపడి ఆత్మలను ప్రకాశింప జేసి సర్వావయవవృద్ధికి ముఖ్య కారణమగు ప్రాణమును ప్రాణాయామముతో శుద్ధిచేసి మోక్షప్రాప్తి నొందవలెనని యోగాశాస్త్ర ప్రకారంగా వెల్లడిచేశారు.

శ్రీకృష్ణదేవరాయలు ఈ కావ్యంలో కథానాయక ఆముక్త మాల్యద, ఆ కథానాయికనే శ్రీ రంగపతి పెండ్లి చేసుకున్నాడు. భగవంతుడైన విల్లిపుత్తూరు మన్నారు స్వామి విష్ణు చిత్తునితో కలలో కన్పించి 'మీ అమ్మాయిని

శ్రీరంగం తీసుకపో అంతా మేలేజరుగును' అని చెప్పి అలాగే రాయల వారి కలలో ఆంధ్ర విష్ణువు కన్పించి 'ఒక కృతి నిర్మించి శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితం చేయుమన్నాడు'. విష్ణుచిత్తునకు గోదాదేవినిచ్చి కవికి కావ్యకన్యకనిచ్చి కథను నడిపించమని చెప్పి ముక్తి మార్గానికి చేరువలో ఉండమన్నాడు.

అందుకే శ్రీ కృష్ణదేవరాయలు తనకావ్యంలో గోదా రంగనాయకుల వివాహం జరిపించి రంగనాథునిలో గోదా ఐక్యమయినట్లు తులసిమాలగా అవతరించినట్లు తెలియజేసారు. దీనిని బట్టి ఆముక్తమాల్యద అను ప్రబంధములోని కథ ధర్మార్థకామములతో పాటు మోక్ష మార్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. అందుకే ఋగ్వేద బాష్యం చెప్పినట్లు ప్రాణమునకు ప్రాణము నేత్రమునకు నేత్రము శ్రోత్రమునకు శ్రోత్రము, అన్నమునకు అన్నము, మనస్సునకు మనస్సును అయిన పరమాత్మను తెలిపిన మానవుడు సర్వశ్రేష్టమయిన మనస్సుతో బ్రహ్మమును పొంది మోక్ష సుఖంను ఆనందమును పొందుతారు. ప్రాచీనం నుండి నేటి వరకు మోక్షమునకు, ముక్తిని పొందుటకు పలు మార్గాలు, పలుకావ్యాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇహలోహము వదిలిన ఆత్మ పర మాత్మలో ఐక్యమగుటకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

ఆధార గ్రంథాలు :

డా॥ దుర్గయ్య పల్లా నిని ప్రబంధ వాఙ్మయ వికాసము
శ్రీకృష్ణదేవరాయలు సా ఆముక్తమాల్యద.
మహర్షి స్వామి దయానందసరస్వతి సా ఋగ్వేదబాష్యం.
నీకికమరణం లేదు.
భరత్ పరుమల సా అక్షరాలోచనలు.
రామకృష్ణ పరమహంస.

❖ ❖ ❖

భారతం – కామం

– డా॥. నల్లపనేని విజయలక్ష్మి, శాఖాధిపతి, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

ధర్మార్థ కామ మోక్షాలు చతుర్విధ పురుషార్థాలని శాస్త్రాలలో పేర్కొనబడ్డాయి. వేదాలు నాలుగూ ఈ పురుషార్థాలను, వాటి సాధనోపాయాలను గురించే వివరిస్తున్నాయి. వైదికధర్మంలోని ప్రవృత్తిమార్గం ధర్మార్థకామాల సాధన మార్గం కాగా నివృత్తిమార్గం మోక్షమనే నాల్గవ పురుషార్థానికి సాధనామార్గంగా నిలిచింది. నాలుగు వేదాల సారాన్ని తనలో ఇముడ్చుకున్నది భారతేతిహాసం. అందుకే దీనికి పంచమవేదమని పేరు. "ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ! యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్" అని భారతం గురించి భారతం లోనే ప్రకటించబడింది.

చతుర్విధ పురుషార్థాలలోను మోక్షసాధన అత్యుత్తమమని, అదే జీవితలక్ష్యంగా ఉండాలని భారతీయ తత్త్వవేత్తల అభిప్రాయం. వారు ధర్మార్థకామాలలో ధర్మానికి ప్రాధాన్యమిచ్చారు. మానవుని స్వవిధులను, ఇతరుల పట్ల నిర్వహించవలసిన బాధ్యతలను నిర్దేశించేది ధర్మం. "ధరతి లోకానితి ధర్మః."

నైతికసూత్రాలతో లోకాలను పట్టి నడిపించేది ధర్మం, కాబట్టి ధర్మార్థకామాలు మూడింటిలో తారతమ్య పరీక్ష చేసినట్లయితే ధర్మమే ఆచరణీయమని వాత్స్యాయనుడు చెప్పాడు.

'తేషాం సమవాయే పూర్వః పూర్వో గరీయాన్'

ధర్మార్థ కామాలకు ఘర్షణ జరిగినపుడు కామం అర్థం చేత సాధింపదగినది కనుక కామం కంటే అర్థమే శ్రేష్ఠమని, ఆ రెంటికి సంఘర్షణ జరిగినపుడు అర్థం ధర్మంచేత సాధింపదగినది కనుక ధర్మమే శ్రేష్టమని భావం.

భారతం కూడా మోక్షసాధన అత్యుత్తమమని బోధిస్తుంది. ధర్మార్థ కామాలలో ధర్మం శ్రేష్ఠమని చెపుతూనే అర్థ, కామాలకు గల ప్రాధాన్యాన్ని కూడా వివరిస్తుంది. శాంతిపర్వం తృతీయాశ్వాసంలో ధర్మార్థ కామాల తారతమ్యానికి సంబంధించిన చర్చ కనిపిస్తుంది. ధర్మరాజు విదురుడిని, భీమార్జున నకుల సహదేవులను ఈ విషయంలో వారి వారి అభిప్రాయాలను చెప్పమని అడిగినపుడు భీముడు కామ ప్రాధాన్యాన్ని వివరించాడు.

నాకామః కామయత్యర్థం నాకామో ధర్మ మిచ్ఛతి
నాకామః కామయానో-స్తి తస్మాత్కామో విశిష్యతే
(శాంతి-అ167-శ్లో29)

ఈ లోకంలో కోరికలులేని మానవుని చూడము. ఎవరికి కామం (కోరిక) ఉండదో అతడు ధనప్రాప్తికి పెనుగులాడడు. భోగాల కొరకు ప్రయత్నించడు. అందువల్ల కామము గొప్పది అని భావము.

లోకంలో వివిధ ప్రాణులు చేసే కర్మలన్నీ అవి లౌకికాలైనా, పారలౌకికాలైనా కామ మూలకాలే అని గుర్తించాలి. కామం లేని వానికి కర్మ ప్రవృత్తే ఉండదు. ధనసంబంధమైన, ఇతర భోగసంబంధమైన కోరికలను త్యజించిన ఋషులకు కోరికలు లేవా ? అంటే ఉన్నాయనే చెప్పాలి. అందుకే భీముడు "ఋషులు కూడా ఏదో ఒక కోరికతో తపస్సు చేస్తారు. కోరికల వల్లనే మేధావులు వేదోపవేదాల స్వాధ్యాయం నిరంతరం చేస్తూ విద్వాంసులవుతున్నారు. కోరికల వల్లనే శ్రాద్ధాలను, యజ్ఞయాగాదిక్రతువులను, దాన, ప్రతిగ్రహాది కర్మలను ఆచరిస్తున్నారు. కోరికల వల్లనే వ్యాపారులు, కర్షకులు, గోపాలురు, శిల్పులు మొదలైన వారు వివిధ కర్మలను ఆచరిస్తున్నారు. కొందరు తమ కోరికలను సఫలం, చేసుకోవడానికి ప్రాణాలకు ప్రమాదం కలిగించే సాహస కార్యాలు చేయడానికి కూడా వెనకాడరు. యజ్ఞయాగాదిక్రతువులు, తీర్థయాత్రలు, వివిధ దానాలు, శ్రాద్ధాలు, కృషి , గోరక్ష, వాణిజ్యాదులు, స్వాధ్యాయం, వ్రతాలు, తపస్సులు - అన్ని కర్మలూ కామ మూలకాలే" అని కామ ప్రాధాన్యాన్ని వివరించాడు. 'దధిసారము

చందంబున నధిపా! ధర్మార్థ సారమగు కామరసంబు' అని పెరుగులో సారంగా ఉండే వెన్న వలె ధర్మార్థాలలో కామరసం సారంగా ఉంటుందని, కామం వలన మరింత సౌఖ్యం పొందనివాడి సొత్తు చచ్చుగింజలు గల పంట వలె ఎందుకూ పనికిరానిదవుతుంది అని వివరించాడు.

కోరికల వల్ల మానవుడు సత్కార్యాలను, దుష్కార్యాలను కూడా ఆచరిస్తున్నాడు. తనకు గల భోగాసక్తి కారణంగా మానవుడు విషయ ప్రపంచంలో తగుల్కొని సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు. కోరికల సాధనకు ప్రయత్నించి, ఒకదాని వెంట ఒకటిగా తలెత్తే కోరికలను కట్టడి చేయలేక, వాటిని తీర్చుకోలేక అశాంతికి, దుఃఖానికి గురవుతున్నాడు. భోగాసక్తి లేనివానికి ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఉండదు. అందువల్ల అశాంతి, దుఃఖము, అసంతృప్తి ఉండవు. అయితే కోరికలను సమూలంగా తుడిచిపెట్టడం, ప్రాపంచిక విషయాసక్తిని విడిచిపెట్టడం చాలా కష్టం. అందువల్లనే వేదవేత్తలు ధర్మమార్గంలో మాత్రమే కామాన్ని అనుభవించాలని కట్టడి చేశారు.

శాంతిపర్వం పంచమాశ్వాసంలో వ్యాసుడు అరిషడ్వర్గాలలో ఒకటైన కామాన్ని క్షయింప చేసుకోవలసిన అవసరాన్ని శుకునికి వివరించాడు.

బంధనంబులలో నెల్లఁ బరమ బంధ
నంబు గామంబు దద్వర్జనమున నాత్మ
యభ్ర పటలంబు వాసిన యమృత కిరణ
పూర్ణ మండలమును బోలెఁ బొలుచు ననఘ

(శాంతి - 5 - 190)

జీవుడిని సంసారంలో బంధించే బంధనాలన్నింటిలోనూ కామమనే బంధనం చాలా గట్టిది. దానిని వదిలించుకోగలిగితే మబ్బులను విడిచిన పూర్ణచంద్రుని వలె ఆత్మ ప్రకాశిస్తుంది.

పరతత్త్వోపాసన తత్పరుఁడై సంక్షీణ కామభావత నున్నం
బురుషు సుఖమొందు వృద్ధిం
బొరయుచు వపు వమృతకిరణుఁ బొందిన మాడ్కిన్

(శాంతి - 5 - 191)

పరతత్త్వాన్ని ఉపాసించడం ద్వారా కామ భావాలను క్షయింపజేసుకోవాలి. అలా చేయగలిగితే శుక్లపక్షంలో చంద్రుడు నిత్యాభివృద్ధిని పొందిన విధంగా పురుషుడు శాశ్వత సుఖాన్ని పొందగలుగుతాడు. కామమనే వృక్షం ఏ విధంగా వృద్ధి చెందుతుందో దానిని ఎలా తొలగింప జేసుకోవాలో కూడా వ్యాసుడు విపులంగా తెలిపాడు.

వినుఁ మోహబీజ సంజనితంబుగాఁ ద్రు
మంబు ప్రమాద జలంబు దనకుఁ
బరిషేచనంబుగఁ బెరుఁగు నజ్ఞాన స్థి
రాధార కలితమై యందసూయ
పత్రసంపద యది చిత్ర తరంబు మా
న స్కంధ దృఢత నున్నతి వహించు
శోక శాఖంబు ననేక చింతోప శా
ఖంబు బురాకృత కర్మసార
ఘనముఁ దృష్ణలతా పరిగతము నగుచుఁ
బొలుచుఁ దత్ఫలములకు లుబ్ధులు గడంగి
ప్రాఁకి పడుదురు విడుపు శస్త్రముగ నది వి
ఖండితము సేసి బుధుఁడు దుఃఖములఁ దొఱఁగు

(శాంతి - 5 - 199)

"కామమనే వృక్షం మోహబీజం నుండి మొలకెత్తి ఏమరుపాటు అనే నీటితో పెరుగుతుంది. అజ్ఞానమనే గట్టి వేళ్ళతో అసూయ అనే ఆకులతో చిత్రంగా ఉంటుంది. అభిమానమనే కాండంతో దృఢపడి ఆ వృక్షం ఎదుగుతుంది. శోకమే కొమ్మలుగా, అనేక చింతలే రెమ్మలుగా, పూర్వం చేసిన కర్మల బలమే బలంగా పెరుగుతుంది. ఆశలనే తీగలతో ఆ చెట్టు చుట్టబడుతుంది. లోభులు ఆ చెట్టు పండ్లను ఆశించి ఎక్కి చివరికి పతనమైపోతారు. ఆత్మజ్ఞానం గల పండితుడు త్యాగమనే

కత్తితో ఆ చెట్టును తెగనరికి దుఃఖాలకు దూరమౌతాడు." అని చెప్పి కేవలం ఆత్మ జ్ఞానం కలవారు మాత్రమే నిస్సంగత్వంతో, కర్మ పరిత్యాగంతో కామ బంధనాల నుండి బయటపడగలరని తేల్చి చెప్పాడు.

భారతంలో కృష్ణుడు కోరికలను సమూలంగా నిరసించలేదు. ధర్మవిరుద్ధం కాని కోరికలను తీర్చుకోవచ్చని చెపుతూ 'ధర్మావిరుద్ధమైన కామము నేనే' అని పేర్కొన్నాడు. ధర్మసమ్మతమైన కామం మానవుని ఆధ్యాత్మికోన్నతికి, సుఖశాంతులతో కూడిన జీవితానికి దోహదపడితే ధర్మవిరుద్ధమైన కామం శాశ్వతమైన దుఃఖానికి, అశాంతికి దారితీస్తుంది. ఈ రెండింటి ఫలితంలో గల భేదాన్ని చూపడానికే భారతం రచించబడింది. అందుకే అది సార్వకాలికంగా, సార్వజనీనంగా ప్రజల మన్ననలందుకుంటున్నది.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

సాహిత్యం చెప్పిన సార్వకాలిక ధర్మాలు

– డా॥ వై. వి. సిహెచ్. లీలా పద్మజ, తెలుగు శాఖాధిపతి, రాజా ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కళాశాల, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

దేశగౌరవమ్ము జాతి పై నిల్చు
జాతి గౌరవమ్ము నీతి పై నిల్చు
నీతి కలిగిన జాతి నిజమైన జాతిరా

అని పెద్దలన్నట్లు ఏ జాతి గౌరవమైనా అది అనుసరించే నీతి పైనే నిలుస్తుంది. అలా జాతిని నీతిపైన నడిపించడానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాహిత్యం, ధార్మిక ప్రసంగాలు నీతి శతకాలు మొ॥న వెన్నో దోహద పడతాయి. 'సర్వాగమానాం ఆచారం ప్రథమం పరికల్పితే ఆచార ప్రభవోధర్మ : ధర్మస్య ప్రభురచ్యుత:' అని ఆరోక్తి, అన్ని ఆచారాలూ ఆగమాలలో (వేదాలలో) చెప్పబడ్డాయి. ఆచారాల వల్ల ధర్మం ప్రభవించబడుతుంది. అలాంటి ధర్మానికి ప్రభువు అచ్యుతుడు. చ్యుతి (నాశనం) లేని హరి అని అర్థం. ఆచారమనే పచ్చని చెట్టుకి ఆచరణ అనే నీరు పోయాలి.

వేదమూలమిదం జ్ఞానమ్ - వేదాలే జ్ఞానానికి మూలం. ఆవేదాలలోని జ్ఞానమే పురాణాలు, కావ్యాలు, శతకాలు ఇలా బహుముఖీన రూపాలుగా విస్తృతి కాబడ్డాయి. ఏకం సత్ బహుదా వదంతి అన్నట్లు ఒకే సత్యం అనేక రూపాలుగా చెప్పబడింది. సమాజం ఏకాలం నాటిదైనా సార్వకాలిక ధర్మాలుగా కొన్నిటిని ఆచరిస్తుంది. అందులో సత్యం చెప్పుట, ధర్మబద్ధంగా సంపాదించిన ధనంతో గృహకృత్యాలు నేరవేర్చుకొంటూ దాన ధర్మాలు చేస్తూ మోక్ష ప్రాప్తిని పొందుట. పరుల వస్తువులను గానీ మరేదీ గానీ అపహరిచడం గానీ, కావాలని కోరుకోవడం కానీ చేయకుండుట. హింస చేయకుండుట మొ॥నవి. అలాంటి హితులను, నీతులను సాహిత్యం బోధిస్తుంది. ఆ సాహిత్యం ప్రాచీనం కానివ్వండి ఆధునికం కానివ్వండి. సాహిత్యం స్వభావం అదే. ఎందుకంటే విశ్వశ్రేయం : కావ్యం కదా.

మన సంస్కృతికి జీవనాధారం, రామాయణ మహా భారత, మహాభాగవతములు. వాటిల్లో ఎడనెడా ధార్మిక విషయాలను పాత్రాగతంగా సోదాహరణంగా వివరించారు. ఆయా పాత్రలు మనకు ఎలా వుండాలో చెప్పేవిగా ఎలా వుండ కూడదో చెప్పేవిగా వుంటాయి. మన భాషా సాహిత్యాలలో ఏ చిన్న సామెత అయినా ఏ చిన్న లోకోక్తి అయినా ఏ పిట్టకథ అయినా ఏ సూక్తి అయినా కూడా మనకు ధర్మాన్ని బోధించేవిగానే వుంటాయి. అది తెలుగు వారు చేసుకున్న పుణ్యం అనే చెప్పాలి.

భారతంలో మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు ఎట్లా వుండాలో చెప్పబడ్డాయి. వ్యక్తిత్వ వికాసానికి ఏవి మార్గాలో చెప్పబడ్డాయి. రామాయణంలో రాజు తన రాజ్య ప్రజలతో ఎట్లా వుండాలో, తల్లిదండ్రుల పట్ల, కుటుంబ సభ్యులు పట్ల ఎట్లా వుండాలో చెప్పడమైంది. రామరాజ్యంగా కీర్తింపబడాలంటే రాజనేవాడు ఆచరించవలసిన ధర్మాలను తెలియ చేసింది. రామో విగ్రహ్వాన్ ధర్మ : అని ప్రసిద్ధి పొందిన శ్రీరాముడు తరాలెన్ని మారినా తరగని సుగుణ శోభితుడు.

భాగవతంలో మరియు భారతంలోనూ మనం చూసే కృష్ణుడితత్వం / లోకానికెంతో ఔపదేశికత్వం కలిగిస్తుంది. భాగవతంలో పోతన గారు ప్రహ్లాద చరిత్రలో ఏ జాతికైనా విద్యావశ్యకత ఎంతటిదో చెబుతూ చెప్పిన ఈ మాటలు

చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురతకలుగున్
చదువగవలయును జనులకు

.....

సార్వకాలిక ఆచరణీయములు

ఏది మంచి ఏదిచెడు అనే వివేకం కలిగిన జాతికి పాపభీతి వుంటుంది.

ప్రహ్లాదుడెట్లుండే వాడో చెప్పిన ఈ మాటలు మాన వాళి ఎట్లుండాలో అన్యాపదేశంగా చెప్పడమే, 'ఆత్మ వత్సర్వ భూతాని' అని అన్నట్లు తన వలె ప్రాణులందరినీ చూడాలి. తన యందు అఖిల భూతములందు ఒక భంగి సమహితత్వముతో నుండట, పెద్దలెదురైన సేవకు డివలె చేరి సమస్కారములు చేయుట, కన్నులకు అన్యకాంత లెదురైన మాతృ భావనతో మరలుట, తల్లిదండ్రుల వలె ధర్మవత్సలతతో దీనులను రక్షించుట, స్నేహితులపట్ల సోదరస్థితి, దైవతములుగా గురువులను భావించుట, లీలలందున బొంకులు లేకుండా వుండడం మొ॥నవి ప్రహ్లాదుని లక్షణాలు మరియు మంచి రూపం, విద్య మొ॥న వెన్నో కలిగినా గర్వం దరిచేరనివాడు, ఎన్నో సంప దలున్నా గానీ పంచేంద్రియములకు వశముకాని ఇంద్రియని గ్రహంతో శమ, దమాదులనే సంపదతో వర్ధి ల్లేవాడు. మంచి వయస్సు, బలము వున్నప్పటికీ కామ రోషాదులు లేనివాడు, స్త్రీ మొ॥న వెన్నో సుఖభోగముల అవకాశం వున్నప్పటికీ వ్యసన సంసక్తి లేనివాడు నిత్యము హరి ధ్యానము మాత్రమే వున్నవాడు ప్రహ్లాదుడు.

అలాగే వర్ణాశ్రమ ధర్మాలను భాగవతంలో - అన్ని వర్ణాల వారికి పనికి వచ్చే ఉత్తమ ధర్మం, సార్వకాలిక దర్మం ఏదో చెప్పండి అంటూ నారదుడిని దర్మరాజు అడిగినపుడు ఆయన చెప్పిన నారాయణుడే స్వయంగా తనకు చెప్పినవి అంటూ చెప్పిన 30 ధర్మాలు - సత్యము, దయ, ఉపవాసాది తపము, శౌచము, సైరణ, సదసద్వి వేకము, మనోనియము, బహిరింద్రియ, జయము, హింస లేమి, బ్రహ్మచర్యము, దానము, యధోచిత జపము, సంతోషము, మార్ధవము, సమదర్శనము, మహాజనసేవ, గ్రామ్య కోరికలు, నిష్ఫల క్రియలు విడుచుట, మిత భాషిత్వము, దేహముగాని తన్ను వెదకికొనుట. అన్నోద కంబులు ప్రాణులకు పంచియిచ్చుట, ప్రాణులందు దైవత్వ బుద్ధి, ఆత్మ బుద్ధి చేయుట, శ్రీనారాయణ చరణ స్మరణ, కీర్తనం, శ్రవణం, సేవ, నమస్కారము, అర్చన, దాస్యము, సఖ్యము, ఆత్మ సమర్పణం చెలిమి కలిగి వుండుట. ఇక బ్రాహ్మణులకు దానములు చేయుటు, దానములు పుచ్చుకొనుట వంటి అదనపు లక్షణములు. క్షత్రీయుడు ఆచరించవలసిన వాటిలో యజ్ఞములు చేయుట, చేయించుట, దానములు చేయుట వంటి అదనపు లక్షణములు, వైశ్యులకు గోరక్షణ, వ్యవసాయ, వాణిజ్యం, అలాగే శూద్రులకు ఒకటే సేవ బ్రాహ్మణ సేవ అని చెప్పబడ్డాయి.

బహిరింద్రియ నిగ్రహం, అంతరింద్రియ నిగ్రహం, శుచిత్వం, తపస్సు, సౌమ్యత, దయ, సత్యం, జ్ఞానం, క్షమ, విష్ణుభక్తి, హర్షము ఉత్తములకు స్వాభావికమైన లక్షణములుగా చెప్పబడ్డాయి.

అట్లాగే స్త్రీ ధర్మాలు కూడా ప్రత్యేకించి చెప్పబడ్డాయి. నిజంగా ఇలా ఆయా పురుషులు తమ తమ ధర్మాలను, ఆయా స్త్రీలు తమ తమ ధర్మాలను పాటించినపుడు పట్టాల మీద ప్రయాణించిన రైతు గమ్యం చేరినట్లు సమాజం ధర్మమనే గమ్యం చేరుతుంది.

.....

పోతన భాగవతం - సప్తమస్కందం - ప్రహ్లాద చరిత్ర.

స్త్రీలు తమను తమ గృహాలను చక్కగా తీర్చిదిద్దుకో వలెనట, సత్యం ప్రియకరంగా పలకాలట, దాక్షిణ్యం, సంతోషం ధర్మచింతన, మేధాచింతన కలిగి భర్తను దైవ తమునిగా భావించి బంధువులతో సౌమ్యంగా మెలగి, భర్త సౌఖ్యాల నెరిగిమసలుకుని, ఒక వేళ భర్త దారి తప్పిన వాడైనప్పటికి తన పాతివ్రత్యబలంతో అతనిని ఉద్ధరించి ఉత్తమునిగా తీర్చిదిద్దుకోవలెనట.

అలాగే బ్రహ్మచారికి కొన్ని నియమాలు చెప్పబడ్డాయి. అలాగే అనేక కులవృత్తుల వారికి ఆయా వృత్తి ధర్మాలు చెప్పబడ్డాయి. ఉత్తమ గృహస్థుడికి లక్షణాలు చెప్ప బడ్డాయి.

సత్యమహిమను వామనావతార చరిత్రలో వామనుడికి దానం ఇవ్వవద్దని వారిస్తున్న శుక్రుడితో బలిచక్రవర్తి గృహస్థుని ధర్మాలను చెబుతూ సత్యహీనుని మోవజాల

ననుచు బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ అంటాడు. ఎలాంటి దుష్కర్ముడినైనా భూదేవి మోస్తుందట గానీ సత్యం పలుకని వాడిని మోయలేననడంలో సత్యవాక్పరిపాలనకెంత విలువ నివ్వవలసివుందో తెలుస్తుంది. అలాగే పలికి బొంకక నిజమున బరనకంటి మానధనులకు భద్రంబు మఱియుగలదె అనడంలో ఆడిన మాట తప్పరాదు ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటే కలిగే క్షేమం గొప్పది. అనే సందేశం కనబడుతుంది.

అలాగే ఆధునిక యుగంలో కూడా ఎందరో కవులు, తమ తమ రచనలలో ధర్మనిరతిని బోధించారు. వారం దరినీ పేరు పేరునా చెప్పడం సాధ్యం కాదు. కనుక ఉదా :- జాషువా గారి ఫిరదౌసి కావ్యంలోని ఫిరదౌసి లేఖ పరిశీలిస్తే - ఇచ్చిన మాటను తప్పిన గజనీ మహ్మదు గురించి - సత్యవాక్యం బెవడుల్లంఘింపడొ వాడెపొ ధన్యుడిద్ధరా మండలిన్ అన్న మాటలనే చూడండి కాలం మారినా మారని కొన్ని ధర్మాలున్నాయి. వాటిలో సత్యము పలుకుట, హింస చేయకుండట మొ॥నవి. ఎంత అత్యాధునిక కాలమైనా అబద్ధాలు చెప్పడం అత్యుత్తమం అని అనదు కదా. కానీ నేటి మన సమాజంలో అబద్దపు జీవితం, అబద్ధాలతో బ్రతుకును వెళ్ళదీయడం, అనైతికతతో బతకడం, ఘోరాలు, నేరాలు ఇలా హింసాత్మక జీవితాన్ని గడుపుతున్న వాళ్ళను చూస్తున్నాం. కాలం ఏదైనా నీచుడిని నీచంగానే చూసేవారు. చివరిగా వేమన గారు చెప్పిన ఈ పద్యంతో ముగిస్తాను.

హీనగుణమువాని నిలుసేర నిచ్చిన
ఈగ కడుపు జొచ్చియిటట్టు సేయదా
విశ్వదాభిరామ వినుర వేమ

- హీన గుణము కల్గిన వానిని ఎట్టి పరిస్థితులలో మన దరిదాపులకు రానివ్వ రాదు. రానిస్తే ఈగ కడుపులో చేరితే జరిగే కలవరంలాగే వుంటుంది. తస్మాత్ జాగ్రత్త.

// శుభం భూయాత్ //

ఉపయుక్త గ్రంధాలు :

1) రామాయణం.
2) మహాభారతం
3) జాషువా - పిరదౌసి
4) వేమన శతకం - మొ॥నవి.

❖ ❖ ❖

భగవద్గీత – అధ్యయనం

– ఎల్కమూరి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

ప్రపంచ సాహిత్యంలో వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు చాలా ప్రధాన్యత కలిగి ఉన్నవి. మానవ సమాజానికి కావాల్సిన ధర్మాలను తెలియజేస్తాయి.

మానవుని పుట్టుక నుండి మరణించే వరకు జరిగే జీవిత సమస్యల సంఘటనలు, వాటి పరిష్కార మార్గాలు మన వేదాల ద్వారా తెలుస్తాయి.

భారతదేశం సంప్రదాయ, ఆధ్యాత్మికత కలిగి ఉన్న దేశంగా ప్రసిద్ధి చెందినది. ఎందరో మునులు, మహర్షులు ద్వారా ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు ఎన్నో విషములను తెలియజేస్తాయి. అందులో మహా భారతం, ఇతిహాస అంతర్భమైన భగవద్గీత ఒక మహా గ్రంథంగా పేరు పొందింది. ఈ పవిత్ర భూమి కురు క్షేత్రంలో కృష్ణుడు అర్జునుడికి చేసిన గీతోపదేశమే అయినప్పటికి, ఈ సర్వసమాజానికి తెలియజేయడం జరిగిందని గ్రహించాలి. సృష్టి ప్రారంభం నుండి ఇప్పటి వరకు చరిత్రను తెలియజేసే గ్రంథం 'మహాభారతంగా' అని చెప్పవచ్చు. ఇందులో లక్ష శ్లోకాల మహాభారతాన్ని మించి మరో మహాగ్రంథం ప్రపంచ సాహిత్యంలో లేదు. వేల సంవత్సరాలు గడిచి పోతున్నప్పటికి, భగవద్గీతను ప్రతి ఒక్కరు అర్థం చేసుకుంటే, మనకు తెలిసే విషయాలు. గీత ఒక మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని, తత్వాన్ని తెలియజేస్తుంది. అంతేగాక రుగ్వేదం, యజుర్వేదం, ఆధర్వణవేదం, సామేదంలు కలిపి పంచమవేదంగా పిలుస్తారు. అంటే వేదవ్యాసుడు మొదటగా నాలుగు వేదాలను రాసి, ఆ తర్వాత ఆ వేదాల సారం ఉండటం వల్లనే మహాభారతానికి ప్రత్యేక సంతరించుకొన్నది. అందులో ముఖ్యంగా మహాభారతంలో భీష్మపర్వంలో భగవద్గీత ప్రస్తావన చాలా ప్రాముక్యతను సంతరించుకొన్నది. మానవ సమాజానికి అభివృద్ధి ఒక్క ప్రామాణిక గ్రంథంగా పేర్కొనవచ్చు. గీత ధర్మంను, యోగంను, వ్యక్తిత్వ వికాసంను మొదలగు మానవ జీవన ప్రమాణాన్ని తెలియజేసే విషయాలు చాలా ఉన్నాయి. గీత మత గ్రంథము కాదు. ఇది సమాజానికి మంచిని చేకూర్చే హిత గ్రంథంగా పేర్కొనవచ్చు. శ్రీకృష్ణభగవానుడు గీతోపదేశం చేయడానికి కారణం. ధర్మరక్షణ, లోక కళ్యాణం కోసం శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి గీతోపదేశం చేసినాడు. ఎలాంటి సందర్భంలో చూసినట్లయితే కౌరవులు - పాండవులు మధ్య యుద్ధం ప్రారంభ దశలలో అర్జునుడు ఆ యుద్ధ రంగంలో తన వారు తాతలు, అన్నలు, మొదలగువారిని చంపి, ఆ పాపాన్ని ఎలా అని నిరుత్సాహంలో పడిపోతాడు. అప్పుడు శ్రీకృష్ణుడు యుద్ధ ధర్మం గురించి చెప్పుతాడు. ఈ యుద్ధభూమిలో అడుగుపెట్టిన తర్వాత యుద్ధం చేయడం ధర్మం అది ఒక కర్తవ్య బాధ్యతగా భావించాలి తప్ప అధైర్యపడకూడదు. ధైర్య సహసాలు ప్రదర్శించాల్సిన సందర్భంలో మృత్యువును గురించి, బాంధవ్యాలను గురించి ఆలోచించటం తప్పు. విజయం పొందడానికి యుద్ధం చేయడం క్షత్రియ ధర్మం అని శ్రీకృష్ణుడు అర్జునునికి తెలియజేయడం కోసం గీతోపదేశం చేస్తాడు. ఇందులో 'కురుక్షేత్ర' యుద్ధ భూమిలో ప్రారంభదశ నుండి చివరకు జరిగే ధర్మాలను గురించి తెలియజేస్తాడు. అవి జాతిధర్మం, ఆశ్రమధర్మం, గుణధర్మం, రాజుధర్మం మొదలగు అంశాలు కనిపిస్తాయి. అర్జునుడిని చైతన్యపరచడం కోసం గీతప్రస్తావన చేయడం జరిగింది.

"జాతస్య హిధ్రువోమృతుః ధ్రువం జన్మం మృత స్యచ।
తస్మాదపరి హార్యేర్థే నత్వం శోచితు మర్హసి ॥

ఈ సమాజంలో ప్రతి ప్రాణి పుట్టిన తర్వాత మరణించక తప్పదు. ప్రతి ఒక్కరికి తెలిసిన విషయం "శోకించటం

వృదా అని అర్జునునికి గీతాచార్యుడు జీవిత ధర్మాన్ని బోధిస్తాడు''.

"శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనిష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥"

పై శ్లోకం గమనించినట్లయితే పరధర్మాన్ని ఆచరించుటకన్న, గుణరహితమైన నీకు తెలిసిన స్వధర్మమే శ్రేయస్కరం. ఈ స్వధర్మాచరణలో మరణించిననూ శ్రేయస్కరం అందుకే పరధర్మాచరణ ఎప్పుడు భయకరమైనదని బోధిస్తాడు పరమాత్మ అయిన శ్రీకృష్ణ భగవానుడు. ఈ బోధనను మనం క్రమం తప్పకుంటే పాటిస్తే ప్రలోభాలకు లొంగకుండా చక్కటి ప్రగతి మార్గంలో చూపుతుంది అని గీత ద్వారా తెలుస్తుంది. పరధర్మాచరణ కంటే స్వధర్మాచరణ అన్ని విధాల ఉత్తమం తెలియజేయడం జరిగింది.

మానవ జీవన విధానంలో ఆత్మతత్వం గురించి తెలిపే అంశాలు.

ఆత్మతత్వం :

శ్రీ కృష్ణ భగవానుడు ఈ విధంగా బోధిస్తాడు.

"వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథాశరీరాని విహాయం జీర్ణ న్యన్యాని సంయాతి నవానిదేహి॥"

పై శ్లోకం పరిశీలించినట్లయితే ఈ శ్లోకం మానవుడు చిరిగిన వస్త్రం వదలి కొత్త వస్త్రం ధరించినట్లుగా ఆత్మ గూడా చనిపోయిన వారి శరీరం వదిలి కొత్త శరీరాన్ని ధరిస్తుంది.

"నైనం ఛిందతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయం త్యాపోవ న శోషయతి మారుతః॥"

పై శ్లోకం గమనించినట్లయితే ఆత్మతత్వం ఏ విధంగా ఉంటుందో విశ్వంలో ఆత్మ శాశ్వతమైనది. ఆత్మ ఆయుధములో చీల్చబడదు. నిప్పుచే కాల్చబడదు. నీటి చేత తడుబడదు. గాలిలో ఆర్పివేయనూబడదు. ఈ విధంగా ఆత్మకు ఏనాటికీ నాశనము లేదు అని ఆత్మ తత్వాన్ని చెప్పుతాడు. అన్ని తత్వాలకన్నా ఆత్మతత్వం ఉత్తమంగా చెప్పవచ్చు.

ఈ సమాజంలో మానవుడు చేసే కర్మ గురించి తెలియజేసే

"కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన ।
మాకర్మఫల హేతుర్భూర్మా తే సఙ్గోస్త్వకర్మణి॥"

పై శ్లోకం గమనించినట్లయితే సమాజంలో మానవుడు ఏ ఫలితం ఆశించకుండా కర్మ చేయాలి. కర్మ అనేది చేసేపని మీద ఉండాలి. వాటి ఫలితం మీద ఉండ కూడదని, ఆ కర్మాచరణ మాత్రమే కాదూ బాధ్యత కల్గిన మానవ ధర్మంగా బావించాలి. కర్మాచరణ అంటే వ్యక్తి ధర్మం లేదా స్వధర్మాతో కర్మాచరణ సాగాలి అని భగవానుడు అర్జునుడికి బోధిస్తారు. ఈ లోకం ఏపని చేయాలన్న లాభం కోసం ఎదురుచూస్తున్న రోజులు ఇవి. కనుక ఇలాంటి లాభాపేక్ష లేకుండ కర్మ చేయమని బోధిస్తున్నాడు.

ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు భగవద్గీత ఈ సమాజంలో సర్వకాల, సర్వమానవాళికి అభివృద్ధికి తోడ్పడే గ్రంథము భగవద్గీత అని చెప్పవచ్చు. ఇందులో దేశ రక్షణకోసం, సైనికులకు కర్తవ్య బాధ్యతను, మానవుని వ్యక్తిత్వ ధర్మంను, తత్వమును, మానన్తత్వమును, విజ్ఞాన శాస్త్రంగా ఇలా ఎన్నో విషయాలు, అనేక కోణాలలో నిమిడి కృతమై ఉన్నవి. అందుకే మన పురాణాలు, వేదాలు, ఇతిహాసాల ద్వారా ధర్మరక్షణకోసం చాలా విషయాలు ఉన్నవి. ఇప్పుడు భగవద్గీతకు వ్యక్తిత్వ వికాస సర్వప్రామాణికం గ్రంథంగా పేర్కొనవచ్చును. ఉదా:- స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీ తన నిజ జీవితంలో చూసినట్లయితే తన సందేహం కలిగినప్పుడు భగవద్గీతను ఒక్కసారి చదివేవాడట. న్యాయస్థానంలో న్యాయదేవత ముందు భగవద్గీతను ప్రామాణికంగా తీసుకుంటారు.

భగవద్గీత నేటి సమాజంలో ఆధునికకాలంలో ఎందరో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, యువకులు, పిల్లలు, పెద్దలు అందరికి ఆమోదయోగ్యం, ఎన్నో విధాల శాస్త్ర విజ్ఞాన పరంగా అన్ని కోణాలకు సంబంధించిన విషయాలు

అంతర్గతంగా ఉన్నాయి. మానవునికి కావల్సిన వ్యక్తిత్వం గురించి, సృష్టిలో ప్రతిప్రాణి ఏవిధంగా దాని జీవన మనుగడ కొనసాగిస్తుందో తెలియజేస్తుంది.

భగవద్గీత మానవధర్మ శాస్త్రంగా, వేదాలసారంగా, ఉపనిషత్తులసారంగా, సర్వకాల ప్రామాణిక గ్రంథంగా ప్రపంచ దేశాలు, వారి వారి భాషలలో అనువాదములు కావించబడ్డాయి. ప్రపంచ సాహిత్యంలో గీత ఎక్కువ అనువాదములు పొందినదిగా తెలుస్తున్నది. భగవద్గీత వేదగ్రంథంగా, ధర్మశాస్త్రంగా నిత్య పారాయణంగా, పాఠ్యాంశంగా వెలుగొందుతుంది. అందుకే వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మానవ జీవిన విధానానికి ఒక ప్రతీకంగా నిలుస్తాయి.

ఆధార గ్రంధం :

1. శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి, 1963, గీతామకరందము.

❖ ❖ ❖

దాశరథి శతకం – మోక్షమార్గం

– జంగిటి వేణు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ మరియు పి.జి కళాశాల (అ) సిద్దిపేట, తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో శాఖోపశాఖలుగా వికాసము పొందిన కావ్య ప్రక్రియలలో శతకం కూడా ఒకటి. సాధారణంగా కావ్యాలు, కొన్ని సాహిత్య ప్రక్రియలు పండితులకు మాత్రమే పరిమితం. కానీ శతకాలు పండిత పామరులకు వారధిగా ఉంటాయి. అట్లాంటి శతకాల ద్వారా పురుషార్థాలను ముఖ్యంగా మోక్షంను గురించి చాటి చెప్పిన కవులెందరో ఉన్నారు. ఈ పురుషార్థాలు ఏవి అనే ఆలోచిస్తే సృష్టిలో ప్రతి మినిషికి కావల్సిన అంశాలు అవే చతుర్విద పురుషార్థాలు. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం.

ప్రతి మనిషి ధర్మానికి బద్ధుడై, ధనాన్ని సంపాదించాలనీ, ఆ తర్వాత సుఖాలు అనుభవించి, చివర్లో మోక్షం కొరకు ప్రతయ్నం చేయాలని పెద్దలు పెప్తారు.

నేను ఈ పరిశోధన పత్రంలో దాశరథీ శతకంలో ప్రస్తావించబడిన మోక్షం లేదా ముక్తి మార్గాన్ని పొందిన వారి గురించి వారు చేసిన కర్మల గురించి చర్చించదలచుకున్నాను.

మోక్షం :

చతుర్విద పురుషార్థాల్లో ఈ మోక్షం ఉత్తరోత్తర ఉన్నత్తమైనది. ప్రతి మనిషి 'పునరసి జననం, పునరపి మరణం" లేనటువంటి మోక్షాన్ని కోరుకుంటాడు అంటాడు ఆది శంకరాచార్యులు.

అసలు మోక్షం అంటే గ్రామాల్లో ఒక నమ్మకం ఉంటుంది. చనిపోతే మనిషి దేవుడు ముఖ్యంగా పరమాత్మ అయిన శివుడు దగ్గరకు వెళ్తారని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవారు. మానవుడు చేసిన పాపపుణ్యాల ఫలితంగా మరో జన్మ ఆధారపడుతుంది అని వారి అభిప్రాయం. కానీ మోక్షం అనేది పునర్జన్మ రాహిత్యం. మనిషి తన సంసార చక్రంలో పడి తన జీవితంలో ఎన్నో రకాలైన మానసిక క్షోభాలను అనుభవిస్తాడు. వాటి నుండి శాశ్వత విముక్తి కోసం కోరుకునేదే మోక్షం.

దాశరథి శతకం :

భక్తరామదాసుగా పేరు ప్రఖ్యాతులుగడించిన కంచెర్ల గోపన్న రాసిందే ఈ దాశరథి శతకం. ఈయన 17వ శాతాబ్ధానికి చెందిన వాడు. పెళ్ళి చేసుకుంటే కారాగార శిక్షను అనుభవించాల్సిందేనని తెలిసి కూడా కమలను భార్యగా చేసుకున్న గొప్ప వ్యక్తి. ఈనాటి భద్రాచంలో రామ మందిరానికి కారకుడు మన కంచర్ల గోపన్న. అనాటి గోల్కొండ నవాబు ఆగ్రహానికి గురై 12 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. జైలు గోడలపై సీతా రామలక్ష్మణుల బొమ్మలు గీచి, వారిని కీర్తిస్తూ, కటాక్షం కొరకు ఆవేదనతో కాలం గడిపాడు. ఆయన రాసిన రచనల్లో మోక్షమార్గం కనిపించేటువంటి రచనే ఈ శతకం.

తెలుగులో వచ్చిన భక్తి శతకాల్లో ఇది ప్రజాధరణ పొందింది. దీన్ని రోజూ పఠించేవారు కూడా ఎంతో మంది ఉన్నారు. రామనామ మాధ్యుర్యాన్ని రామభక్తి పార వశ్యాన్ని, విష్ణుదేవుని అవతారాల్ని, రాముడి వైభవాన్ని రామ భక్తులు ఆవేశాల్ని నిండుగా వివరించేది ఈ దాశరథిశతకం. "డాం డడ డాం డడాండ నినదంబు లాజాండం నిండ మత్తవేదండమునెక్కి" రామభక్తిని చాటి చెప్పాడు రామదాసు.

కంచర్ల గోపన్న శ్రీరామున్ని కీర్తిస్తూ, పొగడుతూ, ప్రేమతో అనుమానిస్తూ తనకు మోక్షం కల్గించవలసిందిగా ప్రార్థిస్తుంటాడు. రఘువంశంలో పుట్టిన శ్రీరామ నీవు అందరిలోకెల్ల ఉత్తముడవు, ముల్లోకాలల్లో రాజాల్ని స్థాపించిన ఓ రామా! నేను చేసిన పాపాల్ని పోగొట్టి నన్ను రక్షింపు స్వామి అంటూ తనలో ఉన్న ఆవేదనను వ్యక్తం చేశాడు.

ఓ రామచంద్రా నేను రేగు పండ్లకు ఆశపడి ముత్యాలను ఇచ్చినట్టు, నేను నా రచనను దుష్టులకు ఇచ్చి మోసపోయాను. అంటూ వాపోయిన కవి గోపన్న తనకు మోక్షం ప్రసాదించుమని నానా రకాలుగా ప్రార్థించాడు.

శివుడు – పార్వతి :

మహాభారతంలోని విష్ణుసహస్రనామంలో ఉన్నటు వంటి శ్లోకంలో పార్వతీ పరమేశ్వరుని ఏ మంత్రం వల్ల తొందరగా మోక్షం పొందవచ్చని అడిగితే అపుడు ఆ ఈశ్వరుడు.

శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే ॥
శ్రీరామనామ వరానన ఓమ్ నమః ఇతి

అని సమాధానం ఇస్తూ నీ నామ మంత్రంమే ఈ సృష్టిలో గొప్పదని తెలిపాడు మరి. పొద్దస్తమానం నీ నామధ్యానంలో ఉన్న నన్ను కరుణించయ్యా అంటూ మొరపెట్టుకున్నాడు.

గజేంద్రుడు :

ఓ భద్రాచల నివాస ఇంద్రుని వాహానానికి ఆపద కల్గితే వెనువెంటనే వచ్చి అండగా నిలిచావు. నీ దృష్టిలో మానవుడు, జంతువులు అనే తేడా ఏమీ లేదు కదా తండ్రి. మరి నన్నెలా కరుణింపవయ్యా అంటూ సందేహం వ్యక్తపరిచాడు.

అహల్య :

ఏక పత్నీవ్రతుడా రాయిలా ఉన్న గౌతముడి భార్యను విముక్తి చేసి శాపవిమోచన గావించావు. అట్లే ఈ సంసార చక్రంలో నుండి ఈ భవ బంధాల నుండి నాకు మోక్షం కల్పించరావయ్యా.

విభీషణుడు :

లంకా నగరపు రాజ్యాధినేత రావణసురుడి తమ్ముడు విభీషణుడు లాంటి శత్రువర్గానికి చెందిన వ్యక్తులకు కూడా నీవు రక్షణ కల్పిన్తూ, నీ ప్రేమానురాగాలు, రాజ్యసౌఖ్యం కల్పించినటువంటి దయాహృదయుడైన నీవు, నీయందు నా మనస్సును, శరీరాన్ని లగ్నం చేసి నీ యొక్క కృపకటాక్షాల కోసం రేయింబవళ్ళు ఎదురు చూస్తూనే ఉన్నానని తన గోడును వినిస్తాడు.

శబరి :

ఓ దశరథారామ నీకు శబరి ఏమైనా దగ్గర బంధువా? కాదు కదా మరి అట్లాంటి శబరి యందు దయ, ప్రేమా చూపించి ఆమె ఇచ్చిన ఎంగిలి పండ్లను స్వీకరించి ఆమెకు మోక్షం ప్రసాదించావు మరి మొర ఎందుకు ఆలకించడం లేదు అంటూ ఆవేదన చెందాడు.

గుహుడు :

గుహుడు నీకు దాసుడు కాదుగా అట్లాంటి గుహుడికి నీ పాదసేవ చేసే అదృష్టం కల్గించావు. తండ్రి మరి నా చేతులతో నీ పాద పూజ చేసే అవకాశం కల్గించి నాకు మోక్షం కల్పించవయ్యా అంటూ తన ఆవేదనను వ్యక్త పరిచాడు.

ఇవే కాక నీ దశవతారాలతో ఎందరో జీవులకు, భక్తులకు, రాక్షసులకు మోక్షం ప్రసాదించావు. ఈ కలి యుగంలో నాకు మోక్షం కల్గించరావయ్యా అంటూ తల్లడిల్లుతూ తన ఆవేదనకు అక్షరరూపం కల్గించి ఆర్తితో వేడుకొన్న భక్తి రూప రచన ఈ దాశరథి శతకం. ఇందులో అనేక సామాజిక అంశాలతో పాటు మోక్షాన్ని, మోక్ష మార్గాల్ని తెలియజేశాడు మన గోపన్న.

ముగింపు :

ఒక వ్యక్తి తన జీవిత కాలంలో నానా రకాలైన సంఘ ర్షణలకు గురవుతాడు. దానిలో భాగంగానే సంతోషం, బాధ మొదలైనవి అనుభవిస్తాడు.

మనిషి తన దేహంపైన ఉన్న మోజు, తన వద్ద ఉన్న డబ్బు, అధికారం కోరికలే ముఖ్యమని విర్రవీగుతాడు.

తనను తాను తెలుసుకుని తానుండే చోటును తెలుసుకొని మోక్ష రూపాను సంధానం కావాలని కోరుకునే వారు చాలా తక్కువ.

"నాది అనుకుంటే బంధం
నమమ నాది కాదు అనుకుంటే మోక్షం"

ప్రతి మనిషి స్వార్థాన్ని విడిచి నిస్వార్థంగా, ధర్మంగా జీవిస్తూ, డబ్బు, పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తూ, మిత మైన కోరికలు ఉండే ప్రతి వ్యక్తికి మోక్షం తప్పకుండా కల్గుతుంది.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

చతుర్విధ పురుషార్థాలు

– గౌరయ్య, స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల, సిద్దిపేట, తెలంగాణ.

చాతుర్వర్ణ్యం మయా స్పష్టం గుణకర్మ విభాగశః ।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥

వేదాంత పరిభాషలో ప్రతి జావాత్మను పురుషుడు అనీ, విశేష లోకాలతో కూడిన శక్తి క్షేత్రాన్ని ప్రకృతి అనీ అంటాం. ఇలా పురుషుడు ఆత్మక్షేత్రంగా మరి ప్రకృతి శక్తి క్షేత్రంగా, ఒక శుద్ధ చైతన్యం లేదా మహామూల చైతన్యం నుంచి బయటకు వచ్చి రెండుగా విభజింప బడ్డాయి. ఇది సృష్టి యొక్క రచనా కార్యక్రమంలోని మూలరచనా సిద్ధాంతం.

అంటే ఒకానొక మూలచైతన్యం నుంచి ఒక శక్తిక్షేత్రంగా బయటికి వచ్చిన "ప్రకృతి శక్తి" అనేక డైమెన్సన్స్‌లోని అనేక లోకాలుగా మారుతూ అతల, వితల, సుతల, కుతల, పాతాళ, తలాతల మరి భూలోక, భువర్లోక, సువర్లోక, జనలోక, మహర్లోక, తపోలోక మరి సత్య లోకాలుగా విరాజిల్లుతూ ఉంటుంది.

అలాగే మూల చైతన్యం నుంచి ఒక ఆత్మక్షేత్రంగా విడివడి బయటికి వచ్చి అనేక అంశాత్మలుగా విడివడి ఖనిజలోకంలో ఉన్నప్పుడు ఖనిజాత్మగా, వృక్షలోకంలో వృక్షాత్మగా, జంతులోకంలో ఉన్నప్పుడు జంతు ఆత్మగా మానవలోకంలో ఉన్నప్పుడు మానవాత్మగా, దైవలోకంలో ఉన్నప్పుడు దైవాత్మ గా మారి ప్రకృతి లోకంలో ఉన్న ప్పుడు ప్రకృతి ఆత్మగా ఇలా రకరకాలుగా జీవాత్మలు తయారువుతాయి. ఇలా మొత్తం ప్రకృతి క్షేత్రాన్ని ప్రకృతి అన్నట్లే మొత్తం ఆత్మక్షేత్రాన్ని పురుషుడు అంటారు. మానవజన్మ పొందడం ఎన్నో జన్మల సుకృతఫలం. జన్మను సార్థకం చేసుకోవడానికి మానవునికి వివిధ దశల్లో క్రమశిక్షణతో ధర్మబద్ధంగా జీవించడానికి అవసరమైనవి చతుర్విధ పురుషార్థాలు. అవి 1) ధర్మం, 2) అర్థం, 3) కామం, 4) మోక్షం.

ధర్మం :

మతము లేదా సామాజిక నియమాలకు కట్టుబడి నీతి వంతమైన శీలము కల్గి ఇతరులకు హితాన్ని కల్గించేది ఎప్పుడు దృవతారాలా స్థిరమైనది ధర్మము.

అర్థం :

సమాజంలో సుఖమయ జీవనానికి గృహస్థ ధర్మాలను ఇతర బాధ్యతలను నిర్వర్తించడానికి వ్యక్తికి అవసరమైనది సంపద లేదా ఐశ్యర్యం.

కామం :

సమాజంలో వివిధ వ్యక్తుల నడవడిని ఏవిధంగా ఉండాలో వివరించేది కామం. ధర్మబద్ధమైన కోరికలను తీర్చుకోవడమే కామం. ఇది అతి సున్నితమైనది. శారీరక లేక ఇంద్రియ సుఖాలు లేదా లౌఖిక సుఖాలు.

మోక్షం :

పురుషార్థాలలో చివరిది అత్యంత ప్రధానమైనది. అర్థాన్ని, కామాన్ని ధర్మ బద్ధంగా నిర్వర్తించడం ద్వారా దీనిని పొందుతాడు. అంతేగాని కొందరు పూర్వజన్మ సంస్కారాలు ప్రస్తుతం ఏ దశలో ఉన్నప్పటికి వెంటనే వెంటనే సన్యాస స్థితిని పొందే భాగ్యం కూడా ఉండ వచ్చును.

1) బ్రహ్మచర్యం :

సృష్టికి మూలమైన కామాన్ని త్యజించిన వారికి, స్త్రీలను ద్వేషించిన వారికి దూరంగా ఉండేవారో బ్రహ్మచారులు కాలేరు. నిరంతరం బ్రహ్మాన్ని అన్వేషిస్తూ ఆత్మజ్ఞానానికి భౌతిక సుఖాలకు దూరంగా ఉండేవారు. రాగద్వేషాలకు అతీతంగా ఉండేవారు బ్రహ్మచారులు. ప్రతి పురుషుని లోనూ స్త్రీత్వం ఉంటుంది. అది ప్రేరణ శక్తి, అలాగే ప్రతి స్త్రీలోనూ పురుషతత్వం ఉంటుంది. కాబట్టి స్త్రీ

పురుషులు పరస్పర విరుద్ధమైన వారు కారు. అందువల్ల ద్వేషించి త్యజించడం బ్రహ్మచర్యం అనిపించుకోదు.

చతుర్విధ పురుషాలు మానవులకు సదా ఆచరణీయాలు.

కం: బరులెయు వియెనరించిన
వరవర యప్రియముదమున మనంబున కదు దా
కొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథము లకెల్లన్ ॥

ఇతరులు ఏదిచేస్తే నీ మనస్సుకు బాధకలుగుతుందో (మహాభారతం) దానిని నీవు ఇతరులకు లేకపోవడమే ధర్మం ద్వారా మహోన్నత స్థానానికి చేరుకుంటారు అదే మోక్షం. పునర్జనమ్మ రాహిత్యము లేక సంసార చక్రముల నుండి విడుదల ఆశ్రమ ధర్మాలు :- ధర్మం, అర్థం, కామం మూడు గృహస్తాశ్రమ ధర్మాలు అనగా గృహస్తులు పాటించాల్సిన ధర్మాలు. వ్యక్తి ధర్మానికి బద్దుడై గృహస్తాశ్రమం ధనాన్ని సంపాదించాలని, తద్వారా సుఖాలు అనుభవించాలని అంటారు.

కావున ధర్మేచ, అర్థేచ కామేచ నాతి చరామి అని పెళ్ళిలో ప్రమాణం చేయించబడుతుంది. గృహస్తాశ్రమ ధర్మ వల్ల యతులు, ప్రమాణం చేయించబడుతుంది. గృహస్తాశ్రమ ధర్మం వల్ల యతులు, స్వాములు, పరివ్రాజకులు మొ॥ బిక్ష ద్వారా తమ విధులను నిర్వర్తిస్తున్నారు.

వానప్రస్థం :

భార్య భర్తలు కలిసి ఉంటూనే లౌకిక భోగాలకు దూరంగా ఉండి మోక్షార్థులై జపతపాదులు నిర్వహించుటకు పరోపకారధర్యంతో గడిపే జీవితం.

సన్యాస :

సన్యాసం తీసుకున్న వారు సంసారానికి పూర్తిగా దూరంగా ఉండాలి. మోక్షమును పొందాలంటే కామము అనగా కోరిక మరియు ధన సంపాదన ధర్మయుక్తంగా ఉండాలి. సన్యాస ధర్మము అనగా మోక్షమును మాత్రమే కోరుతు మిగిలిన మూడు పురుషార్థాలను త్యాగము చేయడము గృహస్థుడు కూడా కాలాంతరములో దీనిని

యథా గుణః తథా కర్మ
యథా అంతరంగ తథా బహిరంగ

అంటే నీ లోపల ఏదుందో అదే బయటకి వస్తుంది. మరి నీవు చేస్తున్న కర్మలు నీ గుణాలను బట్టే ఉంటాయి. అని అర్థం సృష్టిక్రమంలో గుణాలు సదా మారుతూనే ఉంటాయి. ఇలా మారుతున్న గుణాలను బట్టి మారే కర్మలనే చతుర్వర్ణాలు అంటారు.

అలాగే ఆ మూల చైతన్యం నుంచి ఒకానొక పురుష క్షేత్రం. ఒకానొక ప్రకృతి క్షేత్రం వచ్చి ఒకదానితో ఒకటి లీనం అయిన పుంఖానుపుంఖాలనులుగా లోకాలు ఏర్పడి రకరాలు గుణాల కారణంగా రకరకాల జీవాత్మలు పుట్టుకొచ్చాయి. వీటన్నింటిని నేను అవ్యయుడిలా, అకర్తగా మరి సాక్షిలాగా మాత్రమే ఉన్నాను సుమా! అవి నాలో నుంచి వచ్చినా కూడా .. నేను మాత్రం వ్యయం కాలేదు. అవ్యయం గానూ మరి అకర్త గానూ మాత్రము ఉన్నాను. అని అంటారు భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో.

అంటే ఒకానొక తల్లి బిడ్డను కన్నప్పుడు ఆ తల్లి తన శరీర భాగాన్ని కోసుకుని తను వ్యయం అయ్యి పిల్లలను పుట్టించిందా? లేదే ! తల్లి తల్లిగానే ఉండి తన స్వంత ఇచ్చానుసారం బిడ్డను పుట్టించిందంతే ! ఆ పిల్లలు కూడా తమ స్వంత ఇచ్చానుసారమే ఆ తల్లికి బిడ్డలుగా జన్మించారు. ఇక్కడ ఎవరికి ఎవరూ కర్తలు కారు. ఎవరూ వ్యయం కాబడలేదు.

కనుక ఇలాంటి మూలసూత్రాల సారాన్నంతా అవగాహన చేసుకున్న యోగిశ్వరులంతా కూడా ధ్యానంలో కూర్చుని కళ్ళు రెండూ మూసేసుకుని ఏంచేస్తూంటారయ్యా అంటే తమ తమ దివ్యనేత్రాలతో కోటానుకోట్ల లోకాలను మరియు పుంఖానుపుంఖాలుగా జన్మలు తీసుకుంటున్న జీవులనూ చూసి విస్మయంతో ఆ సృష్టి యొక్క రచనను తిలకిస్తూంటారు.

ఇలాంటివన్నీ ఆత్మక్షేత్రంలోనే వీక్షించగలుగుతారు. కనుక వాళ్ళను ఋషులు, ద్రష్టలు అంటారు. వాళ్ళు తమ తమ అనుభవాలను విశ్లేషించినప్పుడు వాఖ్యానం చేసినప్పుడు వాటిని మనం శ్రద్ధగా వినాలి. దానినే మనం శ్రుతి అంటారు. అలా శ్రుతిచేసే వాటిని చక్కగా మననం చేసి స్మృతిలో ఉంచుకోవాలి.

తమోగుణం, రజోగుణం, సాత్వికగుణం మరి శుద్ధసాత్వికం మిగతా గుణాలన్నీ అలాగే ఉన్నా కూడా ఈ చివరి శుద్ధసాత్విక గుణమే మరి నిర్గుణం గా కూడు అయిపోతుంది. తమోగుణ కర్మలు చేసేవారిని శూద్రులు అనీ, రజో గుణ కర్మలు విశేషంగా చేసేవారిని వైశ్యులు అనీ, సాత్విక గుణం విశేషంగా కలిగి ఉండి కర్మలనాచ రించే వారిని క్షత్రియులు అనీ నదా శుద్ధసాత్విక గుణాలతో కర్మలనాచ రించే వారిని బ్రాహ్మణులు అనీ అంటాము. మనం బ్రాహ్మణ ప్రవృత్తి అంటే బ్రహ్మ జానాతి ఇది బ్రాహ్మణ అన్న స్థితిలోనే ఉన్నట్లయితే నేను దేహమే అన్న స్థితి నుంచి అహం బ్రహ్మాస్మి...అంటే నేనే మొత్తం సృష్టికర్తను అనే స్థితికి అంటే ఒక రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, మహావీరుడు, జీసస్, మహమ్మద్ ప్రవక్త వంటి బ్రాహ్మణోత్తములుగా ఎదిగి మరి నిర్గుణస్థితికి లేదా జన్మరాహిత్యస్థితికి చేరుకుని ఆ మూలచైతన్యంలోకి మళ్ళీ చేరుకుంటాం.

❖ ❖ ❖

ఇతిహాసములు – ధర్మ స్వరూపము

– కె. కూర్మావి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా కళాశాల, కాకినాడ.

ధర్మము, అర్థము, కామము, మోక్షము చతుర్విధ పురుషార్థములు మానవులుగా పుట్టిన వారు సాధించ వలసిన లక్ష్యములు. ధర్మమునకు లోబడిన అర్థ కామముల సంపాదన ద్వారా తురీయమైన మోక్షము కూడా సాధించవచ్చు. అందువలన ధర్మము ఉత్తమ పురుషార్థము."ధరతి విశ్వం ధర్మ:" అని అమరకోశము. విశ్వమును ధరించునది కాబట్టి ధర్మము అని పేరు. కర్తవ్యము, స్వభావము, ఆచారము అని కూడా అర్థములున్నవి. జనులచే పూనబడునది ధర్మము. ధర్మమే సకల చరాచర జగత్తుకు మూలమైయున్నది. ఈ సమస్త ప్రకృతిని నడిపించునది ధర్మమే. దృశ్యాదృశ్య జగత్తు అంతయు ధర్మమునకు లోబడి నడచుచున్నది.

జగత్తులోని చరాచరములన్నీ తమకు తెలియ కుండానే తమకు ప్రత్యేకంగా నియతమైన ధర్మపద్ధతిని తప్పకుండా అనుసరిస్తూ ఉంటాయి. పరమేశ్వరుడు సృష్టించిన ఇన్ని కోట్ల జీవరాశులలో ఏ జీవికీ లేని ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు మానవునికి ఉన్నాయి. వీటితోపాటు యుక్తాయుక్త, కార్యాకార్య విచక్షణా జ్ఞానం ఉన్నాయి. ఇవి మానవుల కార్యకలాపాలను నియంత్రిస్తూ ఉంటాయి. ఈ శక్తులు లేని ఇతర జంతువులు అనాలోచితంగా సహజంగానే అంతర్గతంగా ఏర్పడిన వ్యవస్థ ప్రకారం పనిచేస్తూ ఉంటే మానవుడు మాత్రం స్వబుద్ధితో పని చేస్తున్నాడు. ఈ విధంగా బుద్ధి ప్రేరితమైన మానవుల కార్యకలాపాలు వ్యవస్థకూ, సక్రమమైన జీవన విధానానికీ అవరోధం కలిగించినప్పుడే ధర్మాధర్మాల, న్యాయాన్యాయాల చర్చలకు దారితీస్తాయి. ఈ చర్చల సారాంశములే ధర్మశాస్త్ర గ్రంథములు.

ధర్మాలు కాలానుసారంగా, సందర్భానుసారంగా మారేవి కొన్ని ఉంటాయి, ఎల్లప్పుడూ మారకుండా ఉండే శాశ్వత ధర్మాలూ ఉంటాయి. ఉదాహరణకు మహాభారతంలో -

"అహింసా పరమో ధర్మ: తథాహింసా పరోదమ:
అహింసా పరమం దానమమ్ అహింసా పరమ: మత:"
(అనుశాసనిక పర్వం – 37 శ్లో.)

అని అహింస పరమ ధర్మముగా చెప్పబడింది. కానీ, అహింసా సిద్ధాంతానికి చాలా పరిమితులు ఉన్నాయి. కాబట్టి అహింస అనునది అర్ధ సత్యము మాత్రమే. సందర్భానుసారంగా ఈ ధర్మానికి ఉనికి ఉంటుంది.

రామాయణ కాలానికీ, భారత కాలానికీ ధర్మాచరణలో వ్యత్యాసం కనబడుతుంది. భారతంలో ఉన్నంత క్లిష్టత రామాయణంలో లేదు. రామాయణంతో పోలిస్తే భారతంలో ధర్మోపన్యాసాలు ఎక్కువ. ధర్మ సూక్ష్మాలూ ఎక్కువే. ధర్మాధర్మ విచక్షణ, విరుద్ధ ధర్మాల మధ్య సంఘర్షణ భారతంలో అధికంగా కనబడుతుంది.

ధర్మం సనాతనమైనది. "ఏష ధర్మ: సనాతన:" అని మనుస్మృతి వాక్యం.

ఇటువంటి సనాతన ధర్మమును వైదిక ఋషులు దర్శించి వేదములలో, శ్రుతులలో, పురాణములలో, సంహితలలో ప్రతిపాదించారు. ధర్మాచరణము కఠిన మైనది. ధర్మమునకు స్వపర భేదములుండవు. ఋషి ప్రోక్తమైన సనాతన ధర్మమును ఆచరణయోగ్యముగా ఇతిహాసాలలో, పురాణాలలో, కావ్యాలలో కథల రూపములో కావ్యఋషులు మనకు అందించారు. శ్రీమద్రామాయణము, మహాభారతము మహేతిహాసములు. రామాయణము ప్రక్రియను బట్టి కావ్యమని చెప్పినా, ఇతివృత్తమును బట్టి అది ఇతిహాసమే. "ఇతిహ ఆస:" (ఈ విధముగా జరిగినది) అని ఇతిహాసమునకు నిర్వచనము. రామాయణ భారతములు కల్పితాలు కావు.

వాస్తవంగా ఈ భారత భూమి మీద నడయాడిన వాస్తవ వ్యక్తుల జీవిత గాథలు. వేద విహితమైన ధర్మమును, సత్యమును మనసా, వాచా, కర్మణా ఆచరించి చూపిన మహనీయుల జీవిత చరిత్రలు. సత్య ధర్మముల స్వరూపమును, ఆచరణలోని క్లేశములను, ధర్మ మార్గములో ఎదురయ్యే పరీక్షలు, ఆటంకములు ఎదుర్కొంటూ చిత్తశుద్ధితో సాధించిన ధర్మ విజయము వలన పొందే సౌఖ్యస్థితి మానవాళికి సోదాహరణముగా చూపిన ఇతిహాసములు రామాయణ భారతములు.

ధర్మము అన్ని కాలాలలోనూ ఒకేలా ఉండదు. యుగాన్ని బట్టి మారుతూ ఉంటుంది. కాలాన్ని బట్టి, వ్యవస్థను బట్టి, ఆ వ్యవస్థలో ఉన్న వ్యక్తులను బట్టి ఆచరించవలసిన ధర్మాలలో అంతరం ఉంటుంది. ఏ కాలము నాటి సంఘటనలను ఆ కాలము నాటి సామాజిక ధర్మాల ఆధారంగానే పరిశీలించాలి. ధర్మము అనేది చాలా విస్తృతమైన వ్యాప్తి కలిగిన అంశం. ధర్మమెంతో, ధర్మ సూక్ష్మమూ అంతే.

ధర్మాచరణ రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి వ్యవస్థాగతమైనది రెండు వైయక్తికమైనది. వ్యవస్థాగత మైనది అంటే ఒక సమాజములో ఉన్న అందరూ అంగీకరించి ఆచరించే ధర్మం. ఉదాహరణకి బహు భార్యాత్వం కొన్ని కాలాలలో, కొన్ని సమాజాలలో అంగీకార యోగ్యమైతే, బహు భర్తృత్వం కూడా కొన్ని తెగలలో ఆచారంగానే ఉంది. ఇది వ్యవస్థాగతమైనది. సమగ్రమైన వివేచన లేకుండా ఇటువంటి ఆచారాలను ఏకపక్షంగా విమర్శించకూడదు. ఇక వైయక్తికమైనదైతే, రామాయణ కాలం నాడు బహుభార్యాత్వం దోషం కాకపోయినా, రాముడు ఏకపత్నీవ్రతమునే ధర్మముగా ఆచరించాడు. ధర్మాచరణకు వ్యవస్థలోని అనుకూలాంశాలను అవకాశంగా తీసుకొనకుండా, నైతిక విలువలనే ప్రాతిపదికగా గ్రహించాడు. అందువల్లనే శ్రీరాముడు ఆదర్శ పురుషుడయ్యాడు.

ధార్మికునికి ధర్మమే బలం. "ధర్మో రక్షతి రక్షిత:" అని మనుస్మృతి చెబుతోంది.

మనుస్మృతిలో ధర్మానికి పది లక్షణాలు చెప్పబడ్డాయి.

"ధృతి క్షమ దమ: ఆస్తేయం శౌచ మిన్ద్రియ నిగ్రహ:
ధీ విద్యా సత్య మక్రోధో దశకం ధర్మ లక్షణమ్"
(మనుస్మృతి 6-12)

ధృతి, క్షమ, దమము, ఆస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, ధీ, విద్య, సత్యము, అక్రోధము అనునవి పది ధర్మమునకు లక్షణములు. వీటిలో కొన్ని సకారాత్మకమైనవి, కొన్ని నకారాత్మకమైనవి. ధర్మాలు ఎన్నో ఉన్నా, ఈ పదింటినీ పేర్కొనుటకు కారణం ఇవి కాల దోషం పట్టని, సర్వదేశ సర్వకాలాన్వయములైన శాశ్వత ధర్మాలు. ఈ పది లక్షణాలు కలిగినవారు ధర్మపరులుగా చెప్పబడుతారు. మహేతిహాసాలైన శ్రీమద్రామాయణ మహాభారతాలలో ఈ దశలక్షణోపేతులైన ధర్మ నిష్ఠా పరులు ఉన్నారు. కనుకనే యుగాలు గడిచినా ఈనాటికీ వారిని గురించి చెప్పుకుంటున్నాము.

రామాయణ మహాభారతాలలోని మహనీయుల వ్యక్తిత్వాల ఆధారంగా సనాతన ధర్మ స్వరూపాన్ని స్మరించుకోవటం ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

ధృతి :

ధృతి అంటే ధైర్యము అని అర్థం. ఒడుదుడుకులలోనూ పట్టు సడలని మనోధైర్యం. దశరథుడు 'రేపే నీకు పట్టాభిషేకం' అని చెప్పినప్పుడు చిరునవ్వుతో ఉన్న రాముడు - పినతల్లి 'తత్క్షణమే నీవు అడవులకు వెళ్ళాలి' అన్నప్పుడు కూడా అదే చిరునవ్వుతో ఉన్నాడు. "దశరథుడు నాకు తండ్రి, గురువు, రాజు. అతని ఆజ్ఞ అవుతే అగ్గిలో దూకకలను. విషం తినగలను. సముద్రంలో దూకగలను రాముడు రెండు నాల్కల వాడు కాడు. 'రామోద్విర్నాభిభాషతే'. అని అంటాడు. తిరిగి అయోధ్యకు రమ్మని, రాజ్యాన్ని పాలించమని వశిష్ఠుడు చెప్పి, 'నేను నీ గురువును. నేను చెప్పినట్లు నడుచుకో' అంటే రాముడు

'దశరథుడు నా తండ్రి. ఆయన ఆజ్ఞ ప్రకారం నడుచు కోవడం నా ధర్మం' అంటాడు. భరతునితో 'మన తండ్రి నిన్ను అయోధ్యను ఏలుకొమ్మన్నాడు' అని రాగ ద్వేషములు లేని నిశ్చలమైన మనస్సుతో చెప్పగలిగాడు. అయోధ్యనూ, అడవినీ కూడా సమానంగా చూడగలి గాడు. కారడవులలో ఎదురయ్యే కష్టనష్టములకు చలించని ధీర చిత్తుడు శ్రీరామచంద్రుడు.

క్షమ :

శ్రీరాముడు ఎంత ధీరుడో, అంత క్షమాగుణ సంప న్నుడు. తన ప్రియభార్యయైన సీతాదేవిని అపహరించు కొని పోయిన రావణునిపై దండయాత్రకు బయలు దేరినవాడు రాముడు. అతని తమ్ముడు విభీషణుడు ఆశ్రయం కోరితే ఇవ్వవద్దని సుగ్రీవుడు రాముని వారిం చాడు. అప్పుడు రాముడు "ఎవడు వచ్చి నన్ను శరణు కోరినా వాణ్ణి రక్షించటం నా ధర్మం. విభీషణుడేమిటి? రావణుడే వచ్చి శరణు కోరినా రక్షిస్తాను". అంటాడు.

అశ్వత్థామ నిద్రపోతున్న ఉపపాండవులను అధర్మంగా, క్రూరంగా చంపినా, అతనిని క్షమించగలిగింది ద్రౌపది. క్రోధంతో అశ్వత్థామను చంపటానికి ఉద్యు క్తులవుతున్న భీమార్జునులను తన శాంత వచనాలతో ఆపుతుంది. తనకు కలిగిన పుత్రశోకం మరొక తల్లికి కలుగకూడదని భావించి క్షమకు మరో పేరుగా నిలిచింది ద్రౌపది.

దమము :

దమము అనగా క్లేశమునకు ఓర్చు తనము. రాముడు కట్టుబట్టలతో అడవులకు వెళ్ళమని కైక అన్నందుకు దశరథుడు దు:ఖిస్తుంటే రాముడు - "నేను సర్వసంగ పరిత్యాగం చేస్తున్నాను. నాకు పరివారం ఎందుకు? ధనం ఎందుకు? ఏనుగునే ఇచ్చాను. ఏనుగును కట్టే తాడెం దుకు? నాకు ఇస్తానన్నవన్నీ, భరతునికి ఇచ్చేస్తున్నాను. మాకు నార చీరలు ఇప్పించండి." అంటాడు. అడవిలో ప్రవేశించిన వెంటనే తన కేశములను గార పాలతో జడలు కట్టించుకున్నాడు. రాళ్ళతో కూడిన నేలపై చెట్ల క్రింద పడుకున్నాడు. తగినటువంటి సంభారములు లేక గారపిండితో తండ్రికి ఉత్తర క్రియలు నిర్వహించి గారపిండినే ఆహారంగా భుజించాడు. ఇన్ని కష్టములలోనూ ఒక్కసారి కూడా తనకు ఇటువంటి స్థితి కలిగినందుకు తండ్రిని గానీ, పినతల్లిని గానీ, భరతుని గానీ మాట వరుసకైనా, మనసులోనైనా, నిందించలేదు. అరణ్యవాస క్లేశములను సంతోషంగా ఆహ్వానించిన పితృభక్తుడు శ్రీరాముడు. భారతంలో ధర్మరాజు కూడా దుర్యోధనుడు మాయాజూదంలో ఓడిస్తే మాటకు కట్టుబడి ధర్మరాజు దారాసోదర సహితంగా అరణ్యవాసం చేశాడు. ఎప్పుడైనా భీమార్జునులు ఆగ్రహావేశాలతో దుర్యోధనుని పైకి యుద్ధానికి వెంటనే బయలుదేరుదామన్నప్పుడు వారిని వారించి జూదం ఆడిన నాటి నియమం ప్రకారం వనవాసాన్ని, అజ్ఞాత వాసాన్ని సహనంతో విజయవంతంగా పూర్తిచేశాడు.

ఇంద్రియ నిగ్రహము :

అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియ ములు, మనస్సు. వీటిని అదుపులో ఉంచుకొనుటయే ఇంద్రియ నిగ్రహము కలిగి ఉండుట. ఇంద్రియ నిగ్రహము కలవారిలో శ్రీరామునికి సాటి రాగలవారు ఏ దేశములోనూ, ఏ కాలములోనూ ఎవరూ లేరు. రాముని అడవులకు వెళ్ళవద్దని వశిష్ఠాది ఋషులు ఎంత చెప్పినా వినలేదు. చివరకు దశరథుడే స్వయంగా ఈ రాజ్యము నీది. నన్ను చెఱసాలలో పెట్టి నీ రాజ్యమును నీవు పాలించు" అని చెప్పినా, అంగీకరించలేదు. రాజ్యము నకు ఆశ పడలేదు. శూర్పణఖ వరించి వచ్చినప్పుడూ చలించలేదు. నవరత్న ఖచితమైన బంగారు లంకను చూసినప్పుడూ కూడా శ్రీరాముడు ప్రలోభపడలేదు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అని తరతరా లకూ చెదరని ధర్మమార్గం ఆచరించి చూపిన జితేంద్రి యుడు శ్రీరాముడు.

ధీ :

ధీ అనగా బుద్ధి అని అర్థము. మంచి బుద్ధి

కలిగినవాడు బుద్ధిమంతుడు. తెలివితో ఆలోచించి విచక్షణతో నిర్ణయాలు తీసుకొనేవారు బుద్ధిమంతులు. రామాయణములో ధీమంతుడంటే హనుమంతుడే. ఒక్క రామాయణములోనే కాదు, ఎక్కడైనా హనుమంతునికి మించిన బుద్ధిమంతులు లేరు. రామలక్ష్మణులను చూసి సుగ్రీవుడు భయపడగా, వారు వాలి పంపగా వచ్చినవారు కారని మొదటి చూపులోనే గ్రహించినవాడు హనుమంతుడు. రామలక్ష్మణులతో హనుమంతుడు సలక్షణంగా మాట్లాడుతాడు. "మీరెవరు? రాజర్షుల్లాగానూ, దేవతల్లాగానూ వున్నారు. మీరిద్దరూ రాజ్యపాలనం చేయతగినవారుగా వున్నారు. ఆలాంటివారు ఈ నార బట్టలూ జడలూ ధరించి ఈ అడవులకు ఎందుకు వచ్చినట్లు?" అని ప్రశ్నించి తనను తాను పరిచయం చేసుకుంటాడు. హనుమంతుని మాటలు విని రాముడు చాలా సంతోషించాడు. ''ఇతడు ఋగ్యజుస్సామవేదాలు క్షుణ్ణంగా నేర్చినవానిలా మాట్లాడుతున్నాడు. అంతేకాదు. ఇతడు వ్యాకరణమునూ అనేకసార్లు చదివినట్టున్నాడు. (నూనం వ్యాకరణం కృత్స్నమనేన బహుధా శ్రుతం) ఇంతసేపు మాట్లాడినా ఒక్క అపశబ్దమూ పలుకలేదు.'' అంటాడు. అంతే కాక సీతాదేవిని వెదుకుతున్నప్పుడూ, సీతాదేవితో సంభాషించేటప్పుడూ, రావణునితో సంభాషించేటప్పుడూ, లంకలో సీతాదేవిని కనుగొన్నానని రామునితో చెప్పేటప్పుడూ కూడా విశేషమైన ప్రజ్ఞను, వాఙ్నైపుణ్యాన్ని కనపరచాడు. రామాయణంలో హనుమంతుని మాటలు, చేతలు వ్యక్తిత్వ వికాస పాఠాలు.

సత్యం :

"సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయా న్మా ప్రమాదः।" అని తైత్తిరీయోపనిషత్తు ఘోషిస్తోంది. 'సత్యమేవ జయతే' అని ముండకోపనిషత్తులోని మేలుబంతియైన వాక్యం. ఇక్కడ సత్యమంటే పరమార్థభూతమైన శాశ్వత సత్యం. రాముడు సత్య స్వరూపుడు. తాను అడవులపాలైనా, తన తండ్రికి అసత్య దోషము అంటనీయని ధర్మాత్ముడు. "రామో విగ్రహవాన్ ధర్మ:" అని రూపుదాల్చిన ధర్మము శ్రీరాముడు.

ఇంకా ఆస్తేయము (దొంగతనము చేయకుండుట), విద్య వంటి లక్షణములే కాక, గురు భక్తి కలవాడుగా, వినయము, వివేకము మొదలగు ఉత్తమ గుణములతో రాముడు పురుషోత్తముడయ్యాడు. లక్ష్మణుడు, భరతుడు, విశ్వామిత్రుడు, గుహుడు, కుంతి, ద్రౌపది, విదురుడు మొదలగు వారు తమ ఉన్నత వ్యక్తిత్వాలతో సర్వమానవాళికీ మార్గదర్శకులయ్యారు.

సూచికలు :

1. సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్య మప్రియం
   ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మ: సనాతన: -మనుస్మృతి (4-138)
2. ధర్మ ఏవో హతో హన్తి ధర్మో రక్షతి రక్షిత:
   తస్యా ధర్మా నహన్తవ్యో మానో ధర్మో హ్రతో ప్రధీత్ - మనుస్మృతి (8-15)
3. సీతాచరితం - 'అక్షర వాచస్పతి' దాశరథి రంగాచార్యులు (పే. 106)
4. సీతాచరితం - 'అక్షర వాచస్పతి' దాశరథి రంగాచార్యులు (పే. 154)
5. సీతాచరితం - 'అక్షర వాచస్పతి' దాశరథి రంగాచార్యులు (పే. 283)
6. సీతాచరితం - 'అక్షర వాచస్పతి' దాశరథి రంగాచార్యులు (పే. 119)
7. అపి స్వర్ణమయీ లంకా నమే రోచతి లక్ష్మణ
   జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ - శ్రీమద్రామాయణము (యుద్ధకాండ)

8. 'సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయా న్మా ప్రమాదः।
   ఆచార్యాయ ప్రియమ్ ధనమాహృత్య
   ప్రజాతన్తుమ్ మా వ్యవచ్ఛేత్సీహీ
   సత్యాన్నప్రమదితవ్యమ్। ధర్మాన్న ప్రమదితవ్యమ్। -తైత్తిరీయోపనిషత్తు (1.11.1)
9. సత్యమేవ జయతే నానృతం సత్యేన పంథా వితతో దేవయానः।
   యేనాక్రమం తృషయోవ్యప్తకామా యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్॥ -ముండకోపనిషత్తు (3.1.6)
10. రామో విగ్రహవాన్ ధర్మ: రామస్సత్య పరాక్రమः।
    రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ॥ - శ్రీమద్రామాయణము (3.37.13)

❖ ❖ ❖

కవి'తా'ధర్మం

– డా॥. ఎన్. మృదుల, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల - నర్సాపూర్, మెదక్.

మనిషి జీవితంపై ప్రభావితం చూపేది కుటుంబం, సమాజం, గురువు ఆపై కవి - అన్న విషయాన్ని అంగీకరిస్తే, ఆ కవి గురువును, ఆ గురువు సమాజాన్ని, ఆ సమాజం కుటుంబాన్ని ప్రభావితం చేస్తుందన్నది సత్యం. ఇక్కడ జగత్తుకే మార్గదర్శకత్వం వహించేవాడు కవి అన్న విషయం రూఢి అవుతుంది. ధర్మార్థకామమోక్షాలవైపు నడిపించే 'కవి'కి కూడా కవితాధర్మం ఒకటి ఉంటుందని మన ప్రాచీన ఆలంకారికుల నుండి నేటి విమర్శకుల వరకు మనకు బోధిస్తూనే ఉన్నారు.

"కవి మానవుడు. అతనికి మానవ సమాజం ప్రేరణ నిస్తుంది. అతని కావ్యానికి అంగీకృతి చేకూర్చేది మానవ సమాజమే. కనుక ఈ విశాల పునాదిపై మనం సాహిత్యానికి మానుషత్వం గీటురాయని భావిస్తాము." (సదాశివ రావు, పాములపర్తి. భారతీయ సాహిత్య పరిణామ పరిశీలన. 2017: 40) అనే వాక్యాల్లో - సమాజంలో మానవత్వం నెలకొల్పటమే కవి ధ్యేయంగా, కవితాధర్మంగా కనిపిస్తుంది. అది రసాత్మకమైన కావ్యంగానో, రీతి - వక్రోక్తి - ధ్వని - ఔచిత్యంతో కూడిన మహాకావ్యంగానో, సత్యం-శివం-సుందరమైన గద్యంగానో ప్రకటితమవ్వచ్చు.

"ఎవరిని సముద్ధరించవలెనని నీవు కావ్యము వ్రాయుదువో అది వారికర్థమగునట్లుండ వలయును. సామ్యవాద సాహిత్యము సాధారణ మానవుని సముద్ధరించుట లక్ష్యముగా కలది. అందువలన ఈ సాహిత్యము వారికర్థమగునట్లుండవలయును. సాధారణ మానవులనగా కార్మికులు. పనిచేసి బ్రతుకువారు. బ్రతుకు తెరువు పని చేయుటయే అయినవారు... ఎవరిని ప్రబోధించు ఉద్దేశముతో ఈ సాహిత్యము బయలుదేరినదో వారికిది యర్థమగుచున్నదా అని ప్రశ్న. ఇది ప్రశ్నయగుచో వారికర్థమగుట లేదా అన్న ప్రశ్నయు కలదు. కవిత్వము ప్రజల కొరకే గదా వ్రాయబడును. మరి కవిత్వము ప్రజల కర్థమగుచున్నదా? ఎవరి సంగతి మనమందులో వ్రాసినామో ఆ సంగతి వారికర్థమగుట అంత ముఖ్యము కాదు. ఆ సంగతి వారి నిత్యానుభవములోనున్నదేగదా. అది అనుభవము లేని ఇతరులకది అర్థము కావలయును. మధ్య తరగతి సమాజమునకర్థము కావలయును. వారి ద్వారా ఆ విషయము మరియు చిలవలు పలవలుగా వ్యాపించును. ఇందరి సహాయానుభూతియు వారి కుండును. సమాజమును క్రొత్త చైతన్యముతో నింపుట కొరకే సామ్యవాద సాహిత్యము బయలుదేరినది" (రామకోటిశాస్త్రి, కేతవరపు. 2002: 43) అంతేకాదు -

"సాహిత్యమెప్పుడును కార్మిక కర్షక సైనిక జన సంబంధము కలిగి వారికి ప్రేరణము కలిగించునదిగా నుండవలయును. జనసామాన్యమునకు సన్నిహితమై వారియందు నిరక్షరాస్యతను పారద్రోలగలిగిన స్థితి గల సాహిత్యమే సాహిత్యము. జన సామాన్యము కందు బాటులో నుండుటకు కావలసినంత సాహిత్యము సృజింపబడవలెను. రచయితలు సాహిత్యమును ప్రజల అవసరాలకు అనుగుణముగా ఉత్పత్తి చేయవలయును" (రామకోటిశాస్త్రి, కేతవరపు. 2002: 46).

ఈ మాటలు సాహిత్య ధర్మాన్ని తెలియజేస్తున్నాయి. పరోక్షంగా కవి లేదా రచయిత యొక్క బాధ్యతను ప్రకటిస్తున్నాయి. 'సహితస్య భావమ్ సాహిత్యమ్' అనే మన పూర్వ ఆలంకారికుల మాటలో కూడా ఇదే అంతరార్థం.

"సృజన ఫలం అపూర్వంగా ఉండాలి. వాస్తవిక ప్రమాణాలకు భిన్నంగా ఉండకూడదు. ప్రణాళికా బద్ధమైన నిర్మితి ఉండాలి. సత్యమై శివమై సుందరమై భాసించాలి. ఆకాశాలను లోకాలను చేరువగా తీసుకొని రావడంతో మానవ జీవనంలో వినూత్న సందర్భాన్ని సృష్టించాలి" (నరసింహమూర్తి, యు.ఏ. 2002: 8)

ఒక రచయిత తన రచన ద్వారా ఏమి సాధించాలో ఈ మాటలు చెబుతున్నాయి. అంతేకాదు రచనలోని క్రమశిక్షణను ఆ రచన తీసుకొని వచ్చే మార్పును పై వాక్యాలు తెలియజేస్తున్నాయి.

నన్నయాదులు భారత రామాయణాలు రాసినా, ఇతర పురాణాలు రాసినా, ఆధునిక కవులు, కవితలు రాసినా, ప్రజలను ధర్మబద్ధుల్ని చేసి వాస్తవ జగత్తులోకి తీసుకొని రావడానికేనని గుర్తించాలి. కవులు ప్రధానంగా మూడు రకాలు. వారు శాస్త్రకవి, కావ్యకవి, ఉభయకవి. వీరిలో ఉత్తరోత్తరులు బలీయులు అని కొందరి భావన. ఎవరికి వారే శ్రేష్టులని మరికొందరి భావన. కానీ కవులెవరైనా క్రాంతదర్శులే.

'రాత్రి నా చెయ్యి నదిగా మారుతుంది. కాగితాల డెల్టాల్లోకి పారుతుంది' అంటారు గుంటూరు శేషేంద్ర శర్మ. ఇక్కడితో కవి బాధ్యత తీరిపోదని, కవిత్వపు నదులు కాగితాల డెల్టాల్లోకి ఇంకిపోవడమే కాక సహృదయ క్షేత్రాల్లోకి ప్రవహిస్తూ ఎప్పటికప్పుడు సరికొత్త సామాజిక సందర్భానికి తగినట్లుగా ఒదిగిపోవాలని మనం గుర్తించాలి. అందుకే ఆనాటి ప్రబంధాలు ఈ కాలపు దృష్టితో చూడటం మొదలయ్యింది.

"దృష్టంకించి దదృష్ట మన్యదపరం వాచాలవార్తార్వితమ్
భూయస్తుణ్ణ పురాణతః పరిణతం కించిచ్ఛ శాస్త్ర శ్రుతమ్
సూక్ష్యావస్తు యదత్ర చిత్ర రచనం తత్కావ్య మవ్యాహతం
రత్నస్యేవ నతస్య జన్మ జలధేర్నో రోహణాద్వాగిరేః

చూసినది కొంత చూడనిది కొంత, నోటికొచ్చినదల్లా మాట్లాడే వారి వలన కొంత. తలాతోకాలేని కథలల్లే వాళ్ళ వలన కొంత. శాస్త్ర గ్రంథ పఠనం వలన కొంత - ఇలా కవిత్వంలో ఎన్నెన్నో విషయాలుంటాయి. లోకం నుండి ఇలా గ్రహించిన ఎన్నెన్నో విషయాలతో, మంచి మాటలతో తిరుగులేనిదిగా కవిత్వం రూపొందుతుంది. అంతే కాని అదేమీ ఇంద్రజాలికుని మంత్రదండం నుండి పుట్టుకుని వచ్చే అపూర్వ వస్తువు కాదు. సముద్రంలోనో, కొండలమీదో దాగి వున్న రత్నమేమీ కాదది. అది లోక మంతటా ఉన్నదే. ఆ దేవుని దస్తూరీని అర్థం చేసుకొని పవిత్రంగా పునశ్చరణ చేయగలశక్తి వరపుత్రులైన కొందరి మాటలకే లభిస్తుంది. బుద్ధిమంతులెందరో ఉంటారు. కాని బుద్ధిమంతులందరి వాక్కులూ కవిత్వంగా పర్యవసించవు. కాని కవుల వాక్కులు మాత్రం బుద్ధివలన రాణిస్తాయి" (నరసింహమూర్తి, యు.ఏ. 2002: 41) అంటే వాక్కుకు అంతటి శక్తి ఉందన్నమాట. నానృషిఃకురుతే కావ్యం- ఋషికాని వాడు కావ్యాన్ని రచించలేడు. గతాన్ని దృష్టిలో పెట్టుకొని వర్తమానాన్ని బేరీజు వేసుకుంటూ భవిష్యత్‌ను దర్శించగలిగిన కవి ఋషితుల్యుడు. సమాజహితము కోరే అటువంటి కవి, దైవసమానుడన్నది పై మాటలు ఋజువు చేస్తున్నాయి.

"సాహిత్య సృజనకు కారణంగా రచయితల యందున్నట్లు చెప్పబడే ప్రతిభ భావనాశక్తి కంటే వేరు కాదు - ప్రతిభ అన్నది లోకోత్తర విషయం కాదు. సమాజ జీవిత ప్రభావం వల్లనే సామాజికులు యథాయోగ్యంగా చైతన్యవంతులవుతున్నారు. చైతన్యవంతులు కావటమంటే జీవితం అంతఃకరణం మీద ప్రతిఫలించిన దాన్ని బట్టి అనుభవాత్మకంగా ఏర్పడే భావాలకు అనుకూలంగాగానీ ప్రతికూలంగా గానీ ప్రవర్తించటం. సమాజంలో వచ్చే పరిణామం వల్ల జీవితంలో ఎంత అపూర్వత వస్తున్నదో దాని ప్రతిఫలనం వల్ల అనుభవాత్మకమైన భావరూపంలోనూ అంత అపూర్వత ఏర్పడుతుంది. రచయిత లెప్పుడూ జీవితంలో అపూర్వతను కోరుతూ వుంటారు. వుంటారంటే పరిణామాలకు సుముఖంగా వుంటారు. సమాజాన్ని అందుకు సిద్ధంగా వుండాలని ప్రబోధిస్తారు." (రామకోటి శాస్త్రి, కేతవరపు. 2002: 41)

శ్రీశ్రీ - ఆకాశపు దారులంట హడావిడిగా వెళ్ళిపోయే కవితా జగన్నాథ రథచక్రాలను భూమార్గం పట్టిస్తానని, భూకంపం పుట్టిస్తానని, చెప్పినా -

కష్టజీవికి ఇరువైపులా నిలబడే వాడే కవి అన్నా - ప్రపంచమొక పద్మవ్యూహం - కవిత్వమొక తీరని దాహం అన్నా- ఇదే సారాంశం.

ఉపయుక్త గ్రంథసూచి :

1. నరసింహమూర్తి, యు.ఏ. కవిత్వదర్శనము. 2002. సాయిశ్రీ ఆఫ్‌సెట్. గుంటూరు.
2. రామకోటిశాస్త్రి, కేతవరపు. భాషాసాహిత్యాలు సామాజిక భావనలు. 2002. జిజ్ఞాస ప్రచురణ. వరంగల్లు.
3. శ్రీనివాసరావు, శ్రీరంగం. మహాప్రస్థానం. 1970. విశాలాంధ్ర. విజయవాడ.
4. సదాశివరావు, పాములపర్తి. ప్ర.ము. 1958. పు.ము. 2017. తెలంగాణ ప్రచురణలు. హైదరాబాదు.
5. సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానం. కావ్యాలంకార సంగ్రహం.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

అరణ్యపర్వం – ఆధ్యాత్మిక ధర్మం

– డా॥. పి.లలితవాణి, సహాయ ఆచార్యులు (రి), తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల, చేవెళ్ల.

"మహత్త్వాత్ భారవత్త్వాత్ చ మహాభారతముచ్యతే"

భారతానికి తొలినామం "జయం". చతుర్వేద సారమైన పంచమవేదం అనిపించుకున్న ఈ జయమనే గ్రంథం చతుర్వేదాల కన్నా బరువైనదని, మహత్తరమైనదని గ్రహించినందున "మహాభారత"మనే పేరు స్థిరపడింది. భారతీయుల విజ్ఞాన సర్వస్వం భారతం.

"భారతం చేక్షు ఖండం చ ప్రతిపర్వ రసోదయమ్"

భారతంలోని భాగాలకు పర్వాలని పేరిచ్చాడు తత్కర్త వ్యాస భగవానుడు. పర్వమంటే చెఱుకుగడలోని కణుపు. ఏ కణుపుకా కణుపు ఎంత మధురంగా ఉంటుందో భారతంలోని ప్రతి పర్వమూ దేనికదే మధురాతి మధురంగా రసప్లావితాన్ని కలుగచేస్తుందనడం వ్యాసోద్దేశం.

వ్యాసర్షి ఏ పరమార్థాన్ని భారతంలో నిక్షిప్తం చేశాడో, ఆ పరమార్థాన్నే అందిపుచ్చుకుని కవిత్రయం మన తెలుగు భారతంలో యథాతథంగా ఆవిష్కరించారు. మన కవిత్రయం సాక్షాత్తు త్రిమూర్తులే. ఆదికవి నన్నయ విష్ణువు. కవిబ్రహ్మ తిక్కన బ్రహ్మదేవుడు. ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన పరమశివుడు. ఈ ముప్పురికీ కాలవ్యత్యాసం ఉన్నా, ప్రాంతీయ వైవిధ్యం ఉన్నా - భారతం మాత్రం స్వరూప సందేశాలలో ఏక సూత్రతతో విరాజిల్లింది. తెలుగు జాతికే కైలాస శిఖర సమున్నత వజ్రగోపురం ఆంధ్ర మహాభారతం.

భారతంలోని మూడవ పర్వాన్ని ఇద్దరు వ్రాశారు. మొదటగా ఆదికవి కొంతభాగం; అనంతర కాలంలో శంభుదాసుడు తక్కిన పూర్తిభాగం. శివకేశవా భేదం లాగా వీరి రచన ఒక్కసమంగా సాగింది. ఎఱ్ఱన తన అరణ్యపర్వ రచన మొత్తాన్ని "నన్నయభట్టు ప్రణీతంబైన శ్రీ మహా భారతంబునం దారణ్య పర్వంబున...." అంటూ ఆదికవి నన్నయే వ్రాసినాడన్నట్లు కూర్చడం మహౌన్నత్యం. రాజ రాజ నరేంద్రునికే అంకితమవ్వడం మరో విశేషం. ధర్మాత్ములైన పాండవ పంచకం పాంచాలితో సహా చేసిన వనవాసమే ఈ పర్వం. అరణ్య శాంతి పర్వాలు మహా భారత సాహిత్య మూర్తికి జ్ఞాన నేత్రాలు. ఈ పర్వసారం అవగతమైతే మోక్షప్రాప్తియే. నన్నయభట్టు అన్నట్లు "లోనారసి" పరికిస్తే తప్ప ఒక్క పట్టాన అర్థంకాని అంత రార్థ పరతత్త్వ సాధన జ్ఞాన భాండారం అరణ్యపర్వం. తమ వనవాసాన్ని పాండవులు యోగసాధన కనుగుణంగా మలచుకున్నారు. సమయాన్ని వ్యర్థపుచ్చక పరమ ప్రయోజనాన్ని పొందారు. ఆ పరమ పరతత్త్వ ప్రకాశ మార్గాన్ని అందించిన మహితాత్ములు మార్కండేయ రోమశ నారదాది దివ్యర్షులు. పరమాత్ముడైన శ్రీకృష్ణుడు.

యతో ధర్మః తతో విష్ణుః
యతో విష్ణుః తతో జయః

ఈ వాక్కు అరణ్యపర్వంలో ప్రస్ఫుటంగా నిరూపితమైన ప్రధాన సందేశం.

"ధర్మో విగ్రవానివ" అని ప్రస్తుతించబడిన ధీరోదాత్తుడు యుధిష్ఠిరుడు. అందుకే అతడు ధర్మరాజుగా స్థిరపడిపోయాడు. ధర్మాచరణుడు, ధర్మబుద్ధి నియుక్తుడు, ధర్మావలంబి, ధర్మానుష్ఠాన దీక్షాపరుడు, ధర్మమే రూపంగా మసలినవాడు - ధర్మరాజు. అందుకే వనవాస సమయంలో తన కుటీరంలో తానుండగా - మహా మహా మహర్షులే ధర్మజుని వద్దకు పిలవకుండానే వెళ్ళారు. యోగక్షేమాలు విచారించారు. పురాతన చరితలు చెప్పి, ధర్మోపదేశాలు చేశారు. విలపిస్తున్న అతని ఊరడించారు. మంత్రాలనిచ్చారు. వరాలు గుప్పించారు. ఉపాయాలు బోధించారు. కర్తవ్యోన్ముఖుని చేశారు. తీర్థయాత్రలు చేయించారు. దివ్యలోకాలను దర్శింపచేశారు.

అరణ్యవాసాన్ని - దివ్యయోగ సముపార్జనగా మలిచారు. అందుకే అరణ్యవానంలో - ధర్మజుని ధర్మబలం ఇనుమడించింది. భీముని భుజబలం సహస్రాధిక మయింది. అర్జునుని అస్త్రబలం అధికాధికమయింది.

ధర్మజునికి వ్యాసుడు ప్రత్యక్షమై "ప్రతిస్మృతి" అనే మహా యోగవిద్యను ఉపదేశించి, అర్జునున కిమ్మని ఆదేశించి, తత్ఫలితాన్ని వివరించాడు. ఈ మహామంత్రాన్ని ఉపదేశింది సాక్షాత్తు నారాయణ రూపుడైన వ్యాసర్షి ధర్మమే స్వరూప స్వభావాలుగా వెలుగొందుతున్న ధర్మజునికి, అఖండ తపోదీక్షాపరుడు, సాక్షాత్తు నరమహర్షి అయిన అర్జునునికి. పరోక్ష నారాయణుడు పరోక్ష నరమహర్షికి పరోక్షంగా యోగవిద్య నందించడం ప్రత్యక్షంగానే ప్రస్ఫుట మయింది. ఈ మంత్ర యోగవిద్యా సాధనతో అర్జునుడు పరమేశుని వద్ద పాశుపతాన్ని పొందాడు. ఇంద్రాది దేవతల చేత వివిధ దివ్యాస్త్రాలను గ్రహించాడు. మహేంద్రుని అర్ధ సింహాసనాసీనతను పొందాడు. నివాత కవచ కాలకేయ పౌలోమాది రాక్షస సంహారం అవలీలగా చేశాడు. ఊర్వశి శాపాన్ని వరంగా మలచుకోగలిగాడు - ఇలా ఇవన్నీ వ్యాసమహర్షి మంత్రప్రభావ విజయ పరంపరలే.

ఇక ధర్మనందనుడు - వైతరిణిలో స్నానం చేసి, అఖిల లోకాలనూ దివ్యదృష్టితో దర్శించి, ముప్పదివేల యోజనాల దూరంలో ఉన్న వైఖానసుల వేదధ్వనిని వినగలిగి దివ్యుడైనాడు.

మరి భీమసేనుడు సౌగంధిక కథలో అపర శివమూర్తి అయిన ఆంజనేయుని విశ్వరూప సందర్శనాన్ని పొంది చరితార్థుడైనాడు. మరో పుష్పోదంతంలో తన దర్శనంతోనే కుబేర పుత్రులకు శాప విమోచనం కలిగించి, దైవ సముడైనాడు.

నహుష ప్రశ్నలకు తగిన ధర్మ సమాధానాలను చెప్పి నలుగురు తమ్ములను బ్రతికించుకున్నాడు ధర్మరాజు. శ్రీకృష్ణ పరమాత్మే "శమదమాది సల్లక్షణాలు ధర్మజునికి సహజ సంపద" అని ప్రశంసించాడు. దుర్యోధనుని నీచవర్తనను, పాపకృత్యాలను సహించిన ధర్మజుని క్షమగుణాన్ని అభినందించాడు. మహాసముద్ర నిభులైన భీమార్జున నకుల సహదేవుల వీర విజృంభణను ధర్మనందనుని సత్యసంధతే, ధర్మనిష్ఠే ఆపగలుగుతున్నదని కొనియాడాడు.

ధర్మరాజు మార్కండేయ మహర్షిని సేవించి - చతుర్యుగ లక్షణాలను, తత్ప్రభావాలను, పరమాత్మ తత్త్వాన్ని, ధర్మయుత పరిపాలనా ప్రకారాన్ని, జీవలక్షణా విశేషాన్ని హింసా హింస వైవిధ్యాన్ని, లోకరీతిని, లోకనీతిని - ఇలా సమస్త జ్ఞానాన్ని పొందాడు. సీతారాముల కథను మొత్తం అవగతం చేసుకున్నాడు. వ్యాసభగవానుని నుండి స్వర్లోకపు గుణదోషాలను, స్వర్గాన్ని చేరే విభిన్న పుణ్య కార్యాలను తెలుసుకున్నాడు.

నర మానవ మాత్రులకు పట్టువడని యక్షుని క్లిష్ట ప్రశ్నలకు సముచిత సమాధానాలిచ్చి ధర్మరాజు సార్థక నాముడైనాడు. అన్నిటినీ మించి "సర్వధని" ఎవరన్న ప్రశ్నకు "సమచిత్తుడు" అన్న సమాధానం ధర్మజునే "సర్వధని"ని చేసింది. నకులుని బ్రతికించమన్న ధర్మజుని ధర్మౌన్నత్యం మిన్నుకెగసి తారలను తాకింది. ధర్మరాజు తనకోసం కాక తనను నమ్ముకున్న బ్రాహ్మణుని కోరిక తీర్చమని వేడుకున్నాడు తండ్రిని. మురిసిన ధర్ముడే ధర్మతనయుని నేనోళ్ళ ప్రశంసించి, ఆతని కోరికకు మహాశ్చర్యం పొంది, వెంటనే అనుగ్రహించాడు. పరుల కోసం జీవించేవాడే ఉత్తమ పాలకుడు. తానంటూ ఏమీ కోరక, ఎవరో కోరిన కోర్కెను తీర్చమని కోరిన ధర్మజుడు ధన్యుడు. ఉత్తముడు. అక్షరాలా ధర్మతనయుడు. అందుకే ధర్మరాజు.

ధర్మరాజు ధర్మదేవతను "సదా నా మనస్సు ధర్ముమునందే నిలిచేటట్లు స్థిరబుద్ధిని ప్రసాదించమ"ని వేడి, తద్వరాన్ని పొందాడు.

పరమేశుని వరం వల్ల భర్తృ పంచకమును పొందిన పాంచాలి ఆ అయిదుగురిని సరిసమానంగా సేవించి వారి అడుగు జాడల్లో నడిచిన మహా ఇల్లాలు. శ్రీకృష్ణుని

ప్రియసతి అయిన సత్యభామకు సతీత్వ లక్షణాలు బోధించిన సాధ్వీమతల్లి ద్రౌపది. అభిమానవతి, అసమాన సౌందర్యవతి అయి పతులనందరినీ మెప్పించిన తరుణీ మణి పాండవ పట్టమహిషి అయిన పాంచాలి. ధర్మ రాజుకు తగిన ధర్మ ప్రవర్తకురాలిగా, భీమునికి సరైన బలోద్రేక స్వరూపిణిగా, అర్జునునికి అనుగుణమైన వీర నారీ శిరోమణిగా, నకులునికి యుక్తమైన అకలంక లావణ్యరాశిగా, సహదేవునికి సరిదీటైన మహా విద్వాం సురాలిగా తనకు తానే సాటి అన్నట్లు అడుగడుగునా ప్రవర్తించిన ద్రౌపది అయిదుగురి గుణ సమాహార సముజ్జ్వల ప్రతీక. పతులతో పాటు అరణ్యాలకే కాక మహా ప్రస్థానానికి కూడా పయనమైన పాంచాలి పాతివ్రత్యం పతాక స్థాయి నందుకున్నది.

ధర్మాన్నే పాటించి, ధర్మాన్నే అనుసరించి, ధర్మ బద్ధంగా మెలగి, ధర్మాత్ములాలిగా, ధర్మమే రూపంగా కలిగిన ధర్మరాజుకే ధర్మాలను బోధించిన ద్రౌపది ధర్మ పరాయణ. పాంచాలి ధర్మమే పతులను అనుక్షణం కాపా డుతూ వచ్చింది. ద్రౌపది నడిచిన ధర్మాలలో ప్రధాన మైనది ఆధ్యాత్మిక ధర్మం. ప్రముఖమైనది సతీత్వ ధర్మం.

పాంచాలి నెరపిన ఆధ్యాత్మిక ధర్మమే శాపాయుధుడైన దూర్వాసుని నుండి పాండవులను రక్షించింది. సౌగంధిక పుష్పాలను సాధించింది. అడుగడుగునా పాండవులను ధర్మానుయాయులుగా నడిపించింది. ఎన్ని ఆపదలు కలి గినా అన్నిటినీ అధిగమించి, పాండవులతో కలసి మెలసి అరణ్యవాస కాలాన్ని పూర్తి చేయగలగడానికి మూల కారణం పాంచాలి అనుసరించిన ఆధ్యాత్మిక ధర్మమే.

"ఆధీయతే దైన్యమనేన ఇతి ఆధిః"
మనస్సంబంధమైన వ్యధకే ఆధి అని పేరు.
"అత్తి స్వకర్మఫలమితివా ఆత్మా అదభక్షణే"

స్వకర్మ ఫలితాన్ని అనుభవించడమే ఆత్మికం. తన కర్మల ఫలితాలను అనుభవిస్తూ మానసికంగా వ్యధ చెందడమే ఆధ్యాత్మికం. ఎన్ని కష్టాలు పడుతున్నా ఎంత వ్యధ చెందినా, అనుక్షణం దుఃఖం అనుభవిస్తున్నా చలించకుండా, ఎవరినీ నిందించకుండా, చిరునవ్వుతో ధర్మమార్గంలోనే నడవడం ఆధ్యాత్మిక ధర్మం.

"ధరతి విశ్వం ధర్మః"
"ధ్రియతే వాజనైరితి ధర్మః
ధరతేతి ధర్మః"

విశ్వాన్నే ధరించేది, వేదవిహితమైన కర్మ, జనుల చేత చేయబడేది ధర్మం. ధర్మానికి పుణ్యం, యముడు, నీతి, స్వభావం, ఆచారం అని నానార్థాలున్నాయి. జ్ఞానంతో కూడిన ధర్మం సాత్వికం. అహంకార పూరితమైన ధర్మం రాజసం. మోహావిష్టమైన ధర్మం తామసికం. ధర్మరాజు సాత్విక ధర్మసాధకుడు.

పాండవులు అరణ్యవాస పుణ్యకాలాన్ని నియతితో, దైవానుగ్రహంతో, వరాలతో, శస్త్రాస్త్ర బలసంపత్తి ప్రాప్తితో, పరతత్త్వ సముపార్జనతో, పరమాత్మ సాక్షాత్కార ధన్యతతో, రాక్షస సంహారంతో, ధర్మాచరణతో, ధర్మనిష్ఠతో, అహింసా ప్రవృత్తితో, శత్రువులను సహితం రక్షించిన ఉదార స్వభావంతో ఊర్ధ్వలోక సందర్శనా సద్భాగ్యంతో నిర్వి ఘ్నంగా, నిరామయంగా పూర్తి చేశారు.

❖ ❖ ❖

భారతీయ జీవన విధానం – పురుషార్థాలు

– రొఖుచేంద్ర రొళ్ళ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, తెలంగాణ.

భారతీయ తాత్విక చింతన అతి ప్రాచీనమైనది. సృష్టిలోని ప్రతిప్రాణి యొక్క జీవనగమనాలను గమ్యాలను అధ్యయనం చేస్తూ సర్వోత్కృష్ట జీవియైన మానవుని మనుగడను కొన్ని ప్రాథమిక సూత్రాలను నిర్ధేశించింది. సృష్టిలో ఉద్భవించిన ప్రతి ప్రాణికి ఆహార, నిద్రా, భయ, మైథునాలు సహజాతాలు. అవి వాటిని సంతృప్తి పరచుకునే మార్గాలు వాటి వాటి సామర్థ్యంలో విజ్ఞతతో అన్వేషించుకుంటాయి. కాని మానవుడు మేధోపరంగా, నైతికంగా, దైహికంగా అన్ని ప్రాణులకంటే ఉన్నత స్థితిలో ఉంటాడు. కాబట్టి పై సహజాతాలను అతడు పూరించుకునే క్రమంలో కొన్ని కట్టుబాట్లను, నియమాలను నిర్ణయించుకునే శక్తిని కల్గివుంటాడు. మానవుడు తప్ప తక్కిన జీవులకు జననమరణాల మధ్య నిర్ణయించుకునే లక్ష్యాలేవీ వుండవు. అవి ప్రకృతి నియమాలకు అనుగుణంగా, తమ అవసరాల ప్రేరణగా జీవన ప్రస్థానాన్ని సాగిస్తుంటాయి. కాని మానవుడు భిన్నమైన జీవి. ప్రకృతి నియమాలను తనకనుగుణంగా మార్చుకోవడమో లేక తను ప్రకృతి నియమాలకు అనుగుణంగా మారడమో అనే బౌద్ధిక సంపత్తిని కలిగి ఉన్నవాడు. ఒక రకంగా చెప్పాలంటగే ప్రకృతిని కొంత వరకు తన ఆధీనంలోకి తెచ్చుకున్న వాడు. అందువలన అతడి జీవన చర్య ప్రకృతిని ప్రభావితం చేస్తుంది. తద్వారా ఆ ప్రభావం సృష్టిలోని ప్రాణికోటి మీద కూడా ప్రసరిస్తుంది. అందువలన బుద్ధి జీవులయిన భారతీయ తాత్వికులు మానవ జీవనానికి కొన్ని పరిమితులను నిర్ధేశించారు. కొన్ని నియమాలను ఆపాదించారు. సృష్టిలోని ప్రాణులన్నీ పరస్పరం ఆధారపడి జీవిస్తుంటాయి. కాబట్టి ఒక దానిలో ఒకటి సంఘర్షించు కోకుండా సమన్వయంతో కొనసాగాలి కాబట్టి "శంనో అస్తుద్విపదే, శం చతుష్పదే" అని వేదవాక్యం నిల్చింది.

మానవాళి జీవన విధానం సృష్టిలోని క్రమస్థితిని ప్రభావితం చేస్తుంది. అందువలన భారతీయ తాత్వికులు మానవ జీవనానికి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించారు. ఆ లక్ష్యాన్ని అందుకునే మార్గాలను ఏర్పరిచారు. మానవ జీవితానికి ఒక ప్రయోజనాన్ని లక్షించారు.

అందుకని ఆ లక్ష్యసాధనకై నిర్ధేశించుకున్నవే పురుషార్థాలు. సృష్టిలోని ప్రాణులకు ఒక జీవన లక్షమంటూ ఉండదు. కాని మానవ జీవితానికి ఒక పరమలక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్యమును సాధించే క్రమంలో ఇవి సోపానాలుగా ఉంటాయి.

పురుషార్థం అనే పదం పురుష, ఆర్ధ అనే రెండు పదాలతో కూడినది. పురుష అనగా మనిషి అని అర్థం. ఇది లింగభేదం లేకుండా యావద్మానవ జాతిని ఉద్దేశించింది. అర్థం అనగా ప్రయోజనం ఆ లక్ష్యం అని అర్థం. అర్థానికి ఉంటే విస్తృతార్థమలలో ప్రయోజనం ఒకటి. సాధారణంగా వాడుకలో ఏం అనంతో ఈ పని చేస్తున్నావని అడగడం, నీవు చేస్తున్న పనికి ఏమన్నా అర్థం పర్థం ఉందా? అని ప్రశ్నించడం చూస్తుంటాం. ఇక్కడ అర్థం అనే పదం లక్షం అనే ఉద్దేశంతో ఉపయోగింపబడింది. ఆ సూత్రీకరణ ఆధారంగానే పురుషార్థం అంటే మానవ జీవనానికి లక్ష్యం అని అన్వయించుకోవచ్చు. ఇది అంచెలంచెలుగా కొన్ని సీమిత లక్ష్యాలతో ప్రారంభమయి చివరగా అంతిమ లక్ష్యాన్ని చేరుకునే మార్గం వైపు పురోగమిస్తాయి.

ప్రాచీన కాలం నుండి భారతీయ తాత్విక పరంపరలో గుర్తించబడిన పురుషార్థాలు నాలుటు అవి ధర్మ (విధి), అర్థ (సంపద), కామ (తృప్తి), మోక్ష (విముక్తి) అనేవి. వీటిని సార్ధిక భావనానికి లక్ష్యాలుగా పేర్కొనవచ్చు.

వీటిలో ధర్మ మోక్షాలు మానవుడు పాటించాల్సినవి కాగా అర్థకామాలు సమజంగా నెరవేరేవి.

పురుషార్థాలను ప్రాతిపదికం చేసుకునే భారతీయ సాహిత్య, సాంసారిక జీవనాలు నిర్మితమైనాయి.

కావ్య ప్రయోజనంలో...

"ధర్మార్థకామ మోక్షేసు వైచక్షణ్యం కలాసుచ
ప్రీతింకరోతి కీర్తించ సాధుకావ్య నిషేవణమ్"

అని పేర్కొన బడింది.

దాంపత్య జీవనంలో... ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి అని చెప్పుకోవడం జరుగుతుంది.

కాబట్టి మానవ జీవనం ధర్మార్థాలలో ప్రారంభమై మోక్షంతో సిద్ధిని పొందుతుంది. పురుషార్థాల క్రమాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా అన్వయించుకోవడం గమనించదగ్గది. ధర్మ, అర్థ, కామ, మోక్షాల వరుసను కొందరు ఆమోదిస్తే అర్థ, కామ, ధర్మ మోక్షాలను మరికొందరు అనుసరించారు.

ధర్మం :

పురుషార్థములలో ధర్మం సంక్లిష్టమైనది. ధర్మాన్ని నిర్వచించడం నిర్దేశించడం ఆయా సందర్భాన్ని బట్టి మారుతుంది. సక్రమ మార్గంలో సరియైన భావనలతో పురోగమించడమే ధర్మంగా భావించవచ్చు. జీవన మాత్రాలను క్రమబద్ధీకరించుకుని నిర్వర్తించడమే దర్మంగా చెప్పుకోవచ్చు. మహాభారతంలో ధర్మం నైతిక భావనగా పేర్కొనబడింది. ఉత్తమ లక్ష్యమును నిర్దేశించుకుని సాధించడమే ధర్మంగా మీ మాంసలో పేర్కొనబడింది. అర్థకామాలను సక్రమ మార్గంలో, గౌరవప్రధంగా ధర్మమార్గంగా, ప్రామాణికంగా సాధించాలి.

సమాజం ద్వారా సమర్థించబడేదే ధర్మం. ధర్మాచరణ మానవ విధి.

మోక్షసాధనకు ధర్మనిర్వహణే ప్రధాన మార్గం.

అర్థం :

అర్థము అనే వరానికి శబ్దార్థము, ఇంద్రియార్థము, ధనము, నివృత్తి, న్యాయము, వస్తువు, ప్రయోజనము అని నైఘంటి కార్తములు. పురుషార్థములలో ఒకటైన అర్థమును ధనము, సంపద అనే అర్థంలోనే తీసుకోవడం జరుగుతుంది. మానవ జీవితంలో ఆర్థిక సంపాదన బలమైన తపనగా వృద్ధి చెందింది. నేటి సమాజంలో అందరూ ధన సంపాదనకై ప్రయత్నిస్తున్నారు. జీవన అవసరాలైన ఉన్నత చదువులు, విలాస జీవనం, పేరు ప్రఖ్యాతలు వీటన్నింటిని పెంచుకోవడానికి, నిలుపుకోవడానికి డబ్బు ముఖ్యమే. కాని దీనిని సరియైన నియంత్రణలో ఉంచితే ఆనందానికి అవధులుండవు. అత్యాశకు లోనైతే ఆనందాన్ని పొందలేము సంపాదించిన ధనంతో ఆనందంగా మంచి పనులు చేస్తే సంతోషకరమైన అనుభూతిని పొందగలము.

కామం :

కామం అనగా వాంఛ, కోరిక, ఇచ్ఛ అనే అర్థాలుంటాయి. వాంఛలను తృప్తి పరచుకోవడంలోనే కామం అంతమవుతుంది. కామం అనే సంస్కృత పదానికి సంతృప్తి, సుఖానుభూతి అనే అర్థాలు కనబడ్తాయి. కామసూత్ర కావ్యం దీని ఆధారంగానే ఆవిష్కృతమైంది. అయిదు జ్ఞానేంద్రియాలు, మనసు, ఆత్మల సమన్వయంతో ఆనందానుభూతిని పొందడమే కామమని కామసూత్ర కారుడు పేర్కొన్నాడు. మనువు ననుసరించి ఆనందానుభవపు కోరికయే కామం. సంతృప్తిగా పనిచేయడం వలన ఇంద్రియనుఖానందం, మానసికానందం పొందడం దీనిలో భాగం. లైంగికానందం కొరకు పడే తపపను కామావిష్కారణలో ఒక భాగంగా భావించవచ్చు. విలాసవంతమైన జీవితం వలన కోరికలను తృప్తి పరచుకోవడం ద్వారా ఆనందానుభూతి లభిస్తుందని చాలా మంది అనుకుంటారు. విలాస జీవనానికి ధనమే మూలమని భావన. ధనమే ఆశలను సాధించడానికి అవసరం అని అనుకుంటారు. కామసాధనకు అర్థం ఆవశ్యకమే. కాని అర్థ సంపాదన ధర్మ మార్గంతో కూడినదైతే తద్వారా పొందే సంతృప్తియే వేరు.

మోక్షం :

మోక్షమనగా విమోచనం. నిష్క్రియాతత్వం. మానవాళి యొక్క ఆధ్యాత్మిక మూలతత్వాన్ని ఆవిష్కరించేది మోక్షం. ధర్మబద్ధమైన అర్థ సంపాదనతో కామాలను సాధించి సంతృప్తి దశకు చేరుకొని వాటన్నిటికీ అతీతంగా నిలవడమే మోక్షస్థితి. ఈ స్థితికి చేరుకున్నప్పుడు మనసు ఒక ప్రశాంత స్థితిని అందుకుంటుంది. పూర్వానుభవాలు, గత వర్తమాన భవిష్యత్తులు ఏవీ మనిషిని చలింపచేయ లేవు. దీనిని వ్యక్తులుగా మనమే పొందాలి. ధర్మమార్గ నిర్దేశంతో మోక్షసాధన చేయవచ్చు. ధర్మార్థకామాలు లేకుండా ఇది సాధ్యం కాదు. అన్ని కోరికలు నశించిన స్థితికి చేరుకుంటాడు. అహంబ్రహ్మాస్మి అనే తత్వమును గుర్తించి జీవించడమే మోక్షం. మనిషిలో అహం నశించిన స్థితిలో ఉంటాడు.

స్థూలంగా పురుషార్థాలను పరిశీలిస్తే అవి మానవ జీవన అంతి లక్ష్యమైన మోక్షసాధనకు సోపానాలుగా కననబడ్తున్నప్పటికీ అవి కొన్నిసార్లు పరస్పర విరుద్ధంగా కూడా ప్రవర్తిస్తాయి. వాటిని సమన్వయం చేసుకోవడం చాలా కష్టం.

అర్థసంపాదనలో పదేళ్లలో పదివేల కోట్లు సంపాదించాలని ఉంటుంది. అవి ధర్మమార్గంలో సాధ్యమా? కాదు. డబ్బు సంపాదించాలని పేరాశకు పోతే ఎలాగైనా సంపాదించాలని అనిపిస్తుంది. అది ధర్మ విరోధమైనా ఉపేక్షించడం జరగదు.

అలాగే కామం, తనది కానిదయినప్పటికీ తనకు కావాలని తపించడం ధర్మ విరోధం అవుతుంది.

ధర్మార్థకామాలు పరస్పర విరోధాలుగా కనబడినా అవన్నీ ఒకేచోట చేరి సమన్వయంలో పనిచేయడం ఎలా సాధ్యం?

యక్ష ప్రశ్నలలో ధర్మజునికి ఇవే ప్రశ్న ఎదురౌతుంది.

"ధర్మశ్చ, అర్థశ్చ, కామశ్చ పరస్పర విరోధిన
ఏశాం నిత్యవిరుద్ధానాం, కథం ఏకత్ర సంగమ"

ఇది యక్షుడి ప్రశ్న.

దీనికి ధర్మరాజు చెప్పిన సమాధానం పై మూడింటి సమన్వయాన్ని దృఢ పరుస్తుంది.

"యదా ధర్మశ్చ భార్యాచ, పరస్పర వశాను భౌ
తదా ధర్మార్థ కామానం, త్రయాణమపిసంగమ,

అంటే మనిషికి ధర్మం మరియు భార్య పరస్పరం పొందికగా సానుకూలంగా ఉంటాయో అపుడు ధర్మార్థ కామాలు ఒకే చోట ఉంటాయి. ఇది ఎంత ముఖ్యమైన మాట! ధర్మంలో శ్రద్ధ వున్న భార్యదొరికినట్లయితే ధర్మార్థకామాలు పరస్పర విరోధాలైనా మూడు కలిసే ఉంటాయి.

భారతీయ వివాహ వ్యవస్థ ఆదర్శంతమైనది. ఇది దంపతుల మధ్య ఒక సుదీర్ఘ ప్రయాణానికి ఒక స్నేహ పూర్వక ఒడంబడిక ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి అని చెప్పబడింది. అందుకే భార్యను ధర్మపత్ని అని పేర్కొన్నారు. ఆమె కులద్వయతారిణి, రెండు వంశాలను ఉద్ధరిస్తుంది. ధర్మ ధర్మ మార్గంలో చరించడానికి భార్య తోడ్పాటు ఎంతో అవసరం.

ధర్మార్థకామ మోక్షాలైన చతుర్విధ పురుషార్థాల నిర్మాణం అద్భుతమైన తాత్వకత. ధర్మమోక్షాల మధ్యన అర్థకామాల గమనం కొనసాగడమే మానవ జీవన పర మార్థం. ధర్మ మోక్షాలనే చెలియలికట్ట (తటము, తీరము) ధృఢంగా ఉండి, వాటి మధ్యన అర్థకామాలు సరియైన దిశలో ప్రవహిస్తేనే సత్ఫలితాలు లభిస్తాయి. అలా కాక ధర్మ మోక్షాలనబడే గట్లు బలంగా లేకపోతే అర్థకామాతి ఎటు పోగూడదో అటు వెళ్ళి విపరీత పరిణామాలకు దారితీస్తాయి.

ధర్మం పురుషార్థాలలో ప్రధానమైనది. ధర్మ బంధనంలో ఉన్నప్పుడే అర్థ కామాలు మోక్ష మార్గం వైపు గమిస్తాయి.

ధర్మ మార్గం కాని కామం వలన సీతను కోరిన రావణుడు పతనం చెందాడు. రాజ్యాన్ని కోరిన దుర్యోదనుడు

అంతరించాడు. ప్రపంచాన్ని జయించాలకున్న హిట్లర్ ఎలా అంతమయ్యాడో గమనించవచ్చు.

పురుషార్ధ నిర్మాణం మానవ జీవితంలో అంతర్లీనంగా దాగివున్న అనేక ప్రశ్నలకు సమాదానాలను అందిస్తాయి. జనన మరణాల గురించి ఉత్పన్నమయ్యే అనేక ప్రశ్నలకు సమాధానం కొరకు వీటిని జాగ్రత్తగా అనుసరించాలి. నేటి యువత తప్పుడు దోవలో ప్రయాణిస్తున్నారు. కృత్రిమమైన మోహావాంఛలలో కొట్టుమిట్టాడుతున్నారు. మాదక ద్రవ్యాలు, విశృంఖలతలతో తమ సుఖాన్ని పొదుతున్నట్టుగా అనిపిస్తున్నా ఆనందానికి ఆమడ దూరంలో ఉన్నారు. అట్టి యువత పురుషార్ధ సూత్రాలను పాటించి ప్రశాంతతను పొందడమే జీవన పరమావధిగాభావించాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. Purushartha - Aims of Life - Sneha Sharma
2. తత్వశాస్త్ర నిఘంటువు - తెలుగు అకాడమి

❖ ❖ ❖

రామాయణం – ధర్మార్థ కామ మోక్షాలు

– యాదగిరి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా యునివర్సిటీ, తార్నాక, హైదరాబాద్.

"వేదోఽఖిల ధర్మమూలమ్". వేదం ధర్మానికి నెలవు. శ్రుతులు, స్మృతులు, ఉపనిషత్తులు, పురాణాలు, ఆగమాలు, దర్శనములు, ఇతిహాసాలు... ఇలా అన్ని గ్రంథాలు ధర్మాన్ని బోధిస్తున్నాయి. ఈ విశ్వానికి, జగత్తుకు ఆధారం ధర్మం. సకల ధర్మా శాస్త్రాల సారం రామాయణం. మానవులు అనుసరించవలసిన ధర్మశాస్త్రం. ప్రపంచ సాహిత్యంలోనే "తొలి కావ్యం". దీనిని రచించిన "వాల్మీకి" "ఆదికవి". ఈ ఆది కావ్యాన్ని... ॥కావ్యం రామాయణం సీతాయాశ్చరితమ్ మహత్। పౌలస్త్య వధమిత్యేవ, చకార చరిత వ్రతః॥ రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్... అనే మూడు పేర్లతో పిలుస్తారు. శోకం నుండి పుట్టింది శ్లోకం. 24వేల శ్లోకాలు. ఆరు కాండలు. సంస్కృత భాషలో సాగిన రచన. మధురంగా పాడుకోగల కావ్యం రామాయణం.

॥కూజంతమ్ రామరామేతి మధురమ్ మధురాక్షరమ్।
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥

కవిత్వం అనే చెట్టుకొమ్మపైన ఎక్కి, రామ, రామ అనే మధురాక్షరాలను గానం చేస్తున్న, వాల్మీకి అనే కోయిలకు మానవ జాతి నమస్కరించ వలసిందే. ఈ రామాయణ కావ్యం మానవ హృదయాలపై చెరగని ముద్రవేసిన కథ. తల్లిదండ్రుల అనురాగం, పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మ బలం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం, జీవ కారుణ్య భావన, ప్రకృతిలాలన ఇలా జీవన పార్శ్వాలన్నింటిని పట్టి చూపిస్తుంది రామయణం. అందుకే ఇది ఆచరించవలసిన ధర్మ గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మానవుడు, మాధవుడుగా ఎలా ఎదుగుతాడో నేర్పిస్తుందీ రామాయణం.

రామాయణం భారతీయ భాషలన్నింటిలో తలమానికంగా అలరారుతుంది. ఇండోనేషియా, థాయిలాండ్, కంబోడియా, మలేషియా, వియత్నాం, లావోస్ తదితర దేశాలలో కూడా రామాయణం ప్రసిద్ధి పొందింది. ఇంత గొప్ప కావ్యాన్ని అందించిన వాల్మీకి గురించి రామాయణ కల్పవృక్ష కర్త విశ్వనాథ వారు..."ఒక్క వాల్మీకి కాక వేరొక్క డెవడు సుకవి శబ్ద వాచ్యుడు..." అంటారు. పలు భాషల్లో వందల కొద్ది రామాయణాలు వచ్చాయి.

మరల నిదేల రామాయణం బన్నచో,। నీ ప్రపంచకమెల్ల నెల్ల వేళ
తినుచున్న అన్నమే తినుచున్నదిన్నాళ్ళు,। తన రుచి బ్రదుకులు తనివి గాన
చేసిన సంసారమే చేయు చున్నది,। తనదైన అనుభూతి తనది గాన
తలచిన రామునే తలచెద నేనును,। నా భక్తి రచనలు నావి గాన
కవి ప్రతిభలోన నుండును గావ్యగత శ। తాంశముల యందు తొంబదియైన పాళ్ళు
ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి। రెట్లు గొప్పది నవకథా దృతిని మించి.

ప్రతీ రోజూ తిన్న అన్నమే అని తినడం మానేయడం లేదు. సంసారంలో కష్ట సుఖాలున్నాయి కదా అని మనం మానేయడం లేదు. అలాగే ఎవరి అనుభూతులు వారివి. ఈ రామాయణం నా అనుభూతి. నా రసాస్పందన" అని విశ్వనాథ, వారి కావ్య రచనా హేతువు వివరించారు.

॥ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం॥

రామ నామము సకల పాప హరము, మోక్షప్రదం.
॥రమంతే సర్వేజనాః గుణైతి ఇతి రామః॥

తన సద్గుణముల చేత అందరినీ సంతోషింపజేసే వాడు రాముడు. అని రామ శబ్దానికి వ్యుత్పత్తి చెప్ప బడింది.“రామ” నామములో పంచాక్షరీ మంత్రము “ఓం నమశ్శివాయః'' నుండి 'మ' బీజాక్షరము, అష్టాక్షరీ మంత్రము ''ఓం నమో నారాయణాయః'' నుండి 'ర' బీజాక్షరము పొందుపరిచారు. మూడు మార్లు ''రామ'' నామమును స్మరించినంతనే శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము చేసిన ఫలము లభిస్తుందని, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రము-ఉత్తర పీఠిక చెబుతుంది.

॥శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యమ్ రామనామ వరాననే॥

రామాయణం - ఇతిహాసం :

భారతీయ సాంస్కృతిక సాహిత్య చరిత్రను ఇతిహాసం అంటారు. “ఇతి హాసః” అనగా ఇలా జరిగింది అని అర్థం. ఇతి హాసం అంటే... ॥ధర్మార్థకామ మోక్షాణముపదేశ సమన్వితం। పూర్వావృత్త కథాయుక్త మితిహాసం ప్రచక్షతే॥ ధర్మార్థ కామ మోక్షాలు అనే చతుర్విద పురుషార్థాలు, ఉపదేశాలు, పూర్వ వృత్తాంత కథలతో కూడినవి ఇతి హాసాలు. హిందువుల కాలగణన ప్రకారం. త్రేతాయుగం నాటి కథ. లక్షల ఏండ్లకింద జరిగిన కథ. అందుకే రామాయణం ఇతిహాసం. ప్రాచీన మానవ నాగరికతకు చరిత్ర గ్రంథం. ఇతిహాస లక్షణాలున్న ఈ కథను ఒక్క శ్లోకంలో చెప్పాలంటే...

॥ఆదౌ రామ తపోవనాదిగమనం హత్వా మృగం
కాంచనమ్। వైదేహీ హరణం జటాయు మరణం సుగ్రీవ
సంభాషణమ్॥
॥వాలీ నిగ్రహణం సముద్రతరణం లంకాపురీదాహనమ్।
పశ్చాద్రావణకుంభకర్ణహననం ఏతద్ధి రామాయణమ్॥

ఒక్క మాటలో చెప్పాలంటే... కట్టే, కొట్టే, తెచ్చే... అనే నానుడి తెలుగునాట తెలియని వారుండరు. రామాయణం మధురమైన కావ్యం. సులభమైంది. సరళమైంది. ప్రజలందరి నాలుకలపై నడయాడుతున్నది రామ కథ. అడుగడుగున గుర్తుచేసుకుంటాం. ఇది మానవులందరి సందేహాలను తీరుస్తూ... ముందుకు నడిపిస్తున్న ధర్మశాస్త్రం. ఈ ఇతిహాస కావ్యమే రామాయణం.

రామాయణం - ధర్మార్థ కామ మోక్షాలు :

మానవుని సాధనే పురుషార్థం. ఇది హిందువుల భావన. మానవ జీవన లక్ష్యాలు నాలుగు. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం. ఇవే చతుర్విద పురుషార్థాలు. ధర్మం మొదటిది. ధర్మం ద్వారానే అర్థకామాలు పొందాలి. అప్పుడే మోక్షం లభిస్తుంది. మానవ నడవడికకు ధర్మమే ప్రధానం. ॥ధారణాత్ ధర్మమిత్యాహుః ధర్మోధారయతి ప్రజాః॥ ప్రజలు ధరించునది గనుక ధర్మం. ధర్మం ప్రజలను ధరిస్తుంది. కనుక ధారణతో కూడినదే ధర్మం. మహా భారతంలో వ్యాసుల వారు, ధర్మాన్ని అనుసరించటం అవశ్యకతను చెపుతూ.... ॥ఊర్ధ్వబాహిర్విరోభ్యేష న చ కశ్చిత్ శృణోతిమే। ధర్మాదర్థశ్చ కామశ్చ న కిమర్థం సేవ్యతే॥ రెండు చేతులు పైకెత్తి, గొంతెత్తి, అరచి మరీ చెపుతున్నాను. అయినా, నామాట ఎవరూ విననైనా వినటం లేదు. నిజానికి ధర్మం నుండే అర్థమూ, కామమూ సిద్ధిస్తాయి. అయితే సాధారణ జనులకు ధర్మం అర్థం కాక పోవచ్చు. అందువలన మహాపురుషులు ఏ మార్గంలో నడుస్తారో, అదే ధర్మ మార్గము. ఇంకా తేలికగా ధర్మం గురించి...

ఒరులేయవి ఒనరించిన
నరవర! యప్రియము దనమనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపతముల కెల్లన్॥

ఇది భారత నీతి. ఇతరుల వల్ల నీ మనసుకు నొప్పిగలిగితే, అలాంటివి నీవు ఇతరులకు చేయకుండా ఉండడమే ధర్మం. ఇంత సులభమైంది. లోతైనదే అయిన ధర్మానికి పది లక్షణాలు అంటుంది మనుస్మృతి.

॥ధృతిः క్షమా దమోऽస్తేయం, శౌచమింద్రియ నిగ్రహః।
ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్।

ధృతి-ధైర్యము, క్షమ, దమము, అస్తేయము, శౌచము, ఇంద్రియ నిగ్రహము, ధీ-వివేక బుద్ధి, విద్య, సత్యము, అక్రోధము... ఇవి ధర్మం పది లక్షణాలు.

శ్రీ రాముడు సద్గుణాల రాశి. రూపవంతుడు. గుణంలో శ్రేష్ఠుడు. మహావీరుడు, మృదుభాషి, శరణు కోరిన వారిని కాపాడతాడు. కోపం, గర్వం లేనివాడు. సత్యం పలికే వాడు. పరుల సంపదను ఆశించని వాడు. దీనులను ఆదుకునే వాడు. కాలాన్ని వృథాచేయకుండా జ్ఞానులతో, సజ్జనులతో వివిధ విషయాలను చర్చించే వాడు. వినయశీలి. తల్లిదండ్రులపట్లా, గురువులపట్లా నిశ్చలభక్తి కలవాడు. సోమరితనం, ఎమరుపాటు లేని వాడు. కళలలో ఆరితేరినవాడు. అసూయ, మాత్సర్యం లేనివాడు. ప్రజలపట్ల వాత్సల్యం కలవాడు. అందుకే రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, పితృవాక్య పాలకుడుగా, ఒకటే మాట. ఒకటే సీత. ఒకటే బాణం. ఇది రామ ధర్మం.

రాముని ప్రతి కదలిక ధర్మమే. ధర్మ స్థాపనే రాముని లక్ష్యం. అధర్మాన్ని అంతమొందించడమే రాముని కర్తవ్యం. తండ్రి దశరథుడు పంపగా విశ్వామిత్రునితో యాగ రక్షణకు వెళ్ళాడు. తండ్రికి ఇచ్చిన మాటను, గురువు ఆజ్ఞను పాటించాడు. పదహారెళ్ళ వయసులోనే తాటకను వధించాడు. క్షత్రీయుడుగా సిద్ధాశ్రమంలో యాగరక్షణ చేసాడు. మారీచ, సుబాహులను అంతమొందించాడు. వనవాసం చేస్తూ దండకారణ్యంలో ప్రవేశించాడు. ఋషులు, మునులు రాక్షసుల హింస నుండి కాపాడమని రాముడిని శరణు వేడారు. మీరు ఆజ్ఞాపించండీ అని వినయంగా ప్రార్థించాడు. ॥నిషచర హీన కరూంగా ధరితీ॥ (రామచరిత మానస్) 'భూమిపై రాక్షసులే లేకుండా చేస్తాను' అని ప్రతిజ్ఞ చేశాడు. విరాధుడు, ఖరదూషణ, త్రిశరులు, పద్నాల్గువేల మంది రాక్షసులను, కబంధున్ని హతమార్చాడు.

సీతను అపహరిస్తాను రామలక్ష్మణులను ఆశ్రమంలో ఉండకుండా చెయ్యాలి అంటాడు రావణుడు. ఆ మాట వింటూనే...

॥రకారాదీని నామాని రామ త్రస్తస్య రావణ। రత్నానిచ రథాంశ్చైవ సంత్రాసం జనయంతి మే॥

రాముడంటే నేనెంత భయపడుతున్నానో తెలుసా! రత్నం, రథం అని 'ర' కారంతో ఆరంభించే శబ్దం వినిపించిందంటే గుండె దడదడలాడుతోంది అంటాడు. విశ్వామిత్రుని యాగ రక్షణ వేళ రామబాణంతో సముద్రం ఒడ్డున పడ్డ మారీచుడు. ఇది ఇరువై సంవత్సరాల కిందటి మాట. రాముని గురించి నీకు తెలియదు. లంకేశ్వరా...

॥రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్య పరాక్రమః। రాజా సర్వస్య లోకస్య దేవానా మివ వాసవః॥

రాముడు రూపు దాల్చిన ధర్మమూర్తి. పరమ సజ్జనుడు. సత్య పరాక్రముడు. శత్రువునోట అంతటి ప్రశస్తి పొందిన వాడు రాముడు. నీ ఆలోచన మానుకో అన్నాడు. రావణుడు వినలేదు. సీతను అపహరించాడు. ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. వానరులు తోడు రాగా లోక కంటకులైన కుంభకర్ణ, రావణాసురులను వధించాడు. అధర్మ పరులైన రాక్షసులను అంతమొందించి ధర్మాన్ని నిలిపిన ధృతిమంతుడు రాముడు.

స్వయంవరం తరువాత కన్యాదానం చేస్తూ జనకుడు... ॥ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ॥ ఈమె సీతా నా కూతురు ధర్మబద్ధంగా నీతో నడుచుకుంటుంది, అన్నాడు. అది మొదలు రాముడే సర్వస్వంగా జీవించిన ఉత్తమ ఇల్లాలు. అయోధ్యా, అరణ్యం ఒకే విధంగా భావించిన సాధ్వీమణి. గృహస్థాశ్రమ ధర్మాన్ని త్రికరణ శుద్ధిగా పాటించిన పతివ్రతా శిరోమణి సీత. మహా పతివ్రత అనసూయచేత ప్రశంసలు, దివ్య వస్త్రాభరణాలు అందుకుంది. సీత జీవన విధానమే ధర్మం. అందుకే రామాయణానికి మరోపేరు సీతాయాశ్చరితమ్.

ధర్మ బద్ధంగా అర్థం సంపాదించాలి. ధర్మాన్ని పాటిస్తూ పాలన కొనసాగించిన దశరథుని రాజ్యంలో ప్రజలు

సుఖసంతోశాలతో సంమృద్ధిగా జీవించారు. అధర్మానికి నిలయమైన బంగారు లంక బుగ్గిపాలైంది. అధర్మ మార్గాన నడిచిన అతిబలశాలి వాలి అర్ధాంతరంగ కలగతిలో కలిసిపోయాడు. ధర్మాన్ని నమ్ముకున్న స్నేహశీలి సుగ్రీవుడు రాజ్యసుఖాలు అనుభవించాడు.

ధర్మ సమ్మతం కాని కామం-కోరిక మనిషి పాలిట కాలపాశమే. లోకనీయతికి లోబడే మనుషులు నుడుచుకోవాలి.

॥ఆహార నిద్రా భయమైథునం చ సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్। ధర్మోహితేషామధికో విశేషో ధర్మేణ హీనాః పశుభిః సమానాః॥

ఆహారము, నిద్ర, భయము, మైథునము, ఇటువంటి ప్రాపంచిక విషయాలు పశువులకూ, మనుష్యులకూ సమానమే. ధర్మం ఒక్కటే మానవులకు విశేషంగా ఉంటుంది. ధర్మహీనుడైన మనిషి పశువుతో సమానమే. ధర్మాన్ని విడిచి ప్రవర్తించిన అహల్య, దేవేంద్రులు శాపగ్రస్తులయ్యారు. ఈర్ష్య, ద్వేషాలకు చిరునామ అయిన తాటకి తనువు చాలించింది. కామ మోహ పర వశురాలైన శూర్పణఖ కురూపిగా అవమానం పాల య్యింది. ఇక రావణబ్రహ్మ తన గురించి తాను...

॥స్వ ధర్మే రక్షసాం భీరుః సర్వదైవ న సంశయః। గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా॥

ధర్మ నిర్మాహణలో మేమెప్పుడూ పొరబాటుపడం. మాధర్మం ఏమిటో తెలుసా! పరదారాగమనం, అప హరణం, బలాత్కారం. ఇది లంకేశ్వరుడి ధర్మ నిష్ఠ. ఇంతలా అధర్మపూరిత కామస్వభావం కలవాడు కనుకనే రాముడి చేతిలో హతమయ్యాడు. అందుకే రామా యణానికి మరోపేరు పౌలస్త్య వధ.

ఒక విచిత్ర వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకోవాలి. నేటి కలియుగంలోని కొంతమంది మనుషుల ప్రవర్తనకు అద్దం పట్టినట్లు ఉంటుంది. వానర రాజుగా ఉన్న వాలికి మహా రాణిగా జీవితం గడిపింది తార. వాలి మరణించాడనుకుని వచ్చి సింహాసనం ఎక్కిన సుగ్రీవునికి ప్రియురాలుగా హాయిగా జీవితం గడిపింది. తిరిగి వాలి సింహాసనం ఎక్కగా తార పట్టపురాణిగా రాజభోగాలు అనుభవించింది. వాలి నేలకూలాడు. సుగ్రీవుడు రాజు అయ్యాడు. ఆయన అంతఃపురం చేరింది. విదుషీమణి తార. సంపద, అధి కారం ఎక్కడ ఉంటే తార అక్కడ ఉంటుంది. భోగాలు అనుభవించడమే జీవిత పరమావధి. నేటి నాగరిక సమాజంలో ఎందరో 'తార'లు. ఆ మనస్తత్వాన్ని పోలిన మనుషులను మనం గమనించవచ్చు. ఇలాంటి వారం దరికి తార ప్రతినిధి.

మానవ జీవిత లక్ష్యాలలో నాల్గవది మోక్షం. పురుషా ర్థాలలో చివరిది. ధర్మం ఆధారంగా అర్థకామాలు పొందిన వారికి ముక్తి కరతలామలకం. సత్యము, త్యాగమయ జీవనమే ధర్మం. నిద్రాహారాలు మాని తపస్సుచేసినందుకు అహల్య, ఆశ్రయమిచ్చి నదిని దాటించినందుకు గుహుడు, సోదర భక్తితో భరతుడు, నిరంతరం సేవించి లక్ష్మణుడు, ప్రభు భక్తితో హనుమంతుడు, శ్రీరాముని దర్శనంకై వేచి ఉండి తమ తపశ్శక్తిని ధారపోసిన శరభంగ మహర్షి, సుతీక్షణుడు, ఆతిథ్యం ఇచ్చిన పండుముదుసలి తపస్వినీ శబరి, శరణని వేడుకొని విభీషణుడు... పరమ పదాన్ని అలంకరించారు.

సీతను అపహరించుకొని వెళుతున్న రావణున్ని అడ్డ గించాడు జటాయువు. ముసలితనం చేత సీతను కాపాడ లేక పోయాడు. కానీ రావణుని రథాన్ని ధ్వంసం చేశాడు. రథ సారథిని సంహరించాడు. రావణుడి ఖడ్గధాటికి రెక్కలు తెగి నెలపై పడ్డాడు. రక్తపు మడుగులో పడివున్న జటాయువును రాముడు చూశాడు. విషయం తెలుసు కున్నాడు. జటాయువు ప్రాణాలు వదిలింది. ఆప్తుడి మరణానికి రాముడు కన్నీరుమున్నీరైనాడు. పక్షిరాజైన జటాయువుకు రాముడే స్వయంగా అంత్యక్రియలు చేశాడు. ధర్మస్వరూపుడు శ్రీరాముడు తన తండ్రికి అంతిమ సంస్కారం చేయలేకపోయాడు. కానీ ధర్మాన్ని కాపాడడంలో తనువును చాలించిన జటాయువుకు ఆ

భాగ్యం కలిగింది. అంటే ధర్మాన్ని పాటించే వారిని దైవమే అన్నీతానై చూసుకుంటాడు అని తెలుపుతుంది రామాయణం.

మోక్షాన్ని పొందడానికి ధర్మాన్ని పాటించాలి. ధర్మాన్ని ఆచరించడానికి అర్థాన్ని, కామాన్ని జయించాలి. పురుషుడు ఏకపత్నీవ్రతుడై ఉండాలి. స్త్రీ పాతివ్రత్యాన్ని పాటించాలి. ప్రియంగ సత్యమే పలకాలి. మాటతప్పకూడదు. తల్లిదండ్రులు, గురువుల మాట జవదాటరాదు. ఇవి కనీస ధర్మాచరణాలు. వీటిని రామాయణం మనకు నేర్పిస్తుంది. ఈ రామాయణం ఎప్పటివరకు అంటే...

॥యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే। తావత్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥

లోకము నందు పర్వతములు, నదులు ఉన్నంత కాలము రామాయణ కావ్యము ప్రకాశిస్తుందని చతుర్ముఖ బ్రహ్మ, వాల్మీకిని దీవించాడు. పురుషార్థాలను సాధించడం కోసం రామాయణం చదవాలీ... అని వాల్మీకినే బాలకాండలో చెప్పాడు.

॥ఇక్ష్వాకూణాం ఇదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం। మహద్ ఉత్పన్నం ఆఖ్యానం రామాయణం ఇతి శ్రుతం॥

॥తదిదం వర్తయిష్యావః సర్వం నిఖిలం ఆదితః। ధర్మ కామ అర్థ సహితం శ్రోతవ్యం అనసూయతా॥

ఇక్ష్వాకువంశంలో మహానుభావులైన ఎందరో రాజులు జన్మించారు. ఆ వంశానికి వన్నె తెచ్చారు. అట్టి మహావంశంలో జన్మించిన శ్రీరాముని చరితమే రామాయణము. బ్రహ్మానుగ్రహ ప్రభావంతో రూపుదిద్దుకొన్నది. ఇది ధర్మకామార్థములను ప్రతిపాదిస్తుంది. దీనిని ఎట్టి దోషదృష్టి లేకుండ వినాలి. పఠించాలి. ఆచరించాలి.

॥మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే। చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥

❖ ❖ ❖

ఆదర్శ న్యాయం – 'ధర్మం' – పరిశీలన

– ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్తు సెకండరీ స్కూలు -
ఇటికాలపల్లి మం॥, నర్సంపేట, జి॥ వరంగల్ రూరల్, తెలంగాణ.

ధర్మాన్ని రక్షిస్తే, ధర్మం రక్షిస్తుంది.

ధర్మం అనగా న్యాయం. 'చతుర్విధ పురుషార్థాలు' అనేవి మన దేశ వాఙ్మయంలో ఎంతో ప్రాధాన్యతను కలిగి వున్నాయి. 'పురుషార్థాలు' అనగా సమస్త మానవ కోటికి తోడ్పేవి అని అర్థం. ఇక్కడ 'పురుష' అనే పదం 'మనిషి'కి పర్యాయ పదంగా చెప్పుకోవాలని ప్రాచీన వాఙ్మయం తెలుపుతున్నది. అందుకే మనుషులందరికీ ఉపకరించేవిగా 'పురుషార్థాల'ను అర్థం చేసుకోలె. పురుషులు (మనుషులు) అర్థించేవి (నేర్చుకోదగినవి, ఆచరించదగినవి) పురుషార్థాలు, వీటిని సమాజ లక్ష్యాలుగా, ఆదర్శాలుగా, బాధ్యతలుగా చెప్తుంటారు.

ధర్మం, అర్థం, కామం, మోక్షం ... అనబడే నాలుగు అంశాలను 'చతుర్విధ పురుషార్థాలు'గా చెప్తారు. వీటి అర్థాలు వరుసగా ... విధి, సంపద, కోరిక, విముక్తి. వీటినే ఇంగ్లీషులో Righteousness, Money, Desire, Liberation అంటారు. ఈ నాలుగు పురుషార్థాలను నెరవేర్చడం వ్యక్తి (మనిషి) యొక్క బాధ్యత. వ్యక్తిగత ప్రయోజనానికి ఏ వ్యక్తి అయితే, ఈ నాలుగు లక్ష్యాల్ని సమతుల్యం చేస్తాడో, నెరవేర్చుతాడో - తద్వారా ఆ వ్యక్తి సమాజంలో గుర్తింపును పొందుతాడు. ఈ నాలుగు ఒకదానికొకటి స్వతంత్రమైనవి కావు, ప్రత్యేకమైనవీ కావు. అంతే కాకుండా, వీటిని ఒంటరిగా చూడలేము. ఇతర లక్ష్యాల్ని నిర్వహించి, శుద్ధి చెయ్యటమే కాక, వాటిని (ఇతర లక్ష్యాల్ని) స్వయంగా నిర్వహించుటకు తోడ్పాటు నందిస్తాయి.

మానవ జీవనం వేదాలలో, శాస్త్రాలలో తెలుపబడిన ధర్మబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి ఉండాలె. అప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తుంది. ఆ నియమ నిబంధనలే 'చతుర్విధ పురుషార్థాలు'. వాటి పేర్లు ధర్మార్థకామ మోక్షాలు. ధర్మం, అర్థం, కామం, మోక్షం. వీటి గురించి అందరికీ సమగ్రంగా తెలియ జెప్పాలనే ఒక గొప్ప లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా - సదాశివపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల - తెలుగు శాఖ నిర్వహణలో "భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు" అనే అంశంపై 08.02.2020 రోజున "అంతర్జాతీయ సదస్సు" జరుగుతున్నది. "ఆదర్శ న్యాయం 'ధర్మం' - పరిశీలన" అనే అంశంపై నేను ఈ సదస్సులో ప్రసంగ పత్ర వ్యాసాన్ని సమర్పిస్తున్నాను. చతుర్విధపురుషార్థాల్లో మొదటిదైన 'ధర్మం' గురించి అనేకాంశాలను విశ్లేషించే ప్రయత్నం ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

'ధర్మం' ణనూా=పీూా (విధి - Righteousness) అనేది ఒక బాధ్యత. సత్యం (నిజం, వాస్తవం), అహింస (హింస లేకపోవడం), ఇంద్రియ నిగ్రహం (తొందరపాటు లేకపోవడం), అస్తేయం (దొంగతనం), అపరిగ్రహం (అమితంగా ఇతరుల నుండి గ్రహించడం), ధృతి (ధైర్యం), శౌచం (శుభ్రత), శాంతి (ప్రశాంతం), క్షమ (క్షమించటం), ఓర్పు (ఓపిక) ... మొదలగు వాటిని బాధ్యత కలిగి ఉండాలని, ఇవి మానవుల నైతికాభివృద్ధికి ఎంతో ముఖ్యమైనవిగా ప్రాచీన సాహిత్యం చెప్తున్నది. పురుషార్థాల్లో, ధర్మం ఎంతో గొప్పది. ఈ సమస్త ప్రపంచం ధర్మం ప్రకారమే నడుస్తున్నది. ధర్మాన్ని కట్టు బడిన జీవితానికి సార్థకత ఉంటుంది. ధర్మం అనే దానినే స్వధర్మం అంటారు. స్వధర్మాన్ని ఆచరించటం అనేది తప్పని సరిగా చెప్తారు. కాలం మారుతున్న కొద్దీ స్వధర్మం కూడా మారుతూ వస్తున్నది. ఏ కాలంలో అయినా జన్మ,

వృత్తి, సమాజం వలన ఏర్పడిన స్వధర్మాన్ని వదిలి పెట్టవద్దు. స్వధర్మ ఆచరణలో పట్టుదల అనేది ఏ యుగానికైనా అవసరం.

"మన విషయాలలో ఇతరులు ఎలా ఉండాలె? అని అనుకుంటామో, మనం ఇతరుల విషయంలో అలాగే ఉండాలె, మన విషయంలో ఇతరులు ఎలా ప్రవర్తించ కూడదని మనం ఆశిస్తామో, మనం కూడా ఇతరుల విషయాలలో అలా ప్రవర్తించకుండా జీవించాలె" - అనేది ధర్మమార్గంగా చెప్పబడింది. నైతికత్వంలో కూడినదే ధర్మ (న్యాయ) మార్గం.

'ధర్మబద్ధమయిన జీవితానికి కట్టుబడటం' అనగా సొంత ధర్మాచరణమునకు కట్టుబడి జీవించటం అని తెలుసుకోవాలె. జన్మవల్ల, వృత్తి వల్ల, సమాజం వల్ల కలిగిన సొంత ధర్మాన్ని విడిచిపెట్టవద్దు. సొంత ధర్మాన్ని 'దీక్ష'గా పాటించాలె. సొంత ధర్మం చాలా గొప్ప పవిత్రమైంది.

సొంత ధర్మం ఏదైనా మనుషులందరినీ సమానంగా చూసేదిగా ఉండాలె. అనగా కుల, మత, వర్ణ, వర్గ, లింగ ... మొదలగు తారతమ్యాల కారణంగా చులకన భావం చూపకుండా, వివక్ష లేకుండా చూడాలె సొంత ధర్మం ఏదైనా మనుషుల్లో మౌఢ్యాన్ని, మూఢత్వాన్ని పెంచేదిగా కాకుండా, మానవత్వాన్ని పంచేదిగా ఉండాలె.

నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండించవలసిన ఆవశ్యకత ఉన్నది. ఈ సమస్యకు మూలాలు ప్రాచీన సాహిత్యంలో ఉన్నాయి. కాబట్టి సాహిత్యాన్ని సమీక్షించి, మహిళలపై జరుగుతున్న హత్యాచారాల్ని నిర్మూలించాలె. ఇదంతా సామాజిక బాధ్యతగల పెద్దలందిరిపై ఉన్నది. పెద్దలంతా తమ సొంత ధర్మంగా దీనిని భావించాలి. సమాజాన్ని సరైన తీరులో నడిపించేతందుకు సరియైన సాహిత్యాన్ని సృజించుటకు సాహిత్యకారుల్ని అనగా రచయితలను, కవులను, కవయిత్రులను, రచయిత్రులను, కథాయిత్రులను... మొదలగు వారిని తగిన విధంగా ప్రోత్సహించాలె.

ఈనాటి సమాజంలో బహుజనులపై అనేక ప్రదేశాలలో దాడులు, హత్యలు... మొదలగునవి అనేకం జరుగుతున్నాయి. వీరు ఇలా మరణించడమే వారి సొంత ధర్మమా? వారు ఇలా మరణించాల్సిందేనా? వీరిని చంపేవారు చేసేది వారి సొంత ధర్మమేనా? ఈ హత్యాకాండకు ఎవరు కారకులవుతున్నారో, అట్టి హంతకులను శిక్షించకుండా ఏవదిలివేయడమే ధర్మమా? ... ఈ సమస్యకు మూలాలు ఉన్న సాహిత్యాన్ని, అనగా హింసను పెంచి పోషించే సాహిత్యాన్ని తిరగరాయాలి. మంచి సాహిత్యం సృజించబడేటట్లు తగిన ప్రోత్సాహకాల్ని సృజనకారులకు అందించాలి. 'హింస'ను నిషేధించిన దేశం మనది. మన ప్రాచీన సాహిత్యంలో 'హింస'కు తావు లేనిదే 'ధర్మం' అని వివరించాలి. ఇదంతా ధర్మాన్ని రక్షించే కార్యంలో భాగంగా చెప్పుకోవాలె.

విదేశాలలో పుట్టిన హింస, అవినీతి, అమానవీయతల్ని మనదేశం దిగుమతి చేసుకొని, ఈ దేశంలో పుట్టిన అహింస లాంటి మానవీయ అంశాల్ని ఎగుమతి చేసింది. ఈ పరిస్థితి మారాలె. ఈ దేశంలో పుట్టిన బౌద్ధం, ప్రపంచ దేశాలకు వెళ్లి, ప్రపంచ శాంతిని ప్రబోధించింది. కాబట్టి మన దేశం బౌద్ధమయం కావాలి. ఎందుకంటే 'ధర్మం' గురించిన అనేక అంశాలు బౌద్ధధమ్మ సాహిత్యంలో ఉన్నాయి. ఇట్టి ధమ్మ సాహిత్యవగాహనతో మనదేశం శాంతిదేశంగా రూపొందుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు. ధమ్మం శరణం గచ్చామి.

❖ ❖ ❖

ప్రకాశం జిల్లా శతక సాహిత్యంలో పురుషార్థాలు

– ఐ. చంద్రశేఖరరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ లెకర
క్షీకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దానవో
ద్రేకస్తంభకు, గేళిగోల విలసద్బర్హాల సంభూత నా
నా కంజాత కుంభకు మహానందాంగనా ఢింభకున్ !

అని భక్తకవివరేణ్యుడు పోతనామాత్యులు ప్రార్థించి నట్లుగా మానవులందరూ అనేక మార్గాలలో ప్రయత్నించి కైవల్యం పొందాలనే ప్రయత్నిస్తుంటారు. పరమాత్మను చేరుకునే మార్గాలలో ప్రయత్నించి కైవల్యం పొందాలనే ప్రయత్నిస్తుంటారు. పరమాత్మను చేరుకునే మార్గాన్ని తెలియచేసేదే సనాతన ధర్మం. దీనినే భారతీయ సంస్కృతిలో మేళవిస్తూ అవలోకిస్తే "మనిషి సంస్కరించేదే మతం" అని చెప్పవలసి వస్తుంది.

"పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరేశయనమ్, ఇహ సంసారే బహుదుస్సారే కృపయా పారే పాహి మురారే" అన్నారు భజగోవింద స్తోత్రంలో జగదుద్ధరు శంకరాచార్యుల వారు. ఎన్నెన్నో జన్మలు పొందిన తరువాత మానవ జన్మ లభించడం గొప్ప అదృష్టం. మిగిలిన ప్రాణులకన్నా జ్ఞానవంతుడైన మానవుడు ధర్మాన్ని అనుష్ఠించి కైవల్యం పొందే ప్రయత్నం చేయడానికి అవసరమైన మార్గాన్ని నిర్దేశించే మన భారతీయ సంప్రదాయ హైందవంలో మనల్ని సంస్కరించుటకు అనేక ఆచారాలు ఏర్పాటు చేశారు.

ఆచారార్దేవమోక్షం ప్రాప్నుయాత్'' అంటారు విబుధులు.

ఈ ఆచారాలు కర్మానుష్టానాలు మనశ్శుద్ధికోసం ఉద్దేశించినవి. మన భావాలను భగవంతుడి మీదకు మరల్చడం ద్వారా చిత్తశుద్ధిని అలవరచుకొని భగవత్సాన్నిధ్యం పొందగలగుతాము. మనస్సు శుద్ధమైతేనే ఆ అనుభూతిని పొందగలం.

భారతీయ వాఙ్మయం మిక్కిలి విస్తృతమైనది. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు ధర్మమూలకమైనవి. వీటి సారాలే చతుర్విధ పురుషార్థాలు. సుబోధకంగా వేదవేదాంగాలను పురాణాలను ఉపనిషత్తులను వీటిలోని మూల సారాన్ని సామాన్య జనానికి చెప్పడం కోసం జనుల కర్తవ్యాచరణ ప్రధానంగా నాలుగు అంశాలతో నిండి ఉండాలని పండితులు నిర్దేశించారు. ఈ నాలుగింటికి ధర్మార్థకామమోక్షాలని పేర్లు పెట్టారు. వీటిలోని మర్మమేమిటంటే పురుషార్థాలలో ప్రధానంగా చెప్పబడే ధర్మంతోనే తక్కినవి అనుసంధానించబడి ఉంటాయి. అంటే అర్థ, కామ, మోక్షాలు కూడా ధర్మంతో కూడి ఉన్నప్పుడే అవి పురుషార్థాలుగా మనగలగుతాయని పెద్దల మాట.

ప్రభుసమ్మితాలైన వేదాలు, మిత్రసమ్మితాలైన పురాణాలు, కాంతాసమ్మితాలైన కావ్యాలు మొదలుకొని అనేకానేక ప్రక్రియలలో నాటి నుండి నేటి వరకు ఎందరో కవి పుంగవులు మానవులను ధర్మోన్ముఖులను చేయడం కోసం ఎన్నో రచనలు చేస్తున్నారు.

అధర్మం చైవ దుఃఖయోగం శరీరణామ్!
ధర్మార్థ ప్రభవం చైవ సంయోగ మక్షయమ్!!

మన కష్టసుఖాలను కారణము మనం చేసే పనులే. ఏది ధర్మం అనేది అధర్మం అని తెలిస్తేనే ధర్మాధర్మ నిర్ణయం చేసుకోగలుగుతాం. కాల, మాన పరిస్థితులను బట్టి సిద్ధాంతాలను సవరించుకుంటూ జీవనం సాగించవలసి వస్తుంది. అలాంటి సవరణలను ధర్మసూత్రాలు అంటారు. అలాంటి జ్ఞానాన్ని పొందడానికి ఆయా కవి పుంగవుల రచనలు మనకు ఎంతో చక్కగా సహాయపడుతూనే ఉన్నాయి.

ప్రాపంచిక సుఖాలకు లోనయి కామక్రోధలోభమోహ మదమాత్సర్యాలకు లోనయి దుష్ట గుణాలను ఆచరిస్తే

చివరకు పతనం తప్పదు. 'యతో ధర్మో స్తతో జయః' ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడే జయం ఉంటుందనే విషయాన్ని వక్కాణిస్తూ సనాతన ధర్మాన్ని అనుకరిస్తూ మా ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలోని శతకాల ఆధారంగా పురుషార్థాల గురించి వివేచించడమే ప్రస్తుత పత్ర ప్రధానంశాము.

సాధువాదము, సత్కర్మ, సత్యనిష్ఠ
దైవ చింతన యనునవి ధరణి గలిగి
నాల్గుపాదాల ధర్మమ్ము నడచునేని
శాంతినెలకొను దేశాన శంభులింగ!

అంటారు శంభులింగ శతకకర్త వరికూటి కోటయ్య గారు. చతుర్విధ పురుషార్థాలు ఆచరిస్తూ సాధుగుణములు సత్యము దైవచింతనతో నడచుకొన్నట్లయితే దేశం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. మానవ ప్రవర్తన సక్రమంగా ఉండి ధర్మార్థకామమోక్షాలను సాధించాలని, ధర్మబద్ధంగా జీవిస్తూ అర్థాన్ని సంపాదించాలని ధర్మ బద్ధంగా సంపాదించిన అర్థంతోనే కామాలను (కోరికలను) తీర్చుకోవాలని అవీ ధర్మబద్ధంగానే ఉండాలని ఇలా మోక్ష మార్గం వైపు పయనించాలని పేర్కొన్నారు. అట్లుగాక కేవలం స్వలాభానికే ప్రాధాన్యతనిస్తూ తన ఆనందం కోసం సమాజానికి నష్టం జరిగినా లక్ష్యపెట్టని ప్రవర్తన పెరిగిపోయిన నేటి ప్రజల ఆలోచనల వలన

దుష్కృతంబగు దోపిడి, దొంగతలను
మానభంగాలు హత్యలు మహిని బెరుగ
రాక్షసత్వము చెలరేగి రాజ్యమేల
శాంతిలేదయ్య జనులకు శంభులింగ - అంటూ

దుర్గునాలు పెరిగిపోయి, శాంతి కరువైన సమాజాన్ని కాపాడమని ఆ శంభులింగడిని వేడుకొన్నారు.

ప్రాపంచిక సుఖాల దొంతరలో మునిగిపోయి భక్తి, ముక్తి పట్ల శ్రద్ధ చూపక ముదిమి వరకు ప్రాకులాడి వృద్ధాప్యంలో తనను రక్షింపమంటూ వేడుకొనే ప్రజలు

చీము నెత్తురు పుండ్లు చితికిన దేహమ్ము
రోగాల పుట్ట రోత పుట్ట
కన్నచిడ్డలు సుంత కరుణచూపరు సుమ్ము
ఇరుగు పొరుగు చేర నిష్టపడరు
మందుండనై మిమ్ము మరచిపోతిని తండ్రి
నెనరూని దయచూడు నీలవర్ణ
నాపాలి దైవమా లోపాల నెంచక
సంకటంబుల బాపు వేంకటేశ

దీనజనపోష యిక నీవె దిక్కునాకు
అమరవందిత లక్ష్మీశ హరి ముకుంద
భక్తమందార కరివర భయవిదూర
శేషశైల నివాస హే శ్రీనివాస!

దుఃఖించవలసి వస్తుందని, దీపముండగానే ఇల్లు చక్కపెట్టుకొన్నట్లుగా బాల్యదశ నుండే ధర్మార్థాలను ఆచరిస్తూ మోక్షమార్గం వైపు పయనించమని భక్తమందార శతకం ద్వారా కోటయ్యగారే సూచించారు.

శ్రీత్రిపురాంతకేశ్వర శతకకర్త పాలుట్ల పాలంకయ్య గారు దుర్లభమైన మానవజన్మ పొందగానే ప్రయోజనం లేదని మన కర్తవ్యాలను మనం నిష్ఠతో నిర్వహించాలని పేర్కొంటూ

పురుషుడనై జనింపగనె పూజ్యత గల్గదు వానికిన్ ధరా
సురులను బ్రోవకున్న గడు శూరత జూపకయున్న నాజిను
ర్వర సిరులందు దాలిమి వర్ధిల్ల జేయకున్న నీశ్వరున్
మరువొక గొల్వకున్న బుధమాన్య! హరా! త్రిపురాంత కేశ్వరా!

ధైర్యగుణం కలిగి ఉండాలనీ, ధరానురులను గౌరవించాలనీ, సంపదల పట్ల తాలిమి కలిగి ఉండాలని ఈశ్వరారాధన మరువక పాటించాలని సూచించారు.

పరిచయముందనీ శ్రుతులు వైభవముం గననీ మహీస్థలిన్
విరచన జేయనీ కృతులు, వేగమె పద్యశతంబు జెప్ప నీ,
కరచరణాది సంఘటిత కాయము నిల్పగ నిమ్ము రోదసిం
బురహర నిన్నుగాంచక యపూజ్యుడగుం త్రిపురాంత కేశ్వరా!

కేవల పాండిత్యంతో, ప్రతిభతో ప్రయోజనం లేదని భగవద్భక్తియే లేకపోతే పైవన్నీ నిష్ప్రయోజనమేనన్నారు.

వేణుగోపాల శతకకర్త ఊరె వీరభద్రకవి గారు పరోప

కార ధర్మమును పాటించాలని ఉపదేశిస్తూ

నిబిడ దారిద్ర్య వార్నిధి నీదగాలేము
లే మురాంతకుని పాలికి జనంగ
నా కుచేలుండు మీదగు సన్నిధికి వచ్చి
వచ్చిన మాట వాక్రుచ్చకున్న...

కృష్ణుడు ఎలా తనను ఆశ్రయించిన కుచేలుడిని అనుగ్రహించాడో అలాగే మనం కూడా చేతనయినంతో పరులకు సాయం చేసే గుణం అలవరచుకోవాలనీ, ఆ సాయం అహంభావంతో కాకుండా భక్తిభావంతో చేస్తూ 'మానవ సేవే మాధవ సేవ' అనే ధర్మాన్ని అనుసరించాలని ప్రబోధించారు.

శ్రీహైమవతీశ శతకకర్త పాలుట్ల వెంకట నర్సయ్య గారు ముక్తి పొందే మార్గాన్ని ఉపదేశిస్తూ

నబీపరసతిని కన్నతల్లిగ
బర ధనమును మట్టిపెడ్డ పగిదినిగను న
ప్పురుషుండు ముక్తి కర్హు న్
డరయగ సందేహమేల హైమవతీశా!

అర్థకామాలను అధికంగా పొందాలనే ఆపేక్షతోనే సాధారణంగా ఎవరైనా అధర్మవర్తనులవుతారు. పరస్త్రీలను కన్నతల్లిగా భావిస్తూ, ఇతరుల సొమ్ముకు ఆశ పడకుండా దాన్ని మట్టిపెడ్డ లాగా భావిస్తే ఇక ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావలని అటువంటి లక్షనాలు అలవరచు కోమని ప్రబోధిస్తారు. ఈ పద్యంలోని ముక్తి పదం మోక్ష మార్గానికి సంకేతం. మోక్షమంటే జీవితానంతరం పొందే సౌఖ్యాలు కావని, బ్రతికి ఉండగానే జీవితాన్ని సార్థకం చేసుకుంటూ ఆత్మతృప్తిని అనుభూతం చేసుకోవడమని మహర్షుల వివేచన. ఇలా ధర్మబద్ధంగా జీవిస్తూ

వర జప హోమ క్రియలును
సరిరావు త్వదీయనామ సంకీర్తనకున్
నిరతము నట్లొనరించిన
హరియింపవె పాతకములు హైమవతీశా!

యజ్ఞయాగాది మహాక్రతువులు చేయలేకపోయినా భగవన్నామ సంకీర్తనతో పాతకములు పోగొట్టుకొని పురుషార్థ సాధనను గ్రహింపగలమంటారీ కవిపుంగవులు.

ఉపసంహారం :

దండలతో దండాలతో భగవంతుడిని ప్రసన్నం చేసు కోవడం సాధ్యం కాదు. అది ధర్మాచరణతో మాత్రమే సాధ్యమవుతుంది. ఇటువంటి ధర్మాలన్నిటి కంటె పరమ ధర్మము

ఒరులేయని యొనరించిన
నరవర! యప్రియము దన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్!

అని కవిబ్రహ్మ తిక్కనార్యులు ఉద్బోధించినట్లుగా పరులకు నష్టం, కీడు తలపెట్టకుండా ప్రజలు జీవించాలి. ధర్మం గురించి ఇంతకంటె దృఢంగా తేలికగా ప్రస్తుత ప్రపంచానికి వివరించిన మరొక మహాకవి లేడనడం నిర్వి వాదాంశం.

ధర్మం కంటె శ్రేష్ఠమైన బంధువులేడు. మేలైన ధనం లేదు. ధర్మం కంటే ప్రియతరమైనదేదీ లేదు. కాబట్టి ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి.

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాసి ధర్మాత్పరం ధనమ్
ధర్మాత్ప్రియతరః కోవా స్వధర్మం రక్ష యత్నతః

ఉపయుక్త గ్రంథసూచి :

1. హిందూ మతము - ఒక అవగాహన - స్వామి నిర్వేదానంద - రామకృష్ణ మఠం
2. మన పిల్లలకు హిందూమతం చెప్పడం ఎలా - కె. అరవిందరావు - ఎమెస్కో
3. సనాతనధర్మం - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు - ఎమెస్కో
4. పురాణ ప్రశస్తి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య - తిరుమల తిరుపతి దేవస్థానము
5. తెలుగులో క్షేత్రాలు సాహిత్యం - మాడుగుల నారాయణమూర్తి - తెలుగు అకాడమి

రామాయణము – ధార్మికాంశాలు

– యం. వేణుగోపాల్ శర్మ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల-మెదక్, తెలంగాణ.

వేదవేద్యే పరేపుంసి జాతే దశరతాత్మజే
వేద: ప్రాచేతసాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా

వేదమే కావ్యంగా ఆదికవి వాల్మీకి నోట పలికిందని సహృదయుల అభిప్రాయం. లోకోత్తరమైన వాఙ్మయాన్ని లోక సమ్మతమైన కావ్యంగా జనరంజకంగా రూపొందించాడు వాల్మీకి మహర్షి.

ఈ సకల చరాచర ప్రపంచం నశించకుండా దేని వలన నిలబడుతుందో అదే ధర్మము.

"ధ్రియతే అనేన ఇతి ధర్మ:"
"ధారయతే ఇతి ధర్మ:"

ధర్మమే ఈ జగత్తును నిలబెడుతుంది. ఇదే అర్థాన్ని శృతి వాక్యమయిన 'ధర్మో విశ్వస్య జగత: ప్రతిష్టా". వేదాలు, ఉపనిషత్తులు శృతి, పురాణాలు, వీటన్నిటిలో ధర్మం గురించిన ప్రస్తావన ప్రముఖంగా చెప్పబడి ధర్మ ప్రయోజనాన్ని ప్రతిపాదిస్తున్నాయి. భారత, భాగవత, రామాయణాల్లో కూడా చతుర్విధ పురుషార్థాల గురించే చెప్పబడింది. రామాయణంలోని ప్రతి పాత్రలో ఈ ధర్మాలు చెప్పబడ్డాయి. పురుషార్థమన్న మాట సంకుచితంగా కేవలం పురుషులకు చెందినది అనుకోవడం పొరపాటే. పురుష శబ్దానికి మనిషి అని అర్థం.

ధర్మార్థ కామ మోక్షాలు ఒక దాని కొకటి అనుసంధానమై నిలబడతాయి. ప్రతి మనిషి ముందుగా ధర్మంగా ప్రవర్తిల్లుట మీద మిగిలిన పురుషార్థాలు ఆధారాపడి ఉంటాయి. అందుకనే కాబోలు "ధర్మో రక్షతి రక్షిత:" అన్నది ప్రధానంగా నిలిచింది. దీనిని బట్టి సర్వ పురుషార్థాలు ధర్మమునే ఆధారంగా చేసుకొని నడుస్తున్నవనే చెప్పవచ్చు.

రామాయణాన్ని పరిశీలించినపుడు మనకు అది ఒక ఆదర్శప్రాయమైన గ్రంథంగా కనిపిస్తుంది. భాగవతం ఆధ్యాత్మికతకు, భారతం ఒక సాంఘిక ఇతివృత్తానికి ఉదాహరణలుగా నిలిచినా రామాయణం మాత్రం ఆదర్శ ప్రాయమైన గ్రంథరాజముగా నిలబడింది. అందుకు కారణం రామాయణంలోని చాలా పాత్రలలో ఈ చతుర్విధ పురుషార్థాలు ప్రతిబింబిస్తాయి.

ధర్మమనేదానికి ఇదమిత్థమయిన అర్థం చెప్పడం కంటే, నియమబద్ధమయిన జీవనశైలి అని చెప్పవచ్చు. రామాయణంలో ప్రతి పాత్రలోనూ ధర్మాన్ని దర్శించ గలుగుతాము. రామునిలో పితృ వాక్య పరిపాలన అనే ధర్మపాలనలో రామాయణం కథంతా నడిచింది. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ అనేవి లోక కళ్యాణ హితమయిన అంశము ఆధారంగా రాముని పాత్ర కూడా మామూలు మానవుని వలె కష్టాలు పొందినట్టు చూస్తాము. రాముని వనవాస అంశాన్ని తీసుకున్నప్పుడు లక్ష్మణుని పాత్రలో ధర్మబద్ధత ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ప్రస్తుత కాలంలో ఈ అంశం నుదూరమయినా, నాడు అన్న, వదినలకు సేవ చేయుటకు లక్ష్మణుడు సైతం అడవులకు వెళ్ళడం ఈ నవీన సమాజానికి అంతుబట్టని విషయమయినా ఇది ధర్మ సూక్ష్మమయిన విషయం.

రామాయణంలో ఊర్మిళాదేవి లాంటి పాత్ర "నభూతో న భవిష్యతి". ఏ పురాణాలు, ఏ ఇతిహాసాలు, ఈనాటి ఆధునిక గ్రంథాలు పరిశీలించినా అటువంటి పాత్ర కనిపించదు. లక్ష్మణుడు సహితం వనవాసానికి వెళ్ళటాన్ని తనకు తానుగా అంగీకరించటం, ఆ 14 ఏళ్ళపాటు సుదీర్ఘ నిద్రకు వెళ్ళటం వంటి సన్నివేశాలు రామాయణంలో మణిమకుటాలు. ఇలా సకల జీవ రాశులలో కూడా ఈ ధర్మాన్ని రామాయణ కర్త చూపించటం, గమనించదగిన విషయం. జాంబవంతుడు, హనుమ, జటాయువు, ఉడుత ఇలా అన్నింటిలోనూ కూడా ధర్మం ప్రతిపాదించబడింది.

సీతాపహరణ ఘట్టంలో రావణుడు సీతను కొనిపోవు చున్నప్పుడు ఆ అధర్మాన్ని చూడలేక జటాయువు రావణాసురుణ్ణి ఎదుర్కోవటం అనేది ఒక వైవిధ్యమయిన అంశం. రావణుని పరాక్రమం ముందు తాను బ్రతుకు తుందో లేదో కూడా ఆలోచించని జటాయువు పాత్ర అమోఘమయినది.

ఇలా ధర్మాన్ని కేంద్ర బిందువుగా చేసికొని రామాయణ పాత్రలన్నింటినీ నడిపించిన రామాయణ కర్త ధర్మం వెంటనే మిగిలిన పురుషార్థాలు సిద్ధించినట్టుగా గోచరింప చేశాడు. "యతో ధర్మస్తతో జయ:" అన్నట్లుగా ధర్మమును వెన్నంటే అర్థ, కామ, మోక్షాలు ఆధారపడి ఉంటాయని నిరూపితమయినది. రామాయణంలోని ఏ పాత్రకు కష్టం, సుఖం కలిగినా ఇవన్నీ ధర్మముపై ఆధారపడిన లోక కళ్యాణం కోసం జరిగినదని చెప్పవచ్చు.

మానవ జీవన గమనంలో గృహస్థాశ్రమ ధర్మము యొక్క ప్రశస్తి ఉంది. గృహస్తు కానివాడు ధర్మాచరణ చేయడం కొంతవరకు కష్టము. ధర్మ బద్ధమయిన జీవితం నడవడానికి గృహస్థాశ్రమ ధర్మమే గొప్పదని చెప్పబడినది. సత్య వాక్య పరిపాలన, పితృవాక్య పరిపాలన, భ్రాతృ ప్రేమ, వైవాహిక వ్యవస్థ, స్వామిభక్తి, ఆశ్రితపాలన, ప్రతిజ్ఞా పాలన, లోక మర్యాద, వైవాహిక జీవితం, రాజనీతి ధర్మం, లోకహితం మరియు భూతదయ వీటన్నిటినీ ఆధారంగా చేసుకొని ధర్మం నిలబడుతుంది.

ఇలా రామాయణంలో ప్రతి పాత్రలో ఇన్ని ధర్మాలు ఉండటం వలన రామాయణం ఒక ఆదర్శప్రాయమయిన గ్రంథంగా నిలిచింది. అన్ని గ్రంథాలలో వలె కాకుండా కేవలం చతుర్విధ పరుషార్థాల వలన రామాయణానికి ఇంతటి ప్రశస్తి కలిగిందని చెప్పడంలో సందేహం లేదు.

❖ ❖ ❖

మహాభారతము – ధార్మికత

– డా. కొచ్. వామనమూర్తి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల-మెదక్, తెలంగాణ.

మానవుని అస్తిత్వానికి మూలమైన నైతిక, ఆధ్యాత్మిక విలువల ద్వారానే మానవ జీవితం ఉదాత్తతను పొందుతుంది. ఆధ్యాత్మిక పరిమళములు లేని జీవితం అర్థ రహితము. కర్మను ఆచరించే నియమము, నిబద్ధత, సహ జీవనం, ధైర్యం, నిజాయితీ, సేవాగుణం ఇవన్నీ సంస్కార భావాలు, "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" అనేది కాళిదాసు గారి నానుడి. మానవుని ధర్మాచరణకు సాధనములు ఎన్ని ఉన్నా శరీరం ప్రధానమైనది. భగవంతుడు మానవునికి ధర్మసాధన కొరకు ఈ శరీరము నిచ్చినాడు. ఈ దేహమును దేవాలయంతో కూడా పోలుస్తారు. మనిషి జీవితం అనే సౌధానికి "ధర్మం" అనేది పునాదివంటిది.

ధర్మార్థ, కామ, మోక్షములు చతుర్విద పురుషార్థములు. వీటిలో ధర్మం మూలమైతే అర్థ, కామ, మోక్షములు దాని అంతస్థులు. చతుర్విద పురుషార్థములను గురించిన విషయములు మహాభారతంలో విశేషించి గోచరిస్తాయి. మానవాళిలో పూర్తి సద్గుణములే గాని కేవలం దుర్గుణములే గాని ఉన్న వ్యక్తి ఉండుట చాలా అరుదైన విషయము. ప్రతి మనిషిలో ఏవో లోపాలు కనిపిస్తాయి. అట్లే దుర్మార్గునిలో కూడా ఎక్కడో మంచి గుణములు కనిపించకపోవు. మనిషిలోని మంచి, చెడులు నిర్ణయించేది వారి ధర్మాచరణ.

ధర్మేచార్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ ।
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్ ॥

ఈ శ్లోకము మహాభారత వైశిష్ట్యాన్ని తెలియజేస్తుంది. మహాభారతంలో ఉన్నదే లోకంలో ఉంది. లోకంలో ఉందే, మహాభారతంలో ఉంది. ఇందులో లేనిది ఇంకెక్కడా ఉండదు. మహాభారతం మన సాంఘిక ఇతివృత్తం. అది దర్పణం వంటింది. భారతం చదవడం అంటే మనల్ని మనం అద్దంలో చూసుకొనుట వంటిది. అందుకే తెలుగు వారికి మహాభారతం ఒక స్వతంత్ర మహా కావ్యంవలె మన హృదయాల్లో నిలిచి ఉంది. మహాభారత కర్త వ్యాసమహర్షి అందులో ధర్మాధర్మములను అద్భుతంగా చిత్రించినాడు. ఈ భారతంలో తానూ ఒక పాత్రగా ప్రకాశమానం అవుతాడు. మహాభారత పాత్రలను ప్రత్యేకంగా వీక్షించాలి.

మహాభారతంలో మణిమకుటం భీష్ముడు. తనకు చెందవలసిన రాజ్యాధికారమును తృణప్రాయంగా భావించిన త్యాగధనుడు, ఆశ్రిత వాత్సల్యం, భక్తి, శ్రద్ధలు, ధర్మపాలన మూర్తీభవించిన కరుణా సింధువు. అష్ట వసువులలో ఒకనిగా అవతరించిన భీష్ముడు సదా పూజనీయుడు. వశిష్ఠ ముని శాపం వలన భూలోకములో మానవునిగా అవతరించిన ప్రభాసుడు శాపావకాశమును కోరగా గంగా శంతనులకు దేవవ్రతుడుగా పుట్టి మహాభారతమును నడిపిన ధీరోదాత్తుడు భీష్ముడు. జీవితంలో తనకు వచ్చిన ఎన్నో కష్టాలను ఎదురీదిన ధీశాలి. ఎదురైన ప్రతి కష్టమును ఓ మెట్టుగా మలచుకొని నడిచినాడు. వశిష్ఠుడు, శుక్రాచార్యుడు, పరశురాముడు ఆయనకు గురువులైనారు. తండ్రి సుఖం కోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటానని, రాజ్య పాలనాధికారం తనకు వద్దని భీషణ ప్రతిజ్ఞ చేసి దేవవ్రతుడు భీష్ముడయినాడు. అందుకు తండ్రిచే స్వచ్ఛంద మరణము అనే వరాన్ని పొందినాడు. తన మరణ దినమును ఒక పర్వదినముగా అనుగ్రహించమని శ్రీకృష్ణుని వేడుకొన్నాడు. అనాటి నుండి మాఘ శుద్ధ ఏకాదశి "భీష్మైకాదశి" గా ప్రసిద్ధి నొందినది అని నారదీయ పురాణం చెబుతుంది. దీనిలో తండ్రి యొక్క మనోరథమును ఎరిగినవాడైన పితృభక్తి పరాయణుడని అందరికీ తెలియుచున్నది. ఇది ఎక్కడా జరగని అంశముగా

తండ్రి కొరకు, రాజ్యమును, వివాహమును త్యాగం చేయడం కనిపిస్తుంది.

భీష్ముని సత్యనిష్ఠ అమోఘము. ఎన్ని కష్టములు తన ముందున్నా సత్యనిష్ఠకు దూరం కాలేదు. సత్యం, ధర్మం కంటే ఏదీ గొప్పది కాదని భావించాడు.

ధర్మపాలన రాజనీతి ధర్మములు ధర్మరాజుకి బోధించి నాడు. "సత్యాన్నాస్తి పరోధర్మ:..." సత్యం కంటే గొప్ప ధర్మం లేదు. సనాతన ధర్మానికి మూలకారణమే సత్యము. సత్యము, ధర్మము రెండు ఒకటిపై మరొకటి ఆధార భూతమైనాయి. ధర్మం లేక సత్యానికి ఉనికి లేదు. సత్యం లేక ధర్మం లేదు. భీష్ముల వారి భావనలో నిత్యమైనది, నాశనం లేనిది సత్యం ఒక్కటే. మహాభారతంలో ధర్మా ధర్మములను విగ్గడించి చెప్పగలిగింది భీష్ముడు మాత్రమే. అందుకు శ్రీకృష్ణుడే నిదర్శనం. శ్రీకృష్ణుడే భీష్ముడిని "మూర్తీభవించిన ధర్మం" గా పేర్కొంటాడు. అయితే భారతంలో కనిపించే ఒకటి రెండు సందర్భములు భీష్ముడు అధర్మమునకు తలవంచినాడు. ఒకటి శ్రీకృష్ణ రాయబారంలో దుర్యోధనాదులు, కౌరవులు కృష్ణుడిని బంధించటాన్ని, ద్రౌపదీ వస్త్రాపహరణమును, ఆపక మిన్నకుండుట, అయితే ఇందులో ధర్మ సూక్ష్మములు దాగి ఉన్నాయనేది విజ్ఞుల అభిప్రాయం. అయినప్పటికి భీష్ముడు అందులకు అంగీకరించినాడు. ధర్మా ధర్మ విచక్షణ తెలిసినవాడు భీష్ముడు. ఈ సందర్భరములో భీష్ముని యొక్క పరాక్రమాన్ని కూడా ఒకసారి ప్రస్తావించు కోవాలి. అతడు అమిత పరాక్రమశాలి. ఒక్కసారిగా పదకొండు వేల మంది విలుకాళ్ళను ఎదుర్కోగలిగిన పరాక్రమవంతుడు. అతనిని యుద్ధరంగంలో ఎదుర్కో వడం ఎవరితరం కాలేదు. అందుకే భీష్ముడిని మహారథి కుడు అన్నారు.

యుద్ధంలో తనవారందరినీ కోల్పోయిన ధర్మరాజును శ్రీకృష్ణుడు అంపశయ్యపై ఉన్న భీష్మాచార్యుల చెంతకు తీసుకొని వెళ్ళి భీష్మునిలోని జ్ఞాన సంపద తనతోనే పోకూడదని, వర్ణాశ్రమ ధర్మాలు, రాజధర్మాలు, ఆపద ్ధర్మాలు, మోక్షధర్మాలు, శ్రాద్ధ ధర్మములు, దాన ధర్మములు, స్త్రీ ధర్మములు ఇలా సమస్త ధర్మముల గురించి బోధింపజేశాడు. భీష్ముడు చేసిన ధర్మబోధ మనకు భారతంలో శాంతి, అనుశాసనిక పర్వాలలో కని పిస్తుంది. ధర్మరాజుతో వచ్చిన శ్రీకృష్ణ పరమాత్ముని జూచి భీష్ముడు పరమభక్తితో ఆయనను స్తుతించాడు. అదే "భీష్మస్తవం" శ్రీ వైష్ణవ సంప్రదాయంలోని స్తవములలో ఇది అగ్రగణ్యమైనది.

"నమ: కృష్ణాయ యనుచు వినత శిరస్కుడై మ్రొక్కెవిశ్రుతభక్తిన్" అని తిక్కన పేర్కొంటాడు.

అన్నింటిని మించి, ఈ ప్రపంచానికి విష్ణు సహస్రనామ స్తోత్రాన్ని అందించినది భీష్మాచార్యుడు. విశ్వమే విష్ణువు, ప్రపంచమంతట విష్ణువును చూడగలిగే మార్గమును ఈ స్తోత్రంలో మనకు చూపిస్తాడు. తనువు చాలించుటకు అంపశయ్యపై ఎదురుచూసి మాఘశుద్ధ అష్టమినాడు ప్రాణాలు వదిలినాడు. అష్టమి మొదలు ద్వాదశి వరకు గల అయిదు రోజులను భీష్మ పంచకములని అంటారు.

ఇలా మహా భారతమును సాంతం తన రాజనీతి ధర్మ ములతో నడిపిన భీష్మాచార్యులు చూపిన వివిధ ధర్మ ప్రబోధములు ఆచరణీయములు.

❖ ❖ ❖

జానపద సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు

– ఎన్. అరుంధతి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ.

"ధర్మార్థ కామ మోక్షేషు వైచక్షణ్యం కళాసుచ
ప్రీతిం కరోతి కీర్తించ సాధు కావ్య నిషేవణం"

ధర్మార్థ కామ మోక్షాలలోను, కళలో నైపుణ్యాన్ని కీర్తిని, ప్రీతిని నత్కావ్యం కలిగిస్తుందనీ భామహుని అభిప్రాయము. ఇదే కావ్య ప్రయోజనం.

కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే శివేతర క్షతయే
సద్యః పర నిర్వలత యే కాంతాసమ్మిత యోపదేసయుజే

కావ్యం యశస్సు కొరకు, ధన సంపాదన కొరకు, వ్యవహార జ్ఞానం కొరకు, అమంగళ పరిహరణం కొరకు, మోక్షసాధన కొరకు కాంతా సమ్మితమైన ప్రబోధం కొరకు అని ముమ్మటుని అభిప్రాయం.

జానపదమనగా జనపదానికి సంబంధించినది. జనపద మనగా పల్లెటూరు. జనపదమున నివసించువారు జాన పదులు. వారి గురించి తెలిపే సాహిత్యం జానపద సాహిత్యం. జానపద విజ్ఞానానికి కాలనిర్ణయం చేయడం కష్టం. మానవుని తొలిదశ దీని పుట్టుకకు ప్రారంభమని చెప్పుకోవాలి. ఎందుకంటే ఈ విజ్ఞానమంతా తరతరాలది తప్ప ఒక తరానికి, ఒక వ్యక్తికి, ఒక కుటుంబానికి సంబంధించినది కాదు. జానపద సాహిత్యములో యక్షగాన వాఙ్మయము. అతిప్రాచీనమైనది. ఈ కళ ప్రజల సంస్కృతి సంప్రదాయానికి అద్దము పట్టినది. యక్షగానాన్ని ప్రజా సాహిత్యమని చెప్పవచ్చు. ఇతి వృత్తాలు, పౌరాణికాలు గానీ, సాంఘికాలు గానీ ఏవైనప్పటికీ రాజు నుండి పేద వరకు ఆకర్షించిన రచన యక్షగానం. ప్రజాహృదయాలకు అతిసన్నిహితమైనది. అంతేకాదు సాంఘికాలు, పురాణాల్లో, ఇతిహాసాలలో ఉన్న గొప్పతనాన్ని, విలువల్ని సామాన్య మానవుని అనుభవంలోకి తీసుకువచ్చాయి. సాహిత్యపు ఔన్నత్యాన్ని సామాన్యునికి చవి చూపాయి.

యక్షశబ్దం : వేదమంత్రంలో యక్షశబ్దం పరమాత్మ వాచకంగా ప్రయోగించబడింది. ''సమస్త విశ్వాన్ని నడిపించేవాడు, ఈ బ్రహ్మాండరూప రథాన్ని లాగేవాడు, అద్వితీయమైన అధ్యక్షస్థానంలో ఉన్నవాడు, సమస్తాన్ని ధరించేవాడు సర్వ ఋతువుల్ని వ్యవస్థీకరించినవాడు ఎవ్వడు? అతడే యక్షుడు.

వాల్మీకి రామాయణంలో యక్షత్వం అమరత్వం; అదొక దివ్యవరప్రసాదం. మహాభారతం ప్రకారంగా యక్షులు ధర్మపరాయణులు జిజ్ఞాసువులు. ఇతిహాసాలలో వారు శైల, జల, వన దేవతలు, బ్రాహ్మణ, బౌద్ధజైన సార స్వతాలలో వారు దేవయోనులుగా, రాక్షసకల్పులైన రాజస శక్తులుగా పేర్కొనబడ్డారు. భట్టికావ్యంలో యక్షులను స్తోత్ర పాఠకులన్నారు. మేఘ సందేశంలో యక్షులు సంగీత సాధకులుగానూ, నృత్య గీతాభిలాషులుగాను సూచింప బడ్డారు.

శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో మొదటిసారిగా ''యక్షగానం'' సమస్తపదంగా కనిపిస్తోంది.

"కీర్తింతురెద్దాని కీర్తి గంధర్వులు గంధర్వమున యక్షగానసరణి"

యక్షగానమను సాహిత్య ప్రక్రియ దేశీవాఙ్మయశాఖకు చెందినది. నంగీతము, నృత్యము, అభినయము, వేషధారణము సాహిత్యము మొదలన అనేక కళల ఆధారముగా రూపొందిన విశిష్ట సాహిత్య ప్రక్రియ ఈ యక్షగానము. ఇక జానపదము ఒకరు ఇద్దరు పాడుకునేది. కాని యక్షగానము. గుంపులు, గుంపులుగా చేరి రాత్రివేళలో ఆడి-పాడి అలరింపజేసేవి. ఆనందాన్ని అందించేవి. ధర్మము, నీతి, న్యాయము అనే వాటిని చాటేది. మోక్ష మార్గానికి సోపానము వేసేది ఈ కళయే.

ఈ యక్షగానాలలో భీష్మ, ద్రోణ, కర్ణాది పాత్రల ద్వారా జానెడు పుట్టకూటికై నీచులు గొల్చెడి ఘోర దుర్దశలను చూపిరి. శకుని, మాయల ఫకీరు మారీచుడు వంటి పాత్రల చేత లౌక్యాన్ని ప్రదర్శించిరి. రావణుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుల పాత్రల ద్వారా దుర్మార్గుల గుణ శీలాదులను విశదపరిచి ప్రజలను చైతన్యం చేసిరి. సీత, దమయంతి పాత్రల ద్వారా స్త్రీలు వనవాసముందును. భర్తల చెంత నిలిచి ధైర్యమును ప్రబోధించిరి. రాముడు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు, నలుడు వంటి పాత్రల ద్వారా ధర్మాన్ని ప్రజలకు చాటి చెప్పారు.

వస్తు వైవిధ్యం దృష్ట్యా యక్షగానాన్ని నాలుగు ప్రధాన విభాగాలుగా చేయవచ్చు. పౌరాణికాలు, చారిత్రకాలు, సాంఘీకాలు కాల్పనికాలు. ఆ నాలుగు భాగాల్ని కొంత సూక్ష్మంగా మరికొన్ని విభాగాలు చేసే అవకాశమున్నది. భారత, భాగవత, రామాయణ, పౌరాణిక శాక్తేయ సంబంధమైన కథలు, గాథలు సమాజాన్ని ధర్మము, న్యాయము, నీతి అనే భావములను తెలియజెప్పినవి, ధర్మాన్ని కాపాడినవి. యక్షగానాలే అని చెప్పవచ్చు. ధార్మిక, నైతిక జ్ఞానం లేనివారు ఇంచుమించుగా పశువులతో సమానం. కావున మౌఖిక సాహిత్యమైన యక్షగానం ప్రజలను, ప్రభువులను, దేవతలను ఆదరించి సన్మార్గమున నడిపించినవి.

పౌరాణిక సంబంధమైన యక్షగానాలలో భాగవత సంబంధమైన రుక్మిణీ కళ్యాణం, కాళీయమర్ధనం, శ్రీకృష్ణ తులభారం, చెంచులక్ష్మీ పరిణయం, వంటివి రామాయణ సంబంధమైన శ్రీరామాంజనేయ యుద్ధం, మండోదరి పరిణయం, మైరావణ చరిత్ర వంటివి, భారత సంబంధమైన భీమసేన విలాసం, బభ్రువాహన చరిత్రము, శకుంతల పరిణయం, నలమహారాజు చరిత్ర, చిరుతల శ్రీ మహాభారతం, గయోపాఖ్యానం, సుభద్ర పరిణయం, విజయవిలాసం వంటివి ఎన్నో ఉదాహరణలుగా చెప్పకోవచ్చు. శకుంతల పరిణయం యక్షగానంలో ఆనాటి వైవాహిక వ్యవస్థ, సత్యవాక్పాలనము వంటి అంశాలు. తెలియజేసినవి. జానపదుల్లో పంచపాండవుల కథగా ప్రసిద్ధిగాంచిన భారతంలోని అనేకాంశాలు, యక్షగానాలుగా అవతరించాయి.

జానపద రూపక ప్రపంచంలో బహుళ ప్రాచుర్యం పొందిన యక్షగానం, గయోపాఖ్యానం, అన్నమాటకు కట్టుబడి ఆర్తత్రాణ పరాయణత్వమే ధ్యేయంగా మెలగిన పాండవుల ధర్మపారమ్యాన్నీ లోకానికి చాటిన కథ ఇది.

మరొక యక్షగానం బభ్రువాహనవిజయం. తండ్రిని యెదిరించి సాహస పరాక్రమాలు ప్రదర్శించిన భారత సంబంధి అయిన బభ్రువాహనుని కథ ప్రజలను ఆకట్టుకున్నది. జయంత జయపాలమనే కల్పిత యక్షగానంలో భానుమతి వంటి పతివ్రతల పాత్రలు సమాజం మీద ముద్ర వేస్తాయి. ప్రభావతివంటి దుష్టపాత్రల్ని ప్రజలు ఛీ కొడతారు. కల్పన ఉన్నా సామాజిక సందేశం స్ఫురిస్తుంది. స్నేహానికీ, ప్రతివ్రతా తత్వానికీ, నీతికి, ధర్మానికి ఎన్నటికైనా జయం తప్పదని, జయంత జయపాల యక్షగానం సందేశమిస్తుంది.

భక్త రామదాసు చరిత్ర యక్షగానంలో రామదాసు పన్నెండు సంవత్సరాలపాటు జైలులో ఉండడానికి కారణమేమిటో బోధపడదని ప్రజలనుకుంటూనే యక్షగాన రచయిత దీనికొక కల్పన చేశాడు. రామదాసు పూర్వ జన్మలో ఒక చిలుకను పన్నెండెండ్లు పంజరంలో ఉంచి నందువల్ల అతన్ని విడిపించడంలో ఇంత తాత్సారం జరిగిందని సీతకు రామునిచేత చెప్పించాడు. కార్యకారణ సంబంధాన్ని ఈ విధంగా జోడిస్తూ సంఘటనల మధ్యన వైరుధ్యాన్ని సమన్వయిస్తూ, ప్రేక్షకుని మనస్సులో చెలరేగిన సందేహాలకు సమాధానాలందిస్తూ యక్షగానం ప్రదర్శితమవుతుంది.

యావద్భారతంలో భగవంతుని నామస్మరణం, భక్తికి మొదటి సోపానంగా భావించే స్థితికి చేరుకుంది. సాహిత్యంలోని సర్వప్రక్రియల్ని ఈ భక్తుల కథలు స్పృశించాయి. యక్షగానం కూడా భక్తుల కథల్ని సంభావించింది.

"శ్రవణం కీర్తనం విష్ణోః
స్మరణం పాదసేవనం ।

అర్చనం వందనం దాస్యం

సఖ్యమాత్మ నివేదనమ్ ॥

సంస్కృత భాగవతంలోని ఈ శ్లోకం నవవిధ భక్తుల్ని ప్రతిపాదించింది. ఈ నవవిధ భక్తి మార్గాలు యక్షగాన సాహిత్యంలో నిండుగా కనిపిస్తున్నాయి. రామదాసు చరిత్ర యక్షగానంగా రచించిన యాదవదాసు ఈ నవ విధ భక్తులను తమ గ్రంథంలో ప్రతిష్టాపించారు.

జాతీయోధ్యమ ప్రభావంతో రాసిన క్రోదాపురి రైతు విజయను యక్షగానంలో ఒక రైతుకు కలిగిన కష్టాలు, చెల్లిలి వివాహ నిమిత్తం అప్పులపాలైన అతని జీవితం, వడ్డీలు, మోసాలు, కుటుంబ సమస్యలు....వివరించడం జరిగింది.

ముగింపు :

యక్షగాన రచయితలు కాలప్రభావానికి లోనై సమాజానికి చక్కని సందేశాన్నిచ్చిరి. ప్రజలు నాటి నాయకుల బారినుండి చితికి బ్రతుకుల నుండి బయటపడి వంశములను కాపాడుకొనగలినారు. ప్రధానంగా భాషాబలంచేత ప్రజలను రంజింపజేసి. ఐక్యతవైపుకు మరల్చినారు. కులములను, వృత్తిధర్మాలను, జాతి ధర్మాలను చాటిచెప్పి దైవభక్తి, దేశభక్తి, పితృధర్మములను, దానధర్మాలను కాపాడుకొన్నారు. రాజధర్మాలను వివరించి, ప్రజల మనస్సును రంజింపచేసిన యక్షగాన ప్రక్రియ ప్రజావళికి ఆనందాన్ని కలిగించింది.యక్షగాన వాఙ్మయానికి ఎంతో బలమువున్నదని నిరూపించినది. సామాన్య ప్రజానీకంలో ఒక సమూలమైన మార్పును తేవడంలో యక్షగానం తనవంతు పాత్రను సముచితంగా పోషించినది. సామాన్య ప్రజానీకానికి ధర్మాధర్మములను చతుర్విద పురుషార్థ ములను గురించిన విషయాలు సులభంగా తెలియజెప్పిన ప్రక్రియ యక్షగానం.

మన జానపదకళలు, సాహిత్యం మహోన్నతమైన మన దేశ సంస్కృతికి పట్టుకొమ్మలు, సకల శాస్త్రాలకు మూలం, మానవ నాగరికతా వికాసంలో చతుర్విద పురుషార్థాల పాత్ర అనన్య సామాన్యమైనది.

❖ ❖ ❖

రామాయణం–పరమార్థం

– ఎస్. చంద్రశేఖర శర్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే.

భారత వాఙ్మయంలో పురాణత్రయంగా చెప్పుకోబడుతున్న ఇతిహాసములు భారత, భాగవత, రామాయణములు. వీటిలో రామయణం ఎంతో విశిష్టమైనది. రామ నామము కమ్మని కర్ణ రసాయనము. అందుకే రామాయణం సర్వ జనపారాయణమైనది. నేటికిని అందరి నోళ్ళలో నిత్యం నానుతుంది. ఎప్పుడు ఎక్కడ ధర్మానికి విఘాతం కలిగినా, ధర్మాచరణ తగ్గుముఖం పట్టినా అప్పుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు, ధర్మ రక్షణకు సజ్జనులకు విముక్తి లభించడానికి యుగయుగాలలో భగవంతుడు అవతరిస్తుంటాడు.

యావత్ స్థాస్యంతి గిరయ: సరితశ్చ మహీతలే,
తావద్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి.

కొండలు నిలకడగా ఉన్నంతకాలం, నదులలో నీరు ప్రవహిస్తున్నంతకాలం, రామాయణ కథ విశ్వవ్యాప్తిలో ఉంటుంది. జీవులన్నింటిలో మానవ జన్మ లభించడం దుర్లభం. అందులోను పురుష జన్మ, విప్రుడిగా, అంతకంటే వైదిక ధర్మాచరణపై ఆసక్తి కలిగిన వాడిగా ఉండడం ఇంకా దుర్లభం. ఆత్మానాత్మ వివేచన కలిగి ఉండడం కూడా దుర్లభం. మోక్ష సాధన ఎన్నో జన్మల పుణ్యం వలన కానీ సిద్ధించదు.

యదాయదాహి ధర్మస్య.....అన్నట్లుగా బాధలతో అలమటించే జీవుల పట్ల భగవంతుడు కరుణతో ఈ భౌతిక ప్రపంచంలో అవతరిస్తాడు. శ్రీ రామచంద్ర మూర్తి అవతరించి ఎన్నో అద్భుతమైన కార్యములు నిర్వహించి తన ఔన్నత్యాన్ని చూపించాడు. రాముడు కళంకము లేని కళానిధి. సాధారణ మానవునిగా అవతరించి విశిష్టమైన వ్యక్తిత్వంతో ఎన్నో లీలలను ఆస్వాదించాడు. అంతే కాకుండా ఎన్నో కష్టములను అనుభవించాడు. మానవుని జీవన గమనానికి చతుర్విద పురుషార్థములు మూలమని మనకు రామాయణం, రాముడు తెలియజేస్తున్నారు. కర్మలు ఆచరించడం ముక్తికి కారణం కానేరదు. కేవలం దానం వలన మోక్షం లభించదు. అందుకు గాను మానవుడు భాహ్యభోగాలను, కోరికలను వదిలి, ధర్మము వైపు నడవాలని మనకు రామాయణం ప్రభోదిస్తుంది.

రాముడు అత్యంత సౌశీల్యవంతుడు, సత్య, ధర్మాలను అనుష్టించినవాడు. రాముని రాజ్యంలో ప్రజలు సత్య యుగంలో మాదిరిగా జీవించారు. వరదలు, కరువులు, ప్రకృతి, భీభత్సములు, ఆకలి బాధలు లేకుండా సుఖ, సంతోషాలతో జీవించారు. ''రాజా ప్రజా రంజనాత్'' రాముడు ప్రజా రంజకునిగా పరిపాలించడం వలన అది సాధ్యపడింది. రామాయణ కర్త రాముని భక్తి, శ్రద్ధలతో కూడిన ధర్మ దేవతగా నిలబెట్టినాడు. రామాయణంలోని పాత్రల తీరు, నిబద్ధత, గురుభక్తి, సత్యపాలన, భ్రాతృ ప్రేమ, పితృ వాక్య పాలన, కరుణ రసం, ధర్మ రక్షణ మొదలగు అంశములు రామాయణం యొక్క స్థానమును వాఙ్మయంలో సుస్థిరం చేసినది. వాల్మీకి రామాయణాన్ని సంస్కృతంలో అందించిన తదుపరి వివిధ ప్రాంతీయ భాషలలో మరెన్నో రూపాలను సంతరించుకున్నది. తెలుగులో కూడా నిర్వచనోత్తర రామాయణము మొదలుకొని నిన్న మొన్నటి వరకు అనేక రామాయణాలు వచ్చినవి. అయితే అందరు రచయితలూ వాల్మీకి వారసుల వలె కాకుండా భిన్న రీతులలో చెప్పినారు.

రామాయణమును కేవలం కథగా చూడకుండా, రామచంద్రుని లోకాతీతమైన వైభవముగా చూడాలి. రాముడు స్వరూప, లక్షణములందే కాకుండా ధర్మాచరణలో ఆకర్షనీయులుగా, ఆదర్శ పురుషుడుగా కనిపిస్తాడు.

అందుకే రామాయణం ఆదర్శప్రాయమైన కావ్యమైంది. పరిపూర్ణుడైన రాముడు పేరులో, యశస్సులో, రూపంలో, లీలలో, తన పరివారంలో అన్నింటిలో పరిపూర్ణత్వాన్ని చూపించాడు. లోక కళ్యాణం కోసం అవతరించిన రామునికి అందరూ స్వజనులే, ధర్మ రక్షణ, సత్య పాలన తప్ప రామునిలో మరో కోణం కనిపించదు. అందుకే రామాయణం రాముడిని లోక నాయకునిగా చూపిస్తుంది. రామాయణంలో లేని నీతి లేదు. అందులో కనిపించని యోగం లేదు. రామాయణం ఒక నీతి సంహితంగా పాఠకులకు కల్ప వృక్షముగా నిలిచింది. రాముని కథ సామాన్య ప్రజానీకానికి కథ. రస హృదయులకు రమణీయ కావ్యం.

నీతి కోవిదులకు నీతిశాస్త్రం; యోగులకు ఇది యోగశాస్త్రం, మంత్రాంగానికి, మంత్రతంత్రము వంటిది. ఇలా అన్నింటిని మేళవించుకొని రామాయణం ఒక మహా కావ్యంగా నిలిచింది. శ్రీరామచంద్రుడు ప్రణవ స్వరూపుడు. సీతాదేవి ప్రణవ స్వరూపిణి, ప్రణవ సమేతమైన ఈ ప్రాణముల సంచారం ఆయనం అంటాము. ఇదే రామాయణం. తెలుగులో వచ్చిన అనేక రామాయణములు పూర్తి అనువాదాలుగా కాకుండా స్వతంత్రమైన సంక్షేప రచనలుగా వచ్చినవి. అవాల్మీకములగు అంశములు ఎన్నో చెప్పబడినవి. మొల్ల రామాయణం, ద్విపదలో వచ్చిన రంగనాథ రామాయణం ఈ కోవకు చెందినవి. విభీషణున్ని గురించి రామునికి హనుమంతుడు తెలపడం, విభీషణుడు రాముడిని స్తుతించడం, రాముడు విభీషణునికి అభయమిచ్చి, లక్ష్మణునితో పాటు నీవు నాకు తమ్మునివే అని పలుకుతాడు. దీనితో రాముని దయార్ద్రహృదయం అవగతమవుతుంది.

రామాయణంలో రాముడు వేదవేద్యుడు అయితే సీతామాత వేదమాత, రాముడు శివస్వరూపుడు అయితే సీత శక్తి స్వరూపిణీ, రాముడు పరమాత్మ అయితే సీత పరంజ్యోతి, ఇది హనుమంతుడికి సాక్షాత్కారమైనది. ఈ రామాయణ పరమార్థం సత్య ధర్మముల సమన్వయమే. ఇలా రామాయణంలోని పాత్రలలో చతుర్విద పురుషార్థ సిద్ధి కనిపిస్తుంది. రామాయణ పారాయణం చతుర్విద పురుషార్థములను ప్రసాదిస్తుంది. రామాయణలోని ఈపరమార్థం గ్రహించగలిగితే మానవ జీవితములు సార్థకమవుతాయి.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం మహా పాతకనాశనమ్.

❖ ❖ ❖

భారత భాగవతాలలో – ధర్మ స్వరూపం

– పి. అశోక్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, గోల్కొండ కాలేజి, హైదరాబాద్.

ధర్మం :

ధర్మం అని శబ్దం "ధృ"అనే శబ్దం నుండి ఉద్భవించిందని వ్యాకరణ వేత్తలు నిర్వచించారు. ధృ అంటే పుట్టించేది అని అర్థం. ధరతి లోకానికి ధర్మః (లోకములను ధరించేది ధర్మం). ద్రియతే వాజనైరితి (జనులను పుట్టించేది ధర్మం).అనే నిర్వచనాలు ఇచ్చారు పూర్వులు.

మానవ జీవితానికి ఆధారమైన ఈ ధర్మానికి వేదమే మూలమని చెప్పవచ్చు. శ్రూయతే ధర్మాదిక మనయేత్రి శ్రుతి. ధర్మములను వినిపించునది కనుక వేదం శ్రుతి అని పేరువచ్చిందని చెప్పవచ్చు.

ఋగ్వేదంలో ధర్మ శబ్దాన్ని మతం, న్యాయం, దైవం, యజ్ఞయాగాది క్రతువులను చేయటం, సత్యం, అహింసా అనే అర్థాలతోనే కాక లౌకికమైన నడవడి కన్నా అతీతమైనది అనే అర్థంతో కూడా కనిపిస్తుంది. ఇటువంటి ఈ ధర్మానికి ఆధారం విష్ణువని ఋగ్వేదం వివరిస్తుంది. ఇంకా సృష్టిని ఒక క్రమంలో నడిపించేది ఋతమని, దానికి విరుద్ధమైన అనృతమని, అనృతం, నాశన హేతువని ఋగ్వేదం వర్ణిస్తుంది. అనగా ఋతమునకు మరుపేరు ధర్మమని, ఆ ఋతమునకు లేదా ధర్మమునకు లోబడిన కార్యకలాపాలనే కర్మ అని వ్యవహరిస్తారు. ఋతమును లేక ధర్మమును అనుసరించుట సృష్టి కర్తవ్యం అని ఋగ్వేదం స్పష్టం చేస్తుంది.

ఋగ్వేదం తర్వాతి అధర్వణ వేదంలో ధర్మం గురించి సవివరమైన చర్చ ఉంది ధర్మాన్ని అనుసరించడం మానవాళికి క్షేమమనే విషయమేం ఇక్కడ కూడా నిరూపితమైనది. ధర్మము అనగా మానవుని లౌకిక, నైతిక, ఆధ్యాత్మికమైన సత్ప్రవర్తన అని వేదాలు వివరిస్తున్నాయి. బ్రాహ్మణాలు ఉపనిషత్తులు కూడా ఇదే అభిప్రాయాన్ని నిర్ధారించాయి మొత్తం మీద ధర్మం అనేది ఒక క్రమ పద్ధతిలో మానవుని గురించి పట్టిఉంచి సక్రమ మార్గాన నడిపించేది అని వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు ముక్తకంఠంతో చాటుతున్నాయి

వేదాంత, మీమాంసాది శాస్త్రకారులు, మనువు మొదలైన స్మృతికర్తలు వారివారి సిద్ధాంతాలను అనుసరించి ధర్మం అనే మాటకు వివరణ ఇచ్చారు. ఈ శాస్త్రకారులు, తత్వవేత్తలు, స్మృతికర్తలు, ధర్మాన్ని గురించి ఇలా వివరణ ఇచ్చారు....

"ధర్మము మానవుని అభ్యుదయం వైపు నడుపుతుంది"
"ధర్మం దైవముతో ప్రత్యక్ష సంబంధము గలది"
"ధర్మము మానవుని మనుగడకు మూలాధారము"
"ధర్మం ధర్మము మానవునిలో విశ్వ ప్రేమ వర్ధిల్లాలి చేయును"
"ధర్మము మానవజాతికి సర్వస్యశరణాగతి"
''ధర్మము మానవునితోను, భగవంతునితోను, ప్రకృతితోను కలుపుతుంది"
"ధర్మం సమస్త ప్రాణ కోటికి సర్వస్వమైనది"

తొలి స్మృతికారుడు మనవు'' ఆచారంః పరమోధర్మంః అని నిర్వచించి ఈ ఆచారాలు వర్ణధర్మాలు జాతి ధర్మాలు శ్రుతులలో ఉన్నవేనని సప్రమాణంగా వివరించాడు ఈ వివరణ కూడా మానవుల ప్రవర్తన గుర్తించినటువంటిదే పరాశర స్మృతి అయినందువలన తన తెలివితేటలతోను, శక్తిసామర్థ్యాలతోను, ప్రకృతిని జయించాలని ఆశిస్తాడు. సృష్టి రహస్యాలను తన అధీనంలోకి తెచ్చుకోవాలని నిరంతరం ప్రయత్నిస్తుంటాడు. మనిషి బుద్ధిని ప్రలోభ పెట్టేవి, ఆకర్షించేవి, సత్త్వరజస్తమోగుణాలు, అరిషడ్వర్గాలు ఇవన్నీ మనిషిలో ఆలోచనలను ప్రేరేపిస్తాయి. ఈ ఆలోచనలే వ్యక్తిని ధర్మమార్గానికో లేదా దానికి వ్యతిరేక మార్గానికో నడిపిస్తాయి.

జన్మ, విద్య, సంస్కారం, పరిసరాల ప్రభావం మొద లగునవి మనిషిలోని ఆలోచన మార్గాన్ని రూపొందిస్తాయి. అతనిలోని గుణాల ప్రభావాన్ని సూచిస్తాయి. గుణాల ప్రభావం, ఆదిక్యతలను బట్టి ఆయా వ్యక్తుల ప్రవర్తనలో మార్పులు ఏర్పడతాయి. రజస్తమోగుణాల ప్రభావం ప్రధానంగా కనిపించే వ్యక్తుల మీద అరిషడ్వర్గాల ప్రభావం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ కారణాల ప్రభావం వల్లనే ఒక వ్యక్తి ప్రవర్తన మూలంగా లోకకల్యాణం, లోకవినాశనం కూడా సంభవించే అవకాశం ఏర్పడు తుంది. మనిషి ప్రవర్తన ఒక నియతికి లోబడి ఉండాలి. వ్యక్తి నడవడే లోక కళ్యాణానికే తోడ్పడాలని వేదాలు శాసించాయి. అటువంటి నియతిబద్ధమైన నడవడినే ధర్మం అని వివరించింది. ప్రతి మనిషి ధర్మాన్ని అనుస రించి జీవనం సాగించటం అనుల్లంఘనీయమని నిర్దేశిం చింది. వ్యక్తుల ధర్మానుసరన సమాజ పురోగమనానికి, శ్రేయస్సుకు మూలమని శృతి, స్మృతిశాస్త్రాలన్ని నిర్ద్వం దంగా ప్రకటించాయి. మహాభారతం ప్రకారం ధర్మం విష్ణు స్వరూపమని వివరించే ఉపాఖ్యానం ఉంది. అందులో ఆ శ్రీమహావిష్ణువు యజ్ఞయాగాది క్రతు కర్మరూపమైన ప్రవృత్తి ధర్మాన్ని బ్రహ్మాది దేవలకు ఇచ్చి, నీశ్చలము, అవ్యయము, శాశ్వతము, బ్రహ్మానందా సదృశము అయిన నివృత్తి ధర్మం తానే అయి నిలిచాడని వివరంగా వర్ణించడ మైనది.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా" శాశ్వతమైన ధర్మము నకు స్థానమును నేనే" అని అర్జునుడికి ధర్మస్వరూపాన్ని గురించి వివరించాడు. అందువల్లనే ధర్మమనేది భగ వంతునితో సమానమైనీ, ధర్మాన్ని భక్తిశ్రద్దలతో అనుస్టించ వలసి వుందని ప్రాచీనులు నిర్దేశించారు.

సిద్ధ, సాధ్య, సాధన, ధర్మస్వరూపం :

ప్రాచీనులు ధర్మాన్ని భగవత్స్వరుపంగా మానవ జీవి తానికి మూలాధారంగా వర్ణించారు. ఇక ధర్మచరణ ఏ స్థాయిలో ఏ విధంగా నిర్వహించవలసి ఉన్నది అనే అంశం గురించి తెలుసుకోవాలి. ఎందుకంటే ధర్మం భగవంతుడైతే దాన్ని ఆచరించేవారిని ఏమని విచారించాలి అనే సందేహం తప్పకుండా వస్తుంది.

సాధారణంగా ఏ కార్యము తలపెట్టినా దానికి తగిన సాధన ఉండాలి. అప్పుడే ఆకార్యం సాధ్యమే సిద్ధఫలాన్ని పొందేందుకు అవకాశం కల్గుతుంది. ధర్మాచరణలోనూ ఇదే క్రమం వర్తిస్తుంది. భగవత్ స్వరూపమైన ధర్మమే సిద్ధధర్మం. భగవంతుని చెరటమే ధర్మాచరణకు లక్ష్యం. దీని కొరకు సాధన చేసేవారిని ధర్మ వర్తనులు వారి ధర్మబద్ధమైన జీవన విధానమే సాధనధర్మం. వీరిరువుకి మద్య మరొక వర్గం వారుంటారు. వారు ధర్మస్వరూపాన్ని సంపూర్ణంగా గ్రహించి సాధన ధర్మ మార్గాన్ని అనుసరించే వారికి ధర్మ ప్రబోధం చేస్తుంటారు. వీరినే ధర్మతత్వజ్ఞు లని, స్థిత ప్రజ్ఞులు అని పేర్కొంటారు.

మహాభారతంలో సిద్ధ, సాధ్య, సాధన, ధర్మాచరణ స్వరూపానికి పరిపూర్ణమైన ఉదాహరణలుగా నిలిచేవారు అనేకమంది కలరు. వారి వారి ధర్మానుసరణను, ధర్మ విచక్షణను పరిశీలించినప్పుడు వారి వ్యక్తత్వాలు ధర్మ ప్రబోధానికి ఏ విధంగా నిదర్శనాలుగా నిలుస్తాయన్న విషయం బోధపడుతుంది. మూర్తీభవించిన ధర్మమే సిద్ధ ధర్మము రామోవిగ్రహవాన్ ధర్మః అని వాల్మీకి అవతార పురుషుడు మూర్తీభవించిన ధర్మమే అని అభివర్ణించాడు. ఏ వ్యక్తి నిర్మోహుడు, నిస్సంగుడు అయి ఫలితాన్ని గురించి వ్యాకుల పడకుండా తనకర్మలకు లోకశ్రేయస్సునే ప్రయోజనంగా భావిస్తాడో అతడే సిద్ధస్వరూపుడు. అతడి కర్తవ్యం ధర్మ సంరక్షణ ఒక్కటే. తనకు వ్యక్తగతమైన ఫలితాన్ని, ప్రయోజనాన్ని కోరకుండా కాలానుగుణంగా వర్ణిస్తూ సర్వధర్మాలను ఆచరిస్తూ ఇతరులకు మార్గదర్శ కుడై ఉండేవాడు సిద్ధధర్మస్వరూపుడు." అర్జునా! ముల్లో కములలో నాకెట్టి కర్తవ్యంలేదు. నేనుపొందినదిగానీ, పొందవలసినదిగానీ లేదు. అయినప్పటికీ లోకమునకు ఒక ఆదర్శమును నెలకొల్పేందుకే నేను సర్వదా కర్మను చేయుచున్నాను." అని భాగవతంలో ధర్మరక్షణ అనే

కర్తవ్యం తప్ప తనకు ఎటువంటి వాంఛలేదని కనుకనే ఫలితాలు తనకు అంటవని శ్రీకృష్ణుడు చెప్పాడు.

"భారతంలో కృష్ణుడిని విష్ణువనీ కల్క్యాత్ముడని అనేక చోట్ల భీష్మావిదురాదులు స్తుతించారు. అంతేకాక" సర్వము తనయందు సర్వమునందు తానుండునట్టి సర్వాత్ముకుడని కృష్ణుడిని స్తుతించారు. భారత గాథకు సంబంధించి సిద్ధధర్మ స్వరూపుడు శ్రీక నశించవచ్చు. వీటినే ఆచారాలు అని పేర్కొన్నారు. శాశ్వత ధర్మాలు వ్యక్తిలో సంస్కారాన్ని పెంచి ఉత్తమ స్థితికి తీసుకెళ్తాయి. ఇవి సమాజ నియతిని, కట్టుబాట్లను ఏర్పరచి సుస్థిరమైన సాంఘిక జీవనానికి తోడ్పడేవి అని ధర్మశాస్త్ర గ్రంథాలు వివరణల వలన స్పష్టమవుతుంది.

ధర్మ స్వరూపం :

కృత, త్రేత, ద్వాపర, కలియుగలలో ధర్మం గోవు రూపంలో సంచరిస్తూ ఉంటుందని ఆయా యుగాలలో సత్త్వరజస్తమో గుణాల ప్రాబల్యం వల్ల ధర్మధేనువు ఒక్కొక్క పాదాన్ని కోల్పోతుందని పురాణగాథ తెలుపుతున్నది. మానవుల ఆలోచనలలో నడవడిలో కలిగే మార్పులను గుర్తించి ధర్మశాస్త్రవేత్తలు కాలానుగుణంగా ఆచరించవలసిన ధర్మాన్ని, ధర్మసూక్ష్మాన్ని ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రస్తావించారు. సమయం ఆధారంగా ధర్మ శాస్త్రవేత్తలు నిరూపించిన ధర్మస్వరూపం, ధర్మతత్త్వం, అవ్యయము, శాశ్వతం, నిర్ద్వంద్వంగా అయినది ఇదే సిద్ధ ధర్మం. ధర్మసూక్ష్మం ధర్మతత్వాన్ని గ్రహించి తెలియ దగినది సాధ్యధర్మవర్తనులు గుర్తించినది. ధర్మం మానవు లందరూ ఆచరించవలసిన సామాన్య విశేష ధర్మాలు సాధన ధర్మం ధర్మతత్త్వం అత్యున్నతమైనది. సామాన్యు లకు అగోచరమైనది. ధర్మం జనులందరూ అనుసరించి ఆచరించవలసినది. ఈ రెండింటికి మధ్యన గల ధర్మ సూక్ష్మాని ఏ విధంగా గ్రహించాలి. ధర్మసూక్ష్మం ప్రయో జనం ఏమిటి అని స్మృతికారులు చర్చలు చేశారు.

కొన్ని సందర్భాలలో మానవ జీవితంలో ధర్మ నిర్ణయం విషయంలో సంకట పరిస్థితి సంభవిస్తుంది. సామాన్య విశేష ధర్మాల మధ్యగాని ధర్మానుసరణంలో పక్షాంతరం వల్లగాని ఏధర్మం ఆచరణీయమనే సందిగ్ధత ఏర్పడు తుంది. సీతాపరిత్యాగం, జూదంలో భార్యను పణంగా పెట్టడం, హరిశ్చంద్రుడు భార్యా బిడ్డలను విక్రయించడం, యజ్ఞయాగాదులలో పశుహింస వంటివే కాక సత్య వాక్పాలన వంటి అంశాలలో కూడా ధర్మాధర్మ చర్చలు తలెత్తాయి. ఇటువంటి సందర్భాలలో ధర్మసూక్ష్మాని ఏ విధంగా గుర్తించగలరు? ధర్మ నిర్ణయం విషయంలో శ్రుతి, స్మృతి, సదాచారం, ఆత్మకు ప్రియం కలిగించేది నాలుగు మార్గాలను ధర్మశాస్త్రవేత్తలు నిర్దేశించారు. దీనిలో ఉత్త రోత్తరం బలీయం అన్నారు. ధర్మ నిర్ణయంలో సందేహం కలిగితే ముందుగా ఈ విషయంలో వేదం ఏమీ చెప్పింది అని చూడాలి. వేదంలో వివరణ లేకున్నా, సందిగ్ధంగా ఉన్న స్మృతి చెప్పిన అంశాన్ని పరిశీలించాలి.అప్పటికి స్పష్టంగా లేకుంటే లోకంలో సత్పురుషులవర్తనను వారు లేక లోకాచారాన్ని బట్టి ధర్మ నిర్ణయంచేయాలి. అది కూడా వీలుకాకుంటే ఆత్మకు ప్రియం కలిగించే విధంగా ప్రవర్తిం చమని వివరించారు. కానీ ఆత్మకు ప్రియం కలిగించే విధానం అనగానే ఎవరికి నచ్చిన మార్గం వారు అను సరించవచ్చునని భావిస్తే అది పొరపాటని అన్నారు. నిష్పా క్షికంగా వ్యవహరించే జ్ఞానులను గుర్తించి వారి నిర్ణయాన్ని ధర్మంగా స్వీకరించాలని నిర్ధారించారు.

"ఆత్మ జ్ఞానం మహాభారతం

కం॥ శ్రుతము బరిత్యాగము గల
మతిమంతులు అని అడుగు లోభ మద మోహ సమా
వృత బుద్ధులు గాని సమం
చిత చరితులవలన శీలనీరూఢా

అని వివరించి అట్టి వారి వలన ధర్మ సూక్ష్మాన్ని గ్రహిం చాలని చెప్పింది. ధర్మ తత్వం ధర్మసూక్ష్మాలు తర్వాత ధర్మాన్ని గురించి మరికొంత వివరంగా పరిశీలించవలసి ఉంది. ఆచరణ స్థాయిలో ధర్మ స్వరూపమే సాధన ధర్మం సామాన్య విశేష ధర్మాలు సాధన ధర్మ శాఖలు తిరిగి

విశేష ధర్మం మూడు విధాలుగా ఆచరణీయమైన అవి వ్యక్తి ధర్మం సామాజిక ధర్మం ఆధ్యాత్మిక ధర్మం వర్ణాశ్రమ ధర్మాలు జాతి ధర్మాలు మనిషి అనుసరించవలసిన మార్గం వ్యక్తి ధర్మం సంఘజీవి అయిన మనిషికి సజ్జను లతో కుటుంబంతో వివిధ వర్గ జనులతోను గల సంబంధ బాంధవ్యాలను బట్టి నిర్వర్తించవలసిన విధులు సామాజిక ధర్మం మూడవదైన ఆధ్యాత్మిక ధర్మం జీవాత్మ పర మాత్మల సంయోగానికి సంబంధించినది. మాయా మోహిత మైన జీవాత్మ మాయ నుంచి విడివడి పర మాత్మను చేరేందుకు తోడ్పడే నియతి మార్గం ఏదైతే ఉందో అది ఆధ్యాత్మ ధర్మం ఈ మూడు ధర్మ మార్గాలు మానవులందరూ అనుసరించవలసినవని ధర్మశాస్త్ర కారులు ప్రబోధించారు. మానవ జీవితంలో అతి ముఖ్య మైనవి ధర్మార్థమోక్షాలు.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్‌ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

తెలుగు నవల – చతుర్విధ పురుషార్థాలు

– డా. ఈతకోట ఈశ్వరరావు, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

చతుర్విధ పురుషార్థాలనగానే భారతీయ సాంప్రదాయంలో వచ్చిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు మొదలగు ప్రాచీన సాహిత్యం అంతా కూడా గుర్తుకు వస్తుంది. ఆయా గాధల్లో తెలిపిన 'ధర్మార్థకామ మోక్షాలు' అనేవి పాటించేవి కావు. మనిషి తన జీవితంలో వ్యక్తిగతంగా అనుభవిస్తూ తన జీవిత చరమర్థంలో మిగిలేవి. చతుర్విధ పురుషార్థాలనేవి యావత్ ప్రపంచంలో ప్రతి మనిషి మనుగడకు అవసరమయ్యే లక్షణాలు. ఈ నాలుగు లక్షణాలు ఒక వ్యక్తి జీవితంల సక్రమంగా ఉంటే అటువంటి వ్యక్తులు ఉత్తమ వ్యక్తులు, అవి ఎవరిలో అయితే లేకుండా అక్రమంగా జీవించుతుంటారో వారు అధములుగా మనకు తారసపడతారు. అనేక పురాణాలు, కులపురాణాలు, రామాయణం, మహాభారత ఇతిహాసాల్లో ఈ రెండు రకాల మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు మనకు ప్రాచీన సాహిత్యంలో దర్శనమిస్తుంటారు. ఆయా వ్యక్తుల గుణగణాలను ననుసరించి మానవుడు జీవితంలో చతుర్విధ పురుషార్థాలనే తనకు సంక్రమించేలా కృషి చేస్తారు.

నేటి ఆధునిక జీవనంలో చతుర్విధ పురుషార్థాలనేవి అంతటా కనపడవు ఒక్కరు ధర్మబద్ధంగా జీవిస్తే మరొకరు అర్థాన్ని ఆశించి ధర్మాన్ని విస్మరిస్తారు. మరొకరు కోరికలే గుర్రాలుగా జీవనం సాగిస్తారు. అంతిమంగా మోక్షం గురించి, ఆలోచించే తీరుతెన్నులు నేటి ఆధునిక మానవుడికి కరువయ్యాయి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో విరివిగా వచ్చిన ప్రక్రియలు కవిత్వం, కథ, కథానిక, నవల, నాటకం మొదలగునవి. వీటిలో తెలుగు నవల ప్రారంభమై 150 సంవత్సరాలు పూర్తిచేసుకోబోతోంది. నైతిక, సాంఘిక జీవనంలో ఏర్పడిన ప్రతి విషయాన్ని నవల విశదీకరిస్తుంది. తెలుగు నవల అనగానే కందుకూరి వీరేశలింగం గారి రాజశేఖరచరిత్ర గుర్తుకు వస్తుంది. ఇదే మొట్టమొదటి తెలుగు నవలగా తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకుంది. 1940 తర్వాత తెలుగు నవలలు ఊపందుకున్నాయి. వాటిలో చారిత్రక నవలలున్నాయి. పౌరాణిక నేపథ్యంలో రాసిన నవలలున్నాయి. సాంఘిక నవలలున్నాయి. తర్వాత కాలంలో మనోవైజ్ఞానిక నవలలు, సైన్స్ ఫిక్షన్ నవలలు, డిటెక్టివ్ నవలలు, దళిత నవలలు, స్త్రీవాద నవలలు, మైనారిటీవాద నవలలు ఇలా తెలుగునవల పరిణామం చెందుతూ వచ్చింది.

1970 నుండి నేటి వరకు తెలుగు నవలలో వస్తు శిల్ప నిర్మాణం విషయంలో క్రొత్త పుంతలు తొక్కిందని చెప్పవచ్చు. నాటకీయత, పాత్ర చిత్రణ తెలుగు నవలలో నేటి మానవునికి అద్దంపట్టి చూపించేవిగా ఉండేవి.

నాడు శ్రీ కందుకూరి వీరేశలంగంగారు రచించిన రాజశేఖర చరిత్ర నుండి ఇటీవలకాలంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం పొందిన డా. గడ్డం మోహన రావు రచించిన కొంగవాలు కత్తి వరకు కూడా నవలా రచనలో కొత్త కొత్త పరిణామాలు చెందుతూ వచ్చాయి.

మూఢ నమ్మకాల ఉచ్చులో చిక్కుకున్న మానవుల జీవితాన్ని 'రాజశేఖర చరిత్ర'లో మనం గమనించవచ్చు. అందులోని ప్రతిపాత్ర చతుర్విధ పురుషార్థాలను ఏదో ఒక దానిని కలిగిఉంటూ, కోల్పోతూ ఉంటుంది. ఎల్లా ప్రగడ సూర్యనారాయణ 'లీలావతి' నవల నుండి 2019 కొంగవాలు కత్తి వరకు తెలుగులో వచ్చిన అసంఖ్యాక నవలలో ఈ చతుర్విధ పురుషార్థాలను మనం అధ్యయనం చేసి పరిశీలించవచ్చు.

కొడవటిగంటి కుటుంబరావు రచించిన 'చదువు' నవలలో సుందరం పాత్ర చతుర్విధ పురుషార్థ లక్షణాల్ని

కలిగి ఉంటుంది. తెలుగునవలా సాహిత్యంలో వచ్చిన ప్రజల మనిషి, పాలేరు, కూలిరాజు, రాజిగాడు రాజ య్యాడు మొదలగు నవలను అధ్యయనం చేస్తే చదువు నవలలో సుందరం స్వాతంత్ర్యోద్యమం నాటి పరిస్థితు లను ధర్మబద్ధంగా లేవని అనుకుంటూ ధర్మం కోసం పోరాడుతూ చదువే 'ధర్మంగా' అతని పాత్ర ఉంటుంది. తెలంగాణా జీవిత వాస్తవికతను తెలిపే ప్రజల మనిషి నవలలో కంఠీరవం పాత్ర చతుర్విధ పురుషార్థాలు సంతరించుకునే పాత్రగా వట్టికోట ఆళ్వారుస్వామి రచిం చారు.

దేశపిత బాపూజీ ధర్మబద్ధంగా పోరాడి భారతదేశానికి స్వాతంత్ర్యం తేవటంలో ప్రధానపాత్ర పోషించారు. ఇదే పాత్రను ఆదర్శంగా తీసుకొని మహీధరరామ మోహన రావుగారు ''కొల్లాయిగట్టితేనేమి'' నవలలో 'రామనాధం' పాత్ర ఆద్యంతం చతుర్విధ పురుషార్థాలను అన్వయించు కొని వుంటుంది. బోయ జంగయ్య నవలలోను రాజయ్య పాత్రకూడా సాంఘిక వివక్షను ధర్మబద్ధంగా ఎదుర్కొని న్యాయవాదిగా ఎదిగి తన జీవితానికి పురుషార్థాన్ని సంత రించుకుంటాడు.

చిలకూరు దేవపుత్ర రచించిన పంచమం నవలలో శివయ్య పాత్ర కూడా అధర్మం ఏలుతున్న సమాజంలో ధర్మంగా జీవించాలని పోరాడి చదువుకుని డిప్యూటీ కలె క్టర్‌గా ఎదిగి అధర్మపాలనలో అన్యాయానికి గురవుతాడు. ఇందులో ప్రతిపాత్రను చతుర్విధ పురుషార్థాలను అన్వ యించుకుంటూ అధ్యయనం చేస్తే ధర్మార్థకామ మోక్షా లనేవి మనిషి జీవితంలో ఉంటే ఏ స్థితిలో ఉన్నాయి కోల్పోతే ఎలా ఉన్నాయి అనే సంగతి అర్థం అవుతుంది.

చలం నవలలు మైదానం, అమీనా, అరుణ, దైవ మిచ్చిన భార్య మొదలగు స్త్రీవాదకోణంలో రచించారు. పురూరవ వంటి నవల పౌరాణిక ఇతివృత్తంలో రాసారు. మైదానం నవలలో రాజేశ్వరి పాత్రను తనే చెప్తాడు. ఆమె శరీర కోరికలకులోనై ఆ పాత్ర ఏ విధంగా అధర్మంతో ధర్మాన్ని విస్మరించిందో చెబుతుంది. ముప్పాళ్ళ రంగనాయకమ్మ రచించిన బలిపీఠం నవల్లో ఆదర్శ వంతుడు 'భాస్కర్' పాత్రలో ధర్మవిరుద్ధమైన జీవితం తారసపడుతుంది

ఈ విధంగా తెలుగు నవలలు చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, మరో మొహంజదారో, నైమి శారణ్యం, అల్పజీవి, మట్టిమనిషి, కృష్ణవేణి, అతడు, ఆమె, అంపశయ్య, చీకటి రోజులు, కాలరేఖలు, కాలాతీత వ్యక్తులు, సమత, రాజు - మహిషి, చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు. ఇలా తెలుగు నవలలు గురించి అందులో చతుర్విధ పురుషార్థాల గురించి అధ్యయనం చేసి పరిశీలిస్తే నిన్న మొన్నటి వరకు కేంద్రసాహిత్య బహుమతులుందుకున్న కొంగవాలుకత్తి, శష్టభూమి నవల వరకు కూడా ఈ చతుర్విధ పురుషార్థాలను మనం పరిశీ లించవచ్చు.

కొంగవాలు కత్తి నవలలో నర్సింగరావు అధర్మాన్ని ఎదురించి, ధర్మబద్ధంగా చదువుకొని ధనంలేన సమ యంలో ధనాన్ని సక్రమమార్గంలో సంపాదించుకుంటూ తనకు చదువుపైన ఉన్న కోరికను సాఫల్యం చేసుకుని డాక్టరేట్ డిగ్రీ అనే మోక్షపదాన నిలబడతాడు.

తెలుగు సాహిత్యంలో ప్రతినవల ఇతివృత్తంలో ప్రతిపాత్ర చతుర్విధ పురుషార్థాలను సంతరించుకునే ముందుకు సాగుతుంటుంది.

❖ ❖ ❖

హైందవం – ధర్మం

– డా॥. జి. సుతోసిని, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

"జన్తూనాం నరజన్మ దుర్లభం" అన్నారు పెద్దలు. ఎన్నో జన్మల తపః ఫలం వల్లనే మనకు మానవజన్మ లభిస్తుంది. అది రాకముందు దానికోసం తపించిన జీవుడు అది లభించిన తరువాత దాన్ని వ్యర్థంచేసుకొని పరితపిస్తుంటాడు. మానవ జీవితానికి ఒక పరమార్థం ఉందని, ఆ పరమార్థాన్ని సాధించడానికే మన ప్రాచీనులు పురుషార్థ భావన చేశారు. మానవుడు జన్మించింది మొదలు మరణించే వరకు తన జీవిత లక్ష్యానికి అనుగుణంగా పురోగమించే ప్రయత్నం చేస్తాడు. అతడు సాధించాల్సినవి పురుషార్థాలు. ఇవి నాలుగు విధాలుగా వున్నాయి. 1) ధర్మం, 2) అర్థం, 3) కామం, 4) మోక్షం. ప్రపంచంలో ఏ నాగరికతలోనూ ఈ విషయాలు లేవు. భారతీయ ఋషులు మాత్రమే ఈ చతుర్విద పురుషార్థాలు చెప్పారు.

ధర్మం :

ధర్మం అనే పదం "ధృఞ్" అనే ధాతువు నుంచి వచ్చింది. దీనికి ధరించు అని అర్థం. మానవుణ్ణి ఏది ధరిస్తుందో, మానవుడికి ఏది ఆధారమవుతుందో అదే ధర్మం. అనాది నుంచి ఏ ధర్మం ఆచరణలోకి వస్తుందో అదే సనాతన ధర్మం. ఈ ధర్మానికి వేదాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు ప్రమాణగ్రంథాలు. సనాతనధర్మం అనేమాటకు ఎల్లప్పుడూ ఉండేది, శాశ్వతమైంది అని కూడా అర్థం.

"ధర్మస్య జయోస్తు - అధర్మస్య నాశోస్తు।
ప్రాణిషు సద్భావనాస్తు - విశ్వస్య కళ్యాణమస్తు"॥

ధర్మానికి జయం కలుగుగాక! అధర్మం నశించుగాక! ప్రాణుల్లో మంచి భావాలు నెలకొనుగాక! ప్రపంచానికి మేలు కలుగుగాక! ఇది హిందూధర్మం కోరుకొన్న విశ్వకళ్యాణం. ఆహారం, నిద్ర, భయం మొ॥వి జంతువులకూ, మనుష్యులకూ ఉన్నాయి. మనుష్యులకూ, జంతువుకూ తేడా ధర్మమే. ధర్మంవల్ల పుణ్యం, అధర్మం వల్ల పాపం వస్తుంది. ధర్మం పాటించకపోతే వాళ్ళు పశువులతో సమానం. ధర్మ మార్గంలో నడిస్తే ఈ లోకంలో కీర్తి, పరలోకంలో మంచిగతి లభిస్తుంది అని ఆర్ష గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయి.

"ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియము తన మనంబున కగు
దా నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమధర్మపథముల కెల్లన్"
(మహాభారతం, శాంతిపర్వం)

ఇతరులకు అపకారం చేయకుండా ఉండడం, ఇతరుల సొమ్మును ఆశించకుండా ఉండడం, అసత్యం చెప్పకుండా ఉండడం, అహింసను పాటించడం, దయ, క్షమ కలిగి ఉండడం, దానం చేయడం మొ॥గు అన్ని ధర్మం పరిధిలోకి వస్తాయి.

"పరిత్రాణాయ సాధూనాం - వినాశాయి చ దుష్కృతామ్।
ధర్మసంస్థాపనార్థాయ - సంభవామి యుగే యుగే"॥

చెడ్డవాళ్ళను దండించడానికి, మంచివాళ్ళను రక్షించడానికి దేవుడు యుగయుగాల్లో అవతరిస్తాడని గీతలో శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. ధర్మం మానవుడిని దివ్య మానవుణ్ణి చేస్తుంది. ధర్మం వల్లనే మోక్షం లభిస్తుంది. ధర్మానికి పరమావధి మోక్షమే.

"ధర్మ ఏవ హతో హంతి - ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాద్ధర్మోన హంతవ్యో - మా నో ధర్మో హతో వధీత్"॥
(మనుస్మృతిః 8-15)

మనం ధర్మాన్ని నాశనంచేస్తే ధర్మమే మనల్ని నాశనం చేస్తుంది. అడవిలో ఒంటరిగా ఉన్న సీతను అపహరించి, ధర్మాన్ని నశింపజేశాడు - రావణుడు. చివరికి ధర్మ యుద్ధంలో రాముడి చేతిలో నశించాడు. "ధర్మోరక్షతి

రక్షితః'' అంటే ధర్మాన్ని రక్షించేవాళ్ళను ధర్మమే రక్షిస్తుంది అని అర్థం. ఎన్ని ఆటంకాలు, ఆపదలు కలిగినా పాండవులు ధర్మమార్గాన్ని విడువలేదు. మనం చేసిన ధర్మం మనతోనే వస్తుంది. పశువునకు ధర్మాధర్మ విచక్షణ లేదు. అందువల్ల ధర్మం ఆచరించని మనిషి పశువుతో సమానం. అన్ని కాలాల్లోనూ ధర్మమే గొప్పదనీ, ధర్మాన్ని ఆచరించుటే మనిషి కర్తవ్యమని మన పెద్దలు అనేక విధాలుగా చెప్పారు.

ధర్మ లక్షణాలు :

ధర్మానికి పది ముఖ్యమైన లక్షణాలు ఉన్నాయి.

"ధృతిః క్షమోస్తేయం శౌచ మింద్రియనిగ్రహః ।
ధీ ర్విద్యా సత్య మక్రోధో దశకం ధర్మలక్షణమ్" ॥
(మనుస్మృతి 6-92)

ధృతిః- (ధైర్యం) :

ధృతి అంటే ధైర్యం. ఇంకా వివరించాలంటే ఎంత ప్రాణాపాయం సంభవించినా చలించక ధైర్యంగా వుండటం. ధైర్యం లేని మనిషి జీవితంలో దేనినీ సాధించలేడు. ఇందకు నిదర్శనం దధీచి. పూర్వం వృత్రుడు అనే రాక్షసుడుండేవాడు. అతడు స్వర్గాన్ని జయించాడు. ముల్లోకాలనూ పీడించసాగాడు. అతని సంహారం రధీచి వెన్నెముకతో చేసిన వజ్రాయుధంతో అవుతుందుని వరం. ఇంద్రుడు తపస్సు చేస్తున్న దధీచి వెన్నెముక నడిగాడు. వెన్నెముక నివ్వాలంటే ప్రాణాలను వదలవలసిందే. "జాతస్య మరణం ధ్రువం" నేను ఇతరులకు ఉపకారం చేస్తున్నాననే సంతోషంతో వెన్నెముక ఇచ్చాడు దధీచి. ఇది ధృతి.

క్షమ :

క్షమ అంటే ఓర్పు. ఇది ధర్మానికి రెండవ లక్షణం. క్షమ మనకు సహనాన్ని నేర్పిస్తుంది. సహనం వల్ల అనేక మంది స్నేహితులవుతారు. ఇది అన్ని ధర్మాలలో గొప్పది. వశిష్ఠుడు ఓర్పుకి ఆదర్శం. విశ్వామిత్రునికి వశిష్ఠునితో వైరం. ఒకనాటి రాత్రి విశ్వామిత్రుడు వశిష్ఠుణ్ణి సంహరించడానికి పొదలమాటున దాగివున్నాడు. ఆశ్రమ ప్రాంగణంలో అరుంధతీ వశిష్ఠులు కూర్చున్నారు. పండు వెన్నెల! "ఈ వెన్నెల ఎంత నిర్మలంగా వుందో" అనింది అరుంధతి. "విశ్వామిత్రుని తపస్సులా లోక కళ్యాణం చేస్తూంది" అన్నాడు - వశిష్ఠుడు. ఇది విన్న విశ్వామిత్రుని మనసులో మార్పు వచ్చి వశిష్ఠునికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

దమః :

ఇది ధర్మానికి మూడవ లక్షణం. దమం అంటే మనుస్సును అదుపులో వుంచుకోవడం. మనస్సు అధీనంలో లేకుంటే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. మనస్సు చంచలమైనది. వేగవంతమైనది. ఇది మనిషిచేత మంచి చెడుల్ని రెంటినీ చేయుస్తింది. వేగవంతమైనది. ఇది మనిషిచేత మంచి చెడుల్ని రెంటినీ చేయిస్తుంది. కాబట్టి మనస్సును అదుపులో వుంచుకోవడం చాలా అవసరం. ఎప్పుడు మంచివాళ్ళ స్నేహం చేసి, మనస్సును పవిత్రం చేసుకోవాలి. మనుషులు మనో నిగ్రహం సాధిస్తే మహానుభావులవుతారు.

అస్తేయం :

ఇది ధర్మానికి నాల్గవ లక్షణం. స్తేయం అంటే దొంగతనం అది లేకపోవడమే అస్తేయం. పూర్వం లిఖితుడనే మహర్షి వుండేవాడు అతడు తన అన్నయిన శంఖముని తోటలోని ఒక పండు తిన్నాడు. ఈ విషయం శంఖునికి తెలిసి శిక్ష అనుభవించవలసిందే అని రాజుగారికి తెలిపాడు. రాజు దొంగతనానికి శిక్ష చేతులు నరకటం అని తెలిపి వెంటనే లిఖితుని చేతులు నరికారు. చేతులు నరికినా అతునికి చలనం లేదు. బాధలేదు ప్రాయశ్చిత్తం చేసుకున్నానని సంతోషించినాడు. మరునాడు అర్ఘ్య ప్రదానం చేయాలి. చేతులు లేవు. నదీ తీరానికి పోయాడు. అతని ధర్మప్రవర్తనతో స్నానం చేసిన వెంటనే చేతులు వచ్చాయి. ఆ స్నానం చేసిన నదియే "బాహుదా" నది. అస్తేయమనేది ఒక మహా వ్రతమని పెద్దలు చెబుతారు.

శౌచం :

ధర్మానికి ఇది ఐదవ లక్షణం. మానవులు మానసికంగా, భౌతికంగా శుచిగా వుండాలి. భౌతిక శుద్ధి నీటితో జరుగుతుంది. మానసిక శుద్ధి జ్ఞానంతో జరుగుతుంది. ఈశ్వరోపాసనకు రెండు ముఖ్యమైనవే. దేవతలనూ, పెద్దలను పూజించడం, పరిశుభ్రంగా ఉండటం, ఋజు ప్రవర్తనం, పరస్త్రీలను తల్లులుగా భావించడం, బ్రహ్మచర్యం, ఇవన్నీ శారీరక శౌచాలు - అని భగవద్గీతలో చెప్పారు. అంతఃశౌచం మనస్సుకి సంబంధించినది. మనస్సు శుద్ధంగా వుంటే అన్ని విద్యలూ వస్తాయి.

ఇంద్రియ విగ్రహం :

ఇది ధర్మానికి ఆరవ లక్షణం. ఈశ్వర సాక్షాత్కారాన్ని కోరేవాళ్ళు ఇంద్రియ విగ్రహం కలిగివుండాలి. నిగ్రహం అంటే అదుపులో వుంచుకోవడం. ఈ నిగ్రహాన్ని మనిషి సాధించగలిగితే జితేంద్రియుడై కీర్తిని పొందుతాడు. అన్ని ఇంద్రియాలకు మూలకారణం మనస్సే" అని వాల్మీకి మహర్షి చెబుతాడు.

ధీః :

అంటే బుద్ధి ఇది ధర్మానికి ఏడవ లక్షణం. మంచి పనులు చేయాలంటే విశేషమయిన బుద్ధి కావాలి. విశేషమయిన బుద్ధి వున్నవాళ్ళకే ఆత్మబలం వుటుంది. ఆత్మబలం వున్నవాళ్ళకే ఈశ్వరసాక్షాత్కారం లభిస్తుందని ఋషులు ఉపదేశించారు.

విద్యాః :

ధర్మానికి ఎనిదవ లక్షణం విద్య. గడ్డిపోచ మొదలు పరమాత్మ వరకు వున్న పదార్థాల నిజ స్వరూపాన్ని తెలుసుకోవడమే విద్య. విద్య ద్వారా పదార్థాల నిజ స్వరూపం తెలిశాక మనం దేన్ని అనుసరించాలి. దేన్ని వదిలేయాలో అర్థమవుతుంది. మంచి మార్గంలో జీవనం గడపడానికి విద్య ఉపయోగపడుతుంది.

సత్యం :

ధర్మానికి తొమ్మిదవ లక్షణం సత్యం. సత్యాన్ని త్రికరణ శుద్ధిగా మనోవాక్కాయకర్మలతో పాటించాలి. వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి సత్యమే సర్వ శ్రేయస్కరమైంది. సత్యాన్ని ఆశ్రయించి వున్నదే ధర్మం.

అక్రోధః :

ధర్మానికి పదవ లక్షణం శాంతాన్ని, సరళతను, ప్రసన్నతను కోల్పోకూడదు. ఇది సద్గ్రంథాల అధ్యయనం వల్లనే సాధ్యమవుతుంది.

ముగింపు :

మన దేశానికి ప్రాణశక్తి జీవన విధానం. సత్యం ధర్మం మూలస్తంభాలుగా ఉన్న మన హిందు జీవన విధానం మీదనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది మన ప్రాణశక్తిని కాపాడుకోవలసిన భాద్యత మనందరిది.

❖ ❖ ❖

అభిజ్ఞాన శాకుంతలం – చతుర్విధ పురుషార్థాలు

– డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

భారతీయసాహిత్యం పారమార్థికసత్యాన్ని బోధించే సాత్వికసాధనం. అందునా సంస్కృతసాహిత్యం ప్రబలోపకరణం.వేదాలు, వేదాంగాలు, దర్శనాలు, పురాణాలు, కావ్యాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పురుషార్థ సాధనని ప్రస్ఫుటంగా అందించాయి. సంస్కృత కావ్య విహాయసంలో ధృవతార కవికులగురువుగా వినుతికెక్కిన మహాకవి కాళిదాసు.

పురా కవీనాం గణనా ప్రసంగే
కనిష్ఠికాధిష్ఠిత కాళిదాస
అద్యాపి తత్తుల్య కవేరభావాత్
అనామికా సార్థవతీ బభూవ

అనే ఈ శ్లోకం కాళిదాసు వైభావాన్ని చాటి చెప్తుంది.

ధ్వనిసిద్ధంతప్రతిష్ఠాపనాచార్యుడైన ఆనందవర్ధనుడు తన ధ్వన్యాలోకంలో కాళిదాసువైభవాన్ని చాటిచెప్పాడు.

యేనాస్మిన్నతివిచిత్రకవిపరంపరావాహినిసంసారే కాళిదాస ప్రభృతయో ద్విత్రాః పంచషా వ మహాకవయో గణ్యంతే అని ఘంటాపథంగా నినదించాడు. ఈ మాట వల్ల కాళిదాసు వైశిష్ట్య తెలుస్తుంది.

వ్యాఖ్యనవిద్యాచక్రవర్తి అయిన మల్లినాథ సూరి కాళిదాసు రచనలకు వ్యాఖ్యనం రాసే సందర్భంలో

కాళిదాసగిరాం సారం
కాళిదాసః సరస్వతీ ।
చతుర్ముఖో ధవా సాక్షాత్
విదుర్నాన్యే తు మాదృశః॥ అని ప్రకటించాడు.

కాళిదాసు రచించిన మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం అమరభారతికి అనర్ఘరూపక రత్నమాలికలు.

ఆపరితోషాద్విదుషాం న సాధు మన్యే ప్రయోగ విజ్ఞానమ్।
బలవదపి శిక్షితానామాత్మన్యప్రత్యయం చేతః ॥
(అ.శా. 1-2)

పండితులు చూసి మెచ్చుకొనే వరకు నేను చేసిన ప్రయోగం సరియైనదని నమ్మను. పనిలో ఎంతటి నేర్పరియైనప్పటికీ తన పని మీద అతనికి సరిగా ఉన్నదనే నమ్మకం (ఆత్మతృప్తి) కలగదు. దానిని ఇతరులు చూసి మెచ్చుకొన్నప్పుడే ఆత్మవిశ్వాసం కలుగుతుంది 'అని అభిజ్ఞాన శాకుంతలంలో సూత్రధారునిచే పలికించాడు ఈ శ్లోకాన్ని మహాకవి కాళిదాసు.

పురుషార్థవివేచన :

భారతీయజీవనవిధానంలో పురుషార్థాలు అవిభాజ్యనీయాలైన అంశాలు. ప్రతిమనిషి తను ఉన్న స్థాయి నుండి ఉన్నతస్థాయికి వెళ్ళే ప్రస్థానంలో ప్రకృష్టస్థానాన్ని పొందిన అంశాలు పురుషార్థాలు.

పురుషార్థమిదం గుహ్యం పరమర్షిణా సమాఖ్యాతామ్
స్థిత్యుత్పత్తి ప్రళయాశ్చిన్వన్తే యత్రభూతానామ్
(సా.కా.69)

ఈ కారికలో కపిలమహర్షి జీవితంలో పురుషార్థాల ప్రాముఖ్యాన్ని తెలియచేశారు.

పురుషౌ ఆత్మమానవౌ అని పురుషశబ్దాన్ని అర్థఃఅభిధేయరైవస్తుప్రయోజననివృత్తిషు అని అర్థశబ్దాన్ని అమరకోశం నిర్వచించింది. ఆత్మమానవగత ప్రయోజనాలని నెరవేర్చేవి పురుషార్థాలు అని చెప్పవచ్చు.

ధర్మ, అర్థ, కామ, మోక్షాలు అనే నాలుగు పురుషార్థాలు మనిషి నడతని, మమతని నడిపించేవి.

ధర్మార్థకామమోక్షేషు వైచక్షణ్యం కళాసు చ ।
కరోతి కీర్తిం ప్రీతిం చ సాధుకావ్యనివేషణం॥ (కావ్యా.1)

భామహుడు ఉత్తమకావ్యపఠనం వల్ల ధర్మార్థకామ మోక్షాలు సిద్ధిస్తాయి అని పేర్కొన్నాడు.

చతుర్వర్గఫలప్రాప్తిः సుఖాదల్పధియామపి।
కావ్యాదేవ..... (సా.ద.1-2)

వేదవేదాంగాల వల్ల పురుషార్థాలు నెరవేరుతున్నప్పటికీ కావ్యం వల్ల సులభంగా లభిస్తాయని విశ్వనాథుడు ప్రకటించాడు.

అందుకే అభిజ్ఞానశాకుంతలంలో కాళిదాసమహాకవి నిక్షిప్తం చేసిన పురుషార్థాలని ప్రకృతపత్రంలో రేఖామాత్రంగా చర్చిస్తాను.

భవంతి నమ్రాస్తరవः ఫలోద్గమైः
నవాంబుభిర్దూర విలంబినో ఘనాः।
అనుద్ధతాస్సత్పురుషాస్సమృద్ధిభిः
స్వభావ ఏవైష పరోపకారిణామ్॥ (అ.శా.5-13)

పండ్లు కాపుకు వచ్చిన తరువాత చెట్లు ఇతరులు వాటిని తీసుకోవడానికి అనుకూలంగా క్రిందకు వంగుతాయి. క్రొత్త నీటిని మోసుకొని వచ్చిన మేఘాలు మిక్కిలి క్రిందకు వంగుతూ అధికంగా వర్షాన్నిస్తాయి. కాబట్టి సత్పురుషులు ఎంత సంపదలు లభించినా గర్వించక వినయంగా వంగి ఉంటారు.సత్పురుషుల ధార్మిక ప్రవృత్తిని కాళిదాసు ఈ శ్లోకంలో ఉపదేశించాడు.

కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకుంతలా।
తత్రాపి చ చతుర్థోऽంకः తత్ర శ్లోక చతుష్టయమ్॥

అనే ప్రసిద్ధమైన శ్లోకం సంస్కృత కావ్యాలలో నాటకం మనోహరమైనదని, ఆ నాటకాలలో అభిజ్ఞాన శాకుంతలం, అందులోనూ నాలుగోవ అంకం, ఆ నాల్గవ అంకంలో నాలుగు శ్లోకాలు రమ్యమైనవి.

యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్ట ముత్కంఠయా
కంఠస్తంభిత బాష్పవృత్తి కలుషం చింతా జడం దర్శనమ్।
వైక్లబ్యం మమ తావదీదృశమహో స్నేహాదరణ్యౌకసः
పీడ్యంతే గృహిణः కథం ను తనయా విశ్లేషదుఃఖైర్నవైः॥
(అ.శా. 4.5)

శ్లోకచతుష్టయంలో ఈరోజు శకుంతల అత్తవారింటికి వెళ్తుందని నా హృదయం విలవిలలాడుతుంది. కన్నీటిని అణచుకోవటంలో గొంతు డగ్గుత్తికతో ఉంది. ఆలోచన వల్ల చూపు కనిపించటం లేదు. పెంచిన అమ్మాయిని అత్తవారింటికి పంపుటానికి అరణ్యవాసినైన నాకే కూతురి గురించి ఇంత బాధ ఉంటే, ఇక గృహస్థులు, కని పెంచిన వారు తమ కూతురిని అత్తారింటికి ఎంత బాధపడతారో ఇది కణ్వమహర్షి బాధపడ్డ తీరు. వనౌకసः సంతः అపి లోకజ్ఞాः వయమ్ అడవులలో తిరుగేవారైనప్పటికీ మేము లోకం తెలిసినవాళ్ళమంటాడు. సమాజంలో తండ్రి కూతురుని భర్త ఇంటికి పంపేప్పుడు కన్నీరు మున్నీరయ్యే బాధని తపస్వియైన,అరణ్యవాసియైన కణ్వమహర్షి అనుభవించి చూపించాడు.

మేఘ సందేశంలో యక్షుడు మేఘంతో సందేశం పంపాడు. ఇక్కడ కణ్వమహర్షి చెట్లతో మాట్లాడాడు.

పాతుం న ప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వపీతేషు యా
నాదత్తే ప్రియమండనాపి భవతాం స్నేహేన యా పల్లవమ్।
ఆద్యే వः కుసుమప్రసూతిసమయే యస్యా భవ త్యుత్సవः
సేయం యాతి శకుంతలా పతిగృహం సర్వైరనుజ్ఞాయతామ్॥
అ.శా. 4.8

నాల్గో అంకంలోని నాలుగు శ్లోకాలలో ఇది రెండవ శ్లోకం. కాళిదాసు తన కావ్యాలలో చెట్లకు చాలా ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ శ్లోకంలో కణ్వమహర్షి చెట్లతో మాట్లాడుతూ ' మీకు నీళ్ళు పోసి మీరు త్రాగిన తర్వాతనే శకుంతల నీళ్ళు త్రాగుతుంది. అలా కాకుండా ఆమె ఒక్క రోజైనా నీళ్ళు త్రాగలేదు. ఆమెకు అలంకారాలంటే ఎంత ఇష్టమున్నా మీపట్ల ఉన్న ప్రేమతో చిగురొకైనా కోయలేదు. మీకు తొలిసారి పువ్వులు పూసినప్పుడు ఆమె గొప్ప పండుగ చేసుకొనేది. అటువంటి శకుంతల నేడు అత్తారింటికి వెళ్తుంది. కాబట్టి మీరు అనుమతి ఇవ్వండి అంటాడు. ఆశ్రమజీవనం గడిపే వారికి చెట్లో , జంతువులతోనే కదా సాంగత్యం. అందుకే వాటితోనే తన బాధని పంచుకున్నాడు. ప్రాకృతిక, ధార్మికప్రవృత్తి ఈ శ్లోకంలో ప్రబలంగా కనిపిస్తుంది.

దుష్యంతుడికి సందేశాన్ని పంపేవేళ కణ్వమహర్షి ఎంతో నైపుణ్యంతో వ్యవహరించాడు. ఒక పక్క ఆయన మహా రాజు మరోపక్క తనకి అల్లుడు. ఆ పెండ్లి ప్రత్యక్షంగా చేసింది కాదు. ఆయనకు తెలియకుండానే శకుంతలని గాంధర్వ వివాహం చేసుకొని వెళ్ళాడు. అగ్నిహోత్రం వల్ల ఆ విషయం తెలుసుకొన్న కణ్వమహర్షి యోగ్యుడైన, ఉత్తముడైన భర్తని పొందావని శకుంతలని అభినంది స్తాడు.

దుష్యంతునికి సందేశాన్ని పంపే శ్లోకం ఓ పక్క హెచ్చరిక, మరోపక్క భర్తగా తన కూతురిని చక్కగా చూసుకోమనే సందేశం కలగలసి ఉంది.

అస్మాన్ సాధు విచింత్య సంయమధనానుచ్చైఃకులం చాత్మనః
త్వయ్యస్యాః కథమప్యబాంధవకృతాం స్నేహప్రవృత్తిం చ తామ్।
సామాన్య ప్రతిపత్తిపూర్వకమియం దారేషు దృశ్యా త్వయా
భాగ్యాయత్తమతఃపరం న ఖలు తద్వాచ్యం వధూబంధుభిః ॥
(అ.శా.4.16)

ఈ శ్లోకం చతుర్థాంకశ్లోకచతుష్టయంలో మూడ వది.'నేను తపస్సే ధనంగా కలవాడిని. నువ్వు ఉత్తమ కులంలో పుట్టిన వాడివి. ఈమెను ప్రేమించి పెళ్ళాడావు, ఆ సంగతి గుర్తుంచుకో. ఈమెని నీ భార్యలలో ఒకదానిగా చూసుకో. ఆ తర్వాత ఆమె అదృష్టాన్ని బట్టి ఉంటుంది. అమ్మాయి వైపు వాళ్ళు ఇంతకన్నా ఎక్కువ మాట్లాడ కూడదు. అని విన్నవిస్తాడు.

ఇందులో ఒకపక్క దుష్యంతుడిని హెచ్చరించడం, మరొక పక్క మా అనుమతిలేకుండా వివాహమాడావు, వినయంగా బ్రతిమాలడం ఇలాంటివన్నీ ద్వంద్వార్థంగా కనిపిస్తాయి. తపస్సంపన్నుడైన కణ్వమహర్షి తలచుకుంటే దుష్యంతుడిని శపించగలడు. కాని కూతురు పరిస్థితి అడ్డు వస్తుంది. ఇలాంటి సందర్భాలు నేటి సమాజంలో కోకొల్లలు. నువ్వు ఉత్తమకులంలో పుట్టావు అనడం, నీ ధర్మాన్ని విడిచటపెట్టవు అనే అర్థం నిబిడీకృతమై ఉం ది. బంధువులు కల్పించుకోకుండానే ప్రేమించి పెండ్లాడా వనడంలో మాకు చెప్పకుండా మా అమ్మాయిని వలలో వేసుకొన్నావు అని దెప్పిపొడిచినట్లుంది. నువ్వు నా కూతురిని ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదు, నీ భార్యలలో ఒకదానిగా చూడమనటంలో శకుంతలనట ఆయనకి భార్యగా గుర్తింపు తెప్పించాలనే తపన తారస పడుతుంది. అమ్మాయి తండ్రి యింతకన్నా ఎక్కువ మాట్లాడకూడదు, ఆ తర్వాత ఆమె అదృష్టమనటంలో, అన్నీ తెలిసి ఏం చేయ్యాలో పాలుపోని పరిస్థితి కని పిస్తుంది. సామాజికుల మానసికాందోళన కణ్వమహర్షిలో కనిపిస్తుంది.

కణ్వమహర్షి శకుంతలకు సర్వం తానై పెంచాడు. కూతుర్ని అత్తవారింటికి పంపే సందర్భంలో కూతురు అత్తారింట్లో ప్రవర్తించవలసిన పద్ధతిని ఈ శ్లోకం తెలియ జేస్తుంది. ఆ మాటలను కణ్వమహర్షి మధురంగా మనసుకి తాకే విధంగా చెప్పాడు.

శుశ్రూషస్వ గురూన్, ప్రియసఖీవృత్తిం సపత్నీజనే
భర్తుర్విప్రకృతాపి రోషణతయా మాస్మ ప్రతీపం గమః।
భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే , భాగ్యేష్వనుత్సేకినీ
యాంత్యేవం గృహిణీపదం యువతయో , వామాః కులస్యాధయః॥

(అ.శా.4-18)

ఈ మధురు శ్లోకం, శ్లోకచతుష్టయంలో నాల్గోవది.

అత్తమామలకు సేవలు చెయ్యి. సవతులతో స్నేహంగా ఉండు. భర్త నీకు ఇష్టం లేని పని చేసినా కోప్పడకు.. భర్తకు విరుద్ధంగా నడచుకోవద్దు. సేవకులు పట్ల దయతో ఉండు. సంపదలు ఉన్నాయని పొంగిపోవద్దు. యువ తులు ఈ విధంగా నడచుకొని మంచి ఇల్లాళ్ళని పేరు తెచ్చుకుంటారు. అట్లా నడచుకోని యువతులు పుటి ట్టనింటికి, మెట్టినింటికీ కూడ మనోవ్యథను కలిగిస్తారు అని కణ్వమహర్షి శకుంతలకి ఉదేశిస్తాడు. ఈ శ్లోకాలు చదివిన వెంటనే ఎంతటి వారి గుండె అయినా కరిగి కంట నీరు కారవలసిందే. మెట్టినింటికి వెళ్ళే అమ్మాయికి ఇంత మధురంగా ఉపదేశం చేయడం సామాజిక ధార్మిక సందేశం.

మేదచ్ఛేదకృశోదరం (అ.శా.2-5) అర్థవినియోగంలో వ్యసనానికి సంబంధించినది.

అనాఘ్రాతం పుష్పం.. (అ.శా.2-10)

ముహురంగులిసంవృతాధరోష్ఠం...(అ.శా.3-25) ఈ శ్లోకాలలో కామికానందతారమ్యత కనిపిస్తుంది.

భారతీయజీవనవిధానంలో మోక్షం అంతిమ ఘట్టం. దుఃఖాదీనామవసానం మోక్షణం.

అధ్యాక్రాంతా వసతి..... (అ.శా.2-14)

శాంతమిదమాశ్రమపదం... (అ.శా.1-15)

ఈ శ్లోకాలు కర్మసిద్ధాంతాంతర్గత ముముక్షుత్వాన్ని తెలియచేస్తుంది.

మమాపి క్షపయతు నీలలోహితః పరిగతశక్తిరాత్మభూః (అ.శా. 7.35) అనే శాకుంతలభరతవాక్యంలో ముముక్షుత్వం ప్రతిఫలిస్తుంది.

గచ్ఛతి పురశ్శరీరం ధావతి పశ్చాదసంస్తుతం చేతః।
చీనాంశుకమివ కేతోః ప్రతివాతం నీయమానస్య॥
(అ.శా.1-29)

రథానికి కట్టిన జెండా ఎదురుగాలికి ముందు భాగం వెనక ఉండేట్టుగా ఎగురుతుంది. అదే విధంగా నా శరీరం ముందుకు వెళ్తుంటే నా మనస్సు మాత్రం జెండా లాగా వెనక్కి వెళ్తుందంటాడు దుష్యంతుడు. మనస్సు రాయాలని ముందుకు వెళ్తున్నా పత్రపరిమితి వెనక్కి లాగుతుంది. కాళిదాసశాకుంతాలన్ని పురుషార్థచతుష్ట యానికి ఆలవాలంగా చెప్పవచ్చు.

సంకేతాక్షరాలు :

1. అ.శా - అభిజ్ఞాన శాకుంతలం
2. కావ్యా - కావ్యాలంకారం
3. సా.ద - సాహిత్యదర్పణం
4. సా.కా- సాంఖ్యకారికలు

ఆధార గ్రంథాలు :

1. కాళిదాసు,అభిజ్ఞానశాకుంతలం (2005), భోగీశ్వరశర్మ,నోరి.శివకామేశ్వరీ గ్రంథమాల, విజయవాడ
2. కాళిదాసు,అభిజ్ఞానశాకుంతలం (1995), చౌఖంబా సురభారతీ ప్రకాశనమ్, వారణాసీ
3. విశ్వనాథుడు, సాహిత్యదర్పణం (2004), లోకమణి దాహల్, చౌఖంబా కృష్ణదాస అకాదమీ,వారణాసీ

❖ ❖ ❖

మహాభారత సావిత్రోపాఖ్యానం

– డా॥ ఖి. ఎన్. మంగాదేవి, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, మారిస్ స్టెల్లా కళాశాల, విజయవాడ.

"అభ్యుదయ నిఃశ్రేయ సాధనం ధర్మః" అని కణాదుని వైశేషిక సూత్రము మానవుడు చతుర్విధ పురుషార్థములలోని చివరిదైన మోక్షమును పొందుటకు సాధనం ధర్మం -

"వేదో అఖిల ధర్మ మూలమ్ వద్విదాంచస్మృతి శీలే" అనుట చేత వేదము, స్మృతులు ధర్మాచరణకు మూలము. అట్టి ధర్మమమును గృహస్థ ఆశ్రమములో ఆచరించిన పతివ్రత సావిత్రి. అటు పుట్టినింటిని, ఇటు మెట్టినింటిని తన ధర్మాచరణతో ఉద్ధరించిన సాధ్వి సావిత్రి. అందుకే మహాభారతం - అరణ్యపర్వం - సప్తమాశ్వాసములో అరణ్యవాసం చేస్తున్న ధర్మరాజు, మార్కండేయ మహర్షిని పతిభక్తితో అన్ని కష్టాలకు ఓర్చుకొని చివరకు శుభమును పొందిన పతివ్రత కథను చెప్పమని ప్రార్థించినప్పుడు మార్కండేయ మహర్షి ధర్మరాజు ఆంతర్యాన్ని గ్రహించి అలాంటి పతివ్రతల కథలు అరణ్యవాసం చేస్తున్న ద్రౌపదికి ఊరట నిస్తాయని సావిత్రి కథను చెప్పాడు"

"తన మగని, నత్త మామల, జననీ జనకులను దన్ను
సకలంబును దా
ఘనముగ నముద్ధరించెను జనవర సావిత్రి ధర్మచరితముకంటే"

అని సావిత్రి కథను వినిపిస్తాడు.

మద్రదేశపు రాజైన అశ్వపతికి 18 సం॥లు సావిత్రిని ఆరాధించగా ఆ దేవి వరానుగ్రహం వలన జన్మించిన కన్య సావిత్రి. అల్లారుముద్దుగా పెరిగిన సావిత్రి యవ్వన వతియై తండ్రి వరుని ఎంచుకొనమనగా సాళ్వదేశ ప్రభువు రాజ్యాన్ని కోల్పోయి, అడవులలో నివసిస్తున్నాడు. అతడి పుత్రుడైన సత్యవంతుడుని వరిస్తున్నానని చెపుతుంది.

అది విన్న నారద మహర్షి సత్యవంతుడు గొప్ప వ్యక్తిత్వం కలవాడైనప్పటికి ఒక సంవత్సరకాలం మాత్రమే జీవించివుంటాడు అని చెప్పగా తండ్రైన అశ్వపతి ఇంకొక వరుని అన్వేషించడం మంచిదని కుమార్తె అయిన సావిత్రితో చెప్తాడు. సావిత్రి తండ్రితో...

కం॥ **"వినుము మనోవాక్కాయములను మూడు**
తెఱంగులందు నంతఃకరణం
బనఘ! ప్రధానము గావున !
మనమున గైకొన్న భర్త మానుట దగునే.

సావిత్రి ధర్మాన్ని ఆచరించి తన వారందరిని ఉద్ధరించిన స్త్రీ మూర్తి. ముందుగా తాను ప్రేమించిన సత్యవంతుడు సంవత్సర కాలమే జీవించి వుంటాడని తెలిసినా తండ్రి వద్దనినా భర్తృ భావన మనో వాక్కాయములతో నిండి వుంటుందని, మూడింటిలోనే మనస్సు ముఖ్యమని అంతఃకరణమే ప్రధానమని, మనసున ఒకసారి భర్తగా నిర్ణయించుకొనిన వరుని వివాహమాడడమే ధర్మమని పలికింది. ఆ ధర్మమూర్తి మాటలను విని నారదుడు ఆమెను ఆ సత్యవంతునికే ఇచ్చి వివాహము చేయమని చెప్తాడు. సావిత్రి తండ్రి ఆమెను వనమునకు తీసుకెళ్ళి, రాజ్యమును కోల్పోయి అంధులైన సాళ్వరాజపుత్రుడైన సత్యవంతుడికి, సావిత్రికి వివాహము చేస్తాడు.

వివాహానంతరము సావిత్రి వనవాసయోగ్యమైన నార చీరలు కట్టుకొని అత్తమామలకు, భర్తకు సేవలు చేస్తూ, గార్హస్థ్య ధర్మ నిర్వహణ ఆచరిస్తుంది. ధర్మంలో భార్యా, భర్తలిరువురు అద్వైత స్థితి పొందడం ప్రధానం. సావిత్రి వివాహానంతరం సంవత్సరకాలం గడిచిన పిదప భర్తైన సత్యవంతుడు మృతి చెందే సమయం ఆసన్నమవగానే ముందు మూడు రోజులు త్రిరాత్రోపవాస వ్రతం చేస్తుంది. తరువాత భర్తతో కలిసి అడవికి వెళుతుంది. అడవికి

బయలు దేరే ముందు పెద్దలందరికి నమస్కరించి ''సాభాగ్యభాగ్యవర్ధన'' మనే ఆశీస్సులు పొందుతుంది. అడవిలో సావిత్రి అంక తలముపైనే సత్యవంతుడు చైతన్య రహితుడవుతాడు. యమధర్మరాజు సత్యవంతుని లాంటి పుణ్యాత్ముని తీసుకొని వెళ్ళడానికి వస్తాడు. సావిత్రి అతనిని చూడగలుగుతుంది. కారణం గృహస్థ ధర్మంలో అద్వైతసిద్ధి పొందడం.

యమధర్మరాజు సత్యవంతుని శరీరంలోని జీవుని, తీసుకొని వెళుతుండగా విగతజీవుడైన భర్త శరీరాన్ని భద్రపరిచి, యమధర్మరాజు వెనుక వెళుతుంది. యమునికి ఆ దంపతుల వెనుకున్న రహస్యం, అద్వైత సిద్ధి పొందిన వారిని తెలుసుగనుకనే తానే సత్యవంతుని ప్రాణములు తీసుకొనివెళ్ళడానికి వస్తాడు. యముడు, సావిత్రిని వెనుకకు తిరిగి వెళ్ళమని చెప్తాడు. ఇక్కడ సావిత్రి పతివ్రతత్వం విదితమవుతుంది.

అసలు సావిత్రి అలా ఎలా వెళ్ళగలిగింది. అంటే చతుర్విధ పురుషార్థలలో నాల్గవ పురుషార్థాన్ని సాధించాలంటే గృహస్థాశ్రమం ఉత్తమమైనది. గృహస్థాశ్రమ ధర్మం ఆచరిస్తూ అద్వైతసిద్ధిని పొందిన పతివ్రత సావిత్రి. భర్త జీవుడు భార్యలోని జీవుడు వేరు వేరు కాదు. అదే అద్వైత సిద్ధి. భర్తలోని జీవుడు ఎటువెళితే అటు భార్యలోని జీవుడు వెళ్ళగలుగుతుంది.

అందుకే యముడు ''ఎందుకు నన్ను వెంబడిస్తున్నావు'' అని అడిగితే

సావిత్రి "పతులెందుఁజనిన నచటికి సతులుంజన వలదే నీ ప్రసాదమునను మ
త్పతి భక్తి కతమునకు సంస్తుత గుణ నా కరుగరాని చోటుంగలదే ?" అని చెప్పి మనవి చేస్తుంది.

అంతేకాదు వాక్చాతుర్యంతో సజ్జనులలో శ్రేష్ఠుడైన ధర్మరాజుని నీ దర్శనమైంది. సజ్జన దర్శనం వృధాకాదు అని ముందుర కాళ్ళకు బంధం వేస్తుంది.

సావిత్రి మాటలకు యముడు పతిప్రాణం కాకుండా ఏదైనా వరం కోరుకోమనగానే

సాళ్వదేశాధిపతియైన మామగారికి దృష్టిని ప్రసాదించ మని కోరుకుంటుంది.

వరం పొందిన సావిత్రి మళ్ళీ యముడిని అనుసరిస్తుంది. అంతేకాక యమధర్మరాజుతో త్రికరణ శుద్ధిగా ధర్మమును ఆచరించాలనే ఆర్య ధర్మమును చెప్తుంది.

"ఎడపక వాఙ్మనఃక్రియలనేరికి హింస యొనర్పఁ బూనరె
య్యెడలను దీనులం గరుణ యేర్పడఁబోవఁగ జూతురిక్కుచో
గడమ పడంగ నీకెదిరి కాంక్షితముల్ దుది ముట్టదీర్తు! రె
క్కుడు మదిఁగూర్తు రాశితులకున్, వినుమిన్నియు నార్యధర్మముల్"

అని తనకు ఎట్టి కొరత లేకుండా సంతృప్తి చెందేటట్లు దానం చేయమని అడుగుతుంది. ఇక్క ఆర్య ధర్మమేదో గుర్తు చేస్తుంది.

యముడు మరియొక వరం ప్రసాదించగానే అది కూడా భర్త ప్రాణములు కాకుండా కోరుకోమనగానే మామగారికి రాజ్యప్రాప్తి కలగాలని కోరుకుంటుంది.

యముడు వరమును అనుగ్రహించి ముందుకు సాగుతుంటాడు. సావిత్రి అబేధము లేని జీవుడు అనుసరిస్తూ వుంటాడు. యముడు ఇక ఆగి పొమ్మని ఆజ్ఞాపిస్తాడు. వెంటనే సావిత్రి

"ధర్మాత్ములు తమ సలిపెడు ధర్మక్రియ దప్పరెట్టి దశలందుకుమో
వీర్ములు దాపము బుట్టవు ధార్మిక హృదయముల బ్రధమధర్మాధ్యక్షా!

ధర్మాచరణ చేయువారు తాము మొదలుపెట్టిన ధర్మానికి ఫలితం పొందేవరకు ధర్మాచరణ వదలరని పతివ్రతా ధర్మాన్ని వదలనని చెప్తుంది.

"కావున బతియనుగమనం బేవిధమున విడువదగునె? యెట్లయిననుమో
హావేశము బొందక ధర్మావస్థితి సలుపవలదె యవహిత బుద్ధిన్" అంటుంది.

మళ్ళీ యమధర్మరాజు సత్యవంతుని ప్రాణములు తప్ప యేదయినా వరం కోరుకోమనగానే తన తండ్రికి నూర్గురు కొడుకులు కావాలని కోరుతుంది. వరమొసగిన యముడు వెనుకకు తిరిగి వెళ్ళుమనగా

"నాకు డప్పి యెక్కడిది ? మనంబు భర్తృ చరణ పంక జాసక్తమైకరముభక్తి
నలరుచున్నది, సతులకు నన్యమెట్టిదియును ధర్మమె భర్తృ సంశ్రయముకాక.

సావిత్రి గృహస్థ ధర్మంలో పొందిన అద్వైతసిద్ధి వలన సత్యవంతున్ని యముడు తీసుకొని వెళ్ళలేకపోవడం గుర్తించాడు.

సావిత్రి "సఖ్యం సాప్త పదీనం" అనే ధర్మాన్ని చెప్పి యముడితో చుట్టరికం కలిపి

"కావున మిత్ర మనోరథం, బవశ్య కర్తవ్యముంబుగా జిత్తగింపు మనిన" ఆ మహానుభావుడు నీకిష్టమైన వరం కోరుకోమంటాడు. సావిత్రి భర్త ప్రాణాలను ప్రసాదింపమని కోరుతుంది.

యమధర్మరాజు అనుగ్రహిస్తాడు. నూరుమంది కొడుకులను కూడా అనుగ్రహిస్తాడు. సావిత్రి పాతివ్రత్య ధర్మాచరణ ద్వార పూర్ణఫలాన్ని పొందింది. చతుర్విధ పురుషార్ధాల సాధనకు ధర్మాచరణయే మూలము.

ఉపయుక్త గ్రంథాలు :

1) కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - అరణ్య పర్వము టి.టి.డి.
2) ఆంధ్ర మహాభారతం - అమృతతత్వ సాధనం - డా॥జి.వి. సుబ్రహ్మణ్యం
3) ఆశ్రమ ధర్మములే నేలపాటింపవలెను - శ్రీ కేశవ పంతుల నరసింహశాస్త్రి

❖ ❖ ❖

భారతీయ తత్వ శాస్త్ర భూమిక: చతుర్విధ పురుషార్థాలు

– నందిగాము నిర్మల కుమారి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ & పీ.జి.కళాశాల, సిద్ధిపేట.

ముషి తనను తాను నియంత్రణ కోసం కుపెట్టుకున్న జీవన పద్ధతులు బలమైనవి అతి ప్రాచీనమైనవి కూడా. ఆక్రమంలో మోక్షం కోసం సాగిలపడి ప్రకృతి ఆరాధించాడు. ఆ ఆరాధన నుండి రూపొందినదే దైవ భావన. ఆదైవ భావనలో ముషిలో చెలరేగిన అనేక ప్రశ్నలకు సమాధానాల వెతుకులాట మొదలైనది. ఆ అన్వేషణ నుంచే అసలు బ్రతుకు అర్థం ఏమిటి అనే ప్రశ్న బయలు దేరింది. ఆబ్రతుకు అర్థాన్ని అనేక ధార్మిక, నైతిక, పరంపరలు అనేక విధాలుగా వ్యాఖ్యాంచాయి. ఆ క్రమంలో ముషి ప్రకృతి ఆరాధించాడు. ఆ ఆరాధనకు అవసరమైన అనేక పూజా క్రతువులు సృష్టించుకున్నాడు. ఆ క్రతువు భిన్న సంస్కృతుల భిన్న భావజాలాల సమాహారం. అది ప్రతి భౌగోళిక ప్రాంతాకి తమదైన విలక్షణతను ఆపాదించుకుంది.

సమాజంలో ప్రతి జీవి తనకోసం, ఉకి కోసం, అస్తిత్వం కోసం, తన కుటుంబం కోసం, తన కులం కోసం, తన మతం కోసం, ఒక్కోసారి వివేచన, విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తాడు. తాను చేసింది మంచా చేడు నా అనే భావన లేకుండా వాటి అతిక్రమించే క్రమంలో ఉచ్చ నీచాలు మర్చిపోతాడు. ఆ తర్వాత జరిగిన అనర్థం అర్థం చేసుకోవడాకి ఉపక్రమించేవే నియమాలు. మంచి చెడు అు వ్యాఖ్యాంచే సాధనాలు. ఆ సాధనాలు చట్టం రూపంలోనో, లోకోక్తి రూపంలోనో, రాజ్యాంగం రూపంలోనో, లేదా న్యాయం రూపంలోనో ఆ ఆవేశాలను కట్టడి చేస్తాయి. అయితే ఆధుక రాజ్యాంగాలు చట్టాలు రాక ముందు ఈ మనుషులను నియంత్రించిన పరంపర ఏమయి ఉంటుంది? ఆ ఆలోచన మనందరికీ రావొచ్చు. అలా ముషి భావోద్వేగాలను నియంత్రించే సాధనాలనే 'చతుర్విధ పురుషార్థాలు' అని కొందరు వ్యాఖ్యాంచారు. భారతీయ తత్వంలో, న్యాయం, ఆలోచనలో, వివేచనలో భాగం అయిన చతుర్విధ పురుషార్థాలు భారతీయ సంవాదంలో ఎలా వ్యాప్తి చెందాయో అవి సాహిత్యంలో, సారస్వతంతో ఎలా కలిసి నడిచాయో ఈ పత్రంలో నేను చర్చించ దలుచుకున్నాను.

ఈ సృష్టిలో ప్రతి భౌగోళిక ప్రాంతాకి తమదైన సారస్వత సంపదను కలిగి ఉంటాయి. తమదైన ధార్మిక, న్యాయ, విచక్షణ, తర్క పరంపర ఉంటుంది. మానవ నాగరిక వికాసాకి కొన్ని వేల సంవత్సరాల గమనం ఉంది. ఆదిమకాలం నుండి ముషి ఆధుకుడుగా మారే దాకా తన జీవన నరళి అనుసరించాల్సిన సాంప్రదాయాలు తమకు తాము స్వయంసిద్ధంగా రూపొందించుకున్నవి. ముషి గుహ నుండి బయట పడినాక తన జీవిక అవసరాల కోసం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతాకి ఆహారసేకరణ కోసం సంచారం చేసాడు. అలా సంచారం చేస్తున్న క్రమంలో ప్రకృతి నుండి క్రూర మృగాల నుండి తనను తాను కాపాడుకోవడాకి రక్షణ కోసం మొన దేలిన రాళ్ళను ఆయుధాలుగా ధరించాడు. తన ప్రయాణంలో రాయి రాయి రాపిడికి గురి అయితే నిప్పు వస్తుంది అని కుపెట్టాడు. అలాగే వేట నుండి పశువులను మచ్చిక చేసుకొని వ్యవసాయాన్ని ఒక జీవన విధానంగా మార్చుకున్నాడు. నీటి అవసరాల కోసం అన్వేషిస్తూ నదీ పరీవాహక ప్రాంతాల దిశగా తన జీవికను కొనసాగించాడు.

నీరు, నీటి ప్రవాహాన్ని అనుసరించి సంచారం చేసిన మనిషి క్రమక్రమంగా ఒక స్థిరమైన నివాసానికి పరిమితం అయ్యాడు. వేట నుండి జంతువులను మచ్చిక చేసుకొని వ్యవసాయం మొదలు పెట్టాడు. అలా చిన్న చిన్న సమూహాలు ఆవాసాలు గ్రామాలు జనవదాలుగా విస్తరించాయి. గ్రామం కేంద్రంగా జరిగిన వృత్తులు ప్రవృత్తులు కౌటుంబిక జీవన అవసరాల కోసం తనకు

తాను కొన్ని నిబంధనలు విధించుకున్నాడు. అవే స్మృతులుగా, ఇతిహాసాలుగా ధార్మిక రచనలుగా మొదట మౌఖిక రూపంలో ఆ తర్వాత రకరకాల మాధ్యమాల రూపంలో వ్యాప్తి చెందాయి. ఆ క్రమంలో వేదాలు, ఉప నిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, ఉపపురాణాలు, స్మృతులు ఇంకా వైదిక క్రతువుల నిర్వహణ కోసం అనేక నిబంధనలు రాసుకున్నారు. ఆక్రమంలో వెలుగులోకి వచ్చిందే మనుస్మృతి. భారత, భాగవతాలు ఇతర ధార్మిక గ్రంధాలు. భారతీయ ఆలోచనలను ప్రభావితం చేసాయి.

'పురుషార్ధ' అనే శబ్ధం సంస్కృత పదము. దాని మూలాలు సంస్కృత పరిభాషలో ఉన్నవి. ఈ పదం యొక్క మూలం సంస్కృత ధాతువు నుండి వచ్చింది. 'పురుష' 'అర్ధ' అనే సంయుక్త పద కలబోత. పురుష అంటే ముషి లేదా ఆత్మ అు అర్థం. అర్థ అంటే లక్ష్యం లేదా పరమార్ధం లేదా కాంక్ష. 'పురుష' 'అర్థం' రెండు కలిస్తే బ్రతుకు అర్థం లేదా జీవన లక్ష్యం లేదా జీవన అర్థం. భారతీయ హిందూ తత్వశాస్త్రంలో పురుషార్థాకి లోతైన భూమిక ఉన్నది. పురుషార్థం అంటే స్థూలంగా ముషి యొక్క జీవన లక్ష్యం అు అర్థం. హిందూ ధార్మిక ప్రపంచంలో ఈ భావన అత్యంత కీలకమైనది.

ముషి పుట్టుక జీవన సమరంలో సాంప్రదాయ హిందూ ధర్మము ముషి యొక్క జీవితకాల్ని నాలుగు దశలుగా విభజించింది. ఈ విభజన వర్ణ బేధాలకు అతీతంగా నిర్ణయించారు. ఏవర్ణం వాడు అయినా మోక్షప్రాప్తం కోసం బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్త మరియు చివరగా సన్యాస ఆశ్రమాలు విధిగా అనుసరించాలి. ప్రతి ముషి ఈ నాలుగు దశలను విధిగా ఆచరించి సరైన నడవడికను కలిగి ఉండాలి అు విజ్ఞులు ఉపదేశించారు. ఈ గృహస్థ ధర్మాలు మరో నాలుగు పురుషార్థాల అవసర్ని నిర్వ హిస్తుంది. పురుషార్థము అనగా ముషి కోరుకునేవి లేదా ముషి తన జీవన సార్థకతకు ఆచరించాల్సిన లేదా అనుస రించాల్సిన విధులు లాంటివి.

భారతీయ సాహిత్యం మొదటి నుండి తమవైన నైతికత ధార్మిక అంశాల కలబోతగా నిర్మితం అయ్యింది. ప్రాచీన వైదిక సాహిత్యం మొదలు వర్తమాన సాహిత్య ధోరణుల దాకా సాహిత్యం ఏ సమాజం కోసం రాస్తున్నాం. ఏ సమాజ లక్ష్యం కోసం రాస్తున్నాం అంతిమంగా సాహిత్యం యొక్క మౌళిక లక్ష్యం ఏమిటి అనే ప్రశ్న కేంద్రంగా ఇంతకాలం సాహిత్యం నిలబడి ఉంది. ప్రాచీన కాలంలో నిర్మితం అయిన భారత, భాగవతాలు ఈ దేశంలో వైదిక లేదా సనాతన మతం యొక్క వ్యాప్తి కోసమే రచించబడినట్టు అనువాదం చేసిన ఉదంతాలు మనం ఎన్నో చరిత్రలో చూడగలము. ఆది కవి నన్నయ్య మహాభారత్ని అను వాదం చేస్తూ వైదిక పరంపరను ముందు తరాలకు అందించడంతో బాటు భారతదేశ సమాజం యొక్క పూర్వ రూప్ని అర్థం చేసుకోవడాకి ఈ అనువాదం నేను చేస్తు న్నాను అు రాసుకున్నాడు. ప్రాచీన మానవ జీవన వైవిధ్యం అర్థం చేసుకోవడాకి మనకు సాహిత్యం మినహా మరే వనరూ లేదు. ఆ ప్రాచీన సమాజ సాంస్కృతిక అవశేషా లను ఆకళింపు చేసుకోవడాకి అయినా ప్రాచీన సాహిత్యం చదవడం అధ్యయనం చేయడం అవసరంగా ప్రాచీన లాక్షణికులు అభిప్రాయ పడ్డారు.

'ధర్మార్థకామమోక్షాణాం
యస్యైకోపి న విద్యతే
అజాగళస్తనస్యేవ
తస్తజన్మ నిరర్థకం'

ముషి ధర్మము, అర్థము, కామము, మోక్షం అనే అంశాల పట్ల కనీస అవగాహన లే వాు జన్మ నిరర్థకం అనే రీతిలో అవసర్ని ఆవశ్యకతను మన పూర్వీకులు జన బాహుళ్యంలో నిలిపి ఉంచారు. వందల వేల ఏళ్ళుగా ముషి స్వభావాలలో నిలబడి పోవడాకి ప్రధాన కారణం ఆయా తాత్విక ధోరణుల భూమికగా రాయబడిన రామాయణ, మహాభారత, భాగవత గ్రంధాలు.

ముషి తనకు తాను ఒక నియతితో, నిబద్ధతతో బ్రతకడానికి నియమించుకున్న నియమాలు అ్ని

సంఘాలకు సమూహాలకు ఒకే రకంగా లేవు. ఇంకా లోతుగా మాట్లాడుకుంటే ఈ దేశంలో ప్రాచీన ధార్మిక పాయ అయిన బౌద్ధంలో ముషి జీవన విధానానికి విధించుకున్న నియమాలు భిన్నంగా ఉన్నాయి. రెండు వేల ఏళ్ళ కింద బలంగా ఈ దేశంలో భాగం అయిన బౌద్ధం అనేక మంచి విషయాలు ఈ దేశానికి, విదేశాలకూ అందించింది. విషాదం ఏమిటి అంటే ఈ దేశంలో బౌద్ధం ఆచరణలో కొద్దిమంది మిగిలినా చైనా, కంబోడియా, టిబెట్, మలేషియా, థాయ్‌లాండ్, శ్రీలంక, బర్మా, వియత్నాం లాంటి దేశాలలో ఎంతో ప్రభావం చూపుతూ ఉంది. అక్కడ ముషి జీవన నడవడిక కోసం బౌద్ధం తమవైన నియమాలను తమ జీవితంలో భాగం చేసుకుంది. అంతే కాకుండా మరొక ప్రాచీన ఆచరణ అయిన జైనం కూడా ముషి నడవడిక విముక్తి కోసం తమవైన నియమాలను అనుసరించింది. ఏది ఏమయినా ప్రతి ధార్మిక అనుసరణ అంతిమ లక్ష్యం ముషి తన తోటి ముషిని గౌరవించడం ఇతరులకు హాని చేయకుండా బ్రతకడం, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడం అనే ఆచరణగా కొన్ని కులాలు మతాలు లేదా కొన్ని సమూహాలు తమ జీవితాలకు అన్వయించుకున్నవి. ముషి యొక్క విముక్తి కోసం బౌద్ధం కోరికలను వదులుకోవడం, అష్టాంగ మార్గాలను ఒక ఆచరణగా చూపితే, జైనం మరొక ఆచరణను అన్వయించుకుంది. హిందూ మతం మరొక విధమైన ఆచరణను వ్యాప్తి చేసింది.

భారతీయ ప్రాచీన గ్రంథాలు ప్రధానంగా నీతి, నైతికత, ధర్మం, మానవ జీవన లక్ష్యం బ్రతుకు యొక్క అంతిమ సారం మోక్షం. యావత్ సారస్వత చర్చ ఈ అంశాల కేంద్రంగా రచించబడ్డది అని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ దేశం ఆదిమ కాలం నుండి నేటి ఆధుక రాజ్య నిర్మాణాల దాకా అనేక మార్పులకు లోనవుతూ ఉన్నది. వేల ఏళ్ళుగా అనేక మంది విదేశీ పాలకులు ఈ దేశాన్ని పాలించినప్పటికీ అనేక దేశాల ధార్మిక భావనలను ఈ దేశం మీద బలవంతంగా రుద్దినప్పటికీ అనేక మతాల పేరుతో కులాల పేరుతో ఈ భూమి మీద మారణ హోమాలు జరిగినప్పటికీ సకల మతాలు, కులాలు, సకల ధార్మిక భావనలు ఈ దేశంలో ఫరిఢవిల్లాయి దానికి కారణం ఇక్కడి మనుషుల్లో నాటుకొ పోయిన సకల మతాలసారం. అంతిమంగా సకల మతాల సారం ఈ సమాజం సుసంపన్నంగా ఉండాలి అు కోరేవే అయినా పాలకుల అశ్రద్ధ మూలంగా అయితే నేవిని ప్రజలలో పెల్లుభికిన భావోద్వేగాల మూలంగా అయితే నేమి ఇక్కడ అప్పుడప్పుడూ మనుషుల మధ్య, మమతలమధ్య భావోద్వేగాలు కొంత అశాంతి నెలకొల్పబడినప్పటికీ, సహృదయుల జోక్యంతో అవి సమసిపోయాయి. వీటి వెనక బలమైన ధార్మిక భావనతో కూడిన పునాది ఉంది. ఆపునాది వెనక చతుర్విధ పురుషార్థాలు మనుషుల మధ్య ప్రేమ అనురాగాలు పెంచే పనే చేసాయి. అవి మనుషుల నియమాల రూపంలో కట్టు గోడల మాదిరిగా ప్రజల ఆలోచనలను నైతికతను నియంత్రించాయి.

ఈ సమాజంలో ప్రతి జీవి కొన్ని సామాజిక కట్టుబాట్లకు నీతి నియమాలకు కట్టుబడి జీవించడం ఒక ఆచరణగా 'ధర్మము'ను తన జీవితాుకి అన్వయించుకున్నాడు. అలాగే ప్రతి ముషి తన జీవిత అంతిమ లక్ష్యం తన కోసం, తన కుటుంబం కోసం లేదా తన అనునాయుల కోసం అవసరమైన ధనము, కీర్తి సంపాదించడమే జీవిత పరమ లక్ష్యంగా భావించే వాళ్ళు అది తప్పు అని తన జీవితంలో 'అర్థము' ను అన్వయించుకున్నారు. మరి కొందరు జీవితం మొత్తం పర స్త్రీ వ్యామోహంలో కొట్టుకొపోయి శారీరక లేదా ఇంద్రియ లౌకిక సుఖాల కోసం వెంపర్లాడడం మాత్రమే జీవితం కాదు. వాటికి అతీతంగా జీవించాల్సిన అవసర్ాు 'కామము' అనే అర్థములో తన జీవితానికి అన్వయించుకుంటూ బ్రతికాడు. ముషి తన జీవితంలో ఎన్ని సామాజిక నియమాలను అతిక్రమించినా ధన సంపాదన, కీర్తి దాహంతో బ్రతికినా ఇంద్రియ సౌఖ్యాలు అతిక్రమించి భోగలాలసతో బ్రతికినా ఒక ముషికి అంతిమంగా కావాల్సింది 'విముక్తి'. కనుక చేసిన

అన్ని తప్పులనూ వదిలించుకొని విముక్తి కోసం వెంపర్లాడే అంతిమ స్థితి 'మోక్షము'లో అన్వయించుకున్నాడు. తనను తాను నియంత్రించుకున్న ముషి కొన్ని నియమాలకు కంకణబద్ధుడిగా జీవించాల్సిన అవసరాన్ని 'చతుర్విధ పురుషార్థాలు' ప్రతి క్షణం ముషి యొక్క నడవడిక నడతను కొన్ని యుగాలుగా నియంత్రణ చేసాయి చేస్తున్నాయి.

మనిషి యొక్క జీవితాన్ని పురుషార్థాలు ఎలా శాసించి ప్రజల జీవితాలలో భాగం అయ్యాయో భారతీయ ప్రాచీన సారస్వతం కూడా పురుషార్థాలు సమస్త సారాన్ని ఆకళింపు చేసుకొని రాయబడినవా అని అనిపిస్తది. అన్నదమ్ముల మధ్య అనురాగాలు, దాయాదుల మధ్య ఆస్తి కోసం, అంతస్తు కోసం, కీర్తి కోసం, మానవ సంబంధాల మధ్య సమస్త భావోద్వేగాలనూ కలబోసి రాయబడిన 'మాభారతం' అర్థం పరమార్థం పురుషార్థాలలో అర్థం యొక్క ఆవశ్యకతను మనకు తెలియ జేస్తుంది అని లాక్షణికులు అభిప్రాయపడ్డారు. భార్యాభర్తల మధ్య అనురాగం కష్టకాలంలో ఒనకూరిన వియోగం మూలంగా జరిగిన అనర్థాలు భర్త మాట జవదాటని భార్య, అన్న మాట జవదాటని తమ్ముని ప్రేమ, తండ్రి మాటను ధిక్కరించు కొడుకు త్యాగం, పర స్త్రీ వ్యామోహం మూలంగా ధ్వంసం అయిన మరొక రాజు పతన కేంద్రంగా రాయబడిన 'రామాయణ' అంతిమసారం 'కామం' కేంద్రీకృతంగా రాయబడిన ప్రాచీన కావ్యం రామాయణం. ఇలా ప్రతి ఒక్క ప్రాచీన కావ్యంలో పురుషార్థాల అవసరాన్ని దాని అంతిమ సారాన్ని ప్రజలు యుగాలుగా ఎలా అనుసరించారో మనం ప్రతి కావ్యంలో చూడగలము.

భారతదేశంలో మరొక మహా కావ్యం భాగవతం. సకల వేదాంత సారంగా చెప్పబడిన భాగవతం భక్తి యోగాన్ని, వివిధ తత్వ బోధనలు, ఆరాధన విధానాలు, ఆధ్యాత్మిక సంవాదాల కలయికల సమాహారంగా వర్ణించబడిన 'మహా భాగవతం' పురుషార్థాలలో ముఖ్యమైన మోక్షాన్ని విశదీకరిస్తుంది. ఈ విధంగా చతుర్విధ పురుషార్థాల సారం భారతీయ తత్వ శాస్త్రం అనుకోవచ్చు.

"In childhood, he should devote himself to acquiring knowledge; in youth, he should engage in wordly pleasures, and in his old age, he should aspire to salvation through the practice of Dharma".

మనిషి తన బాల్యంలో జ్ఞాన సంపాదన లక్ష్యంగా బ్రతకాలి అని, యవ్వన కాలంలో భౌతిక అవసరాల కోసం లేదా శారీరక సుఖాల కోసం లేదా, ప్రపంచ జ్ఞానాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి. వృద్ధాప్యంలో ధర్మాన్ని ఆచరించి విముక్తిని పొందాలి అని విదేశీ తత్వవేత్త భారతీయ ధర్మాన్ని స్థూలంగా వ్యాఖ్యానించాడు.

చతుర్విధ పురుషార్థాలు కేవలం భారతీయ సారస్వతంలో ప్రాచీన సాహిత్యంలోనే కాకుండా వర్తమాన నవీన సాహిత్య రూపాలు అయిన కవిత్వం, కథ, నవల, లాంటి సాహిత్య ప్రక్రియలలోనూ ఆ ఆలోచనల మూల తాత్విక ధారగా రాసే పరంపర ఇప్పటికీ మనం చూడగలము. ఆధ్యాత్మిక వాదులు ముషి విముక్తి లేదా ముక్తిని దైవంలో చూసుకుంటే, ఆధుక కవులు ఆలోచనా పరులు ఆ విముక్తిని వివిధ వాదాల రూపంలో అన్వయించారు. అందులో భావవాదుల ధోరణి భౌతిక వాదుల ధోరణి భిన్నంగా ఉండొచ్చు. అంతిమంగా ప్రజల విముక్తి లక్ష్యంగా ఈ రెండు శ్రేణులు ఆలోచించాయి అని చెప్పవచ్చు. చతుర్విధ పురుషార్థాల ప్రభావం భారతదేశంలోనే కాకుండా, అనేక దేశాల తత్వశాస్త్ర ఆలోచనలను ప్రభావితం చేసాయి అనడానికి అనేక చారిత్రక సాక్షాలు ప్రపంచంలో అనేక పేరుమోసిన విశ్వవిద్యాలయాలలో జరుగుతున్న పరిశోధనలు నిరూపిస్తున్నాయి. ఏది ఏమయినా భారతీయ సాహిత్యంలో చతుర్విధ పురుషార్థాలు కొన్ని తరాలుగా కొన్ని యుగాలుగా ముషి ఆలోచనలను ప్రభావితం చేసిన బలమైన తాత్విక ఆలోచనలు. ఆ ఆలోచనలను ఇంతకాలం అనేక సాహిత్య ప్రక్రియలు తమలో ఇముడ్చుకుని ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పెనవేసుకు ముషి జీవన రవళిలో అవినాభావ సంబంధాన్ని కొనసాగించాయి.

ఉపయుక్త గ్రంథ సూచీ :

1. బి.యస్. ఎల్. హనుమంతరావు: ఆంధ్రుల చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాదు, 1996.
2. పుల్లెల రామచంద్రుడు(సం). విజ్ఞాన సర్వస్వము: దర్శనములు మతములు. కొమర్రాజు వెంకట లక్ష్మణ విజ్ఞాన సారస్వత కేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయం. హైదరాబాదు, 1992
3. డా॥ ఎన్.ఎల్. నరసింహాచార్య : మునుస్మృతి గాయత్రీ ప్రచురణలు, హైదరాబాదు, 2000.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

అసమర్ధుని జీవ యాత్రలో ధర్మార్ధ కామ మోక్షాలు

– డా॥ జి. వెంకట రమణ, శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల, గుడివాడ, కృష్ణ జిల్లా.

ఈ నవలలో ప్రధాన పాత్ర సీతారామారావు. సీతా రామారావు జీవితం విచిత్రమైంది. ఇతని జీవితం ఉన్నత శిఖరాగ్రం నుంచి స్వచ్ఛమైన జలంతో భూమి మీద పడి మలినాన్ని కలుపుకుని, మురికి కూపంలోకి ప్రవహించే సెలయేటిని జ్ఞప్తికి తెస్తుంది. సీతారామారావు తండ్రి, చావు మంచం మీద ఉండి ''బాబూ మన వంశం పేరు నిలబెట్టు. అంతకంటే నే చెప్పేదేం లేదని'' సలహా ఇస్తాడు. ఆస్థి సంగతి చెప్పలేదు, ఇంకేమి చెప్పలేదు, వంశం పేరు నిలబెట్టమన్నాడు చూశారా, 'ఆయన గొప్ప తనం' అని అందరూ పొగుడుతారు.

వాళ్ళ ముత్తాత తాత ఊరికి చెరువు త్రవ్వించాడు. సత్రం కట్టించాడు. ఆయన బజార్న నడుస్తుంటే ఎవ్వరికైనా కూర్చునే ప్రాప్తం ఉండేది కాదు మరి ఆడవాళ్ళు ఇళ్ళ లోన పరుగెత్తేవారు. సీతారామారావు చిన్నతనం నుండి తన కుటుంబాన్ని గురించి గొప్పలు చెప్పటం వినేవాడు, అప్పుడతనికి రూఢీ అయ్యింది. 'డబ్బుదేముంది? మనిషికి కావాల్సింది పేరు' అనీ అందుకే తన తండ్రికి పదివేలు ఖర్చు చేసి కర్మ చేయించాడు. ఆ పది రోజులు నిత్యాన్న దానం చేస్తాడు. అందర్ని తృప్తి పరచి పంపిస్తాడు.

అతని మేనమామ అతనికి నలభైవేలివ్వాలి. ఒ రోజు మేనమామ పిలిచి, ఇంటికి తీసుకెళ్ళి మర్యాదలు చేస్తాడు. అతనికి అమితానందం కలుగుతుంది, మేనమామ కుంటుంభ పరిస్థితులు చెప్పి నేనంత ఇచ్చుకోలేను, పది ఎకరాల మాగాణి రాసిస్తాను అంటాడు. నువ్వు చదువు కున్న వాడివి మళ్ళీ సంపాదించుకోగల సమర్ధుడివి అంటాడు. సంపాదించకపోతే నీకు సహాయం చెయ్యనా మావయ్యా? అంటాడు సీతారామారావు. ఆమె అత్తకి నలభైవేల అప్పు 10 ఎకరాలతో పోవడం సంతోషాన్ని కలిగి స్తుంది. సీతారామారావు తనకు రావల్సిన నలభైవేలకు గాను పది ఎకరాలు రాయించుకుని పరిష్కారం చేసు కుంటాడు.

ఆ రోజుల్లో, తండ్రి కోరిక నెరవేర్చాననే ఆనందం, వంశం పేరు నిలబెట్టాననే గర్వం అతనికుండేది. అతడు చిన్న తనంలో చాలా ఉన్నతమైన ఆశయాలు కలిగి ఉండేవాడు. మిగిలిన వాళ్ళు చిల్లర విషయాలలో పడితే ఇతను మాత్రం ఏదోటి చేస్తుండేవాడు.

పెళ్ళి చేస్కోటం, పిల్లల్ని కనటం, ఆరోగ్యం చెడ గొట్టుకుని తిరగటం అతనికి నచ్చేవి కావు. ఎంత ఆలో చించినా ఈ మనుష్యులు ఏం సుఖం కోరి పెళ్ళిళ్ళు చేస్కుంటారు అని అనుకునేవాడు. స్నేహితులు కానీ, బంధువులు కానీ పెళ్ళి ప్రస్తావన తెస్తే నాకేమిటి పెళ్ళి? అనేవాడు. అందర్ని చూచినట్టు తనని చూడటం తనకి కష్టంగా ఉండేది. అలాంటోడు పెళ్ళి చేసుకుంటానంటే అందరూ ఆశ్చర్యపోతారు. పెళ్ళి చేసుకుంటున్నావు నిజ మేనా? అంటే అవును చేసుకుంటాను, నేను పెళ్ళికి నూతనార్ధం కలిపిస్తాను. మీలాగ యంత్రాలకి బానిసను కాదు అంటాడు. రామారావు గురుకులంలో చదువు కుంటున్న సమయంలో ఇందిరను ప్రేమించి, పెళ్ళి చేసుకున్నాడు. ఆమె జీవితం ఆమెది, నాది నాదు అందులో ఆనంద డోలికలు అనుకుంటాడు.

అతననుకున్నట్లూ ఏం జరగలేదు. సంవత్సరం తిరిగే సరికి పొత్తిగుడ్డలు కరువైపోతాయి. భార్య బియ్యంలో రాళ్ళు ఏరడం మొదలుపెడుతుంది. ఆడ పిల్ల కు జన్మించింది. ఆనాడు భార్య నొప్పులు పడుతుంటే, 'ఈ హింసకు నేనే కారణం' మహాపాతకిని అని కన్నీరు కారుస్తా. కానీ ఏం లాభం ఐదు సంవత్సరాలు గడిచేసరికి ఇద్దరు పిల్లలు, మూడు గర్భస్రావాలు జరిగిపోతాయి.

అతడు జీవితం చేతిలో కీలుబొమ్మ అవుతాడు. మామ ఓ ఫారంలో గుమస్తాగా పని ఇప్పిస్తాడు. మామ సహాయం

తీసుకున్నందుకు కించపడతాడు. స్నేహితులు కొంటె నవ్వులు నవ్వుతారు. అతనికి మామ మీద కోపం వస్తుంది. అస్తమానం ఆయన గురించే ఆలోచించేవాడు. అతను లేపోతే కూతురుండేది కాదు, అప్పుడు పెళ్ళి ఉండేది కాదనీ బాధ పడేవాడు.

ఒక రోజు ఆఫీసులో ఎకౌంట్ పుస్తకంలో ఒక బొమ్మ గీసాడు. అది చూచి మేనేజరు మండిపడుతూ..... ఇదేమిటి? అనడుగుతాడు 'మామ' అని ఇకిలిస్తాడు, ఇహ్హా హ్హా అని నవ్వుతా. మేనేజరు ఉద్యోగం నుండి తొలగిస్తాడు. అయినా అతను బాదపడకుండా నవ్వి వెళ్ళిపోతాడు. తనకి ప్రపంచం మీద కసిగా ఉండేది. తనకు తెలిసిన వాళ్ళతో కూడా మాట్టాడే వాడు కాదు. తప్పుకుని తిరిగేవాడు.

ఇంట్లోకి కావాలిసిన అవసరాలు తీర్చేవాడు కాదు. బియ్యం లేవని భార్య అన్నా పట్టించుకునేవాడు కాదు. ఎవ్వరికైనా కనబడి 'ఏం చేస్తున్నారు? అంటే ఏముంది చేయ్యటానికి' అనేవాడు. ఈ ప్రపంచం అజ్ఞానుల కోసం చెయ్యబడ్డదే అవటం వల్ల వాళ్ళు సుఖపడుతున్నారు. హాయిగా జీవితం గడుపుతున్నారు అని అనుకునేవాడు.

'ఈ ప్రపంచంలో మనం చెయ్యదగింది ఏమీలేదు' అనేవాడు. 'ఆ సంగతి మాకు తెలుసు' అనేవాళ్ళు కొంత మంది కుర్రవాళ్ళు! 'తెలిస్తే మరి మీరేంటి చేసేది? అంటే 'మాకు ఏది సుఖమనిపిస్తే అది అనేవాళ్ళు'. సుఖం ఎక్కడుందీ? సుఖమంటే ఏంటి? అని ఆలోచిస్తే ఈ లోకంలో అజ్ఞానులే సుఖపడుతున్నారనీ వారికి ఆలోచనలు ఉండవనీ. తనకు అందని ఆదర్శాలతో హైరానా పడుతున్నారని అనుకున్నాడు. రామయ్య తాత సీతారామారావుని పని చేయమంటే ఎందుకు ఇవన్నీ అందరూ ఎప్పుడోకప్పుడు చావల్సిందే అయినా తాపత్రయం ఏంటి? అనేవాడు.

ఒకప్పుడు ఓ అభిప్రాయం మంచిది అనుకుంటాడు. మరుక్షణం దానికి వ్యతిరేకమైన అభిప్రాయం మంచిదిగా తోస్తుందతనికి. ఒక పని చేద్దాం అనుకుని, అనుకోకుండా దానికి వ్యతిరేకమైన పని మొదలు పెడతాడు. మధ్యలో ఆలోచించి పోనీ ఇదీ మంచిదేగా లేకపోతే ఎందుకు చెయ్యబుద్ధి అవుతుంది అనుకుంటాడు. అసలు ఏదో చెయ్యాలనుకుంటాడు, ఏమీ చెయ్యకుండా కూర్చుంటాడు. అతని జీవితం ఆలోచనల పుట్ట అయ్యింది. కళ్ళు మూస్కుని పడుకుని బాహ్య ప్రపంచానికి దూరంగా ఆలోచిస్తాడు. ప్రస్తుతానికి పడుకుని ఆలోచించటమే అతని జీవితం.

సీతారామారావు భార్య గురించి చెప్పాలంటే, ఆమె పరిస్థితులను అర్థం చేసుకుని వాటికనుగుణంగా నడుచుకుంటూ ఉండేది. ఆమెకు తెల్లవారుజామునే కల్లాపి చల్లి ముగ్గేయటం అలవాటు. కానీ ఒకసారి సీతారామారావు మాసిన బట్టలతో ముగ్గేస్తుంటే నా పరువు తీస్తున్నావు అని ఆమె పై అరుస్తాడు. అప్పటి నుండి ఆమెకు అటు తొంగి చూడాలంటే నే భయం వేసేది. ఇంతలో పాల మనిషి వచ్చి 'అమ్మ ఇవ్వాళ్ళ పాల డబ్బులిస్తారా!' అని అడుగుతుంది. ఎంతంటే ఆమె 36 రూపాయలు అంటుంది. 'అంతా అమ్మో' అని మనసులో అనుకుంటుంది సీతారామారావు భార్య . నేను ప్రతి సారి అడగలేను కొంచెం మీరే ఇవ్వండమ్మా అంటుంది పాల ఆమె . సరే ఆయన లేవలేదు లేవగానే అడిగి తీసుకుని ఇస్తా అంటుంది రామారావు భార్య.

రామారావు ఇంట్లో బావిలోని నీళ్ళ కోసం అందరు జనాలందరు వస్తారు. ఆ ఊరిలో ఎవరింటిలో బావి లేదు. అందుకే అందరూ సీతారామారావు ఇంటికే వస్తారు. శినయ్య కూడా నీళ్ళకు వస్తాడు. ఆమె శినయ్యని ఇంట్లోకి కొంచెం నీళ్ళు పొయ్యమంటుంది. ఈ ఊరు ఎందుకు వచ్చావని శినయ్యనంటే 'బ్రతకటానికి' వచ్చానంటాడు. బాగా డబ్బు సంపాదించి అతని గ్రామానికి తిరిగి వెళ్ళి పెళ్ళి చేసుకోవాలనేది అతని కోరిక.

బడికి వెళ్ళేముందు పిల్ల వాళ్ళమ్మతో చదువు చెప్పించుకోవటం అలవాటు. ఇవ్వాళ 'నాకు కుదరదు చదువుకోనువ్వే' అంటుంది అమ్మా. పిల్ల అంట్లు తోముతా

అంటుంది. పిల్లని దగ్గరకి తీస్కుని 'నేనుండగా నీకెందు కమ్మా' అని బాధ పడుతుంది. కళ్లలో నీళ్ళు తిరుగు తుంటాయి తల్లికి. బడికి వెళ్ళమ్మ అని నచ్చచెప్పితే లేదమ్మా నేను బడికి వెళ్తే మాష్టారు గారు జీతం అడుగు తారు. నాన్న ఏమో అడిగితే కోప్పడతారని అంటుంది. అందుకని తల్లి బలవంతం పెట్టలేకపోయింది.

శినయ్య నీళ్ళు పోసి రాగా. కొంచెం బజారుకి వెళ్ళి కట్టెలు తేవాలంటుంది ఆమె. సరే అమ్మ డబ్బివ్వండి తెస్తానని అంటాడు. ఆమె లోపలికి వెళ్ళి కాంతమ్మని గోడ మీద నుండి పిలిచి 'అక్క ఓ ఐదు రూపాయలుంటే ఇవ్వవా... నా దగ్గర ఉన్న వాటి పెట్టి మొన్న జాకెట్టు కుట్టించేశాను. ఆయనని అడగటానికి మనస్సు రావట్లేదు అని అంటుంది. సరేనమ్మ అని ఇస్తుంది. ఇంట్లో 5 రూపాయలు కూడా లేవంటే లోకువ అనీ, తన భర్త గౌరవానికి ఎక్కడలోపం వచ్చిపడుతుందో అని తప్పంతా తన మీదే పెట్టుకుని అడిగి శినయ్యకిస్తుంది.

శినయ్యకి డబ్బిచ్చి కట్టెలు, వెన్నపూస తెమ్మంటుంది. ఇంట్లో వెచ్చాలు కూడా ఐపోయాయి అని గుర్తొచ్చి పిల్లని పిలిచి సుబ్బయ్య కొట్టుకు వెళ్ళి వెచ్చాలు తెమ్మంటుంది. అది చిల్లర కొట్టు. అక్కడ వీళ్ళకి ఖాతా కూడా ఉంటుంది. పిల్ల ఏం కావాలో కాగితం పై రాయించుకుని అన్నీ తెస్తుంది. శినయ్య వెన్నపూస కట్టెలు తేగా,. ఇంక ఈ రోజుకు కాపురం గట్టెక్కినట్లే అను కుంటుంది ఆమె.

కానీ ఓ వైపు ఆమెకి బాధ తుమ్మితే ఊడే ముక్కుగా ఇట్లా కాపురం ఎన్నాళ్ళు జరుగుతుంది. ఎంత దూరం ఆలోచించి చూసినా ఒడ్డుకనపడట్లా. అలల తాకిడాకి ఈ ఓడ ఎప్పుడన్నా పుటుక్కుమన్నా అనొచ్చు అనుకుని తనలో తాను బాధ పడుతుంది.'కాఫీకి పొయ్యి మీద నుండి పాలు దింపుతూ తన చేతులు చూసుకుంటే. అంట్లు తోమడం వల్ల గోళ్ళు అరిగినాయ్, ముంజేతులు మసితో నల్లబడి పోయాయి. మృదుత్వం లేదు. తన ఆకారం, స్వభావం అన్నీ మారిపోతున్నాయి. ఇంకా ఎక్కువ దూరం ఆలోచించడానికి తనకు భయం వేస్తుంది. ఉదయమే 'నాన్న లేచారేమో చూడమ్మా అంటుంది పాపతో, 'లేవలేదు ఇంకా అన్నది. నేను లేపను బాబు కోప్పడతారని అంటుంది పాప అదివిని ఆమెకు చిన్నతనం గుర్తొస్తుంది.

ఆమె చిన్నతనం, తను చదువుకున్న రోజులులో అనాటి తన ఊహలు అన్నీ జ్ఞాపకం వస్తాయి. తను గురుకులంలో చదువుకున్న రోజులలో తన జీవితంలో కెల్లా మంచిరోజులనుకున్నది. ఎన్ని తియ్యని ఊహలు ఊహించుకున్నది. నిజంగా తన పెళ్ళి అయినప్పుడు అంతా తనను అదృష్టవంతురాలు అన్నారు. తనూ అలానే అనుకునేది. కానీ, అనుభూతికి వచ్చేటప్పటికి అంతా తారుమారు అయ్యింది. తప్పు ఎక్కడుందో తెలియడం లేదు అనుకుని నిరాశ పడుతుంది. నాన్నని లేపమంటే కోప్పడతారు అంటావేంటి అమ్మ తను నీ నాన్న ఏమనడు అంటుంది. మొన్న కాఫీ ఆరిపోయిందని లేపడమే కష్టమా అన్నాడట. నిన్న కాఫీ కోసం లేపితే కోప్పడ్డారని లేపదు. తాను ఏం తప్పు చేశాను అనుకుంటూ మౌనంగా కూర్చుం టుంది. వెంటనే తన చిన్నతనం జ్ఞాపకం వచ్చి. ఆడ వాళ్ళకు ఎంత తెలివి ఉండి ఏం లాభం లే అది రాణింపుకు రాదు కదా? ఆ తెలివి బయట పడే అవకాశం భర్త ఇవ్వకపోతే అంతా బూడిదలో పోసిన పన్నీరు అవ్వాల్సిందే! అని అనుకుంటూ తన చిన్న నాటి జ్ఞాపకాలు తలపోసుకుంటుంది.

తన తండ్రిని నిద్ర లేపటానికి వెళ్లిన పాపను గురించి. 'ఈ పిల్ల జాతకం ఎట్లా ఉందో? అని అనుకుంటుంది'. సీతారామారావు గ్లాసులో తప్ప కాఫీ తాగడు. అందుకనీ ప్రత్యేకంగా గాజు గ్లాసు తెప్పిస్తుంది. అది పిల్లలు ఎక్కడ పగలగొడతారో అనే భయంతో అతను కాఫీ తాగ్గానే అల్మారాలో దాస్తుంది అతని భార్య. ఆ గాజు గ్లాసు కోసం నెమ్మదిగా లేచింది అతని భార్య నెమ్మది గా లేచి అతనికి కాఫీ సిద్ధం చేయ్యడానికి వెళుతుంది.

సీతారామారావుకి కొద్ది రోజులు నుండి కలలు వస్తుంటాయి. తను చీమలు దూరని చిట్టడవిలో, కాకులు

దూరని కారడవిలో తపస్సు చేసుకుంటున్నట్లు,. ఒక నాగుపాము తన నెత్తి మీద పడగ విప్పి ఆడుతున్నట్లు, పూండ్లు గడిచిపోయినట్లు.....ఇలా వస్తుంటాయి కలలు. తన చుట్టూ పుట్టలు మొలిచినట్లు, గోళ్ళు పెరిగి మెలితిరిగినట్లు, శరీరం శుష్కించి పోయి, ముఖంలో బ్రహ్మ తేజస్సు ఉట్టి పడుతున్నట్లన్నీ ఒకేసారి జరిగిపోతాయి. ఉండీ ఉండీ ఒక మెరుపు మెరుస్తుంది. ఆ మెరుపు తేజస్సుకి సింహాలు, పులులు అన్నీ మృగాలు నివ్వెరపోతాయి. రామారావు కన్నులు తెరచి చూడగా. పార్వతి పరమేశ్వరులు ప్రత్యక్షమవుతారు. వారిద్దరూ అర్ధనారీశ్వర్లుగా ఉంటారు. వారు ''సీతారామారావుని ఏంకావాలి'' అని అడుగుతారు. ఏం కావాలో కోరుకోమంటారు. అతను 'అన్నం' అన్నాడు. అందుకు శివుడు నీకు ఆకలి లేకుండా చేస్తాను అంటాడు. వద్దు దేవా 'నన్ను మోసం చెయ్యొదలచితివా' అంటాడు సీతారామారావు. 'నాకు ఆకలి ఉండాలి - ఆకలి తీరే అన్నం ఉండాలి' అంటాడు. 'శివుడు తథాస్తు నీకు శుభం కలుగును గాక', అని శివుడు, పార్వతి మాయమైపోతారు. ఆ వరం ఇచ్చిన తర్వాత సీతారామారావు రూపు రేఖలు మారిపోయి, గడ్డం ఊడిపోయి, గోళ్ళు పెరిగి విచిత్రంగా మారతాడు. స్వర్గ లోకం నుండి ఊర్వశీ, రంభా, తిలోత్తమ పంచభక్ష పరమాన్నాలు పళ్ళాలలో పెట్టుకుని ఆడుతూ, పాడుతూ తినిపిస్తుంటారు. ఇదంతా కల, నిజం కాదు. కల చెదిరి, దురదృష్టవశాత్తు సీతారామారావు మంచం మీద కదిలి నిద్ర లేస్తాడు. దృశ్యం అదృశ్యం అవుతుంది. ఊహల తియ్యదనాన్నుండి ఒక్కసారి నిత్యజీవితం మీదకి దృష్టి మళ్ళేటప్పటికీ, అతనికి భరించలేని బాధ కలుగుతుంది. భార్యమీద కోపం వస్తుంది. ఎప్పుడూ పని పని... పొద్దున్న నాలుగింటికి లేచి రాత్రి పడుకునే దాకా ఏదోక పని చేస్తుంటుంది. తనకి ఆకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చి తనభార్యకి తొమ్మిదో నెల అని కోపం ఎక్కువైపోతుంది. లేచినప్పట్నుంచి బియ్యంలేవు, పప్పులేదు. అనే మాటలు చెబుతూనే ఉంటుంది.

ఒకప్పుడు దీనిని ఎట్లా ప్రేమించానా అని ఆలోచిస్తూ కుళ్ళుకుంటూ లేస్తాడు. ఆమె కాఫీ ఇస్తుంది. ముఖం కడుక్కుంటూ అని, అంటే బెడ్ కాఫీ అలవాటైతే తప్పా... అని కోప్పడతాడు. అయినా ముఖం కడుక్కుంటే ఏంటి? కడుక్కోకపోతే ఏంటని లాక్కుని కాఫీ తాగేస్తాడు. ఇంతమంది మేధావులున్నారు. వీళ్ళలో ఒక్కరు కూడా అన్నం తేలిగ్గా దొరికే పద్ధతి ఎందుకు కనిపెట్టరు? ఈ విప్లవాలు జరుగుతాయి. ఎప్పటికప్పుడు ఇంకా ఈ విధంగానే జరిగితే వర్గం లేకుండా అందరికీ సమానంగా ఎలా ఎప్పుడు అన్నం దొరుకుతుంది అని అనుకుంటాడు. ఇది అతనికేం నచ్చదు. మన మహా ఋషులు ఈ సమస్యని పాశ్చాత్యుల మల్లే కాకుండా, సక్రమమైన దృష్టి తోనే చూశారు అనుకునేవాడు. కానీ వెంటనే అతనికి మనం ఈ గడియ చచ్చినా చచ్చిపోవచ్చుగదా! యీ ఆరాటం ఎందుకు? అనిపించేది. ఈ లోగా ఏదోటి చెయ్యటానికి, ఏ సుఖం అనుభవించకుండా మరణిస్తే జీవితం వృధా అయిపోయినట్టేగా! అనుకునేవాడు. అతనికి పునర్జన్మ పై నమ్మకంలేదు. ఎటు ఆలోచించినా, ఎంతలోతుకి పారజూచినా 'చచ్చేవరకు బ్రతకటం తప్పా ఈ ప్రపంచంలో చేసేది ఏమీలేదనే నిశ్చయం అతనికి రూఢీ అవుతుంది. అన్నం కోసం తాపత్రయపడటం నీచం అని తెలిసీ, తెలియనట్లు బ్రతకటం ఆత్మ వంచన అనీ ఈ రెండూ తనకు పనికి రావనీ అనుకుంటాడు.

తాను ప్రయత్నించడు. అన్నం దానంతట అదే వచ్చి పడాలి. సుఖాలు వాటంతట అవే వచ్చి తనకు ముసురుకోవాలి. ప్రయత్నించి సాధించడం గొప్పైనా? ఏ ప్రయత్నం లేకుండా జీవితం సాగాలి అని ఆలోచిస్తూ ఉంటాడు. పాప వచ్చి తన నీ స్నేహితులు వచ్చారని చెప్పగా వాళ్ళలో వచ్చి కూర్చుంటాడు. ఒక వాళ్ళు సంభాషణ మొదలు పెడతారు ప్రాణం ఎలా వచ్చింది అని అడుగుతారు. ఎవరికి తోచింది వారు చెపుతున్నారు. మనం మరణిస్తే శరీరాలు నశిస్తాయని మట్టిలో కలిసి, అందులో మరో రూపం పుట్టుకొస్తుందనీ, రక రకాల అభిప్రాయాల్ని వ్యక్తం

చేస్తుంటారు. 'నిర్నిమిత్తముగా పుట్టి, పరిణామం చెందే దాని ఫలితం మనకు విదితం. అసలు దానికే ప్రయోజనం లేనప్పుడు, మనకి ఆదర్శం ప్రయోజనం అనీ ఎక్కడనుండి వస్తుంది. నిర్నిమిత్తముగా పుట్టం' అని తేల్చేస్తాడు సీతారామారావు. అందరూ ఏదోకటి చెయ్యాలని కాని, ఏం చెయ్యక్కర్లేదు అని కానీ ఎక్కడుంది అని అనుకుంటారు. అందరూ నిరాశ వెదజల్లుతున్నారు. ఆశా లేదు, నిరాశాలేదు, ఇంతకి తేలింది ఏమిటి అనగా తేలడానికేముంది? మనం నిర్నమిత్తంగా పుట్టాం. 'పీలుంటే బ్రతకటం లేదంటే చావటం' అని ముగిస్తాడు సీతారామారావు. ఉదయమే సీతారామారావు ఇంట్లో నుండి బయటకొచ్చేసరికి మేనమామ రాసిన ఉత్తరం ఉంటుంది. అంతకు ముందు వందరూపాయాలు కావాలని తను ఉత్తరం రాస్తే ఆయన జవాబివ్వలేదు. దాంతో ఇంకో ఉత్తరం రాసాడు. 'నాకు వందరూపాయ లివ్వడం నీకు కష్టంగా ఉంది. ఒకప్పుడు నేను నీకు చేసిన సహాయం మరచి పోయినట్టున్నావు. నలభై వేల బాకీకి పది ఎకరాలు కట్టుకున్నాను. జ్ఞాపకం ఉందా? మళ్ళీ నాకు డబ్బు కావలిస్తే నిన్ను పొలం అమ్మమంటే ధరలు పడిపోయాయనీ వంక చెప్పి వెయ్యిరూపాయలకు కొనుకున్నావు. విశ్వాసం లేదు. ఒక వందరూపాయలు పంపలేకపోయావా? మా ఇంటికొచ్చిన కుక్క నయం. ఓ పూట అన్నం వేస్తే ప్రతిరోజు ఇంటికి కాపలా ఉంటుంది. అది విశ్వాసం గల జంతువు. నీకిచ్చిన డబ్బుకి ఎన్ని కుక్కులు వచ్చేవా అని ఆలోచిస్తున్నా"! అంటాడు. ఇది మేన మామకి రాసిన ఉత్తరం సారాంశం అంటాడు. దానికి జవాబు ఈ కవరు. అది చూసి కుతుహలంలో చదవడం మొదలు పెట్టాడు.

"నాయనా నీ ఉత్తరం అందింది. వందరూపాయలకు రాసిన ఉత్తరం కూడా అందింది. మనసులో ఉద్దేశాలు బయటకొచ్చినందుకు సంతోషం, నీ తండ్రి, తాత విషయం కూడా నేను పూర్తిగా ఎరుగుదును. పదిమంది చేత పొగిడించుకోవాలనే ఆశ మీకు ఉంది. అది తీర్చుకోవడానికి మంచి, చెడు రెండు పనులు చేసింది నీ కుటుంబం. మీ దాతృత్వం వల్ల కొంత మంది లాభించినా, మీ స్వాతిశయం వల్ల కొంత మంది ఎంత బాధ పడే వారో మీకు తెలియదు. నీ చిన్నతనంలో మీ తల్లి ఉన్నప్పుడు మీ ఇంట్లోనే ఉండేవాడ్ని. ఆస్తి పాస్తులు లెక్క చూసుకోవటం జమ ఖర్చులు, చూసుకోవటం, అజమాయిషీ కనుక్కోడం మీ నాన్నకి పనులుగా కనిపించేవి కావు. మేం ఈ పనికి బాగా పనికొస్తాం అని నమ్మకంతో పిలిపించి మేనేజిమెంటును ఒప్పచేసాడు.

మేము మీ ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుండి పడిన బాధలు, అనుభవించిన కష్టాలు మీకు తెలియవు. కానీ నేను మీ ఇంట్లో పడిన సుఖం నా చెల్లికి అంటే మీ తల్లికి తెలుసు. నీ తండ్రి ఎప్పుడూ మమ్మల్ని ఆయనతో సమానంగా చూసేవాడుకాడు. ఎప్పుడూ పరాయివాళ్ళ గానే, నౌకర్ల గా చూసేవాడు, నా వంశం అనే అహంకారం ఆయనలో జీర్ణించుకుపోయి తెలియకుండానే చేశాడు. మీ వాళ్ళు అన్నాలు ముగించే వరుకు మాకు తినే ప్రాప్తంలేదు. ఒకరోజు మీ అమ్మ ఎందుకో విస్తరిలో వడ్డించింది. అందుకు మీ నాన్న 'విస్తరి కావల్సి వచ్చిందే? అన్నాడు'. ఆ రోజు మీ అమ్మ ఎంత ఏడ్చిందో మనం 'వెళ్ళిపోదాం అన్నయ్య' అని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. అది మీ ఇంట్లో ఏం సుఖపడింది? పేద కుటుంబం అయినా గొప్ప కోసం మీ నాన్న మా చెల్లిని చేసుకున్నాడు. ఏ రోజైనా పరిశుభ్రంగా ఉంటే మా ఇంటికొచ్చి ఎన్ని నేర్చుకున్నావే. అంది నీ మేనత్త. పుట్టుకతో నేర్చుకోవాలని అంది. మురికిగా ఉంటే శుభ్రంగా లేదని తిప్పేది. దాని ఇంట్లోనే అది పరాయిదిలా బ్రతికింది. నీ మేనత్త ఎలాంటిదో నీకేం తెలుసు? అయినా అది మీ కుటుంభంలోనే ఉంది ఆమె సంగతి గతి ఏమైంది. భర్తని విడచిపెట్టి అయినా మీ కుటుంభంలో మీ యింట్లోనే ఉండేది. చిన్నప్పుడే భర్తని వదిలి అసూయ ద్వేషంతో ఉండేది. ఇలా బ్రతికాం మీ యింట్లో. మళ్ళీ నువ్వు కడుపున పడ్డాక మీ అమ్మ చాలా సంతోషించింది. కానీ నువ్వు పెరుగుతున్న కొద్ది మళ్ళీ

మీ అమ్మకి విచారం 'వాడు మనలాంటోడు కాదు అన్నయ్య' వాళ్ల నాన్న పోలికలే అని కన్నీరు పెట్టుకుంది.

ఆ మాటలు విని నిన్ను గమనిస్తే నీలో అన్నీ మీ నాన్న లక్షణాలే. ఇంట్లోకి వచ్చి మీ నాన్న లాగా అప్పులు చేస్తూ ఉండే వాడివి. పులి కడుపున పులే పుడుతుంది అని మీ నాన్న నిన్ను చూసి మీసం దువ్వేవాడు. నేను అహర్నిశలు మీ పొలం మీద పనిచేశాను, చేయించాను. కానీ ఏం లాభం? నేను వసూలు చేస్తే మీ నాన్న ఖర్చు పెట్టేవాడు. నాకెందుకు వచ్చిన శ్రమ ఇది? అని, ఎవరి కోసమని నా మనసు మారింది. నేను దూరంగా ఉన్నా. నిన్ను పిల్చుకుని బాకీ పరిష్కారం చేసుకున్నా. నలభై వేల పొలం పదివేలకు కట్టుకుని నీ వంశ గౌరవం నిల బెట్టావు. నీ అనందానికి నన్ను ఉపయోగించుకుని 'నీ కోసం అని చేసా. విశ్వాసం లేదని నిందించడంలో అర్థం ఉందా? ఈ మధ్య నీ మామా వచ్చాడు. నీ పరిస్థితి, నీ ప్రవర్తన విపులంగా చెప్పాడు. నీ దగ్గరుంటే పిల్లలు చెడి పోతారేమో అని, వెంట రమ్మని అంటే కూతురు ఒప్పు కోలేదంటు మంచి ఆడవాళ్ళు నీ లాంటి పురుషుల భార్యలే అవుతారు" ఇవీ ఆ ఉత్తరంలోని విషయాలు.

ఉత్తరం చదువుకునేప్పటికి నీతారామారావుకి అయోమయం కలుతుంది. ప్రతీ అక్షరం చాకై అతనికి హృదయంలో గుచ్చుకుని బాధపెడుతుంది. ఆ ప్రేమా, అభిమానం వొట్టి నటనేనా? అనుకుంటాడు. అతని కోసం తను త్యాగానికి సిద్ధపడితే ఎంత నీచంగా ఆలోచించాడు తన మేమ అని అనుకుంటాడు. అతనికి ద్వేషం వస్తుంది. ప్రపంచంలో ప్రతీ ఒక్కడూ తనను మోసగిస్తూనే ఉన్నారు. చదువుకునే వాడికి, తెలివి తక్కువ వాడికీ, చవటకీ అందరికీ తనే లోకువే అనుకుంటాడు. తన మేనమామకి ఘాటైన ఉత్తరం రాయాలని కలం కాగితం తీసు కుంటాడు. కానీ ఏమని రాసేట్లు? ఆయన ఉత్తరానికి జవాబేమి ఉంది రాయడానికి. తన మామ వెళ్ళి మేన మామతో మాట్లాడటం మరీ మంటగా ఉంది. అయితే తనేం చెయ్యగలడు. ఏమి తోచక మేనమామ అని బొమ్మ వేసుకుంటాడు హేళనగా. మేనమామ ఉత్తరం సీతా రామారావు హృదయాన్ని అగ్ని గుండంగా మారుస్తుంది. పొద్దునే లేచాక బయటికి వెళ్ళితే కాకి పొడుస్తుంది. అది కేవలం తననే మాత్రమే పొడుస్తుంది. ఈ లోపు పక్కింటి ఎరుకల్ది వచ్చి, చూడండి బాబు! మా పిల్లని ఎలా బాదిందో! లేనోళ్ళం అని ఇలా చేస్తారా... మీ పిల్లని పిల వండి? అంది.

ఇలాంటి వాళ్ళతో చిక్కులు తెచ్చి పెడుతున్నందుకు కూతురు మీద కోపం వస్తుంది. 'ఎందుకు కొట్టావు? అని అడుగుతాడు. కూతురు ఏం మాట్లాడలేదు. గట్టిగా అడిగిన ఏం చెప్పలేదు. ఎరుకల్ది చూస్తూ నిలబడుతుంది. ఏం చెప్పాలో తెలియక కూతుర్ని బాదాడు. ఆమె తట్టు కోలేక తనే ముందు కొట్టిందని అంది. ఎరుకల్ది ఎన్ని అబద్దాలు ఆడత్నావని తిడుతుంది. అతనికి భయం వేసింది. దాని నోటికి అడ్డూ ఆపు లేదా... అని బాధ పడ్డాడు. ఇక నుంచున్నావే కొట్టాగా అన్నాడు. ఎరుకల్ది వెళ్ళిపోతుంది. కోపం తగ్గగానే పశ్చాతాపం కలిగి అతనికి గుండెలు చెదిరాయి. ఆ పిల్ల ఏం చెయ్యకుండా ఉంటే కొట్టినందుకు బాధపడుతుంది. ఆ పిల్లని దగ్గరికి పిలిచి "ఏమ్మా అడగగానే ఎందుకు చెప్పలా?' అని అడిగాడు. నువ్వు కొడతావని భయం వేసిందని అంటుంది ఆ పిల్ల. సపోట పళ్ళు ఎత్తుకుపోతుంటే కొట్టానంటుంది. తన తప్పు లేకుండా కొట్టినందుకు బాధ పడతాడు. నాతో చెప్పక పోయావా అంటే 'మొన్న చెప్తే నువ్వే కొట్టు నాకెందుకు చెప్తావు అన్నారుగా' అని అంటుంది. ఎప్పుడేమి చేస్తాడో ఎలా ఉంటాడో ఎవరికీ అర్థం కాడు. చివరికి తన పిల్లకి కూడా. నిజమే అతనికి పిల్లల కష్టాల్లో జోక్యం కలిగించు కోవటం చాలా అయిష్టం అతని కళ్ళలో నీళ్ళు తిరుగు తాయి. అతనికి ఏం అర్థం కాదు. ఒక క్షణం ఒకటి మంచిదని ఇంకో సారి ఇంకొకటి మంచిదని అనిపిస్తుం దతనికి. ఒక్కో క్షణంలో తాను చెప్పిందానికి మరుక్షణం విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటాడు. తనకి తానే అర్థం కాడు. చూడమ్మా! ఆ... చిల్లర వాళ్ళు తగని వాళ్ళు, వాళ్ళ

నోళ్ళు మంచివికావు. వాళ్ళతో తిరక్కు అంటాడు. తన భార్య చిల్లర వాళ్లతో తిరగొద్దంటే, తిరిగితే ఏంటి? వాళ్ళూ మనుషులు కాదా? అందరితో తిరిగి అన్నీ తెలుసుకోవాలంటాడు. ఇప్పుడు అదే తప్పనిపిస్తుందతనికి. అతనికి ప్రపంచం ఏకమై తనను హింసిస్తునట్లు అనిపిస్తుంది. ప్రపంచ భారమంతా తనొక్కడే మోస్తున్నట్లు అనిపిస్తుంది. తన భార్యతో తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకోవాలనుకుంటాడు. 'నాకు బాగా బతకాలని ఉంది, నిన్ను సుఖ పెట్టాలని ఉంది. కానీ చేత కావటం లేదు'. అని చెప్పుకోవాలనుకుంటాడు. తన హృదయం విప్పి తన ముందు పెడితే శాంతి లభిస్తుందనే ఆశ కలుగుతుంది. భార్య మీద ప్రేమ బహిర్గతం చెయ్యాలనుకుంటాడు. కానీ ఎలా...? అన్నం పెడితే 'కొత్త కూర వండావా?' అంటాడు. ఆమె మాట్లాడదు. 'ఇవాళ ఇస్త్రీ చీర కట్టావా?' ఆమె మాట్లాడదు. 'ఒంట్లో బాలేదా?' అంటాడు. 'బాగా లేకేం బాగానే ఉంది'. అంటుంది. అతనికి కోపం వస్తుంది. మొదట్లో చెప్పిన మాట వినేది. ఇప్పుడు ఇలా తయారైంది. తనకు కోపం వస్తే భార్య వెళ్ళిపోతుంది. ఆమె అలా వెళ్ళిపోయేసరికి, తనకు నుంచోవటమే కష్టం అయ్యిందా! అని నేను తిననని పళ్ళెం నెట్టేసి వెళ్ళిపోతాడు.

ఎక్కడ జరిగిందో పొరపాటు? ఎవర్లో ఉంది తప్పు? అని ఆలోచిస్తూ పడుకుంటాడు మీరు తినకపోతే తినను అనేది. ఇప్పుడు తినటం లేదుగా అని అనుమానం వచ్చి, మంచి నీళ్ళకోసం అన్నట్లు వంట గదిలోకి వెళ్తాడు. వెళ్ళి మంచినీళ్ళు తాగి, మంచినీళ్ళు ఇవ్వటం కష్టంగా ఉందా. అని అరుస్తాడు. ఆమె మాట్లాడదు. తనకి ఆకలి వేస్తుంది. అయినా 'నేను తినను నే ఛస్తే నీకేంటి?' అని నువ్వు సుఖంగా ఉండి చావు అంటాడు, భార్యతో.

అక్కడ్నుంచి వచ్చి ఏంట్రా చేసింది? అని ప్రశ్నించుకుంటాడు. రొమ్ము మీద దబ దబ గుద్దుకోవటం మొదలు పెడతా, ఇంట్లో అలికిడి లేదని భార్య ఆత్మహత్య చేసుకుందనే భయం కలిగి ఏం తెలియనట్టు బయటికి వెళ్ళి బావిలోకి తొంగి చూస్తాడు. బుడగలు కనిపిస్తాయి. అతని గుండె దడ దడ కొట్టుకుంది. వెనుక నుండి భార్య వస్తుంది. 'ఏం చేస్తున్నావక్కడ' అంటాడు. ఆమె మాట్లాడదు. చూస్తూ నిలబడుతుంది.

'ఏం కొడతావా' అంటాడు. 'నేనెందుకు కొడతాను' అంటుంది. అయితే నేను కొడతాను అంటాడు. చెంప మీద చెడేలు అని భార్యను కొడతాడు. పాప కెవ్వు మంటుంది. అతని శరీరం భయంతో వణకి పోతుంది. ఆయాసం ఎక్కువై వగర్రు పుడుతుంది. చుటూ ఉన్న వస్తువులు ఏమి కనిపించవు లేదతనికి; అంతా అయోమయం అవుతుంది. లోపల నరాలు చెటేలు చెమున తిరుగుతున్నట్లు అనిపించింది.

బజార్లో అందరూ నడుస్తూనే ఉన్నారు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూనే ఉంటారు. ప్రపంచం యధా ప్రకారం నడుస్తూనే ఉంటుంది. సూర్యుడు పడమట అస్తమిస్తాడు. తూర్పున ఉదయిస్తాడు తను భార్యని కొట్టడంలో ఈ ప్రపంచానికి ఏమి సంబంధం లేదు

అతనికి గింగిర్లు ఎత్తినట్లు అనిపిస్తుంది. శరీరం అంతా సూదులు గుచ్చుతున్నట్లు ఉంటుంది. అక్కడ ఉండలేక పోతాడు.

సీతా రామారావుకి ఇంట్లో ఉన్న ప్రతీ వస్తువూ తనను ఎక్కిరిస్తునట్టూ ఉన్నట్లుంటుంది. గోడకు ఉన్న పెళ్ళినాటి ఫోటో చూస్తాడు. తర్వాత తన డైరీ తీసి చదవటం మొదలు పెడతాడు. తనకు మళ్లే అనిపించదు. అతనికి. అప్పుడు అతనూ, తన భార్య సముద్రం దగ్గర కూర్చుని మాట్లాడుకుంటూ. 'నీవు నన్నంత ప్రేమిస్తున్నావు' అంటే ఆమె సిగ్గుపడుతుంది. 'చెప్పు ఎప్పట్నుండి?' అని ఆమె అనగానే చూసినప్పట్నుంచి అంటుంది ఇద్దరూ ఆప్యాయంగా కలిసి అంతా తిరుగుతారు. అప్పుడు తామిద్దరూ ఉన్నత స్థాయిలో ఉన్నట్లు భావిస్తారు. ఇంక చదవలేక డైరీ మూసేస్తాడు రామారావు.

గబ గబా వెళ్ళి అద్దంలో ముఖం చూసుకుంటాడు. అతని గుండెలు పగిలిపోతాయి. సన్నని భయంకరమైన

మూలుగు అతని కంఠం నుండి 'నేనెవర్నీ? పిశాచినా? ఎవర్ని నేను' అనుకుంటాడు.ఇంట్లో నుండి వచ్చేసి బజార్న నడుస్తూ ఆలోచిస్తూనే ఉంటాడు. అతను 'నానాటికి తీసి కట్టు నాగంబాట్లు' గా ఉండటానికి కారణాలు పోగు చేసుకుంటాడు. ఈ విచిత్ర వ్యక్తిలో మరి విచిత్రం ఏంటంటే ఇతను ఆకలికి దాసుడు. నేనిలా అవటానికి స్నేహితులే కారణం అనుకుంటాడు. వాళ్ళ వల్లే చెడి పోయాననుకున్నాడు. మళ్ళీ ఒకరి వల్ల చెడటం ఏమిటి? అనుకుంటాడు

రోడ్డు మీద నడుస్తున్న సీతారామారావు బిగ్గరగా నవ్వు కుంటాడు. అతను వెళ్ళే ప్పటికి రామయ్య తాత మనవడితో 'గుర్రం ఆట ఆడుకుంటా ఉంటాడు. అది చూసి సీతారామారావు నవ్వి తాతతో ' ఈ జీవితం చూశావు.... పిచ్చివాడి రూపంలో ముడ్డి మీద తంత్రం ఉంది. కానీ కొంత మందికి బుద్ధి రాదా అంటాడు, రామయ్య తాత. అతనికి అకస్మాత్తుగా తన భార్యను కొట్టినందుకు ఎత్తి పొడుస్తున్నట్లు చనిపోవాలను కుంటాడు.. చావ దలచిన వాడుకి ముక్కు తడుపు చూడాలని ఉంది అంటాడు. చూసి చనిపోవాలనుంది అంటాడు. చావదలచిన వాడుకి కోర్కెలు ఉండటం మంచిది కాదు. బబూ! అంటాడు తాత. అతనేదో విధంగా తగాదా పెట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు. తన భార్యని కొట్టడంలో తప్పేముంది. పరిస్థితుల్ని బట్టి కొట్టానని అంటాడు. దేవుళ్ళు చేయలేదా? అంటాడు.

అందుకు తాత 'మూర్ఖుడా శారీరక తృప్తికోసం, పశు వాంఛ తీర్చుకోవడానికే నీ అసమర్థతను కప్పిపుచ్చు కోవడానికిలా చేస్తున్నావు. అని వెళ్తావా నువ్వే బయటికి గెంటించుకుంటావా' అంటాడు. ఏంటి తాత అంటే వెళ్ళు అంటే వినలేదని కర్రతో వెనకాల పడతాడు. సీతా రామారావు బజార్న పడతాడు. ఎక్కడికి అని ఎవరో అడిగితే నాకేం తెలుసు నా కాళ్ళని అడుగు అని అంటాడు. దూరంగా నాయకులంతా ఓ ప్రసంగం నడిపిస్తుంటారు. అందరూ గావుగా మాట్లాడుతుంటారు. అది విని సీతా రామారావు అక్కడికి వెళ్ళి వేదిక ఎక్కి వారందరి గురించి వాస్తవాలు చెబుతారు. వారు చేసిన హత్యలు, మాన భంగాలు గురించి వారెదుటే ప్రసంగిస్తాడు. 'వీడు పిచ్చి వాడు' అని అంటారు. వాళ్ళు. సీతారామారావు అదేం వినకుండా ప్రసంగిస్తూనే ఉంటాడు. జనాలుకు కూడా బుద్ధి లేదా అన్నీ తెలిసి ఇలా నిశ్శబ్దంగా ఉంటారని. అని నోరు పారేసుకుంటారు.

కొట్టండి వీడ్ని అని జనాలంతా వచ్చి పట్టుకుని కొడతారు. రామయ్య తాత వచ్చి ఎలా ఉంది బాబు! అంటే పర్లేదు అంటాడు. తాత మీ మనవరాలికి నన్ను క్షమించమని చెప్పు అంటాడు. అది నిన్ను ఎప్పుడు క్షమిస్తుంది అంటాడు. తాత. ఇద్దరూ అలా మాట్లాడు కుంటూ ఊరి చివర వంతెన దగ్గరకు చేరుకుని కూర్చుం టారు. సీతారామారావు తాత మాట్లాడటం మొదలు పెడ తాడు. 'జ్ఞాన బండారం ఎప్పటికప్పుడు నింపుకుంటావు కానీ అది ఇతరులకి అభివృద్ధి చేసేదైతే ఉపయోగ పడుతుంది. నాయనా లేకపోతే జాతి నాశనం అవుతుంది. ఇప్పుడు నీ గతి కూడా ఇదే నీకున్న జ్ఞానం తో సమస్యల ఒత్తిడిలో నువ్వు కొత్త మార్గాన్ని వెతకగలవు నువ్వలా చేయలేదు. ఈ ప్రపంచంలో చేయడానికేం లేదన్నావు' అని తాత వివరంగా చెబుతాడు, అందుకు రామారావు 'నాకు జ్ఞానం ఉందని' అంగీకరించావు కదా తాత అంటాడు. జ్ఞానం ఒకటే మానవునికి సహాయపడదు. ఉపయోగపడేటట్టు చేసే మనస్తత్వం కావాలి. తాను జ్ఞానాన్ని సంపాదించాడు కానీ జీవితపు లోతుల అనుభవం లోకి రాలేకపోతాడు. మానవులు పది మంది కలిసి ఓ చోట చేరి భవిష్యత్తును నిర్ణయించి ఈ బాధలు లేని సంఘం ఎలా ఉంటుందో ఊహించుకుని దాని కోసం పాటు పడ్డారు. దీనినే మానవ పరిణామ దశలుగా వర్ణిస్తాం అంటాడు తాత. అలా మొత్తం బోధిస్తాడు. రామయ్య తాత వెళ్దాం అంటే నేను కాసేపాగి వస్తా అని స్మశానం దగ్గరుకు వెళ్తాడు. అక్కడ చితిని చూస్తూ తన గుండెలో మనశ్శాంతి చేర్చుకున్నాడు.

అతనికి ఆలోచిస్తే సమాధి నుండి 'బాబు నువ్వు మారావు అని నేను సంతోషించా' అని అన్నట్లు అనిపిస్తుంది. మా అమ్మని సంతోషపెట్టా అని కన్నీరు కారుస్తాడు. చీకటి పడుతుంది. అక్కడే ఎంతోసేపు ఏడుస్తూ ఉండిపోతాడు.

ఎదురుగా విషం కక్కుతూ ఓ ఆకారం, కళ్ళు జ్యోతుల్లా మండుతున్నాయి. ఆ ఆకారం తన మీదకి దూకింది. గుప్పిళ్ళు బిగబట్టి మోహం మీద గుద్దుతూ ఉంది. రక్తం, కండలు, ఎముకలు, పేగులు - స్మశానం అంతా భీబత్సం. సీతారామారావు పళ్ళు బిగించి. పిడికిలి బిగబడతాడు. శక్తినంతా కేంద్రీకరించి దాని గొంతు పట్టుకుంటాడు. మెడ నులుముతాడు. తన కళ్ళు నెత్తురు గుడ్లుగా ఊడిపడతాయి. తన మెడ కోడి మెడ విరిచినట్లు విరిగింది. ఒక సన్నని భయంకరం అయిన మూలుగుతో కూలబడతాడు. తనను హత్య చేసుకుంటాడు. తెల్లారి స్మశానంలో ఎవ్వరో చచ్చిపడున్నారని ఊరంతా చెప్పుకుంటా ఉంటారు జనాలు వెళ్తారు. శవానికి కాళ్ళు లేవు వంటి నిండా దెబ్బలే, మెడ మెలితిరిగి వుంది. 'ఎవరో పొడిచి చంపారు' అనుకుంటా ఉంటారు. రామయ్య తాత వచ్చి చెప్పే వరుకు ఆ శవం సీతా రామారావుదని బాగా ఎరిగిన వాళ్ళు కూడా గుర్తు పట్టలేక పోయారు. అలా సీతారామారావు చచ్చిపోతాడు. జీవితంనికా పిరికితనం, సోమరితనం, అర్థంకాక పోవడం, వితర్క వాదాలు అన్నీ సీతారామారావుని అసమర్థుని చేసి చంపేస్తాయి. జీవితం తనకి ఓ పట్టాన అర్థం కాదు. గొప్ప మానసిక సంఘర్షణను చిత్రిం చిన మనో విశ్లేషణాత్మక నవల ఇది. మనసు పొరల్లోని అంత:

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. అసమర్థుని జీవ యాత్ర - త్రిపురనేని గోపీ చంద్ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ - 2019.

❖ ❖ ❖

భార్గవరామ చరిత్ర – ధర్మాచరణ

– జి. రమేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

కం॥ ధర్మజ్ఞులైన పురుషులు
ధర్మువునకు బాధసేయు ధర్మువునైనన్!
ధర్ముగా మదిదలపరు
ధర్ముపు స్వరంబునకు హితంబుగ వలయున్!

ధర్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానులు ధర్మానికి ఏమాత్రం కీడు కలిగించే ధర్మానైనా, ధర్మంగా మనస్సులో భావించరు. అచ్చమైన ధర్మం జగత్తుకంతటికీ మేలు చేకూర్చాలి. ధర్మ స్వరూప నిరూపణకు, ధర్మసూక్ష్మ వివరణకు వేదాలు, పురాణాలు, మహాభారతాదులు పేర్కొనదగినవి. అహింసా పరమోధర్మ: అన్న అహింసా నిర్వచనంలో ధర్మ సూక్ష్మాన్ని అరయవలసి ఉన్నది. పరోపకారార్థమిదం శరీరం" అన్న వాక్యం పరుల ఉపకారార్థం తమ శరీరాలను సహితం అర్పించాలి అంటుంది.

ధర్మమనగా మానవత్వాన్ని రక్షించే గుణము. హిందూ దేశానికి ధర్మక్షేత్రమని పేరు. ఈ ధర్మక్షేత్రంలోనే వేదాలు, పురాణ, ఇతిహాస, కావ్యాదులు అవతరించాయి. వీటిలోని ఇతివృత్త స్వీకరణ పరంపరలోనే తర్వాత కాలంలో ప్రబంధాలు, కథలు, నవలలు, మొదలైనవి పుట్టాయి. సకల ప్రాణి కోటిలో మానవ జన్మం ఉత్తమమైనది. ఇలాంటి మానవత్వాన్ని పరిరక్షించే విషయంలో ఉత్తమమైనది. ఇలాంటి మానవత్వాన్ని పరిరక్షించే విషయంలో మానవజాతి ఒక్కటే సమర్థమంతమైనది. ఇతర ప్రాణులలో లేని బుద్ధి విశేషంగా ఉండటమే దీనికి కారణం. ఆహార, భయ, నిద్రా మైథునములు అన్ని ప్రాణుల యందు సమానము, కేవలం యుక్తాయుక్త విచక్షణ, ఆలోచనకు రూపమియగల ప్రజ్ఞ బుద్ధి ద్వారా సాధ్యమై, ఈ ఉత్తమ గుణాన్ని సాధించవచ్చును.

'ధర్మం' అన్న పదానికి ఈ భావనకు భారతీయ మతాలలో చాలా అర్థాలున్నాయి. సనాతన ధర్మ ప్రకారం ఏ ప్రవర్తనా నియమావళి, మూల సూత్రాలు, మరియు ఏ న్యాయము చేత వ్యక్తిగత, సామాజిక, మతపర జీవితం సజావుగా నడుపబడుతుందో, ఏ కారణముచే సర్వ జీవ జాలం, ప్రకృతిలోని ప్రతి పదార్థం, శక్తి ఒక దానితో నొకటి అనుసంధానం చేయబడి, మనుగడ సాధిస్తాయో, ఏ కారణముచే ఈ ప్రపంపం, బ్రహ్మాండ మండలం తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నాయో అట్టి దానిని ధర్మంగా నిర్వచించారు.

మానవులు తమకు కల్గిన సత్సంకల్పాలను ఇతరులకు నష్టము కలిగించకుండా నెరవేర్చుకొనడమే ధర్మం యొక్క ముఖ్య లక్షణమని చెప్పవచ్చును. భూమి మీద సకల మానవులలోను కొందరు ఉత్తములుగా ఉండి, తోటి మానవులలో పూజింపబడితే దైవ సమానులుగా భావించబడడానికి వారు ఆచరిస్తున్న ధర్మ గుణమే ప్రధాన కారణం. శాంతి, దయ, అహింస, సత్యము, అస్తేయము, ఉపకారము, సానుభూతి, శౌచము మొదలైన సుగుణములన్ని ధర్మమునకు అవయవాలై ఉంటాయి. ధర్మానికి వేదాలు ప్రమాణాలు, ధర్మాధర్మ,,నిర్ణయం చేసిధర్మ పక్షపాతులై వ్యవహరిస్తారు. ఇటువంటి ప్రామాణికమైన ధర్మాన్ని ఆచరించిన వారు ఇహలోకాల్లో కీర్తిని, సుఖాన్ని పొందుతారు.

చతుర్విధ పురుషార్థాలలో ఒకటైన ధర్మము, ఈ నాల్గింటిలోను కీలకమైనది. ఈ ధర్మాన్ని వీడిననాడు మనిషి తామోగుణ లక్షణాలచే రాక్షసుడిగా మార్పు చెందుతాడు. ఇట్టి ధర్మము విశిష్టతను ఇనుమడింప చేస్తూ, మహాభారతంలో ఉన్న పరశురామ వృత్తాంతాన్ని, ఇతివృత్తంగా స్వీకరించి, ఆధునిక కాలంలో ఒక మహాకావ్యం రాయగల్గిన మహామనిషి, గొప్ప రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు అనుముల వేంకట సుబ్రహ్మణ్య

శాస్త్రి గారు 19వ శతాబ్దానికి చెందినవారు. వీరు భార్గవరామ చరిత్రం అనే పద్యకావ్యంతో పాటు, దాదాపుగా ముప్పై రచనలు చేసిన మఎహనీయులు. ఇందులో కొన్ని ముత్రితా ముద్రితాలు, ఇంకొన్ని అలభ్యములు అయి ఉన్నవి. వీరు ఒక పౌరాణిక పాత్రని తీసుకొని జాతీయోధ్యమకాలంలో ధర్మ ప్రతిష్టాపనం చేస్తూ ధర్మము యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ భార్గవుని వృత్తాంతాన్ని 10 ఆశ్వాసాలకావ్యంగా రచించాడు. ఇందులో ధర్మాచరణ, ధర్మపాలనా సంబంధమైన అంశాలే ఎక్కువగా పొడసూపినాయి. ఈ చతుర్విధ పురుషార్థాలలో మొదటిదైన ధర్మము గురించి ఈ వ్యాసంలో ప్రస్తావించడం జరుగుతుంది.

మానవ సమాజం సుఖశాంతులతో జీవనం కొన సాగించవలెనన్న సత్యదృష్టితో పూర్వం మహర్షులు శాస్త్ర పురాణేతిహాసాదుల ద్వారా అనేక ధర్మాలను ప్రబోధించారు. ఏ సత్కార్యాచరణం, ఏ నీతి వర్తనం మానవులను అనంబాధితంగా అనాకులితంగా జీవింపచేస్తుందో అదియే ధర్మం. అట్టి ధర్మాచరణమే సమస్త మానవాళికి 'శ్రీరామరక్ష'గా భావించాలి. ఈ కావ్యంలో అట్టి ధర్మాచరణమే ఆయా సందర్భాలలో వేద బుక్కులవలె సమకూర్చబడినవి. ధర్మరక్షణం లోకరక్షణానికి మూలం. ధర్మ రక్షణమును బ్రాహ్మణులు చేస్తుండగా, తద్వతిరేకం కాని విధంగా క్షత్రీయులు లోకరక్షణానికి పూనుకోవలెను. బ్రాహ్మక్షత్ర తేజాలు రెండును పరస్పరావగాహనతో సంఘాన్ని కాపాడుతుండాలి. వాని రెండింటిని స్పర్ధ ఏర్పడిన యెడల లోకంలో సంక్షోభం తలయెత్తుతుంది. ఇట్టి చిత్రణమే ఈ కావ్యంలో కన్పిస్తుంది.

క్షత్రీయులు శస్తమైన ఆర్షతేజాన్ని తిరస్కరింపకుండా దాన్ని సహాయంతోనే లోకపాలనం చేయాలి. నీతి మార్గంలో నడిచిన పరిపాలనయే లోక కళ్యాణానికి కారణ మౌతుందని ఈ కావ్యం ధర్మ ప్రతిపాదకంగా ఉపదేశిస్తుంది. భగవంతుని అవతారాలలో ఒకటియైన భార్గవ రాముని కథను కావ్యంగా రచించుట అందలి ఉద్దేశము ధర్మ ప్రతిష్టాపనయే అని తెలుస్తుంది. అధర్మాన్ని నిరసించి ధర్మానికే విజయం కలుగునని ఈ కావ్యం బోధిస్తుంది.

ఈ భార్గవ రామ చరిత్ర అనే పద్య కావ్యంలో ధర్మాలకు మధ్య జరిగిన సంఘర్షణం ప్రధాన వస్తువుగా స్వీరించడం జరిగింది. భార్గవ రాముడు ధర్మానికి ప్రతీక కార్తవీర్యార్జునుడు అధర్మానికి సంకేతం కథాంతంలో అధర్మ ప్రవృత్తిని నిరసిస్తూ ధర్మాచరణమే సంపూర్ణ విజయం పొందినది. కథాగమనంలో సందర్భాను సారంగా ఎన్నో ధార్మిక అంశాలు సూక్తుల రూపంలో వెలువడ్డాయి. అధర్మాన్ని ఖండించుట కావ్యంలో కన్పిస్తుంది. ధర్మాచరణ ఫలితమే చివరకు పరిపూర్ణమైన కీర్తిని ఇస్తుంది అని దీని ద్వారా మనం తెలుసుకోవచ్చు.

లోకములో ధర్మ బద్ధములైన విషయాలు తాత్కాలికంగా ప్రతిష్టంభనకు గురియైనను చివరకు విజయం ధర్మాన్నే వరిస్తుంది. శాస్త్ర విహితాలైన, లోక హితాలైన అనేకానేక ధర్మాలు ఈ కావ్యంలో ప్రస్తుతింపబడ్డాయి. "ధర్మోరక్షతి రక్షిత: అన్న సూక్తిని అనుసరించి తమ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించిన పాత్రే చివరకు విజయాన్ని పొందుట, ధర్మాన్ని నిర్లక్ష్యము చేసిన పాత్రలు వినాశనం పొందుట అనేది ఈ కావ్యంలో కనిపిస్తుంది.

సగర కుమారుడగు అసమంజసుడు పౌరులను హింసించుచుండగా పౌర జనము సగరునిలో ఆ విషయాన్ని తెల్పిరి. సగరుడతనిని అడవులకు పంపించెను. ఈ సందర్భంలో

తే: వాని దుండగములు వర్ణించి చెప్పిన
నాతడ్రలిగి యద్దురాత్ము ఘోర
కాననముల కనిచె ఘనులెందు ప్రియబంధు
నైనసైప రపథయాయియైన

(భా-2-89 వ పద్యం)

మహాత్ములు అపమార్గానుయాయులైన వారు తమ కెంతటి ప్రియ బంధువులయినను వారినేమాత్రం సహింపరు. దానికి ఉదాహరణ ప్రాయంగ సగరుడు అసమంజసుని దురాగతనములను సహింపక అడవులకు

పంపించెను. ఇందులో ధర్మా చరణమే విజయానికి మూలంగా గుర్తించవచ్చు.

జీవనాన్ని పవిత్రం చేసే అంశాలను గూర్చి ఈ క్రింది పద్యంలో కవిగారు ఉపదేశించడం జరిగింది.

కం. మానావ మానములకుం
దానుబ్బక చిన్నవోక తగనక్షోభ్యుం
డైనెగడుంబండి తుడగు
మానేసి గంగా వ్రాహంబు మాడ్కి గుమారా!

(భా - 3-149)

గౌరవము వలన గర్వమును పొందక అవమతి వలన బాధపడక అక్షోభుడైన మనిషి గంగాహ్రదయువలె పవిత్ర జీవితాన్ని గడుపును.

మానవుడు తన ప్రయత్నముచేతనే పావనత్వం నొంద గలడు. మానవునికి సేవ్యములయిన పంచాగ్నులను తెలియపరస్తున్నాడు.

తే: తల్లిదండ్రియు గురుడునాత్మయును నగ్ని
హోత్రమును నాగ బంచాగ్ను లుర్విజనుల
కనవరతమును గాధ ప్రయత్నమెసగ
వాని పరిచర్యసేత పావనము సుమ్ము

(భా-3-155)

తల్లి, తండ్రి, గురువు, ఆత్మ, అగ్ని హోత్రం అను ఈ ఐదు భూప్రజలకు సేవింపదగిన పంచాగ్నులుగా కవి భావించాడు. ఎల్లప్పుడు వీటిని విడువకుండా పరి చర్యలతో జీవితాన్ని పావనం చేసి కొనవల్సి ఉండును. కావున పంచాగ్నులను అనవరతం సేవింపవలెనను ధర్మోపదేశం ఇందు చేయబడింది.

రేణుకాదేవి చిత్రరథుని చూచి మోహించెను. ఈ విషయమును తన తపశ్శక్తిచే గ్రహించిన జమదగ్ని ఆమెను వధించుటకై కుమారులను ఆజ్ఞాపించెను. నలువురు కుమారులు వెనుకంజ వేయగా అయిదవ వాడైన పరశురాముడు మాతృవధను ఆచరించెను. ఆ తర్వాత తండ్రిని ప్రసన్నుని చేసుకొని తల్లిని బ్రతికింపుమని తండ్రిని ప్రార్థించెను. ఆమె అటుచే పునరుజ్జీవిత మయ్యెను ఈ సందర్భంలో రేణుక పట్ల దోషమును నిర్ణయించుటకు అవసరమైన ధర్మ పద్ధతి ఈ విధంగా నిర్ణయించాడు.

తే: అప్పుడున్న యునికికాత్మబశ్చాత్తప్త
యగుట కొత్తయునికి కాసపడుట

(భా - 4-149)

గృహస్థాశ్రయ ధర్మాలను గురించి కవి ఈ విధంగా వివరించాడు.

తే: "అగ్నిహోత్ర ఫలము వేదాధిగమము
దత్తభుక్త ఫలంభు విత్తప్రచయము
రతి సుతోదయ ఫలము గార్హస్థ్య కలన
వృత్త శీల సలంబెందు వృద్ధసేవ"

(భా - 4-156)

సంతత వేదాధ్యయనానికి అగ్నిహోత్ర ఫలము కలుగును. సంపదవలన దానము అనుభవమును ఫలములోదవును. గృహస్థ జీవితం వలన సంతాన ఫలము కలుగును. వృద్ధులను సేవించుట వలన సచ్చరిత్ర, సచ్ఛీలత అను ఫలములు సిద్ధించును. కావున విత్త ప్రచయం, గృహస్థ జీవితం, వృద్ధ సేవ అనునవి పురు షునికి అవశ్యాచరణీయములైన ధర్మలుగా చెప్పబడినవి. కార్తవీర్యార్జునునితో కృత్స్నమదుడు చెప్పిన రాజధర్మం ఇలా ఉన్నది.

తే: "సాధుసమ్మతమగునీతి సరణి దొలగి
తా స్వతంత్రుడనిన త్రుళ్ళు ధరణిధవుని
స్వార్థ పరుడతిలోభి వంచకుడంటంచు
జనులు శంకింపకుందురే మనుజనాథ"

(భా-7-40)

లోకమునందు సాధు సమ్మతమైనదే నీతి. అదియే గుణం అట్టి నీతిని దప్పి తన స్వతంత్రమగు మర్గాన్ని అహంకరించి ఉన్న రాజును స్వార్థ పరుడనీ, దురాశ పరుడనీ, మోసగాడనీ, ప్రజలు అనుమానిస్తారు. కావున

అహంకారయుతమైన పద్ధతి గర్హ్యమగుచున్నది. సాధు సమ్మతమైన నీతి మార్గమున నడచుకొనుటయే క్షత్రీయ ధర్మం.

వృద్ధ మంత్రి ఒకడు కార్తవీర్యార్జునునికి పరశురాముని ప్రతాపమును గూర్చి చెప్పిన పిమ్మట రాజనీతిని ఉపదేశిస్తాడు. ఇది సర్వ కాలాలకు ఉపయోగకరమైన ధర్మం.

సీ. స్వ ప్రయోజనము దుర్జనులకు దెలుపకు
మాత్మగుణ ప్రశంసార్థిగాకు
మతి సాధులగు వారి యర్థముల్ గొనకుము
సంశ్రయింపకుము దుర్జాతినెపుడు

(భా-8-32)

ఈ పద్యంలో ప్రతిపాలనకుని ఆచరణీయములైన ధర్మాలే ఉపదేశింపబడ్డాయి. కార్తవీర్యార్జునుని అహం భావం ముందు ఈ ధర్మాలన్ని వ్యర్థములైనవి. అయిన ధర్మములను తెలియచెప్ప వలసిన వృద్ధమంత్రి తన కార్యమునందు కృతార్థుడయినాడు. కార్తవీర్యార్జునునితో రాయభారం విఫలమైంది. అర్జునుడు పరుశురాముని ఆధిక్యమును అంగీకరించలేదు. సర్వమును దైవాదీనమని పలుకుతూ కార్తవీర్యార్జునుడు రాయభారులుగా వచ్చిన ముని పుత్రులను త్రిప్పి పంపెను. వారు జమదగ్ని తపోవనమును ప్రవేశించి జరిగిన వృత్తాంతాన్ని పరశురామునితో చెప్తారు. అప్పుడు పరశురాముడిట్లనెను.

ఉ: అమ్ముని పుత్రులేగి జమదగ్ని తపోవని జొచ్చియాప్తవ
ర్గమ్ముల తోడనున్న భృగురాముగనుంగొని తాము చన్న కా..
ర్యమ్ము తెఱంగు జెప్పవిని యాతడునారసి చూచి సత్యధర్మమ్ములు...

(భా-8-73)

సత్యధర్మాలు తమంతట తాముగా ఈ లోకమందు సాగిపోవాలి. కానీ అవి క్షతీయ అహంభావముచే తొలగిపోవుట ఎలా అటంక పడుటయో జరుగుతుంది. అట్టి సత్య ధర్మాలను కాపాడుకొనుటకు కార్ముకమునకు పని గల్గినది కదా! అని పరుశురాముడు విచారించాడు. శస్త్రం చేతనైన సత్య, ధర్మాలను రక్షింపవలసిందిగా ఇచ్చుట ప్రభోదింపబడి ఉన్నవి. ఏ విధంగానైన సరే సత్యధర్మాలను రక్షించుటయే ధర్మముగ పేర్కొనబడింది. రాముడు కార్తవీర్యార్జునుని వధించిన ఘట్టమున జమదగ్ని ఇతర మనులను పరశురామునికి తీర్థయాత్ర శిక్షను విధించిరి.

భీష్ముని స్వప్నమున తల్లియయిన గంగాదేవి వచ్చి భీష్మునికి ఈ విధంగా ధర్మోసహితమును బోధించెను.

ఆ.వె. తగదు రన్న! తల్లిదండ్రులకన్న దా
మిన్నయైన గురుని మీద నడరి" (భా-10-142)

తల్లిదండ్రులకంటే గొప్ప వాడయిన గురువు మీద అకాల ధుర్మరణమును కలిగించు నీచాతి నీచమైన అస్త్రమును ప్రయోగింపదగదు. కావున ఉపసంహరించుకొనుమని తల్లికుమారుని వారించినది. తల్లి దండ్రుల కంటే గురువే మిన్నయను ధర్మం ఇచ్చుట ప్రతిపాదింపబడింది. తర్వాత నారదాది మహర్షులును గంగయు వచ్చి అస్త్రోప సంహారమును చేయించినారు. భీష్ముడు అనంతరం గురువగు పరశురామునకు నమస్కరించి ఆశీర్వాదమును పొందెను.

ఈ విధంగా ఈ కావ్యమమంతటను అనేక విధాలైన ధర్మాలను సూక్తుల రూపమున కవి ఉపదేశించినాడు. ధర్మబద్ధమైన వర్తనము కలిగిన పరశురాముడు బాహు గర్వముచే అధర్మమైన మానసిక వ్యాపారము గల కార్తవార్యార్జునిపై ధర్మాచరణ పద్ధతిలో విజయమును సాధించెను. ధర్మాధర్మ సంఘర్షణయందు చివరకు ధర్మమయే విజయమును పొందెను. కవి చతుర్విధ పురుషార్థాలలో ఒకటైన ధర్మప్రతిష్టాపనను దృష్టియందుంచుకొని ఈ విధంగా మహాకావ్యాన్ని రచించి కృతకృత్యుడయ్యాడని చెప్పవచ్చు.

❖

తెలుగు కావ్యాలు – ధర్మార్థ కామ మోక్షాలు

– కట్ట రంజిత్‌కుమార్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ మరియు పి.జి. (స్వయం ప్రతిపత్తి) కళాశాల, సిద్ధిపేట.

ధర్మము :

ధార్మిక, నైతిక విలువలు మానవుని జంతువుల నుండి వేరుచేస్తున్నాయి.''ధర్మో విశేషో అధికోనరాణామ్, ధర్మేణహీనాః పశుభిః సమానాః'' అని మనుస్మృతి గ్రంథంలో చెప్పబడింది. చతుర్విధ పురుషార్థాలలో మొట్టమొదటిది ధర్మం. ధర్మలక్షణాలలో ప్రప్రథమ మైనది, ప్రధానమైనది సత్యం. మానవుడు ఆచరించ వలసిన సామాజిక ధర్మాలన్నింటిలో సత్యం శ్రేష్టమైనది. ధర్మం అన్న పదం ''ధృ''అనే ధాతువు నుండి పుట్టింది. ధృ అనగా ఉద్ధరించుట.''ధరతి విశ్వం ఇతి ధర్మః'' లోకాన్ని, రక్షించేది ధర్మం. ఇహలోకమందు అభ్యుదయాన్ని, పరలోకమందు శ్రేయస్సును కల్గించేది ధర్మం. ధర్మప్రవర్తన అర్థకామాలతో ప్రవర్తిల్లినప్పుడే మానవ సమాజం ఉన్నతిని సాధించి స్వర్గతుల్యమౌతుంది.

''ధర్మార్థకామా మోక్షాణాం ఇదయేవైక సాధనమ్'' అని భరతుడు నాట్యశాస్త్రంలో చతుర్విధ పురుషార్థాలకు కామం సామాన్య ధర్మమని చెప్పాడు. సత్యానికి మించిన ధర్మం లేదు. అనృతం కంటె మించిన పాపం లేదు. సత్యాచరణ ద్వారా మిగిలిన ధర్మలక్షణాలు అలవడుతాయి. ఆంధ్రమహాభారత గ్రంథం అరణ్యపర్వశేషంలో ఎఱ్ఱన.

ఉ॥: **''భూతహితంబుగా బలుకుబొంకును సత్య ఫలంబునిచ్చుత**
ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్లు, ప్రా
ణాతురుడైనచో, పరిణయంబున యందును, బల్కు బొంకును, స
త్యాతిశయంబయండ్రు, మహితాత్మక యిట్టివి ధర్మ సూక్ష్ములే''!

జీవులకు హితము కలిగించే అసత్యం, సత్య ఫలితాన్నిస్తుంది. అదే విధంగా ప్రాణులకు భయాన్ని, అహితాన్ని కల్గించే ఆ సత్యవాక్కు, అసత్య ఫలితాన్నిస్తుందని ధర్మ వ్యాధుడు కౌశికునకు ఉద్బోధించాడు. సత్యం తప్పని వాడు సర్వేశ్వరుడని; త్రిలోకపూజ్యుడని సర్వేశ్వర శతకకర్త యధావాక్కుల అన్నమయ్య క్రింది పద్యము ద్వారా నిరూపించాడు.

శా॥ **''సత్యం చెప్పుడు తప్పడేనియు, దురాచారుండు గాడేని/చిత్యం బేమఱడేని దుర్జనుల**
గోష్ఠింబొందడేని భక్త సాం/గత్యం బాదట బాయడేని మదన గ్రస్తుండు గాడేని నీ
భృత్యుండాతడు మూడు లోకములలో పూజ్యుండు సర్వేశ్వరా''!

హరిశ్చంద్రుడు సత్యవాక్కు పరిపాలన కోసం రాజ్యాన్ని, కన్న కొడుకును పోగొట్టుకున్నాడు. భార్యను అమ్ముకున్నాడు. కాటిపాపరి అయ్యాడు. ఎన్ని కష్టాలైనా సత్య ధర్మాన్ని వీడలేదు. నన్నయ్య విరచిత శకుంతలో పాఖ్యానంలో తే॥గీ॥ ''సర్వ తీర్థాభిగమనంబు సర్వవేద / సమధిగమము సత్యంబుతో సరియుగావ/యెఱుగుమెల్ల ధర్మంబులకెందు బెద్ద / యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు''! సర్వతీర్థాలను సేవించి వచ్చుట, సర్వవేదాల్ని అధ్యయనం చేయుట సత్యంతో సమానములు కావు. అన్ని ధర్మాలలో కెల్ల సత్యమే గొప్పదని శకుంతల దుష్యంతునకు సత్యప్రాశస్త్యాన్ని వివరించింది. మనం నిత్యం సత్యాన్ని పలకటం ద్వారా వాక్శుద్ధి కలుగుతుంది. మన నోటి నుండి ఏ వాక్కు వెలువడినా అది జరిగి తీరుతుంది. లోభానికి దేహానికి లోబడి అసత్యమాడటం మహాపాతకం.

అర్థము :

ధర్మాచరణ ద్వారా అర్థము సంపాదించాలన్నారు

ఋషులు. అర్థమనగా ధనము. ఇది ద్వితీయ పురుషార్థము. "ధనంమూలం మిదం జగత్" జగమంతా ధనంపైనే ఆధారపడి ఉన్నది. ధనం లేనిదే ఏ కార్యాన్ని సాధింపలేము. అలాగని అధర్మమార్గంలో ధనార్జన చేయకూడదు. అది పాపహేతువు అవుతున్నది. ధర్మంగా ఆర్జించిన ధనం సద్వినియోగం చేయాలి. ధర్మకార్యాలకు ధనాన్ని హెచ్చించాలి. దీనినే మహాకవి కాళిదాసు రఘువంశ రాజులను వర్ణిస్తూ, 'త్యాగాయ సంభృ తార్థానాం' అని చెప్పాడు. అనగా త్యాగము చేయుట వలన ధనమునార్జించారని భావము. సుమతి శతకారుడు బద్దెనభద్రభూపాలుడు

కం॥ "సిరితా వచ్చిన వచ్చును/సలలితముగా నారికేళ సలిలము భంగిన్/సిరితా పోయిన పోవును/కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ"! అని అన్నాడు. సంపద కొబ్బరికాయలో నీటిలా ఎప్పుడు వస్తుందో, ఏనుగు మ్రింగిన వెలగపండులో గుజ్జు మాయమైనట్లు ఎప్పుడు పోతుందోనన్నాడు. కాబట్టి ధర్మాన్నంటి ఉన్న వారికి సంపదలు చెప్పకనే వస్తాయి. భాస్కర శతకకర్త మారద వెంకయ్య ధనమున్న రోజు మరచిపోయి, సంపద ఆయువు క్షీణించిన సమయంలో పుణ్యకార్యాలు చేయలేక పోయానని దుఃఖిస్తే లాభమేమిటి? గాలితో కూడిన అగ్ని విజృంభించేటప్పుడూ, దప్పిగొని నాలుక ఎండిన సమయంలోను కంగారుపడి బావి తవ్వితే ఫలమేముంటుంది. కనుక ధనమున్నప్పుడే సద్వినియోగం చేసి పుణ్యాన్ని సంపాదించుకోవాలి. ధనానికన్నా రాముని సన్నిధి సుఖమంటాడు త్యాగరాజు ఈ కీర్తనలో "నిధి చాలా సుఖమో రాముని స/న్నిధి సేవ సుఖమో నిజముగ బల్కు మనసా!" అని తెలుసుకోమంటాడు. ధనము కన్నా భగవన్నామమే సౌఖ్యమంటాడు. కనుక ధన వ్యామోహాన్ని భగవవ్యామోహము చేయమంటాడు. ప్రారబ్ధాన్ని బట్టి ధనం సమకూరుతుందనేది కర్మ సిద్ధాంతం. భోగము ననుభవించుట కూడా దానధర్మ ఫలమేనన్నది ధర్మసూత్రము. పుణ్యకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు, ధర్మంకొద్దీ ధనమన్నది లోకసత్యము.

కామము :

కామమనగా కోరికయని అర్థము. జీవితంలో ప్రతి వానికి ఎన్నో కోరికలుంటాయి. వానిని తీర్చుకొనుట కూడా పురుషార్థమే. మానవ జీవితం మొదలయ్యేది జీవించాలన్న కోరికతో కనుక కోరికలుండటం తప్పు కాదు. వాటిని మంగళకరమైనవిగా కోరుకోవాలి. మనస్వార్థపు కోర్కెల వలన ఇతరులు నష్టపడ కూడదు. కోర్కెలు ధర్మ విరుద్ధములై ఉండకూడదు. ఎన్ని కట్టెలు వేసినను అగ్నికి తృప్తిలేనట్లు; ఎన్ని సుఖములనుభవించినను మానవునికి తృప్తి కలుగదు. కనుక క్షణికములగు ఐహిక సుఖముల మీది ఆశలను పరిమితిలోనుంచుకున్న వివేకవంతుడు శాశ్వత సుఖాన్ని పొందుతాడు. ఆశలకు కారణం మనస్సు. పగ్గంలేని గుఱ్ఱం వంటిది మనస్సు. కనుక మనస్సును అదుపు చేసుకుంటే కోరికలను అదుపు చేసుకోవచ్చు. వేమన శతకకారుడు యోగి వేమన

ఆ.వె. : 'చిత్తమనెడి వేరు శిథిలమైనప్పుడే /
ప్రకృతియనెడి చెట్టు పడును పిదప
కోర్కెలనెడి పెద్ద కొమ్మలెండును గదా/
విశ్వదాభిరామ వినుర వేమ"!

అని మనస్సనే వేరు తెగితేకాని మాయ అనే మహా వృక్షం నశించదు. అప్పుడు మాత్రమే ఆశలనే కొమ్మలు ఎండిపోయి ముక్తికి చేరువౌతారని తెలిపాడు. ఆశలనేవి మానవనైజమని తెలుస్తుంది. ఆశ అనేది మనిషిని దుఃఖము నందు త్రోస్తుంది. దురాశ మనిషిని నాశనము చేస్తుంది.

మోక్షము :

మోక్షమనగా విడుదల యని అర్థము. అద్వైత సిద్ధాంతములో లౌకిక ధర్మాచరణ ద్వారా ఇహబంధాల నుండి విముక్తి కావటమే మోక్షమని వివరించారు. అదే జీవన్ముక్తియని వక్కాణించారు. నిష్కామ కర్మాది యోగములు ముక్తికి సోపానము. భగవదనుగ్రహముతో

ధర్మాచరణ మార్గము ద్వారా అర్థకామాలను జయించిన వానికి జీవన్ముక్తి లభిస్తుంది. మానవుడు మాటిమాటికి చావు పుట్టుకకు లోనగుచు మతిలేని దుఃఖము ననుభవించుచున్నాడు. ఈ దుఃఖ స్థితి నుండి తప్పించుకుని శాశ్వతమైన ఆనంద స్థితి నందుకోవటమే మోక్షము. ధర్మార్థ కామ సాధనకు హిందూ ధర్మ శాస్త్రాలు ఆశ్రమ ధర్మాలను ప్రతిపాదించాయి. మానవుని జీవితంలో నాలుగు దశలను నాలుగాశ్రమాలుగా విభజించారు. వాటిని బ్రహ్మచర్యాశ్రమం, గృహస్థాశ్రమం, వాన ప్రస్థాశ్రమం, సన్యాసాశ్రమములంటారు. జీవుని జీవితం చరితార్థం కావడానికి త్రివర్గాలైన ధర్మార్థ కామాలను సాధనాలుగా చేసుకుని జీవన్ముక్తుడు కావాలి. భారతీయ ఋషులు కాంక్షించింది కూడా ఇదే. కనుకనే వారు చతురాశ్రమ ధర్మాచరణ ద్వారా ముక్తికి మార్గాన్ని సుగమమం చేశారు. బ్రహ్మచర్యాశ్రమంలో భక్తియోగం అనుసరణీయం చేశారు. గృహస్థాశ్రమమంలో చతుర్విధపురుషార్థాలు, పంచయజ్ఞ కర్మ నిర్వహణము; వాన ప్రస్థాశ్రమంలో సాధు, సజ్జనుల సమాగమనము ద్వారా జ్ఞాన యోగమును పెంపొందించుకొని మానవుడు పరిపూర్ణతను సాధించుకొని వైరాగ్య చింతనతో సన్యాసాశ్రమాన్ని పొందేలా ఈ నాల్గుయోగాలైన భక్తి కర్మ-జ్ఞాన-వైరాగ్యాదులను మానవ జీవన విధానములో ప్రతిపాదించారు. ఈ విధంగా సమాజ గతమైన ధర్మార్థ కామాలను సోపానాలుగా చేసుకొని మోక్షప్రాప్తినొందుటకు ఆశ్రమ ధర్మాలు సహకరిస్తాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. ఆంధ్ర మహాభారతము-తి.తి.దే ప్రచురణ-2005
2. వేమన శతకం - నీల్‌కమల్ పబ్లికేషన్స్ - 2005

❖ ❖ ❖

జయరాజు పాటలు – ధర్మార్థ కామ మోక్షాలు

– ఎలకంటి రవీందర్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ఉపోద్ఘాతము :

ఆధునిక కాలంలో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కాలంతో పాటు మారుతూ వస్తున్నాయి. భారతీయ సాహిత్యంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వివిధ భాషలలో సాహిత్య రూపాలు పరిణామం చెందుతూ వస్తున్నాయి. కాలం సాహిత్య, సామాజిక, రాజకీయ మార్పులకు మూలంగా నిలుస్తుంది. భారత దేశం భిన్న ప్రాంతాలకు, కులాలకు, మతాలకు, భాషలకు, సంస్కృతులకు, కళలకు, సంప్రదాయాలకు పుట్టినిల్లు. వారి ఉత్పత్తే పరిణామమే ఈ సమాజం, సాహిత్యం యొక్క రూపాలు. ఈ పరిణామం సాహిత్యంలోనూ, సమాజంలోనూ చోటు చేసుకుంది. భారతీయ సమాజం, సాహిత్యంలో నైతిక విలువలకు, మానవీయ విలువలకు, సాంఘీక, ఆర్థిక కట్టుబాట్లకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. వీటి విలువ ఎక్కువగా శ్రామిక శక్తి అయిన పనిలోంచి పుట్టింది. శ్రామికుని శ్రమలోంచి పుట్టిందే పాట.

రచయిత పరిచయం :

ప్రజాకవి గొడిశాల జయరాజు గారు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ ప్రాంతానికి చెందిన మానుకోట (కొత్త జిల్లా : మహబూబాబాద్)కు చెందిన వ్యక్తి. తల్లి : చెన్నమ్మ, తండ్రి : కిష్టయ్య. జయరాజు గారి భార్య మంగమ్మ, జయరాజు గారికి ఇద్దరు కుమారులు : సాధన్, నిశాంత్. కవిగా, పాటల రచయితగా, ప్రజా వాగ్గేయ కారుడుగా పేరు పొందారు. జయరాజు గారు తనదైన శైలిలో ప్రకృతి పాటల రచయితగా, దళిత సామాజిక గేయాల రూపకర్తగా, సినీగేయ రచయితగా, స్త్రీల ఆత్మ గౌరవ, అస్థిత్వ పాటల రచయితగా ప్రఖ్యాతి గాంచారు. ప్రజాకవి జయరాజు గారు వృత్తి రిత్యా ప్రస్తుతం హైదరాబాదులోని సింగరేణి కాలరీస్ భవన్‌లో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తూ, ప్రవృత్తి అయిన ప్రకృతి పాటలు, ప్రజా ఉద్యమ పాటల రచన అభిలాషను కొనసాగిస్తున్నారు.

జయరాజు రచనలు :

A) వందనాలమ్మ... జయరాజు పాటలు (రచనా కాలం : 1999)
B) జయరాజు పాటలు (రచనా కాలం : 2005)
C) వసంత గీతం .... జయరాజు పాటు (రచనా కాలం : 2011)
D) జ్ఞాపకాలు వ్యాస సంపుటి (రచనా కాలం : 2016)
E) అవని Philosophy of Nature (రచనా కాలం : 2018)

జయరాజు పాటలు - ధర్మార్థ కామ మోక్షాలు :

భారతీయ సంద్రబీపాయంలో "భిన్నత్వంలో ఏకత్వం" అనేది అనేక కులాల, మతాల అనేక వర్గాల, వర్ణాల ఐఖ్యతకు మూలాంశంగా ఉంది. భారతీయ సంస్కృతికి, కళలకు, భారతీయ సంప్రదాయ దార్శనికతకు, మానవ ప్రగతికి వివిధ మతాలు అనుసరిస్తున్న మానవీయ, నైతిక, సామాజిక విలువలని చెప్పవచ్చు. భారత దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు మరియు వివిధ ఆటవిక జాతుల నుండి ఇప్పుడిప్పుడే నాగరికతలోకి వస్తున్న అనేక భాషలు, ఆయా సమాజాలు ఈ ఆపంతంలో కొలవుదీరి ఉన్నారు. వీరందరిపై వారు అనుసరిస్తున్న నియామకాలపై, మతాలపై ప్రజాకవి జయరాజు గారు కింద విధంగా తన పాటల రూపంలో ధర్మార్థ, కామ మోఓలను తెలియజేస్తున్నారు.

రాముడవైనా.... రహీమైనా.... యేసువైనా....నీవేగా.... / మందిరైనా ... మసీదైనా ... మాధవా నీదేనా ... /

వెన్నెలంతగ కురిసినా... చంద్రవంకా నీవేగా... / ఎగిరె ఆ పావురాలకు ఏ గుళ్ళైన ఒకటేగా... / పాల సంద్రమే చిలికినట్లు / పసిడి రాసులు కురిసినట్లు / చీకటే నిదురోయినట్లు / వేకువై మము లేపినట్లు / అణువు అణువున నీవేగా... / మా అంతరాత్మ నీదేగా ... / పంచవెన్నెల చిలుకవైనా / పావురాల జంటవైనా / ఊరెఊట చలిమెవైన / పారే పరువపు ఏరువైన / రుతువు రుతువున నీవేగా ... / మా బతుకు బాటనీదేగా ... / ఎండవైన వానవైన / వెన్నెలైన చీకటైన / వీచే చల్లని గాలివైన / పూచె పూటతోటవైన / మా వయసు ఉరకలు వేసినా... / మా వలపు కిన్నెర మీటినా... / అమ్మవైనా నాన్నవైనా / మనసు దోచిన మగువవైనా / మాటల విలుకాడవైన / పాటల చెలికాడవైన / ఈ జనన మరణం నీదేగా... / మా ప్రాణ ప్రమిద నీవెగా .. అంటూ జయరాజు గారు ప్రకృతిని దేవునిలో చూసుకుంటున్నాడు కవి.

భారత దేశంలో అత్యధిక ప్రజలు విశ్వసిస్తున్నది హిందూమతం కాబట్టి తెలుగు పురాణ ఇతిహాసాలలో భారకత, భాగవత, రామాయనాలలోని కథానాయిక, నాయకులను మానవ సమాజానికి ఆదర్శవంతులుగా నిలిచేట్టు ప్రాచీన కవులు ఆయా పాత్రలను వాటిలో తీర్చిదిద్దారు. ఆ పాత్రలే ఈ విశ్వమంతటా దైవ స్వరుపులుగా కొలువుదీరాయని మన ప్రాచీన కావ్యాలు, ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు చెబు తున్నాయి. వాటి ఆధారంగానే ప్రజాకవి జయరాజు గారు వాల్మీకి రామాయణంలోని శ్రీరాముని పాత్రను కొలుస్తూ కింది పాటలో ప్రకృతిలోని జీవరాసి పుట్టుక, ఆవిర్భావం, వాటి మనుగడ గురించి వివరిస్తున్నాడు.

శ్రీ రాం... జయ జయ శ్రీ రాం ... / జయహో శ్రీ రాం... /చినుకెట్లా కురిసిందో - చిగురెట్లా వేసిందో / పొద్దెట్లా పొడిసిందో - మొగ్గెట్లా తొడిగిందో / మా కంటి చూపును మార్చి - మా ఇంటి ఇలవేల్పయిన రాం .... / నీళ్లల్లో ఈదే చేప - నింగిని ముద్దాడే పక్షి / నేలంతా నీవేనమ్మా - విరమూసిన వెన్నెల కొమ్మా / బతుకెందుకు మార్గం చూసి - బతుకంతా తోడైవున్నా రాం ... మరుజన్మ పుందంటావా - ఉంటే మాతోనుంటావా / పుడమంతా పూలై పూసి - పులకించే వరమిస్తావా రాం... అంటూ దైవ శక్తి ఉంటే ఈ ప్రకృతిలో ఏదైనా సాధ్యమని పై పాట ద్వారా కవి మానవుని పుట్టుకకు, బతుకు మనుగడకు మూలం తను నిర్వహించే కార్యకలాపాలేనని చెప్తున్నాడు. ఈ విధంగా జయరాజు గారు అనేక పాటలు ధర్మ, అర్థ కామ మోక్షాలను తన పాటలలో చొప్పించి పాటలు రాశారు కాని ఈ పత్ర నిడివి దృష్టా పై పాటలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

ముగింపు :

ఈ భూమి మీద నివసిస్తున్న ప్రతి జీవరాసి ప్రకృతితో రక్షింపబడుతుంటాడు కవి. ప్రకృతిని రక్షించడమే ధర్మమని, ఒక జీవి మరొక జీవిపై ఆధారపడడం అనేది ప్రకృతి ధర్మం అని అంటాడు. అందులోనే అర్థ, కామాలు ఇమిడి ఉన్నాయని మనం చేసే పనుల వల్లే వాటి ఫలి తాలు ఉంటాయని అంటాడు ప్రజాకవి. ఈ సృష్టిలో దైవం అనేది మానవుని మానవీయ విలువలో, నైతిక విలువలో దాగి ఉంది అని దాన్ని రక్షించుకున్నప్పుడే మానవుని మనుగడకు ఆధారం ఉంటుందని ప్రకృతి పాటల రచయిత జయరాజు గారు పై పాటలలో తెలియ జేశారు.

❖ ❖ ❖

జానపద సాహిత్యం – ధర్మార్థ మోక్షములు

–సోనభోయిన సతీష్, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్.

అన్ని పురుషార్థ విలువలను సాధించుటకు ధర్మమే మూలకారణము. బాల్యం నుండి చివరిదశదాకా మనిషి ఎట్లా జీవించాలో ధర్మం తెలుపుతుంది. ధర్మాన్ని ఆచరించి జీవితాన్ని సఫలం చేసుకోవాలె.

సోదరధర్మమునకు లక్ష్మణుడు, రాముడు ఉదాహరణ. ఒకరిపై ఒకరికి ఉన్న అనురాగం సతీధర్మమునకు సీతమ్మ ఉదాహరణ. రాజధర్మమునకు రాముడు ఉదాహరణ. మిత్రధర్మమునకు కర్ణుడు ఉదాహరణ. త్యాగధర్మమునకు భీష్ముడు ఉదాహరణ.

అర్థము అనగా డబ్బు సంపద ఐశ్వర్యము సంపదకై మానవులందరూ ప్రయత్నిస్తారు. దానివలననే కామము (కోరిక) తీరును. ధర్మాచరణంతో సాధించిన సంపదలో కోరికలు తీర్చుకొని మోక్షము పొందటమే ధర్మార్థకామ మోక్షసాధనము. ప్రతిమానవుడు చేయవలసిన పని ఇది.

ఈ యుగంలో, అంటే కలియుగంలో రకరకాల వివాద వాదాలతో అసలైన జీవిత పరమార్థమును మరిచిపోయి కేవలము అర్థము (డబ్బు) కామము (విపరీతపు కోరిక)ల వెంటపడి ధర్మమును మరిచిపోయి మానవుడు రాక్షస చర్యలకు పాల్పడి దుఃఖమును వినాశమును పొందుచున్నాడు. ఇది కాలవైపరీత్యమో, మానవమనస్తత్వ వైపరీత్యమో తెలియదు.

శ్రామికుల ధర్మము శ్రమచేయుట ద్వారా అర్థమును సంపాదించుట శ్రమచేయువారు పాడిన పాటలు శ్రామిక గేయములు. ఇల్లలుకునప్పుడో, పిండివిసరునప్పుడో, ధాన్యము దంచునప్పుడో కదురు కవ్వములడించునప్పుడో, వరినాటు, కలుఉకోతలప్పుడో మోటదోలునప్పుడో, ఏతమెత్తునప్పుడో, నాగలిదున్నునప్పుడో, కుప్పగొట్టునప్పుడో, పడవ నడుపునప్పుడో, పాలకీ మేనాలు మోయునప్పుడో, శ్రమాపనోదనమునకై పాటలు పాడువారిని మనము చూచుచునే యున్నాము. హృదయ - లేదా - మేధాగత ఘోరమును తొలగించి ఉల్లాసమును కలిగించునటులే శారీరక శ్రమమును కాయకష్టమును పోద్రోలియుతానహామును కలిగించునటులే శారీరక శ్రమమును - కాయకష్టమును పోద్రోలియుత్సేహామును కలిగించునటుకును గేయములు తోడ్పడును. శ్రామికులనగా రాజకీయ సిద్ధాంతులు చెప్పడు ప్రత్యేక శ్రామికులు కాదు. శరీర కష్టమొనర్చు వారందరును శ్రామికులే శ్రమపడువారందరు శ్రామికులే.

ఏలెస్సా ఓలెస్సా ఏలెస్సా ఓలెస్సా
ఏలెస్సాబో ఓలెస్సా – ఏలెస్సాబో ఓలెస్సా
ఏలాయేలా యేలా యేలా యేలా యేలాయేలేలా
ఏలాయేలా యేలా యేలా యేలా యేలాయేలాతండేలా
ఏలా ఏలా జోర్మెయ్ బార్మెయ్.....

ఇట్టి వానిలో అర్థరహితములగు మాటలు ధ్వన్యనుకరణములే యధికరముగా నుండెను పాటలో నన్నియు భారముదీర్చు మాటలే. ఏలెస్సా యనుమాటతో తెడ్డు నొక్కక్కమారు కదలించి కాళాసుశ్రమ మార్చుకొనును.

ఏటికేతంబెట్టి ఎయింపుట్లుబండించి
ఎన్నడో మెతుకెరుగరన్నా – నేను గంజిలోమెతుకెరుగరన్నో
కాల్జేయి కడుక్కొని కట్టమీద గూసుంటే
కాకిదన్ని పాయెరన్నా కాకిపిల్లా దన్ని పాయెరన్నా
పోరుకూచాల్లేక పోయికూడ కూసుంటె
పోరిదన్నిపాయెరన్నా పోరితల్లిదన్నిపాయెరన్నా
చుక్క పొద్దునలేచి బొక్కెనెత్తుకపోంగ
బొక్క బోర్లాబడిరాన్న – నేను ప్రక్కలిరుగాబడితిరన్నా
నాదేటి బ్రతుకాయెరాన్న – నేను నాడె చావకపోతురన్నా

ఈ పాటలో కాకి శబ్దము గ్రామాధికారిని సూచించును. గ్రామాధికారి తన్నగాచూచి అతని కుమారుడు (కాకిపిల్ల) గూడ నా బీదరైతును తన్నిపోయెను. వారి పోరుకు(చాల)

తాళలేక నా బీదరైతు తన గుడిసెలో ప్రాయ్యిచెంతకు బోవ నాతని భార్య పిల్లలు కూడ ఈసడించుకొనిరి. పేద వానిని ఇంటివారుకూడ గణింపరుకదా. ఇటు గ్రామాధికారులతో తన్నులు దిన, అటు అలుబిడ్డలయీసడింపులకు గురియైన నాదరిద్రకబుపేవలుడు దైవోపహతుడు కూడా. బొక్కనెత్తుకుని చుక్క ప్రొద్దుక పోవుచుండగాబొక్క బొర్లపడెను. ఎంత హృదయ విదారక గేయము.

ఎనుబదెన్మిదివేల మేకాంగవీరు, లొలయ తొమ్మిదివేల యుత్తమాశ్వములు
సోరిది నెన్మిదివేల చొక్కపు చెల్పిపెలును, నిరువది లక్షలయీను గోడిగలు
కరులును మూడువేల్ గడ లైదులక్ష, పరగంగ లొటపిటల్ పదునైదువేలు
పసగలపచ్చల పాలకీల్ నూరు, నరిగెలు నొకలక్ష యందలాల్ నూరు....

ఇందులోని సంఖ్యా వివరములున్నియునతి శయోక్తులే. కాటమరాజుకు నిజముగానంత బలము లేకుండెను మరియును కాటమరాజు వెంట "తుపాకి విలుమూక తొమ్మిదిలక్ష" లనుట నమ్మదగని విషయము తుపాకులానాడు లేనేలేవు బహుశః కథా రచనము నోటికి తుపాకులు వచ్చియుండును. ఇది వీరుడైన వారి ధర్మ వైభవం.

కోలాటములందును స్త్రీల పాటలందును సతీపతుల సంవాదరూపమున నున్న శృంగారగేయము లెన్నియో కలవు. వెంకటేశ్వర్లవేట, చెంచులక్ష్మిపాట సత్యభామా కృష్ణుల సంవాదము, పార్వతీశివుల సంవాదమువంటి పాట ఉదాహరణలు.

కృష్ణుని పేరుతో శిష్టులను జానపదాలను శృంగార సాహిత్యము సమృద్ధిగా సృష్టించిరి. ఇదియంతయు జావశీల శృంగారము ఒక జానపద కృష్ణుడు.

పడతి నువు నీళ్ళరి పది దినములాయె అలివేణిపాను వున ఒంటిగుండగలెను
కలికి కన్నులజూడవే ఆదిలక్ష్మి అందిముచ్చటలాడ వేయని బ్రతిమాలగానాయె
బాలింతరాలనయ్యా ముద్దులకృష్ణ బాలింతరాలనయ్యా.....

తెలంగాణమున కాముని పున్నమి సందర్భమున వెన్నెల రాత్రులందు గ్రామ లక్ష్మి శృంగార పారవంశ్యమున నుప్పొంగిపోవును. పిన్నలు పెద్దలు స్త్రీ పురుష భేదము లేకుండా వెన్నెల రాత్రులందు ఆటపాటలతో నిమగ్నుల గుదురు. కోలాటము పాటలు, జాజర పాటలు పాడుచు విచ్చలవిడిగా తిరుగుచుందురు. కాముని పాటలు శృంగారాత్మకములుగు వానిలో నొక్కటిటనుదహరింతును.

కాముడ కాముడా వలలో కట్టెకుపోంగా వలలో
కట్టకాళ్ళ బెనిగె వలలో గంగా రేగుముల్లు వలలో
.....

ఈ పాటయందలి కట్టకాళ్ళు, కంతా, వేజాదీ, శబ్దములు కడకాళ్ల, క్రంత విరజాడి శబ్దములకు జానపదరూపములు పాటయందు సంబోధింపబడిన కాముడు రతీప్రియుడో! లేదా సాధారణుడో! ప్రియుని కాముడాయని సంబోధించి ప్రియురాలు తనకు కడుకాల బెనగిన (విరిగిన) గంగరేగు ముల్లును తీయవలసినదిగా కోరుచున్నది. ప్రియురాలికి కలిగిన బాధను ప్రియుడు గుర్తించెను. ఆమెకు నిజముగనే ముల్లు విరిగినది. కాని ప్రియుడేమి చేయగలడు? అది విజన ప్రదేశము కాదుగదా ప్రియురాలి పాదమంటి ముల్లు దీయుటకు. అదియొక క్రంత అచ్చట ప్రజల మూకయుండును.

ఈ విధంగా అనేక విధాల జీవనవృత్తులలో మానవులు ధర్మాచరణము చేస్తున్నారు. అన్ని పురుషార్థాలు సాధిస్తున్నారు. జానపద సాహిత్యంలో నాటి నుండి నేటి వరకు మానవులు అనుభూతులు కష్టసుఖాలను చిత్రించిరి.

ఆధార గ్రంథాలు : తెలుగు జానపద గేయ సాహిత్యము - డా॥ బి.రామరాజు

జ్ఞానాదేవతుకైవల్యమ్

– శ్రీనేవి కాశీవజ్ఝల, శాఖాధిపతి, సంస్కృత విభాగం, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాద్.

అచారాత్ జాయతే ధర్మః ధర్మాదర్థశ్చ వర్ధతే ।
అర్థాత్ కామమవాప్నోతి కామాత్ మోక్షముచ్యతే ॥

నిరంతర సదాచారమే ధర్మానికి మూలము. నిరంతర ధర్మాచరణ వలన అర్థము (సంపద) సిద్ధిస్తుంది. ధర్మ బద్ధముగా సిద్ధించిన అర్థమును వినియోగించి ధర్మ బద్ధములైన కోరికలను నెరవేర్చుకోవలెను. ఈ విధమైన ఋజు ప్రవర్తనము మోక్షసాధనకు మార్గమును సుగమము చేయును.

మోక్షము అనగా ఏమి? :

ఈ జగత్తు పాంచభౌతికమైనది. జీవపరిణామక్రమాన్ని గమనించినట్లైతే-
'ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః । అగ్నేరాపః ।
అద్భ్యఃపృథివీ । పృథివ్యా
ఓషధయః । ఓషధీభ్యోన్నమ్ । అన్నాత్పురుషః । [1]

అనగా 'ఆకాశము నుండి వాయువు । వాయువు నుండి అగ్ని । అగ్ని నుండి జలము । జలము నుండి పృథ్వీ । పృథ్వీ నుండి ఓషధులు । ఓషధుల నుండి అన్నము । అన్నము నుండి పురుషుడు వృద్ధి చెందారు'. దీనిని అనుసరించి అవసరమైన అన్ని విషయాలు అమరిన తరువాతే జీవుని ఉత్పత్తి జరిగింది. ఐతే ఈ జీవుడు పుట్టుకకు ముందు ఎక్కడ ఉన్నాడనే ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానంగా జీవుడు ఆత్మ స్వరూపంగ పంచ భూతాలలో లీనమై విశ్వాంతరాళాలలో సంచరిస్తూ కర్మ విపాకం కలిగిననాడు పంచభూతతత్వాన్ని కలిగిన భౌతిక దేహంలోకి ప్రవేశిస్తాడు. అనంతరం తన పుట్టుకకు కారణమును మరచి విషయలోలుడై సుఖదుఃఖానుభవాన్ని పొందుతాడు. ఈ స్థితి నుంచి తిరిగి పుట్టుకకు ముందున్న స్థితిని అనగా ఆత్మస్వరూపాన్ని తెలుసుకోవడమే మోక్షము.

మోక్షము గురించి భిన్నాభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి. మోక్షము అంటే మరణానంతరము పొందునది అని, స్వర్గప్రాప్తియని జన్మరాహిత్యమని సామాన్యుల అభిప్రాయము. అయితే శ్రుతులననుసరించి స్వస్వరూప జ్ఞానమును కలిగి నంతర నిష్కళంక ఆత్మానంత ప్రాప్తియే మోక్షమని తెలియుచున్నది. స్వస్వరూప జ్ఞానమును పొందుటకు జీవుడు మొదట అంతర్ముఖుడై అవిద్యతో కూడిన శరీరమును, దానికి సంబంధించిన సుఖదుఃఖ భావాలను గుర్తెరిగి, వాటిని లక్షింపకుండా ఉండడానికి సాధన చేయాలి. ఈ స్థితిలో అశాశ్వతమైన సుఖ దుఃఖముల అనుభవము అవిద్య (అజ్ఞానము) వలన కలుగుతున్నదని గ్రహించగలగడమే మోక్షసాధనకి మొదటి సోపానం. అనంతరం ఆ సుఖదుఃఖ భావములు మనసునకు అంటకుండా సాధన చేయవలసి వున్నది. దానికై అవిద్యా నాశనము ముఖ్యము. అవిద్య నశించినపుడే స్వస్వరూపజ్ఞానము కలుగుతుంది. వీరిని సుఖ దుఃఖాలు, ప్రియాప్రియాలు, మానావమానాలు అనందాన్ని కానీ బాధను కానీ కలిగించవు. తామరాకుపై నీటిబొట్టువలె ఉంటారు. ఈ విధమైన స్థితిని నిరంతరం అభ్యసిస్తే అది మోక్షమార్గమును సూచిస్తుంది. అందుకే 'జ్ఞానాదేవతుకైవల్యమ్' అన్నారు పండితులు.

మోక్షమునకు మరియొకపేరు 'భూమా'[2], అనగా ఆత్మజ్ఞానము కంటే అన్యమైన విషయమందు ఆసక్తిని కలిసి ఉండకపోవటం.

'యత్ర నాన్యత్పశ్యతి నాన్యత్ శృణోతి, నాన్యద్విజానాతి స 'భూమా' యోవైభూమా తదమృతమ్.

ఏ జీవుడైతే అన్యమును చూడడో, వినడో, ఆ స్థితి 'భూమా', అదే అమృతతుల్యం. ఒక్కమాటలో చెప్పాలంటే అద్వైత భావన. జగద్గురు ఆదిశంకరులు చెప్పి

నట్టుగా 'అహం బ్రహ్మాస్మి', 'తత్వమసి' 'సర్వంఖల్వి దంబ్రహ్మ' అనే మహావాక్యాలను అనుసరించి మోక్ష మార్గము వైపు అడుగులు వేయవచ్చు. దీనికై సాధన చతుష్టయమును ఆచరించుట ముఖ్యము. అవి 1. వివేకము, 2. వైరాగ్యము, 3. షట్ సంపత్తులు, 4. ముముక్షుత్వము

వివేకము :

శాశ్వత అశాశ్వత జ్ఞానము వివేకము ద్వారా పొంద వచ్చు. జననమరణాలు ఈ భౌతికదేహానికి చెందినమే గానీ ఆత్మకు కాదు. అనే జ్ఞానమును కలిగి ఉండడమే వివేకము. సాధువచన శ్రవణము, వేదాంత సాహిత్య అధ్యయనము ద్వారా వివేకమును సాధించవచ్చు.

వైరాగ్యము :

లౌకిక వ్యవహారముల పట్ల ఆసక్తి లేకపోవడం వైరాగ్య మైనను అది శాశ్వతము కాదు. వివేకము వలన జనించిన వైరాగ్యమే శాశ్వతమైనది. అనగా ప్రాపంచిక విషయాల మధ్యే ఉంటూ వాటిపట్ల అనాసక్తిని కలిగి వుండటం. దీనికి ఎంతో సాధన అవసరం.

షట్ సంపదలు :

1. శమము, 2. దమము, 3. ఉపరతి, 4. తతిక్ష, 5. శ్రద్ధ, 6. సమాధానము- ఈ ఆరు సంపదలు జీవి మనో నిగ్రహణకు, క్రమశిక్షణ సాధనకు సహకరించె గుణ ములు. వీటి సాధనతోనే ఏకాగ్రత సిద్ధించి, ధ్యాన మగ్నులమవుతాము.

శమము : శమము అనగా అంతరింద్రియ నిగ్రహము, కోరికలను నశించపజేయడము వలన వచ్చిన ప్రశాంతత.

దమము : ఇది హేతుబద్ధమైన బాహ్యేంద్రియ నిగ్రహము.

ఉపరతి : ఇంద్రియ సుఖాల నుండి మనసును మరల్చి, మోక్షసాధన పైన మనసును లగ్నం చేయడం.

తితిక్ష: సుఖదుఃఖాలను సమభావనతో స్వీకరించే శక్తిని కలిగి ఉండడమే తితిక్ష

శ్రద్ధ : ఉపనిషత్తులచే ప్రామాణికంగా ప్రతిపాదింప బడిన విషయాలపై విరుద్ధభావన లేక గౌరవం కలిగి ఉండడం. ప్రామాణికములైన గురూపదేశ శ్రవణం మరియు వేదాన్తాది గ్రంథ పఠనం వలన కలిగేదే శ్రద్ధ.

సమాధానము : బ్రహ్మపై మనస్సును నిలిపి మనసు లోని ఆందోళనలను పారద్రోలి మానసిక అస్థిరతల నుండి విముక్తిని కలిగిస్తుంది.

ముముక్షుత్వము :

లౌకిక (అనగా వృద్ధాప్యం, రోగం, సుఖదుఃఖాలు, జననమరణాలు) విషయాలపై మనస్సును నిలుపకుండా ఉండగలగడం. దీనిని సాధించడానికి పరిపూర్ణ జ్ఞానియైన గురూపదేశం అవసరం. గురువు సహకారముతో అంతర్ము ఖుడై ఆత్మసాక్షాత్కారాన్ని చేసుకోవడానికి తీవ్రకృషి చేయాలి. ఆత్మసాక్షాత్కారాన్ని పొందడమే ముము క్షుత్వము.

ఈ సాధన చతుష్టయమును ఆచరించుట ద్వారా బ్రహ్మను తెలుసుకొనవచ్చు. 'బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి'[4] - బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మ అవుతాడు. ఆ స్థితియే మోక్షము.

❖ ❖ ❖

ధర్మబద్ధ కామం

– పూషడపు సుభ్భారెడ్డి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అవనిగడ్డ, కృష్ణా జిల్లా.

భగవంతుని మనోకామన నుండి ఈ సమస్త జగత్తు ప్రభవించినదని భారతీయులతోపాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు నమ్ముతున్నారు. సౌరకుటుంబంలో పాంచభౌతిక మైన ఈ భూవాతావరణంలోనే ప్రాణులు మనుగడ సాగించడానికి అవకాశాలు పుష్కలంగా ఉండటంతో ఇక్కడ అనంత జీవరాశికి ఆహార, విహారాలు సాధ్య మౌతున్నాయి. ఆహారచక్రం తదనుగుణంగా జీవితచక్రాల భ్రమణంలో ఎన్నో పరిణామ దశలు దాటుకొని జీవులు మనుగడ సాగిస్తున్నాయి. భౌమిక నియమాలకు లోబడి ఇక్కడ ఆయు: ప్రమాణాలు ఉంటాయి గనుక ప్రతి జీవి తన ఘనమైన వారసత్వ లక్షణాలను తరువాతి తరానికి అందించే ఏర్పాటు చేసుకున్నది. ఇందులో వృక్షాలు మొదలైన భూమిజములుగాక, చలనం కలిగిన మిగిలిన ప్రాణికోటి కొన్ని మానసిక భావనలు కలిగిఉండి, వాటి ప్రకోపాల కారణంగా తమను పోలిన సంతానాన్ని పొందుతున్నాయి. దీనికి ప్రేరణగా ఉన్న ప్రచోదనా శక్తినే మనమంతా కామం అంటున్నాం. ఆదిమకాలంలో మానవుడు దీనిని పొందే క్రమంలో తన సహచర జంతువులను అనుసరించాడు. బుద్ధి వికసించిన కొలదీ తన సర్వోత్కృష్టతను గ్రహించినవాడై, కొన్ని నియమాలకు బద్ధుడై, సంఘాన్ని ఏర్పరచుకున్నాడు. తొలినాళ్ళలో మానవ సంతతికి కూడా "తల్లి మాత్రమే నిజము-తండ్రి నమ్మకమన్న" సూత్రము వర్తించేది. నాగరికత నడకలు కుదుట పడ్డాక ప్రకృతి సహజమైన ఈ వాంఛలకూ, విషయ వాసనలకూ, విధి, నిషేధాలు నేల నాలుగు చెరుగులా అమలు చేయడం ప్రారంభమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే అవి నాగరికతకు, ఆటవికత్వానికి మధ్య తెరలా నిలిచాయి. అయితే నేటికీ స్వేచ్ఛా శృంగారం అనుభవిస్తున్న మానవ తెగలు ఉనికిలోనే ఉన్నాయి. కొన్ని రకాల పక్షులు, జంతువులు జీవితాంతం ఒకే భాగస్వామితో కలిసి ఉండటమూ మానవుణ్ణి ప్రేరేపించి ఉండవచ్చు. ఈ పద్ధతే కుటుంబవ్యవస్థ, రాజ్యవ్యవస్థ వటవృక్షాల్లా వేళ్ళూనడానికి మూల భూతమయ్యింది.

భారతీయుల దృష్టిలో కామము :

కామం అనే పదానికి మన దేశభాషలలో సంకేతార్థాలు, నానార్థాలు ఎన్నున్నా దాని రూఢ్యర్థం మాత్రం శృంగారోద్దీపన భావన మాత్రమే. భారత ఉపఖండంలో మానవుల ఆలోచనలను గట్టిగా ప్రభావితం చేసి, వారిని మోక్షపథగాములను చేయడానికి తొలిగా పూనుకున్నది వేదసాహిత్యము. ఆపై వచ్చిన ఇతిహాస వాఙ్మయం లోకోత్తరమైన సంస్కారాలకు రాచబాట పరిచింది. యాజ్ఞవల్క్య, మను, గౌతమ, నారద, పరాశరుల పేరుతో స్మృతులు వెలువడ్డాయి. దేశకాలమాన పరిస్థితులలో వచ్చే మార్పులకనుగుణంగా కట్టుబాట్లను సవరిస్తూ "దేవల స్మృతి"లాంటివి రూపుదిద్దుకున్నాయి. ఇవన్నీ సాంఘిక నియమాను శాసించాయి. వర్ణం, వర్ణాశ్రమ ధర్మాల పేరుతో శ్రమవిభజన జరిగాక పురుషార్థాల సాధన కోసం గృహస్థులంతా ప్రయత్నాలు మొదలుపెట్టారు. భారతీయ వాఙ్మయోద్ధారకులైన ఋషుల అభిమతంలో కామం అంటే సృష్టిరథానికి ఇరుసులాంటిది. దానికి చక్రాలు భార్యాభర్తలు. వీరు ధర్మాన్ని ఆచరిస్తూనే అర్థాన్ని సంపాదించే సామర్థ్యాన్ని నైపుణ్యాలను పొందాక, ధర్మబద్ధంగా కామాన్ని అనుభవించినట్లయితే వారికి మోక్షం కరతలామలకమౌతుంది. అంటే పురుషార్థాలన్నీ ధర్మం ప్రాతిపదికనే సాధించవలసి ఉంటుంది. సమస్త జంతుకోటి ఋతుకాలము నందు సుఖం కోసం సంగమించడం వలన సంతానాన్ని పొందుతున్నాయి. మిగిలిన కాలం విడివిడిగానే ఉంటాయి. మానవులు సుఖం కోసమే సంభోగిస్తున్నారు కానీ వారికి నియమిత కాలం లేదు.

నిత్యమూ భోగము అనుభవించే స్థితి మనకున్నది. ఇది ఎన్నో అనర్థాలకు, సమాజంలో సంక్షోభాలకు హేతువవ్వ డాన్ని గమనించిన మహర్షులు గృహస్థాశ్రమ ధర్మాన్ని పాటిస్తూనే మోక్షసోపానాలు ఎలా అధిరోహించవచ్చో ఆచరించి చూపించారు. "సంతానం కోసమే సంభోగమని" అట్టి నియంత్రణ పాటించలేనివారు పరిమిత భాగ స్వామ్యంగా దీనిని పొందవచ్చునని కట్టడిచేశారు. అది మెల్లగా ఏకభాగస్వామ్యంగా మారింది. కామ్యాలు ఈడేర్చుకునే క్రమంలో "కంచుకోటలులాంటి ఈ కట్టు బాట్లు తరచూ మంచులా కరిగిపోతున్నాయని" మన వాళ్ళు గుర్తించడానికి ఎంతోకాలం పట్టలేదు. అందుకే ఏకపత్నీ వ్రత ధర్మానికి విశేష మర్యాదను కల్పించి, మిగిలిన పద్ధతులన్నింటినీ నిరసించారు. విశృంఖల శృంగారాన్ని హేయమని నిషేధించారు. కొన్ని స్థానికా చారాలను మన్నిస్తూనే, స్థూలంగా స్త్రీ, పురుష సంబంధా లను ఆదర్శవంతం, ఆరోగ్యవంతం చేయడానికి చాలా తరాలు పట్టింది. "గలగల పాఱేనదిలో నీటిని యధేచ్ఛగా దోసిళ్ళుపట్టి త్రాగేంత తేలికగా ఉన్న విధానాలు పోయి, ఆ నదీ ప్రవాహాలే భూమిలో ఇంకి, బావులలో ఊటగా పొంగి వచ్చినపుడు, ప్రయత్నపూర్వకంగా తోడి, పాత్రలలో సేకరించి, నిర్మలోదకమైన తర్వాత త్రాగడం శిష్టవ్యవ హారమై కీర్తించబడింది".

అనిర్వచనీయమైన ఆనందానికి హేతువైన కామానికి సంఘజీవనంలో అదుపు, పాదుపు అవసరమయ్యాయి. మానవుణ్ణి పతనమనే పాతాళబిలాల్లోకి నెట్టే అరిషడ్వర్గాలలో కామానికి ప్రథమ తాంబూలం ఇవ్వ బడింది. అదిమొదలుగా దాని వలన అష్టకష్టాలు పడి నాశనమైన ధీరోదాత్తులు, నారీశిరోరత్నాల చరితలు పురాణగాథలుగా ప్రచారంలోనికి వచ్చాయి. కోరికల్ని దండించాలని, కామాన్ని జయించాలని వేదాంతం అప్ప టికే గట్టిగా హెచ్చరికలు జారీచేసింది. కామ, క్రోధ, లోభాలు మూడూ నరకద్వారాలని, కామాన్ని అదుపులో పెట్టుకోకపోతే మానవుని బుద్ధి నాశనమౌతుందని భగ వంతుడే భక్తునికి గీతగా చెప్పవలసివచ్చింది.

ఇదంతా నాణానికి ఒక ప్రక్క, మరోప్రక్క జిజ్ఞాసువులైన పండితులు మానవ శరీరధర్మాలు, ఆరోగ్యసూత్రాలు, భోగానుభవ మార్గాలు గురించి తమకున్న దక్షత, వ్యవ హారజ్ఞానంతో కామ కళానైపుణ్యాలను, ఏర్చి, కూర్చి కామ శాస్త్రాలను వ్రాయడం ప్రారంభించారు. బ్రహ్మచే నిర్మించ బడిన బృహత్‌శాస్త్రంలో ఒక భాగాన్ని 14మంది మనువు లలో చేరని, మనువనే మహాపురుషుడు కామ శాస్త్రంగా వ్రాశాడు. దానిని నందీశ్వరుడు వెయ్యి అధ్యా యాలతో విపులంగా ప్రకటించాడు. ఇది బహు విస్తారంగా ఉం డటం చేత ఉద్దాలకముని పుత్రుడు శ్వేతకేతువు (ఔద్దాల కుడు) 500 అధ్యాయాలుగా సంక్షిప్తీకరించాడు. బభ్రుసుతుడు బాభ్రవ్యుడు దానిని మరింత తగ్గించాడు. పాటలీపుత్రవాసి దత్తకాచార్యుడనేవాడు పై గ్రంథంలో "వైశిక ప్రకరణ" మును ఒక ప్రత్యేక గ్రంథంగా వ్రాశాడు. బాభ్రవ్యుని గ్రంథం ఆధారంగానే కౌటిల్యుడను నామాం తరంగల ఆర్య చాణక్యుడు నేటికి 2,400సం॥ క్రితం అర్థశాస్త్రంతోపాటు కామశాస్త్రమునూ అనితర సాధ్యంగా కూర్చాడని పండితులంతా నేడు నమ్ముతున్నారు. అయితే అది వాత్స్యాయనంగా ప్రసిద్ధి పొందింది. ఈ రెండు గ్రంథాలూ తమ తరువాత సృజింపబడిన అపార సంస్కృత సాహిత్యంపై చెరగని ముద్రవేశాయి. వాత్స్యాయన కామ సూత్రం 7 అధికరణాలుగా వ్రాయబడింది. ఇందులో ధర్మార్థ కామాలను ఎలాసేవించాలో చెప్పే "త్రివర్గ ప్రతి పత్తి" విపులంగా చర్చింపబడింది. కామం కంటే అర్థము, అర్థము కంటే ధర్మమూ గొప్పవని, కామాన్ని తీర్చుకోవ డానికి ధర్మార్థాలను విడనాడకూడదని వాత్స్యా యన కారుని అభిమతం. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమ ధర్మాలు క్రమంగా అనుసరించేటట్లు చేయడానికి దేశమేలే ప్రభువు కృషి చేయాలి. దీనినే "లోకయాత్ర" అంటారు. దీనిని పాటించక దేవ, మానవ లోకములలో కామానికి దాసులై దేవేంద్రుడు, కీచకుడు, రావణుడు ఎలా పతనమయ్యారో కూడా ఈ గ్రంథమే

వక్కాణించింది. "పంటలను ఆశించే కీటకాలు మిక్కుటంగా ఉన్నప్పటికీ మనం పంటలు పండించడం ఎలా మానమో, అలాగే దోషాలను అధిగమించి సుఖాలను పొందడం బుద్ధిమంతుల లక్షణమని వాత్స్యాయను డంటారు. ఈ గ్రంథం ఆధారంగా కొక్కోకుడు సంస్కృతంలో నేటికి వెయ్యేండ్ల క్రితం "రతిరహస్యమ్" వ్రాశాడు. అది ఆంధ్రదేశంలో మరెన్నో గ్రంథాలకు ప్రేరణనిచ్చింది.

ముగింపు :

భారతీయుల దృష్టిలో స్త్రీ, పురుష సంయోగం పవిత్రమైన సృష్టికార్యం. పితృఋణమును తీర్చుకోవడం కోసం మానవుడు సాగించే ఒక యజ్ఞవిధి. చతుర్విధ పురుషార్థాలు సాధించడానికి కావలసిన దివ్యదేహాన్ని ఈ ప్రక్రియ ద్వారానే మనం పొందుతున్నాము. ధర్మమనే చట్రంలోనే దీనిని పొందినప్పుడు మానవుడు మహనీయుడౌతాడు.

ఉపయుక్తగ్రంథసూచి :

1. అర్ధశాస్త్రము - బాలానందినీ వ్యాఖ్య - మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు - 2013
2. వాత్స్యాయన కామసూత్ర వ్యాఖ్యానము - శ్రీధర శ్రీరామకృష్ణ - 2003
3. భగవద్గీత - మల్లాది లక్ష్మీనరసింహశాస్త్రి వ్యాఖ్యానము - 1992
4. నా స్వీయపరిశీలనలు

❖ ❖ ❖

వేయి పడగలలో పురుషార్థం – ధర్మం

– అవధానం సుజాత, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సిటీ కాలేజి (ప్రభుత్వ), హైదరాబాద్.

మానవ జీవితానికి పురుషార్థములు ప్రధానమైనవి. పురుషార్థములు 4. ధర్మ, అర్థ, కామ, మోక్షములు. వీటిలో ధర్మం ప్రధానమైనది. ధర్మంతో కూడిన అర్థం, ధర్మబద్ధమైన కామమము, మోక్షాన్ని ఇస్తాయి. ధర్మం లేని జీవితం కష్టాలపాలే. భారతీయ సంస్కృతికి ఈ పురుషార్థములు ఆలంబన అని చెప్పవచ్చు.

ధర్మశబ్దము దృధాతుజన్యము :

ధర్మ శబ్దము విధి ప్రకృతి దానము మొదలైన అనేకార్థములతో చెప్పబడుతుంది. అదేగాక "ధర్మా-ధరణే అను ధాతుద్ర నుండి ధరించునది అని అర్థము. "వేదములకు విరుద్ధముగాని ఆచారమే ధర్మము" అని చెప్పవచ్చు.

యజ్ఞవల్క్యస్మృతి "యజ్ఞము సచ్ఛీలము, దమము. అహింస, దానము, స్వాధ్యాయము" అను కర్మలే పరమ ధర్మము. ధర్మంకోసం తమ ప్రాణాలు అర్పించిన వీరులెందరో ఉన్నారు. రాముడి ప్రభుధర్మం కోసమే సీతను వనమాసాలకు పంపినాడు. భీష్ముడు ప్రభు ధర్మాన్ని పాటించి, కౌరవులను వీడక, చివరి వరకు వారి తోనే ఉన్నాడు.

భగవద్గీతలో మొదటి అధ్యాయంలోనే కురుక్షేత్రం ధర్మక్షేత్రంగా చెప్పబడింది. ఈ విధంగా ధర్మం విశిష్టమైన దని తెలియుచున్నది. ధర్మం అంటే ఒక ఆచరణ, ఒక క్రమశిక్షణ, ఒక జీవన విధానం. మనిషే మనిషిగా జీవించ డానికి ఒక కొలమానం.

ధర్మవ్యాధుని వృత్తాంతం, హరిశ్చంద్రోపాఖ్యానం, నలోపాఖ్యానం, శకుంతలోపాఖ్యానం ఇవన్నీ కూడా ధర్మనిష్టకు కట్టుబడిన వారు. చివరకు విజయాన్ని సాధిస్తారని తెలుపుతున్నాయి.

ప్రతిభాశాలి – విశ్వనాథ :

ప్రతిభాశాలి విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలి. జ్ఞానపీఠ బహుమతి పొందిన అఖండ ప్రతిభాశాలి. నవ్య సంప్రదాయ ప్రయోక్త శ్రీ విశ్వనాథ సత్యనారాయణ భారతీయ సంప్రదాయ పునఃరుద్ధరణనే ధ్యేయంగా 1934లో రచించిన నవల వేయిపడగలు. వీరు అనేక ప్రక్రియలను అనగా నవల, నాటకం, కథ శతకం, విమర్శ, ఖండకావ్యాలు మొదలగు ప్రక్రియలను రచించారు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షానికి జ్ఞానపీఠ బహుమతి లభించింది. ఈ రచన తెలుగు సాహితీ కల్పవృక్షము. విశ్వనాథ రచించిన స్మృతి రచనలలో వరలక్ష్మీ త్రిశతి, గేయాలలో కిన్నెరసాని పాటలు, నాటికల్లో గుప్తపాశుపతం, త్రిశూలం, వేనరాజు నవలల్లో వేయిపడగలు, ఏకవీర, చెలియలికట్ట, పురాణ వైర గ్రంథమాల మొదలైనవి ప్రసిద్ధమైనవి. ఆంధ్ర ప్రశస్తి అనే కావ్యం ద్వారా వీరు దేశభక్తిని చాటారు.

విశ్వనాథ వారు మంచి విమర్శకులు. నన్నయ గారి ప్రసన్న కథా కవితార్థయుక్తి అనే రచన వీరి విమర్శనా ప్రతిభకు నిదర్శనం. వీరి రచనల్లో భాష విలక్షణమైంది. సామెతలు, నానుడులు, పలుకుబళ్లు, జాతీయాలు, ప్రతీకలు పదబంధాలతో నిండి ఉంటుంది. సమకాలీన అంశాలను సామాజిక పరిస్థితులను భారతీయ సంస్కృతిని తమ రచనల్లో నిక్షిప్తం చేసారు. నేటి తరానికి అవి అక్షయపాత్రలు. ముఖ్యంగా వీరి రచనల్లో ధర్మ నిబద్ధత, ధర్మాచరణ మానవీయ విలువలు కనిపిస్తాయి.

వేయిపడగలు – వైశిష్ట్యం :

ఆంధ్రవిశ్వకళా పరిషత్తు నిర్వహించిన నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందినది. ఈ నవలను విశ్వనాథ ఆశువుగా చెబుతుంటే విశ్వనాథ వెంకటేశ్వర్లు వ్రాసారు.

18 రోజులలో పూర్తి చేసారు. 999 పుటలు ఉన్నాయి. ఈ నవల స్వర్ణోత్సవ, వజ్రోత్సమును జరుపుకొని 85 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నది. ఆంగ్లం, హిందీ, సంస్కృతం ఇతర భాషలలోకి అనువదింపబడింది. ఆనాటి ఆంధ్రపత్రికలో ధారావాహికంగా వెలువడింది. అని మొదలినాగభూషణ శర్మగారు అన్నారు.

తెలుగు నవలా వికాసంలో వేయి పడగలు గూర్చి ''వేయిపడగలు సర్వభారతీయాత్మకు వ్యాఖ్యానం వంటిది'' అన్నారు.

వేయిపడగల్లో ప్రధానంగా ప్రాచీన, పాశ్చాత్య సంస్కృతుల మధ్య సంఘర్షణ, అంతరించిపోతున్న విలువలను విశ్వనాథ వర్ణించారు.

సుబ్రహ్మణ్య స్వామి తన వేయిపడగలతో భూభారాన్ని వహిస్తున్నారని పురాణోక్తి. అంటే ధర్మం సహస్ర ముఖంగా వ్యాపించాలని విశ్వనాథ ఈ నవలకు వేయిపడగలు నామౌచిత్యం చేసారు.

వేయిపడగలలో ధర్మం :

ఈ నవలలో ధర్మానికి ప్రతీకగా ధర్మారావు పాత్ర చిత్రించబడినది. ''ధర్మం, తదాచరణ, సదాచారము మూడును. ఒకటిగానై ఆయాభేద తాదాత్మ్యము పొందుచూ స్వామియు, ప్రభువును, ధర్మారావును నేక దేశగతులై ప్రకాశించిరి''.

ఈ నవలలో పైన భగవంతుడు, క్రింద రాజును బ్రాహ్మణుడును, ఈ రెండు మహాసంస్థలకును, మధ్య గణాచారి త్రెంచరాని లంకె... ఇది నాలుగు స్తంభముల ధర్మమంటపము, స్వామి, జెమీందారు, బ్రాహ్మణుడు, గణాచారి వీరు నాల్గురు స్తంభములు.

ఈ మంటపములో సుబ్బన్నపేట ప్రజలు మహోత్సవములు చేయుచుందురు. ధర్మార్థకామమోక్షములను అరటి చెట్లు కట్టిన యీ నాల్గుస్తంభములు నిత్యము శుభచిహ్నములై పచ్చనై శోభనహేతువులై యుండెను. ఈ ధర్మమంటపము నిత్యకళ్యాణము పచ్చతోరణముగా, మూడువందల యేండ్లు నిరంతరముగా అవ్యహితముగా శోభాయమానమై యొప్పెను. ఈ మూడువందల యేండ్లలో వేయిపడగలతో భాసించిన నాగేశ్వరస్వామి, సుబ్బన్నపేట మీద తన సహస్రఫణామండలి ఛత్రముగా చాచి, ఆ చల్లని నీడలో ఆ యూరి ప్రజల జోకొట్టెను. వారును ధర్మమోక్షములు మధ్యన ఊగుచున్న అర్థ కామములను ఉయ్యెలలో సుఖనిద్ర కాంచుచుండిరి.

ఇన్నినాళ్లు స్వామి పడగలు ప్రజలకు చల్లనీడ నిచ్చుటకు విరిసెను కాని, కాటువేయుటకు విరియలేదు. స్వామి రెండువేల కన్నులు, ధర్మముచేత బొండుమల్లెలు విరిసినట్లున్న నాల్గుదిక్కులు తనివితీర చూచుచు, ప్రశాంతజ్యోతిస్సులు విరజిమ్మెను.

ప్రభుధర్మము :

ప్రభవు ప్రజలకు ప్రతినిధి. ప్రజల కష్టసుఖాలను చూసుకోవాలి. ప్రజలకు అండదండగా నిలవాలి. వేయి పడగలలో కృష్ణమనాయుడు ప్రభువు. కోటలోకి ప్రజలు యదేచ్ఛగా వేళ్లేవారు. పంటలు పండకపోతే రైతులు శిస్తు వచ్చేనాటికి కట్టవచ్చు నిర్భందము లేదు. అన్ని విధాల ప్రజలకు రక్షణగా ఉండేవారు.

ధర్మో రక్షతి, రక్షితః అన్నారు పెద్దలు. భీష్ముడు అంపశయ్యపై ధర్మమును రక్షించినపుడే సమాజము రక్షింపబడును. కృష్ణమ నాయుడు ప్రజలను కన్నబిడ్డలుగా చూసే వాడు. వారి కష్టసుఖాలలో పాలుపంచుకునే వాడు. ఒకసారి కోటలో దొంగతనం చేస్తూ పిల్లలు పట్టుబడితే వారిని దండించక కావలసిన తినుబండారాలిచ్చి పంపివేసారు. రైతులకు కూడా ధాన ధర్మాలు చేసేవాడు. స్వామి కళ్యాణోత్సవాలను వైభంగా జరిపించేవాడు. కృష్ణమ నాయని పాలనలో ప్రజలు రామరాజ్యాన్ని చవిచూసారు.

దాంపత్య ధర్మం :

భారతీయ సంప్రదాయంలో అతి పవిత్రమైనది దాంపత్యధర్మం. దాంపత్యధర్మం సక్రమంగా ఉన్నపుడే వ్యవస్థ రక్షింపబడుతుంది.

అరుంధతి, ధర్మారావుల ద్వారా దాంపత్యధర్మం వివరించబడింది. నవలలో "నీవు మిగిలితివి" ఇది నా జాతిశక్తి అన్న వాక్యాల ద్వారా దాంపత్య ధర్మం రక్షించబడింది అని చెప్పబడింది. ధర్మారావు ఒకసారి రెండు తలల నాగేంద్రుడు దర్శనమిస్తాడు. దాంపత్య ధర్మానికి ప్రతీకగా విశ్వనాథ ఈ వర్ణన చేసారు. ధర్మారావు చిన్న అరుందతిని వివాహం చేసుకుంటాడు. స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతాన్ని విశ్వనాథ ఖండించారు.

నవల ప్రారంభంలో "వేయిపడగల పాము విప్పారు కొనివచ్చి కాటందుకొన్నది. అని చెప్పడం కలలోన "రాజును" అని చెప్పడం ధర్మానికి చ్యుతి కల్గిందని సూచించారు. ఈ నవలలో ప్రాచీన ధర్మం, ధర్మానికి జరుగుతున్న లోపాలను ఆధునిక సంప్రదాయ ధోరణులను అవి సంఘానికి చేస్తున్న హానిని సూచించారు.

సేవాధర్మం :

గోపన్న, కృష్ణమనాయుని ఇంటి కోటలో సేవకుడు. ప్రభువైన కృష్ణమనాయుని అన్ని విధాల సేవిస్తూ, మంచిని తెలిపేవాడు. ధర్మారావు కష్టాలలో ఉన్నపుడు అతని గూర్చి ప్రభువును చెప్పి సహాయం చేయిస్తాడు. ప్రభువు చనిపోగానే అతని కుమారుడు రంగారావు రాజవడం, ఆధునిక పోకడలు గోపన్నను కలవరపరుస్తాయి. లక్ష్మణస్వామి ఏనుగు చనిపోగానే కొత్తరాజు రావడంతో కోటలోని పరిస్థితులు మారడంతో అతను తట్టుకోలేక చనిపోతాడు.

ధర్మారావు తండ్రి చనిపోయినపుడు గోపన్నకు తన స్థితి గూర్చి ఒక ఉత్తరం రాసి గోపన్నకు ఇచ్చి జమీందారు కిమ్మనెను. కానీ మరల ఆ ఉత్తరం తీసుకొని చింపి వేసెను. కాని గోపన్న జమిందారుకు ఓ రోజు తిలకం దిద్దుతూ ధర్మారావు ఉత్తరమిచ్చి, తిరిగి చింపివేసిన సంగతి చెప్పెను. "యెంతవారి కెంత యిక్కెట్లు వచ్చినవి. ఇంగువ కట్టిన గుడ్డ వాసన ఎక్కడికి పోవును". పులికడుపున మేక పుట్టునా! వారి వంశములో తక్కువవాడేల పుట్టును! అని,

"తమరు ధర్మారావు గారి కేదో దారి చూపించనిచో నాకుఖ్యాయన ఏమగును? ఆయన చెడిపోవుట మనకు మాత్రము క్షేమమా! మీరు, వారు (రాజు, మంత్రి) సుబ్రమణ్యేశ్వర స్వామి గణాచారి మీరందరు ఒకటేనని జనము చెప్పుకొందురు. మీతో మీకు తగాదాలు రారాదు. ఇందులో గొందరు జెడిపోయినచో దక్కిన వారికి పొత్తు కలిసి యుండునా! వారికి మీరు సాయపడుట భగవంతునకు కూడ ఇష్టమైనది ప్రభుధర్మం. అని గోపన్న తన సేవా ధర్మాన్ని మరువక ప్రభువు ద్వారా సహాయం చేయించెను.

ఈ నవల్లో ధర్మారావు స్వామి కళ్యాణోత్సవాలను చేయించెను. గిరికకు భక్తిమార్గంను నేర్పి ఆమె ద్వారా దేవదాసీ వ్యవస్థకు ఒక పవిత్రతను ఆపాదించెను. హరప్పకు యోగమార్గంను నేర్పెను. పెద్దల కర్మఖాండలను చేయించి, అతని ద్వారా హిందూ సనాతన ధర్మంను నిలిపెను. సాంప్రదాయ విద్యలు, కుల విద్యలను రక్షించాలని ఆంగ్ల విద్యలకు సమాంతరంగా, సనాతన ఆర్ష విద్యలను నేర్పు జాతీయ కళాశాలలను ప్రోత్సహించెను.

ఈ నవలలో ధర్మారావు తండ్రి రామేశ్వర శాస్త్రి నాలుగు వర్ణముల వారిని వివాహమాడెను. బ్రాహ్మణ, క్షత్రియ, వైష్య, శూద్ర కన్యలను వివాహమాడి వారి ద్వారా సంతానంను పొందెను. ఆ సంతానం ద్వారా వారి వర్ణాశ్రమ ధర్మాలను రక్షించాలన్నదే ఆయన ఆలోచన ఈ నవలలో పసరికను గార్డినర్ దొర తన దేశానికి తీసుకుపోతుంటే ధర్మారావు అడ్డుకొని పైరు పచ్చదనానికి ప్రతీక. మా పసరికి విడిచి పెట్టండని ఇది మా జాతి సంపద అని చెబుతాడు. ఈ విధంగా విశ్వనాథ వేయిపడగలు నవలలో ధర్మం యొక్క రూపాన్ని విస్తృతంగా వర్ణించారు.

❖ ❖ ❖

పోతన భాగవతంలో మోక్ష మార్గం

– డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ, తెలుగు శాఖాధ్యక్షులు, తెలుగు విభాగం, సెంట్ ఆన్స్ మహిళా కళాశాల, మెహదీపట్నం, హైదరాబాదు.

కర్మ, జ్ఞాన, భక్తిమార్గాలలో సకల జనులకు సులభ మయినది భక్తి మార్గం. తద్వారా ముక్తిని పొందడాన్ని భాగవతం బోధిస్తుంది. మానవ జీవిత లక్ష్యం మోక్షాన్ని సాధించడం. మోక్షము జ్ఞాన రూపంలో ఉంది. చిత్తశుద్ధి ఉన్నవారికి మాత్రమే జ్ఞానం లభ్యమవుతుంది. ఆత్మజ్ఞానం లేకుండా ఎంత భక్తిని సంపాదించిననా మోక్షం రాదు. పుణ్యం మాత్రమే వస్తుంది. ఆ పుణ్య ఫలంతో ఊర్ధ్వ లోకాలకు పోయి అక్కడ సుఖభోగాలను అనుభవించి పుణ్యము తీరిపోగానే తిరిగి భూలోకంలో మరల జన్మించవలసిందే. "మోక్ష సాధన సామగ్ర్యాం భక్తి దేవ గరీయసి" అని మోక్ష సాధన సామగ్రిలో భక్తికి గొప్ప స్థానం ఇచ్చారు ఆది శంకరులు. భక్తితో అంటే ఆత్మ జ్ఞానంతో ఆ మహావిష్ణువును ఎవరు స్మరిస్తారో వారికి ఆ దేవదేవుడు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. తనలోకి ఐక్యం చేసు కుంటాడన్నమాట. ఆంధ్ర మహా భాగవతంలో పలు ఘట్టాల్లో మోక్షానికి మూలం భగవన్నామ స్మరణే.

భగవంతుడు సర్వాంతర్యామి. ఎచ్చోట ఉన్నా మన మొరలు విని మనల్ని రక్షించే దేవదేవుడతడు. దానికి ఒక గొప్ప ఉదాహరణ గజేంద్రమోక్ష ఘట్టమే. విర్ర వీగుతూ వనవిహారానికి బయలు దేరిన ఒక మత్తేభము దాహార్తితో సరస్సులోకి దిగింది. దప్పిక తీర్చుకోవడంతో సరిపెట్టుకోక తన బృందంతో కలసి ఆ కాసారాన్ని కకా వికలం చేసింది. ఆ మదగజం ఆగడాలన్నింటినీ మడుగు లోని ఒక మొసలి గమననించసాగింది. కొంత సేపటికి అదను చూసి ఒక్కసారిగా ఆ కరిరాజుపై విజృంభించింది. హుంకారం చేస్తూ కుప్పించి దాని కాళ్లను పట్టుకుంది. కరి మకరి ఒకదానిపై మరొకటి దాడి చేసుకోసాగాయి. తొలుత ఎంతో ఆత్మ విశ్వాసంతో అలుపెరుగకుండా సమరం సాగించిన ఆ కరీంద్రుడికి క్రమేణా ధైర్యం సన్నగిల్లింది. గుండెల్లో భయం పొడచూపింది. అప్పుడు దానికి ఆ పరమాత్మ మనస్సులో మెదిలాడు.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై... శరణు వేడెదన్"

ఈ లోకం ఎవరి వల్ల పుడుతుందో, ఎవరితో కలిసి ఉంటుందో, ఎవ్వని లోపల లయమవుతుందో, ఎవరు పరమాత్ముడో, ఎవరు ఈ విశ్వానికి మూలకారణమో, ఎవరు పుట్టడం గిట్టడం పెరగడం లేకుండా ఉంటాడో, ఎవరు అన్నీ తానై ఉంటాడో అటువంటి ప్రభువైన భగవంతుణ్ణి నేను శరణు వేడుతానని నిర్ధారించుకుంది.

ఆపద కాలంలో ఆ ఆశ్రిత పాలకుడు గుర్తుకు రావా లంటే గత జన్మల్లో ఎంతో పుణ్యం చేసుకోవాలి. గజేం ద్రుడు గత జన్మలో ఇంద్రద్యుమ్నుడు అనే మహారాజు. అగస్త్య ముని శాపం మూలంగా తమోగుణం కలిగిన మత్తేభంగా జన్మనెత్తాల్సి వచ్చింది. అయినా పూర్వ జన్మ సంస్కారాలు చిత్తం నుంచి చెదరిపోలేదు. ఆ ఫలితంగానే కమలనాభుడు తన ఆత్మలోకి వచ్చాడు.

"కలడందురు దీనులయెడ కలడందురు పరమయోగి... కలడో లేడో"

దేవుడు ఆర్తులైన వారి వెంట ఉంటాడంటారు. ఉత్తములైన యోగుల చెంత ఉంటాడంటారు. అన్ని దిక్కులలోనూ ఉంటాడని అంటారు. 'ఉన్నాడు ఉన్నాడు..' అనే దేవుడు మరి ఉన్నాడో లేడో అని సందే హించాడు. గజేంద్రుని మొర ఇలా విన్నప్పుడు విష్ణువు కాపాడాలని బయలుదేరి వెనుదిరిగి వచ్చేశాడు. గజేం ద్రుడు ఆ పరమాత్మను సందేహించినందు వల్లే శ్రీమహా విష్ణువు స్పందించలేదు. 'కలుగడే నా పాలి కలిమి..' ఇక సందేహించడమెందుకు? 'కలిమి లేములు లేక కలుగు వాడు..' అని తీర్మానించుకున్నాడు. కరుణాంతరంగుడైన

ఆ కమలలోచనుడు భక్తులు కలిగినవారా మరి లేనివారా అని చూడకుండా కాపాడుతాడన్న నమ్మకంతో ప్రార్థించాడు.

ప్రాణాపాయ స్థితిలో ప్రతి ఒక్కరూ గజేంద్రుని వలె నిరాసక్తులై ఉంటారు. కానీ గజేంద్రుని వలె ఎంతమంది శ్రీహరిని ప్రార్థించగలరు? ఆపత్కాలాల్లో అందరూ ఆ పరమాత్ముని వేడగలరా? కనుక నిరంతరం భగవన్నామ స్మరణ చేయడం అభ్యసిస్తే ఆపద సమయంలో భగవంతుడు స్ఫురణకు వస్తాడు.

పోతన భాగవతంలో సప్తమ స్కంధంలో -

"ఎట్టి వారికైనా నేకాంతులకునైనా వచ్చి చొరగరాని వాసుదేవు
తత్త్వమందు జేరి ధరణీశుడహితుడై, ఎట్లు సొచ్చె మునివరేణ్యా! నేడు"

ధర్మరాజు నారదుణ్ణి ఒక ప్రశ్న వేశాడు.. ధర్మ మర్మజ్ఞా! నాకొక పెద్ద సందేహం కలిగింది. మహానుభావుడైన వాసుదేవునిలో ప్రవేశించగలగడం ఎటువంటి పుణ్యాత్ముల కైనా వీలు కాదే, ఎటువంటి తేజస్సుకైనా ప్రవేశించే శక్తి ఉండదే, అటువంటిది శత్రువైన శిశుపాలుడు ఆ మహాసౌభాగ్యమును ఎలా పొందగలిగాడు స్వామీ.. విష్ణువును నిత్యం నిందించడమే కదా! మరి ఇది ఎలా సాధ్యమైంది?"

ఈ ప్రశ్నకు నారదుడు..

''అలుకనైన జెలిమినైన గామంబుననైన... వేరుసేయడతడు"

'ధర్మనందనా.. కోపంతో గానీ, కోరికతో గానీ, స్నేహంతో గానీ, మోహంతో గానీ, శత్రుత్వంతో గానీ, ప్రీతితో గానీ, భీతితో గానీ, ఏ విధంగానైనా సరే.. హరిని ఏమరకుండా స్మరిస్తున్నట్లయితే సర్వ భూతాత్మకుడైన విష్ణుదేవుని సన్నిధానము లభ్యమవుతుంది. ఆ స్వామి ఎవరినీ ఎప్పుడూ పరునిగా చూడడు..' అని మరలా ఇలా అన్నాడు.

''వైరానుబంధనంబున జేరిన చందమున... నా చిత్తమునన్"

ఆ విష్ణువును విశృంఖలమైన విరోధంతో చేరటం కంటే భక్తితో చేరడమే కష్టమనిపిస్తుంది. అనురాగంతో చేసే ఆరాధనకంటే, ద్వేషంతోనే భగవంతుణ్ణి పొందవచ్చేమోనని నాకు అనిపిస్తున్నది అని నారదున్నాడు. అధికమైన కామంతో గోపికా భామలు, భయంతో కంసుడు వెనుదీయని వైరంతో శిశుపాలుడు, దంతవక్త్రుడు మొదలైన రాజులు, అనుబంధం పెంచుకున్న యాదవులు మొదలైన వారు ఆ స్వామి అనురాగానికి పాత్రులవడం సాధ్యమైందంటే నిరంతరమైన స్మరణం వల్లే!

సనక సనందనాది మునీంద్రులు ఎంతో నిగ్రహం కలవారు. ఒకసారి వారిని శ్రీహరి సన్నిధికి పోనీయక ద్వారపాలకులు అడ్డుకున్నారు. దాంతో వారు వెంటనే కోపానికి గురయ్యారు. ఆ ద్వారపాలకులను రాక్షసులై పుట్టండని శపించారు. ఈ హఠాత్పరిణామానికి ద్వారపాలకులు పదవీ భ్రష్టులై దు:ఖంతో పశ్చాత్తాపంతో మునులను శరణు వేడారు. వారి దు:ఖం చూసి ఆ మహాత్ముల సుకుమారమైన మనసు ద్రవించింది. "మీకు మూడు జన్మలలో వైర భక్తితో భగవంతుని సాన్నిధ్యం సంప్రాప్తమవుతుంది.." అని శాపానికి ఉపసంహారం చెప్పి వెళ్లిపోయారు. అలా ఆ వైకుంఠ ద్వార పాలకులిద్దరూ మొదటి జన్మలో హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షులుగా జన్మించారు. రెండవ జన్మలో కైకసి అనే రాక్షసికి రావణ, కుంభకర్ణులై జన్మించారు. మూడవ జన్మలో సాత్వతికి శిశుపాల, దంతవక్త్రులుగా జన్మించారు.

''వక్రతంబెటులేక పాయని మహావైరంతో... సంఘాతులై"

ఆ ఇద్దరూ ద్వేషాదులతోనే పుట్టారు. హరిని దూషించుట పుట్టుకతోనే ప్రారంభమైంది. చివరికి కృష్ణ పరమాత్మ వారి శిరస్సులను ఖండించి వేశాడు. అలా వారికి మోక్షాన్ని ప్రసాదించాడు. ప్రహ్లాద ఘట్టంలో కూడా ప్రహ్లాదుడు

హిరణ్యకశిపుడికి పునర్జన్మ లేని ముక్తి మార్గమును ఇలా వివరించాడు..

"సంసార జీమూత సంఘంబు విచ్చునే... దానవేంద్రా!"

'దానవేంద్రా.. పెనుగాలి విసురు లేకుండా కారు మబ్బుల గుంపులు విడిపోవు. అలాగేచక్రధారి సేవ చేయ కుండా సంసార బంధాలు తొలగిపోవు. వర్షం పడకపోతే అడవులలో రగులుకొన్న అగ్ని ఆరదు. అలాగే హరి సేవ అనే అమృతం పడకపోతే మనిషికి తాపత్రయాలు చల్లారవు. బడబాగ్ని ప్రజ్వరిల్లితే సముద్రాలు కూడా ఇంకి పోతాయి. అదే విధంగా విష్ణు చింతన ఉంటే పాపాలు పటాపంచలైపోతాయి. సూర్యుని కిరణాలు విడిపోవు. హరిభక్తి అనే అంజనం లేకుండా నిర్మలమై నిరుపమానమై పునర్జన్మ లేని ముక్తి పెన్నిధిని అందుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఆఖరికి ఆ బ్రహ్మకు కూడా ఇది తప్ప మరో మార్గం లేదు. దానవేంద్రా.. అన్ని శాస్త్రములు చది వాను. కథలూ గాథలూ అనేకం తవ్వి చూశాను. ఈ సంసార సముద్రంలో భార్యా పుత్రులు తిమింగలాలు. కామ క్రోధ మద మాత్సర్యాలు పొంగి పొరలే కెరటాలు. ఇటువంటి ఘోరమైన సముద్రాన్ని దాటాలంటే అనవసర మైన వాదాలతో, అతి తెలివితేటలతో సాధ్యం కాదు. హరిభక్తి అనే నౌక ఒక్కటే దీనిని దాటించగలదు. ఇతర ఆలోచనలు, చదువులూ, పాండిత్యాలూ ఎందుకూ పనికి రావని ప్రహ్లాదుడు ముక్తి మార్గం చెప్పాడు. ఇంకొక మాట కూడా అన్నాడు.. సంసారంలో కొట్టు మిట్టాడే వారు ఎన్న టికీ ఆ మహావిష్ణువును చేరుకోలేరు అని కూడా ఉద్బోధిం చాడు. మోక్షాన్ని పొందాలంటే నిరంతరమైన భగవంతుని స్మరణం వల్లనే సాధ్యమవుతుందని చెప్పాడు.

గోపికా వస్త్రాపహరణ వృత్తాంతం ఒక గొప్ప ఘట్టం. కృష్ణుడు ఎందుకు అవతరించాడంటే భూదేవి గోరూప మున బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి రాక్షస ప్రవృత్తి గల రాజుల వలన తనకు కలుగుతున్న ఉపద్రవమును విలపిస్తూ విన్నవించింది. బ్రహ్మ విష్ణుమూర్తిని ప్రార్థించి ఇలా ఆదేశించాడు.. "దేవాధిదేవుడు తన సర్వోత్కృష్ట శక్తులతో సహా త్వరలో భూలోకమున శ్రీకృష్ణరూపమున అవతరింప నున్నాడు. ఆయన భూలోకమున దుష్ట శిక్షణ, శిష్టరక్షణ అను కర్తవ్యములను నిర్వర్తించు వరకు దేవతలు కూడా ఆయనకు తోడ్పడుటకు భూలోకమున ఉండవలెను. కావున దేవాధిదేవుడు అవతరించేలోపు యదువంశమున దేవతలు వెంటనే జన్మించవలెను.. అని అన్నాడు.

భగవంతుడు స్వయంసంపూర్ణుడు. ఆది అంతము, పుట్టుక చావు లేనివాడు. మనం అనుభవిస్తున్న దు:ఖం నుంచి పారమార్థిక ఆనందం వైపు దానిని చూపడానికి అద్భుతమైన తన సంకల్పానుసారం గతంలో అనేకమార్లు అనేక రూపాల్లో అవతరించినట్లే, ఈసారి శ్రీకృష్ణుని రూపంలో అవతరించాడు. 'కృష్ణ' అనే శబ్దానికి 'అందరినీ ఆకర్షించేవాడు' అని అర్థం! గోపికలెవరు? అన్న ప్రశ్నకు గోపికలందరూ వేదవిద్వాంసులు అన్నది సమాధానం! వెనకటి జన్మలో రామావతారం కాలంలోమునులూ, ఋషులూ శ్రీరామచంద్రునితో కలిసి మెలిసి ఉన్నారని, ఆయన సాహచర్యంలో నిత్యం గడపాలనే విన్నపాన్ని రాముని ముందుంచగా, కృష్ణావతారమున మీరు తిరిగి జన్మింతురని, అప్పుడు మీ అభీష్టాన్ని తీరుస్తానని శ్రీరాముడు అభయమిచ్చాడు. ఆవేద విద్వాంసులే కృష్ణావతారం కాలంలో బృందావన గోపికలై జన్మించారు.

'గోపికా వస్త్రాపహరణము':

కృష్ణుడు తమకు భర్త అవాలని గోపికలు హేమంత ఋతువు ప్రారంభం నుంచి యమునా నదీ తీరమున ప్రతి రోజూ తెల్లవారు జామున కాత్యాయనీ దేవిని పూజిం చారు.

"కొంటివి మా హృదయంబులు కొంటివి మానంబు లజ్జగొంటివి వలువల్
గొంటివిక నెట్లు జేసెదొ కొంటెవుగద నిన్ను నెఱిగికొంటిమి కృష్ణా"

మాసాంతమున ఒక రోజు గోపికల కోరికలు గ్రహించిన కృష్ణుడు ఒడ్డున ఉన్న వస్త్రాలను అపహరించి ఓ చెట్టు

మీదకు ఎక్కాడు. వస్త్రాపహరణమన్నది బాహ్యానికి ఓ మిష మాత్రమే! గోపికల వస్త్రాపహరణమంటే వారి చిత్త వృత్తులను తీసివేయడం అని అర్థం! వారిని అలానే ఒడ్డు మీదకు రమ్మన్నాడు. అంటే నగ్నదేహాలతో రమ్మని అనడమేమిటి? అన్న భౌతికార్థముతో కాకుండాఅందులోని అంతరార్థం గ్రహిస్తే బాహ్యాలంకరణల మీద, దేహం మీదా, కామ మోహ మమకారములు అన్నీ వదులు కోవాలన్న పరమాత్ముని భావన అవగతమవుతుంది. అలాగేవచ్చిన గోపికలను రెండు చెతులూ ఎత్తి నుదుటున తాకించి, నమస్కరించమంటాడు ఆ కృష్ణుడు. నుదుటున ఉన్నది ఆజ్ఞా చక్రము! ఆ స్థానము ఆత్మను పరమాత్మతో కలుపుతుంది. ఇక్కడే జ్ఞాన నేత్రం తెరుచుకొని ఆత్మ దర్శనమవుతుంది. ఈ చక్రాన్నే దివ్య నేత్రమనీ, జ్ఞాన చక్షువనీ అంటారు. కృష్ణుడు వీరిని మేల్కలపడానికే చేతులను జోడించమంటాడు. ఈ చేతుల జోడింపు వలన జరిగినది ఏమిటనగా, ''జీవాత్మ పరమాత్మల కలయిక''!వజ్ర వైడూర్యాలు, కామ మోహాలు, మమకారాల అడ్డు తొలగించుకోమని, అలా తొలగించుకొని వస్తేనే తనలో లయమవుతారని కృష్ణుడు ఈ గోపికా వస్త్రాపహరణ లీలలో ముక్తి యొక్క అంతరార్థాన్ని తెలియజేశాడు!

నారదుడు ధర్మరాజునకు మోక్ష ప్రాప్తికి సంబంధించిన విషయాలను ఇలా ఉటంకించాడు.

"అసంకల్పాజ్ఞ యేత్కామం క్రోధం కామ వివర్జనాత్
అర్థానర్థే క్షయాలోభం భయం తత్త్వా వమర్శనాత్"..

సంకల్పములను వదలి వేయుట ద్వారా కామమును, కామమును త్యజించుట ద్వారా క్రోధమును, ప్రాపంచిక వస్తు సంపదలయందు అనర్థమును చూచుట ద్వారా లోభమును, తత్త్వ విచారణచే భయమును జయించ వలయును.. అని మోక్ష ప్రాప్తి గురించి ధర్మరాజునుద్దేశించి నారదుడు ఉపదేశం చేశాడు!

ఉపయుక్త గ్రంథాలు :

1. మోక్ష సాధన - కూరపాటి ఆంజనేయులు
2. మోక్ష సాధన రహస్యం - శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములు
3. ఆంధ్ర మహాభాగవతము - బమ్మెర పోతన
4. శ్రీ పోతన భాగవత మధురిమలు - సంకలనం: బాలగంగాధర్ పట్నాయక్

❖ ❖ ❖

భారతీయ సంస్కృతికి పురుషార్థాలు మూలస్తంభాలు

– పి. అనురాధ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సింధూ డిగ్రీ కళాశాల, మెహదీపట్నం, హైదరాబాద్.

ధర్మ, అర్థ, కామ, మోక్షం అనేవి వీటి అన్నింటిలో ప్రధానమైనవి. మొట్టమొదటి ధర్మం । ధృ। అనే ధాతువుకు । పట్టి ఉంచే । అని అర్థం.

అంటే మానవ సమాజాన్ని నడిపించే చోదక శక్తి ధర్మం అని అర్థం ।ధారయతీ ప్రజా। అంటే జనును కలిపి ఉంచేది ధర్మశబ్దం సాపేక్షం. మానవధర్మం గృహస్థ ధర్మం... మొదలగునవి. అలాగే దేశ ధర్మం ఒక దేశ నాగరికతకు, సంస్కృతికి మూలస్తంభం అవుతుంది. ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క ప్రాంతంలో కొన్ని ధర్మాలు అనుసరించబడతాయి. వీటినే ఆచారాలుగా పరిగణిస్తారు. మహాభారత గ్రంథాలలో ఇవి మనకు స్పష్టంగా తెలుస్తాయి.

ధర్మం అంటే ధరించేది మహాజనులు ఏ మార్గంలో నడుస్తారో అదే ధర్మం. ఇది ఉంటే అన్నీ ఉన్నట్లే ధర్మం ప్రకారం అర్థం సంపాదించాలి. ధర్మం ప్రకారం కోరికలు తీర్చుకోవాలి. అలా చేస్తే మోక్షం కరతలామలకం అవుతుంది. వీటికి సజీవ సాక్ష్యాలు మన ॥ఇదిహాసాలు॥ అయిన రామాయణం మహాభారతం మొదలగునవి.

రామాయణం ద్వారా మన సంస్కృతి ఆవిష్కృతం అవుతుంది. రామాయణం మానవులందరికి ఆదర్శ ప్రాయం అందుకే రాముడు సర్వమానవాళికి ఆదర్శ పురుషుడయ్యాడు.

ధర్మార్థ కామ మోక్షాలు, ధర్మబద్ధంగా ఆచరించడం మహాభారతంలో మనకు స్పష్టంగా తెలుస్తుంది. పాండవులు ధర్మం వైపు నడిచారు. కౌరవులు అధర్మం వైపు అడుగులు వేశారు. ధర్మం గెలిచింది - అధర్మం ఓడిపోయింది.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునకు ఏమి ఉపదేశించాడు. అంటే నువ్వు ధర్మం వైపు వుండి యుద్ధం చేయి ధర్మ యె నిన్ను గెలిపిస్తుంది.

ఆ ధర్మమే నేను, నీవు నన్ను శరణు వేడుకో నేను నిన్ను రక్షిస్తాను.

సర్వధర్మాన్ పరిత్యాజ్య మా మేకమ్ శరమమ్ వ్రజామి అహల్యా సర్వ వింపేభ్యో మోక్షయిష్యామి మాశుచ : అంటే సర్వధర్మాలను వదిలి చేసి నన్ను ఒక్కడినే శరణు కోరుకో నేనే నిన్ను పాపాల నుండి విముక్తుణ్ణి చేసి నీకు మోక్షం ప్రసాదించగలనని ఈ శ్లోకం భావం ఇదియే గీతా సారాంశం. అంటే ఇక్కడ అన్యాయాన్ని, అధర్మాన్ని నిర్మూలించాలి కనుక కురుక్షేత్రంలో ఈ విధంగా గీతోపదేశం చేస్తాడు. ఈ గీతోపదేశం ముఖ్యంగా 3 విషయాలు తెలియజేస్తుంది. 1. కర్మయోగం, 2. జ్ఞానయోగం, 3. భక్తియోగం.

భగవద్గీతలో మొత్తం సారాంశం హిందూతత్వానికి మూలం అందుకే మనది హిందూమతం కాదు. హిందూ ధర్మం.

మహాభారతంలో ధర్మరాజు ఎంతో ధర్మాత్ముడు అంటే అరణ్యపర్వంలో పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు ఒక బ్రాహ్మణుడు పాండవుల వద్దకు వచ్చి తన అరణి లేడి కొమ్ములతో యిరుకుపోయినదని దానిని తెచ్చి ఇవ్వవలసినదిగా ఆ బ్రాహ్మణుడు కోరగా ధర్మరాజు నలుగురు తమ్ములతో లేడిని పట్టుటకు బయలుదేరాడు. కొంతసేపటికి ఆ లేడి కనబడకుండా మాయమైంది. వెదికి వెదికి అలసట చెంది మంచినీళ్ళు తెమ్మని నకులుని పంపించాడు నకులుడు ఎంతకూ రాకుండుటచే సహదేవుని పంపాడు. అదేవిధంగా అర్జునుడు భీముడు ఎవరూ తిరిగి రాలేదు. చివరకు ధర్మరాజే బయలుదేరాడు. మంచినీటి కొలను ప్రక్కనే నలుగురి తమ్ములను మృతదేహాలను చూసి ఎంతో దుఃఖించాడు. అంతలో అదృశ్యవాణి పలికింది. ధర్మనందనా నేను యక్షుడును.

ఈ సరస్సు నా ఆధీనంలో వున్నది. నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీ తమ్ములు అహంభావంతో దాహం తీర్చుకోబోయినందుకే ఈ గతి పట్టింది నీ వాయినా ఈ నా ప్రశ్నలకు సమాధానం చెప్పి నా దాహం తీర్చుకో అన్నాడు. యక్షుడు సరే అన్నాడు ధర్మరాజు.

ధర్మరాజుని పరిక్షించుటకు యమధర్మరాజు యక్షుడి రూపంలో ఉండి 72 చిక్కు ప్రశ్న వేయగా ధర్మరాజు ఇచ్చిన జవాబులు కొన్నింటిని చూద్దాం.

1. సూర్యుడిని ఉదయింప చేయువాడు ఎవరు (బ్రహ్మం)
2. సూర్యుడిని అస్తమింప చేయునది ఎవరు. (ధరన్మం)
3. ధర్మాని అధారమైనది దయా, దాక్షిణ్యం.
4. దేవలోకానికి దారి ఏది. (సత్యం)

ఇలా ధర్మరాజు అన్ని ప్రశ్నలకు ధర్మబద్ధంగా సమాధానాలు చెప్పగా యక్షుడు సంతోషించి నీకు మీ తమ్ములలో ఒకరిని బ్రతికించి పంపిస్తాను ఎవరిని పంపించమంటావో చెప్పు అనగా ధర్మరాజు నకులుడిని పంపించమంటాడు.

యక్షుడు ఎందుకు నకులుడినే పంపించమంటున్నావు అంటాడు. మా పాండవులకు తల్లులు ఇచ్చుట కుంతి, మాద్రి, నేను, భీముడు, అర్జునుడు కుంతి పిల్లలు నకులుడు, సహాదేవుడు, మాత్రి మాత పిల్లలు, కుంతి పిల్లలో పెద్దవాడను బ్రతికేవున్నాను.

కాబట్టి మాద్రి మాత పిల్లల్లో పెద్దవాడైన నకులుడు బ్రతికి ఉండాలి అని సమాధానం చెప్పాడు. అదే ధర్మం అన్నాడు. యక్షుడు అతని ధర్మానికి సంతోషించి మిగిలిన అందరిని బ్రతికించాడు. ధర్మరాజు ఎప్పుడు ధర్మాన్ని తప్పలేదు.

కామం :

పాండవులకు భార్య ద్రౌపది. అది ధర్మబద్ధంగా జరిగిన వివాహం. ఎందుకంటే కుంతి మాటకు కట్టుబడవలసి వచ్చింది.

ఒకవేళ ద్రౌపదిని ఐదుగురు కాకుండా అర్జునుడు ఒక్కడే వివాహం చేసుకుంటే మిగిలిన నలుగురు సన్యాసం స్వీకరించాలి. దేశానికి దిశ నిర్దేశం చూపించే పాండవులు సన్యాసం స్వీకరిస్తే ప్రజలు పరిస్థితి ఏమవుతుందో అని ద్రౌపది ఐదుగురిని వివాహం చేసుకోవటానికి అంగీకరిస్తుంది. అందుకే మొదట సహాదేవుని భర్తగా స్వీకరిస్తుంది.

తరువాత నకులుడిని వివాహం చేసుకుంటూ తరువాత అర్జునుడు, తరువాత భీముడు, చివరగా ధర్మరాజును వివాహం చేసుకుంటుంది. ఎందుకంటే అలా వివాహం చేసుకుంటే అది ధర్మబద్ధమైన వివాహం అవుతుంది.

అర్థం :

పాండవులు మాయాజూదంలో ఓడిన తరువాత అరణ్య అజ్ఞాతవాసాలు పూర్తిచేసిన తరువాత వారికి న్యాయ సమ్మతంగా రావలసిన రాజ్యభాగాన్ని ఇవ్వవలసినది. ద్రుపద పురోహితుణ్ణి పంపగా వారు సంజయుణ్ణి రాయబారిగా పంపిస్తారు. సంయుడు అసలు విషయాన్ని దాటవేస్తాడు. అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుని రాయబారిగా తన పెదతండ్రి ధృతరాష్ట్రుని వద్దకు పంపి తనకు అర్ధరాజ్యం కాకపోయినా ఐదు ఊళ్ళు ఇచ్చినా చాలుని అదీ కూడా వాళ్లపై ఆధారపడిన ప్రజలకోసం బంధువుల కోసమే ఎంతో ధర్మబద్ధంగా అడుగుతాడు.

మోక్షం :

పాండుపులు ఎప్పుడు సత్యాన్ని వదిలిపెట్టలేదు. ఎన్ని కష్టాలు పడినా భార్యతో పాండవులు పడరాని పాట్లు పడినా సత్యంవైపే నిలబడి వున్నారు. అందుకే వారికి మోక్షం సిద్ధించింది.

మన భారతీయ వివాహ వ్యవస్థ ఎంతో గొప్పది. వివాహ సమయంలో భార్యభర్తలచే ఈ ప్రమాణం చేయిస్తారు.

॥ ధర్మేచ, అర్థేయ, కామేచ తుభ్యం ప్రజాసహత్వ ధర్మచ్య ప్రాతిపాదయామి ॥

ధర్మములందమా, అర్థములందమా, కామాయల ముందుమా సంతానోత్పత్తి

ప్రక్రియలందమా నీతో నమస్కరించి గృహస్థాశ్రమ ధర్మాదులను ఆచరించెదను అని ఒకరినొకరు ప్రమాణాలు చేసుకుంటారు. అంత గొప్పది మన ధర్మం. అందుకే మనది హిందూ ధర్మం అయింది.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

"సతి దానశూరము" యక్షగానంలో ధర్మార్థ కామమోక్షలు

– డా॥. బొబ్బిల భుజంగరెడ్డి, సహాయాచార్యులు, తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

క్రీ॥శ॥. 1675 నుండి 1855 వరకు తంజావూరు ప్రాంతాన్ని భోసల వంశానికి చెందిన మరాఠా రాజులు పరిపాలించారు. వీరిలో శాహాజీ అనే రాజు క్రీ॥శ॥ 1684 ఉండి 1712 వరకు (28 సం॥) తంజావూరు రాజ్యాన్ని పాలించాడు. శాహాజీ మరాఠీవారు అయివుండి తమిళ ప్రాంతాన్ని (తంజావూరు ప్రాంతాన్ని) పాలించినప్పటికీ తెలుగు భాషను నేర్చుకొని చక్కని తెలుగులో 16 యక్ష గానాలు (దేశి నాటకాలు), 04 ప్రబంధాలు రచించాడు. ఈయన రచించిన 16 యక్షగానాల్లో ఒకటి "సతి దాన శూరము" అనే దేశి నాటకం. ఈ యక్షగానంలో ధర్మార్థ కామ మోక్షాలు ఎలా ప్రతిపాదించబడినాయి తెలపడమే ఈ పత్రం ఉద్దేశం.

శ్రీమహావిష్ణువు తిరునాళ్ళు దర్శించడం కోసం ఒక మతంగ స్త్రీ (మాదిగ స్త్రీ) ఈ తిరునాళ్ళు జరిగే చోటుకు వస్తుంది. ఆమె వివాహిత. పిల్లాండ్లు, మెట్టెలు, గజ్జెలు, అందెలు, మొలనూలు ధరించి కళ్ళకు కాటుక, నుదుట కస్తూరి తిలకం దిద్ది అందంగా ఉంటుంది. అదే తిరు నాళ్ళకు మోరోభట్లు అనే బ్రాహ్మణుడు తన శిష్యునితో కలిసి వచ్చి అక్కడ ఈ మతంగ స్త్రీని చూసి మోహిస్తాడు. అతనికి ఆ స్త్రీ "కొమ్మో పూవులరెమ్మో, బంగారు బొమ్మో, మరుని శరమ్మో లేక తళుకో, మరువంపు మొలకో, రతిచేతి చిలకో, ముద్దుల కలికో, లేక ఇంతో, వెన్నెల కాంతో, చెలుల మేల్బంతో, మదనుని దంతో, లేక నారో, మేటి మిటారో, చికిలి కటారో, యిది యోయ్యారో లేక తేటో, మదనుని తోటో, గుణముల కోటో, సింగారపు పేటో" అన్నట్లు కనిపిస్తుంది. మోరోభట్లు ఆమెను మోహిస్తాడు. అతని శిష్యుడు అది చూసి "మహాదైన ధర్మమోక్షమనేషు వంటిది ఆపేక్షించే పెద్దలు పరస్త్రీని చూచేదిలేదు. అదియెట్లానంటే, పిళ్ళారి చవితినాటి చంద్రకళ నెషువలె చూడరాదో అషువలెనో" చూడకూడదంటాడు. అప్పుడు మోరోభట్టు, "విలాసాలచేత ప్రకాశించుచుండే కను బొమ్మలు కలిగినటువంటి స్త్రీని జూచి యెవరి మనస్సుకు వికారం పుట్టకయుండురా" అంటాడు. అప్పుడు శిష్యుడు, కఫంతో నిండిన ముఖాన్ని, మాంసపు ముద్దలైన స్తనాలను, మలమూత్రాలతో తడిసిన కటిభాగాన్ని కలిగిన స్త్రీని మోహిస్తావా? నీకు వెర్రిపట్టిందా అంటాడు. ఆమె మీద తన గురువుకు విరక్తి కలిగించడంకోసం, మోక్షద్వారానికి అడ్డుతగిలేది, నరకానికి దారిచూపేది. కపటం కలిగిన స్త్రీ విషమైనప్పటికీ అమృతంలా కనిపిస్తుంది. దాన్ని వదిలి పెట్టు అంటాడు. అప్పుడు గురువు "పసలేని బ్రహ్మానంద పదము నేనొల్లర, సశరీర స్వర్గఫలము సమకూడు దీని వల్ల" అంటాడు. దానికి శిష్యుడు, మీ వంటి పెద్దలు, మా వంటి వారికి బుద్ధి చెప్పాలి గాని మీరే ఇట్ల పరస్త్రీని మోహిస్తే మీ పెద్దరికానికి మచ్చవస్తుందంటాడు. అప్పుడు మోరొభట్లు, ఆకులు, అలమలు తిని వాయుభక్షణం చేసే విశ్వామిత్ర, పరాశరాది పెద్దలే స్త్రీని చూసి మోహించి నప్పుడు, పాలు, పెరుగు, నెయ్యితో భోజనం చేసే నావంటి వానిని స్త్రీ మోహం కలిగితే తప్పా అంటాడు.

మతంగ స్త్రీ దగ్గరికి వెళ్ళి "నీ ఊరేమిటి? నీ పేరేమిటి, నీ జాతేమిటి? అని అడుగుతాడు. అప్పుడు ఆ స్త్రీ, మేం మాదిగవారం, అంటరానివారం, పసుల మాంసం తింటాం. కల్లు తాగుతాం, మా దగ్గరకు రాకు, దూరంగా ఉండమంటుంది. అయినప్పటికీ ఆ బ్రాహ్మణుడు తన మీద దయదలిచి తన దగ్గరకు రమ్మంటాడు. అప్పుడు మతంగ స్త్రీ "తనువు అస్థిరం, ధర్మమే స్థిరం" కాబట్టి "ఈ కులహీనురాలి గొడవ నీకేల?" ఇంటికిపోవయ్య అంటుంది. అప్పుడు మోరోభట్లు "కులహీనమైనగాని గుణము గలిగిన దాని, కొనాయడరటవె జనులు

భామామణి" అటాడు. "పాలుపైన శుక్తులను బుట్టినదైన గాని, ముత్యమునెవరైన నిందింతురా" అంటాడు. అప్పుడు మతంగ స్త్రీ "సంసారిగానా యీ సరసమేల నాతో, సంసారం జేయ సన్నలు సేసేవు, ఓజ నీకిది కాదుర బాపనయ్య, ఓజ నీకిది గాదు, ఏ జాతినైనాను ఈ వగ చెల్లీని, మా జాతికిది మరియాద గాదుర... నా మగడు దెబ్బతియ్య బోయాని" అని భయపెడుతుంది. అప్పుడు మోరోభట్లు "తోళ్ళు గట్టువాడు, దొమ్మికాడు, వెట్టినీళ్లు తాగువాడు నీకేలె?, మామళ్ళు, వరాలును, మాడలు, చీరెలు, జోళ్ళు ఇచ్చెద" నాతో రావె అంటాడు. అప్పుడు ఆ స్త్రీ "పతి నెడబాయ రాదయ్య ఓ బాపనయ్య, సతులకిది ధర్మము గాదయ్య, పతిని వంచింప నిహపర మింతైన లేదయ్య, కులహీనుడైననుగాని, గుణరహితుడైనగాని, కలుద్రాగువాడైనగారి, గడుసువాడైనగాని, కలిమి లేని వాడైనగాని, బలిమిలేని వాడైనగాని, తులువైనగాని, బలు దుష్టుడైనగాని, మగడె ప్రాణ బంధుండు గాడా? ఓ బాపనయ్య" అని పతివ్రతా ధర్మాన్ని తెలుపుతుంది. అయినా అతను ఆమెను తన వెంట తన ఇంటికి రమ్మంటాడు. అప్పుడు ఆమె "బాపండ యేర, యిటువలె బలుకంగ మేర, కులహీనమైన గుణశీలము విడిచి, యలరునిల్లాలు వెలయాలైన? ఇల జనులకు జాతు లెచ్చు కొలదులంతెగాని, తలచ ధర్మ భేదము గలదా వెట్టి" అని దూషిస్తుంది. అప్పుడు మోరోభట్లు, ఈ వేదాలు, ధర్మాలు, మతభేదాలు అన్నీ మేం సృష్టించినవే. "హితవు చెప్పెద నీకిపుడు విప్రునియభి మతము దీర్చుటకంటె మఱిలేదె ధర్మము" అంటాడు.

అప్పుడే అక్కడికి ఆ మతంగ స్త్రీ మగడు వస్తాడు. అప్పుడు ఆమె తన మగనితో 'అమ్మక్క చెల్ల యెంత అదలించిన వినక, దొమ్మిసేసి యీతడు దొడరెగదోయి, కమ్మవిల్తుని కేళి గుడియైన గూడుదాము, కొమ్మా లెమ్మా రమ్మని వెడెనోయి" అని ఫిర్యాదు చేస్తుంది. అప్పుడు ఆమె మగడు మోరోభట్లుతో "మగనిల్లాలితో నీకు మాటలేటికిరా, తగునా బాపన సాల్లే ధరమ్మ తోసి.. పర సతుల పొందుట పాపముగాదా, సరస శాస్త్రములెల్ల చదువలేదటర" అని కొట్టబోతాడు. అప్పుడు మోరోభట్లు, నీ భార్యను నేను మానసికంగా కోరుకున్నప్పుడే అది నా భార్య అయ్యిందని అంటాడు. అంతేగాక "యాగము చేసేది రంభ భోగములకే కాద, భోగములకన్న వేఱె పుణ్యము గలద, భామలె దైవము, భామలె పెన్నిధి, భామలపొందని వాని బ్రతుకేమి భ్రాంతి" అంటాడు. అప్పుడు మాదిగవాడు, మీవంటివాడు పరబ్రహ్మంమీద, పరలోకం మీద ఆసక్తి ఉంచాలాగిన పరస్త్రీని కోరగూడ దంటాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు, సుఖ దుఃఖాలు తెలియని నిర్గుణమైన బ్రహ్మమే మోక్షమని బుద్ధిలేఇవాడు చెప్తాడు. మదిరాక్షి అయిన స్త్రీ కోకముడి విడుచుటే మోక్షం గాక వేరే మోక్షంకలదటరా" అని అంటాడు. నా పంచప్రాణాలైనా వదులుతానుగానీ దీనిన (మతంగ స్త్రీనని) వదలను అంటాడు.

అప్పుడు ఆ మాదిగవాడు, వీడు పంచప్రాణాలైనా వదలుతాడు గానీ నా భార్యను వదిలేలాగ లేడు. ఇంత జరిగే కంటే తానే తన భార్యను ఆ బ్రాహ్మణునికి దానం చేస్తే మంచిదని నిశ్చయించుకుంటాడు. "తన జాతిలో వీరదాసుడు హరిశ్చంద్రుడనువైన సత్యముకై యాలినమ్మ మలేద, దానమానము తమ వారికే కలదు, ప్రాణమడిగిన నిత్తు భామనిచ్చేది హెచ్చు, తనువు సంసారము ధన మస్థిరము చూడ, తనకీర్తి స్థిరము ధారపట్టుమి నీవు" అని భార్యను ధారపోయడానికి సిద్ధపడతాడు. అప్పుడు మోరోభట్లు శిష్యుడు, "నీ పద్దు చెల్లింది అంతేచాలు. ఇకనైనా కడు చెడిపోక బ్రాహ్మణీకానికి వేదశాస్త్రాలకు మాటరాకుండా, ఈ దానము పట్టక, మనస్సు విరక్తి దెచ్చుకొని, వేదకావ్యాలలో సూక్ష్మార్థము విచారించుకొని, యిహపర సాధనము కలగునట్టులు, నలుగురు చూచిన వారలు మెచ్చునటుల నడుచుకొని రావయ్యా" అంటాడు. శిష్యుని మాటలు విన్న మోరోభట్లు "సమాధిగా నుండి, వేదార్థ తత్వము విచారించి, మనస్సునందు విరక్తి చెంది

తన శిష్యునికి నమస్కరిస్తాడు. శిష్యుని సత్సాంగత్యంవల్ల తాను సత్పురుషునిగా మారుతాడు. మాదిగవానితో "ధన ధాన్యాది మహాదానములిత్తురుగాని, యెనయ నీదాన మెవరైన జేతురా, మలినజాతి వారమని మాటిమాటికి బలికితివి, మలినమేడది నీవు నిర్మలుడవై యుండ గాను" అంటాడు. అప్పుడు ఆ మతంగ స్త్రీ మగడు, "వినయంబు మీఱగ విప్రముఖ్యులకు, నిచ్చెదనన్నది యీయలేకున్న, నెచ్చైన సంపదలెల్ల తరుగుబీ యశములెల్లను మాయుబీ నపకీర్తి వొడముబీ విడువక పాపంబు వెంబడి దొడరుబీ భూసుర, నీవు నా పువ్వుబోడికిని, ఆసించి యడుగ నీకంగనామణిని, దారవోసెదనంటిబీ దడయక నీవు దావట్ట నటంచు దప్పించుకొన్న విడుతునే?" అంటాడు. అప్పుడు మోరోభట్లు "మాదిగవాడైతే పరమేశ యీ, మగువను గొమ్మనేని పరమేశ, కాదంటే బెదిరించేని పరమేశ నన్ను, గావు మీవేళను పరమేశ" అని పరమేశ్వరునికి మొరపెట్టుకుంటాడు. అప్పుడు, కోరిన దాన భంగము కాకుండా జేయుము, కొండవీటి జంగమా" అని మాదిగివాడు పరమేశ్వరున్ని కోరుతాడు. అప్పుడు "కట్టడి బాపనయ్య తిట్టేని రావద్దని, ఒట్టువెట్టేని మగడు, పట్టినకొమ్మపోయె, మెట్టిన కొమ్మపెయె, గట్టువిల్తుడ కావవే, ప్రాణము కన్నను మానమె యెక్కుడు, నానా విధముల జూడను, మానము హీనమైన మానిని బ్రదుకేల, దీనురాలను కావవే" అని మతంగ స్త్రీ పరమేశ్వరున్ని కోరుతుంది. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఈ నలుగురి సుగుణాలకు మెచ్చి బ్రాహ్మణునికి సాయుజ్యం, మాదిగవానికి సారూప్యం, మాదిగ స్త్రీకి సామీప్యం, శిష్యునికి సాలోక్యమిస్తాడు. ఇంతటితో ఈ కథ ముగుస్తుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. గంటి జోగిసోమయాజి. పరిష్కర్త. యక్షగానములు (తంజావూరు), మూడవ సంపుట, వాల్తేరు, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు, 1957

❖ ❖ ❖

శ్రీ శివ మహాపురాణము – చతుర్విధపురుషార్థాలు

– డా॥. మరపతి కాంతయ్య, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, డా॥. బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల. మహబూబ్‌నగర్ జిల్లా.

శివ మహా పురాణంలో ఏడు సంహితులున్నాయి. అష్టాదశపురాణములలో శ్రేష్ఠమైన పురాణంగా శివపురాణమును పేర్కొనవచ్చు. ఎందుకనగా శివపురాణంలో వేదాలలో, ఉపనిషత్తులలో ప్రతిపాదించబడిన పరమాత్మ తత్వముతోపాటు ప్రధానంగా మోక్షధర్మము కూడా ప్రతిపాదించబడింది. మాత్యర్యంలేని బుద్ధితో విద్వాంసులు తెలుసుకోదగిన పరమాత్మ తత్వము, శ్రేష్ఠమైన మంత్రములు, ధర్మార్థ కామములచే పురుషార్థాలు శివమహాపురాణంలో చక్కగా విరించబడ్డాయి.

అనంతమైన ఈశ్వర విభూతి, పావనమైన శివ పార్వతుల లీలలు రమణీయంగా వర్ణించబడ్డాయి. శివభక్తి, లింగమహిమ స్వాత్కర్షగా చెప్పబడింది.

ఈ పురానములో 1. కర్మకాండ, 2. ఉపాసనాకాండ, 3. జ్ఞానకాండ అనే మూడు కథా కథన పద్ధతిలో సరళంగా, విస్తారంగా విరింపబడ్డాయి.

"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" (ఆది. ప. 1/267) ఇతిహాసపురాణ సహాయంతో వేదాల అర్థాన్ని సవిస్తరంగా చెప్పవచ్చునని మహాభారతలో చెప్పబడింది. అందువలన "పురానం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మనాస్మృతమ్" (ఆది. ప. 53/3) సకల శాస్త్రాలలో పురాణాలకే అగ్రస్థానమీయబడినదని మత్స్యపురాణంలో పేర్కొనబడింది.

ఇతిహాసపురాణంచ పంచమోవేద ఉచ్యతే (శ్రీ మద్భాగవతం 1-4-20)

ఇతిహాసపురాణంచ పంమం వేదానం వేదం (ఛాందోగ్యమ్ - 7-1-12)

శివ మహాపురాణంలో 457 అధ్యాయాలున్నాయి. మొత్తం 24000 శ్లోకాలున్నాయి.

1. విద్యేశ్వరసంహిత, 2. రుద్రసంహిత, 3. శతరుద్ర సంహిత, 4. కోటిరుద్రసంహిత, 5. ఉమాసంహిత, 6. కైలాససంహిత, 7. వాయవీమసంహిత అనే ఏడు సంహితలున్నాయి.

రుద్రసహింతలో 1. సృష్టిఖండము, 2. సతీఖండము, 3. పార్వతీఖండము, 4. కుమారఖండము, 5. యుద్ధ ఖండము అనే ఐదు ఖండములున్నాయి.

ఈ శివపురాణంలో పరమేశ్వరుడు (ప్రవాహ రూపముగా)య నిత్యమగువాటిలో (కూటమి) నిత్యుడు, వివిధములైన చేతనములలో అద్వితీయమైన చేతనగలవాడు. కోరికలేని ఈశ్వరుడు మానవుల కోరికలన్నీ తీర్చును. కేవలం జ్ఞానయోగంతో పొందదగినవాడు, జగత్కారణుడు, జగన్నాధుడైన శివుని గూర్చి తెలుసుకున్నప్పుడే జీవుడు సంసారబంధాలనుండి నిశ్చితంగా విముక్తుడవుతాడు. సంసార బంధమునుండి విడివబడుటయే మోక్షము.

శ్లో : ఏక ఏవ శివస్సాక్షాత్ సత్యజ్ఞానాది లక్షణంః
వికారరహితః శుద్ధః స్వశక్త్యా పంచధాస్థితః

సత్యజ్ఞానానందరూపుడు, వికారరహితుడు అయిన శివుడు ఒక్కడే ఐనప్పటికీ సృష్టి, స్థితి, లయ, తిరోధాన అనుగ్రహములచే పంచకృత శక్తుల వల ఆ పరమశివుడే సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన అనే ఐదు భేదములతో పంచముఖ పరబ్రహ్మగా భాసిస్తున్నాడు. చతుర్విధ పురుషార్థ సాధన కొరకు శివుని సద్యోజాతాది పంచబ్రహ్మ మంత్రములతో జపము, అర్చన, అభిషేకములు చేస్తారు భక్తజజనులు.

1. సద్యోజాతముఖము :

పరమేశ్వరుని సద్యోజాత ముఖము నుండి గాయత్రి మొదలుకొని రెండు కోట్ల మంత్రములు ఉద్భవించాయి.

వీటిని "వైదిక మంత్రములు" అంటారు. వీటికి మరోపేరు "పూర్వామ్నాయ మంత్రములు".

2. ఆమదేవముఖము :

ఈశ్వరుని ముఖమునుండి శైవాగమమునకు చెందిన ఒకచోటి 'మంత్రములు' ఉద్భవించాయి. ఇందులో 'దక్షిణామూర్తి' మొదలగు మంత్రములుంటాయి. అందుకే వీటికి 'దక్షిణామ్నాయ మంత్రముల'ని పేరు.

3. అఘోర ముఖము :

పరమేశ్వరుని అఘోర ముఖము నుడి వైష్ణవాగ మొక్తములైన ఒకకోటి మంత్రములార్భవించాయి. వీటికి 'పశ్చిమామ్నాయమంత్రములు' అని పేరు.

4. తత్పురుష ముఖము :

మహా దేవుని తత్పురుష ముఖము నుండి శాక్తేయము లైన రెండు కోట్ల మంత్రములు ఉద్భవించాయి. ఇవి మహా విద్యాది మంత్రములుగా ప్రసిద్ధిగాంచాయి. వీటిని 'ఉత్తరామ్నాయ' మంత్రములంటారు.

5. ఈశాన ముఖము :

శివుని ఈశాన ముఖము నుండి ఆత్మానంద ప్రదములైన కోటి మంత్రములు ఉద్భవించాయి. వీటిని 'ఊర్ధ్వామ్నాయ మంత్రములు' అంటారు.

కావున సద్యోజాతాది పంచబ్రహ్మమంత్రములతో శివుని పూజించినట్లయితే మోక్షం లభిస్తుందని శివ మహాపురాణం పేర్కొంటుంది. మానవుడు తన జీవి తమును శివునికి సమర్పించి, అనన్యభక్తి శ్రద్ధలతో శివ లోకాన్ని చేరుకుంటారు.

శివపురాణము అన్నింటికంటే శ్రేష్ఠమైనద. పరలోకము లోని పరమార్థ వస్తువును ప్రసాదిస్తుంది. కలి, కల్మషరాశు లను నశింపజేస్తుంది. ఇది ధర్మార్థకామమోక్షములనే పురుషార్థములను ప్రసాదిస్తుందని విద్వేశ్వర సంహితలో పేర్కొనబడింది. కలియుగమునందు మానవులు శివ పురాణం చదివినా, విన్నా ఉత్తమోత్తమగతులను (మోక్షము) పొందుతారు.

శివపురాణముననుసరించి బ్రహ్మ, విష్ణువులు ఇద్దరూ వాదోపవాదం చేసుకుంటూ ఉన్న సమయంలో స్తంభా కారంగా లింగం ఆవిర్భవిస్తుంది. బ్రహ్మ, విష్ణువు ప్రప్రథ మంగా లింగరూపంలోనున్న శివుని పూజిస్తారు. దానికి మెచ్చిన శివుడు, వారికి శివరాత్రినాడు ఎవరైన భక్తితో ఉ పవాసముండి, లింగాన్ని అర్చిస్తారో వారు మోక్షానికి అర్హులవుతారని తెలుపుతాడు.

శివరాత్రినాడు నిరాకారుడై, జితేంద్రియుడై తన శక్తికొలది నిశ్చల భావంతో శాస్త్రోక్తంగా శివుణ్ణి పూజిస్తూ అనంతమైన ఫలితము లభిస్తుంది. జ్యోతిర్మయలింగం నుండి శివుడు ఆవిర్భవించిన శుభదినమైన మహాశివ రాత్రినాడు శివుని దర్శిస్తే చాలు ముక్తి లభిస్తుందని శివ పురాణం పేర్కొంటుంది.

జ్యోతిస్తంభము లేదా జ్యోతిర్మయలింగము మిక్కిలి చిన్నదైననూ, అన్ని విధములైన భోగానుభములను సులభంగా సమకూర్చునని, మోక్షమును పొందుటకు సులభసాధనమని శివపురాణం ద్వారా తెలుస్తుంది. శివుడు జ్యోతిర్లింగ రూపమున వెలసిన స్థలమునందు నివసించిన (లేదా) మరణించినా మోక్షము లభిస్తుందని శివపురాణము ద్వారా తెలుస్తుంది.

శివపురాణముననుసరించి, సూర్యుడు ఆరోగ్యమును, చంద్రుడు సంపదలను, ప్రసాదిస్తాడు. కుజుడు వ్యాధు లను నివారిస్తాడు. బుధుడు పుష్టినిస్తాడు. బృహస్పతి ఆయువును వృద్ధి చేస్తాడు. శుక్రుడు భోగములను ప్రసాదిస్తాడు. శనైశ్చరుడు - మృత్యువును నివారిస్తాడు. ఈ విధంగా ఆయాదినములు అనగా ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని వారాలలో శివపూజ చేస్తే లభించే ఫలితాలు వివరింపబడ్డాయి.

ఆయా దేవతలకు చేసే పూజల ఫలితాన్ని ప్రసాదించు వాడు శివుడే. దేవతలు ప్రసన్నం కావడానికి ఐదు విధాలుగా పూజా విధానం చెప్పబడింది. అందులో మొదటిది ఆయా దేవతల మంత్రములను జపించుట, రెండవది హోమము చేయుట, మూడవది దానము

చేయుట, నాలుగవది తపస్సు చేయుట ఏదైనా వేదికపై ప్రతిమ యందుకానీ, అగ్నియందుగానీ (లేదా) బ్రాహ్మణ శరీరమందుగానీ, ఆరాధ్యమైన భావనతో పూజించుట, ఆరాధించుట ఐదవ పద్ధతి. ఈ ఐదు పూజా పద్ధతులలో ఒకదాని తర్వాత మరొకటి ఉత్తరోత్తరంగా శ్రేయోదాయకాలు.

జీవుడు శివుడిలో ఐక్యమైనంత వరకు మళ్ళీ జన్మిస్తూనే ఉంటాడు. మాయతో మరొక రూపముతో ప్రకటించబడటమే మరో జన్మగా భావించబడుతుంది. పుట్టినప్పటినుండి శరీరము ఆరు భావవికారాలతో జీర్ణమవుతుంటుంది. కావున దానికి జీవుడనిపేరు. జన్మించిన వాడు వివిధ బంధములలో చిక్కుకొని, బంధనానికి లోనవుతాడు. కావున జీవన మరణరూపబంధ ముక్తి కొరకు జన్మకు అధిష్ఠానమైన మాతాపతృస్వరూపమైన శివలింగమును పూజించినట్లయితే మోక్షము లభిస్తుంది.

శివమహాపురాణంలో వివరింపబడిన ఆయా పూజా పద్ధతులను అనుసరించి, శివమహాపురాణంలోని ఆయా కథలను అనుసరించి మానవుడు శివుని ఆరాధించి ధర్మార్థ కామమోక్షములనే చతుర్విధపురుషార్థాలను సాధించవచ్చు నని తెలుస్తుంది.

❖ ❖ ❖

భారతీయ సంస్కృతికి చాతుర్వర్గ మూలాలు

– టి. లక్ష్మ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, సింధూ డిగ్రీ కళాశాల, మెహదీపట్నం, హైదరాబాద్.

పురషార్థం అనేది పురుష మరియు అర్థ అనే రెండు మిశ్రమ సంస్కృత పదం. పురుష అంటే మానవుడు. ఆత్మ అంటే విశ్వం యొక్క ఆత్మ, ప్రయోజనం ఇది హిందూ మతంలో ఒక ముఖ్యమైన భావన. మరియు మానవ జీవితం యొక్క నాలుగు సరైన లక్ష్యాలు లేదా లక్ష్యాలను సూచిస్తుంది.

చతుర్విత పురుషార్థాలు :

1. ధర్మ - ధర్మం, విధి.
2. అర్థ - శ్రేయస్సు, ఆర్థిక విలువ
3. కామ - కోరిక, ఆనందం
4. మోక్ష - విముక్తి, ఆధ్యాత్మిక విలువలు

నాలుగు పురుషార్థాలు ముఖ్యమైనవి కాని సంఘర్షణ సందర్భాలలో హిందూతత్వశాస్త్రంలో అర్థ లేదా కామ కన్న ధర్మం చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. మోక్షాన్ని మానవ జీవితానికి అంతిమ ఆదర్శంగా భావిస్తారు. అదే సమయంలో హిందూ మతాన్ని ఆచారించే వారందరితో ఏకాభిప్రాయం కాదు, మరియు చాలా మందికి మన నాగరికతను, సంస్కృతం సంబంధించిన అవగాహన లోపాలున్నాయి. హిందూ ధర్మంలో కొన్ని ఆచరించే విధి, విధానాలుగా ఈ చతుర్విత పురుషార్థాలు మనకు చూపబడుతున్నాయి. వాటినే "కాతుర్వర్గ॥ అని కూడా పిలువబడతాయి.

రాముడు క్షత్రియుడు. క్షత్రియులకు దక్షిణ నాయకత్వం ఉంది. అంటే అనేకమంది భార్యలు వుండటం కానీ రాముడు ఆ మార్గాన్ని త్యజించాడు. ఏక పత్నీ వ్రతుడయ్యాడు. సీతామనోభి రాముడయ్యాడు. అది అసలైన ధర్మం. అయోధ్యలో కరువు విలయతాండవం చేసినపుడు మహర్షులు రాముడిని యజ్ఞం చేస్తే ఈ కరువు పోతుంది రామ, నీవు యజ్ఞం చేయటానికి సిద్ధం కావాలి. అని చెప్పి నీవు యజ్ఞం చేయాలంటే నా ప్రక్క భార్య ఉండాలి. ఇప్పుడు సీత నీ ప్రక్కన లేదు కనుక నీవు ప్రజల కోసమైన వివాహం చేసుకోవాలి అని ఒత్తిడి తెచ్చినా రాముడు దానికి అంగీకరించకుండా దీనికి వేరే ఏదైనా ఉపాయం ఆలోచించండి మునివర్యా అని అడుగగా అయితే నీవు బంగారు ప్రతిమతో సీత విగ్రహాన్ని చేయిస్తే దానిని ప్రక్కన పెట్టి యజ్ఞం చేయవచ్చు. అని చెప్పగా రాముడు దీనికి అంగీకరించి ఆ విధంగా యజ్ఞం పూర్తి చేశాడే కాని రెండో పెళ్ళి గురించి కలలో కూడా ఆలోచించ లేదు. అంత ధర్మాత్ముడు శ్రీరామచంద్రుడు.

అర్థం :

రాముడు న్యాయబద్ధంగా రాజ్యపరిపాన చేసి ప్రజల క్షేమం కోసం ప్రజలకు ఏ లోటులేకుండా పరిపాలించాడు రామరాజ్యం సుభిక్షంగా వుందనటానికి రాముని పరిపాలన నిదర్శనం.

కామం :

రాముడు ఇంద్రియ నిగ్రహం కలవాడు అడవులలో 14 సం॥లు వున్నా సీత రాములు భార్యాభర్తల బంధంతో కాకుండా భక్తిభావంతో ఇద్దరూ లక్ష్మణుని సేవలో తరించారు. అందరికీ ఆదర్శవంతంగా నిలిచారు. పినతల్లి కైకేయికి ఇచ్చిన మాటను తప్పలేదు. 14 సంవత్సరాలు బ్రహ్మచర్యం పాటించారు. పినతల్లికి చేసిన వాగ్దానానికి కట్టుబడి ఉన్నాడు. వనవాసం పూర్తయిన తరువాత అయోధ్యకు వచ్చి వారి దాంపత్యానికి ప్రతీకంగా సీతా రాములకు లవకుశలు జన్మించారు.

మోక్షం :

సత్యం వైపు పయనించటమే మోక్షానికి దారి. రాముడు, సీత, లవకుశలు వారు నిరంతరం సత్య మార్గాన్ని అనుసరించి వారు మోక్షాన్ని పొందారు.

ధార్మర్థ కామ మోక్షాలకు మనం ముందు చెప్పు కున్నట్లు భార్య, భర్త, పిల్లలు, సత్యం. ఈ మార్గాన్ని అందరూ అనుసరిస్తే ప్రతీ దేశం రామరాజ్యంగా విరా జిల్లుతుంది.

భారతీయ వివాహ వ్యవస్థ ఎంతో గొప్పది. వివాహ సమయంలో మొదట వరుని చేత - దాత అంటే పెండ్లి కుమార్తె తండ్రి ప్రమాణం చేయిస్తాడు.

॥ ధర్మేచ, అర్థేచ, కామేచ, త్వయి ఏశానాతిచరితవ్యా॥

ధర్మములందమా, అర్థకామములందమా, ఈ వధువు నతిక్రయించి గృహస్థాశ్రయ ధర్మములను సాగించరాదు. అని అడుగును. వరుడు - నాతి చరామి - నేను పై ప్రమాణంతో నంగీకరించుచున్నాను.

తరువాత వరుడు - వధువుచే ప్రమాణం చేయిస్తాడు.

॥ ధర్మేచ, అర్థేచ, కామేచ, తుభ్యం ప్రజా సహత్వదర్మచ్య ప్రతిపాదయామి ॥

ధర్మములందమా, అర్థములందమా, కామాధు లందమా సంతానోత్పత్తి ప్రక్రియలందమా నీతో నను గురించి గృహస్థాశ్రమ ధర్మాదులను ఆచరించేదను నీవు కూడా నాతో నట్లే ఆచరించాలి అని ఒకరినొకరు ప్రమా ణాలు చేసుకుంటారు. అంత గొప్పది మన ధర్మం అందుకే మనది హిందూ మతం కాదు హిందూ ధర్మం.

❖ ❖ ❖

అర్థము ధర్మముననుసరించిన అనుసరణీయము

– డా॥. యస్. బేబీరమణి & యస్. సతీష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, తెలంగాణ.

చతుర్విధ పురుషార్థములు నాలుగు విధములుగా ఉన్నప్పటికీ, మొదటి దైనధర్మముననుసరించిన అర్థ, కామములచే మాత్రమే మోక్షము లభిస్తుందని ఆంధ్ర మహాభారతము శాంతిపర్వము ప్రథమా శ్వాసమునందు శ్రీకృష్ణుడు ధర్మరాజునకు తెలిపిన ధర్మములలో కలదు. గంధము, రసము మొదలైన వాటిపట్ల గల కాంక్ష మోహమును కలుగజేస్తుంది. దానివల్ల పాపము చేయ వలెనను ఆలోచన కలుగుతుంది. కావున ప్రజ్ఞతో ఈ దోషములను అధిగమించవలెను.

అర్థము వలన కలుగు అనర్థములను తెలుపుటకై ఒక చక్కని ఉదాహరణగా సువర్ణ ష్ఠీవిని గూర్చి తెలుప వచ్చు. సృంజయుడను రాజువద్ద నారదుడు కొంతకాలము అతిథ్యమును పొందినాడు. ఆ రాజునకు సువర్ణష్ఠీవి యనుపుత్రుడు గలదు. సువర్ణష్ఠీ విసర్జకములు అన్నియు అనగా ఉమ్మి, కన్నీరు, చెమట మొదలైనవన్నీ బంగారు మయములు.

సువర్ణష్ఠీవి ఈవిధముగా పెరుగుచుండగా బోయలు ఒకనాడు సమయము చూసుకొని సువర్ణష్ఠీవిని అపహరించుకొని అడవికి తీసుకొని వెళ్ళినారు. అతని శరీరము నంతను ఖండించిన బంగారమును కానరాక శరీరమును అచ్చటనే వదలి వెడలిపోయినారు.

సృంజయుడు తన కుమారుడు కానరాకుండటచే దుఃఖముతో నారదుని ప్రార్థింపగా నారదుడు దివ్య దృష్టితో సువర్ణష్ఠీవిని కనుగొని తన సంకల్ప బలముచే మరల పునర్జీవితుని చేసినాడు.

మరికొంత కాలమునకు దేవేంద్రుడు సువర్ణష్ఠీవితనను మించినవాడై తన పదవికి ముప్పు కలిగించునని తలచి అతనిని వధింపవలెనని సంకల్పించినాడు. తన వజ్రాయుధమును పిలిచి శార్దూల రూపంములో వెడలి సువర్ణష్ఠీవిని వధింపుమని ఆదేశించినాడు. ఆ సమయమున సృంజయుడు తన పుత్రులతో భాగీరథీ తీర ప్రదేశమున విహరించుచున్నాడు. వేచియున్న వజ్రాయుధము శార్దూల రూపాముతో సువర్ణష్ఠీవి శరీరమును చీల్చి వేసింది. మరల నారదుని ప్రమేయముతో మరల జీవించినాడు.

ఈ విధముగా కృష్ణుడు ధర్మరాజునకు ఉపదేశించిన ఈ అంశముల ద్వారా అర్థము ధర్మబద్ధమై, తగినంత యున్న చోహితమును కలిగించును.

అధికమైన అర్థము అనర్థమును కలుగజేయునను విషయము స్పష్టమగుచున్నది.

లక్ష్మీఎట్టివారి వద్ద నుండునను విషయమును భీష్ముడు ధర్మరాజునకు తెలుపుటకై రుక్మిని లక్ష్మీదేవిని ప్రశ్నించిన సందర్భమును తెలిపినాడు. రుక్మిణి లక్ష్మీదేవిని నీవెట్టి స్త్రీలయందు, ఎట్టి పురుషులయందు నివసింతువని ప్రశ్నింపగా లక్ష్మి ఇట్లు పలికింది. సత్యము పలుకువారియందు, శౌచము పాటించువారియందు నివసింతువని ప్రశ్నింపగా లక్ష్మి ఇట్లు పలికినది. సత్యము పలుకువారియందు, శౌచము పాటించువారియందు, గురుభక్తులందు, విజ్ఞానము, తపము, దానము, బ్రహ్మచర్యము, శమము గలిగినవారియందు ప్రీతితో తాను వసింతునని తెలిపినది. క్రూరుని, నాస్తికుని, కృతఘ్నునియందు తాను నివసింపనని, భర్తకు ప్రతికూలురాలు, అధిక నిద్రకలుగు స్త్రీల నుండి తాను తొలగిపోవుదునని పలికినది. పైన తెలిపిన సత్యము, శౌచము, తపము, దానము, బ్రహ్మచర్యము, శమము మొదలైన గుణములన్నియు ధర్మమునకు సంబంధించివే.

కావున అర్థము ధర్మముననుసరించియే కలదని లక్ష్మీదేవి పలుకుల వలన తెలియుచున్నది. అట్టి అర్థమే మోక్షకారణమగును. ❖

భాగవతపురాణము – చతుర్విధ పురుషార్థములు

– డా॥. బొచ్చుమంచి వెంకటేశ్వర్లు, తెలుగు అధ్యాపకులు, విజ్ఞానజ్యోతి ఇనిస్టిస్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్.

భాగవతం ప్రాముఖ్యత :

వేదాంతపరంగా భాగవతం ప్రాముఖ్యత భాగవతంలోనే క్రింది శ్లోకంలో చెప్పబడింది.

సర్వవేదాంతసారం హి శ్రీ భాగవతమీస్యతే
తద్రసామృత తృప్తస్య నాన్యత్ర స్యాద్రతి క్వచిత్

శ్రీమద్భాగవతం సకల వేదాంత సారంగా చెప్పబడింది. భాగవత రసామృతాన్ని పానం చేసినవారికి మరే ఇతరములు రుచించవు??వైష్ణవ సిద్ధాంతాలలో?వేదాంత సూత్రాలకు భాగవత పురాణమే సహజమైన వ్యాఖ్యగా పరిగణింపబడుతున్నది. పురాణాలలో ఇది ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది.

మహాభాగవతానికి ఉన్న ప్రసిద్ధి సామాన్యమైనది కాదు. "ఈ మహా గ్రంథం ఆసేతుశీతాచల వ్యాప్త పండిత మండలీ కంఠస్థగిత విపుల మణిహారమై, నానా మత ప్రస్థాన సిద్ధాంతావిరుద్ధ ప్రమాణ తర్క సాధనోపాలంభ పూర్వక దుర్విగాహ భక్తి స్వరూప నిరూపణ ఫల వ్యాచిఖ్యాసువులకు ఆలవాలమై, గీర్వాణ వాణీ తరుణారుణ చరణారవింద మరందాస్వాదలోల హృన్మత్త మిళింద చక్రవర్తులచే బహుభాషలలోనికి అనూదితమై, మోక్షాభిలాషుల మనస్సులలో భద్రముద్రాంకితమై, నిజానికి పురాణమంటే ఇదేనన్నంత అవిరళమైన ప్రచారాన్ని గడించింది... ఆధ్యాత్మిక శిఖరాల నధిరోహించిన ఈ ఉద్గ్రంథం, భారతదేశంలోని సారస్వతేయుల మహాప్రతిభకు ప్రథమోదాహరణమై శాశ్వతంగా నిలిచి ఉంటుంది."

భాగవతం అవతరణ :

భాగవత పురాణము, సంభాషణల రూపంలో రచించబడింది. పరీక్షన్మహారాజు (పాండవ మధ్యముడైన అర్జునుని మనుమడు) ఒక బ్రాహ్మణునిచే శాపగ్రస్తుడై ఏడు దినములలోపు మరణిస్తాడని తెలిసి తన రాజ్య విధులన్నీ పక్కనబెట్టి ప్రతీ జీవియొక్క అంతిమ లక్ష్యాన్ని తెలియగోరాడు. అదే సమయంలోనే తను సంపాదించిన అపార జ్ఞాన సంపదను ఎవరికి బోధించాలో తెలియక ఒక మంచి శిష్యుని కోసం వెతుకుతున్న శుకుడు అనే ముని రాజుకు తారసపడి ఆ రాజుకు బోధించడానికి అంగీకరిస్తాడు. ఈ సంభాషణ ఎడతెరిపిలేకుండా ఏడు రోజులపాటు కొనసాగింది. ఈ వారం రోజుల సమయంలో రాజుకు నిద్రాహారాలు లేవు. ఒక జీవి యొక్క అంతిమ లక్ష్యం, నిత్య సత్యమైన భగవంతుడు శ్రీకృష్ణుడు గురించి తెలుసుకోవడమేనని వివరిస్తాడు.

భాగవతంలో చెప్పబడిన భగవంతుని స్వరూపం:

భగవంతుని దివ్య స్వరూపం భాగవతంలో ఒకచోట ఇలా వర్ణించబడింది. తేజోమయాలైన ఆయన కన్నులు సమస్త సృష్టికి మూల స్థానాలు. సూర్యాది సకల గ్రహ నక్షత్రాలు ఆయన కనుగ్రుడ్లు. అన్ని దిశలా వినగలిగిన ఆయన చెవులు సకల వేదనాదాలకు నిలయాలు. ఆయన శ్రవణం ఆకాశానికి, శబ్దానికి ఆదిస్థానం. భాగవతంలో విష్ణువు యొక్క 25 అవతారాల లీలలు వర్ణించబడ్డాయి.

ఒకసూర్యుండుసమస్తజీవులకుతానొక్కక్కడైతోచుపో
లికనేదేవుడుసర్వకాలముమహాలీలన్నిజోత్పన్నజ
న్యకదంబంబులహృత్సరోరుహములన్నానావిధానూనరూ
పకుడైయొప్పుమునుండునట్టిహరినేప్రార్థింతుశుద్ధుండనై.

ఒకే సూర్యుడు సకల జీవరాసుల్లో ఒక్కొక్కరికి ఒక్కొక్కడుగా కనిపిస్తాడు. అట్లేతాను సృష్టించిన అనేకములైన ప్రాణుల హృదయపద్మాలలో నానావిధాలైన రూపాలతో, లీలావిలాసాలతో, భగవంతుడు నిరంతరం ప్రకాశిస్తూ ఉంటాడు. అట్టి భగవంతుణ్ణి పరిశుద్ధులమై ప్రార్థిద్దాం. కనబడే సూర్యుని దర్శనం స్థూలదృష్టి. కారణం ఆయన ప్రత్యక్ష కర్మసాక్షి. కనబడని భగవంతుని దర్శనం సూక్ష్మ

దృష్టి. కారణం ఆయన పరోక్ష కర్మసాక్షి. అందుకే ఆ హరికి, సర్వపాప విదారికి నమస్కారం. ఇట్టి ప్రార్థన చేస్తూ మనలో ఆధ్యాత్మిక భావనా భాస్కర తేజాన్ని బలీయం చేసికుందాం. సాధారణ జీవితం ఒక సరళరేఖ. దాని ఆద్యంతాలు అర్థం, కామం అంతకుమించి అది ఎదగటంలేదు. కాని ఈ రెండింటిని ఊర్ధ్వ ముఖంగా మళ్ళించి వాటిని ఒకచోట కలపటమే ధర్మం. అప్పుడు అర్థకామాలు అనగా సంపాదనా సుఖాలు ధర్మబద్ధాలవు తాయి. అదే ఆదర్శమార్గం. ఇట్టి ధర్మార్థకామాల మూడింటిని పరివేష్ఠించి యుండే చరమ ఫలమే మోక్షం. ఈ విధంగా ప్రతి జీవి ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే చతుర్విధ పురుషార్థాల సాధనామార్గంలో అచంచలంగా పయనించాలి. కాని ప్రస్తుత సమాజానికి అర్థమే పరమార్థ మయింది. కామం వికార రూపం ధరించింది. ధర్మం సుదూరంగా నెట్టివేయబడింది. మోక్షం స్మృతి పథంలోనే లేదు. ద్రవ్యార్జనకు ఎట్టి నీచమార్గాన్నైనా ఆశ్రయిస్తోంది. కామసాఫల్యానికి ఎంతటి క్రౌర్యాని కైనా ఒడిగడుతూ ఉంది. ధర్మాన్ని పినరంత కూడ కనబడనీకుండ భూస్థాపితం చేస్తోంది. ఇక మోక్షమా! అదొక శూన్యవాదం. అర్థరహితమైన అనుభూతి. ప్రాజ్ఞులు ఈ పురుషార్థాలను వేముఖాల ఘోషించే ప్రయత్నం చేస్తూన్నారు. వాటి స్వరూపం లెస్సగా భావింపజేయడానికే భారత భాగవత రామాయణాది పురాణ కావ్యాలు వ్రాసినారు. భారతం ప్రధానంగా అర్థాన్ని, రామాయణం కామాన్ని, ఎలా ధర్మ బద్ధంగ చేయవచ్చునో చెబుతాయి. ఇక భాగవతమేమో మోక్షపురుషార్థాన్ని ప్రభోధిస్తుంది. అందుకే కవులంటే ఇట్టి ఉత్తమ రచనల్ని చేసినవాళ్ళే. వీరంతాఋషితుల్యులు. క్రాంతిదర్శిత్వం కలవారు.

సమాజం ఒక చైతన్య స్రవంతి. అది నిన్న ఉండింది. నేడు ఉంది. రేపటికి ఉంటుంది. భాగవత రచనాకాలం నాటి సమాజం ఎట్లా ఉండేదో అంతగా మనకు తెలీదు. కాని భాగవతంలో ప్రతిబింబించే సమాజం, వర్తమాన కాలానికి ఎలా ఉపకరిస్తుందో చూడటం అవసరం. ప్రధానంగా భాగవతంలో సత్వరజస్తమోగుణాలు, జనన మరణాలు, భక్తిజ్ఞాన కర్మయోగాలు, ధర్మాధర్మ వివేచన, పారమార్థికాంశాలు ప్రతిపాదింపబడినాయి. భాగవతం లోని వివిధ పాత్రల తీరుతెన్నుల ఆధారంగా పురుషార్థాల పాత్ర అంచనావేయవచ్చు.

"ధర్మార్థకామమోక్షాణాం
యస్యైకో-పినవిద్యతే
అజాగళస్తనస్యేవ
తస్యజన్మనిరర్థకం"

ధర్మం అర్థం కామం మోక్షం అనే వీటిలో ఏ ఒక్కటైనా చక్కగా తెలిసికొని సరైన మార్గంలో నడువలేనివాడు మేక మెడచన్నులా నిరర్థకజన్మ కలవాడని మనపూర్వులు ఏనాడోచెప్పినారు.

ధర్మం :

నారదుడు గత జన్మలో దాసీపుత్రుడు. అడవిలో వచ్చి పోయేవాళ్ళకు నీళ్ళిన్నూ యోగులకు నపర్యలు చేస్తూండేవాడు.

"మంగళమనుచునువారల
యెంగిలిభక్షింతువాన? కెండకునోడన్
ముంగలనిలుతునునియతిని
వెంగలిక్రియఁజనుదునురువివేకముతోడన్"

ఆ వేదవేత్తలు భుజించగా మిగిలిన అన్నాన్ని తినే వాడు. వారి ఆజ్ఞలు నెరవేర్చుతూ చివరకు జ్ఞానోదయం పొందినాడు.

వారల్ కృష్ణచరిత్రముల్చదువఁగా, వర్ణింపగా, బాడగా,
నా రావంబుసుధారసప్రతిమమై యశ్రాంతమున్వీనులం
దోరంవైపరిపూర్ణమైన, మదిసంతోషించినేనంతటం
బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభ దూరుండనై.

గుణవంతుణ్ణి చూచి సంతోషించడం గుణహీనుణ్ణి కరుణించడంఅనేమహత్తరధర్మంనేర్చుకున్నాడు. ఉద్ధవుడు ధర్మప్రతిష్ఠాపనకే శ్రీ కృష్ణుడు పుట్టాడని విశ్వసించినాడు. కృష్ణ నిర్యాణానంతరం శ్రీకృష్ణ బోధల్ని ప్రచారంచేసే

కార్యంలో నిమగ్నుడైనాడు. కర్ధముని భార్య సంతానవతి కాగానే సన్యసించాలనే ధర్మాన్ని గుర్తెరిగింది. అంగుడు దుర్మార్గుడైన కొడుకును వాడిని వెనుక వేసుకువచ్చే భార్యను త్యజించాలన్న ధర్మాన్ని పాటించినాడు. చిత్రకేతు తనయుడు పునర్జీవితుడయ్యే అవకాశం కలుగుతూ ఉంటే కూడ అది ధర్మకార్య నిర్వహణకు ప్రతిబంధక మని తలచినాడు. పరశురాముడు తొల్త తండ్రిమాట పాటించి సోదరులను తల్లిని చంపినా వరము కోరు మన్నప్పుడు స్వార్థచింతన మాని ధర్మబుద్ధితో తనచే నిహతులైన వారిని బ్రతికించుకున్నాడు. అంబరీషుడు ధర్మవీరానికి ప్రతీకగా నిల్చి అదే మోక్షహేతు వని నిరూపించినాడు. భాగవతారంభంలో శ్రీ కృష్ణుడు శిశు రక్షణకు ఉద్యమించినాడు. బాలఘాతుకుడైన అశ్వ త్థామను భూసురుఉడవు బుద్ధిదయా భూసురుఉడవు శుద్ధవీరభటనందోహా గ్రేసరుఉడవు, శిశుమారణ, మాసురకృత్యంబు ధర్మ మగునే? తండ్రీ! చంపుటకు ఉద్యుక్తుడైన అర్జునునితో ద్రౌపది...

"ఉద్రేకంబునరారుశస్త్రధరులై యుద్ధావనిన్నేరుకిం
చిద్రోహంబునునీకుఁజేయరుబలోత్సేకంబుతోఁజీఁకటిన్
భద్రాకారులఁచిన్నపాఁపలరణప్రౌఢక్రియాహీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటానీ చేతు లెట్లాడెనో

వెరచినవానిని చంపుట ధర్మము కాదని వారించింది. ధర్మాత్మునకు పశుపక్ష్యాదులు కూడ తోడ్పడుట రాముని పాత్రద్వారా, అధర్మవర్తనునితమ్ములైనను విడిచివెళ్ళుట రావణుని పాత్రద్వారా మనకు తెలుస్తూనేఉంది.

అర్థం :

కాసులు గలవాడు రాజు కావచ్చు. అర్థం లేని బ్రతుకు నిరర్థకం కావచ్చు. కాని ధనం దుర్మతులకు మదం కలిగిస్తూ ఉండగా, ఉత్తమకీర్తులు ఆత్మహితాన్ని మాని పరశ్రేయానికే ఆనందానికే తమ దగ్గర గల ధనమేగాక చివరకు శరీరాన్ని కూడా వ్యయిస్తారు.. ద్రుపదుడు బాల్యస్నేహితుడైన ద్రోణుని, ధనపతితో దరిద్రునకు, పొత్తుకుదర దని నీవెవ్వరో నాకు తెలీదు పొమ్మని అవమానించినాడు. రంతీదేవుడు అతని అలుబిడ్డలు, తమ ఆకలిని సైతం లక్ష్యపెట్టక,

సీ॥ అతిథిభూసురు డొక్క డాహారమడిగిన
గడపకప్రియముతో గారవించి
హరిసమర్పణమంచు నన్నంబులోసగ
మిచ్చినభుజియించి యేఁగెనాత
డంతలోనొకశూద్రుఁ డశనార్థియైవచ్చి
పాడసూపలేదన బోకతనకు
నున్నయన్నములోన నొకభాగమిచ్చిన
సంతుష్టుఁడై వాఁడు చనిన వెనుక

ఆ॥ కుక్కగమియుఁదాను నొక్కఁడేతేరనా
యన్నశేషమిచ్చి సన్నయంబు
లాడి మ్రొక్కిపంప నోడకచండాలు
డొక్క డరుగుదెంచి చక్క నిలిచి.

క॥ హీనుఁడఁడఁజండాలుండను
మానవకులనాథ!దప్పి మానదు నవలం
బోనేర నీకుఁజిక్కిన
పానీయము నాకుఁ బోసి?బ్రతికింపఁగదే."

దప్పితీర్చుకోవడానికి మిగిలి యున్న నీటినికూడ, దాహం అంటూ వచ్చిన పుల్కసునకుపోసినారు. ఆపదలో నున్న వారికి సుఖం గూర్చటంకంటే మించిన ధర్మం లేదని విశ్వసించినారు. బలిచక్రవర్తి సిరిమూటకట్టుకొని ఎవ్వడు పోడని, అతిథుల్ని సాక్షాత్తు భగవత్స్వరూపులుగా సంభా వించి, వారి కోర్కెలు తీర్చుటలో గల ఆనందం అనుభ వించినాడు. కుచేలుడు అర్థార్థియై శ్రీకృష్ణుని యొద్దకు వెళ్ళినా, ఆయన దర్శనంతోనే సర్వం ఒనగూడిన తృప్తితో ఏమికోరకనే వెనుదిరిగి వచ్చినాడు. సుదాముడు.

నీపాదకమలసేవయు,
నీపాదార్చకులతోడినెయ్యమును, నితాం
తాపారభూతదయయును
తాపసమందార నాకుదయసేయుగదే - అన్నాడు.

కామం :

దితి అసురసంధ్య వేళ రతికూడదని భర్త చెప్పినా వినక బలవంతంగా తన పంతం నెగ్గించుకొని లోకకంటకు లైన సుతులకు తల్లి అయ్యింది. పురంజనుడు కామా సక్తితో స్వాతంత్ర్యం కోల్పోయినాడు. పెంపుడుజంతువులా భార్య ఏంచేస్తే అది తానూ చేస్తూ ఆమెకు వశుడైనాడు. అవిద్యతోకూడిన దేహకర్మ కారణంగా బహుజన్మ బంధా లకు మూలమైనాడు. కామము చేత భ్రష్టాచారుడై శబర కాంతా సంగమంతో తండ్రి యైనాడు. ఉత్తానపాదుడు ఇద్దరు భార్యల్ని కట్టుకొని ఒక్క భార్యపై మాత్రమే మమకార వ్యామోహాలు పెంచుకొన్నాడు. ఆమెచే సవతి కొడుకు తన ఎదుటే ఉపాలంభింపబడితే కూడ మౌనం వహించాడు. చ్యవనుడు తాను పుట్టలో నుండగా తెలియక కళ్ళుపొడిచిన స్త్రీని తనను పెళ్ళి చేసుకుంటే క్షమిస్తానని ఆంక్షలు విధించినాడు. యయాతి తన వార్ధక్యాన్ని కుమారుల కిచ్చి వారి యౌవనాన్ని తాను స్వీకరించి సుఖలోలుపుడు కాదలచినాడు. వసుదేవుడు భార్యలేనిదే బ్రతుకలేని బలహీనతతో కావాలంటే పుట్టిన పిల్లల్ని అందరినీ ఇస్తాను చంపుకో నాభార్యను మాత్రం నాకు వదలు మని కంసుణ్ణి కోరినాడు. రాక్షసులు మోహిని అందాన్ని చూస్తూ అమృతంపంపకంలో ఆమె చేసిన మోసాన్ని గమనించలేకపోయారు.

శ్రీకృష్ణ గోపికల మధ్య ప్రవర్తమానమైన అనురాగం జీవాత్మ పరమాత్మల ఐక్యానుసంధానానికి సాక్ష్యంగా నిలిచింది. అది కామం కాదు. మధుర భావనలతో లౌకిక సుఖానికై తపన చెందిన గోపికలకు కృష్ణుడు నవ్వే సమాధానంగా ఇచ్చి ఆత్మారాముడై వారితో రమించినట్లు పోతన భాగవతం సాక్ష్య మిస్తున్నది. ఇట మలినరహిత మైన ప్రేమను అనుభూతి ప్రదమైన తృప్తిని వారి కిచ్చుట ద్వారా కృష్ణుడు సామాన్యులు భావించే శారీరక సుఖానికి భిన్న మైన అనుబంధాన్ని గోపికలతో సాగించినట్లు గుర్తించ వలసి ఉంది.

శ్రీ కృష్ణుడు అసలిత బ్రహ్మచారి అనే తిరుగులేని సత్యాన్ని భీష్ముడే ధ్రువీకరించినాడు.

"త్రిజగన్మోహననీలకాంతిఉదనువుద్దీపింపఉబ్రాఛాతనీ
రజబంధుప్రభమైనచేలముపయిన్ రంజిల్లనీలాలక
వ్రజ సంయుక్తముఖారవిందమతిసేవ్యంబైవిజృంభింపమా
విజయుం జేరెడు వన్నెలాడు మది నావేశించు నెల్లప్పుడున్".

కృష్ణుడు శిఖిపించమౌళి అగుటయే దానికి ప్రబలమైన సాక్ష్యం. స్త్రీ పుం మయూరాలమధ్య రతిక్రీడ లేదు. ఆడునెమలి అందాన్ని తిలకిస్తూ మగనెమలి బాష్పాలను రాల్చగా, ఆ కన్నీటిబిందువుల్ని తన్మయత్వంతో ఆడు నెమలి స్వీకరిస్తుంది. అదే దాని గర్భధారణకు కారణ మవుతుంది. భోగమనగా సర్పం. దానికి శత్రువు నెమలి. భోగశయనునివలె కనిపించినా భోగి (కాళీయుని) గర్వాన్ని అణచినవాడుక ృష్ణుడు. అంతేకాక పంచేంద్రియ స్థానీ యులు పాండవులు. వారికి భోగనిధానమైన దేహమే ద్రౌపది. శ్రీకృష్ణుడు పాండవపక్షంలో నిల్చి ద్రౌపదిని రక్షించాడంటే ఇంద్రియాలను అదుపులో ఉంచడం ద్వారా దేహాన్ని కాపాడినా డనుట. ఇట్టి తాత్త్విక భూమిక ద్వారా శ్రీకృష్ణుని పవిత్రత స్పష్టమవుతూ ఉంది. ఇట్టి ఔన్నత్యాన్ని తెలిసికోలేని అల్పజ్ఞులు కృష్ణలీలలకు వికృతార్థాలు తీసి దూయబట్టటం క్షమింపరాని దోషం.

మోక్షం :

జీవిత పరమావధి మోక్షమే సుమా! అని సనాతన ధర్మం ప్రబోధిస్తుంది. మోక్షం తాత్త్వికతా యుక్తమైన భక్తిచేతనే సాధ్యం. భక్తి అనేది ఒక విధమైన చిత్త పరిపాకం. ఆకలిగొన్న లేగదూడ అమ్మ పాలకై అలమటిం చునట్లు, తల్లి ఒడిలోని పసికూన పాలిండ్లను తడు ముటలో పొందు అనిర్వచనీయమైన అనుభూతిలాగ, యువతి మనోహరుని పరిష్వంగ సుఖానికై ఆరాటపడు విధంగా భక్తుని అంతరాత్మ అఖండజ్యోతి దర్శనానికి, తద్వారా లభించే చిన్మయానందానికి పలవరిస్తుంది.

భాగవతంలోని పాత్రలలో ఖట్వాంగుడు :

ఆ॥ వరమునాకునొండు వరమొల్ల ననవుడు
నాయువొకముహూర్తమంతతడవు
గలదటంచుఁబలుక గగనయానమునన
మ్మానవేశ్వరుండు మహికివచ్చి.

ముహూర్తకాలంలో మోక్షార్హత సంపాదించుకొన్నాడు. తాను బ్రతికేది కేవలం ఏడుదినాలే అని తెలిసి ఆ లోపలే ముక్త సంగులైన మునులబోధల పట్ల పరీక్షుత్తు సంసక్త మనస్కుడైనాడు. కపిలుడు తల్లికే మోక్షకారణమైన తత్వాన్ని బోధించినాడు. తత్వశూన్యులు సంసార వ్యామోహులు అయినవారి సాంగత్యం మోక్ష ప్రతిబంధకంగా వృత్రాసురుడు పేర్కొనినాడు. మృకండుడు లోకాలను భ్రాంతిలో ముంచుతున్న మాయను తెలిసికొనే జ్ఞానం పొందుటపట్లఆసక్తిచూపినాడు.

సర్పయాగం చేసిన జనమేజయుని ఉద్దేశించి నారదుడిలా అంటాడు. "ఒకరు తనను బాధించినారని తానొకరిని బాధించగలనని భ్రమచెంది జీవి దుఃఖాన్ని తెచ్చుకుంటాడు." కాబట్టి ఈ మాయా వికారాదులకు దూరంగా ఉంటూ ప్రతివ్యక్తి హరిభక్తి పెంపొందించుకోవలసి ఉంది. భాగవత భక్తులలో తమోగుణ ప్రధానుడైన గజేంద్రుడు, రజోగుణ దీప్తుడు ధ్రువుడు, సత్వగుణ ప్రకాశుడు ప్రహ్లాదుడు ఉన్నారు. జ్ఞాన తేజులైన ఋషులు, భక్తి నిర్భరులైన మునులు, రక్తిమయులై అభిన్నత కోరిన గోపికలు, వైరంతో భగవత్ప్రాప్తి నొందిన రాక్షసులు కనిపిస్తారు.

ముగింపు :

ధర్మార్థ కామములు ఆచరించటం మోక్షపథానికి సోపానపంక్తిని నిర్మించుకోవటమే. ధర్మం ఆచరించే సమయంలో వ్యక్తి బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలలో దేని యందుంటాడో ఆ ధర్మాన్ని ఆచరించాలి. బ్రహ్మచారి నిష్ఠతో గురుశ్రూష ఆచరించి అధ్యయనం చేయాలి. నైష్ఠిక బ్రహ్మచర్యం నుండి చలిస్తే అది ధర్మం కాదు. భాగవతంలో గృహస్థుడైన అంబరీషుడు దూర్వాస మునిని ఏకాదశీవ్రత పరిసమాపన వేళ అతిథిగా ఆదరించ దలచుకొన్నాడు. ద్వాదశి ఘడియలు దాటిపోతున్నా నదీ స్నానానికి వెళ్ళిన ముని రాలేదు. అంబరీషుడు ధర్మచర్చ చేసి సలిల భక్షణంబు సమ్మతంబు అని తీర్థం మాత్రమే పుచ్చుకొన్నాడు. ఆ పిమ్మట వచ్చిన ముని కుడువ రమ్మని మునుముట్ట కుడిచినాడు. ధర్మ భంగంబు జేసి దుష్కర్ముడయ్యెనని క్రుద్ధుడైనాడు. తరువాతి కథ ఎట్లున్నా అతిథికన్నా ముందు గృహస్థుడు భోజనం చేయరాదనే ధర్మం ఇట నిర్దేశింపబడింది. వాన ప్రస్థాన్ని గైకొనేటప్పుడు కూడా సంసారాన్ని అంటిపెట్టుకొన్నవారు దుఃఖాన్ని అనుభవింపక తప్పదు.

ఈ విధంగా మానవుడు అన్ని దశల్లోనూ ధర్మం ఆచరించాలని భాగవతం ప్రతీక పాత్రలద్వారా ప్రత్యక్షీకరిస్తుంది. ధర్మం ఆచరిస్తూ శరీర పోషణ పట్ల, ఆశ్రితజన పరిరక్షణ కొరకు అర్థం సంపాదించాలి. ధర్మబద్ధమైన అర్థార్జన మోహానికి తావీయదు. ఎప్పుడైనా వాటిని తేలికగా త్యజించే మనఃస్థితిని కలుగజేస్తుంది. రంతిదేవుడు రాజైనా భోగపరాయణుడు కాకుండా తన సంపద నంతా దానం చేసినాడు. భాగవతం ఐహిక అర్థాన్నివిడనాడి, పారమార్థిక అర్థాన్ని సముపార్జించు కొమ్మని అనగా మోక్షసామ్రాజ్యం పొంద మని ప్రబోధిస్తుంది. బలిచరిత్ర మిట్టిదే. "విత్త మార్జనచేసి విష్ణువీగుటగాక" యజన, దానాదుల కుపయోగించి కర్మ సంగత్వం పొందక భగవదర్పణ బుద్ధితో మెలగటమే చరమలక్ష్యం కావలెను.

కామాన్ని ముక్తికి సోపానంగా మలచవలెనంటే దానితో ధర్మాన్ని జోడించాలి. తలపులను అన్యాక్రాంతం కానీయకుండా సాధన చేయాలి. భాగవతం "కన్నుదోయికి అన్యకాంతలడ్డమై"నపుడు మాతృభావంతో మసలుకొమ్మన్నది. మోహినివలలో చిక్కిన శివుడు, ఒక గంధర్వుని రతిక్రీడలను చూచి భర్త కోపానికి గురైన రేణుక, పరుల రతిని జూచి భ్రష్టుడైన అజామిళుడు, ఆధునిక సమాజం యొక్క పోకడలకు హెచ్చరిక పాత్రలు. అట్టి

కామాన్ని ఆహార, విహారాది నియమాల ద్వారా అణచి ముక్తినిపొందాలి. మోక్షం చరమ పురుషార్థం. మానవజన్మ ఉత్తమం. భవహర మగు శ్రీకైవల్యపదంబును పొందుటయే మానవ జీవిత కర్తవ్యం. అందుకు భాగవతం పఠనం, శ్రవణం ఉత్తమం. దాని ద్వారా చతుర్విధ పురుషార్థాలు లభిస్తాయి.

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు **7989781963** లేదా వాట్స్‌ఆప్ నెంబర్ **7386529274** సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్‌లో ప్రియాంక ఫాంట్‌లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   - ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   - బి) ముఖ్యాంశాలు (Key words)
   - సి) ముగింపు (Conclusion)
   - డి) పాదసూచికలు
   - ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

పురుషార్థసాధన – గజేంద్ర మోక్షము

– విజ్జేపు నాగమణి, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.

ప్రవేశిక :

భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు, ఆదర్శ ప్రాయాలైన గ్రంథాలు రామాయణ, భారతేతిహాసాలూ, అష్టాదశ పురాణాలు. మానవజాతికి సంస్కార సార్ధకాల్ని కలిగించే ఈ గ్రంథాల్లో సనాతన ధర్మం ప్రతిష్ఠితమై ఉంది. ఇందున్న ధర్మ సూక్ష్మాలు మానవాళి తెలుసు కోవలసిన అవసరం ఉంది. పురుషార్థాలు అనగా ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు. వీని ప్రస్తావన వేదకాల సాహిత్యం నుండి మనకు లభిస్తూ ఉన్నది.

ధర్మార్థకామములు మూడింటిని ఆచరించినవారికి చివరిదైన మోక్షమార్గాన్ని పొందడం సులభం. పురుషార్థ సాధన ద్వారా మోక్షాన్ని పొందినవారి కథలు, గాథలు అనేక కలవు. మోక్షధర్మానికి ప్రతీకగా "గజేంద్ర మోక్షం" ఘట్టాన్ని చెప్పుకోవచ్చును.

ఉద్దేశము :

స్వార్థ చింతన, అహంకారం అనే దుర్గుణాల వల్ల చెడు నడతలు నడవకుండా యువతకు పురుషార్థాల యొక్క ప్రాధాన్యాన్ని తెలియజేసి, సన్మానవర్తనులుగా మార్చాలన్నది ఈ పరిశోధనా పత్రము యొక్క సారాంశం.

విషయము :

॥ గజేంద్రమోక్షం ॥ ఘట్టాన్ని తాత్విక దృష్టితో చూపిస్తూ, మానవ జీవితానికి అన్వయింపచేస్తూ, మోక్షసాధన మార్గాన్ని ధ్రువుడు, ప్రహ్లాదుని వంటివారు ఏవిధంగా పొందారో తెలుసుకోవచ్చును. భగవత్సాక్షాత్కారం పొందటానికి వయస్సు, బలం ప్రధానం కాదని బుద్ధి బలమే సాధనమని ఈ ఘట్టాన్ని ఉదాహరణగా తీసుకుని ఈతరం వారికి తెలియజేయాలి.

మోక్షధర్మమునకు ప్రతీక – గజేంద్ర మోక్షం :

ప్రస్తుత ఘట్టము శ్రీమద్భాగవతము నందలి అష్టమ స్కందం లోనిది. గ్రంథకర్త శ్రీ పోతనామాత్యులు. ఏ కథలలో అయితే పుణ్యశ్లోకుడైన శ్రీహరి చెప్పబడునో పండితులకి ఆ కథలే ఆనందాన్ని కలుగజేస్తాయి. అటు వంటి భాగవతాన్ని శుకమహర్షి పరీక్షిత్తుకి చెబుతూ; నీటిలో బ్రతికే మొసలి, అడవిలో తిరిగే ఏనుగులకు పోరాటం కలగటం, శ్రీహరి గజరాజును రక్షించడం మొదలగు విషయాలను తెలియజేయుచున్న సందర్భములోనిది ఈ కథ.

పాల సముద్రంలో యోజనాల ఎత్తు, వైశాల్యం ఉన్న బంగారు, వెండి, ఇనుముతో కూడిన కొండలు న్నాయి. ఆ పర్వతానికి "త్రికూటము" అని పేరు. జలజల ప్రవహించే సెలయేళ్ళు, చుట్టూ శోభాయమానమైన వనాలు, సరస్సులతో నిత్యం అలరారుతుందా ప్రదేశం. అటువంటి చోట ఒకనాడు గజరాజు తన ప్రియా సమూహంతో విహరించి అలసి, దాహంతో రమ్యమైన సరోవరాన్ని వెతుకుతూ రాజహంసల సమూహంతో కూడుకొన్న ఒక సరస్సును చూసి, దిగి, అందులో తన పరివారంతో జల క్రీడలు ఆడుతుండగా, ఒక మొసలి అమాంతం ఏనుగు కాళ్ళను తన కోరలతో పట్టింది. ఏనుగు దాని నుండి విడిపించుకునే ప్రయత్నం చేసింది. ఒకదానితో ఒకటి పోటీ పడుడూ, వాటి బలంతో భుకర పోరాటం సాగించాయి. ఎంత ప్రయత్నించినా గంభీరమైన ఆకృతి కలిగిన ఏనుగు, మొసలి నుండి తప్పించుకోలేకపోయింది.

గజేంద్రుడు తన బలాన్ని మాత్రమే సాధనంగా గ్రహించాడు.

"పాదద్వంద్వము నేలమోపి పవనున్ బంధించి పంచేంద్రియో
న్మాదంబు బలమార్చి బుద్ధిలతకన్ మారాకు హత్తించి ని
ష్కేద బ్రహ్మపదావలంబన గతిం క్రీడించు యోగీంద్ర మ
ర్యాదం నక్రము విక్రమించె కరి పాదాక్రాంత నిర్వక్రమూ"॥

మొసలి మహాయోగిలా ఉంటే సంసార వ్యామోహంలో చిక్కుకున్న ప్రాణిలా ఏనుగు చిక్కి శల్యమవుతున్నది. తన శక్తి పూర్తిగా క్షీణించే వరకూ పోరు సాగించి, నీరస పడింది.

పై వాక్యాలను తప్పక గమనించాలి. తాను బలం ఉన్నంత వరకు నేను, నా బలం అనుకున్నదే తప్ప, భగవంతుడు ఉన్నాడని గాని, తానే కాపాడాలని కాని భావించలేదు. తన శక్తి అంతా అయిపోయిన తర్వాతే, ఇదిగో ఈ విధంగా ప్రార్థించడం మొదలుపెట్టింది.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూల కారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానయైన వా
డెవ్వడు వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్॥"

అని ప్రార్థించింది. ఇప్పుడు కూడా ఎవరివల్ల ఈ జగాలు పుట్టాయో, ఎవరియందు లయమవుతాయో, ఎవరు కారణంగా చెప్పబడతాడో అని పలికింది తప్ప, దేవా! నీవే దిక్కవలేదు. శక్తి ఉడుగుతున్నా అహం మాత్రం చావలేదు. ఈ స్వార్థమే మానవాళిని కూడా పతనం చేస్తుంది. పరులసేవ, పరులకు సాయం ఇవి విస్మరించడం తప్ప, ఆచరించడమనేది ఏకోసానా కనపడట్లేదు నేటి జీవనంలో. ఇదే ఆపదలకు మూలమని నిరూపిస్తుంది ఈ ఘట్టం. ఇంకా "నేను" అనే భ్రాంతిని వీడలేదు. శరీరం అంతా నీరుగారిపోతుంది. ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయే సమయం ఆసన్నమవుతుంటే, అదిగో అప్పుడు కలిగింది పశ్చాత్తాపం; వెనువెంటనే;

"లావొక్కింతయులేదు, ధైర్యము విలేలంబయ్యె ప్రాణంబుల్
దావుల్దప్పె మూర్ఛవచ్చె దనువు డస్సెం శ్రమంబయ్యెడి
నీవేఁ దప్ప నితఃపరంబెరుగ మన్నింపందగుం దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా॥"

అంటూ వేడుకుంది. వెంటనే హుటాహుటిన శ్రీమహావిష్ణువు గజేంద్రుని చెంతకు చేరుకున్నాడు. ఇంతసేపు శ్రీహరి ఉపేక్షించడానికి కారణం లేకపోలేదు. ఏనుగు ఇంతవరకు నేను, నా బలం అనే అహంకారంతోనే ప్రార్థించింది తప్ప, ఆర్తితో కాదు. తనలో బలం సన్నగిల్లాక అహంకార ఛాయలు పోయి, భగవంతుణ్ణి నిస్వార్థంతో ప్రార్థించింది. "ఈశ్వరా!" అనే ఆ పిలుపే శ్రీహరి రాకకు కారణమయినది.

పెద్దలపట్ల చిన్నవారు వహించవలసిన ధర్మం ఈ సంఘటన ద్వారా వ్యక్తమవుతున్నది. గురువుల ఎదుట ఎంత మర్యాదను పాటించాలో, ఇటువంటి ఉపాఖ్యానాల్ని ఉదాహరణగా స్వీకరించి, యువతకు బోధించవచ్చు.

ముగింపు :

మోక్షసాధనకు మార్గం మమకార, వికారలను త్యజించుట అని గ్రహించాలి. "గజేంద్రుడు", "మొసలి" రెండూ కూడా పూర్వం పెద్దలపట్ల అనుచితంగా ప్రవర్తించడం వలననే శాపాన్ని పొంది, ఇంత భీకరపోరాటం చేయవలసిన స్థితి ఏర్పడింది. కాబట్టి ఇహలోకంలో సన్మార్గ వర్ధనులుగా మెలగటం ఎంతో మంచిది. దాని వలన "మోక్షమార్గానికి బాట" ఏర్పడుతుందని భావించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్భాగవతము (అష్టనుస్కందం) - బమ్మెర పోతన.
2. "ఉషశ్రీ" భాగవతం (సరళ వచనం) - పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు.

❖ ❖ ❖

"కుమార సంభవం – గృహస్థాశ్రమధర్మం"

– డా॥. పెండ్యాల అనసూయా ప్రసన్నలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సంస్కృత విభాగం, సిటీ కాలేజి, హైదరాబాదు.

ధర్మార్థ కామ మోక్షాణాముపదేశ సమన్వితమ్ ।
పూర్వవృత్తం కథాయుక్తమితిహాసం ప్రచక్షతే ॥

ధర్ముము, అర్థము, కామము, మోక్షము అను చతుర్విధ పురుషార్థాలకు సంబంధించినది, ఉపదేశాలతో కూడినది, పూర్వకాలంలో జరిగిపోయినది, కథలతో విలసిల్లునది ఏది కలదో అదే ఇతిహాసమైంది. భారతీయ వాఙ్మయంలో అటువంటి ఇతిహాసాలు రామాయణ మహాభారతాలు.

"రామో విగ్రహవాన్ ధర్మః" అని రామాయణం ప్రబోధిస్తే, మహాభారతం "ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ। యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్" ॥ అని స్పష్టపరచింది. అంటే 'ధర్ముము, అర్థము, కామము, మోక్షము అను విషయాలకు సంబంధించి ఇందులో ఏమి ఉన్నదో అది వాఙ్మయమంతటా ఉంది. ఇందులో లేనిది మరెందులోనూ లేద'ని శ్లోకార్థం. అట్లే పురుషార్థ లను గూర్చి చెప్పని సాహితీప్రక్రియ సంస్కృత వాఙ్మ యంలో ఎక్కడా కనిపించదు. "పురుషార్థాలలో ధర్మానికే అగ్రస్థానమీయబడింది" అని సాహిత్యం నిరూపించింది.

ఊర్ధ్వబాహుర్విరౌమ్యేష న చ కశ్చిచ్ఛృణోతిమామ్ ।
ధర్మాదర్థశ్చ కామశ్చ స ధర్మః కిం న సేవ్యతే ॥

"ధర్ముము వలననే అర్థకామములు కలుగుతున్నాయి. అట్టి ధర్మాన్ని ఆచరించండయ్యా" అని చేతులెత్తి ఆక్రో శిస్తున్నాను. కానీ నా యీ ఆక్రోశమునెవడును వినడేమి? అని వ్యాసమహర్షి వచనము.

హితముతో కూడినదే సాహిత్యం మానవుడు సంపూర్ణ వ్యక్తిత్వంతో శోభిల్లాలంటే అందుకు హితాన్ని బోధించే అక్షరశక్తి అత్యంతావశ్యకం. అటువంటి శక్తి భారతీయ సాహిత్యానికే ఉందనటం అతిశయోక్తికాదు. భారతీయ సాహిత్యం ఆనాటినుండి ఈనాటి వరకు మానవాళి శ్రేయస్సును కోరుతూనే ఉంది. శ్రేయస్సుకు దోహదపడే ధర్మాచరణకు వేదకాలం నుండి ప్రమాణాలు కనబడు తూనే వున్నాయి. కనుకనే -

"వేదః స్మృతిః సదాచారః స్వస్యచ ప్రియమాత్మనం ।
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్" ॥

వేదం, స్మృతి, సదాచారం, తన మనస్సునకు ఇష్టము అను నాలుగు విధాలైన "ధర్మునకు" ప్రత్యక్ష లక్షణ మని పెద్దలు చెబుతారు.

వేదపురాణాదులు కేవలం చతుర్విధపురుషార్థాల్ని గూర్చి చెప్పి ఆపకుండా దానిని ఆచరించి చూపిన విజయగాథల్ని, గొప్పనడవడుల్ని సాహిత్యం అందించే 'సారం'గా నిరూపించాయి. వందబోధల కన్నా సాధించి చూపిన ఒక్క మహాపురుషుని కథ మానవాళిని ప్రభావితం చేస్తుంది. శ్రేయస్సులను చేకూరుస్తుంది. సంపదల్ని పెంపొందిస్తుంది. అంతెందుకు విశ్వానికంతటికిని ఆ మహనీయుడు ప్రేరణగా నిలుస్తాడు. అటువంటి మహత్తరపురుషుల జీవన విధానాలను సాహిత్యం రూపంలో రామాయణ మహాభారతములనే పేర్లతో అందించిన ఘనత వాల్మీకి వ్యాసాదులదైతే అదేమార్గంలో నడచి విశ్వహితాన్ని కాంక్షిస్తూ తన 'రచన'కు శ్రీకారం చుట్టినవాడు మహాకవి కాళిదాసు. చతుర్విధ పురుషా ర్థాలను వ్యక్తి సాధించే క్రమంలో 'ధర్మానికి' ఉన్న స్థానాన్ని గూర్చి మానవాళికి బోధపడేలా "కావ్యసృష్టి" గావించిన కవికుల గురువు కాళిదాసు. సంస్కృత మహాకావ్యకర్తయైన కాళిదాసమహాకవి పేరు వినని భారతీయుడుండడు అనటం అతిశయోక్తి కాదు.

విషయం :

ధారణాద్ధర్మ మిత్యాహుః ధర్మోధారయతే ప్రజాః ।
యత్స్యాద్ధారణసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః[1] ॥

ధరించునది కనుక ధర్మము అనబడింది. ధర్మమే ప్రజలను ధరిస్తూ వుంటుంది. ఏది సంఘాన్ని కట్టు బాటుతో నడుపుతుంటుందో అదే ధర్మమని పెద్దల వచనం. ఒక గొప్ప ధర్మంకానీ, సిద్ధాంతంకానీ వ్యక్తికి బోధపడాలంటే దానిని ఆచరించేవారిలో ఎంతో నిష్ఠ ఉండాలి. అప్పుడే సాహిత్యమైనా సిద్ధాంతమైన పరిరక్షించ బడేది. ఎందుకంటే -

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే[2] ॥

లోకములో ఉత్తమవ్యక్తి ఎట్లా నడుస్తున్నాడో ఇతర జనులున్నూ అట్లే నడుస్తారు. ఉత్తములు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తున్నారో దానినే లోకము అనుసరిస్తూంటుంది.

కాళిదాసమహాకవి అటువంటి ఉత్తమపురుషుల గాథలనే తన కావ్యాలలో నాయకులుగా చూపాడు. వారి ఉత్తమ నడవడులనే ఉన్నత వ్యక్తిత్వాలుగా నిరూపించాడు. ఈ మహాకవి రచించిన 17 సర్గలతో కూడిన 'కుమారసంభవమను' మహాకావ్యం సంస్కృత పంచమహాకావ్యాలలో మొదటిది. ఇందులో జడాత్మక పదార్థాలను కూడా పాత్రలుగాచేసి వాటికి ప్రాణంపోసి - గొప్ప వ్యక్తిత్వాలను వాటికి ఆపాదించి- 'ధర్మాచరణ'లో ఆ పాత్ర ఎంత సమున్నతమైనదో చాటిచెప్పాడు. ఉదాహరణకు హిమవంతుడను పర్వతరాజు. ఈ రాజు పర్వతములన్నిటికి నాయకుడు. నగాధిరాజు. ఆకారంలోనే కాక మనస్సులో కూడా ఎంతో సమున్నత శిఖరాలను అధిరోహించిన ఉత్తమపాత్ర. జీవితంలో ఒక వ్యక్తి గృహస్థుడై ధర్మాచరణ పరాయణుడిగా ఎంత ఉన్నతంగా ఎదుగుతాడో నిరూపించాడు. హిమవంతుడు ఒకవైపు పర్వతములకు రాజుగాను, మరొకవైపు ఒక గృహస్థుగాను మనకు ఈ కావ్యంలో కనిపిస్తాడు. గృహస్థుయొక్క ధర్మవర్తనమెంత గొప్పదో, ధర్మాచరణలో తన మహనీయతను ఏవిధంగా చాటుకుని ఉన్నతునిగా భాసిల్లాడో కాళిదాసు అద్భుతంగా ఆ పాత్రను తీర్చిదిద్దాడు. గృహస్థధర్మం సమస్త ధర్మాల్లోను విలక్షణ మైంది. సమాజంలో ఆశ్రమధర్మం నాల్గురకాలు. ఒకటి బ్రహ్మచర్యాశ్రమము, రెండు గృహస్థాశ్రమము, మూడు పరివ్రాజకాశ్రమము, నాల్గు సన్యాసాశ్రమము. ఈ నాల్గింటిలో అత్యుత్తమమైన ఆశ్రమము గృహస్థాశ్రమ విధానమే. అదే భారతీయ సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. గృహంలోని దంపతులు, సంతానం, ఎంత ప్రీతికరమైన మనస్సును కలిగివుంటారో అదే 'గృహానికి' శోభనిస్తుంది. ఒకవ్యక్తియొక్క శరీరం, మనస్సు ఆనందంతో పరవశించాలంటే గృహవాతావరణమే మూలమని ఈ కావ్యం నిరూపిస్తుంది. గృహంలోని సభ్యుల సహకారమే ఆ గృహస్థుణ్ణి "ఉత్తమ వ్యక్తి"గా తయారుచేస్తుంది. కనుక ప్రస్తుతం ఈ అంశం పైననే నా యీ పరిశోధనావ్యాసం ఆధారపడి వ్రాయబడింది. ఆ గృహస్థు పాటించే ధర్మాన్ని గురించి చెప్పి అర్థకామాదులను ఏవిధంగా తన జీవితంలో సాధించుకుంటాడో తెలియజేయడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

"సర్వేషామపి చైతేషాం వేదస్మృతి విధానతః ।
గృహస్థ ఉచ్యతే శ్రేష్ఠః స త్రీ నేతాన్ బిభర్తిహి" ॥

ఈ నాల్గు ఆశ్రమముల వారిలో శ్రుతి స్మృతులందు చెప్పబడుటవల్ల గృహస్థుడే ఉత్తముడనబడతాడని, అతడే తక్కిన మూడు ఆశ్రమముల వారిని పోషిస్తున్నాడని కనుక అతడే "శ్రేష్ఠుడ"ని మనుస్మృతిలో చెప్పబడింది. ఇదే శ్రేష్ఠ వ్యక్తిత్వం పర్వతరాజైన హిమవంతునితో స్పష్టము చేయబడింది. అటువంటి "ఉత్తమ గృహస్థుని"గా ఈ కావ్యంలో హిమవంతుడనే పాత్ర మనకు కళ్ళముందు సజీవంగా సాక్షాత్కరిస్తుంది. అంతేకాదు ఉత్తమ గృహస్థుడు తన ధర్మాన్ని ఏవిధంగా ఆచరిస్తే ఉన్నతునిగా నిలబడతాడో ఈ పాత్ర నిరూపిస్తుంది. ధర్మాన్ని ఏవిధంగా ఒక వ్యక్తి అర్థం చేసుకోవాలో తెలుపడానికి కవి ఈ పాత్రను అద్భుతంగా సృజించాడనిపిస్తుంది.

"ధృతిః క్షమా దమో-స్తేయం శౌచమింద్రియనిగ్రహః।
ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్"[4] ॥

సంతోషం, కీడు చేసినవానికి తిరిగి కీడు చేయకుండా వుండటం అనేది క్షమ. వికారాదులకు కారణమున్నప్పటికీ మార్పుచెందకుండా వుండటం దమం. పరుల వస్తువులను అపహరింపకుండా వుండటం ఆస్తేయం. ఒంటిని నీటితో కడుగుకొనటం శౌచం, విషయములనుండి ఇంద్రియాలను మరల్చటం ఇంద్రియనిగ్రహం అంటారు. శాస్త్రాదుల రహస్యాన్ని ఎఱుగుట, ఆత్మజ్ఞానం, ఉన్నదున్నట్లుగా చెప్పుట, కోపములేమి అను ఈ పది ధర్మమునకు గుర్తులు అని మనుస్మృతిలో చెప్పబడింది. ''ఈ ధర్మమును పెంపొందించు ఈ దశగుణములు జడ పదార్థమైన హిమవత్పర్వతమునకు కవి ఏవిధంగా ఆపాదించినాడో గమనిస్తే కావ్య ప్రయోజనమిదేనని బోధపడుతుంది.''

''ధర్మమంటే శాస్త్రం ఆదేశించిన నియమ నిబంధనలకు లోబడి త్రికరణశుద్ధిగా నడుచుకోవటం''. ఈ విధమైన వర్తనంతో గృహస్థు ఉన్నతుడిగా ఎదుగుతాడని కుమారసంభవ కావ్యం నిరూపిస్తోంది.

''ఏకో ధర్మః పరం శ్రేయః క్షమైకాశాన్తిరుత్తమా''[5] అని అంటుంది భారతం. అంటే మిక్కిలి శ్రేయోదాయకమైనది ధర్మమొక్కటే. సహనమొక్కటే ఉత్తమమైన శాంతినిస్తుందిట.

కుమారసంభవమున ఈ భావం మొదటి శ్లోకంలోనే సూచించబడింది.

''అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయోనామ నగాధిరాజః ।
పూర్వాపరౌవారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవ మానదణ్డః''[6] ॥

అంటూ భరతఖండానికి ఉత్తరపుటంచున నిరంతరం, హిమాలయమనే మంచుకొండ, సార్థకనామమును కలిగి హిమాద్రిగా అలరారుతోంది. అది పూర్వపశ్చిమములకు దీర్ఘముగా సాగి తూర్పుపడమర సముద్రములనొరసి పృథ్వికి కొలచుటకు సిద్ధము చేయబడిన మానదండమా (కొలబద్దయా) అన్నట్లు ఒప్పారుతోంది. అనగా ఈ హిమవత్పర్వతము దైవనిర్మితమైన కోటగోడ అని, అది దేవతలు నడయాడు స్థలము కనుక చైతన్య విలసితమని కవిచేత చెప్పబడింది. ఆవిధంగా ఆరంభించబడిన పర్వతరాజు మహిమ సప్తర్షుల రాకతో మరింత ఇనుమడించింది. ఆ శైలము సకలభోగభాగ్యములకు నెలవని, అందచందములకు నిలయమని, స్వయంగా దేవతలచే ఆరాధించబడు పర్వతరాజు నిశ్చలమైనవానిగా ధర్మపథమున నిలిచి అతిథులకు ఆనందమును కలిగించుచున్నాడని సప్తర్షులు స్వయంగా చెబుతారు.

''ఉపపన్న మిదం సర్వమతః పరం ..... మనసఃశిఖరాణాం చ సదృశీ తే సమున్నతిః''[7] ॥

అంటూ అతని వినయశీలములను కొనియాడతారు. ఏ ధర్మమార్గమును అతడవలంబిస్తున్నాడో, అతని శిఖరములు ఎంత ఉన్నతములో అంతటి ఉన్నతము అతని మనస్సుకూడా అయిఉన్నదని సప్తర్షులచేత కవి చెప్పటంలో ఉద్దేశ్యం - గృహస్థ ధర్మాన చరించువారు సమాజంలో అంతటి సమున్నతస్థానాన్ని వహిస్తారని సూచించాడు.

''అనంతరత్న ప్రభవస్య యస్య హిమం న సౌభాగ్య జాతమ్ ।
ఏకో హి దోషో గుణనన్నిపాతే నిమజ్జతీందో కిరణేష్వివాంకః''[8] ॥

ఆ హిమగిరి సకల సౌభాగ్యసంపన్నమని, సంజీవన్యాది మహౌషధములకు మరియు సకల రత్నములకు నెలవై హిమముతో కప్పబడియున్నదని చెప్పబడింది. హిమవత్పర్వతమున 'మంచు ఆవరించి వుండటం అనేది ఆ నగరాజునకు లోపము కాలేదని వర్ణించబడింది. అలా కవి చెప్పటంలో ఉద్దేశ్యం మానవకోటికి సందేశమివ్వటమే. మానవులు సదా ప్రసన్నంగా ఉండాలి. సహనంతో జీవించాలి. లోపము లేనివారు ఈ లోకమున కనిపించరు. ఆ లోపాలను తలచుకుంటూ ప్రశాంతతను కోల్పోకూడదన్న సత్యాన్ని ఈ పై శ్లోకము ద్వారా చాటిచెప్పాడు.

ప్రసన్నతా గుణమే ఆత్మశాంతికి, ఆరోగ్యానికి, ఆనందానికి ఆధారంగా నిలుస్తుంది. మనిషి ఆత్మస్థైర్యానికి ఆనందమయ జీవితానికి అటువంటి "ధార్మిక జీవనమే" మొదటిసోపానమని కవి నిరూపించాడు. అంతేకాదు పర్వతరాజు అంతటి జ్ఞానస్వరూపుడు, ధార్మికుడు, శాంతియుతుడు కనుకనే "మంచు" అనే ఒకలోపాన్ని సహింపగలశక్తిని కల్గివున్నాడని అర్థమౌతోంది.

"ఆత్మజ్ఞానం సమారమ్భా స్తితిక్షా ధర్మనిత్యతా ।
యమర్థాన్నాపకర్షన్తి స వై పండిత ఉచ్యతే"[9] ॥

ఆత్మజ్ఞానం, కార్యములందు శక్తివైరాగ్యం, ధర్మమెడ తెగకుండుంట అను పురుషార్థములనుండి ఎవనిని దూరముగా తొలగింపవో అతడు కదా పండితుడు అని భారతంలో చెప్పబడింది. అంటే శాస్త్రం వల్ల సిద్ధించు గొప్పజ్ఞానమే ఆత్మజ్ఞానం. అన్నింటిని సహింపగల శక్తి తితిక్షా అవుతోంది. 'ధర్మనిత్యతా' అంటే ఒకప్పుడును ధర్మం తప్పకుండా వుండడమే. ఇవన్నీ వున్నవానినే పండితుడనాలి.

పర్వతరాజు తన ధర్మాన్ని గుర్తెఱిగి ప్రవర్తించినవాడు. ఒక రాజుగా తనాశ్రయించిన వారిని పరిరక్షించినవాడు.

దివాకరాద్రక్షతి యో సహానులీనం ..... ।
క్షుద్రే-పినూనం శరణం ప్రపన్నే..... [10] ॥

అంటూ సూర్యకాంతికి భయపడి శరణుజొచ్చిన వానికి ఆశ్రయాన్నిచ్చి తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు ఆ పర్వతరాజు. అంతేకాదు-

"న మాననీం మేరునగాధిరాజాత్ కన్యాం కులస్యస్థితయే స్థితజ్ఞః ।
మేనాం మునీనామపి మాననీయా మాత్మానురూపాం విధినోపయేమే"[11] ॥

ఆ నగరాజు విద్వత్సంపన్నుడు. మర్యాదనెఱిగినవాడు. కర్తవ్యాకర్తవ్యములనెఱిగిన వివేకి. స్వయంగా మేరువే అతని స్నేహితుడు. కుటుంబవృద్ధినాశించి, కులప్రతిష్ఠను కోరి, వయోరూప గుణములచేత తనకు అన్నివిధముల అనురూపయైన "మేనాదేవి" అను కన్యను విధిపూర్వకముగా వివాహమాడి ఆ పర్వతరాజు గృహస్థ ధర్మాన్ని ఆచరించాడు. ఇక ఆ మేనాదేవి పితృదేవతల సత్సంకల్ప జన్య. కనుకనే ఋషిపుంగవులకు కూడా మాననీయురాలైంది. ఆమె శీలసౌజన్యములందరికీ ఆదర్శప్రాయమైంది.

గృహంలో దంపతులు ఇద్దరూ సమానగుణశీలురుగా దొరకటం అరుదైన విషయమే. గృహకార్యంలో నిగర్వులైన దంపతులిద్దరూ ఎవరిధర్మాన్ని వారు సక్రమంగా నిర్వర్తించటంలోనే వారి గౌరవం ఇనుమడిస్తుంది. ఇదే శ్రేష్ఠ ధర్మం. వారిద్దరూ ఎంత స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించుకుంటే అంత ఆనందమయమైన జీవితాన్ని అనుభవిస్తారు. "ప్రజాయై గృహమేధినామ్" అన్నట్లు వారి వైవాహిక జీవితానికి సంతానాన్ని పొందటం ఫలంగా చెప్పబడింది.

"సంతోష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్రవై ధ్రువమ్"[12]॥

అని మనుస్మృతి. ఏ కులంలో భార్య చేత భర్తయు, భర్త చేత భార్యయు సంతోషం కలిగి వుంటారో ఆ కులంలో సంపద నిరంతరం తాండవిస్తుందని ఇందులో చెప్పబడింది. సరిగ్గా అదేవిధంగా ఉత్తమమైన శీలసంపదలతో నడచుకుంటూ శ్రేష్ఠమైన మార్గంలో చరిస్తూ సంత్సంతానాన్ని 'పార్వతి' రూపంలో ఆ మేనా పర్వతరాజ దంపతులు పొందటం జరిగింది.

"ప్రసన్నదిక్పాంసు విధిక్తవాతల శంఖస్వనాంతర పుష్పవృష్టి ।
శరీరిణాం స్థావర జంగమానాం "సుఖాయ" తజ్జన్మదినం బభూవ"[13] ॥

"ఆ పార్వతి పుట్టినరోజు అత్యంతశుభప్రదమైంది. అది స్థావరజంగమ, చేవ మనుష్య పశుపక్ష్యాదులకును అంతెందుకు సకల శరీరధారులకు సమస్త శుభాలను, సుఖసంతోషాలను సమకూర్చునదిగా అయివుంది. దిక్కులు నిర్మలములైనాయి. దూళిరహిత వాయువులు

వీచాయి. మంగళధ్వనులు వినిపించాయి'' అని ధర్మాచరణపరాయణుడైన, పరిపూర్ణుడైన ఒక గృహస్థు యొక్క సంతానము ఏవిధంగా ఉండాలో కవి తెలియ జేసాడు. సత్సంతానమంటే ఈ విధంగా ఉండాలని ఆశించాడు. కనుక ఉత్తమ గృహస్థుగా ఎదగమని ప్రబోధించాడు. అలా గృహస్థుయొక్క జీవనం ఆదర్శంగా ఉన్నప్పుడే, ధర్మబద్ధంగా సాగినప్పుడే ఆ కుటుంబం సిరిసంపదలతో తులతూగుతూ వుంటుంది. జీవితమంతా ఉత్సాహంగా ఆనందంగా సాగాలంటే కలిగే సంతానంవల్ల కూడా ప్రసన్నతే చేకూరాలి. ఆవిధమైన సత్సంతానాన్ని లోకానికి అందించడం 'ధర్మం'లో భాగమేనని కవి మాన వాళికి ఉద్బోధించాడు. నిజానికి చతుర్విధ పురుషార్థాలలో ధర్మాన్ని ఆశ్రయించి అర్థకామాలు కూడా సిద్ధిస్తాయని కవి నిరూపించాడు. కొన్నిసార్లు అర్థకామములవల్ల ధర్మం సిద్ధిస్తుందా? లేక ధర్మం వల్లనే అర్థకామాలుంటాయా అన్న ప్రశ్న వస్తుంది. దేనిని గృహస్థు ఆచరించాలి అన్న విషయంలో సందేహాలు కలుగుతుంటాయి. అదే విషయంలో మనుస్మృతి ఇలా చెబుతోంది.

"ధర్మార్థ వుచ్యతే శ్రేయः కామార్థె ధర్మ ఏవ చ ।
అర్థ ఏవేహ వాశ్రేయ స్త్రివర్గ ఇతి తు స్థితిः"[14] ॥

'ధర్మార్థములు' రెండును కామహేతువులగుటవల్ల శ్రేష్ఠములని కొందరంటారు. 'అర్థకామములు' సుఖమును కలిగించునవి కనుక శ్రేష్ఠములని కొందరంటారు. 'ధర్మము' అర్థకామములకు కారణం కనుక ధర్మమే శ్రేష్ఠమని కొందరంటారు. 'అర్థమే' ధర్మకామములకు హేతువు కనుక అదే శ్రేష్ఠమని కొందరు చెబుతారు. ఏదిఏమైననూ ధర్మార్థకామములు (త్రివర్గమని చెప్పబడునది) మూడును "పురుషార్థ"ములగుటచే శ్రేష్ఠములే అని మనుస్మృతిలో చెప్పబడింది.

ఈ పురుషార్థములను పొందు క్రమంలో 'సత్సంతానమను ఫలం' ధర్మబద్ధమైన కామమును సేవించుటవల్ల సిద్ధించునదని కవి 'పార్వతి జననం' ద్వారా నిరూపించినాడు. ప్రసన్నమయ జీవితాన్ని గడిపే దంపతులకు సంతానం కూడా బహుముఖ ప్రయోజనాలను సిద్ధింపజేస్తుంది. కనుకనే పార్వతి జననం సకల ప్రాణికోటి "హితాన్ని" అభిలషించి జరిగిందని కవి నిరూపించాడు.

తపోనిష్ఠలో నిల్చిన తన కుమార్తెను సాదరంగా అనునయించి, ఆశీర్వదించి ఆమెను కూడా కర్తవ్య నిష్ఠలో నిలిపి ధర్మాచరణలో నిమగ్నురాలయ్యేలా చేసి ఉత్తమ తండ్రిగా నిలిచి ఆదర్శుడైనాడు. తండ్రి నేర్పిన సంస్కారాలు పార్వతిలో పుష్కలంగా నిండివున్నాయి. కనుకనే ఆ సంస్కార విశేషం చేతనే తన నివాసమునకు వచ్చిన, మారువేషధారియైన సాక్షాత్తు శివుణ్ణి కుశల ప్రశ్నలతో వివరాలు అడిగితెలుసుకున్నది. ఎవరి ధర్మములు ఏవిధంగా ఉంటాయో పసిగట్టగలిగిన పార్వతి బ్రహ్మచారి రూపమున వున్న వ్యక్తితో అత్యద్భుతంగా సంభాషించ గల్గినది. -

"అథాజినాషాఢధరः ప్రగల్భవాగ్వేలన్నివ బ్రహ్మమయేన తేజసా ।
వివేశ కశ్చిజ్జటిల స్తపోవనం శరీరబద్ధः ప్రథమాశ్రమో యథా"[15] ॥

ఒకానొకరోజు జడలు ధరించిన బ్రహ్మచారి ఒకడు పార్వతి ఆశ్రమానికి వచ్చాడు. అతడెవరో ఆమెకు తెలియదు. పరిచయమేమియు ఏమాత్రం లేదు. కానీ పలాశదండం చేతనున్నది. కృష్ణాజినం భుజానవ్రేలాడుతున్నది. గడసుతనంతో, వాక్చాతుర్యంతో ఉన్న ఆ వటుని గూర్చి వివరాలు సేకరించినది పార్వతీదేవి. వేదాధ్యయనం బాగుగా గ్రహించిన వాడగుటచే బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతోంది. అంతెందుకు "ప్రథమాశ్రమమగు బ్రహ్మచర్యము రూపుదాల్చినదా" అన్నట్లు వున్న ఆ రూపమునకు అచ్చెరువొంది, మర్యాదలాచరించిన ఆమెను గూర్చి కుశల ప్రశ్నలు వేసాడు ఆ బ్రహ్మచారి. వారిద్దరి సంభాషణలో ధర్మాన్ని ఆచరించడానికి మొదలు, మూలము శరీరమేనన్న సత్యం బోధపడుతుంది-

"అపి క్రియార్థం సులభం సమిత్కుశం జలాన్యపి స్నాన విధిక్షమాణితే ।
అపి స్వశక్త్యా 'తపసి' ప్రవర్తసే శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్"[16] ॥

ఆ కపట వటువు ఆమెను ఈవిధంగా ప్రశ్నించాడు-

మొదటి ప్రశ్నగా ఓ పార్వతీ ! హేమాద్యనుష్ఠానములు యథావిధిగా నిరాటంకముగా జరుగుచున్నవా?

రెండవ ప్రశ్న - వాటికి అవసరమగు సమిధలు, నిర్మలోదకములు లభ్యమగుచున్నవా?

మూడవ ప్రశ్న - ఇంతకుమించి తపమాచరించుట లేదుకదా? అన్న ప్రశ్నలో హితవాక్యము కనిపిస్తుంది. అంటే ధర్మసాధనములెన్నో ఉన్నాయి కానీ అన్నిటికీ ఈ శరీరమే మూలము కదా! దేహములేక ధర్మమెక్కడిది? శక్తికి మించి తపమాచరించుట లేదుకదా. అది తగదన్న హితవు. ఇవన్ని ఆ వచ్చిన అతిథి పార్వతినడిగినట్లు ఉన్నప్పటికి ఈ ప్రశ్నలు "ఉత్తమవ్యక్తి"కి ఉండవలసిన "ధర్మాచరణను" గూర్చియేనన్నది స్పష్టమయ్యే అంశము. ఎందుకంటే -

"ధర్మస్తు కాయేన వాచా బుద్ధ్యా ధనాదినా చ బహుభిః సాధ్యతే. తేషు చ వపురేవ ముఖ్యసాధనం సతి దేహే ధర్మార్థకామమోక్ష లక్షణశ్చతుర్వర్గః సాధ్యతే." అతఏవ "సతతమాత్మానమేవ గోపాయీత" ఇతి శ్రుతిః.

ఈ విధంగా అన్ని ధర్మములకంటే ఉత్తమమైనది శరీరమును కాపాడుకొనుటయే కదా అన్న సత్యమును సాక్షాత్తు శివస్వరూపుడైన వటువుచే మహాకవి పలికించటం విశేషాంశముగా చెప్పాలి.

అంతేకాదు -

"హిత్వాధర్మం తథార్థం చ కామం యస్తు నిషేవతే ।
స వృక్షాగ్రే యథాసుప్తః పతితః ప్రతిబుద్ధ్యతే"[17] ॥

ధర్మమును, అర్థమును వదలిపెట్టి ఎవడైతే కామమునే సేవిస్తున్నాడో వాడు వృక్షాగ్రముమీద నిద్రించినవాని వలె క్రింద పడిపోయిన తరువాత తెలివితెచ్చుకున్న వాడయ్యి పశ్చాత్తప్తుడు కావలసివస్తుంది. తండ్రి అనుమతితో పార్వతీదేవి తపశ్చర్యను ఆచరించటంలో ఉద్దేశ్యమేమిటో- ఆమె నిర్ణయము ఎంతవరకు ఆచరణ యోగ్యమో తెలుసుకొనుటకే కాక తాను గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి ఆమె ఎంతవరకు సమర్థురాలో స్వయంగా తెలుసుకున్నాడు ఆ వటుని రూపాన్ని పొందిన సాక్షాత్తు శివుడు. అంతేకాదు -

"దివం యది ప్రార్థయసే వృథాశ్రమః పితుః ప్రదేశాస్తవ దేవభూమయః ।
అధోపయంతార మలం సమాధినా న రత్న మన్విష్యతి మృగ్యతే హి తత్"[18] ॥

అంటూ పార్వతీదేవి యొక్క తండ్రి నిలిచిన ప్రదేశాన్ని ప్రశంసించాడు. ఇలా అనటంలో మరో ముఖ్య ఉద్దేశ్యం. ఉత్తమ గృహస్థుగా ఉన్న హిమవంతుడు తన కన్యారత్నమును ఎవరికివ్వాలో నిర్ణయింపగల సమర్థుడై వుంటాడని గార్హస్థధర్మము నెఱిగిన హిమవంతునికి సర్వము తెలియునని చెప్పినట్లైంది. అంతేకాక ఈ ఘట్టము ద్వారా మరొక అంశం విశదమౌతున్నది.

"యథావాయుం సమాశ్రిత్య వర్తంతే సర్వజంతవః ।
తథా గృహస్థ మాశ్రిత్య వర్తంతే సర్వ ఆశ్రయాః"[19] ॥

ప్రాణవాయువును ఆశ్రయించి జంతువులన్ని ఏవిధంగా జీవిస్తున్నాయో "గృహస్థుని" ఆశ్రయించి తక్కిన ఆశ్రమస్థులు జీవిస్తారు. అని స్మృతివాక్యం. అటువంటి "గృహస్థ జీవనం" గడపడానికి సాక్షాత్తు పరమేశ్వరుడు కూడా "ఉత్సాహంతో" ఉన్నాడని, కనుకనే కవి అతని నోట "కన్యారత్నము"ను వెదుక్కుంటూ స్వయంగా వరుడే వచ్చువిధంగా "కుమార్తె" వుండాలన్న సత్యమును బోధించాడు. ఇక బ్రహ్మచారిగా వచ్చిన వ్యక్తి కూడా "గృహములకే" వస్తారన్న విషయమును వెల్లడించాడు.

"గృహస్థేనైవ ధార్యంతే తస్మాజ్జ్యేష్ఠాశ్రమోగృహీ"[20] అని మనుస్మృతి. ఇంద్రియ జయుడైన గృహస్థుమాత్రమే పరమున నాశములేని స్వర్గసుఖాన్ని, ఇహలోకాన స్త్రీ సాంగత్యాన్ని, రుచిరాన్నమును మొ॥లగు సిద్ధులను

పొందగలడు. కనుక గృహస్థాశ్రమాన్ని చక్కగా ఆచరించాలని మనుస్మృతి (3-79)లో చెప్పబడింది.

ఈ విధమైనట్టి బోధ ఈ కుమారసంభవ మహాకావ్యమున ఎన్నియో సందర్భాలలో ప్రకటించబడింది. అంతెందుకు ప్రజాపరిపాలనము రాజుకెంత ముఖ్యమో తన కుమార్తెను (కన్యారత్నమును) యోగ్యునికిచ్చి వివాహము జరిపించుట కూడా గృహస్థునకంత ముఖ్యధర్మముగా చెప్పబడింది. తననాశ్రయించిన వారినెంతగా 'రాజు' సంరక్షిస్తాడో తన సంరక్షణలో ఎదిగిన కుమార్తెను సద్భర్తగా వుండదగిన వ్యక్తిని అన్వేషించి సంబంధమును కూర్చుట కూడా అంతే ముఖ్యవిధియై వున్నది "గృహస్థుని"కి.

ఈ విధమైన సన్నివేశము కుమారసంభవ కావ్యమున 6వ సర్గలో చూపబడింది. ఈ సర్గ మొత్తము భారతీయ జీవన విధానానికి దర్పణంగా నిలుస్తుంది. ఈ సర్గ 'సంస్కృతి సంప్రదాయాలకు' పట్టుకొమ్మగా వుంది. అందులో 'ఆశ్రమధర్మాలు అన్నీ గృహస్థునిపైన' నిలిచి వున్నాయని మరోసారి నిరూపించబడింది. పరివ్రాజకులకు, తాపసులకు, గృహస్థులకు వారివారి కర్తవ్యాకర్తవ్యాలను గుర్తించే దిశగా ప్రయాణించాలన్న 'ఆకాంక్ష' మహాకవి కాళిదాసు తన ఈ రచనలో వ్యక్తపఱచినాడు.

గృహస్థు ముఖ్యవిధి "అతిథి సత్కారం." ఆ విధి నిర్వహణలో తాను వర్తించిన విధానం సర్వులకు సదా ఆచరణీయం. అతడు చేసిన అతిథి సత్కారం మరువ కూడనిది. శివునికి పార్వతినిచ్చి వివాహం జరిపించాలని సప్తర్షులంతా హిమవంతుని దగ్గరకు దౌత్యానికై వస్తారు. అప్పుడు ఆ హిమవంతుడు -

"తానార్ఘ్యనర్ఘ్య మాదాయ దూరాత్ప్రత్యుద్యయౌ గిరిః ।
నమయన్ సార గురుభిః పాదన్యాసైర్వసుంధరామ్"[21]॥

అని ఎదురేగి ఇలా అన్నాడు.

"అపమేఘోదయం వర్షమదృష్టకుసుమం ఫలమ్ ।
అతర్కితోపపన్నం వో దర్శనం ప్రతిభాతిమే"[22] ॥

అంటూ హిమవంతుడు ఇలా అంటాడు.

"మీ రాక మేఘం లేని వర్షం. పూవు లేని ఫలం. కారణం లేని కార్యం. ఎంత అదృష్టం. నా జీవితం ధన్యమైనది" అంటూ మర్యాదపూర్వకంగా సముచిత సంభాషణ గావించిన ఉత్తమగృహస్థు. హిమవంతుడంతటి ఔన్నత్యము గలవాడు కనుకనే సాక్షాత్తు శివునిచే నియోగించబడిన 'అరుంధతి' కూడా దీని నిమిత్తమై వచ్చింది.

"ఆర్యాప్యరుంధతీ తత్ర వ్యాపారం కర్తుమర్హతి ।
ప్రాయేణైవం విధే కార్యే పురన్ధ్రీణాం ప్రగల్భతే"[23] ॥

అంటూ వివాహాది శుభకార్యాల్లో కుటుంబినులు అన్నివిధాలా సమర్థులు కదా అంటూ స్వయంగా శివునిచే అనిపించాడు కవి. అట్టి శివపార్వతుల వివాహకార్య భారాన్ని సాధించుటకు అరుంధతితోపాటుగా తక్కిన ఋషులపై కార్యనిర్వహణ విధిని వుంచి తన తరపున వెళ్ళమన్నాడు. అలా హిమవంతుని ఇంటికి చేరిన సప్తర్షులు మామగారిగా అతడు తగినవాడు శివునికి" అని మెచ్చి "విశ్వగురోర్గురుః" అంటూ హిమవంతుణ్ణి ప్రశంసించారు. వారి రాకలోని అంతర్యాన్ని గ్రహించాడు పర్వతరాజు. సప్తర్షులు పార్వతిని శివునికిచ్చుటకు అతడు అంగీకరించడానికి ఈవిధంగా పలుకుతారు.

"అశోచ్యాహి పితుః కన్యా సద్భర్తృ ప్రతిపాదితా ।
తమర్థమివ భారత్యా సుతయా యోక్తుమర్హసి"[24] ॥

అంటూ సప్తర్షులు అంటారు. శివుడు యోగ్యుడని ఆ కన్యకు అతడు తగిన వరుడేకాక - అట్టి యోగ్యుణ్ణి ఆమెకిచ్చి వావాహంచేస్తే శోకించవలసిన పనికాని విచారపడనవసరముకానీ రాదని చెబుతారు. అంతేకాదు వారి జంట 'శబ్దార్థముల'వలె కూడునని చెబుతారు. కనుక వివాహానికి ఆమోదాన్ని తెలుపమని ఋషులు అడిగిన వెంటనే హిమవంతుడు ఎంతో ముదమును పొందుతాడు. అందుకు భార్య అంగీకారమునకై ఆమెవైపు చూస్తాడు. "మేనాముఖముదైక్షత..... ప్రాయేణ గృహిణీనేత్రా" కన్యార్థేషు కుటుంబినః" నిజమే ఆమె ముఖంలోకి తొంగిచూసాడు. ఈవిధంగా "విషయాన్ని గ్రహించడం" అనేది అనాదిగా గృహస్థులైనవారు సహజం

గానే చేసేదేనని రూఢిపరచినాడు కవి. అంతేకాదు కుమార్తెను పిలిచి ఆమె మనసులో ఏముందో గ్రహిస్తాడు. ఎందుకంటే తాను తీసుకోబోయే నిర్ణయమే ఆమె భవిష్యత్తుని నిర్ణయించగలదని వివేకంతో ఆలోచించాడు. తండ్రియైన హిమవంతుడు అర్థకామాలను ధర్మమార్గాన సేవించినవాడు కనుకనే ఆవిధమైన "సద్వర్తనమును" చూపగలిగాడు.

"తదేత్కుశలో విద్వాన్ ధర్మార్థమవలోకయన్ ।
నాతిరాగాత్మకః కామీ ప్రయుంజానః ప్రసిద్ధ్యతి"[25] ॥

ఎవడు ధర్మార్థాలను పరిశీలించి, వాటికి ప్రాముఖ్యాన్నిచ్చి, కామాది పురుషార్థాలను అతిగా కాకుండా ఎవడు తగుమాత్రంలో సేవిస్తున్నాడో అట్టి విద్వాంసుణ్ణి, కుశలుణ్ణి ఇహపరసుఖములు రెండనూ వరిస్తాయిట.

హిమవంతుడు ఒక గృహస్థుగా తానెన్నుకున్న ధర్మ మార్గంలో నడచి, సరైన నిర్ణయాలతో జీవితాన్ని సుసంపన్నం చేసుకున్న ధీరుడునూ శాంతుడున్నూ. కనుకనే పార్వతిని పిలిచి సప్తర్షులకు పరిచయం చేసి ఇలా అంటాడు.

"ఏహి విశ్వాత్మనే వత్సే భిక్షా-పి పరికల్పితా ।
అర్థినో మునయః ప్రాప్తం గృహమేధిఫలం మయా"[26]॥

ఓ పార్వతీ ! ఇటు రామ్మ ! తల్లీ ! నీవు విశ్వాత్ముడైన శివునికి భిక్షగా కల్పించబడినవమ్మా గృహస్థుడనైన నాకు గృహమేధి ఫలము దక్కినది. అనురూప వరునకిచ్చిన కన్యాదాన ఫలము నేడు లభించినదని ఎంతో సంతోషంతో అంటాడు. గృహస్థాశ్రమ ఫలము ఆవిధంగా తనకు దక్కినదని ధన్యుడైనానని మిక్కిలి సంతోషించి పార్వతిని అభినందిస్తాడు. ఆనందిస్తాడు. వెంటనే పార్వతి ఋషులకు వందనము గావించినది. వారామెను ఆశీర్వదించి ఈ శుభవార్తను శివునికి తెలియజేయడానికి వెళ్ళిపోతారు.

ఉపసంహారం :

ఈ విధంగా జగత్కల్యాణముగా తన కుమార్తె వివాహమహోత్సవము జరుగనున్నదని ఉప్పొంగిపోయిన ఉత్తమ గృహస్థుడు హిమవంతుడు. మహాకవి కాళిదాసు ఈ సన్నివేశములనన్నింటిని ఎంతో హృద్యంగా మలిచినాడన్నది సుస్పష్టము. హిమవంతుని పాత్రను ఒకవైపు పర్వతరాజుగాను, మరొకవైపు ఒక ఉత్తమ గృహస్థునిగాను చూపుతూ "ధర్మబద్ధమైన" జీవితమే అర్థకామాదులను సిద్ధింపజేయగలదని నిరూపించాడు.

"విశ్వదానీం సుమనసఃస్యామ" అని ఋగ్వేదం. "ఉత్సాహంగా" జీవిస్తూ మానవుడు "ప్రసన్నంగా" ఉండమనే సాహిత్యం బోధిస్తోంది. సంస్కృతి సంప్రదాయాలకు అనుకూలంగానే జీవితాన్ని మలచుకుంటూ వైదిక ధర్మాలకు కట్టుబడి ఆత్మప్రసన్నతను పొందడమే "ధర్మం" యొక్క లక్ష్యంగా నిర్దేశించబడింది. ఇహపరసుఖాలకు వేదికగా "ధర్మాచరణమే" ప్రథమ కర్తవ్యంగా వ్యక్తికి ఉండాలని కావ్యం ఉపదేశిస్తోంది.

ఆధారగ్రంథాలు :

1. శ్రీమన్మహాభారతం
2. భగవద్గీత
3. మనుస్మృతి 6-89
4. మనుస్మృతి 6-92
5. శ్రీమన్మహాభారతం-ఉద్యోగపర్వం-ప్రజాగరపర్వం
6. కుమారసంభవం 1-1
7. Ibid 1-2
8. Ibid
9. శ్రీమన్మహాభారతం - ఉద్యోగపర్వం
10. కుమారసంభవం 1-
11. Ibid 1-9
12. మనుస్మృతి 3-60
13. కుమారసంభవం 1-11
14. మనుస్మృతి 2-224
15. కుమారసంభవం 5-9
16. Ibid 5-10
17. సూక్తిముక్తావళి
18. కుమారసంభవం
19. మనుస్మృతి 3-77
20. Ibid 3-78

21. కుమారసంభవం 6-15 22. Ibid 6-16 23. Ibid

24. Ibid 25. సూక్తిముక్తావళి 26. కుమారసంభవం

ఉపయుక్త గ్రంథసూచి :

1. అమరకోశం - విక్టరీ పబ్లికేషన్స్, సీతారమపురం, విజయవాడ, 2014.
2. కుమారసంభవం - వావిళ్ళవారు
3. భగవద్గీత - గీతాప్రెస్, గోరఖ్‌పూర్, 1995.
4. మనుస్మృతి - బాలసరస్వతీ బుక్ డిపో, ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్, కర్నూలు.
5. శ్రీమద్రామాయణం - గీతాప్రెస్, గోరఖ్‌పూర్.
6. శ్రీమన్మహాభారతం- ఉద్యోగపర్వం - ఆర్షవిజ్ఞాన ట్రస్టు, హైదరాబాదు.
7. సూక్తిముక్తావళి - అవంతిప్రెస్, ఇన్నిస్‌పేట, రాజమండ్రి, 1966.

❖ ❖ ❖

ఆత్మజ్ఞానం (మోక్షము) యొక్క గొప్పతనము

– డా॥. యస్.పి. శ్రీకృష్ణవేణి, అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల, సదాశివపేట

ఆత్మ జ్ఞానం అనేది ఎంతటి అత్యున్నత స్థితి అంటే ఎదుటి వ్యక్తికి అది అవసరమా లేదా అని ఆలోచించడమే ఉండదు. అంతటి దివ్యమగు అమృతమిది. కాబట్టి దీనిని ఎదుటి వ్యక్తికి అవసరమున్నప్పటికి ఇవ్వాలి, అవసరము లేదనుకొన్న వ్యక్తికి అతడి అవసరాన్ని మేల్కొలిపి అయినా ఇవ్వాలి. దానివలన అతడికి పరమ శ్రేయస్సు కలగాలని సమాజానికి ఆత్మీజ్ఞానం అవసరమే లేదని అనడం నిజం కాదు. మనుష్యులకు మాత్రమే కాదు ప్రతి ప్రాణికి సుఖం అనేది అవసరం. ఉదయం నుండి సాయంత్రం దాకా ప్రతిప్రాణి సుఖం కొరకే పాటుపడుతూ ఉంటుంది. శారీరక కర్మలకు అంతం, మానసిక కల్పనలకు, లౌకిక జ్ఞానాలకు పూర్ణాహుతి (ముగింపు) మేధస్సు యొక్క ఉన్నతికి పరాకాష్ట, చిత్తం లోని చింతలయొక్క వ్యర్థత అనేది ఎప్పుడైతే తెలుస్తుందో మనిషికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడే అర్థం కాగలుగుతాయి.

వాస్తవానికి ఏ వస్తుసామాగ్రి అంతగా అవసరం లేదో ఆ వస్తు సామాగ్రి వెంటే సమాజం కొట్టుకుపోతూ ఉంటుంది. అలా కొట్టుకు పోతూ ఉన్న సమాజాన్ని చూసి ఋషుల హృదయం కరుణతో నిండి పోతుంటుంది. సమాజానికి ఒకవేళ తత్త్వజ్ఞానమే అవసరం లేదని అటువంటి అమాయకులగు మనుష్యులకే అనిపిస్తుంది. కాని ఋషులకు మాత్రం తత్త్వ జ్ఞానం లేకుండా మనుష్య జీవితం సాగదని అనిపిస్తుంది. సత్యాన్ని సాక్షాత్కరింప జేసుకొన్న మహాపురుషులు ఎందరో అవతరించినారు. కాని వారు మౌనంగా ఉండిపోయారు. ప్రజలకు ఈ జ్ఞానంతో అవసరం లేదన్నప్పుడు వారికి ఏమని చెప్పాలి అని వారు అనుకొన్నారు. ఎవరో కొందరు మహా పురుషులు మాత్రం వాస్తవంగా సమాజానికి జ్ఞానం యొక్క అవసరం ఉంది కాని ఈ విషయాన్ని సమాజానికి తెలియజెప్పవలసిన అవసరం ఉన్నది అని అనుకొన్నారు. పిల్లవాడు సరిగా తింటున్నాడా లేదా అని తల్లి చూస్తుంది. వాడు బయట కొన్న నానా రకాల వస్తువులను తింటున్నప్పుడు తల్లి దిగులుపడుతుంది. ఆ పిల్లవాడికి ఇంట్లో తయారైన ఆహారాన్ని తినిపించాలని ప్రయత్నిస్తుంది. పిల్లవాడికి అవసరం లేకపోతే నేనేం చెయ్యాలి. వాడు అడిగితే ఇస్తా అని సవతి తల్లి అంటుంది.

మన ఋషులు సమాజానికి సవతి తల్లులు కారు. వారు మనుష్యజాతికి నిజమైన తల్లిదండ్రులు. ఋషుల యొక్క ప్రసాదాన్ని స్వీకరించడానికి గాని, వినడానికి గాని ప్రజల వద్ద సమయం లేకుండా ఉండవచ్చు అయినప్పటికి ఋషులగు వారు ఏదో సందర్భంగా ఏదో ఒక నెపంతో ఆత్మ జ్ఞానాన్ని వినడానికి ప్రజలు తమ వద్దకు వస్తే బాగుంటుందని కోరుకుంటాడు. దౌర్భాగ్యమేమిటంటే తత్త్వజ్ఞానమనే అమృతాన్ని పానం చెయ్యాలనే తపన ప్రజలలో కనిపించడము లేదు. వారు తత్త్వజ్ఞానము యొక్క గొప్పతనాన్ని తమ అమాయకత్వం వలన తెలుసుకోకుండా ఉన్నారు. ఆత్మశాంతి యొక్క విలువను తెలుసుకోలేకున్నారు. అటువంటప్పుడు వారికి దీని విలువను గురించి తెలియజేయవలసి ఉన్నది. అప్పుడే వారికి మేలు జరుగుతుంది. ఆత్మ జ్ఞానం ఎంతటి ధన్యమైనదంటే, ఎంతటి విలువైనది అంటే ఆధ్యాత్మిక ఇతిహాసాన్ని పరికించి నట్లయితే మనకు తెలుస్తుంది. గొప్ప గొప్ప సామ్రాట్టులు, తమ రాజ్యాధికారాలను వదలుకొని నుదుటిపై విభూతి రాసుకొని చేతుల్లో బిక్షాపాత్ర పట్టుకొని ఆత్మజ్ఞానులగు గురువులకు సేవలు చేసి వారిని మెప్పించారు. సామ్రాట్టులదేముంది. ఇక్కడ అవతరించిన శ్రీరామచంద్రుడు భగవంతుని వంటి మహాత్ములు కూడా గురువులను గొప్పగా గౌరవించడాన్ని చూడవచ్చు.

'ప్రాత్కాల ఉఠికై రఘునాథా'
మాతృపితా గురు నావహిం మాథా !

(శ్రీరామచరిత మానస్, బాలకాండ: 204.4)

భగవానుడగు శ్రీరాముడు ఉదయాననే గురువు యొక్క ఆశ్రమానికి చేరుకొనెడివాడు. ఒకవేళ గురువు సమాధిలో ఉన్నట్లయితే చేతులు జోడించి దూరం గానే నిలుచుండి పోయేవాడు. అంతేగాని గురువుకు అంత రాయాన్ని కలిగించేవాడుకాదు. ఎప్పుడైతే గురువు సమాధి స్థితి నుండి మేల్కొంటాడో అప్పుడు సాష్టాంగ దండ ప్రణామాన్ని ఆచరించే వాడు. ఎవరు ఎవరి పేరును జపించినంత మాత్రాన అందరు తరించి పోతారు అటువంటి భగవంతుడగు శ్రీరాముడికి తెలుసు ఆధ్యాత్మిక విద్య యొక్క గొప్పతనమేమిటో. శ్రీకృష్ణుడు కూడా గురువైన సాందీపుని యొక్క సేవలో ఉంటూ ఉండేవాడు. గురుసోదరులతో పాటు కట్టెలు కొట్టడానికి అడవికి వెళుతూ ఉండేవాడు. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత శ్రీకృష్ణుడు తన గురువు యొక్క పాదాలవద్ద కూర్చుని ఇలా ప్రార్థిస్తాడు.

గురుదేవా మీ పాదాలవద్ద గురుదక్షిణగా దేనిని సమర్పించుకోవాలో, ఏ సేవ చెయ్యాలో ఆజ్ఞాపించండి. గురుదేవులు ఇలా అన్నారు 'నాకు ఏది అవసరం లేదు' గురుదేవా మీకు ఏది అవసరము లేదు కాని నాకు మాత్రం సేవ చెయ్యవలసిన అవసరముంది. అది నా కర్తవ్యము'. "అలాగా అట్లయితే ఏమి కావాలో మీ తల్లిని అడుగు". శ్రీకృష్ణుడు గురుపత్నిని ఇలా అడిగాడు 'తల్లీ, నేను మీకు ఏ సేవను చెయ్యగలను'. గురుపత్ని ఇలా అన్నది. 'కృష్ణా! నువ్వు మా వద్ద ఉన్న వారిలో అందరికంటే సమర్థుడగు విద్యార్థివి, నా కుమారుడు యమలోకానికి వెళ్ళాడు. అతడిని నాకు తెచ్చి ఇవ్వు నాయనా!' అంది. శ్రీకృష్ణుడు ప్రకృతి యొక్క నిబంధనలను, హద్దులను ఉల్లంఘించి యమలోకానికి వెళ్ళి అక్కడినుండి గురు పుత్రుని తీసుకొని తల్లి ఒడిలోకి చేర్చాడు.

భగవద్గీత యుద్ధభూమిలో బోధించబడింది. అప్పుడు సమయం చాల తక్కువగా ఉంది. ఏదైన అనవసరపు మాట మాట్లాడడానికి సమయం కాదది. మొత్తం భగవద్గీతలో నిరుపయోగమైన మాట (పదం) ఒక్కటి కూడా కనిపించదు. భగవంతుడు దేనినైతే చెప్పాడో అది కేవలం సంక్షిప్తంగా సారవంతంగా ఉంది. ఇరు సైన్యాల మధ్య రథం నిలబడి ఉంది. అటువంటి సందర్భంలో శ్రీకృష్ణ భగవానుడు ఇలా అంటాడు.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా!
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞాని సన్తత్త్వ దర్శిన: ॥

ఈ జ్ఞానాన్ని నువ్వు తత్వవేత్తలగు జ్ఞానుల వద్దకు వెళ్ళి తెలుసుకో. వారికి పూర్తిగా సాష్టాంగ దండ ప్రణామమును ఆచరించి వారికి సేవలు చెయ్యడం ద్వారా కపటాన్ని విడిచిపెట్టు. స్వచ్ఛమైన మనస్సుతో ప్రశ్నించడం ద్వారా పరమాత్మ తత్వాన్ని పూర్తిగా తెలుసుకొన్న జ్ఞానులగు ఆ మహాత్ములు నీకు ఆ తత్వ జ్ఞానాన్ని ఉపదేశిస్తారు. (భగవద్గీత 4-34)

శ్రీకృష్ణుని సాన్నిధ్యంలో అర్జునుడిని కూడా శ్రీకృష్ణుడు జ్ఞానుల వద్దకు వెళ్లి ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకోవాలని అతడికి సలహా ఇస్తూ ఉన్నాడు. ఆత్మజ్ఞానం యొక్క గొప్పతనం ఎటువంటిదో దీనివలన తెలుస్తున్నది. ఈ ఆత్మజ్ఞానం మనిషికి మనిషికి మధ్య ఉన్న దూరాన్ని తొలగిస్తుంది.

భయం, శోకం, ఈర్ష్య, ఉద్వేగం అనే అగ్నిజ్వాలల్లో తపిస్తున్న సమాజానికి సుఖశాంతులు స్నేహసాను భూతులు, సమాచార సంయమాలు, సాహస, ఉత్సాహాలు, శౌర్యం, క్షమ అనే దివ్య గుణాలను ప్రసాదిస్తూ హృదయంలోని అజ్ఞాన మనే చీకటిని తొలగించి జీవుడు లోన బ్రహ్మస్వరూపంలో మేల్కొనేటట్లు చేస్తుంది. ఈ జన్మలో జ్ఞానం ఏ వ్యక్తి ఏ సమాజం, ఏ దేశంలో తత్వ జ్ఞానాన్ని నిర్లక్ష్యం చెయ్యడం జరుగుతుందో, తత్వ జ్ఞానానికి విరుద్ధంగా వ్యవహరించడం జరుగుతుందో, అప్పుడు ఆ వ్యక్తికి ఆ సమాజానికి, ఆ దేశానికి వినాశనం సంభ

విస్తుంది. పతనం సంభవిస్తుంది. లంచగొండితనం, పలాయనవాదం, ఉగ్రవాదం, పిరికితనం వంటి దుర్గుణాలు విచ్చలవిడిగా ఆ సమాజంలో విస్తరిస్తాయి. అపస్తంభ ధర్మసూత్రాల (1.222) లో వస్తుంది. 'ఆత్మలాభాత్నపరం విద్యతే' ఆత్మలాభాన్ని మించిన లాభం మరేది లేదు. నిస్తేజమగు కళావిహీనమగు జగత్తును తేజోవంతంగా, శాంతివంతంగా మార్చాలనుకుంటే అది కేవలం ఆత్మసంయమనం మరియు ఆత్మజ్ఞానం అనే సాధనల వలన మాత్రమే సాధ్యపడుతుంది.

"ఓంతత్సత్"

❖ ❖ ❖

గమనిక

UGC CARE Journal (Arts & Humanities S.No. 35), ISSN No. (2456-4702), UGC Approval (No. 42500). Refereed Joural అయిన భావవీణ సాహిత్య మాసపత్రికలో వ్యాసాల ప్రచురణకై పరిశోధక విద్యార్థులు, ఆచార్యులు, అధ్యాపకులు, సాహితీ మిత్రుల నుండి సద్విమర్శతో కూడిన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు ప్రతి నెల 25వ తారీఖులోపు పంపవలెను. సంచిక ప్రతి నెల 1వ తారీఖున విడుదల చేయబడుతుంది. మిగతా వివరాలకు 7989781963 లేదా వాట్స్ఆప్ నెంబర్ 7386529274 సంప్రదించగలరు.

UGC CARE – నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భావవీణ సాహితీ మాసపత్రికకు పంపించే వ్యాసకర్తలు తప్పనిసరిగా క్రింది నిబంధనలు పాటించాలి. లేనిచో వ్యాసం ముద్రణకు స్వీకరించబడదని గ్రహించగలరు.

నిబంధనలు :

1. అను – 7, పేజిమేకర్లో ప్రియాంక ఫాంట్లో పంపాలి.
2. 4 లేదా 5 పేజీలలోపే వ్యాసం ఉండాలి.
3. మీ వ్యాసాన్ని పంపే ముందు ఒకటికి రెండుసార్లు తప్పులు సరిచూచుకొని పంపవలెను.
4. పరిశోధన వ్యాసంలో ఈ క్రింది అంశాలు విధిగా పాటించాలి. లేకపోతే వ్యాసం తిరస్కరించబడుతుంది.
   ఎ) సంక్షిప్త పరిచయం (Abstract)
   బి) ముఖ్యాంశాలు (Key words)
   సి) ముగింపు (Conclusion)
   డి) పాదసూచికలు
   ఇ) ఆధార గ్రంథాలు (Reference Books)
5. వ్యాస ప్రచురణ విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయమని గ్రహించగలరు.

తమ పరిశోధన పత్రంలో ఈ అంశాలన్నీ ఉన్నవో లేవో పరిశీలించుకొని వ్యాసాన్ని పంపగలరని మనవి. భావవీణ సాహిత్య మాసపత్రిక పాత సంచికల కొరకు ***http://telugujournalbhavaveena.blogspot.com*** నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు.

భావవీణ సంపాదకవర్గం.

ధర్మార్థకామమోక్షాలకు నిలయం : దాంపత్య జీవన సౌరభం

– బోయపల్లి చిట్టెమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

మానవ జీవితంలో దాంపత్యం అనేది సాంఘిక కట్టు బాటు. వివాహానంతరం భార్యాభర్తలు సుఖసంతోషాలతో జీవించి సంతానవంతులై కుటుంబ పోషణ కొనసాగిస్తారు. బంధుమిత్రులు, ఇరుగుపొరుగువారు ఆ దంపతులను చూసి సుఖదుఃఖ సమ్మేళనమైన వారి జీవనయానాన్ని పొగడుతారు లేదా తెగడుతారు. కష్టసుఖాలు, సుఖ దుఃఖాలు, లాభనష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, సుఖః సంతోషాలు సమంగా పంచుకుంటూ కాడికి కట్టిన జొడెద్దులవలె జీవనయానం సాగిస్తారు. ఆ దారి గతుకుల మయం కావచ్చు లేదా నల్లేరు మీద బండి నడక కావచ్చు. పురాకృత సుకృత పుణ్య ఫల విశేషం చేత ఒకరికి ఒకరు జమ గూడుతారు. వాల్మీకి చరిత్రలో రఘునాథ నాయ కుడు, కిరాతుని బోయవాని (వాల్మీకి) భార్య నోట ఒక మంచిమాట అనిపిస్తారు. సప్తర్షులను అరణ్య మార్గంలో అడ్డుకున్న కిరాతకుడికి సప్తర్షులు ఒక ప్రశ్న వేశారు. నీవు తెరచాటుగా సంపాదించిన పాప పుణ్యములు నీ కుటుంబ సభ్యులు పంచుకుందురా? అని ప్రశ్నించారు. అతడు పరుగుపరుగునా ఇంటికి వచ్చి తన భార్యను ప్రశ్నించాడు. ఆమె ఇలా సమాధానం ఇచ్చింది.

చ. "తవులగువారి కెవ్వరికతంబున సాగెద వప్పుదీసి తె
త్తువొ కొనితెత్తువో తెరువుదోచుచుతెత్తువొ జూదమాడితె
త్తువొ చని తెత్తువో యదియు దోసమొప్పునొమొనాకు నేటికా
రవరవ నీవు దెచ్చినవి దాచక వండగ బాడినిచ్చలున్"

అదే విషయాన్ని కిరాతుడు సప్తర్షులకు తెలియ జేయగా వారు అతనికి "మరామరా" అని విలోమంగా రామ మంత్రోపదేశం చేశారు. అతడు తపస్సు చేసు కుంటున్న సందర్భంలో భార్యాబిడ్డలు, బంధువులు వచ్చి అతని తపస్సును విరమించ చేయటానికి ప్రయత్నించారు. అప్పుడు అతను అన్న మాటలు నిత్యసత్యాలు.

క. "సతులెవ్వరు సుతులెవ్వరు
హితులెవ్వారేటి వఱదనెందే నొకచో
జతకూడిన కాష్ఠంబుల
గతి నించుక కూడివిచ్చి కదులుదురవలన్"

దీని భావాన్ని గమనిస్తే భార్యాభర్తలనేవారు కాలమనే నదీ ప్రవాహంలో కొట్టుకుపోతూ మధ్య కాలంలో జతపడిన రెండు దుంగల్లా కొంత దూరం కలిసిమెలిసి ఆ తరువాత కొంతకాలానికి కొంత దూరానికి విడిపోయి ఎవరిదారెంట వారు నడుస్తారు. ఎవరో ఒకరు మరణిస్తే మరొకరు ఒంటరి జీవితం గడపుతారు. ఇది దాంపత్య జీవన రహస్యం.

ప్రస్తుత గ్రంథం దాంపత్య జీవన సౌరభం అనంత పద్మనాభరావు 2013లో ప్రచురించారు. పద్మనాభరావుకు పురాణశాస్త్ర గ్రంథ పరిచయం ఉంది. భారత భాగవత రామాయణాది కావ్యాలలో ఎందరో దంపతుల జీవన ప్రస్థానం కనిపిస్తుంది.

పురాణాలలోని దంపతుల జీవన విధానాన్ని ఆధునిక స్థితిగతులకు అనుగుణంగా గమనిస్తే భార్యాభర్తలు ఏడు రకాలలో ఏదో ఒక తరగతికి చెందినవారు లేదా అన్ని రకాల వారు అయి ఉంటారు.

1) పార్వతీ పరమేశ్వరులు - భార్యకు అర్ధ శరీరం ఇచ్చినవాడు /భార్యను నెత్తిన పెట్టుకున్నవాడు.
2) లక్ష్మీనారాయణులు - భార్యను గుండెలపై పెట్టుకున్నవాడు.
3) ఛాయా సూర్యులు - ధుమధుమలాడే భర్త వెంట నీడలా తిరిగే సతి.
4) రోహిణీ చంద్రులు - ధుమధుమలాడే (ఎండ వేడిమి) భార్యకు చల్లని మనస్సుగల పతి.

5) సరస్వతీ బ్రహ్మాలు - భర్తకు తలలో నాలుకగా మెలిగే స్త్రీ.
6) సీతారాములు - ఏకపత్నీ వ్రతానికి మారు పేరైనపతి.
7) సత్యాకృష్ణులు - అష్టమహిషలతో గోపికాలోలుడైన కృష్ణుడు.

ఈ ఏడు జంటలను రచయిత ప్రధానంగా ప్రస్తావించారు.

ఈ వ్యాససంపుటిలో రామాయణ సంబంధమైన జంటలను భిన్నకోణాలలో రచయిత చూపించిన తీరు అద్భుతం. ఒక్కొక్క దాంపత్యం ఒక్కొక్క తరహా. ఎవరి కష్టసుఖాలు వారివి. ఎవరి సాధక బాధకాలు వారివి. అయితే రామాయణ గాథ మొత్తం ఈ పాత్రల చుట్టూ తిరుగుతుంది. ఈ వివరాలను రామాయణంలో స్త్రీ పాత్రలు గ్రంథంలో చక్కగా పాండురంగారావు (ఆంగ్లంలో) విశ్లేషించారు. దానిని అనువాదం చేసిన ఈ రచయిత ఆ స్ఫూర్తితో ఈ గ్రంథంలో పదకొండు మంది దంపతుల జీవన సమరాన్ని తనదైన రీతిలో విశ్లేషించారు. ఇందులో చక్రవర్తులున్నారు - కౌసల్యా దశరథులు, రత్నమాల-జనకులు, రాజకుమారులు - సీతారాములు, ఊర్మిళ - లక్ష్మణులు, ముని దంపతులు - మేనకా విశ్వామిత్రులు, అహల్యా గౌతములు, అనసూయ అత్రులు, అరుంధతి వశిష్టులు, వానరదంపతులైన - తారా వాలి, రాక్షస దంపతులైన - మండోదరి రావణులు, సులోచన ఇంద్రజిత్తులు, శూర్పణఖ ఇందులో ప్రస్తావించబడ్డారు. భారతానికి సంబంధించి గాంధారీ ధృతరాష్ట్రులు, కుంతి పాండురాజులు, ద్రౌపది పాండవులు, భీమ హిడింబిలు, సుభద్ర అర్జునులు, శకుంతలా దుష్యంతులు, గంగా శంతనులు, సత్యవతి శంతనులు, దేవయాని శర్మిష్ఠ, యయాతి నలదమయంతులు, కృపీ ద్రోణులు, రేణుకా జమదగ్నులు, భానుమతీ దుర్యోధనులు, ఉత్తరాభిమాన్యులు, లోపాముద్ర అగస్త్యులు, సావిత్రీ సత్యవంతులు, ఊర్వశీ పురూరవులు ఇందులో విస్తారంగా కనిపిస్తారు.

భాగవతానికి సంబంధించి లక్ష్మీనారాయణులు, సత్యాకృష్ణులు, నంద యశోదలు, దేవకీ వసుదేవులు, జాంబవతీ కృష్ణులు, నీలా కృష్ణులు, రేవతీ బలరాములు ప్రస్తావించబడ్డారు. వీరే కాక శచీ పురందరులు, చంద్రమతీ హరిశ్చంద్రులు, గోదా రంగనాథులు, పద్మావతీ శ్రీనివాసులు పురాణ ప్రసిద్ధమైన దంపతులు.

రచయిత వీరి దాంపత్యాలలోని వైశిష్ట్యతను, విలక్షణతను, వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా, విపులంగా విశదపరిచారు. కథను క్లుప్తంగా చెబుతూ పురాణగాథకు భిన్నం కాకుండా ఆధునిక సమాజానికి ఒక సందేశం లభించేలా వ్యాసాలను విస్తృతపరిచారు.

రుక్మిణీ కళ్యాణాన్ని 'కిడ్నాప్' చేసిన వివాహంతోనూ, ప్రేమ వివాహంతోనూ పోల్చారు. అహల్యా గౌతముల కథలో తెలిసి తప్పుచేసి కాలుజారిన అహల్యను గౌతముడు తిరిగి స్వీకరించటం ఒక ఉదారభావంగా పేర్కొన్నారు. మండోదరి పాత్రను గురించి చెబుతూ సినిమాలలో (విలన్) ప్రతినాయకుని భార్య సౌమ్యంగానూ, పతివ్రతాధర్మంతోనూ ప్రవర్తించిన తీరును ఆదర్శ ప్రాయంగా చెప్పారు. సీతను రామునికి అప్పగించి శరణు వేడమని ఆమె ప్రాధేయపడింది. అతడు అహంకారంతో పెడచెవిన పెట్టాడు. అలానే తార వాలితో రాముని శౌర్య పరాక్రమాలను రుజువర్తనను చెప్పి మందలించే స్థితికి ఎదిగింది. అయినా బుద్ధి గడ్డి తిని అన్నాదమ్ముల మధ్య వైరం కుటుంబాన్ని ఎలా నాశనం చేస్తుందో ఈ గాథలో తెలుస్తుంది.

అనసూయ నిజంగా అనసూయ (అసూయ లేనిది) ఆదర్శ గృహిణి. తాను ఆదర్శంగా ఉండటమే కాక ఆదర్శ దాంపత్యం ఎలా ఉండాలో సీతకు తెలిపిన సాధ్వీమణి. ఆ దంపతులలో మెచ్చుకోదగిన మరో గుణాన్ని కూడా రచయిత సుస్పష్టం చేసారు. భార్యను గూర్చి భర్త ఇతరుల యెదుట నాలుగు మంచి మాటలు చెప్పటం ఆదర్శ దాంపత్యానికి తొలిమెట్టు అని తెలపడానికి అత్రి మహర్షి రామలక్ష్మణులతో అనసూయను గూర్చి అనసూయ

అసాధారణతను గూర్చి ఉదాహరించటం ఒక ఉదాహరణ.

కాపురం కూల్చిన చెల్లెలు అనే భావంతో శూర్పణఖ పాత్రను ప్రవేశ పెట్టారు. ఆమె రావణ సోదరి. ఆమెకు విద్యుజ్జిహ్వునితో పెండ్లి జరిపించారు. పొరబాటున రావణుడు కాలకేయులతో యుద్ధం చేస్తూ బావగారిని చంపాడు. నలుగురు అన్నదమ్ములకు ఆమె ఒక్కగానొక్క సోదరి. ఆమెకు జనస్థానాన్ని అరణంగా ఇచ్చి పంపాడు రావణుడు. రాముడిపై వ్యామోహం పెంచుకున్న శూర్పణఖకు ముక్కు చెవులు కోసి పంపాడు లక్ష్మణుడు. ఆమె రావణుడికి పెడ బుద్దులు నేర్పింది. సీత నీకు దగిన స్త్రీ అని చెప్పి సీతాపహరణానికి దారితీసేలా చేసింది. కథ దుఃఖాంతం కావడానికి, సర్వరాక్షస వినాశనానికి ఆమె మూలకారణం అయింది. ఒక చెల్లెలు దుర్బుద్ధి వంశ నాశనానికే దారి తీసిన సంఘటన ఇది. కాపురం అంటూ ఎక్కువ కాలం చేయకపోయినా జంబుకాసురుడనే కుమారుడు పుట్టాడు. అతడు పాదలలో తపస్సు చేసుకుంటున్నాడు. ఫలాలు కోస్తున్న లక్ష్మణుడు చూడకుండా అతన్ని కత్తితో పొడిచాడు. ఎంతటి హృదయవిదారకమైన జీవితం. అటు భర్తను, తన అన్న ద్వారానే కోల్పోయింది, ఇటు కన్న కుమారుడినీ కోల్పోయింది. ముక్కు, చెవులు కోల్పోయింది. తనవల్ల ఖరదూషణులతోపాటు 14 వేల మంది రాక్షస సైన్యము రాముని చేతిలో నశించారు. అంతటితో నిరాశ్రయురాలైన ఆమె ఇంటి పట్టున పడివుండవచ్చు కానీ, దుర్బుద్ధితో ఆమె రావణ కుంభకర్ణ ఇంద్రజిత్తుల మరణానికి, లంకా వినాశనానికి మూల హేతువు అయింది.

ఆవిడ సంసారం చేయలేదు కదా మరి ఈ దంపతుల కోవలోకి వస్తుందా అనే సందేహం కలుగుతుంది. కొందరి జీవితాలలో నూరేళ్ళ కాపురం మూన్నాళ్ళ ముచ్చటవుతుంది. మరికొందరు పిల్లాపాపలతో నూరేళ్ళ పంటగా సుఖశాంతులతో జీవిస్తారు. ఈ రెండు రకాల జీవన సమరాన్ని తెలియజేయటానికే శూర్పణఖ జీవిత వృత్తాంతాన్ని ఇందులో జోడించారు.

సులోచన ఇంద్రుజిత్తులు :

సులోచన మహా పతివ్రత. కుటుంబ పెద్దయైన మామగారి (రావణుని) స్త్రీ వ్యామోహ బుద్ధి తన కాపురాన్ని నాశనం చేసింది. వాల్మీకి రామాయణంలో సులోచన మనకు కనిపించదు. రంగనాథ రామాయణంలో సులోచన ప్రస్తావన ఉన్నది. బల పరాక్రమాలు కలిగి ఇంద్రుని సైతం బంధించి తీసుకొని వచ్చిన తన భర్త ఇంద్రజిత్తు రామరావణ యుద్ధ అగ్నిహోత్రంలో సమిధయ్యాడు. కొద్దిపాటి వివరాలు లభిస్తున్న వీరిద్దరి జీవన స్థితిగతులను రచయిత ఇందులో ప్రస్తావించారు.

కౌసల్యా దశరథులు :

దశరథుని పాత్ర విచిత్రమైనది. పుత్ర కామేష్టి యాగంలో లభించిన పాయసంతో ఆయనకు నలుగురు పుత్రులు జన్మించారు. పట్ట మహిషి కౌసల్యా రాజ్యాంగ రీత్యా సమస్తాధికారాలు గల మహారాణి. కానీ ఆమె పరిస్థితులను లొంగి తలవంచుకున్న ఒక నిస్సహాయురాలు. బహు భార్యత్వం వల్ల కలిగే అనర్థాలను రామాయణంలో దశరథుని వృత్తాంతం ద్వారా మనము గ్రహించవచ్చు. కైక తన ఔన్నత్యాన్ని చాటుకోవడానికి తన కుమారునికి పట్టాభిషేకం చేయటానికి మంథర దుర్బోధలతో వరాల నెపంతో దశరథుని ప్రాణాలు తీసింది. సాఫీగా సాగిపోతున్న సంసార ప్రవాహానికి గండి పడింది. రాముడు అరణ్యాలకు వెళ్లాడు. భరతుడు రాజ్యాన్ని తిరస్కరించాడు. కథలో మూడు స్త్రీ పాత్రలు మూడు భిన్న మనస్తత్వాలు కలిగి ఉండటం రామాయణ ప్రత్యేకత.

ఈ రామాయణ గాథను ఆధునిక జీవన విధానానికి సరిపడేలా సమన్వయం చేశారు రచయిత. ఈ క్రింది వాక్యాలలో అది ప్రస్ఫుటం అవుతుంది.

"కుమారులు విదేశాలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లి అక్కడ సంవత్సరాల తరబడి ఉండిపోయినప్పుడు ఆ తల్లి పడే మానసిక వ్యధను చూస్తున్నాం. అందులోనూ పతి ఆదరణ సరిగ్గా లేనప్పుడు ఆ బాధ వర్ణనాతీతం. వీడియో కాన్ఫరెన్స్‌లో కుమారుడు వారానికోకసారి తనతో

గంటసేపు మాట్లాడతాడని ఆ తల్లి సంబరపడిపోతుంది. రెండేళ్లకొకసారి చుట్టపు చూపుగా వచ్చి పోయే కొడుకు, కోడలు, మనుమల్ని అనునిత్యం ఊహించుకుంటూ పూజలు చేస్తూ పూజ గదిలోనే గడపుతుంది. చివరి శ్వాస వదిలే సమయానికి ఆ కొడుకు విమానం అంది వస్తాడా, రాడా? అని బెంగ పెట్టుకోదు. తన రాత ఎలా ఉంటే అలా జరుగుతుందని సర్ది చెప్పుకుంటుంది".

మౌన వ్యాఖ్యాత కౌసల్య. భర్తను అదుపులో పెట్టు కోవాలనే మనస్తత్వం గలది కైక. తన కుమారులిద్దరినీ - భరత శత్రుఘ్నులను ఇతరులకు సహాయకులుగా ఉం డేలా తీర్చిదిద్దిన తల్లి సుమిత్ర. వరాలు శాపాలుగా, శాపాలు వరాలు అయిన ఘట్టాలు మనకు భారత, రామా యణాలలో కనిపిస్తాయి.

ఆధారం గ్రంథం :

దాంపత్య జీవన సౌరభం - ఆర్. అనంతపద్మనాభరావు

❖ ❖ ❖

వేమన ధర్మనిరతి

– డా॥. యమ్. విజయశ్రీ, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, జె.కె.సి. కళాశాల, గుంటూరు.

ఉపోద్ఘాతము :

మానవ జీవన విధానంపై లోకానుభవముతో వ్యాఖ్యానించే శతకాలు నీతి శతకాలు. ఈ నీతి శతకాలలో రాజనీతి, గృహనీతి, లోకరీతి ఉంటుంది. సమాజ హితం కోసం రచించబడినవి ఈ నీతి శతకాలు. నీతి బోధ ప్రధానంగా ఉంటుంది. నీతి అంటే ధర్మబోధనే. ధర్మ రక్షణలో నీతి శతకాలు కూడా తమ వంతు పాత్ర వహిస్తాయి. ఏ సాహిత్య ప్రక్రియ అయినా సమాజ హితం కోసమే. శతక సాహిత్యం కూడా సమాజాన్ని సంస్కరించటానికి, సమాజంపై ఆలోచనలు రేకెత్తించటానికి ఉపయోగపడతాయి.

రచయిత పరిచయం :

తెలుగు ప్రజానీకానికి వేమన ఒక మహా యోగి. మట్టిలో పుట్టి మహోన్నత శిఖరాలు అందుకున్న మానవతామూర్తి. మనుష్యుల మధ్య తిరుగుతూనే మానవ జీవిత సత్యాసత్యాలను నిత్యము అన్వేషించాడు. అన్వేషణలో అందివచ్చిన అనుభవాలను ఆటవెలదుల్లో అలవోకగా లోకానికి అందించిన మహానుభావుడు. వేమన పద్యం ఒక్కటైనా నోటికి రాని తెలుగువాడుండడు అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. "ఆయన సూక్తి ఆయన అంతర్వ్యక్తికి అద్దం పట్టిన అభివ్యక్తి, ఆయన సాధకుడు, బోధకుడు, ఆయన ద్రష్ట, స్రష్ట, మహాకవి" అని జి.వి.సుబ్రహ్మణ్యం గారు అక్షరాక్షర సత్యంగా అభిభాషించారు.

వేమన పద్యాలను మొట్ట మొదటగా సి.పి.బ్రౌన్ 1829లో అచ్చు వేయించారు. 1839లో బ్రౌన్ 1200 పద్యాలను రెండవసారి ముద్రించారు. పూర్ణయాచారి బందరులో 1919లో 4000 పద్యాలతో వేమన శతకం అచ్చువేయించారు. వేమన పద్యాలు వివిధ బాషలలోనికి అనువదించబడ్డాయి అంటే వేమన పద్యాల గొప్పదనం అర్థం చేసుకోవాలి. వేమన సమాజాభ్యుదయాన్ని ఆకాంక్షించాడు. వేమన జీవితంలోని వివిధ పార్శ్వాలను బాగా పరిశీలించాడు. జీవితంలోని ముఖ్య సంఘటనలని, సమాజంలోని బలహీనతలని చిత్తశుద్ధితో, సాహసంతో వివరించాడు. నిజాయితి, వివేకం, సత్యం, వీటినుంచే సామాజిక చైతన్యం లభిస్తుందని వేమన పద్యాల సారాంశం.

ధర్మానికి తొలిమెట్టు తల్లితండ్రులను గౌరవించటం. తల్లితండ్రుల పట్ల ప్రేమలేని కుమారుడు పుట్టినా, చచ్చినా ఒక్కటేనని ఈ క్రింది పద్యం ద్వారా తెలియచేశారు.

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి ? వాడు గిట్టనేమి ?
పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా ?
విశ్వదాభిరామ! వినురవేమ!

అలాగే పశువుల రంగు వేరైనా పాలరంగు ఒక్కటై నట్లు, పుష్పజాతులు వేరైనా, పూజ ఒక్కటైనట్లు....

పసుల వన్నెవేరు పాలెల్లనొక్కటి
పుష్పజాతి వేరు పూజయొకటి
దర్శనంబులారు దైవంబు నొక్కటి
విశ్వదాభిరామ! వినురవేమ!

పూజల కన్నా బుద్ధి, మాట కన్నా మనస్సు, కులము కన్నా గుణము ప్రధానంగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనస్సు ధృఢము
కులము కన్న మిగులు గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ! వినురవేమ!

వేమన మానవ స్వభావాల్ని, మానసిక ప్రవృత్తుల్ని జీవన విధానాలలోని మంచి చెడులను లోతుగా పరీక్షించి పద్యాల ద్వారా మన మెదడుకు మేతనందించాడు.

మనకు తెలిసిన, తెలిసీ తెలియని, తెలియని జీవిత రహస్యాల్ని మరింత తెలియచేశాడు.

పుత్తడి గలవాని పుండు బాధైననూ
వసుధలోన చాల వార్త కెక్కు,
పేదవాని ఇంట పెండ్లయినను యెరుగరు
విశ్వదాభిరామ! వినురవేమ!

అర్ధబలం ఆధికంగా గలవానికి చిన్న పుండైనా పెద్ద వార్తలా చెప్పుకుంటారు జనం. పేదవాడి పెండ్లి పెద్ద వార్త కాదు అంటాడు. సమాజంలో అర్ధమునకు (డబ్బు) ఉన్న విలువ ఈ చిన్న పద్యంలో తెలియచేశారు.

మేడిపండు చూడ మేలిమై యుండు
పొట్టవిప్పి చూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ! వినురవేమ!

వేమన సమాజమనే మేడిపండు పొట్ట విచ్చి పురుగుల్ని చూపించాడు. సమాజంలోని అన్యాయాలకు, దుర్మార్గాలకు కారణాలను అన్వేషించాడు. నీతిబద్ధమైన బాధ్యత గల సమజాన్నే వేమన ఆకాంక్షించాడు.

ముగింపు :

ఈ విధంగా వేమన తన పద్యాల ద్వారా ప్రశ్నించాడా! సమాధానం ఇచ్చాడా! సమాజాన్ని ఆలోచింపచేశాడా! చైతన్యపరచాడా! అంటే అన్నీ ఒకేసారి కలిగే నూతన అనుభూతికి లోనై తనను తాను ప్రశ్నించుకుంటాడు, సమాధానపరచుకుంటాడు పాఠకుడు. నవసమాజం నిర్మాణానికి తనవంతు కృషి చేసి తరువాత తరాలకు ప్రేరణ కలిగించారు వేమన. జన సామాన్యంలో వేమన మహాకవిగా, ప్రజాకవిగా సుస్థిర స్థానం సంపాదించు కున్నారు.

ఆధార గ్రంథాలు :

1) తెలుగుసాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.
2) పుష్పాంజలి - బాలల నీతిబోధ.

❖ ❖ ❖

భాగవతంలో "ధర్మం" విశిష్టత

– డా॥. కుంద సురేఖారెడ్డి, స్కూల్ అసిస్టెంట్, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

జీవుడు మానవ జన్మ ఎత్తినందుకు సాధించాల్సిన పురుషార్థాలు నాలుగు. అవి ధర్మ-అర్థ-కామ-మోక్షాలు. హిందూ మతానికి వేదాలు మూలం. దానిలో యజ్ఞ యాగాలు, క్రతువులు, షోడశకర్మలు, షట్కర్మలు, నిత్య నైమిత్తిక కర్మలు, పూజలు, వ్రతాలు, నోములు అంతర్భాగా లుగా వుంటాయి. వీటన్నింటి లక్ష్యం పురుషార్థ సాధన. అంటే పురుషుడు సాధించాల్సిన లక్ష్యం అవి ప్రతి మనిషి సాధించాలి. అవి ధర్మం-అర్థం-కామం-మోక్షం వీటిలో ధర్మార్థకామాలను "త్రివర్గం" అంటారు. ఈ మూడు ఇహలోకానికి సంబంధించినవి మోక్షం-పరలోకానికి సంబంధించినది. మనిషికి "ధర్మం" అతి ముఖ్యమైనది. ధర్మబద్ధమైన జీవనము అన్నింటికి పునాది - మూలం.

మన ప్రాచీన సాహిత్యంలో నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. భారత - రామాయణ - భాగవతాల్లో ఉత్తములైన వ్యక్తిత్వం కలవారి కథలను వివరిస్తాయి.

ఆశ్రితులను రక్షించండం, ఆడినమాట తప్పక పోవడం, తాము సంపాదించిన దానిలో శక్తిమేరకు దానం చేయడం - అతిథి - అభ్యాగతులను ఆదరించడం అనేవి మానవులకు ఉండవలసిన మంచి గుణాలు. మన పురా ణాల్లో, చరిత్రలో ఇటువంటి మహనీయుల కథలు ఎన్నెన్నో వున్నాయి. వాటి ద్వారా మానవులు స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉంది.

బలిచక్రవర్తి ఇచ్చిన మాటకు కట్టుబడి తన గురువైన శుక్రాచార్యుడు హెచ్చరిస్తున్నా "వామనుని"కి దానం చేస్తాడు.

దాతల్లో గొప్పవాడా! ఓ బలిచక్రవర్తి! నీ కులాన్ని, రాజ్యాన్ని, పరాక్రమాన్ని నిలుపుకో. ఈ పొట్టివాడు విష్ణువు. బ్రహ్మాండమంతా నిండిపోతాడు. అతన్ని ఎవరాపగలరు. నామాట విను అని శుక్రాచార్యుడు హెచ్చరిక చేస్తుంటే - బలిచక్రవర్తి ఓ మహాత్మా! మీరు చెప్పింది నిజమే. లోకంలో గృహస్థుల ధర్మం కూడ ఇదే. పలికి లేదనుట కంటే పాపమేది. పూర్వం భూదేవి

"మెట్టి - దుష్కర్ముని నే భరించెదగాని - సత్యహీనుని మోపజాల" ననుచు
బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ"

అని పూర్వం భూదేవి ఎటువంటి వారినైనా భరిస్తాను గాని, ఆడిన మాట తప్పిన వానిని మాత్రం మోయలేను అని బ్రహ్మతో చెప్పింది కదా!

శా॥ కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే
వారేరే సిరిమూట గట్టుకొని పోవంజాలిరే?

ధర్మంగా, సత్యంగా బ్రతికిన వారి చరిత్రలు నేటికి లోకం మరువలేదు! అందునా యజ్ఞాలు - పుణ్యకార్యాలు ఎన్ని చేసినా విష్ణువును చూడటం - సాధ్యంకాదు అటు వంటి శ్రీహరికి ఇవ్వటంతో జన్మ ధన్యం కదా!

కాబట్టి మరణం వచ్చినా సరే, నా నాలుక వెనుదిరు గదు. ఆడినమాట తప్పను అని వామనుని పాదాలను కడిగి నీళ్లు తలపై చల్లుకొని

శా॥ విప్రాయ ప్రకట ప్రతాయ భవతే విష్ణు స్వరూపాయ వే
ద ప్రామాణ్యవిదే త్రిపాద ధరణీం దాస్యామి"

మూడడుగుల నేలను దానం చేస్తున్నానని పలికి పం ంమాత్మునికి ప్రీతి కలుగుగాక! అంటూ ధారపోసాడు.

ఈ రకంగా సత్యానికి కట్టుబడిన రాజు (రాక్షస వంశంలో కూడ) వున్నాడని ఎట్లా ధర్మంగా జీవించాలో తెలుసుకోవాలి.

భక్త ప్రహ్లాదుడు – శ్రీమహావిష్ణువును :

మోక్షాన్ని ప్రసాదించమని కోరినాడు. అంటే జీవిత

మంతా ధర్మంగా బ్రతికితేనే మోక్షం కల్గుతుంది కదా!. రంతిదేవుడు అనే రాజు తన సందను దాన ధర్మాలకే ఉపయోగించాడు. చివరకు తిండి - నీరు తన గురించి ఆలోచించకుండా ఎదుటివారి ఆకలి దప్పిక తీర్చిన మహాదాత. ఇట్లా పురాణాల్లో ఎన్నో ప్రాతలున్నాయి. వాటి నుంచి సమాజానికి తర తరాలుగా నీతిని, ధర్మాన్ని, సత్యాన్ని బోధించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

వ్యక్తి మానసికంగా ఆరోగ్యవంతుడైతేనే చాలా శక్తి సామార్థ్యాలు కల్గివుంటాడు. ధర్మ ప్రవర్తనను అలవర్చుకోవడానికి పురణేతిహాసాలలో విశిష్టమైన వ్యక్తుల చరిత్ర లను చదవడం వల్ల సత్యం, ధర్మం, నీతి ద్వారా జీవన విలువలను పెంపొందించుకుంటాడు. కాబట్టి సమాజానికి ధార్మిక విషయాలను ఇంకా ఎక్కువగా అందించవలసిన అవసరం ఎంతైనా వుంది.

❖ ❖ ❖

జానపద సాహిత్యంలో శృంగార (కామ) సౌరభాలు – ఒక పరిశీలన

– డా॥. సి.హెచ్. చంద్రయ్య, పి.డి.ఎఫ్, ఫెలో, భాషాశాస్త్రశాఖ, భాషాభివృద్ధి పీఠము,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్.

బహుముఖీయమైనది జానపద విజ్ఞానం. ఏ రూపంలో ఉన్నా దాని వెనుక సామాజిక విలువలు, సాంస్కృతిక అనుబంధాలు, సంబంధ బాంధవ్యాలు, సంప్రదాయాలు, సమూహం యొక్క ఆలోచనా ధోరణులు, ప్రవర్తన రీతులు ఉంటాయి. ఒక సమాజం జీవన విధానం జానపద విజ్ఞానంలో ప్రస్ఫుటంగా కన బడుతుంది. ఒక జాతి లేదా సమూహం లేదా సమాజం ఏదైనా కావచ్చును. జానపద విజ్ఞానం ఒక అమూల్య సంపద. ఆయా వర్గాలకు సంబంధించిన జీవన విధానాన్ని, వైవిధ్యాన్ని, నమ్మకాన్ని, అనుభవ వైవిధ్యాన్ని చూపిస్తుంది. వస్తు వైవిధ్యం పుష్కలంగా ఉన్న పాలు, కథాక్రమం, కథనపుష్టి కలిగిన గేయగాథలు, దైవభీతి ప్రతిపాదన దైవత్వపాదన కలిగిన కథా గేయాలు సమాజం కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన త్యాగధనుల స్మృతి కావ్యాలనిపించే గేయగాథలు, సామెతలు, పొడుపు కథలు, మాండలిక విశేషాలు మొదలగునవి జానపద విజ్ఞానంలో భాగం. ఇవే ధర్మార్థ, కామ, మోక్షాలకు సంబంధించిన అనేక గేయాలు, కథలు, ఇంకా చాలా విశేషాలు ఉంటాయి. ఇందులో శృంగార (కామ) గేయాలు, శృంగార కథలు మొదలగునవి ఉన్నాయి.

జానపదం అంటే కేవలం పల్లెపాటలు అనే అభిప్రాయం ఒకనాడు ఉండేది. ఈనాడు పల్లెపాటలు జానపద విజ్ఞానంలో ఒక భాగం. మానవ జీవితంలో పుట్టుక నుండి చివరి దాకా జానపదం కానిదేదీ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ సాహిత్యానికి ఆయా దేశాల జానపద గేయాలే మొదటి సాహిత్య రూపాలు. జానపద సాహిత్యంలో శృంగార, హాస్య, కరుణలకు పెద్దపీట వేసిన అన్ని రసాలు జాలువారుతాయి. జానపద సాహిత్య శృంగార సౌరభం పరిచయం చేయడం నా వ్యాస ఉద్దేశ్యం.

సృష్టిలో శృంగారానికి ఆకర్షితులు కానివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. జానపద గేయ సాహిత్యంలో శృంగారాలు సింగారాలుగా విరబూస్తాయి. జానపద సాహిత్యాన్ని పరిపుష్టం చేసింది శృంగారమే. తెలుగులో శృంగార గేయాలు చాలా ఉన్నాయి. ఈ శృంగార గేయాలకే వలపు పాటలనీ కూడా పేరు ఉంది. ఈ గేయంలో ప్రేయసీ, ప్రియులు, భార్యాభర్తలు సరసాలు, ప్రలోభ, వంచక వియోగ శృంగార భావాలు కనిపిస్తాయి.

శృంగార గేయం :

చక్కని సరిబండ మీన
నా సామి
చెక్కదంటే చిన్నదాన
చెక్కవచ్చి చెంపదాకే
నా సామి
చెప్పరాని దుఃఖమొచ్చే
మాయదారి బండమీన
నా సామి
మందుదంచే మామ కొడుకా
మందుతల మాకులేలా
నా సామి
మనసుంటే చాలు పోరా!
తాగేది కైకుంట నీరు
నా సామి
కడువ నిండ నింపుకోని
రెండు చేతుల కడవ మీన
నా సామి
వాలు కన్నులు వాని మీన

పూర్వకాలంలో గ్రామాల్లో తంగేడి రేల చెక్కవొలిచే వారు. అక్కడున్న గ్రూపులో ఒక అమ్మాయి మరో అబ్బాయి భావాలు గేయం రూపంలో వ్యక్తపరుస్తుంది. చెక్కవచ్చి చెంప దాకడమనే సాకుతో తన భావాన్ని యువకుడు తెలిపితే భావాన్ని అందుకున్న అమ్మాయి అదే వూపుతో అదే లయతో సమాధానం చెప్పింది. మామకొడుకా! మనసుంటే చాలు పోరా అనే పదాలు సదభిప్రాయం సందేశాలు. రెండు చేతులు కడువమీన నా సామి వాలు గన్నులు వాని మీన అనే చరణాలు ఆమె మనసును తెలియజేస్తాయి.

కొంత సమ్మిళితమైంది, ధ్వని పూర్వకమైనది ఉత్తమ కావ్యం అని అంటారు. అలాంటి జసీవ కవిత కళా ఖండాలు కోకొల్లలు.

జేరమమ్మ జేరమే
పైన పుల్కరమే
ఇంట్ల ఎవ్వరు లేరు
ఇగరావే జరమా!
అత్త అంగడివాయో
మామ మత్తడి వాయే
ఇంట్ల ఎవ్వరు లేరు
ఇగ రావే జరమా

అని నాయిక జెరాన్ని ఆహ్వానిస్తుంది. ఆమె ఎంత ప్రాధురాలో ఆహ్వానిస్తున్న జెరము ఏమిటో అందరికీ అర్థమవుతుంది.

రారా నా ఇంటికి
వొంటిగా నిదుర
రాదు నా కంటికి
వొస్తే నేమో వోస్తనామా
రాకుంటే రానను
కల్ల నిజమూ రోండు జెప్పితే
నిమ్మలంగా నిద్రవోత
రారా నా ఇంటికి

ఈ గేయం కూడ అటువంటిదే. శబ్ద చమత్కారానికి, భావ పరిమళానికి సహజత్వానికి నెలవైంది.

ఇంకొక గేయంలో తాను ప్రేమించిన ఒక యువకుడు తనను విడిచి వెళ్లిపోతుంటే అతనితో వెళ్లడానికి వీలుకాని ఆ యువతి పడే విరహ వేదన చక్కగా చిత్రించబడింది.

చెలియా నన్నిడ నాడి పోతావా తిరనాలు
నీకెంత దయలేదగా నా సామి
దున్నిన దుక్కుల్లో దూడమ్మ గుడికాడ
పాపములే ఒడిగడితిరా నా సామి
పండిన పంటల్లో పాపమ్మ గుడికాడ
పాపములే ఒడి గడితీరా నా సామి
సెలియ సెల్లంపల్లె సేంద్రుని గుడికాడ
సేసిన బాసలేమి నా సామి
నుబోయెదారిలో నిలువుర ఒకటుంది
నీరూపు రాసిపోరా నా సామి
రాకున్న పోకున్న రా దారి పడకున్నా
గోరంతా సీటంపారా నా సామి

ఇలా జానపద సాహిత్యంలో శృంగార గేయాలు, గాథలు చాలా ఉన్నాయి. ఇవి పండితులను, పామరులను రంజింపజేస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగువారి జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.
2. తెలుగు విజ్ఞాన సర్వస్వం
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్. సుందరం
4. జానపదం - తిరునగరి శ్రీనివాసు
5. తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు.

❖

रामो विग्रहवान् धर्मः

- **कंदाल वनदुर्गा रोहिणी,** आन्ध्र अध्यापिका., ए.पि. सोषल वेल्फेर ऐ.ऐ.टि मेडिकल्, अकाडमिज, ईडुपुगल्लु, विजयवाड, कृष्णाजिल्ला.

प्रपंच साहित्ये आदिकाव्यं रामायणम् कृत्वा वाल्मीकि महर्षि आदिकविः इति कीर्तिं लब्धवान । तस्य काव्यस्य रामायणम्, पौलस्त्यवधम्, सीतायाश्चरितम् च इति त्रीनि नामानि सन्ति।

द्वकूजन्तं रामरामेति मधुरं मधुराक्षरं
आरुह्य कविता शाखां वन्दे वाल्मीकि कोकिलम्॥

यः इक्ष्वाकु वंशे प्रभवः राम इति नाम्ना प्रसिध्दश्च तस्मिन् एते वक्ष्यमानाः गुणाः सन्ति ।

गुणवत्वम्, वीर्यवत्वम्, धर्मज्ञत्वम्, कृतज्ञत्वम्, सत्यम्, धृढव्रतत्वम्, चरित्रयुक्तत्वम्, सर्वभूतहितत्वम्, विद्वत्वम्, समर्धत्वम्, एकप्रियदर्शनत्वम्, आत्मवत्वम् जियक्रोधत्वम्, द्युतिमत्वम्, अनसूयकत्वम्, संग्रामभूमौ देवानामतिभीतिकृतत्वं च इति षोडशगुणाः।

एवं गुण संपन्नः रामः विशेषतः राक्षसेन मारीचेन द्वरामो विग्रहवान् धर्मः इति श्लाघितः सः रामः वेदोक्तं धर्मं स्वस्य जीवितकाले अनेकानेक संदर्भेषु यधोचितं आचरणं कृत्वा पृधिव्यां धर्मं स्थापितवान् । रामः मातृभक्ति परायणः । पित्रुवाक्यपरिपालकश्च। अत एव रामायणे बालकाण्डे लक्ष्मणं प्रति रामवचनं

द्वयस्या मदभिषेकार्धे मानसं परितप्यते
माता नः सायधा न स्थात सविशंका तथाकुरु
तस्याः शंड्कामयं दुःखं मुहूर्तमपि नोत्सहे
मनसि प्रति संन्जातं सौमित्रग्मुपेक्षितुम्
न बुध्दि पूर्वं ना बुद्धं स्मरामीह कदाचन
मातृणां वा पितुर्वाहं कृतमल्पं च विप्रियम्॥

तथा दशरधस्य अन्तःपुरस्त्रियः एतानि वचनानि उक्तवत्य :

द्वकृतेव्वचोदितः पित्रा सर्वस्यान्तः पुर्स्य च
गतिश्च शरणं चासीत् सरामाग्द्य प्रवत्स्यति॥

एतानि वचनानि रामस्य मातृभक्तिं प्रकटीकुर्वन्ति।

पितृभक्ति :

वनगमन समये कैकेयीं प्रति रामः

द्वअहं हि वचनात् राज्ञः पतेयमपि पावके
भक्षयेयं विषं तीक्ष्णं पतेयमपि चार्णवे ।
नह्यन्तो धर्मचरणं किञ्चिदस्ति महत्तरम्
यथापितरि शुश्रूषा तस्यवा वचन क्रियम्॥

इति उक्तवान्। कौशल्यां प्रति च

द्वनास्ति शक्ति पितुर्वाक्यं समतिक्रमितुं मम
प्रसादये त्वां शिरसा गन्तुमिच्छाम्यहं वनम्॥

इति उक्तवान् । एतैः वचनैः रामस्य पितृभक्तिः ज्ञायते।

भ्रातृप्रेम :

रामः स्वस्य आचरणेन सौभ्रातृत्वं वा भ्रातृवात्सल्यं प्रकटितवान्। सीतां प्रति

द्वभ्रातृपुत्रसमौ चापि द्रष्टव्यौ च विशेषतः
त्वया भरत शतृध्नौ प्राणैः प्रियतरौमम्॥

इति रामस्य वचनं तस्य भ्रातृवात्सल्यं निरूपयति। वनगमन समये लक्ष्मणं प्रति

द्वस्निग्धो धर्मरतोधीरः सततं सत्पथे स्थितः
प्रियः प्राणसमो वश्योविजेयश्च सखाचम्॥

इति रामस्य वचनं तस्य भ्रातृषु प्राणाधिकप्रियत्वं निरूपयति

मित्रप्रेम :

स्वीय पट्टाभिषेक समये वानर मुख्यान् उद्धिश्य

द्वसुहृदोमे भवन्तश्च शरीरं भ्रातरस्तथा ॥
युष्माभिरूधृतश्चाहं व्यसनात् काननौ सः ॥
धन्योराजा च सुग्रीवो भवद्भिः सुहृदां वरैः॥
इति रामवचनं तस्य सौहार्दम् प्रकटीकरोति ।

शरणागतवात्सल्यं :

युद्दरङ्गों विभीषणागमन समये वानरान् प्रति
द्भमित्र भावेन सम्प्राप्तं नत्यजेयं कदञ्चन
दोषो यद्यपि तस्यस्यात् सतामेतदगर्हितम्॥

इति रामवचनं रामस्य शरणागत वात्सल्यं स्पष्टीकरोति तथा सुग्रीवं प्रति रामस्य

द्भपिशाचान् दानवान् यक्षान् पृधिव्यां चैव राक्षसान्
अङ्गुल्यग्रेण तान् हन्यामिच्छन् हरिगणेश्वर ॥
बुद्धाञलि पुटं दीनं याचन्तं शरणागतम्
नहन्यादानृशं स्यार्थमपि शतृपरंतप ॥
सकृदेव प्रपन्नाय तवास्मीति च योचते
अभयं सर्वभूतेभ्यो ददाम्येतद् व्रतं मम
आनयैवं हरिश्रेष्ट दत्तमस्याभयं मया
विभीषणो वा सुग्रीव यदि वा रावणः स्वयम्॥

इति वचनं च तस्य शरणागतवात्सल्यं प्रकटयति ।

कृतज्ञत्वं :

सीतापहरणानन्तरं सीतान्वेषणे रतः रावणेन युद्धं कृत्वा भूमौ पतितं प्राणावसानं जटायुं द्रुष्टवान् जटायुना उक्तं सीतापहरण वृत्तान्तं श्रुत्वा दुःखितश्चापि जटायुना कृतं अनिर्वचनीयं उपकारं स्मृत्वा रुधिरावसिक्तं तं जटायुं परिगृह्यं गाढमालिङ्ग्य भूमौ निपत्य दुःखितवान्।

तथैव सीतासंदर्शनानन्तरं आगतं हनूमन्तं समालिङ्ग्य हनुमताकृतोपकारस्य कृतज्ञतां प्रकटितवान्। स्व पट्टाभिषेक समये पुनः हनुमताकृतं महोपकारं स्मृत्वा

द्भएकस्योपकारस्य प्राणान् दास्यामिते कपे ।
शेषस्येहोपकाराणां भवाम ऋणिनोवयम्
मदङ्गे जीर्णतां यातु यत्वयोपकृतं कपे
नरः प्रत्युपकारणामापत्श्वायाति पात्रतातम्॥

इति उकत्वा रामः कृतज्ञस्य पुरूषस्य लक्षणं व्यक्तीकृतवान् ।

उपसंहारं :

एवं विध गुणसंपन्नस्य रामस्य गुणान वर्णयितुं सहस्त्रफणस्य आदिशेषोरपि असाद्यमेव । अत एव विविधभाषा कवयः रामवर्णनं कृत्वा त्व जीवितं सफलीकर्तुं इच्छन्तः स्व काव्येषु यथाशक्ति रामस्य गुणवर्णनं कृतवन्तः

द्भचरितं रघुनाधस्य शतकोटि प्रविस्तरम्
एकैकमक्षरं प्रोक्तं महापातकनाशनम्॥

उपयुक्तग्रन्थः :- वाल्मीकि रामायणम्

❖ ❖ ❖

భావవీణ ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి 2020 BHAVAVEENA SPECIAL EDITION
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

श्रीमते रामानुजाय नमः

माघकाव्ये चतुर्विधपुरुषार्थाः

Dr.N.SHASHIDHAR,
Sanskrit Lecturer ,
Vignana Jyothi Institute of Arts & Sciences,
West Maredpally ,
Secunderabad
9885343309
Email: shashinalla77@gmail.com

भारतीयानां कार्यकलापानां मूले पुरुषार्थसिध्दिः एव अन्तिमं लक्ष्यम् भवतीति सर्वे जानन्ति।

वैद्यकशास्त्र प्रणेता चरकः एवं वदति –

धर्मार्थकाममोक्षाणामारोग्यं मूलमुत्तमम् ॥चरक-1१-15१५

काव्यशास्त्रेऽपि अस्य तत्त्वस्य महत्त्वं वर्णयति भामहः –

धर्मार्थकाममोक्षेषु वैचक्षण्यं कलासु च ।
करोति कीर्तिं प्रीतिं च साधुकाव्यनिबन्धनम् ॥

इतिहासपरिभाषायाम् यथोक्तं विष्णुधर्मोत्तरे एवं अस्ति-

धर्मार्थकाममोक्षाणामुपदेश समन्वितम्।
पूर्ववृत्तं कथायुक्तमितिहासं प्रचक्षते।

भरतमुनिना अपि काव्यप्रयोजनं पुरुषार्थदृष्ट्या नाट्यशात्रे निरूप्यते। भरतमुनिनानुसारं सर्वभावानां हेतुः काम एव। स वदति कामकारणादेव धर्म-अर्थ-काम-मोक्षादीनां प्रवृत्तिः सम्भवतीति। एवं भरताचार्येणापि शृङ्गारस्य धर्म-अर्थ-कामभेदैः त्रैविध्यं प्रतिपादनं कृतम्।

धर्मो धर्मप्रवृत्तानां कामः कामोपसेविनाम्।
निग्रहो दुर्विनीतानां मत्तानां दमनक्रिमा॥ना.शाअ1/श्लो109

भामहः स्वप्रणीता काव्यालङ्कार ग्रन्थे पुरुषार्थदृष्ट्या कव्यप्रयोजनम् लिखितवान्।

धर्मार्थकाममोक्षेषु वैचक्षण्यं कलासु च।

करोति कीर्तिं प्रीतिं च साधुकाव्यनिबन्धनम्॥काव्यलङ्कारः अ1/श्लो2
प्रायेण सर्वभावानां कामान्निष्पत्तिरिष्यते। स चेच्छागुणसम्पन्नो बहुधा परिकल्पितः।
धर्मकामोऽर्थकामश्च मोक्षकामस्तथैव च। ना.शा अ24/श्लोक94,95
त्रिविधश्चात्र विधिज्ञैः पृथक्पृथक्कार्य – योगविहितार्थः।
शृङ्गारः कर्तव्यो धर्म चार्थे च कामे च।ना.शा,अ20/श्लो73

शिशुपालवधे पुरुषार्थविवेचनम् -

भारतदेशे कस्यापि वाङ्मयस्य निर्वचनं भवतु, सर्वंधर्मार्थकाममोक्षपुरुषार्थचतुष्टयेन आधारो भवति। तस्मिन् क्रमे माघविरचितशिशुपालवधा महाकाव्ते पुरुषार्थस्य विवेचनं कथं न भवेत्। अयं काव्यं ऐतिहासिकं महाकाव्यं अस्ति।

उपमा कालिदासस्य भारवेरर्थगौरवम् । दण्डिनः पदलालित्यं माघे सन्ति त्रयो गुणाः ॥"

"तावभ्दा भारवेर्भाति यावन्माघस्य नोदयः ।" "नवसर्गे गते माघे नवशब्दो न विद्यते" इत्यादयः माघकवेः प्रशंसापराः उक्तयः विराजन्ते संस्कृतवाङ्गमये।

माघकविः संस्कृते प्रसिद्धेषु पञ्चसु महाकाव्येषु शिशुपालवधरूपकस्य रचयिता । शिशुपालवधम् विहाय अन्यः कोऽपि माघस्य ग्रन्थः न लभ्यते । शिशुपालवधस्य कथावस्तु महाभारतात् संगृहीतम्। यदुनन्दनः अत्र नायकः, वीररसः प्रधानरसः । शिशुपालवधं महाकव्यं विंशतिसर्गग्रथितम् । १६५० पद्यैः परिगुम्फितमिदं महाकव्यं संस्कृतसाहित्ये उन्नता शिखरे विराजते ।

शिशुपालस्य वधाया श्रीवासुदेवः "ओम्" इत्यादिवचनेन स्वीकरोति। प्रथमसर्गस्तु मङ्गलाचरणरूपेण भक्त- भगवान्(नारद-श्रीकृष्णः) संवादात् ग्रहणं भवति। अयं काव्यस्य प्रथमे सर्गे चतुर्दशे सर्गे च भगवतः अवताराणां वर्णनं , भगवत् स्तुत्यादयश्च परमपुरुषार्थ(मोक्षः)प्रति महाकाव्यं नयति। श्रीकृष्णस्य युधिष्ठिरस्य शिशुपालस्य च वैभवादि वर्णनं राजसूययज्ञादि स्वर्गसाधनं च धर्मार्थकामस्यापि वर्णनं सर्वत्र प्राप्यते।धर्मौचित्य पद्यानां वर्णनं सर्वत्र प्राप्यते।

कवेः कर्मापि "स्वान्तः सुखाय" (पुरुषार्थाय) एव भवति। द्वितीये सर्गे मन्त्रणा समये पुरुषार्थ प्रशंसा महाकवि करोति।

तुल्ये पराधे अवर्भानुर्भानुमन्तं चिरेण यत् ।
हिमांशुमाशु ग्रसते तन्मदिम्नः स्फुटां फलम् ॥ शिशु.वध/अ2/श्लो49
तेजस्वीमध्ये तेजस्वी दवीयानपि गण्यते ।
पञ्चमः पञ्धतपसस्तपनो जातवेदसाम् ॥शिशु.वध/अ2/श्लो51

पुरुषार्थे क्रमशः धर्म-अर्थ-काम-मोक्षस्य स्थानं वर्तते। अत्र तेषां क्रमशः शिशुपालवधकाव्यदृशा विवेचनं क्रियते।

<u>धर्मः</u>

धर्मशब्दस्य व्युत्पत्तिः 1. ध्रियते लोकः अनेन इति धर्मः

2.धरति धारयति वा लोकं यः स धर्मः

3.ध्रियते लोकयात्रानिर्वाहार्थं यः स धर्मः श्चेति।

श्रुतिः स्मृतिः सदाचारः स्वस्य चप्रियमात्मनः।
सम्यक्सङ्कल्पजः कामो धर्ममूलमिदं स्मृतम्॥याज्ञ.स्मृतिः

शिशुपालवधे श्रुति-स्मृतिविहितव्यवहारस्य धर्मानुविद्धबुद्धेश्च बहुधा प्रयोगं प्राप्यते।

आचरणम् - काव्ये प्रथमा सर्गे भगवान् श्रीकृष्णः उत्थाय नारदास्य स्वागतं करोति, किन्तु नारदमनुज्ञां विना नैव उपविशति। अस्माकं संस्कृतौ भगवद्भक्तस्य ईश्वरसान्निध्यात् अत्यादरं भवत्येव किन्त्वत्र स्वयम् ईश्वरः अस्तीति वैशिष्ट्यम्।

स काञ्चने यत्र मुनेरनुज्ञया नवाम्बुदश्यामवपुर्न्यविक्षत।
जिगाय जम्बूजनितश्रियः श्रियं सुमेरुशृङ्गस्य तदा तदासनम्॥शिशु.वध/अ1/श्लो19

अत्र भगवतः श्रीकृष्णस्य आचरणं शास्त्रसम्मतं धर्मानुबद्धं च दृश्यते।

अर्थः

भारतीयवाङ्मये अर्थस्य चिन्तनं धर्म-मोक्षाद्यपेक्षया न्यूनमस्ति। किन्तु अर्थं विना जीवन किमपि व्यापारं न सम्भवति। अत एव भारतीयचिन्तने पुरुषार्थचतुष्टये अर्थस्यापि समावेशः कृतः।अर्थशुद्धि- रक्षणादिविषये शिशुपालवधे एवं अस्ति-

स्वापतेयमधिगम्य धर्मतः पर्यपालयमवीवृधं च यत्।
तीर्थगामि करवै विधानतस्तज्जुषस्व जुहवानि चानले। ॥शिशु.वध/अ14/श्लो9

अस्मिन् काव्ये द्वारकाधीशः श्रीकृष्ण-शिशुपाल-युधिष्ठर प्रभृति धनाढ्याराजानां नायक-प्रतिनायकादि माध्यमेन वर्णमस्ति। अत एव द्वारका -ऐश्वर्यादीनां वर्णनमपि सर्वत्र वर्तते।

कामः

अस्य कमना, इच्छा ,स्नेहः,प्रीतिः,अनुरागः,प्रेमादिषु विविधार्थेषु प्रयोगे भवति।दशम सर्गे मद्यपानवर्णनसमये , एकादश\ सर्गे प्रभातवर्णनसमये च कामस्य /शृङ्गारस्य स्मरणादिव्यभिचारिभावनां वा वर्णनं सर्वत्र प्राप्यते।

शिशिरमासमपास्य गुणोस्य नः क इव शीतहरस्य कुचोष्मणः ।
इति धियास्तरुषः परिरेभिरे घनमतो नमतोऽनुमतान्प्रियाः ।। ॥शिशु.वध/अ6/श्लो65
कान्ताजनेन रहसि प्रसभं गृहीत
केशे रते स्मरसहासवतोपितेन ।
प्रेम्णा मनस्तु रजनीष्वपि हैमनीषु
के शेरते स्म रसहासवतोपितेन ॥शिशु.वध/अ6/श्लो77

मोक्षः

मोक्षस्य अर्थः मुक्तिः ,स्वतन्त्रः, परममुक्त्यादयश्च भवन्ति। अन्तिम सर्गे यदा श्रीकृष्णः सुदर्शनेन चक्रेण शिशुपालस्य शिरम् छिनत्ति , तदा शिशुपालस्य आत्मा श्रीकृष्णस्य शरीरे प्रविशति । अर्थात् शिशुपालः सुखदुःखादिव्दन्व्देभ्यः कर्मफलेभ्यः संसाराच्च मुक्तो भवति।

अत्र चैष सकलेऽपिभाति मां प्रत्यशेषगुणबन्धुरर्हति ।
भूमिदेवनरदेवसङ्गमे पूर्वदेवरिपुरर्हणां हरिः ॥शिशु.वध/अ14/श्लो58

एवं महाकविमाघः धर्मानुबिद्ध पुरुषार्थचतुष्टयस्य सम्पूर्णे महाकाव्ये विन्यासं कृत्वा विद्वज्जगति "महाकविः" इति प्रसिद्धं च प्राप्तवान्।

उपयुक्तग्रन्थसूची

1.शिशुपलवधम्- अनन्तारामशास्त्रि-चौखम्बा संस्कृता सीरीज-बनारस- 1959.
2.मनुस्मृति- चौखम्बा संस्कृता सीरीज-बनारस- 1960.
1.विदुरनीति- पजगदीश्वरा नंन्दासरस्वति.ह.- विजयकुमरगोविंदराया हासनन्दा- सरन्, नयी दिल्ली-1997

7) भगवद्गीत- गीताप्रेस- गोरकपूर-2005
8) पुराण विमर्श- बलदेवौपाध्याय- चौकाम्बा संस्कृत संस्थन्- वारणासी-1970

❖ ❖ ❖

धर्म कर्म नीती

- डा. वि.टि.वि. क्रिश्न वेनि, अध्यापक, सँस्किट विबाग, सेंन्ट ऑन्स महिला कलाशाला, मेहदिपट्नम, हैदराबाद.

परित्राणाय साधूनां विनाशाय च दुष्कृताम् ।

धर्म संस्थापनार्थाया संभावमि युगे युगे ॥ (गीता 4.8)

स्वयं भगवान कृष्ण ने कहा है ,जब जब धर्म का हानी होगा तब तब मै स्वयं इस धरती पर अवतार लेकर धर्म को पुनः स्थपान करता हु ।

हमार समाज इतना धर्म प्रवण है और हमारे धर्म मे समाज एवं यतोचित व्यवहार का इतना ध्यान रखा गया है कि धर्म तथा समाज व्यवहार नीती को पूर्णत: अलग करना संभव नहीं है धर्म तथा समाज व्यवहार के अंतर्गत आनेवाली बहुत सी बाते एसी है ,जो आचार एवं धर्म मे रखी जा सकती है । धर्मो:रक्षति रक्षित: धर्म को तुम रक्षा करो, धर्मं तुम्हारी रक्षा करेगा ।

"धारयेती धर्मः" अर्थात् धारणकरने (आचरण) योग्य नियमों को हम धर्म कहते है। धर्म सम्पूर्ण जीवन की पद्दति है

Man is social animal.मानव एक सामाजिक प्राणी है । समाज में विभिन्न परिस्थितियों के साथ उसे एक दुसरे के संपर्क में आना व रहना पड़ता है । धर्म और कर्म मानव जीवन के दो पेहलू है। किसी वस्तु या व्यक्ति की वह वृत्ती जो उसमे सदा रहे ,उसमे कभी अलग न हो ,उसे धर्म कहा गया है । जैसे आँखों का धर्म है देखना । यहाँ धर्म का अर्थ स्वभाव नित्य नियम है ।

उदा -सत्य ,क्रौध ,परोपकार ,दया ,क्षमा आदि धर्म एवं आचार नीती मे होते हुए भी समाज एवं व्यवहार से अलग नहीं है । वेसे ही शील ,विनय तथा निरभिमान आदि समाज नीति होते हुए भी धर्म से जुड़े है ।

धर्म कर्म काण्ड से समीप है। स्मृतियों मे आचारों प्रथमो धर्मः कहा गया है। और वर्ण तथा आश्रम के अनुसार उसके अवस्था का निदेश किया गया है। ब्रह्मचारी के लिये गुरुसेवा,स्वाअध्याय- अर्थात् व्यक्तिगत नियमों का पालन कैसे करे, इस दशा मे धर्मो को सीखने के लिये , तथा सिखो से धर्मो को आचरण किस प्रकार करे ,गृहस्थ के लिये दान -धर्मों का आचरणतन तन ,मन ,धन से सम्पूर्ण रूप से व्यक्तीगत,पारिवारिक तथा समाज के प्रति नियमों का पालन करना,-- वानप्रस्थाश्रम मे निस्वार्थ भावन से पारिवारिक धर्मों को वर्तमान पीडी को सौंप कर मार्गदर्शन करना ही उतामोत्तम धर्म है। सन्यासाश्रम मे वर्तमान पीडी को तथा आनेवाले पीडी को धर्मपथ पर चलने के लिये आदेश देना , प्रथम कर्तव्य है ।

मुनु स्मृति के अनुसार धर्म के दसलक्षण इस प्रकार है

धृतिः,क्षमा दमोऽस्तेयं शौचमिन्द्र्य निग्रहः

धीर्विध्य सत्यम्क्रौधो दशकं धर्म लक्षणं ।।मनु स्मृति -6 .82

पुराणों मे भी धर्म पर प्रकाश डाला गया है । महाभारत मे अनेकानेक धर्म सूक्ष्मो को विवेचन किया गया है । "परोपकाराय इदं शरीरं"धर्म को आचरण करने के लिये राजा शिबी ने एक कपोत को बाचने के लिए उसका वजन का अपना जांघ का मांस खण्ड दिया है । तथा भीम ने अपने आप को बकासुर को आहार के रूप मे समर्पित होने के लिये , सक्तु प्रस्थस्य महत्वम् मे "अतिथि देवो भाव:"धर्म का विवेचन इस प्रकार किया कि कुरक्षेत्र भूमि मे धर्मराज से पहेली ही एक उच्छ वृत्ती गरीब ब्राह्मण परिवार द्वारा जो सात दिन लगतार आहार न मिलने पर 8 वा दिन जो केवल मुट्ठी भर दाना से परिवार के चार सदस्य खाने के लिये एक पल पहले जो अतिथि कुटिया मे प्रवेश करने से वे अति सन्तुष्ट हो कर, उस अतिथि को सत्कार किये है । प्राणजाते समय मे भी कर्ण ने अपने कवच कुण्डलो को दान किया, इतना ही नहीं बड़ो का आदर करने के लिये पांडव अपने राज्य को भी छोड़ दिये है ।मित्र धर्म को निभाने के लिये भगवान कृष्ण ने राजा जब सुधामा को स्वयं स्वगत किया है । कर्ण अपने प्राण भी छोड़ दिया। वीर शूर

హోనే పర భీ సత్య ఔర ధర్మ పాలన కరనే కే లియే ఆజ్ఞాత వాస మే అపనే ఆప దాస బనకర సమయ బితాయే హై ।

పద్మా పురాణ మే బ్రహ్మచర్య ,సత్య ,తపస్యా ,దాన ,నియమ,క్షమా ,పవిత్రతా ,అహింసా ,శాన్తి ,అస్తేయ ,కహే గఏ హై । మత్స్య పురాణ ఆది సనాతన పురాణోం ఆది మే అద్రోహ ,అలోభ ,దమ,దయా,బ్రహ్మచర్య ,సత్య,అక్రోధ ,క్షమా ,ఔర ధృతి సనాతన కే మూల తత్వ హై ।

మానవ కర్మశీల ప్రాణీ హై। ఇస విస్తృత కర్మ స్థల మే ఉసకా జీవన చక్ర న కేవల సజగ రహతా హై,స్వప్న మే భీ నిరంతర గతిశీల రహతా హై । కర్మ కరనే కే బినా ఏక క్షణ భీ నహీం జీ సకతా హై ।

ధర్మ -సమయ పరిస్తిథియోం కే అనుసార పరివర్తన ఏవం పరివర్ధన హోతే హుఏ సమాజ కో తథా వ్యక్తి కో అగ్రసర కరనే కీ క్షమతా కో ప్రదాన కరనే వాలా నియమ హి ధర్మ హై ।ధర్మ మనుష్య కో వివేచేన శక్తి ప్రాధాన కరతి హై।

ధర్మ- కర్మ కా దర్పణ హై । కర్మ - ధర్మ కా పూరక హై । ధర్మ కర్మ నిభానా వాలా మానవ హీ జీవన మే సార్థకతా ప్రాప్త కరతా హై ।

ధర్మ అనేకానేక హై । శైశవ ,బాల కౌమార,యువ,ప్రౌడా ,వృద్ధ అవస్థాఔ కే అనుసార ధర్మ కే పాలన కరనా అనివార్య హై ।

ధర్మ నిభానే కే లిఏ అన్తఃప్రేరణా కీ ఆవశ్యకతా హై । ధర్మ కే అనేకానేక పేహలు భీ హై - పారివారిక ,సామాజిక,ఆర్థిక ,రాజనైతిక,ఆది ।

లేకిన కుఛ నిత్య నూతన ధర్మ హై । ఉదా మాతృ దేవో భవఃపితృ దేవో భవఃమాతా పితా సేవా హీ పరమ ధర్మ మానకర శ్రవణ కుమార నే అపనా ప్రాణ త్యాగ కరతే సమయ భీ సేవా తత్పర రహా , ఆచార్య దేవో భవఃఅర్థ హై గురు కీ ఆదేశ కా పాలన కరనా ప్రథమ కర్తవ్య హై,ఇసలియ ఏకలవ్య నే గురు ఆదేశ కే అనుసార అపనీ దాయా హాథ కీ అంగూఠీ కాట కరకే దే దియా హై । అతిథిఃదేవో భవఃనం । వేద ఔర ఉపనిషద మే జో ధర్మ కా ఉపదేశ దియా గయా హై ఉన నియమో కో ఆచరణ కరనే సే వ్యక్తి కాలాతీత పూజనీయ హో జాతా హై ।

ధర్మ ఉపదేశ దేనే మాత్ర సే నహి , ఆచరణ కరనా భీ అనివార్య హై । సత్య వచన పాలన కే లియే 14 వర్ష వనవాస కియా హై । యహాఁ తక కీ ధర్మ కా పాలన కే లియా సీతా కో భీ పరిత్యాగ కియా హై

भगवान श्री राम ने कभी किसी से धर्म आचरण करने के लिये नहि कहा गया ,स्वयम् आचरण किये है ,इसलिये भगवान राम को मर्यादा पुरुषोत्तम श्री राम कहा जाता है । । राजा नल महाराज सत्य वचन निभाने के लिये राज्य को छोड़ कर ,पत्नी पुत्र सहित अनेक दुखो को समना करना पड़ा । अंत मे पत्नी को छोड़ कर शमशान वाटिका मे काम करना पड़ा,लेकिन धर्म को कभी नहीं छोड़ा है ।

निष्कर्ष -----किसी भी स्थिती मे मनुष्य धर्म विमुख (भ्रष्ट) नहीं होना चाहिए । यदि ऐसा कोई विमुख हो तो ,उसे दण्ड देना का आदेश दिया जा सकता है । इसका मुख्य उद्देश्य यह है कि धर्म व्यक्ति और समिष्टि की रक्षा करना है । इसलिये हो सके तो कष्टों को सहकर भी आचरण एवं अनुकरण करना चाहिए । धर्म को निभाते हुए कर्म करना और अर्थ को संचयन करते हए कामनाओ का तुष्ट करते हए मोक्ष को प्राप्त करना है ।

❖ ❖ ❖

Folk Performning Arts and the Role of Telugu News Papers : A Study in Telangana and Andhra Pradesh

- ***Kondigari Buchaiah,*** Research Scholar, Dept. of Folk Arts, Potti SriramuluTelugu University, Hyderabad.

Introduction :

Folk is an ornament of our cultural heritage. Folk implies the people's participation and spontaneity. India has a great treasure of folk and traditional art forms that show it socio-religious and philosophical dimension woven artistically and aesthetically into a life experience, presented in a creative and innovative manner. Folk Performing Arts are tje reflection of Indian culture, tradition and everyday lifestyle. India is a having many religions, castes and tribes and every religion, caste and tribe has its own unique culture and tradition. In order to know the culture, tradition and lifestyle of the respective segments. Folk Arts play is significant role (Das, K.K., 1980) Folk arts are consist of traditional music, masquerades, dance and drama. Among these, the Oral tradition and the Performing arts appear to be the main media of communication. Storytellers, signers, minstrels and other kinds of folk entertainers have acted for centuries as sources for the transmission and dissemination of news and information through face-to-face live communication (Radha Krishna Murthy, 1969)

Literature Review :

There are many folk performing arts such as Yakshaganamulu, Veedhi Bhagavatalu, Golla Sindhulu, Jamukula Kathalu, Pichhigunta Kathalu, etc. These forms attract the masses to a great extent and make them aware of the socio-economic, political and cultural conditions and mobilize them to fight for their just rights. Most of those folk-forms as other folk-songs and ballads, have originated from long back. But, the progressive writers utilized these folk-forms to propagate their ideology and also, to motivate the social consciousness to stand and fight against the age-old traditions and norms, just by changing the traditional themes of these folk-forms and introducing the progressive themes accordingly (Ramaraju. B, 1972). As for the Telangana movement is concerned, in the cultural dimesion of the struggle, the folk art forms and popular songs played an important role in the process of people's mobilization towards telangana movement. During this movement, the folk art played an important role in shaping popular consciousness. Several poets produced large number of people's songs which contributed in many ways to the making of a new radical consciousness among the people of Telangana.

Folk Performing Arts and the Role of News Papers :

News Papers are playing a potential role in reviving Folk Performing Arts. With the inception of printing machine, the availability of books, news papers and folk literature has been increased and it has started influencing the people across the sections. In India, Folk

Performing Arts are varies from state to state and region and region. These Arts can be identified and developmed by the lifestyles of the people who are living in a particular region. In recent times, the news papers are not only influencing the folk literature but also the common people. Though the electronic media has developed at a rapid phase, still the print media has its own relevance in reviving the Fok Performing Arts (Shyam Parmar, 1975)

❖ ❖ ❖

Principles of Dharma in Ramayanam

- ***Dr. K. Padmaja***, Professor & Head, Department of Languages, Aurora's Degree college, Hyderabad.

Indian literary tradition holds Valmiki as the first poet, the Adikavi and Ramayanam as the first epic, Adikavyam. Valmiki is the first path maker for the sweet expressions of poetry. Valmiki's *Ramayanam* is an epic poem of 24,000 verses. Ramayana is known as a treatise of Dharma. The four Purusharthas –values of life. ie, , Dharma, Artha, Kama, and Moksha are dealt here with utmost care. The Ramayanam epic is strewn with exposition of values of life from great sages. The concept of Dharma is depicted well through the conduct of various characters and more so by Rama. He deals with difficult situations with the ardent devotion to Dharma. It gives a clear message that Dharma will be victorious in the end. But those who want to stand by Dharma may have to pay the price in order to achieve benefit for the entire society. The path of Dharma is open for fearless and noble people.

Ramayanam is a book of Dharma and Rama is an embodiment of Dharma and a paradigm of an ideal man. Ramayana clearly illustrates that Artha and Kama can be enjoyed within the legitimate bounds of Dharma.

Hindu dharma includes the religious duties, moral rights and duties of each individual, as well as behaviors that enable social order, right conduct, and those that are virtuous. Dharma is that which all existing beings must accept and respect to sustain harmony and order in the world.

Rama obeys his father and his command without a second thought and gives up his leisurely life to accept that of a hermit. He doesn't even question the orders and leaves for the jungles without any ill feelings in his heart. Sita dutifully follows her husband for the Vanavasam and proves her devotion as a wife. She even enters the holy fire to prove her virtue and purity to her husband at the time of "Agni Pareeksha". Lakshmana, also accompanies Rama and Sita into the forest out of fraternal bond and love.

Another instance is seen when Vibhishana, even after being the brother of Ravana, joins his arch enemy Rama, and didn't flinch thinking of it as a punishment for Ravana's Adharmic ways and dictatorship.

अ - Rama is the personification of Dharma.

Two controversial events in Ramayana where Rama's steadfastness to dharma appear a bit on shaky grounds are the killing of Vaali and sending a pregnant Sita to exile. Examining these in detail will help us to understand dharma as understood by Valmiki and so many saints ever since.

Dharma is not a fixed, unchangeable set of principles that needs blind adherence irrespective of the situation. The same set of actions that serve Dharma at a given place and time, cannot be blindly used for any other context.

Dharma is a means to uphold harmony and social cohesion over long-term.This eternal process of achieving harmony guides design of contemporary rules and regulations. Dharma in 21st century wouldn't imply following age-old traditions without contemplating on the purposes they serve today.

Dasaratha had promised three boons to Kaikeyi when she saved his life during one of those battles he fought on the side of the *Devatas.* When the coronation of Rama is announced, Kaikeyi asks for two of the boons from Dasaratha. She wants Bharata to be installed as the King and Rama to be sent to the forest for fourteen years. When Dasaratha was in a dilemma, Kaikeyi says that **Truth** is the highest ***Dharma***, implying that Dasaratha should keep his promise as otherwise he will be guilty of transgressing *Dharma*

(Ramayanam - 2.14.3) - Those who have knowledge of *Dharma,* says that Truth is the highest *Dharma*

Rama says these words to Kaikeyi as…

"O mother ! Please tell me what the King wants of me. I promise that I will carry out whatever is his wish. What Rama says once he carries out; there is no looking back."

Once Rama gives his word, that is final and it is kept at any cost. There is no question of repetition of the same a second time.

when Bharata requests Rama to return to Ayodhya and rule the Kingdom then Rama says these words to Bharata ….

Rama say to Bharata that Beauty may leave the moon, Himavaan may become bereft of snow, the ocean may transgress its shores but I will never violate the promise given to my father.

Sita apprehends that Rama, armed always, as he is, with his bow and arrows, may tend to hurt animals in the forest or hurt those *Rakshasas* from whom there is no threat. She emphasizes the importance of *Ahimsa* and other virtues and requests Rama to be compassionate, kind and merciful.

Wealth springs from *dharma,* from *dharma* comes happiness and one gets everything from *dharma. Dharma* is the essence of this world.

Dharma, which is the source of all happiness, can be attained even by a skilled person, only after observing various disciplines for his own purification and after great effort subjecting him to great strain and stress. One cannot attain such *Dharma* by leading a life given to the pleasures of the senses.

To be compassionate, kind, merciful and humane is a great virtue.Sita's message to Rama through Hanuman entreating Rama to show some mercy one her and rescue her without further delay.

Dharma is so called because it sustains or supports society (from the root *dhri meaning* to support). The people of a country are held together and sustained by *Dharma.*

(7.59 prakshipta 2/21)

Anger is the enemy who takes one's life. Anger is enemy with the face of friend. Anger is like a very sharp sword. Anger destroys everything.

That is not an assembly where wise old men are not there. They are not wise old men who do not preach *Dharma*. That is not *Dharma* where there is no Truth. That is not Truth which is covered over with deceit.

Rama is justifying his action in killing Vali from behind a tree. Vali, being the elder brother of Sugreeva should have been like a father to him. Instead, he had taken away Sugreeva's wife causing the latter mental agony.

One's elder brother, father and the teacher who gives knowledge – all these three, treading the path of *Dharma,* are to be considered as one's father.

Dharma, is a principle which every person should strive to follow. Dharma implies right conduct and the upholding of morals and virtues. The maintenance of these morals enables an individual to attain salvation, or liberation of the soul. The elements of dharma vary for each individual depending on his or her birth and societal position and therefore it is the responsibility of the person to act accordingly. The only aspects of dharma that could apply to all people equally are those that discourage inflicting harm to another, either by thought or deed. Hinduism teaches that taking the dharmic path is the only possible way to get rid one's karma accumulated throughout his life. The concept of dharma is an overbearing theme in the epic Ramayana,. Each one of the protagonists and the antagonists in the story has a unique dharma. The adherence or abandonment of dharma facilitates to drive the story to completion.

There are many more instances and principles of Dharmam are in Ramayana Maha kavyam. But, I have taken only some instances as examples.

❖ ❖ ❖

Attainment of Purushaarthas According to Shukra Neeti

- ***I. R. Nandini***, Lecturer, GDCW Begumpet, Hyderabad.

The four "Prushaarthas", of life as prescribed by our Vedas are Dharma, Artha, Kama, Moksha. These are the goals of man, by following he can achieve success his life. Man is destined to be born and attain moksha through dharma, artha, kama. Each aspect again is vast in nature and are discussed elaborately in epics, puranas, kavyas and kathas. All this literature, through their subtle teachings focused on practicing them according to one's strength. An attempt is made to understand in brief through the teachings of Sukraneeti, a treatise setting standard rules to follow by men to achieve his desires.

Dhrama is the basic duty one has to follow according the work he takes up. It changes according to person, age, strength, place and position. Knowing one's own dharma should be the prime responsibility of man. Though practicing, is yet another herculean task, but person achieves moksha only when he practices his dharma. Artha is the monetary benefits one should earn to pursue his desires and live above the basic needs of life. Kama is the desire, which generates in the process of life both material and spiritual ones. Both require proper understanding of dharma to achieve them in righteous way. Moksha is the ultimate goal of man, which is to get salvated from the cycle of life and death.

Sukraneeti is one of the important books, which has certain set of standards to be followed by everybody, who wants an ideal successful life. This book consisting of five adhyayas, enlighten on various issues. It also gives general rules of morality which are important in the present scenario, where people are in dark without knowledge of svadharma and always engage in intruding into others dharma and thus leading to failure and struggle. By our ancient literature which is the lamp of enlightment, a layman can bring self awareness in his life.

"Through fear of the punishment meted out by the king, each man gets into the habit of following his own dharma or duty. The person who practices his duty can become powerful and influential in this world. Without strict adherence to one's own walk in life there can be no happiness. Practicing one's own duty is the paramount penance". Svadharma is one's own duty which every man has to be abided according to his physical and mental capabilities. One has to know his capabilities and decide which work he is capable of and continue that as his profession. here the importance of Artha ia said, " whoever is able in matters either in wealth or virtue whoever knows the time and place whoever is free from doubts such a man is respected but he who always feels suspicious is not liked." The above verse says that one should empower oneself regarding money matters. He should have sound knowledge about the resources and correct expenses so that he can live life free of financial crunches. And he can focus on the other social activities through finance. It also says that one should have lot of confidence in self in exhibiting virtues and protection of money.

"Man is a slave of wealth not wealth of anybody. One should always carefully labour for wealth". Hence one should always be careful dealing with finances.

"Through wealth men get virtue satisfaction and salvation". This is clear indication of importance wealth.

This verse says regarding kama or desires. "He should neither repress the senses nor indulge in them excessively. The senses running riot easily destroy mind". Desires arise when senses get in touch with their objects. And it is said that these desires should be sought according to dharma. Abiding by rules only, one should enjoy the worldly desires. Or else unethical wants only lead to destruction. Hence by following dharma only one has to acquire wealth, enjoy the pleasures and finally attain moksha.

"Let not anyone try to get moksha without trying to acquire the other three (dharma, artha, kama) and let him constantly follow the path of moksha without discarding the other three". This verse quotes the importance of the four purshaarthas and their inter link with each other to finally bring the salvation. Any one purushaartha if attained individually cannot lead to moksha. Thus the one who wants to lead a successful life should engage himself in knowing the four purushaarthas by reading the literature and empowering himself about the correct knowledge. Thereby lead his entire life by strictly practicing the virtues.

❖ ❖ ❖

Relevance of Puranic Discourses of Purusharthas in Modern Life

- ***A.V. Sheshachary,*** Lecturer in English, GDC (A), Siddipet.

"Dharmartha Kama Mokshanam
Arogyam Mulamuththamam"

- Charaka Samhitha

In Hindu philosophy the fulfilment of life is said to be fourfold. In sanskrit they are called Purusharthas, namely dharma, artha, kama and moksha. They are aimed at balancing the human life by not ignoring or neglecting one's duties. Vedic Indians used the word "Purusha" to refer the universe as well as individual. "Artha" means aim or goal. "Purushartha" means the actions which are proper and correct. Of the four purusharthas, the first three are interwoven. One has to pass through all the phases of life by knowing the duties and obligations to be fulfilled. The last one is moksha, the ultimate goal or aim of human being.

Unlike animals we have consciousness and intelligence and can discriminate what is good and bad. The word Dharma is derived from the Sanskrit route "Dhri" which means to hold together or to preserve. Dharma has principle to maintain the stability of the society.

"Dharma Eva Hatho Hanthi Dharmo Rakshathi Rakshithaha |
Thasmath Dharmo Na Hanthavyo Mano Dharmo Hathovadheeth" ||

- Manusmrithi

Dharma :

Is for the welfare of mankind. It provides to the acquisitive and emotional drives in man. It brings harmony between temporal gratification and spiritual freedom. In other words a code of conduct through which man has to conduct his day- to - day life. If dharma is ignored, Artha and kama profit and pleasure respectively lead to social chaos.

The manudharma Shasthra, Apasthambha Dharma Shasthra and Yagnavalka Smriti as examples, all suggest that Dharma comes first.

Artha :

Is the second goal of human life. It means the economic and the material aspects of life. According to Kautilya Artha Shasthra, poverty breeds vice and hate, while prosperity breeds virtues and love. A householder requires wealth, because he has to perform many duties. A person should not seek wealth for wealth sake but to uphold Dharma and help the members to his family and society achieve their goals. Artha thus give security and material pleasure and above all it gives a comfortable feeling. Desire for wealth is different from greed for wealth. In other words,it has to be achieved with a certain sense of physical safety. Ultimately, Artha is the pursuit of activities and means necessary for a joyous and pleasurable life. It provides the foundation for Dharma and Kama, without prosperity and security in society or at the individual level, both moral life and sensuality become difficult. In other words, worldly success doesn't violate the moral responsibility of following dharma towards our journey to attain Moksha.

The third Purushartha is **Kama**. In a broader sense Kama means desire and is a narrow sense sexual pleasure. Desire may come in various forms – Music, Art, Beauty, Love, Intimacy, Affection, Fellowship and Kindness.

The definition of pleasure in Kamasutra is "the enjoyment of the appropriate objects by the five senses of Hearing, Feeling, Seeing, Tasting and Smelling, assisted by the mind together with the soul". Kama is good and necessary when it exists to support Dharma and becomes part of the richness of life. However, ill directed kama can lead to over indulgence, addiction, greed and lust. The Upanishads tell us, "As is your desire so is your will, as is your will so is your deed, as is your deed, so is your destiny and you're what your deep driving desire is".

The theory of Purushartha doesn't prohibit physical pleasure. It is prescribed for the development of inner life and outer life of man. The well being of man depends upon the harmonious blending of these three – Dharma, Artha and Kama. All the three combined together are called thrivarga.

Moksha :

Is the end of the death. It is believed that the soul passes through a cycle successive lives and in its reincarnation is always dependant on how the previous life was lived (Karma). Doing good or bad, based on the actions, affects future lives and existence of human beings. One must take responsibility for the actions with in this life time or the next. The fourth and ultimate goal is the transcendence of all arthas. It is attained by overcoming ignorance and desires. It can be attained both in this life and after death.

The word Moksha is derived from Sanskrit which means liberation of soul. Hinduism is a theistic religion believing in Supreme soul manifested in the form of various gods. When one achieves Moksha, the soul achieves unity with supreme soul. After passing through the first three phases of Purusharthas, to attain Moksha, one must let go the desires and ego in the physical world. It is because of the reason most of the human beings renounce society and live simple, ascetic lifestyle.

1. To attain Moksha some start doing selfless acts of service. Some other try on overcoming ignorance through study and meditation. Some focus on achieving self-control i.e., Physical, mental and emotional. In many Hindu traditions, working with a guru or a spiritual teacher is considered a vital part of achieving Moksha. If finding a spiritual teacher is difficult, be patient until you find a guru, learn from your own experience, study and observe the people around.
2. To attain Moksha, practicing yoga is a popular path. Traditional yoga not only focuses on physical exercise, but also on meditation, spiritual study and acts of service to others. The different yoga practices are

   Bhakthi yoga : It focuses on prayer, ritual worship, and the glorification of God.

   Jnana Yoga : It focuses on study, meditation and spiritual enlightenment.

   Raja Yoga : It is a classical form which focuses on physical control.

   Karma Yoga : It is centred around acts of selflessness and service to others.
3. To attain Moksha, some do penance (Tapas). In order to practice tapas, one must spend time alone living a simple life focusing on staying calm and slowly detaching from the world around. Tapas involve meditation, studyand reciting spiritual texts or self disciplinary practices

such as fasting, remaining isolated for a certain period of time or taking a vow of silence.

"Sadhanath Sadhyathe Sarvam"

.....

Thaithiriyopanishad

Moksha is not a candy to be handed over, but it can be achieved by constant practice only. To get Moksha one must alive to pass through all the stages with healthy body and mind. There is no short cut to reaching Moksha.

Ancestral Wisdom and Relevance of Purusharthas in Modern Life.

Human beings face many challenges today- political, social, economic and ecological. We possess neither the interest nor the willingness to follow lack of vision to understand. We search for short term solutions rather than long term. As we live in an era driven by fear at a global level and it is resulting insecurity. Out of this emotional sense of insecurity, we do many things – consciously and unconsciously. We live in this world without knowing the meaning or the purpose of our life.

The idea of education today is also not to learn the ways of peaceful co-existence but to create complex competition among each other. The result is evident – fear, uncertainty, stress, strain, poor health, conflicts, war and even depression. Therefore, Kautilya says "A person without knowledge and wisdom is little more than a beast"…. It is the knowledge which distinguishes from our need and greed. So, understanding our senses and mind are the roots of good knowledge.

The Purusharthas direct and instruct us towards leading a worthy life in this world. Understanding the underlying levels of meaning of Purusharthas and following the paths of our ancestors certainly we can attain Moksha by doing good deeds. Before we seek Moksha, we must first deserve. In this regard, only our efforts with right conduct- Dharma assure that. Through right efforts we learn as well as earn wealth – Artha. We can seek to accomplish that we desire with Artha – Kama. Let us be conscious of blinding desires which can lead us to destruction. If we fail in any of the first three Purusharthas, Moksha will become a mirage. Still there is a ray of hope that regularity in the practice of Purusharthas with consciousness and concentration is of paramount importance in achieving Moksha. In short, we can say that life has intrinsic value and therefore its goal is to live and the Purusharthas are what give content to this goal.

Finally, the undesirable consequences of our following of any one or two of the Purusharthas exclusively are also evident in our ecological crisis today. Our excessive Kama and Artha tendencies make for ecological imbalances i.e., Nuclear Wars, Famines, Cult of Machines, Deforestation, Elimination of Species are only some of factors that exhibit our greed. Now, it is high time that we realise that the earth doesn't belong to us; rather it is we who belong to the earth.

References :

1) Garuda Purana – Theory of Yoga
2) Markandeya Purana – Dharma – Mahabharatha
3) Vayu Purana – Family Life and Stages of Human Life
4) Manusmrithi: Dharma
5) Thaithiriyopanishad

❖

ఆహ్వానం

ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు

భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు

తేది : 08 - 02 – 2020

నిర్వహణ

తెలుగు శాఖ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట,

సంగారెడ్డి జిల్లా,

తెలంగాణ రాష్ట్రం

కళాశాల పరిచయం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట, సంగారెడ్డి జిల్లా (తెలంగాణ) **1984** వ సం.లో స్థాపించబడినది. తొలుత సదాశివపేట ఉన్నత పాఠశాలలో సదుపబడిన ఈ కళాశాలకు పిదప **15** ఎకరాల విస్తీర్ణంలో స్వంత భవనం స్థాపించబడినది. ఈ కళాశాల ఉస్మానియా విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్నది. హైద్రాబాదు నుండి పూడేకు వేళ్ళు జాతీయ రహదారి - **9** సమీపంలో ఉన్నది. ఈ కళాశాల జిల్లా కేంద్ర కార్యాలయానికి **16** కి. మీ. దూరంలో, రాష్ట్ర రాజధాని హైద్రాబాదుకు **60** కి.మీ. దూరంలో ఉన్నది.

1984 వ సం.లో. బి.ఏ. (హెచ్.ఇ.సి.) మరియు బి. కాం. (జనరల్) కోర్సులతో స్థాపించబడినది. **2016 -17** విద్యా సంవత్సరం నుండి రెండు క్రొత్త కంప్యూటర్ కోర్సులు ప్రవేశపెట్టబడినవి. **2018 -19** విద్యా సంవత్సరం నుండి సెమిస్టరు విధానంతో బి.ఏ., బి. కాం., బి. యస్.సి. లలో **18** క్రొత్త గ్రూపులు ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలలో ప్రవేశపెట్టబడినవి. కళాశాలలో నూతనంగా **TSKC** , కామర్స్ ల్యాబ్, **NSS , NCC** యూనిట్లు ఏర్పాటు చేయబడినవి.

మా కళాశాలలో పట్టభద్రులైన విద్యార్థులు సమాజంలో గౌరవప్రదమైన స్థానాలలో స్థిరపడ్డారు. అంకితభావం, నిబద్ధత ప్రతి అధ్యాపకులకు గల విశిష్ట గుణాలు.

సదస్సులో పరిశోధన పత్రములకు సంబంధించిన అంశములు

పురాణములు : ధర్మార్థకామ మోక్షాలు
ఇతిహాసాలు : ధర్మార్థకామ మోక్షాలు
కావ్యాలు : ధర్మార్థకామ మోక్షాలు
నవలలు : ధర్మార్థకామ మోక్షాలు
కథలు : ధర్మార్థకామ మోక్షాలు
ప్రబంధాలు : ధర్మార్థకామ మోక్షాలు
జానపద సాహిత్యం : ధర్మార్థకామ మోక్షాలు

ధర్మార్థకామ మోక్షాలలో ఏదైనా ఒక అంశమును ప్రాచీన యుగము నుండి ఆధునిక యుగము వరకు తీసుకొని మూడు పేజీలకు మించని పరిశోధనా పత్రాలను **2019 జనవరి 20** వ తేదీ లోగా సంపాదకులు. తమ పరిశోధనా పత్రాలను ఈను మేజి మేకర్ - 7 ప్రియాంక ఫాంట్ నందు ఫాంట్ సైజు 15 - A 4 పేపర్ లో సంపాదకులు. సదస్సు పరిశోధనా పత్రాలు ISSN No మరియు UGC అప్రూవ్డ్ జర్నల్ ద్వారా ప్రత్యేక సంచిక ప్రచురింపబడి సదస్సు నిర్వహించిన రోజే వ్యాసకర్తలకు అందజేయబడుతుంది.

విషయం :

మానవ జీవనం వేదాలలో, శాస్త్రాలలో తెలుపబడిన ధర్మబద్ధమైన నియమ నిబంధనలకు లోబడి ఉండాలి. అప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తుంది. ఆ నియమ నిబంధనలే చతుర్విధ పురుషార్థాలు. అవి ధర్మార్థ కామ మోక్షాలు.

చతుర్విధ పురుషార్థాలు

ధర్మము : మనుస్మృతిలో మనువు తెలిపిన ధర్మాలు పది. అవి సత్యము, అహింస, ఇంద్రియ నిగ్రహము, అస్తేయము (దొంగతనము), అపరిగ్రహము (అమితముగా ఇతరులనుండి గ్రహించుట), ధృతి (ధైర్యము), శౌచము (శుభ్రత), శాంతి, క్షమ, ఓర్పు.

అర్థము : ధర్మబద్ధముగా ధనమును ఆర్జించుట

కామము : ధర్మబద్ధమైన కామమును ఆచరించుట

మోక్షము : ఇహలోకమును వదలిన తర్వాత పరమాత్మలో ఐక్యమగుట. ఇట్టి ధర్మార్థ కామ మోక్షాలను గూర్చి అందరు సమగ్రంగా తెలుసుకోవాలని ఈ సదస్సు లక్ష్యం.

Organising Committee:

Sri Vinayaka Kumar, Vice Principal
Sri. Y. Ramesh Babu, Asst. Prof. of Zoology
Dr. S.P. Krishnaveni, Asst. Prof. of Economics
Sri P. Raji Reddy, Lecturer in Physics

Reception Committee:

Dr. D. Karunakar, Asst. Prof of Chemistry
Smt. A. Manjula, Lecturer in History
Sri. J. Rajeshwar, Record Asst.

Registration Committee:

Smt. K. Anuradha, Asst. Prof. of Botany
Smt. P. Savidya, Lecturer in Commerce
Smt. Manjula Vani, Lecturer in Hindi
Smt. Y. Uma Devi, Lecturer in Commerce
P. Sumalatha, Lecturer in Maths
Sri. R. Arun Kumar, Office Sub Ordinate

Technical Assistance Committee:

Ms. F. Bhavani, Lecturer in Computer Science

CHAIRMAN OF THE SEMINAR — CONVENOR

Dr. T. PATANJALI, PRINCIPAL. — Dr. S. BABY RAMANI, HEAD OF THE DEPT, TELUGU

ఆన్ లైన్ లో పరిశోధనా వ్యాస ప్రచురణ కొరకు వ్యాసము ఒక్కంటికి రూ.1000 (అక్షరాలా వేయి రూపాయలు చెల్లించాలి).

పరిశోధనా పత్రాలను **తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దు** భాషలలో drkolliramani@gmail.com నకు పంపవలెను.

PHONE No: 8332932330

GOVT. DEGREE COLLEGE • SADASIVPET
జ్ఞానమే సదాశివమ్

Bank Details :

Account Payee : S. BABY RAMANI
Account No. : 62011228955
IFSC Code : SBIN020106
SBI – ICRISAT Branch,
Patancheru.

ఫిబ్రవరి 2020

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు

అంతర్జాతీయ సదస్సు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.